# అనుష్ఠాన భగవద్గీత

ఆంగ్ల మూలం

నండూరి వేంకటేశ్వరరావు



कर्मण्येवाधिकारस्ते मा फलेषु कदाचन।
मा कर्मफलहेतुर्भूः मा ते संगोस्त्वकर्मणि ॥

తెలుగు

భమిడిపాటి రామగోపాలం

# అనుష్ఠాన భగవద్గీత

(ప్రణవీయాన్ని చేర్చుకొని)

ఆంగ్లమూలం

*(Practical Bhagavad Gita)*

నండూరి వేంకటేశ్వరరావు

తెలుగు

భమిడిపాటి రామగోపాలం

**Y M A Publications**

90 A, Road # 9, Jub ee H'l s, HYDERABAD - 500 033. NDIA

శ్రీకృష్ణ భగవానుడు చేసిన బోధనలను అస్వాదించగలవారి కోసం, విశ్వశ్రేయస్సుకోసం రూపొందించినది ఈ పుస్తకం. గీత ద్వారా లభించిన సందేశము ప్రపంచానికి మేలు చేయుగాక.

★

మీ స్నేహితులలో బంధువులలో ఎవరికైనా బహుమతిగా, జ్ఞాపికగా, ఇవ్వదగినది ఈ పుస్తకం కనుక మీకు ఎప్పుడు ఎన్నికాపీలు కావాలనిపించినా దానికి సొమ్ము మాకు మనియార్డరు ద్వారా లేక డి.డి.ల ద్వారా పంపి అడగవచ్చు. పుస్తకాలు పోస్టులో, కొరియర్ ద్వారా పంపిస్తాము. కనుక మీ చిరునామాలు ఎంత వివరంగా రాస్తే అంతమంచిది.

★ ★ ★

294.131

ప్రచురణ :

Y M A Publications,
90-A రోడ్డు నెంబరు 9· జూబిలీ హిల్స్;
హైదరాబాదు-500 033
ఫోన్ : 040-3548675

Sole Distributors:

VISALANDHRA PUBLICATIONS, Bank Street, AB DS
Hyderabad - 500 001.

© శ్రీమతి ఎన్. సీతారాం, 2001.

ఈ పుస్తకంలో ఉన్న విషయాలు, ఇందులో భాగాలు; ఎవ్వరూ; ఏ పద్ధతిలోనూ, ఏ మీడియం ద్వారానూ, మా నుండి వ్రాతమూలకమైన అనుమతి లేకుండా వాడుకోకూడదు.

తొలి ముద్రణ : 2001

ముఖచిత్ర రచన : ఎస్. గణేష్

ముద్రణ : రాంషా-శిరీషా పబ్లికేషన్స్, సామర్లకోట-533 440.

వెల : రు. 100/- (Overseas : US $ 10)

మొదటి పుస్తకము

# అనుష్ఠాన భగవద్గీత




శ్రీకృష్ణ భగవానుని పాదపద్మములకు
సభక్తికంగా అంకితం



**శ్రీ నందూరి వేంకటేశ్వర రావు (1910-88)**

ఇంగ్లీషు అధ్యాపకులుగా, సంస్కృత విద్యార్థిగా; జీవించారు
పరిశుద్ధమైన, నిరాడంబరమైన, జ్ఞానవంతమైన, తృప్తి చెందిన; జీవితం ఆయనది.
తన విద్యార్థులకు, మిత్రులకు, బంధువులకు; ఆదర్శప్రాయులైనారు.
జీవితాంతమూ భగవద్గీతను అభ్యసించుకొని జీవన్ముక్తులైనారు.

# సారమూ సమాచారమూ...

"గీతము" అంటే పాట. కాని, భగవత్-గీత అంటే భగవంతుడు నిర్ణయించిన విధానము, నిర్వచించిన హద్దు - అని తెలుసుకోవడము మన ధర్మం. పద్దెనిమిది అధ్యాయాలలో వివరించిన ఈ 'విధానం'లో శ్రీమహాభారతం అనే పురాణంలోని భాగంగా స్వీకరిస్తున్నాము. అత్యంత వైవిధ్యభరితాలైన వేదాంత సిద్ధాంతాలెన్నో· శ్రీకృష్ణ భగవానుడు, అర్జునుడు-సంభాషించుకున్న విధంగా-ఈ మహా గ్రంధంలో మనకు దర్శనమిస్తాయి. 'భగవద్గీత"ను ప్రపంచ ప్రసిద్ధమయిన మహాగ్రంధాలలో ఒకటిగా ప్రాక్పశ్చిమ విభేద రహితంగా పరిగణిస్తారు.

మహాభారత యుద్ధంలో అర్జునుడికి రధసారధిగా ఉండడానికి కృష్ణ భగవానుడు అంగీకరించాడు. యుద్ధభూమిలో ఎదిరి పక్షాన మోహరించి ఉన్న వీరులలో ఏ ఒక్కరూ-(ఈ యుద్ధం అంటూ ఒకటి లేకపోతే)- అతనికి శత్రువులు కారు. అట్టి బంధు, మిత్ర, జనాలపై ఊసలు దూసేటప్పుడు కలిగే వ్యగ్రతకు అనుతాపం చెంది నివృత్తి మార్గం కోరడానికి అక్కడ సాక్షాత్తు భగవానుడే ఉండడం 'నరు'లందరి అదృష్టం. ఆ అదృష్టమే ఈ వేదాంతసార బోధనకు అవకాశమైంది.

అర్జునుడిని యుద్ధోన్ముఖుణ్ణి చేయడమే కృష్ణుని కార్యమూ, కారణమూ. ఇందుకోసం ఆయన ఉపనిషత్తులలో ప్రతిపాదించిన వివిధ అంశాల సారాన్ని నిర్వచించి వచించాడు. కనుకనే భగవత్-గీతను ఎందరో విద్వాంసులు ఉపనిషత్ సారంగా గ్రహిస్తారు.

ఈ స్పృహలో, శ్రీకృష్ణుడు; తానే సర్వాతిశయి అయిన భగవంతుడనని· ప్రేమించి, పూజించి, ఆరాధించవలసినది తననేనని; అపూర్వమైన సందేశాన్ని ప్రవచించవలసి వచ్చింది. అట్టి ఆరాధన; భక్తి, జ్ఞాన, కర్మలనే మూడు మార్గాల ద్వారా సాధ్యమని గీత. భక్తి జ్ఞానానికి, జ్ఞానం ఆచరణకు, ఆచరణ నిర్వాణానికి దారితీస్తాయని కూడా గీత చెబుతుంది.

**బ్రహ్మమందు ఐక్యమయిన వాడు దేనికీ ధుఃఖించడు. దేనిని కోరుకోడు:**
**ప్రసన్నమైన మనసుతో సర్వభూతములయందు సమదృష్టిని కలిగి**
**నాపట్ల పరమమైన భక్తిని పొందుతాడు.**
**నాయందు అట్టి భక్తి కలిగినవాడు నేనెవరో, నేనేమిటో సమగ్రముగా**
**తెలిసి, అట్టి తెలివిడి వలన నాయందు ఐక్యమవుతాడు.**

-భగవద్గీత· మోక్ష సన్న్యాసయోగము 54-55.

వ్యక్తి వ్యక్తికీ, ఆత్మ ఆత్మకూ చెందే శ్రీకృష్ణ పరమాత్మకు: దాసోహమని తాదాత్మ్యం చెందమని; గీతా సారాంశం. ★

# మంచి మాటలు

## ఆది శంకరాచార్య :

వేదబోధలలోని ముఖ్యాంశాల సారాంశమే భగవద్గీత. ఆ బోధల ఎరుక మానవుల ఆశాంసాల సాధనకు మార్గదర్శి.

## ఆల్డస్ హక్స్లే :

అనంత నిరంతర వేదాంతం గురించి ఇంతవరకు చెప్పిన తాత్పర్యాలన్నిటిలో అత్యంత స్పష్టమైనదిగా మిక్కిలి విపులమైనదిగా వాసిల్లిన భగవద్గీత భారతీయులకే కాక సమస్త మానవజాతికీ అమూల్యం.

## 'వైష్ణవీయ తంత్రసారము'లో :

సర్వోపనిషదోగావో దోగ్ధా గోపాల నందనః
పార్థోవత్సస్సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్

## శ్రీ అరవిందుడు :

భగవద్గీతలో ఒక భాష, ఒక భావ నిర్మాణం, ఒకానొక ఆలోచనా సమతౌల్యం ఉన్నాయి. ఇవి ఏ శాఖకు సంబంధించిన పట్టుదలలనుగాని చాదస్తపు వ్యాఖ్యానాలని గాని చొరనీయవు; అనేకములయిన సత్యస్వరూపాలలో దేనినో ఒకదానిని నమ్మేవారు మిగిలినవాటిని పరిహార్యాలుగా భావించకుండా కాపాడుతాయి. అయినప్పటికీ, సకల భావసమంచిత పరివేష్టితమైన గమనం కలిగి, అది ఒకానొక మనో-అనుభవ-సంయోగ సాగర పరిణామంగా ఉంది..

## మహాత్మా గాంధి :

నా జీవితం నిండా విషాదాలే· అవన్నీ బహిర్గతాలే. అయినా సరే, అవేవీ నామీద ఏ మచ్చా వెయ్యలేక పోయాయంటే అదంతా భగవద్గీతలోని బోధల అనుగ్రహం.

'సెర్మన్ ఆన్ ద మౌంట్' అనే క్రీస్తు ప్రవచనంలో కూడా కానరాని ఒకానొక ఊరట భగవద్గీతలో నాకు దర్శనమిస్తుంది నేను ఒంటరిగా ఉండేటప్పుడు నిరుత్సాహపు తీక్షదృక్కు నామీద పడి ఏ కాంతి కిరణమూ కానరాని సమయంలో నేను భగవద్గీతను ఆశ్రయిస్తాను. అందులో అక్కడొకటి ఇక్కడొకటిగా దర్శనమిచ్చే శ్లోకాల అండతో అన్ని భయంకర విషాదాలనూ అధిగమించి మరుక్షణమే మందహాసాన్ని సాధించుకో గలుగుతాను

## జవహర్‌లాల్ నెహ్రూ :

భగవద్గీత ప్రాథమికంగా మానవుల అస్తిత్వపు ఆధ్యాత్మిక నేపథ్యాన్ని గురించి చెబుతుంది. దానితో బాటుగానే మన అనుదిన సమస్యలను గురించి కూడా చెబుతుంది. జీవితం మనకు నిబంధించే విధులను, మర్యాదలను ఎలా నిర్వహించాలో తెలియపరుస్తుంది. అయితే దృక్పథంలో ఆధ్యాత్మిక నేపథ్యం, విశ్వశ్రేయస్సు నిలిపి ఉంటాయి. సోమరి తనం తప్పు. ఏ కాలమందైనా మానవ జీవితము చర్యలు, ఆ కాలము నందు నిబంధితములైన ఉన్నత ఆదర్శాలకు అనుగుణంగా ఉండాలి. ఎందుకంటే ఆదర్శాలు కాలానుగుణంగా మారుతూ ఉండవచ్చును. కనుక, ఒక కాలానికి సంబంధించిన ఆదర్శమును ఆ యుగధర్మముగా దృష్టిలో నిలుపుకోవాలి.

★

## విషయ సూచిక


ఆముఖము . . . . . . . . . . . . . . . . . . . . . . 9

మొదటి భాగము :

1. పరిచయము. . . . . . . . . . . . . . . . . . . . . 13
2. బహుమతి . . . . . . . . . . . . . . . . . . . . . 15

రెండవ భాగము : ఆధ్యాత్మిక సమాచారము-విశ్వ సంబంధ వివరము

3. నీలో ఉండే నిజమైన నీవు . . . . . . . . . . . . . . 18
4. తట్టుకోలేని న్యాయము . . . . . . . . . . . . . . . 21

మూడవ భాగము : సాధకుని ప్రాథమిక ఆవశ్యకతలు

5. సత్యము . . . . . . . . . . . . . . . . . . . . . 26
6. స్వేచ్ఛాభీష్టము . . . . . . . . . . . . . . . . . . . 29
7. నిర్ణయ నిశ్చయప్రతిపత్తి . . . . . . . . . . . . . . . 32
8. శారీరక క్రమశిక్షణ . . . . . . . . . . . . . . . . . 38
9. మానసిక క్రమశిక్షణ . . . . . . . . . . . . . . . . 47

నాలుగవ భాగము : సాధన

10. భగవద్గీత వచించే ముఖ్య బోధలు . . . . . . . . . . . 58
11. క్రోధ నియంత్రణ . . . . . . . . . . . . . . . . . 61
12. భయాన్ని బహిష్కరించడం ఎలా? . . . . . . . . . . . . 67
13. ఈర్ష్యామాత్సర్యాలను అణచిపెట్టే పద్ధతులు . . . . . . . . 75
14. కోరికను చంపడం ఎలా? . . . . . . . . . . . . . . . 85
15. ద్వంద్వాలు . . . . . . . . . . . . . . . . . . . . 102
16. వైరాగ్య సాధన . . . . . . . . . . . . . . . . . . . 117
17. భక్తిసాధన . . . . . . . . . . . . . . . . . . . . 132
18. ఏకాగ్రతా సాధన . . . . . . . . . . . . . . . . . . 144


★ ★ ★

# ఆముఖము★

భగవద్గీత అనే మహాగ్రంధంలోని సారం నవీన మానవుడికి అంతగా అందుబాటులో లేనిది. అందుచేత ఆ మహాగ్రంధంలోని వాక్కులను నిత్యజీవితానికి అన్వయించుకుని అనుష్ఠానంలోకి చొచ్చుకొనే విధంగా సహాయపడే వ్యాఖ్యానం సమర్పించాలని చాలా కాలంనుంచి నాకు ఉండిన ఒక కోరిక. ఇప్పుడు నేను సమర్పిస్తున్న ఈ పుస్తకం అట్టి సేవ చేయడానికి తగు మాత్రంగా తోడ్పడుతుందని నమ్మకుంటున్నాను. అరిషడ్వర్గములలో పేర్కొన్న క్రోధ, మాత్సర్యాలను అదుపు చేయడానికి ఈ పుస్తకంలో నేనిస్తున్న సూచనలు మౌలికంగా నావేనని చెప్పుకోలేను. అవన్నీ ఆ సూత్రాలను అనుష్ఠించడానికి సాధనచేసి తమను తాము పరీక్షించుకొన్న అనేకులు ప్రయత్నించినవే. అందులో నేనుకూడా ఉన్నాను. అందుచేత భగవద్గీతలో చెప్పిన "యోగమును" అనుష్ఠించడానికి ఉత్సాహపడేవారు విజయం సాధించడానికి ఈ గ్రంధం, దీనిలోని సూచనలు: సహాయపడగలవని మిక్కిలి విశ్వాసంతో దీనిని అట్టివారి ముందుంచు తున్నాను.

మానవుడికి మనస్సు, ఇంద్రియాలు ఉంటాయి. ఇంద్రియాలను జయించడానికి మానవుడు చేసే నిరంతర సంగ్రామం మనసు ఆధ్వర్యంలో జరుగుతుంది. అదే "యోగ" అనుష్ఠానం. ఈ "మనసు" అనేది శరీరంలో ఒక భాగమా, అయితే శరీరంలో దాని స్థానమెక్కడ - అనేది నిర్ణయించడం చాలా కష్టం. అందుచేత 'మనసు' అనే దానిని ఒకానొక దైహిక అవయవంగానే భావించి దానిని ఎలాగ దారిలోకి తెచ్చుకోవాలో· నిస్సంకోచంగా విజృంభించే ఇంద్రియాలను అదుపులో ఉంచుకోవడానికి 'మనసు" ఎలాటి క్రమశిక్షణలో నడుచుకోవాలో ఈ పుస్తకంలో వివరించాను.

సామాన్య మానవుని జ్ఞాన పరంగా, మనసు అనేది అతడి భౌతిక, ఆధ్యాత్మిక అవగాహనల మధ్య ఉండే ఒక అనుబంధం. భౌతికం నుండి ఆధ్యాత్మికానికిగాని, ఆధ్యాత్మికం నుండి భౌతికానికిగాని అతనికి దారి చూపడంలో మిక్కిలి సహాయకారిగా ఉండేది విశ్వాసం. ఈ విశ్వాసం ఒక మూఢనమ్మకంగా ప్రారంభం కావచ్చు. పూర్వ మేధావుల జ్ఞాన సత్యనిష్ఠల వలన ప్రసాదితాలయిన ఉపనిషదాదిశ్రుతుల వలన కలిగినది కావచ్చు; లేదా తనకు తానుగా ముక్తి మార్గము కొఱకై ఎన్నుకొన్న విధానముకావచ్చు. ఈ విశ్వాసం ఉత్సాహం ద్వారా, ఆచరణ అనుష్ఠానాల ద్వారా పెరిగి వేగాన్ని అందు కొంటుంది. విశ్వాసం, అంతర్దృష్టి -అనేవి తర్కానికి, జ్ఞానానికి అతీతమైనవని అనుభవం అతనికి బోధిస్తుంది.

---

★ (1981 నాటి Pract ca Bhagavad G'ta తొలి ముద్రణకు ముందుమాట ఇది)

విశ్వాత్మను గురించి, విశ్వ నిర్వహణం గురించి; ఈ పుస్తకం రెండవ భాగంలో క్లుప్తంగా చెప్పి ఉన్నాయి. అందులోనే సాధకుడికి ఉండవలసిన విశ్వాసపు మూలసూత్రాలు ఉన్నాయి. వీటిని లోతుగా చర్చించడం లేదు. ఎందుకంటే, ఈ పుస్తకం ధ్యేయం "నమ్మిన వారికి" సహాయపడమే తప్ప "నమ్మని వారిని" లొంగదీసుకోవడం కాదు.

భౌతిక ప్రవృత్తి నుండి ఆధ్యాత్మిక అవగాహనకు ఎదిగేటందుకు విశ్వాసం సహాయం ఉంటుంది. అయితే నైతిక ఔన్నత్యం, పరిపుష్టి అత్యవసరం. శరీరాన్నీ మనసునీ కఠినమైన క్రమశిక్షణలో పెట్టుకుని నిరంతరాయమైన ఆచరణ నిర్వహిస్తేనే అట్టి పరిపుష్టి చేకూరుతుంది. పరివృత్తి పునర్నిర్మాణం వంటి కారణాలకు గాను అనిష్ట క్షేత్రాలపై చేసే ఇతరేతర శక్తుల శిక్షణ; సాధారణంగా మోసానికి దారితీసి, చివరికి అభాసు అవుతుంది. కనుక సాధకుడు (మోక్షసాధనకు) తనధ్యేయం నెరవేరాలంటే బుద్ధి పూర్వకమైన ఇష్టం చేత, నమ్మకం చేత; తన సాధనను కొనసాగించాలి. అట్టి తపస్సు భగవద్గీత సూత్రాల అనుష్ఠానంగా, ఋషుల జ్ఞానానికి సూచికగా; భాసించి, సత్వర, ఆధ్యాత్మికతా ప్రాప్తి.

**జ్ఞానమునకు పరమ చిహ్నమగు శ్రీకృష్ణుడు, (అట్టి జ్ఞానమును సాధించుటకు చేసే) ప్రయత్నమునకు చిహ్నమైన ధనుర్ధారియగు అర్జునుడు- ఎక్కడ ఉంటారో: అక్కడే విజయం, అభ్యున్నతి, వికాసం, నీతి ఉంటాయి. ఇది నా నిర్ణయము.**

-(శ్రీమద్భగవద్గీత మోక్ష సన్న్యాసయోగము : 78)

ఇక ఈ పుస్తకం గురించి. నా ఇల్లాలు (శ్రీమతి సీతారామ్) ఈ పుస్తకపు వ్రాతప్రతి అక్షరమక్షరం చదివి దానిని ఇంకా సొగసుగా తయారు చెయ్యడానికి ఎన్నో నిర్మాణాత్మకమైన సూచనలు చేసింది. అలాగే మా అబ్బాయి (చిరంజీవి యశస్వి) తన విమర్శనాత్మక విజ్ఞానాత్మక సేవలను అందించి, ఈ పుస్తకానికి సంబంధించిన మౌలిక దృష్టికి లోతులను సమకూర్చాడు. ఆ విధంగా వారిద్దరూ ఈ పుస్తకాన్ని వ్రాయకపోయినా, దీనిలోని వస్తువుకు, పద్ధతికి ఎంతో బలాన్ని అందించారు. ఎంత-అంటే: వారిద్దరినీ, ఈ పుస్తకానికి సహరచయితలుగా పేర్కొన దగినంత. వారిద్దరూ ప్రేమవలన, అభి జాత్యము వలన నన్ను ఆ మాట అననివ్వలేదు. కనీసం కృతజ్ఞతలు అయినా చెప్పనివ్వ లేదు. సరే, అలా వదిలేస్తాను. ఎందుకంటే సంగతులు అవి, చదువరులు మీరు.

అయితే; ఈ పుస్తకాన్ని ఇంత శుభ్రంగా, ఇంత తొందరగా అచ్చువేసిన వారికి, ప్రచురించిన వారికి- నా మనఃపూర్తి కృతజ్ఞతలు చెప్పుకోవడానికి స్వాతంత్ర్యం నాకు వుంది కదా!

**- నండూరి వేంకటేశ్వర రావు.**

మొదటి భాగం

# పరిచయము

# మొదటి ప్రకరణము

## పరిచయము

పూర్వ కాలంనాటి (మన) మహర్షులు కేవలం తాత్త్విక చింతనాపరులు మాత్రమే కాదు. వారు తాము అతీతమైన చైతన్య స్థితికి ఎదిగి, స్వయంగా పరిశీలించి పరమాత్మని ఆకారాన్ని, పదార్థాన్ని - అనుభూతికి తెచ్చుకున్న వారు. కనుక భగవంతుని గురించి వారు పొందిన జ్ఞానం మౌలికమైనది, సంపూర్ణమైనది; అసలు ఎట్టి సందేహాలకు తావులేనిది. అంతేకాక, వారు బొత్తిగా స్వార్థం లేనివారు కనుక; దివ్య జ్ఞాన రహస్యాలను నిరపేక్షాకరంగా ముందు తరాలవారికి ఉపనిషత్తుల రూపంలో ప్రసాదించారు.

ఉపనిషత్తులనేవి మానవజాతికి తెలిసిన అత్యంత ప్రాచీనశ్రుతులు. వాటిలోని ఆలోచనావిధానం చాలా లోతైనది. వాటివలన కలిగిన నిర్ణయాలు ఏ ప్రశ్నలకూ లొంగని తర్క సహితమైనవి. అందువలన, అవి; ఈ నాటికీ కూడా, ఆధ్యాత్మిక సిద్ధాంతాలకు సంబంధించినంతవరకూ - అత్యంత శాస్త్రీయమైన, విశ్వాస పూరితములైన వ్యాఖ్యలుగా నిలిచి ఉన్నాయి. అవి సాధకునికి విధాయకములైన ప్రవర్తనా నియమావళులను నిర్దేశించడంతో సరిపుచ్చుకొని ఊరుకోక; అతడు పరమాత్మ రహస్యాలను ఛేదించి, తన అంతిమ లక్ష్యమయిన మోక్షాన్ని సాధించడానికి సహాయపడ్డాయి.

భగవద్గీత ఉపనిషత్తుల సారము, వాటిలోని మూల బోధనలను తనలో ఇముడ్చుకొని ఉన్న గ్రంథం. అది అంతటితో ఆగదు. సంఘజీవి అయిన మానవుడికి, అతడి నిత్య వ్యవహార అవలంబనలో, ఉపనిషత్తులను ఎలాగ అనువర్తితం చేసుకోవాలో సూచించడానికిగాను ఒక అడుగు ముందుకు వేస్తుంది. మానవుడికి విధాయకములైన ప్రాపంచిక కార్యకలాపాలను, అతడి ఆధ్యాత్మికతా సాధనను-కలగలిపే ఒక పదార్థము.

భగవద్గీతలో చెప్పిన ధర్మసూత్రాలు భారతదేశానికే గర్వ, తేజ - కారణాలు. కాని ఆధునిక భారతీయులు వీటిని అర్థం చేసుకోవడంలోనూ, ఆచరించడంలోనూ; చాలా వెనకబడి ఉండటం ఎంతో దురదృష్టకరం. దీనికి ఆధునిక భారతీయులను పూర్తిగా నిందించలేము. భగవద్గీత రచించిన నాటినుండి వ్యక్తి జీవిత, సామాజిక అవగాహన-లలో పరిస్థితులు చాలా మారాయి. ఆనాటి ప్రజలు చాలా విశ్రాంతితో జీవితం గడిపేవారు. స్మృతులకు, పునర్విమర్శకు అవకాశాలు ఎక్కువగా ఉండేవి. వారు కొన్ని సంప్రదాయాలకూ, నమ్మకాలకూ ఒకానొక బలమైన కట్టుబాటులో ఉండేవారు. కర్మ సిద్ధాంతం అనే దానిని, పునర్జన్మ-అతిలోకములను నిస్సందేహంగా విశ్వసించేవారు. వారి సర్వ పరిస్థితులు, ఆలోచనలు-మత, దైవత్వ శక్తుల వలన ప్రభావితాలయి ఉండేవి. అదంతా ఆత్మ తృప్తికి, ఆత్మపరిశీలనకు- దోహదము చేసింది.

కాని (కాలక్రమాన సర్వకార్యక్రమాలకు) యంత్రాలు ఏర్పడి, తీవ్రమైన వేగం, వేదన, భౌతిక దృక్పథం వచ్చిపడ్డాయి. మనుగడ కోసం పెనుగులాడడం మనిషికి ముఖ్యప్రవృత్తి

అయింది. భగవంతుడిని గురించి పట్టించుకోవడానికిగాని, భగవంతుడిని తన ఆలోచనలో నిలుపు కోవడానికి గాని (అధునాతన) మానవుడికి తీరిక ఉండడంలేదు. ఈ సందిగ్ధ స్థితిలో అతడు నిరీశ్వర వాదిగా మారకపోయినా, భగవంతుడి అస్తిత్వాన్ని గుర్తించలేని వాడయ్యాడు. భగవద్గీతలోని బోధలు ఎంత ఉన్నతమైనవి అయితే అవనీ గాక; అవి మన ఆధునిక సమాజానికి, దాని పరిస్థితులకు ఎంత మాత్రమూ సరిపడనివి-అని ఒక అనభిలషణీయమైన నిర్ణయానికి వచ్చేసి ఆ మహాగ్రంధాన్ని విసుగుతో నైరాశ్యంతో కొట్టిపారేస్తున్నాడు.

భగవద్గీత ఆధారంగా, నేటి వరకు, సమగ్రమైనవి, పాండితీ ప్రకర్షాపూరితమైనవి - వ్యాఖ్యలు, వివరణలు - అసంఖ్యాకంగా వెలువడ్డాయి. కాని, నాకు తెలిసినంత వరకు వాటిలో ఏ ఒక్కటి కూడా, ఆధునిక - సామాన్య మానవుడి పరిధిలో నిలిచి, భగవద్గీతలో చెప్పిన ఉన్నత ఆదర్శాలను ఈనాటి ఆధిభౌతిక యుగంలో కూడా అతని దైనందిన సంఘటనలకు ఎలా అనువర్తించుకోవచ్చునో వివరించదు. మాటవరసకి ఆ పుస్తకా లన్నిటిలో కూడా మనిషి అనేవాడు ఇంద్రియాలను జయించవలసి వస్తుందని చెప్పారు, ఇంద్రియాలు జయించడం అనేది అభ్యాసం వల్ల సాధ్యపడుతుందని నొక్కి చెప్పారు, అంతే. అయితే ఆ అభ్యాసం అనేది ప్రస్తుతకాలపు జీవనంలో ఆచరణాత్మకంగా ఎలా ఒనగూడుతుందో ఎవ్వరూ చెప్పలేదు. నిజం చెప్పవలసి వస్తే, ఆ వ్యాఖ్యానాలలో ఏ ఒక్కటికూడా భగవద్గీత ప్రబోధాలకు అనుగుణంగా ఇంద్రియాలను నియంత్రించడానికీ, వాంఛలను నిర్జించడానికీ, సుఖదుఃఖాలను సమదృష్టితో స్వీకరించడానికీ- మానవుడు ఎం చెయ్యాలో స్పష్టంగా నిర్వచించలేదు. తత్త్వ శాస్త్ర సంబంధమైన ప్రౌఢ ప్రవచనాలూ, విపుల చర్చలూ - వాటికవి చాలా విలువైనవే కావచ్చు; కాని మానవుడి నిత్య జీవితంలో అవి నిరుపయోగమైనవి. ఎప్పటికైనా మనిషికి కావలసినది వేరు. అతడికి తటస్థపడే ఏ సమస్యకైనా భగవద్గీత ప్రకారం ఎప్పటి కెయ్యది ప్రస్తుతమనే పరిష్కారం చెప్పగలిగితే అదే అతనికి అవసరమైన సంతృప్తిని ఇస్తుంది. ఆ మహాగ్రంధం ఎన్నటికీ తనకు ఉపయోగపడేదిగా ఉండగలదన్న విశ్వాసాన్ని అతనిలో పాదుకొలుపుతుంది. అలాంటి సేవాభావంతోనే ఈ పుస్తకం వ్రాయాలని నేను వినయపూర్వకంగా సాహసించాను.

ఇందులో కూడా నా దృష్టిలో గట్టిగా నిలిచినది సంపన్నుడైన నగరవాసి. అతడికి అసంఖ్యాకమైన సవాళ్లున్నాయి. ఆవేదనలున్నాయి. ఆశ్వాసలున్నాయి. నిస్పృహలున్నాయి. ఎదుగుదలలున్నాయి. పతనాలు ఉన్నాయి. ఇవన్నీ అతనిని ఒకానొక తీవ్ర, వేగ, స్వభావి అయిన సుడిగుండంలో పడేస్తున్నాయి. అయినా సరే, నేను ఈ పుస్తకంలో చేస్తున్న సూచనలు మన అధునాతన సమాజంలోని అన్ని తరగతుల వారినీ సమానంగా అలరించి వారికి ఉపయోగపడగలవని మిక్కిలి విశ్వాసంతో ఈ రచన చేస్తున్నాను (ఈ రచన ఆధారంగా) ఆ మహాగ్రంథబోధలను అందరూ అభ్యసించెదరు గాక! ★

## రెండవ ప్రకరణము

# బహుమతి

భగవద్గీత చెప్పిన సూత్రాలను ఆచరణలో పెట్టాలంటే, అది నేటి కాలంలో కష్టసాధ్యం. అయితే ఒకవేళ ఎవరైనా చేయగలిగారంటే, దానికి లభించే సాఫల్యం ఏమిటి? అది ఇప్పుడొస్తుందా, లేక, తరువాతెప్పుడోనా?

ఆధ్యాత్మిక ప్రపంచం అనేది మనం నివసిస్తూ, సంచరిస్తూ ఉండే, భౌతిక ప్రపంచానికి పూర్తిగా భిన్నమైనది. అది ఏ పదార్థాలతో తయారైనదో, దాని పరిమాణాన్ని కొలవగలిగే వేమిటో, అది అధివసించిన స్థాయి ఎట్టిదో - ఇవన్నీ మనకి అలవాటయిన భౌతిక పదజాలంతో వర్ణించడానికి అసాధ్యమయ్యే తరగతికి చెందుతాయి. మనభౌతిక అవయవాలతో, లేదా, చాలా ఘనంగా, మిక్కిలి సంక్లిష్టతతో నిర్మించుకొనే ఎదైనా, కృత్రిమమైన యంత్రాంగంతోగాని, ఆధ్యాత్మిక ప్రపంచపు ఎ భాగాన్నీ చూడలేము, వినలేము, స్పృశించలేము, రుచి చూడలేము. విశ్లేషించాలంటే, మర్మమెరుగలేనిది. అంచనా వెయ్యాలంటే, మించిపోయేది. ప్రశంసించాలంటే, కనులు మిరుమిట్లు గొలిపేది.

అయినా సరే, అది సత్యం, ఆ మాటకొస్తే నిత్యం. మన స్వభావము వలెనే, దాని స్వభావము కూడా నవ్యతా పూర్ణము, విభ్రమాన్వితము, సౌందర్య భరితము. ఆశక్తుల ప్రభావము ఇక్కడ వాటి ప్రతిరూపాలుగా మన చుట్టూ పరిభ్రమించే వాటి ప్రభావం కన్నా, శక్తిమంతమైనది. వీటి ప్రభావము-వాటి ప్రభావం కంటే అనుభవనీయం. ఆధ్యాత్మిక ప్రపంచపు శక్తులూ అవి ఇచ్చే ఆనందాలూ ఈ భౌతిక ప్రపంచంలో దొరికే వాటికంటే, సరిపోల్చలేనంత ఉన్నతమైనవి. ఆ ఆధ్యాత్మిక ప్రపంచము అనేది, దివ్యభూమి అని చెప్పుకోతగిన దేవలోకానికి సరసన ఉండేదని అనవచ్చును.

ఈ వివరాలను పరికిస్తే, అటువంటి ప్రపంచము అంటూ ఒకటి ఉండదని అనుకోవలసి వస్తుంది. ఒకవేళ ఉంటే, అది మనకు అందరానంత దూరంలో, దానిని చేరడం అసాధ్యం అనేటంత దూరంలో ఉండవలసింది కాని, అలా కాదు. ఆలోకం మనకు చాలా దగ్గిరలో; మనతోనే ఉంది. అది మనలోనే ఉందని, మనము దానిలోనే ఉన్నామని అంటే అది అతిశయోక్తిగా తోచవచ్చు. అయితే దానిని చేరాలనుకున్న వారికి అది చేరువలోనే ఉంటుంది. దానిని చేరాలనుకోని వారికి అది ఈ విశ్వాంతరాళంలో అవతలి చివరను ఉంటుంది.

ఇవన్నీ ఆలోకాన్ని వర్ణించడానికి ఉపయోగించే దిగ్భ్రాంతికరమైన విశేషణాలు - అని మనము భీతిచెంది, నిస్పృహలో పడి; ఆ లోకపు జీవితాన్ని ఆస్వాదించడానికి విముఖులము కానక్కరలేదు. ఎందుకంటే, ఆ లోకానికి మనముగాని, మనకు ఆ లోకముగాని కొత్త కాదు. మన మందరమూ; ఉద్దేశపూర్వకంగాను, లేక, మనకు తెలియకుండాను - దానిలో నివసిస్తున్నాం. కనీసం దాని అంచున ఉండే ప్రదేశాలలో

ఉంటున్నాం. మనము చేయవలసినది ఏమంటే, ఈ సత్యాన్ని గ్రహించి, దాని పరిధిని విస్తరించుకొని, ఆ లోకంలో మనస్థానాన్ని సుస్థిరం చేసుకోవాలి. మరి ఇదంతా ఎలా సాధించగలం?

దానికో మార్గముంది. మానవుని మనసు అక్షయం. అందులో చాలాభాగం మనం ఎన్నడూ ఉపయోగించని శక్తితో నిండి ఉంది. అది రెండువైపులా పదునున్న ఆయుధం వంటిది. ఒకటి మనలను శాసిస్తుంది. రెండవది మనలకు సమున్నతము, మార్మికము అయిన ఆధ్యాత్మిక ప్రపంచపు ద్వారాన్ని తెరుస్తుంది. భగవద్గీతలోని సూత్రాలను ఆచరణలోకి తెచ్చుకోవాలంటే, "మనసు"కు ఉన్న శక్తిసామర్ధ్యాలను క్రమబద్ధంగా నియుక్తం చేసుకోవలసి వస్తుంది. అలా చేయగలిగిన నాడు మానవుడు అంతర్ముఖుడైన తనను తాను దర్శించుకోవడానికీ, తనను తాను వినడానికీ, తనలో తాను ఇమిడి పనిచేసుకుంటూ జీవించుకోవడానికీ : ప్రారంభిస్తాడు. మరణానంతరం తప్పక ప్రాప్తించే మోక్షం సంగతి అలాఉంచుదాం. అయితే; మానవుడు-ఇక్కడ ఈలోకంలో నివసిస్తూ కూడా; అంతర్గత జీవితపు స్వర్గసుఖాల పారవశ్యాన్ని ఆనందంగా అనుభవిస్తాడు. ఆ సౌఖ్యం, ఈ భౌతిక ప్రపంచం అందించే ఏ ఇతర ఆనందం కంటె కూడాను గొప్పది. భగవద్గీతలో చెప్పిన సూక్తులను ఆచరణలో పెట్టుకునేటందుకు మనము అవలంబించే దీక్షకు ఇంతకన్నా గొప్ప ప్రతిఫలం ఏముంటుంది.! ★

రెండవ భాగం

# ఆధ్యాత్మిక సమాచారము

# విశ్వ సంబంధ వివరము

## మూడవ ప్రకరణము

# నీలో ఉండే నిజమైన నీవు

నీ పాదాలు, చేతులు, శిరస్సుతో సహా నీ శరీరమునందలి ప్రతి అవయవము; నీ మేధ, మెదడు, ఆలోచనలు, ఉద్వేగాలు' చివరికి నీ జీవితం సహా - ఇవన్నీ కూడా నీ శరీరము, నీ ఆలోచనలు నీ అస్తిత్వము మొదలైనవి మాత్రమే. కాని, "నిజమైన నీవు" కాదు. అవన్నీ కలిపితే అదే అవుతుంది కదా - అనుకోవచ్చు. కాని, అది సరికాదు. ఎందుకంటే, మాంసానుగతమైన నీ ఈ అవతారపు సమ్మేళనమే తప్ప అదంతా 'నిజమైన నీవు" కాదు.

మరైతే నీవు ఎవరు?

ఆ "నీవు" అనేది పరీక్షకుగాని, ఋజువుకుగాని లొంగనిది. మానవుడు ఇప్పటి వరకు కనుగొన్నవి, భవిష్యత్తులో కనుగొనగలవి అయిన శారీరక ఉపకరణాలకు సంబంధించిన పరీక్షలకు కూడా అతీతమైనది. దానిని గాఢంగా విశ్వసనీయంగా ఆలోచించగల వారు మాత్రమే దానిని గురించి కొంత తెలుసుకోగలరు. ఈ తెలుసుకోవడమనేది భావనా సంబంధమైన తెలివిడి. అంతేకాని, (భౌతిక, రసాయన శాస్త్రాలకనుగుణంగా ఏర్పరచుకునే) పరిశోధన శాలలలో చేసే ప్రయోగాల వలన తెలుసుకునే లాంటిది కాదు. ఆ 'నీవు" గురించి దాని ప్రత్యేక లక్షణాలను గురించి; మన మహాప్రవక్తలు, అతీత చైతన్యవంతులుగా నిలిచిన ప్రాచీన-ప్రస్తుత మహర్షులు; చెప్పిన విశ్వసనీయమైన (సరియైన) వర్ణనలను ఆధారం చేసుకోవలసి ఉంది.

నీ శరీరమూ ప్రాణమూ కలవగా ఏర్పడిన సజీవమైన "నీవు"నకు మూలముగా, చూస్తే కనపడనిది, చురుకైనది, సత్యమైనది : ఒక పదార్థము ఉన్నది. మనము నివసించే ఈ భూగోళం చుట్టూరా ఈథర్ పరివేష్టితమై ఉన్నట్లు, పైన చెప్పినట్టి పదార్థము నీ యావత్తు శరీరాన్ని, ఇంద్రియాలని, మేధను (దాని కార్యకలాపాలను) పరివేష్టించుకుని ఉంటుంది. శరీరానికి చలనమునిచ్చేది ప్రాణము అనుకుంటే, అట్టి ప్రాణానికే చలనమునిచ్చేది ఇది. కాని, శరీరము, దాని కార్యకలాపాలు వేరు, ఇది వేరు. దీని అవశేషాలు శరీర ధర్మాలవలన ప్రభావితం కావు. ఇదే నీ జీవాత్మ, లేక నీ వ్యక్తియాత్మ. ఇదే నీలో ఉండే నిజమైన నీవు.

**సూక్ష్మత్వము అనంతత్వము అనే రెండు గుణములు**
**కలిగిఉన్న ఆకాశమునకు ఏదియును ఎట్లు అంటదో,అట్లే: శరీరమునందు**
**అంతటా నిలిచి ఉన్న ఆత్మకు ఏదీ అంటదు**

- శ్రీమద్భగవద్గీత క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగయోగము : 33

నీకులాగానే ప్రతి ఇతర ప్రాణి (జంతువు, పక్షి మొక్క, కీటకము - దేనికైనా సరే)

ఒక జీవాత్మ (వ్యక్తి యాత్మ) ఉంటుంది. ఒక చెట్టుకు కొమ్మలు మొలిచినట్లు, ఈ వ్యక్తియాత్మలు అన్నీ (మరింత పెద్దదిగా చెప్పుకోగల) పరమాత్మ (విశ్వాత్మ)లో భాగాలు. ఈ పరమాత్మ అనేది ఒక పెద్ద శక్త్యాశయము. అది అన్ని జీవాత్మలకే కాక, సూర్య, నక్షత్రాది దివ్య గోళాలకు కూడా శక్తినీ ప్రాణాలనూ ఇచ్చేది. అది ప్రకృతికి సంబంధించిన - అగ్ని, నీరు, గాలి-వంటి శక్తులన్నిటికీ అతీతమైనది. వైశాల్యంలోను, శక్తిలోను, మహిమలోను- అవధులు లేనట్టిది. దానికి జనన మరణములు లేవు

**ఆత్మకెప్పుడును జననము కాని మరణముకాని లేదు,**
**ఆత్మ ఒకప్పుడు ఉండడం కాని, మరొకప్పుడు లేకపోవడం కాని జరగదు.**
**అది పుట్టుక లేనిది, శాశ్వతమైనది, నిత్యమైనది, పురాతనమైనది.**
**దేహము చంపబడినను ఆత్మచంపబడదు.**

- శ్రీమద్భగవద్గీత, సాంఖ్యయోగము : 20.

**ఆత్మ అనేది ఛేదించుటకు వీలులేనిది, అగ్నివలన కాలనిది,**
**నీటివలన నాననిది,కరగనిది, ఎండవలన ఆరనిది.**
**అది నిత్యము. అది సర్వ వ్యాపితము. స్థిరము. సనాతనము.**

- శ్రీమద్భగవద్గీత సాంఖ్యయోగము 24

అందువలన; నక్షత్రాది శక్తులును, మానవ, అమానవాది సకల భూస్థిత జీవులును ఒకానొక అనర్ఘ, విశ్వకుటుంబపు సభ్యత్వముతో, సామాన్య పైతృకత్వముతో ఉన్నారు. విశ్వమునందు నిర్ధారితములైన భగవత్సంకల్పములను నెరవేర్చుటకు, ఈ సమస్త జీవరాశులు; వాటివాటి నిర్వాహక సామర్థ్యాలతో సరస్పర ద్వేషరహితముగా ఒక చేతికి ఉండే అయిదు వ్రేళ్లవలె సహకరించుకుంటాయి.

మళ్లీ "జీవాత్మ" గురించి చెప్పుకుందాము. మనలో ప్రతి ఒక్కరికీ సంబంధించే ఒకానొక అతి ముఖ్యమైన విధిని "జీవాత్మ" నిర్వహిస్తుంది. ఒక వ్యక్తి మరణించినప్పుడు అనగా ఆ వ్యక్తికి భూమి మీద నిబద్ధితాలైన అన్ని జీవిత కార్యకలాపాలూ పరిసమాప్తి చెందిన సమయమందు, జీవాత్మ: ఆ శరీరమునూ ఆప్రాణమునూ విసర్జిస్తుంది. అయితే ఆ జీవియొక్క కర్మభారాన్ని మాత్రం తీసుకుపోతుంది. ఆ భారమంతా ఒకానొక విత్తనములోని గర్భభాగము వంటి కీలకమైన స్వరూపానికి మార్చుకొని, దానిని - వాయువు తనతోబాటుగా తాను స్పృశించిన పూవుల సుగంధమును కొనిపోయిన విధంగా - తీసుకుపోతుంది.

**శరీరమునందలి జీవాత్మ**
**నా అంశయందలి ఒక అమర్త్యశకలము.**
**అది భౌతిక రూప స్థితమైన పంచేంద్రియములను**
**మనసుతో సహా ఆరుగా చేసి, తనతో లాగుకొని పోతుంది.**

- శ్రీమద్భగవద్గీత· పురుషోత్తమ ప్రాప్తియోగము : 7

**వాయువు తనతో బాటుగా**
**తాను స్పృశించిన పూవులసుగంధమును తీసుకొని పోయినట్లే,**
**శరీరముపై (ఎంతోకాలము వసించి దానిపై)**
**ఆధిపత్యముగల జీవాత్మ తాను ఆశరీరమును విసర్జించినపుడు;**
**దాని యందు ఉండిన మనసునూ పంచేంద్రియములనూ**
**తాను ఇటుపై స్థితము కావలసిన (వేరొక) శరీరము మీదికి తీసుకొని పోతుంది.**

- శ్రీమద్భగవద్గీత; పురుషోత్తమ ప్రాప్తియోగము : 8

కర్మభారమును ఒక శరీరమునుండి, మరియొక శరీరము వరకు చేకొని పోయే సమయమంతా- అనగా మరియొక శరీరము నందు స్థితమై పునరూపమునొందు వరకు- జీవాత్మయే ఆ కర్మభారమును వహిస్తుంది. తాను భారవాహము చేస్తూ ఉన్న కర్మ భారాన్ని అనుసరించి, అట్టి కర్మభారపు యోగ్యతలకూ అవసరాలకూ సరిగా ఉండే పునరూపమును జీవాత్మ ఆశ్రయిస్తుంది. అప్పుడు జీవాత్మ ఆ కర్మభారమును ఆ పునరూపమునకు ఒప్పగిస్తుంది. కర్మభారమును తన జీవన పరిమాణములో పెంచడమా-తగ్గించడమా అనేది ఆ పునరూపపు బాధ్యత. జీవాత్మ ఇలాగ పునరూపము లనూ-పునర్జన్మలనూ ఎదర్కొంటూ కర్మభారమును పూర్తిగా వదిలించుకొనే వరకు సాగి, ముక్తి పొందుతుంది. ★

# తట్టుకోలేనిదే; కాని, న్యాయమే

అసలు మానవ మేధ చాలా పరిమితమైనది. ఏవో తాత్కాలిక ప్రయోజనాలను ఉద్దేశించుకొని, (తన, జన, తృప్తి కోసం) 'అనంతం", "మోక్షం", లాంటి పదజాలాలను, ఊహలను ఉపయోగంలోకి తెచ్చుకోవచ్చు కాని, ఆ భావాలను అనుభవంలోకి తెచ్చు కోవడంగాని, వాటిని లోతుగా విశ్లేషించుకోవడంగాని, అతనికి అసాధ్యమైన భారం. ఆ సంగతి దృష్టిలో ఉంచుకొని, పోనీ, మనకి అర్థమైనంత పరిమితమైన పద్ధతిలో; ఈ విశ్వాన్ని నడిపిస్తున్న మహాశక్తి తాలూకు ఒకటి రెండు లక్షణాలని గ్రహించడానికి ప్రయత్నిద్దాం.

మనకు తెలిసినంత వరకు, లేదా; మనం ఊహించ గలిగినంత వరకు' భగవంతుని శక్తి సమగ్రమైనది. ఈ 'భగవంతుడు' అనేదే ఒక శక్తి అనుకున్నట్టయితే, ఆ శక్తిని మనం మనకిష్టమొచ్చిన పేరు పెట్టుకొని వ్యవహరించుకోవచ్చును. విశ్వాత్మ, ప్రకృతి, అదృష్టము, విధి - ఇలాగ. అది ఏమీ అంత ముఖ్యం కాదు. అయితే, ఈ విశ్వం మీద అతని సర్వసర్వంసహాశక్తి ఎంతో శాశ్వతము, ఎంతో పరిపూర్ణము. అలా కాకపోతే-అసంఖ్యాకాలైన-నమ్మడానికి వీల్లేనంత పరిమాణము గలిగిన-సౌరకుటుంబాలు, రాశి చక్రాలు, నక్షత్రమండలాలు, వాటివాటికి నిర్ణీతాలైన కక్ష్యలలో; ఇన్నివేల సంవత్సరాల నుంచి - అదేదో సర్కసు రింగులో ఎవడో కొరడాతో అదిలిస్తున్నంత క్రమశిక్షణతో-నిరంతరం పరిభ్రమిస్తూ ఉండడం అసాధ్యం. అవన్నీ కూడా మహాశక్తులే. కాని, విశ్వప్రభువు ఆజ్ఞలను నిస్సహాయంగా నెరవేరుస్తున్న బానిసలవలె ఉన్నట్టు తోస్తుంది. విశ్వ ప్రభువు శక్తిగాని, అధికారం గాని అసంపూర్ణంగా ఉన్నా, శాశ్వతం కాకుండా ఉన్నా, ఇదేమీ జరగదు.

మానవుడు రైల్వేలు, టెలిఫోన్ ఎక్స్ఛేంజీలు, పారిశ్రామిక సంస్థలు ఇలాంటివి ఎన్నో సృష్టించాడు. వాటి కార్యాచరణ పద్ధతులను ఎప్పటికప్పుడు అభివృద్ధి చేసుకుని వీలున్నన్ని చోట్ల కంప్యూటరీకరణము చేస్తున్నాడు. అయినాసరే, వాయుమండలంలో విమానాలు ఢీకొనడంనుంచి ఎన్నో ఘర్షణలు, ప్రమాదాలు, యాంత్రిక వైఫల్యాలు- లాంటివి సంభవిస్తున్నాయని అనునిత్యం వింటున్నాము, గ్రహిస్తున్నాము. కాని; ప్రమాణాలలో అనూహ్యాలు, పరిస్థితులలో సంక్లిష్టాలు, నిండిఉన్న విశ్వాన్ని ఆ ప్రభువు నిర్వహించే రీతి నిబిడాశ్చర్యకరము. సౌరకుటుంబాలు, రాశిచక్రాలు, నక్షత్రమండలాలు విశ్వప్రభువు నిరతిక్రమణీయమైన జాగరూకతతో నిర్దేశించిన ఆజ్ఞల మేరకు లోనయ్యే పరిభ్రమణంలో ఇన్నివేల (లక్షల) సంవత్సరాలలో ఎక్కడా ఒక్కమారు, ఒక్కచోట; గతి తప్పినట్టు గాని; ఒక లిప్తకాలము, ఒక వెంట్రుకవాసి స్థలము తేడాగా జరిగినట్టు గాని వినలేదే! ఈ అనంత కాలంలో ఎన్నడూ కూడా విశ్వాంతరాళంలో (ఆయా శక్తుల గతులలో) ఒక దుస్సంఘటన గాని, చలనభ్రంశంగాని జరిగినట్టు వినలేదే! విశ్వప్రభువు నిర్వహణ అంత



A C. No. 18209

పద్ధతిగా, పటిష్ఠంగా, ఉండి ఉండకపోతే, ఈ శాంతి ఊహించడానికే వీల్లేని దయ్యేది. విశ్వప్రభువు నిర్వహణలోని పద్ధతి గురించి, పటిష్ఠత గురించి అలా చెప్పుకుంటూ పోతే, ఎన్నో తెలుస్తాయి. ఆయన శక్తి సర్వవ్యాపితము. జంగమ స్థావరాలైన ఆతని సృష్టిలో గల పిపీలికాది బ్రహ్మపర్యంతం అన్నీ ఆశక్తికి లోనయ్యేవే. దేహములో అణువణువునా ప్రాణము ఉన్నట్టు విశ్వములో అంతటా ఆ శక్తి నిండి ఉంది.

విశ్లేషించుకుంటూ పోతే; చివరికి ఏ శక్తి అయినా, అధికారమైనా- దానికి సంబంధించిన నైతికబలం ఆధారంగా ఏర్పడుతుందని అనుభవం చెపుతుంది. సత్యము, న్యాయము; పునాదులుగా చేసుకోకుండా నిర్మించుకున్న ఎంతటి శక్తి అయినా ప్రారంభంలో అది చాలా కాలం నిలవగలదన్న భ్రమను కలిగించినప్పటికీ, అది తప్పనిసరిగా కొన్నాళ్లకి హరించుకు పోతుంది. ప్రపంచ చరిత్రలో లెక్కలేనన్ని రాజవంశాలు: ఉన్నట్టుండి నింగికి ఎదిగి, సత్వరమే కూలిపోవడం- అదే ఈ శాశ్వత సత్యానికి సాక్షీభూతము. అలా కాకుండా, ఈ విశ్వపు నిర్వహణ ఎంతో అవిశ్రాంతంగా, పటిష్ఠంగా-మనము ఊహించలేనంత కాలము నుండి- అలా జరుగుతూ ఉందంటే; అదంతా ఈ అనంత కాలమునుండి అమేయమైన శక్తిని సాధించుకున్నది: సత్య-న్యాయాల ఆధారంగానేనని మనము నిర్ధారణకు రాక తప్పదు.

మరి భగవంతుని శక్తి శాశ్వతమైనదని, స్వచ్ఛమైనదని అనుకుంటున్నాము కదా! విశ్వమును ఆయన నిర్వహిస్తున్న తీరు పరిపూర్ణమైన న్యాయముపైన, సత్యముపైన ఆధారపడిఉన్నదని అనుకుంటున్నాము కదా; మరి అనుదినము మనచుట్టూ ఎంతో అసమానత అన్యాయము ఎందుకు కనబడుతున్నాయి?... ఇద్దరు వ్యక్తులున్నారు. వారిలో మొదటివాడు అర్హతలవలన, శీల ప్రవృత్త్యాది విలువల వలన రెండవ వానికంటె ఘనుడు. కాని ఈ రెండవ వాడు ఏ పనికి సమకట్టినా మొదటివాని కంటె జీవితాంతమూ అధికత్వము సాధించే అదృష్టాన్ని పొందగలుగుతున్నాడు. ఈ ఇద్దరి పట్ల అదృష్టపు పంపకం ఎగుడుదిగుడుగా ఉండడాన్ని ఏమని అనాలి?

ఒక్కొక్కప్పుడు (అదృష్టపు ఎగుడు దిగుడుల పంపకము) ఇలాగ కూడా జరగ వచ్చును. మొదటివాడు ఎన్ని విధాల అర్హతలు, విలువలు కలిగిఉన్నా, రెండవవాడు "కలిగినవారి" ఇంటపుట్టి తల్లిదండ్రుల పలుకుబడిచేత, ఎక్కడంటే అక్కడ వర్ణవర్ణాల విజయాలను పొందుతాడు. అప్పుడు మనకు చాలా సందర్భోచితమైన సందేహం జనిస్తుంది. ఆ కలిగినింటి కుటుంబంలో "రెండవవాడే" ఎందుకు పుట్టాలి? మొదటివాడు ఎందుకు పుట్టి ఉండకూడదు?... భగవంతుని ఈ చర్య ఏ విధంగా సమర్థనీయం?

మరి దీనికి జవాబు కావాలనుకుంటే, మన ఆలోచనా ధోరణిని ఇంకొకవైపు తిప్పుకో వలసి రావచ్చు.

మనకు ఉన్న తెలివిడి పరిధికి ఒక అవధి ఉంది. దాని వలన మనము; కారణం లేకుండా కార్యం జరగదు, ప్రతి కారణం దాని ఒక పరిణామాన్ని విడిచిపెడుతుంది-

అని మన లోకజ్ఞానం మనకు చెపుతుంది. కాబట్టి ఇలా అనుకోవాలి:

"రెండవవాడు" సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్న తల్లిదండ్రులకు జన్మించడమనేది ఏదో యాదృచ్ఛికంగా జరిగినది కాదు. దానికేదో కారణం ఉండి తీరాలి. అతని ఈ పుట్టుక ఈ జీవితానికి తొలి సంఘటన. అయితే, ఈ పుట్టుకకు కారణం అతని పూర్వ జన్మములోదే అయిఉండాలి. అంటే ఒక పూర్వజన్మ ఉండాలి. అది ఈ జన్మలో సంఘటించిన వాటికి కారణంగా కూడా ఉండాలి. ఇప్పటి జీవితానికి కారణమైన పూర్వజీవితం, దాని క్రియా కలాపాలు- ఇవి అతని పురాకృత కర్మ- అని హిందూ మత గ్రంథాలు చెబుతున్నాయి. కాబట్టి "రెండవ" వ్యక్తి ప్రస్తుత జీవితం అతని పూర్వ జీవితం వలన, ఆ "పూర్వజీవితం" దానికంటె పూర్వం ఘటించిన జీవితం వలన: ప్రభావం చెందినవి.

ఇలా మనం అంతులేని గతం లోతులకు పోయినా మౌలికమైన కర్మ ఎక్కడ, ఏ దశలో ప్రారంభమైందో తెలుసుకోలేము. (ఇది "రెండవవాని" పట్ల ఎంత నిగూఢమో "మొదటివాని" పట్ల కూడా అంతే.)

ఆ మౌలికమైన కర్మ ఎక్కడ, ఏ దశలో ప్రారంభమైనప్పటికీ, భగవంతుడు "న్యాయానికి మరో పేరే" గనుక మొదటివాడికీ రెండవ వాడికీ సమానమైన న్యాయాన్నే ప్రసాదిస్తూ వాళ్ల జీవితాలను ప్రారంభించేటప్పుడు: వారి వారి మార్గాలు ఇవి- అని నిర్దేశిస్తూ కర్మ భారములను మాత్రము (శూన్యముగా, లేక సమమైన బరువులతో) సమముగానే నిర్ణయిస్తాడు. వారి గమ్యము కూడా అతడే నిర్దేశిస్తాడు. అది ముక్తి కానీ, మరేదైనా కానీ- కావచ్చు. అది ఇద్దరికీ సమానమే. అక్కడికి చేరేటప్పటికి వారి కర్మ భారములు శూన్యముగా గాని, సమానముగా గాని ఉండవలసినదని నిర్ణయిస్తాడు అయితే, వారి మార్గాల ప్రధాన దిశలు (భూగ్రహంలోని) దక్షిణ ధ్రువమునుండి ఉత్తర ధ్రువమునకు గీచిన రెండు రేఖాంశములవలె విభిన్నమైనవిగా ఉంటాయి. ఈ విభిన్నత వలన వారి యానాలు, ఆయానాలలో తటస్థ పడే వివిధ అవరోధాలను అతిక్రమించడానికి వారు అవలంబించే విధానాలు: వేరు వేరవుతాయి. అలాగ, వారి యానాలలో మధ్య మధ్య వచ్చి పడుతూ, తప్పుకుంటూ ఉండే విభిన్నమైన (పరిమాణాలుగల) కర్మ భారాలు వేరు వేరు అయిన్నప్పటికీ, అంతిమ ధ్యేయాన్ని చేరుకొనే టప్పటికి (ఆ తేడాలన్నీ హరించుకు పోయి) వారి కర్మభారాలు సరిసమానంగా ఉంటాయి, కర్మ భారాలను పెంచే, తుంచే-స్థితులు: వారి వివిధ జన్మలు. ఆ యా జన్మలలో వారి యోగ్యతలకు జరుగుతున్నాయని పించే అన్యాయాలు: తాత్కాలికములు, భ్రమాన్వితములు మాత్రమే. మార్గాల నిర్దేశన, ఆ మార్గాలలో సంఘటించే అవరోధ అదృష్టాలు: ఇవన్నీ భగవన్నిర్ణయాలు. ఇప్పుడు మనం పేర్కొన్న "మొదటివాడు", "రెండవవాడు": మనకు 'మధ్య దారిలో కనపడిన వారే" తప్ప, ఆద్యంత స్థితులలో కాదు. విగ్రహము తయారవుతున్న స్థితిలో చూసి, దాని సుందరతను, సమత్వాన్ని నిర్ణయించలేము. (అలాగే వారిరువురు ప్రస్తుతము

ఉన్న స్థితిగతులను బట్టి, వారి అదృష్టపు పంపకం ఎగుడు దిగుడుగా ఉందని భావించ కూడదు.) అంతేకాదు. నక్షత్రసంబంధమైన సంఘర్షణలలో గాని, కక్ష్యలలో సంభవించే లోటుపాటులలో గాని; మనము గమనించగలిగేవి వాటి వాటి తాత్కాలికమైన ఎగుడు దిగుడులే. అవన్నీ ఎప్పుడో సర్దుకుంటాయి. ఎప్పుడు - అంటే అది మనం ఊహించ లేనంత కాల, స్థల వ్యవధులకు అతీతమైనవి.

ఇదంతా మానవుడు ఉరమరికగా ఊహించినది మాత్రమే. అది తప్పు అయితే కావచ్చు. కాని, అసంగతాలుగా అనిపిస్తున్న వీటికి తృప్తికరమైన వివరణలు లభించేదాకా, వీటిని ఆమోదించుకోవడంలో తర్క విరుద్ధమైనదేదీ లేదు.

లేకపోతే, మన మహర్షులు చెప్పిన వాటిని ప్రమాణాలుగా స్వీకరిద్దాం. వారి సూక్తులను విందాము. ఎందుకంటే మనకున్న జ్ఞానం గ్రహణ శక్తి ఆధారంగా ఏర్పడినది. వారిది అనుభవ పూర్వకము. ఒక్కముక్కలో చెప్పాలంటే, ఇదంతా మన పురాణాలలోనూ, ఉపనిషత్తులలోనూ, ఇతర పవిత్ర మత గ్రంథాలలోనూ చెప్పినదే.

భగవంతుడు సర్వశక్తిమంతుడే కాక, సర్వన్యాయవేది. ఆతని ఆజ్ఞలు అనిరుద్ధములు. భగవంతుడు నిర్దేశించే మార్గాలు నిగూఢములే అయినా, వాటిని శంకారహితంగా అనుసరించవలసినదే. ★

## మూడవ భాగం

# సాధకుని ప్రాథమిక ఆవశ్యకతలు

## ఐదవ ప్రకరణము

# సత్యము

ద్రవ్య ప్రాధాన్యముగా సాగుతున్న నేటికాలంలో-"సత్యం" అనేది, దానిని ఆచరించ దలచిన వానికి ఆత్మహత్యా సదృశమని అనిపిస్తుంది. అసత్యవాది, వంచకుడు, బుద్ధి వికాసంతో గారడీ చేసేవాడు, దంభాచారుడైన తార్కికుడు: వీరే సమాజాన్ని ఏలుతున్నట్లు తోస్తుంది. నల్లగా ఉన్నదాన్ని తెల్లగా ఉందని నమ్మిస్తారు. స్పష్టమైనదానిని గుర్తుపట్ట లేనంతగా వక్రీకరించి, అదే నిజమని ప్రచారం చేసి, విజయ పతాకాన్ని ఎగురవేస్తారు. లోక సౌభాగ్యం మాట అటుంచి, సత్యము వచించుకుంటూ జీవనము సాగించడము- ఇది ఒక సమస్యగా తయారవుతోంది. ఒక నౌకరు ఉంటాడు. అతని యజమాని ఏదో కారణం వల్ల అతనిని ఒక అబద్ధం ఆడమని నిర్దేశిస్తాడు. ఉద్యోగం పోతుందేమోనన్న భయంచేత నౌకరు అబద్ధం చెపుతాడు. సామాన్యుడైన వ్యాపారిగాని, న్యాయవాదిగాని, వృత్తిపరంగా తాము చెప్పుకోవలసిన మిధ్యా సత్యాలను పరిపూర్ణ సత్యాలవలె చలామణీ చేసి, అవన్నీ తన వృత్తి నిబద్ధ అవసరాలే తప్ప తమ ఉద్దేశ్యపూరకంగా చేసిన సత్యరేఖా అతిక్రమణలు కావని తమకు తాము నచ్చజెప్పుకుంటారు. ఇవన్నీ మామూలే. జీవన పోరాటంలో తటస్థపడే లౌక్యాలవల్ల, పోటీలవల్ల బలవంతంగా అవలంబించుకోవలసి వస్తున్నవి. వాటిని నియంత్రించుకొనే యోగ్యత లేదు.

అదలా ఉంచి, ఇవాళ ప్రపంచం నిండా క్రియాత్మక తత్త్వవేత్తలు తయారయ్యారు. వీళ్లలో చాలామందికి తమ భక్తులు, తమ అనుయాయులు: ఉంటారు. మెరుగు పెట్టిన అసత్యం సంక్లిష్ట మైన సత్యం· అధునాతన సమాజానికి అవసరాలుగా, అర్హతలుగా ఉంటాయని వారి బోధలవలన గ్రహించవలసి వస్తుంది. అర్ధసత్యాలు, అసత్యాలు, అసంబద్ధ సత్యాలు - ఇవన్నీ కూడా కార్యసాధన ఉద్యమాలలో తప్పించుకోలేనివి. అవి పాపాలు కావు. నైతిక నేరాలు కావు.

ఇవాళ ప్రపంచంలో క్రియాత్మక తత్త్వవేత్తలే కాక, ఇంకా అత్యాధునికులైన పిడివాదులు కూడా చేరారు. తాము అనవసరంగా అసత్యం చెప్పము- అని వాళ్ల సంతృప్తి. అసత్యం వలన ఒకానొక ఉన్నతమైన ప్రయోజనం సిద్ధిస్తుందంటే సత్యము అనే దానిని వారు పట్టించుకోరు. సత్యము దాని ప్రయోజనం కన్నా ఎక్కువకాలం వ్యాప్తిలో ఉంటే దానివలన ఏ లాభమూ ఉండదంటారు వారు. పాలు ఇచ్చే వయసు దాటిన ఆవు మాంసంగా మారవలసిందే.

సమాజం ఇలాంటి సూత్రకారుల ఏలుబడిలో చిక్కుకుపోయి ఉంది. సాధారణమైన ప్రతిభతో, వనరులతో నమ్మకాలతో జీవితాన్ని సాగించుకునే సామాన్య మానవుడికి సత్యమార్గం అంతా అసాధ్యమైన పర్వతారోహణము వంటిది. సత్యమార్గం అతనికి ప్రాపంచిక విజయాలను సమకూర్చదు. రాజీ పడకుండా సత్యమార్గాన్ని పట్టుకుని వేళ్లాడే

వాడు, చివరికి అస్తిత్వాన్నే కోల్పోతాడు. ఇంక జీవితంలో విజయం గురించి గాని, అపజయం గురించి గాని చెప్పడానికి ఏముంది!

కాని, అసలు పరిస్థితి అంత నిరాశావహంగా లేదు. సత్యానికి దాని ప్రాపంచికమైన లాభాలు ఉన్నాయి. దానిని ఆరాధించే వారికి అవి లభిస్తాయి. ఒకటి మాత్రం నిజం. క్రమం తప్పకుండా పరిపూర్ణమైన నిజాయితీతో సత్యమార్గాన్ని అనుష్ఠిస్తూ జీవించే వారికి తొందరగా కాకున్నా, ఆలస్యంగానైనా ఫలితం లభిస్తుంది. వారికి ఒకానొక అంతర్గత మైన ఆధిక్యత ఒనగూడుతుంది. అట్టి ఆధిక్యత ఒనగూడని సామాన్యులు వారిని తప్పక గుర్తిస్తారు. వారికి ఆ సత్యపరమైన జీవితానికి బహుమతులుగా సర్వత్రా ఆదర గౌరవాలు లభిస్తాయి. అదంతా సుదీర్ఘమైన బాధావేదనల వలన చేజిక్కేది కనుక బలిష్ఠంగా, శాశ్వతంగా భాసిస్తుంది. వారికి ఇతరులు పట్టే నివాళులు గొప్పవి అవన్నీ సత్యమార్గ అవలంబికి ఉండే అంతరౌన్నత్యానికి లభ్యమయ్యే, గౌరవాస్పదమైన యోగ్యతా పత్రాలు. అవి వాటంతటవే వస్తాయి. కొన్ని, శత్రువులనబడేవారు ముఖస్థంగా కాక పరోక్షంగా సమర్పిస్తారు. వాటిలో ఏవీ కూడా సత్యమార్గ అవలంబితో పనులున్నవాళ్లు, ఆధారపడి జీవించే వాళ్లు చెప్పే ముఖప్రీతి మాటలు కావు. మంచి చెడ్డలు తెలిసిన ఎవరికైనా ఇదంతా తృప్తికరమూ, ఈర్ష్యాస్పదమూ కూడాను. సత్యముపట్ల విశ్వాసం కలిగి దానిని ఓర్పుతో అంటిపెట్టుకుని ఉంటే, సత్యం ప్రతిష్ఠను పెంచుతుందని నమ్మాలి. సత్యం ఏనాటికైనా తప్పనిసరిగా సముచితంగా సత్కరిస్తుంది.

అదంతా అలాఉంచి, మోక్ష సాధన ధ్యేయంగా సాగే వారికి- అంతర్గత శక్తిగా మార్గదర్శిగా, నిలిచి- సత్యం అందించే చేయూత అమూల్యమైనది. జీవితంలో ప్రాథమిక విశ్వాసంగా సత్యాన్ని స్వీకరించి, ఎలాంటి ఊగులాటలూ లేకుండా దానిని అనుసరిస్తే సత్యం మూడు విధాలుగా సహాయపడుతుంది.

1. సత్యం అనేది ఎవరి అంతరాత్మకైనా అతిసుకరమైన, శంకారహితమైన రక్షకశక్తి. అంతరాత్మ ఎప్పుడైనా కలవరపెట్టవచ్చు, చలించవచ్చు కాని, సత్యము అలాకాదు. అదెప్పుడూ ఒకదిక్కుకే ప్రయాణిస్తుంది. దానికి పక్షపాత బుద్ధిలేదు. న్యాయమే ప్రమాణంగా కలిగినది. కనుక, మానవులకు సంభవించే సమస్యలు చాలా వాటికి సులువైన పరిష్కారాలను చూపుతుంది.

2. అంతః స్వభావము ఒకటి ఉంటుంది. దానికి కొన్ని బలహీనతలు ఉండవచ్చును. వాటిని బహిరంగపరచడానికి, అంగీకరించడానికి బిడియం అడ్డువస్తుంది కాని పట్టుదలగా సత్యాన్ని అంటిపెట్టుకొని ఉంటే, అంతఃస్వభావములోని బలహీనతలు వాటంతట అవే బహిర్గతాలు కాగలవు. పాపకర్మలు ఆత్మావమానకరమైనవి. సత్యాను శీలనం: మనసా - వచసా - కర్మణా - అట్టి పాపకర్మలకు లోనవకుండా కాపాడుతుంది. అలా అలా, శీల ప్రవృత్తులలోని కామ - క్రోధ - మాత్సర్యాది అపరిపక్వతలు తుడిచి పెట్టుకుపోతాయి. భగవద్గీతా ప్రయుక్తాలయిన ప్రయోగాలను ఆచరించడానికి కావలసిన సర్వసన్నద్ధత ఒనగూడుతుంది.

3. అంత ముఖ్యమైనదీ మరిఒకటుంది. శీల ప్రవృత్తులలో ఈ దోషాలు పరిహరించు కోకపోతే, (ముక్తి సాధన ధ్యేయంగా సాగే) ప్రగతికి అనిశ్చితమైన తిరోగమనం సంభవిస్తుంది. పరిహరించుకుంటే ఆగామికర్మను తప్పించుకోవడానికి సహజమైన రక్షణ కలుగుతుంది. సత్యమే ఉత్తమ మిత్రము; సత్యమును నమ్ముకుంటే ముక్తికి అదే మార్గ దర్శకం, అందుకనే సత్యమే దైవము- అన్నారు. ఇంతకంటె ఇంకేమి కావాలి? సాధకుడు ఆధ్యాత్మిక ప్రగతే ముఖ్యమైన లక్ష్యంగా తొట్టతొలి అడుగులోనే మనసును నిబంధించు కుని జీవించాలి. అనుబంధ సూత్రంగా సత్యమార్గ అనుసరణ సాగాలి; అది ఐహిక పురోగమనానికి ఎంతటి అవరోధంగా నిలిచినా సరే. (దీనికి అపవాదంగా "వైరాగ్య సాధన" అనే పదహారవ ప్రకరణము చూడాలి.) ★

## ఆరవ ప్రకరణము

# స్వేచ్ఛాభీష్టము

విధి ఉంది. స్వేచ్ఛాభీష్టము ఉంది. ఈ రెండిటిలో ఎది ఎంతటిది? అనే ప్రశ్న - ఇరు పక్షాలకు సంపూర్ణ సంతృప్తినిచ్చే పరిష్కారం కుదరనిది. (పరిష్కారానికి అసాధ్యాలయిన అనేక సమస్యలలో ఇదికూడా ఒకటి.)

మానవుడి అభీష్టానికి "స్వేచ్ఛ" అంటూ ఒకటుందా? ఉంటే ఎంతవరకు?

మానవ మేధ పరిమితము. కనుక ఈ ప్రశ్నకు ఉరమరికగా వచ్చే జవాబును ఊహించుకోగలము. అంతేతప్ప, ఇలాంటి సందేహాలకి ఖచ్చితమయిన పరిష్కారాలు సాధించలేము.

ఒకలా అనిపిస్తుంది. మానవుడికి స్వతంత్రమయిన ఇచ్ఛాశక్తి ఉంటే, అతడు స్వయంకృషి వలన దానిని క్రమానుగతంగా బలవత్తర పరచుకొని, సర్వేశ్వరునికి ప్రత్యర్థిగా నిలిచేవరకు సాగగలడు. అప్పుడు ప్రతి ప్రత్యేక ఆత్మ, ఒక్కొక్క స్వతంత్రమయిన పరమాత్మగా రూపొందుతుంది. ఒక విశ్వము, బహు విశ్వములుగా పరిణామము చెందుతుంది. అట్టి కూటమి ఆలోచన అనూహ్యము. స్వయం విరుద్ధభావనము. అపచారాభాసము. పలు విశ్వములు వాటివాటి భాగాలైన నక్షత్రమండలాలతో వేటికి తోచిన కక్ష్యలలో అవి విశృంఖలంగా, విభిన్నమైన దిశలలో పరిభ్రమిస్తే ఎప్పుడోగాని, అప్పుడప్పుడు గాని, తరుచుగా గాని; ఒకదానినొకటి ఢీకొంటూ ఉంటాయి. అది విశ్వ వ్యవస్థ కాదు; అవ్యవస్థ, గందరగోళం.

విశ్వం- అంటూ ఒకటి ఉండాలి. ఉందని మనం నమ్ముతున్నాం. అది ఎలా ఉందని అనుకుంటున్నామో, అందులో మానవుడికి స్వతంత్రమయిన ఇచ్ఛాశక్తి లేకపోయే ఉంటుంది. బ్రహ్మాండమయినది, నియమనిష్ఠమైనది- అయిన ఈ విశ్వాకాశమనే కర్మాగారంలో (స్వతంత్రబుద్ధి ఏమాత్రం కూడా ఉపయోగించడానికి అవకాశం లేకుండా) నిస్సహాయంగా తనపని తాను యాంత్రికంగా చేసుకుపోతూ ఉండి ఉండాలి. ఏదైనా ఒక పెద్ద కర్మాగారంలో చిన్న చక్రాన్ని తిప్పే పళ్లచక్రం కూడా, (ఎక్కడో దూరాన ఉండి ఆ) చలనాన్ని ప్రేరేపించే ముఖ్యమయిన ఇంజిను నియంత్రణలో ఉన్నట్టే మానవుడి ప్రతికదలికా, అతనికి కలిగే ప్రతి ఆలోచనతో సహా, తప్పనిసరిగా ఆ విశ్వాంతరాళం నిర్ణయించిన ప్రణాళిక ఆధారంగానే (భాగంగానే) జరుగుతుంది. అతనికి ఆ ప్రణాళిక మీదగాని, కార్యక్రమ వివరాల మీదగాని ఏ కొద్దిపాటి అధికారం కూడా ఉండదు.

మానవుడు తనకు ఒక ఆలోచనా స్వాతంత్ర్యం ఉందని, అది తాను అనుకున్నట్టే సాగుతుందని ప్రకటించవచ్చు. అతడు ఆ విధమును ఆచరించి చూపించవచ్చు. మాటవరసకి "నేను ఉదయం తొమ్మిదిగంటలకు నా గదిలోకి ప్రవేశిస్తాను." అని చెప్పి ఖచ్చితంగా అలాగే ప్రవేశించగలగవచ్చు. అయితే, (మనం ఇంతకు ముందు నిర్ధారించు

కున్న) సిద్ధాంతం ప్రకారం- ఉదయం తొమ్మిది గంటలకు తాను తనగదిలోకి ప్రవేశించడమూ, అలా ప్రవేశిస్తానని చెప్పడమూ రెండూ కూడా (ఒకానొక ఇతరేతర శక్తిచేత) ముందుగానే నిర్ణయమయాయి. అందుచేత ఈ మొత్తం వ్యవహారంలో అతని ఇచ్ఛాశక్తి ఏమీలేదు.

ఈ సిద్ధాంతతర్కం భద్రమైన పునాదిమీదనే ఉన్నట్టు అనిపిస్తుంది. ఇది యధార్థ స్థితి కూడా అయితే మానవజాతి (తనకుందని చెప్పుకొనే) బుద్ధి (మనసు) నిజంగా ఉంటే కూడా అట్టి "బుద్ధి" లేని జంతుజాలం కంటె ఏ విధంగానూ అధికుడు కాడు. స్వతంత్రమయిన ఇచ్ఛాశక్తి లేని పక్షంలో మానవుడిలో ఈ అసంతృప్తి, ఆందోళన ఉండవు. జంతువు వలెనే, అతడు కూడా అజ్ఞానము వలన కలిగే సంతృప్తిని శంకారహితంగా అనుభవించుకుంటూ పోతుండేవాడు.

అదీకాక; మానవుడు తనకు తాను ఎట్టి ఆలోచనలూ నిర్వహించుకోలేని యాంత్రికుడయితే, అనగా స్వతంత్రమయిన ఇచ్ఛాశక్తిని వినియోగించడానికి ఎటువంటి అవకాశమూ లేని వాడైతే- మానవజాతి దేహవైఖరిలోను, అంత:స్వభావాలలోను (సూక్ష్మాతి సూక్ష్మమయిన భేదాలున్నప్పటికీ) మనము ఇప్పుడు గమనించుకుంటున్నంత వైవిధ్యం ఉండదు. మనమందరం ఏదో మాతృక ఆధారంగా ఏర్పడిన నకళ్లవలె ఆకారంలో గాని, పనిలోగాని, ఆలోచనలోగాని: ఏ భేదాలు లేకుండా ఉంటాము. భౌతిక శాస్త్రానికి సంబంధించిన అన్ని సూత్రాలను అధిగమించి సాధారణ మనో బలాలకు అతీతాలయి, అప్పుడప్పుడు విభ్రమాన్వితంగా దర్శనాలిచ్చే శారీరక - మానసిక, శక్తులు కనపడేవే కావు.

తాను ఈ విశ్వకర్మాగారంలో ఒకేమూసలో తయారయిన వస్తువులలో ఒకదాని వంటివాడు అయినప్పటికీ; తనలో ఒక స్వేచ్ఛాభీష్టం ఉండి; తన ఆకారాన్ని, అభిరుచిని దానికి అనుగుణంగా మలచుకునే శక్తిగలవాడనిపించుకునేవాడుగా ఉండొచ్చునని సహేతుకంగా అభిప్రాయపడే అవకాశంకూడా ఉంది.

మరి అట్టి స్వేచ్ఛాభీష్టం ఉన్నట్లయితే అది ఎంతవరకు?

పరిమితిని మించి సాగితేమాత్రం ఒకానొక అవ్యవస్థ నెలకొంటుంది. అది అసందర్భమే కాక, ఊహాతీతంకూడా. కనుక అట్టి స్వేచ్ఛ కొంత పరిమితికి లోబడి ఉండాలి.

ఆ స్వేచ్ఛ ఎలాటిది అయి ఉండవచ్చును- అంటే, ఒక ఖైదీ తనకు కేటాయించిన గదిలో ఏమూలనైనా, మధ్యనైనా ఇష్టానుసారం కూర్చోవచ్చును; అంతేతప్ప ఆ గది విడిచి, అనగా ఆ కటకటాలను దాటి ఇవతలికి రావడానికి వీలుండదు- అనే రకం కావచ్చు ఈ పరిమితికి లోబడి ఉన్న స్వేచ్ఛ అయితే కారాగార అధికారి నిర్వహణకు ఎలాంటి మచ్చను తెచ్చిపెట్టలేకపోతుంది అతడు తన ఉద్యోగాన్ని పోగొట్టుకోడు.

ఇట్టి స్వేచ్ఛను విశ్వస్థాయి దృక్పథంలో పరిగణించుకుంటే అది మిక్కిలి అల్పము. దానివలన విశ్వాంతరాళ నిర్వహణకు (గమనానికి) ఎలాటి అవరోధమూ కలగదు; సరికదా వీసమెత్తు మొగ్గు కూడా సంభవించదు.

మళ్లీ ఖైదీ సంగతే తీసుకుందాము. అతనికి ఆ కారాగారపు గోడల మధ్య కొంత స్వేచ్ఛ ఉంది. ఆ స్వేచ్ఛ ఆధారంగా అతడు తన గదిని శుభ్రం చేసుకుని, కాలుష్య రహితంగా రూపొందించుకుని, అక్కడ తనకు ప్రాప్తమయినంత ఆరోగ్యవంతమయిన పరిస్థితులను ఏర్పరచుకొని కొంతలోకొంత సుఖవంతమయిన జీవితాన్ని సాగించుకో గలుగుతాడు. అలా కాకుండా, ఇది ఏమిస్వేచ్ఛలే - అని నిష్క్రియాపరుడిగా ఉండిపోతే ఆ కారాగారపు గదిలో బొద్దింకలు, తేళ్లు వచ్చి కూర్చోడం వలన బాధలకు గురి అవుతాడు. అదొక్కటే కాదు. కారాగారపు (నిబంధనలకు) క్రమశిక్షణకు తలవంచి సత్ప్రవర్తనలో సాగితే, అతనికి ఒక కుర్చీ, వార్తాపత్రిక, రేడియో-వంటి అదనపు (సుఖ) సౌకర్యాలు ప్రాప్తించవచ్చు. వాటివలన అతడికి కారాగారవాసము అసౌఖ్యంగా లేదని, భరించగలిగినదిగానే ఉందని అనిపించవచ్చు. కారాగారములో ఉన్న ఆ కొద్దిపాటి స్వేచ్ఛనూ దుర్వినియోగం చేసుకుని అప ప్రవర్తనలో పడే ఖైదీకి అధికారులనుండి తన్నులు, దెబ్బలు తప్పవు, బొద్దింకల చీదర, తేళ్ల కాటులు కూడా తప్పవు.

మానవుని మోక్ష "మార్గం" సుదీర్ఘమయినది. అతడు తన స్వేచ్ఛాభీష్టమును ఎంత సద్వినియోగం చేసుకొన్నప్పటికీ విశ్వ (పరిపాలనా) ప్రణాళికను అనుసరించి ముందుగానే నిర్ణీతమయిన సమయానికి మాత్రమే అతడు ఈ భవబంధాలనుండి విముక్తుడవుతాడు తప్ప: ఒకక్షణంముందుగాగాని, ఒకక్షణం తరువాతగాని కాదు. భవబంధకాలము సుదీర్ఘమయినది. మానవునికి ఉన్న స్వేచ్ఛాభీష్టము అతి అల్పము. దానిని అతడు దుర్వినియోగం చేసుకుంటే ఏమోగాని, సద్వినియోగం చేసుకుంటే మాత్రం తన భవబంధ కాలమును సుఖవంతము, ఆనందకరము చేసుకోగలుగుతాడు.

అందుచేత మానవుడు తనకు ఒక పరిమితమయిన స్వేచ్ఛాభీష్టము ఉన్నదని గుర్తించు కోవడము అతని ధర్మము. అట్టి స్వేచ్ఛాభీష్టమును, అతడు, మహత్తరములుగా భాసించిన శ్రుతులు నిర్దేశించిన విధముగా, తెలివిడిగా (తన వికాసము కొరకు) ఉపయోగించు కోవాలి. మార్గము సుదీర్ఘంగా ఉందన్న కారణంచేత, అతడు తన స్వేచ్ఛాభీష్టమును విడిచి పెట్టరాదు, దానిని విసుగుగా చూడరాదు. మానవుడు తన మార్గమును వీలయి నంత సుఖవంతముగా తీర్చిదిద్దుకోవడం కోసమే ఆ మార్గం అంత సుదీర్ఘంగా ఉండాలని నిర్ణయమయింది.

సాధకుడు తనకు ఉన్న స్వేచ్ఛాభీష్టము స్వల్పము మాత్రమే అని గుర్తించడమే కాక, మంచి అంటే ఏమిటో, చెడ్డ అంటే ఏమిటో తెలుసుకుని, మంచిని ఎంచుకుని, దుర్మార్గపు ఉచ్చులో పడకుండా నిలదొక్కుకొనే విధంగా తన స్వేచ్ఛాభీష్టాన్ని సంపూర్ణమయిన ఉపయోగంలోకి తెచ్చుకోవాలి. అసత్యం నుంచి సత్యాన్ని గాలించి తీసుకొని ఊగులాట లేకుండా దానికే అంటిపెట్టుకుని ఉండడం ప్రథమకర్తవ్యంగా చేపట్టి, స్వేచ్ఛాభీష్టాన్ని జీవితాంతం ఆచరణలో పెట్టుకోవాలి. ★

## ఏడవ ప్రకరణము

# నిర్ణయ, నిశ్చయ ప్రతిపత్తి

మనసుకు ఉన్న శక్తి అపరిమితము. నేల నాలుగు చెరగులలో ఏమూల నున్న పదార్థాన్నయినా తన అదుపాజ్ఞలలోనికి తెచ్చుకోగలదు-అంటే నమ్మడానికి అసాధ్యమని పిస్తుంది. మరి తానున్న శరీరంలో ఒక భాగాన్ని తను చెప్పినట్లు, నడుచుకోమని ఆజ్ఞాపించడానికి ఎంత సామర్థ్యమో, వేరే చెప్పాలా?

మనసుకు ఉన్న సమున్నతమయిన సామర్థ్యాన్ని అలాగ సూచించుకోవచ్చును. అది మనలాంటి అధిక సంఖ్యాకులైన సాధారణ మానవులకు వర్తించదు. అందులోనూ అధునాతన సమాజములోని వేగ - ఆందోళనా - పీడితులయిన వారికి.

అయినప్పటికీ మనం అందరం మన మానసిక శక్తులను కూడగట్టుకోవడానికి చాల వరకు కృషిచేసి, మన ఇంద్రియాలను, శారీరక అవయవాలను పరిపూర్ణంగా అదుపులోకి తెచ్చుకుంటే, భగవద్గీతలో చెప్పిన తత్త్వాన్ని ఆచరణలోకి తెచ్చుకున్నట్టే. అందుకోసం (ముక్తిమార్గ) అన్వేషి సాధనను ప్రభావితం చేయగల రెండు ప్రాథమిక సోపానాలను గురించి ఇపుడు చర్చించుకుందాము.

## I. నిశ్చయం

ఏ విషయంగురించి అయినా సరే, అభ్యాసానికి గాను మనస్సును సిద్ధపరుచుకోవ డానికి, మొట్టమొదట సరయిన నిశ్చయానికి రావాలి. దీనికి నాలుగు పద్ధతులున్నాయి.

1. అంతరాత్మ (లేక అంతర్గతమయిన వాక్కు) ఏమంటుందో వినాలి. చాలామంది ఇది చెయ్యరు. దానికి రెండు కారణాలు:

(i) అంతరాత్మ ఉంటుంది. అంతర్గత వాక్కు కూడా ఉంటుంది. చురుకుగానే ఉంటాయి. కాని, వాటి బోధ సాధారణంగా అస్పష్టంగా, వినీ వినబడకుండా ఉంటుంది.

( ) కుహనా ఆత్మ ఉంటుంది. దానికి ఒక స్పష్టమయిన వాక్కు ఉంటుంది. అదివిని చాలాసార్లు అది చెప్పేదే అంతరాత్మ చెప్తున్నదనుకొని మోసపోతూ ఉంటాము. కుహనా-ఆత్మ వాక్కు స్పష్టంగా ఉండడమే కాకుండా, ఖణీగా ఉంటుంది. ఆచరించడానికి వీలయ్యే సూత్రపు ముసుగు తొడుక్కుటుంది. మనలోని అనారోగ్యకరమయిన అభిరుచులకు సమీపంగా ఉంటుంది, ఆ వాక్కు. అది సూచించే దారి అతి తక్కువ ఆటంకాలతో ఉంటుంది.

శ్రద్ధాళువైన (ముక్తిమార్గ) అన్వేషి, 'ఈ కొంటె వాక్కుకి లొంగ కూడదు' అని, ఇతర ధ్యాసలను కట్టిపెట్టి, "నా నిజమయిన అంతరాత్మ దీనిని గురించి ఏమంటుంది?" అని: పట్టుదలగా ప్రశ్నించుకోవాలి.

అవసరమయితే నిజమయిన అంతరాత్మ చెప్పేది, స్పష్టంగా వచ్చేటట్లు చేసుకోవాలి. ఆ చెప్పేదానిని శ్రద్ధగా విని, మనసులో సగౌరవంగా ప్రతిష్ఠించుకోవాలి.

ఇందులో వచ్చే ఇబ్బంది ఏమిటంటే: మనం మన అంతర్గత వాక్కును వినలేమని కాదు; కాని, మనం అలా వినడానికి శ్రద్ధ వహించము. కొంచెం నిదానించి- అంతరాత్మ ఏమి చెప్తున్నది- అని పరిశీలించుకోము. అయితే, ఈ పద్ధతంతా సమగ్రంగానూ, నిజాయితీ గానూ అవలంబించగలిగితే, (మనకు నిర్దేశితమయిన) విశిష్టమార్గం వెంట నడిపించడానికి (మనకు) ఏ ఇతరేతర మార్గదర్శీ అక్కరలేదు.

కనుక అన్వేషికి రెండు సున్నితమయిన ప్రశ్నలు ఎదురవుతాయి. (1) నేను నా అంతరాత్మని విన్నానా? (2) అది నిజమయిన అంతరాత్మేనా? ఛద్మవేషి కాదుకదా!- ఈ ప్రశ్నలని నిపుణతతో ఎదుర్కోవాలి.

ఈ ప్రశ్నలను ఎదుర్కోవడం అలవాటు చేసుకోవడమనేది తప్పనిసరి. దీనిని తొలిదశలలో గట్టిగా ఆచరించుకుంటే క్రమంగా అది అలవాటు అవుతుంది. అలవాటయినకొద్దీ, మనం సరయిన నిశ్చయాలకు వచ్చినట్టే కాక, మరింత ఉన్నత సాధనలకుగాను మనోబలం చేకూర్చుకుంటున్నామని అనిపిస్తుంది.

2. అంతరాత్మని అనుసరించి (మన గమ్యాలను చేరడానికి ఎంత నిజాయితీగా ప్రయత్నించి) నప్పటికీ, ఒక్కొక్కప్పుడు ఆ అంతరాత్మ ఏదో అడ్డదారులు తొక్కు తున్నట్టు, స్పష్టమయిన నిర్దేశకత్వము చూపించడంలేదన్నట్టు అనిపిస్తుంది. పరస్పర వ్యతిరేక సమస్యలు, భిన్నమయిన ప్రయోజనాలు (సిద్ధాంతాలు) తటస్థపడినప్పుడు ఈ పరిస్థితి సంభవిస్తుంది. మాటవరసకి పులి-మేక సంగతే ఉంది. మేకని తినేస్తే తప్ప, పులి బతకదు. పులి తనని తినేస్తే మేక బతకదు. రెండింటికీ బ్రతికే హక్కు ఉంది ఇక్కడ ఎవరిది తప్పు? ఎవరిది ఒప్పు?

ఇలాటి ద్వంద్వాలు ఎన్నో ఉంటాయి. పెట్టుబడిదారీ విధానం - సామ్యవాదం. జాతీయ ప్రయోజనం- అంతర్జాతీయ దృక్పథం. వ్యక్తి నిష్ఠ ధర్మము- పోషకుని పట్ల విధి. మార్గము- గమ్యము. ఇలాంటి ద్వంద్వాల మధ్య కర్తవ్య నిర్ణయం ఎన్నిక చాలా కష్టం. ఎందుకంటే, ఈ ఐహిక ప్రపంచంలో న్యాయము అనేది సాపేక్షకమేగాని, సంపూర్ణము కాదు. అలాంటి పరిస్థితులలో మన ధ్యేయమేమిటో, మనసమాజ స్వభావమేమిటో చూసుకొని, దానికి అనుగుణమయిన నిర్ణయం తీసుకోవడమే ఉత్తమం. అటువంటి ధ్యేయాలో, సమాజ స్వభావాలో మనకు తగలనప్పుడు ఆ ద్వంద్వాలపట్ల సృజించబడే పరిస్థితుల ప్రభావము మనమీద పడకుండా, మర్యాదగా, గొప్పగా సాగగలము.

> చక్కగా నిర్వహించకపోయినా, స్వధర్మమే
> చక్కగా నిర్వహించిన పరధర్మముకంటె ఎన్నదగినది.
> స్వధర్మములో మృత్యువు సంభవించినా మేలేగాని,
> పరధర్మము భయానకము. (విసర్జనీయము)

-శ్రీమద్భగవద్గీత, కర్మయోగము:35

3. అంతరాత్మని విని, ఆ విన్నదానిలో కొంత అస్పష్టత ఉందని అనిపించినా, సరయిన నిర్ణయానికి రాలేకపోవచ్చు. అప్పుడు బుద్ధికుశలత వలన సాధించే మరొక పద్ధతి ఉంది. ఏ విషయంలోనయినా మన ఆలోచన సత్య-అసత్యాలకు మధ్య సంఘర్షణకు గురి అయితే; మన ప్రయోజనానికి విఘాతం అనిపించినా సరే, సత్యమార్గాన్నే ఎన్నుకోవాలి. అలాచేస్తే, అత్యంత బలిష్ఠమయిన నైతిక శక్తి మనపక్షాన నిలిచి, మనం ముందుకి సాగ గలుగుతాము. మనతో ఏకీభవించని వారు ఉంటే ఉండవచ్చుగాని, వారు మనలను తప్పు పట్టలేరు. మనం సత్యమార్గానికి, సత్యవాక్కుకి కట్టుబడి ఉండడంవల్ల అవతలివైపు నుంచి- సంఘసేవ, దేశభక్తి, మానవత్వం- లాంటి "గొప్ప" ప్రయోజనాలకు హాని కలుగుతుందని తోచినా, ఊగులాడకూడదు. సత్యం అనేది సృష్టిలో ఎవరికయినా ఎట్టి దోషారోపణకుగాని లొంగని మనస్సాక్షి.

దానికి తోడు సత్యం ఒకానొక మానసిక ఉల్లాసాన్ని ప్రసాదిస్తూ, స్వయంపునీతమయిన అనుభూతిని కలిగించి, పులకింపజేస్తుంది. భగవద్గీత ఆచరణకుగాను చేసే ప్రయోగాలలో బాసటగా నిలుస్తుంది. ప్రయత్నించిన వారికి ఆ ఉత్తేజం, ఆ అనుభూతి, ఆ పులకరింత అనుభవంలోనికి వచ్చి తీరుతాయి.

4. మనం స్వీకరించే నిశ్చయము ఆత్మతృప్తికరమయిన పరిష్కారాన్ని సాధించడంలో (ఇంతకు ముందు చెప్పిన) మూడు పద్ధతులలో ఏదీ పనికిరాకపోతే, చివరిప్రయత్నంగా మన సమాజపు పరిధిలో ఉన్న పెద్దవారిలో ఒకరి ఆప్తవాక్యమును స్వీకరించి, దానిని నిర్ద్వంద్వంగా అనుసరించాలి. ఎందుకంటే, నిష్కల్మషమయిన మంచితనముతో భాసిల్లే హృదయం ఎప్పుడూ కూడా "వట్టి జ్ఞానం" కంటె, పైచేయిగానే ఉంటుంది.

## II. నిర్ణయం

విషయమంతా సాకల్యంగా పరిశీలించుకున్నాక, చివరికి; దానిలో ఏ వైపునకు మొగ్గు చూపించాలో నిశ్చయమవుతుంది. దానిని సాధన చేయడానికి గాను, మనసును సిద్ధం చేసే విషయంలో, తీసుకునే నిర్ణయం రెండవ సోపానము. సాధకుడికి సరయిన నిశ్చయానికి రావడం ఎంత ముఖ్యమో, దాని అమలుకు తీసుకునే నిర్ణయం కూడా అంత ముఖ్యం, సుసంగతం. భగవద్గీత ప్రయోగాల నిర్వహణకు అసలు కార్యక్షేత్రం మనస్సే. దృఢమయిన నిర్ణయం ప్రాధమిక చాలనశక్తిగా ఆ యంత్రాంగం పనిచేసి, మానవుడి ఇంద్రియాలను, శరీరాంగాలను నియంత్రణలో ఉంచుతుంది. ఆధ్యాత్మిక ఆచరణలో (పూర్తిగా గాని, పాక్షికంగా గాని:) వైఫల్యం సంభవిస్తే; అవాంతరాలను అధిగమించి మన ప్రయత్నాలను కొనసాగించుకోడానికి అవసరమైన నిర్ణయ దార్ఢ్యం కొరవడడమే కారణమని గ్రహించుకోవాలి.

చాలామంది తరుచుగా ఒక పొరపాటు చేస్తారు. ఒకపని చేద్దామనుకున్న కోరికే, ఆ పని చెయ్యాలన్న నిర్ణయం- అని అనుకోవడమే ఆ తప్పు. కోరుకున్నంత మాత్రాన అది

(సాధించుకోవడానికి గాను) నిర్ణయం అవదు. నాటకశాలలో ఒక ఆసనం ఖాళీగా ఉందని గమనిస్తే, సరిపోదు. దానిని (తమకు) కేటాయించుకోవడమే అసలు పని.

ఏ గట్టి నిర్ణయం తీసుకోవాలన్నా, దానికి ముందర అవసరం, సామర్థ్యం ఉండాలి. వాటిలో ఏ ఒక్కటి లేకపోయినా, నిర్ణయం క్షీణించి కొంతకాలానికి (ఎడారి ఇసుక తిప్పలలో కనిపించే సన్నటి సెలయేటి వలె) అదృశ్యమైపోతుంది. ఏ ప్రయోజనమూ సిద్ధించకపోగా, తీవ్రమయిన ఆశాభంగం నిస్పృహ కలుగుతాయి. ఒక సాధారణ సైనికుడు ముఖ్య సైనికాధికారి కావాలని నిర్ణయించుకోవడం ఒక కోటీశ్వరుడు వినోదంకోసం వీధులలో పడి బిచ్చమెత్తుకుంటే బాగుంటుందని నిర్ణయిచుకోవడం- ఇలాటివే.

అందుచేత ఏదైనా నిర్ణయం తీసుకోవడానికి ముందుగా రెండు విషయాలను ధ్రువ పరచుకోవాలి: అది మన కార్యాచరణ ప్రణాళికకు తోడ్పడగలదనీ, దాని ఆచరణ మన సామర్థ్యపు పరిధిలో ఉందనీ.

కొందరుంటారు. వారికి ఒక అంతర్గత స్వభావం ఉంటుంది. వారు చాలా సులువుగా నిర్ణయాలకు రాగలుగుతారు. ఆలోచన జనించిందంటే చాలు. అది ఒక దృఢ సంకల్పంగా మారిపోతుంది. మరికొందరు (చాలామందే) ఉంటారు. వాళ్లు ఒక నిర్ణయానికి రావాలంటే, అది ఒక పెద్ద యజ్ఞం అయిపోతుంది. అలాగని అట్టి చంచల మనస్కులకు అన్ని పనులూ యజ్ఞాలంత దుష్కరమయినవి కావు. కొన్ని విషయాలుంటాయి. వాటిని సాధించాలంటే కొన్ని రకాల అభేద్య నిర్ణయాలకు కట్టుబడి ఉండవలసి వస్తుంది. మన అవసరాల ప్రాముఖ్యాన్ని బట్టి, మన సహజ సామర్థ్యాన్ని బట్టి అలాంటి నిర్ణయానికొచ్చే ముందు కొన్ని సూత్రాలను పాటించుకోవాలి.

1. ఒకానొక నిరుపహతి స్థలంలో గాని, ఇతరులకు ప్రవేశంలేని ఒక గదిలోగాని ఒంటరిగా, ప్రశాంతంగా కొద్ది నిముషాలు కూర్చోవాలి.

2. చేయదలచిన పని అనుపానులు, అవలంబించవలసిన పద్ధతివలన ఒనగూడే ప్రయోజనాలు- అన్నీ ఆలోచించాలి.

3. తీసుకొనే నిర్ణయానికి అవసరమయిన నైర్మల్యం సాధించుకోవడానికి వీలుగా, దృష్టిని దానిమీదనే కేంద్రీకృతం చేసుకునే నిమిత్తం - అవసరమయితే కళ్లు మూసుకోవాలి.

4. అప్పుడు అమ్మమీదనో,భార్యమీదనో, కుమారుడి మీదనో- అలాంటి దగ్గరవారు ఎవరిమీదనో ఒట్టుపెట్టుకున్న మనఃస్థితితో ఆలోచించాలి... 'ఏది ఏమైనా సరే, నేను ఈ పని చేసి తీరుతాను. ఈ నా ధ్యేయం నుండి నా దృష్టిని మళ్లించడానికి సంభవించే ఎలాంటి ప్రలోభానికీ లొంగను. నా ధ్యేయాన్ని చేరుకునే వరకు విశ్రాంతి తీసుకోను. నా సమస్త శక్తినీ ధారపోసి, ఎంతటి త్యాగమయినా చేస్తాను ఈ నిర్ణయాన్ని అమలు పరచడంలో నేను ఊగులాడినా, బలహీనపడినా... నా పట్ల నేను చెప్పరాని అపచారం (పాపం) చేసినట్టు ఇదే నా ఒట్టు."

5. అవసరమయితే ఈ ఒట్టు ఒక ప్రగాఢ స్నేహితుని సమక్షంలో తీసుకోవాలి. ఒట్టు తీసి గట్టున పెట్టే స్థితి ఎప్పుడు సంభవిస్తే అప్పుడు-జ్ఞాపకం చేయడానికి, మందలించడానికి, సరిదిద్దడానికి చనువు తీసుకునే హక్కు ఆ స్నేహితుడికి ఇవ్వాలి. భగవద్గీతలోని సూత్రాలను ఆచరణలోనికి తెచ్చుకోవాలనే నిర్ణయాన్ని దృఢపరచుకుని, తద్వారా ఈ జన్మలోనే ముక్తిని సాధించడానికి వేసుకునే ఒట్టుగా విలసిల్లి, ఇది ఆ మహదాశయానికి ఒక మహాప్రారంభం కాగలదని చెప్పుకోవచ్చును.

ఈ నిర్ణయానికి మన ఇంద్రియాలే శత్రువులు. ఈ ఇంద్రియాలనేవి శరీరంలోని అవయవాల ఉన్ముఖతలే. ఈ అవయవాలు (ఆ ఇంద్రియాలమూలాలు) ప్రపంచ సుఖాలలో తేలి ఆడనిమ్మని, నిరంతరాయంగా మనస్సుకు నచ్చచెప్పుకుంటూ పోతాయి. అవి మనలో చాలామంది మీద గట్టి అధికారాన్ని చెలాయిస్తాయి. అవి (మనస్సులకి) అలా నచ్చజెబుతూనే వుంటాయి. మనం సులువుగా అందులో పడిపోతూనే వుంటాము.

అవన్నీ, చూడడానికి చాలా అల్పమైనవి, అప్రధానమైనవి అయిన ప్రలోభాలలాగా ప్రారంభమవుతాయి. ఒక్కొక్కప్పుడు వ్యక్తిగతమయిన అవసరాలుగా, సామాజిక జీవన పద్ధతులుగా ముసుగులు వేసుకుని వస్తాయి. (మాటవరసకి ఒక పొగదమ్ము, లేదా ఒక మద్యపు గుక్క- ఆరోగ్య సిద్ధి కొరకు లేదా మర్యాద లబ్ధికొరకు!) అవి నిదానంగానే అయినా నిశ్చయంగా మనలని మెట్టు మెట్టూ దిగలాగి, వాటి వలలోకి చేర్చేస్తాయి. మనము పూర్తిగా, నిస్సహాయంగా ఆ వినాశకర వ్యసనాలకు బానిసలమయ్యేవరకు వదలవు.

ఇంద్రియాలు మనిషిని ఈ విధంగా నాశనం చేసుకుంటూ పోయి, అతడు ఆధ్యాత్మిక ప్రగతికోసం చేసే ప్రయత్నాలని వమ్ము చేస్తాయి. ఇంద్రియాలు సృష్టించే ఈ కల్లోలాన్ని స్థిరచిత్తంతో పూర్తిగా అణగదొక్కినట్లయితే, భగవద్గీత (సూత్రాల) ఆచరణకు చేసే సంగ్రామంలో మానవుడు గెలిచినట్లే.

ఇంద్రియాలతో చేసే పోరాటం ఎలా జరగాలో నిర్ణయించుకొనేటప్పుడు (ఆ పద్ధతిని గురించి) ఎవరెవరు ఎన్నెన్ని సూచనలిచ్చినా, ఎవరెవరు (బయటినుండి) ఎంత సహాయం అందించినా, (గెలుపుకి) అసలు కీలకం ఏమిటనేది మనకి మనమే స్వానుభవాన్ని అనుసరించి బోధపరుచుకోవాలి.

> ఎవరికి వారు స్వప్రయత్నంగానే (ఆత్మచేత ఆత్మను)
> ఉద్ధరించుకోవాలి... ఆత్మలో మైత్రి ఉంది,
> శత్రుత్వమూ ఉంది. (శత్రుత్వ ప్రభావం చేత)
> స్వయం పతనానికి లోనుగాకూడదు.

-శ్రీమద్భగవద్గీత: ఆత్మ సంయమయోగము-5

కొన్ని తేలికైన అలవాట్లు చేసుకోవడంలో కూడా నిర్ణయ శక్తిని అభ్యాసంగా పాటించాలి.

1. దినం విడిచి దినం చన్నీటి స్నానం చేయడం

2. రాత్రి విడిచి రాత్రి చాపమీద నిద్రించడం

(ఇలాటి అభ్యాసాలు పాటించేటప్పుడు తొలిదశల్లో కలిగే అసౌకర్యాల వల్ల భీతి చెందకూడదు, అధైర్య పడకూడదు. అప్పుడు కలిగే విజయం వల్ల:

() శరీరం పైన మనసుకి ఉండే ఆధిపత్యం సూచనప్రాయంగా నైనా నిర్ధారణ అవుతుంది.

( ) శరీరం (తనకి స్వతస్సిద్ధంగా ఉండే) పొగరు తగ్గించుకొనే శిక్షణ పొంది, భగవద్గీత (చెప్పిన) సూత్రాల అమలుకి సహాయపడుతుంది.

(˙) దినం విడిచి దినం, రాత్రి విడిచి రాత్రి- సౌఖ్యాన్నీ, ఇబ్బందినీ, చలినీ వేడినీ సరి సమానంగా స్వీకరించడానికి మనసూ దేహమూ సిద్ధమై, భగవద్గీత (చెప్పిన) సూత్రాల అమలుకి ప్రాథమిక అభ్యాసం అవుతుంది.

అందుచేత, శ్రద్ధాప్రధానుడైన సాధకుడుగా మారదలచుకునే వారు, ఏ విషయం గురించి అయినా సరైన నిర్ణయం తీసుకోడం అలవాటు చేసుకొని, ఆ నిర్ణయాన్ని అమలు చేసే స్థిర నిశ్చయానికి రావలసి ఉంటుంది.

అయితే, ఎలాంటి స్థిరనిశ్చయమైనా సాధారణంగా· కాలక్రమాన పలచబడుతుంది. అందుచేత, ఏ విషయంలోనైనా (నిర్వహణా) ప్రయత్న ప్రారంభంలో స్థిరమైన నిర్ణయం తీసుకున్నంత మాత్రం చేత పనైపోదు. నిర్ణయం (నిర్వహణ) పలచబడుతోందన్న అనుమానం కలిగినప్పుడల్లా (జాగరూకతతో) నిర్ణయాన్ని పునరుజ్జీవింప జేసుకోవాలి.

★

## ఎనిమిదవ ప్రకరణము

# శారీరక క్రమశిక్షణ

(అన్ని రకాల ఆధ్యాత్మిక తెలివిడులకు, సాధనలకు, శారీరక క్రమశిక్షణ చాలా అవసరమే గాని) శరీరాన్ని క్రమశిక్షణలో పెట్టడంతో పనయిపోదు. అది భగవద్గీత ఆచరణలో విజయం సాధించడానికి చాలా అత్యవసరమయిన మానసిక క్రమశిక్షణకు ఒక సాధనము మాత్రమే. శారీరక క్రమశిక్షణ గురించి కొద్దిగా చర్చించుకుంటే, ఇంతకు ముందు చెప్పుకున్న "నిర్ణయ" శక్తిని అభివృద్ధి చేసుకోవడానికి, అలవాటు చేసుకోవడానికి, పునర్విమర్శ చేసుకోవడానికి; అవకాశాలు ఎన్నో వస్తాయని తెలుసుకోవచ్చును.

శారీరక క్రమశిక్షణ అంటే, అదేదో కొత్తది కాదు. మనమంతా వృత్తి మొదలయిన వాటికి సంబంధించినవి, అవసరమయినవి, తప్పక పాటించవలసినవి-అయిన కాల పట్టికలే. నిద్రనుంచి లేవడానికి, (పనులు చేసుకోవడానికి), ఆహారసేవనకు, నిద్రకు మనలో చాలామందికి ఈ కాలపట్టికలు నిర్ణీతాలయి ఉంటాయి. ఇవన్నీ బాహ్య శక్తులవలన సంక్రమించినవి. వాటివలన స్వశక్తిలోని పటిష్ఠత చల్లబడిపోతుంది. మనస్తత్వము యాంత్రికమయిపోతుంది. ఒక సాధకుని పట్ల ఇటువంటి శారీరక క్రమశిక్షణ (అనగా కాలపట్టికలననుసరించి ఏర్పడే క్రమశిక్షణ) ఆధ్యాత్మిక ధ్యేయాలకు అననుకూలముగాను, ఆమాటకొస్తే, వ్యతిరేకంగాను నిలుస్తుంది. (కనుక అట్టి క్రమశిక్షణ వలన ఎన్నో లాభాలు కలగడం, వాటికోసం ఆ క్రమశిక్షణ తప్పనిసరి అనిపించడం ఇదంతా సాధకునికి చెప్పుకోతగ్గంతగా సహాయపడదు.) అందుచేత ఇటు ఆధ్యాత్మిక ప్రయత్నాలలో ముందుకు సాగించేవి గానూ, అటు వృత్తి పరమయిన కాల పట్టికలకు హాని కలగకుండానూ కొన్ని పద్ధతులను సమకూర్చుకొని, వాటిని స్వేచ్ఛాభీష్టము సహాయము చేత శ్రద్ధగా, ఉత్సాహంగా పాటించుకుంటూ పోవాలి. ఆ పద్ధతులేమిటో స్థూలంగా, క్లుప్తంగా చెప్పుకుందాము.

### ఆహారం

శారీరక క్రమశిక్షణలో పద్ధతి ఏదయినా గాని, ముఖ్య పాత్ర మాత్రం ఆహారానిదే. మనం తీసుకునే ఆహారం లక్షణాలు, పరిమాణం: ఆధ్యాత్మిక సాధనకోసం శరీరం సంపాదించుకునే సామర్థ్యం మీద, అట్టి ఆధ్యాత్మిక సాధన విజయం మీద సహాయానికి- గట్టి ప్రభావం చూపిస్తాయి. సాత్త్విక ఆహారం మన ప్రగతికి సహాయంగా నిలుస్తుంది. రాజస, తామస ఆహారాలు అవరోధంగా నిలిచి, తిరోగమనానికి, నాశనానికి కారణ మవుతాయి.

**ఆయువు, శక్తి, సత్త్వము, ఆరోగ్యము, సుఖము,**
**ఆనందము ఇచ్చే రస, తైలభరితములైన ఆహారములు**
**హితములుగా, స్థిరములుగా ఉంటాయి.**
**కనుక, సాత్త్వికులకు అవి ఇష్ట పదార్థాలు.**

- శ్రీమద్భగవద్గీత శ్రద్ధాత్రయ విభాగయోగము : 8

**షడ్రుచులలో క్లిష్టములయిన కషాయ, ఆమ్ల, లవణ**
**పూరితములయినవి, వెచ్చగా, ఘాటుగా, పొడిపొడిగా**
**ఉండేవి రాజసులకు ఇష్టముగా ఉంటాయి.**
**అవి దుఃఖశోకప్రదాయములు.**

-శ్రీమద్భగవద్గీత శ్రద్ధాత్రయ విభాగయోగము: 9

**నిలవ ఉన్నవి, రుచి తగ్గినవి, ఉచ్ఛిష్టములయినవి,**
**అపరిశుభ్రమయినవి అయిన ఆహారాలు**
**తమోగుణ ప్రధానులయినవారు భుజించగలుగుతారు.**

-శ్రీమద్భగవద్గీత శ్రద్ధాత్రయ విభాగయోగము:10

**కనుక:**

1. ( ) వరి, గోధుమ- వంటి ధాన్యాలతోనూ, పప్పుదినుసులతోనూ, పాలు (దాని తయారీల)తోనూ తయారుచేసినవి తీసుకోవాలి. సులభ జీర్ణములయ్యే ఆకుకూరలు, కేబేజి, కేరెట్, వంకాయలు మొదలయినవి భుజించాలి.
   ( ) మసాలాలు, కారాలు, మిరియాలు, ఉల్లి మొదలయిన వాటిని వర్జించాలి.
   ( ) మద్యము, ధూమపానము, నశ్యము మొదలయినవి వద్దు.
2. మితిమీరి తినకూడదు. అలాగని అర్ధాకలితో లేచిపోవడమూ మంచిదికాదు.

**అతిగా భుజించేవానికిగాని, అసలు భుజించనివానికి గాని**
**యోగము సిద్ధించదు.**

-శ్రీమద్భగవద్గీత ఆత్మ సంయమయోగము 16

ఏది ఏమయినా, "కడుపునిండుగా" తినడంలో చిన్న సూత్రం ఉంది. ఒక కబళం ఎక్కువ తినెయ్యడంకంటె, కడుపులో ఒకముద్దకి ఖాళీ ఉండగానే లేచిపోవడం మంచిది. ఇది ఏమంత కష్టమయిన పనికాదు. నాలుగురోజులు (అదొక) పద్ధతిగా అలా చేస్తే అదే అలవాటవుతుంది. దీని వెనక ఉన్న సిద్ధాంతం ఏమిటంటే: బతకడానికి తినాలి గాని, తినడానికి బతకడం కాదు.

3. వారంలో ఏదో ఒకరోజు నీరుమాత్రమే పుచ్చుకుంటూ పూర్తి ఉపవాసం ఉండాలి. ఆరోజేదో నిర్ణయించుకుని, పద్ధతిగా అమలుపరచాలి. అలాచేస్తే, అది మనలో క్రమశిక్షణా అభిరుచిని పెంపొందిస్తుంది. ఉన్నట్టుండి వారానికి ఒకరోజు పూర్తి ఉపవాసం తలపెట్టి, అమలు పరచడం కష్టమనిపిస్తే, వారానికి ఒక "పూట" ఉపవాసంతో మొదలుపెట్టి, క్రమంగా దానిని ఒక పూర్తిరోజు ఉపవాసానికి దారితీయించాలి.

ఉపవాసం వేరు, పస్తువేరు. ఉపవాసమనేది మనకి మనం ఇష్ట, బుద్ధి పూర్వకంగా

ఆహారాన్ని మానుకోవడం. పస్తు అంటే, ఆహారం లేక మాడడం. రెండిటికీ భౌతికమయిన, శారీరకమయిన ఫలితాలు ఇంచుమించు ఒకటే. అయితే మనంతట మనంగా ఉపవాసం ఉండాలని నిర్ణయించుకోవడం కనుక, దానివలన: మానవులకే కాక సకల జీవులకు మొట్టమొదటి ఆర్తి అయిన 'ఆకలి' అనే తీవ్రతమమయిన వ్యథను జయించగలగడం అనే విలువ ఒనగూడుతుంది. అందువల్లనే, అన్ని ప్రధాన మతాలకు సంబంధించిన ముఖ్యసూత్రాలలోనూ కూడా ఉపవాసం అనేది మానవుని అంతర్గత ప్రగతికి (విలువైన) సిద్ధ సోపానంగా ఉదహరించారు.

మామూలుగా అందరూ అర్థం చేసుకునేది (అవలంబించేది) ఏమిటంటే, ఉపవాసం అంటే, పొట్టలోకి ఆహారం వెళ్లకుండా ఆపడమేననీ, అది శరీరానికీ, మనసుకీ మంచి చేస్తుందనీ.

కాని, సాధకుడి సంగతి వేరు. అతడు ఉన్నతస్థాయికి చేరుకోవాలని ప్రయత్నించే వ్యక్తి అతని దృష్టిలో ఉపవాసానికి ఉన్న అర్థం సంపూర్ణం, లేకపోతే కనీసం సమగ్రం. అది (ఆహారము చేత జీవాన్నీ శక్తినీ సమకూర్చుకొనే) శరీరపు ధర్మాలలో వాక్కు, వినికిడి, దృష్టి మొదలయిన వాటిని విస్తృతంగా ఆలోకిస్తుంది. అందుకని:

() (అట్టి వాక్కు, వినికిడి, దృష్టి-లకి సంబంధించిన అవయవాలు- అనగా) నోరు, చెవులు, కళ్లు; వీటిని ప్రతిరోజూ కొంతసేపు గాని, వారంలో ఏదో ఒకరోజునాడు మూడు, నాలుగు గంటలసేపుగాని మూసి ఉంచి, కృత్రిమమయిన (దనిపించే ఇంద్రియ నిగ్రహత్వ ఫలితమయిన) మూగతనం, చెవుడు, అంధత్వం సాధించుకోవాలి.

( ) 'బాహ్యకుంభకము''ను ప్రతిరోజూ (కొంతసేపు) సాధనచేయాలి. (చూడు అనుబంధం - పుట 155 )

( )సాధకుడు ఈ ఆలోచనలకు మించిన కష్టసాధ్యతగల మరే ఆలోచనను మనసు లోనికి రానివ్వకూడదు- అవి ఎంత ముఖ్యమయినవైనా సరే.

**4.** ప్రస్తుత కాలంలో కాఫీ, టీ (లాంటి పానీయాలను, ఉత్తేజకరాలుగా కాక) పాలతో సమానంగానూ నిరపాయకరాలైన ఉత్సాహ పానీయాలుగాను పరిగణిస్తున్నారు. కాలాను గుణంగా జీవించాలి కనుక, వాటిని పూర్తిగా నిషేధించుకోనక్కరలేదు గాని; ఈ కాఫీలు, టీలు: రోజుకి రెండు సార్లకన్నా ఎక్కువ పుచ్చుకోకుండా ఉండే పద్ధతి పెట్టుకోవాలి. పద్ధతంటే పద్ధతే. వెసులుబాటు పనికిరాదు. అనుకోని పరిస్థితుల్లో ఎవరేనా ఒక స్నేహితుడితో ఓ రోజున (మామూలుగా పుచ్చుకొనే దానికంటె అధికంగా) ఒకటి ఎక్కువ పుచ్చుకోవలసి వస్తే; మర్నాడు, మామూలుగా పుచ్చుకొనే దాంట్లో ఒకటి తగ్గించుకోడమే పని. ఒక కప్పు టీ ఎక్కువ తాగేస్తే ఏం కొంపమునుగుతుంది- అనేది కాదు, లెక్క. మనకి మనంగా పెట్టుకున్న ఒక పద్ధతిని మనం గౌరవించుకుంటున్నాం, అంతే. మన నిర్ణయం అమల్లోకొచ్చినందువల్ల మన శారీరక క్రమశిక్షణ అధికమైందని తెలుసుకుంటాం. అందుచేత ఆ పద్ధతిని ఖచ్చితంగా అమలు పరుచుకోవలిసిందే.

అయితేను, ఇలాంటి విషయాలన్నీ కూడా: చెప్పడం సులువూ, చెయ్యడం కష్టమూనూ. ఇలా నిబంధించుకొనే ప్రతి విషయంలోనూ మర్యాదగానో గౌరవంగానో 'అలాగే, అలాగే!' అని తలకాయ ఆడించేయగలం. కాని, ఆచరణలోకి వచ్చేటప్పుడొస్తుంది, పేచీ: చెడ్డ అలవాటు మానేయడం, మంచి అలవాటుని తెచ్చుకోడం- (కష్టం!)

మాటవరసకి పొగతాగడం గురించి. అది మనకి అలవాటయిందనుకుందాం. సుదీర్ఘ కాలం సాగిందనుకుందాం. అప్పుడు ఆ అలవాటుని వదలగొట్టుకోవడానికి ఎంత దీర్ఘ కాలం పట్టుంది; ఎంత కష్టం అవుతుంది- అనేది మనంతట మనకే తెలిసిపోతుంది. మానెయ్యాలని ప్రయత్నిస్తూ ఉన్నప్పుడు మానసికంగా, శారీరకంగా ఏదో అసౌఖ్యం, ఆందోళన, (బుర్ర) పిచ్చెక్కి పోయినంతగా బాధపెడతాయి. నిర్ధారణ అయిపోయిన గౌరవప్రదమయిన సంప్రదాయాన్ని ఎదిరించినప్పటి బాధ కలుగుతుంది. ఎవరూ చూడకుండా రహస్యంగా ఒకదమ్ము లాగాలని నీచమయిన ప్రలోభం కలుగుతుంది. ఏదో తెలియని, ఎందుకో తెలియని- అసహనం, వ్యాకులత కలుగుతాయి. జీవితం అంటేనే విరక్తి కలుగుతుంది. ఆ అలవాటుని మానుకోవాలన్న స్థిర నిర్ణయంతో ఉంటే తప్ప, ఇదంతా నాకు చేతకాని పని- అని (నిరుత్సాహపడి, పొగ తాగడం మానెయ్యాలన్న) ప్రయత్నాన్ని చాలించుకుని, మళ్లీ చివరకి దానికి బానిస అయిపోవడమే.

ఇందులో మనం తెలుసుకో వలసినదేమిటంటే, మనలో ఉన్న ఒక అవాంఛనీయ మయిన అలవాటును వదలగొట్టుకోవడం ఎంత కష్టమో అనేదే. పైకి చాలా మర్యాదగా అమాయకంగా, నిరపాయకరంగా కనిపిస్తూ మనలో ప్రవేశించే ఈ అలవాటు, నెమ్మదిగా బలపడి, ఆఖరికి (తనకి ప్రవేశాన్నిచ్చిన) మనల్నే బానిసలుగా చేసేసుకుంటుంది. అందుచేత మనమే కఠినమైన నిర్ణయం తీసుకొని జాగ్రత్త పడుతూ ఏదో నెపంతో ప్రవేశించే ఈ అలవాటు పట్ల మొదట్లోనే రాజీ లేని ధోరణిని చూపించుకోవాలి; ఎందుకంటే ఓసారి అందులో పడ్డామంటే మరి లేవడం అంటూ ఉండదు.

## లైంగిక ప్రవృత్తి

శరీరపు కార్యకలాపాలని క్రమశిక్షణలో (నియంత్రణలో) పెట్టుకోడంలో ఆహారం తరవాత వెంటనే చూసుకోవలసింది లైంగిక ప్రవృత్తి సంగతే. అందరికీ అదంటే అలవిమాలిన ఇష్టమూ ఉండదు; అందరికీ అదంటే నిషేధభావమూ ఉండదు. అది కూడా ఒకానొక శారీరక అవసరమే; శరీరస్థితి ఆరోగ్యంగా వృద్ధి చెందడానికి గాను తృప్తి పరచవలసిందేను. దాన్నిగురించి ఒకానొక నిర్వికారతను సాధించుకో గలంతగా మానసికమైన ఎదుగుదలని సాధించుకోగలిగే వారిని దాంట్లో ఉన్న నీతి నియమాల ప్రసక్తి అట్టే బాధించదు కూడాను. (అంతేకాక) విపరీతమైన బలంతో దాన్ని అణిచేస్తే చాలా అసందర్భపు ఆలోచనలకి (చర్యలకి) కారణమై, చివరికి ఉన్మత్తతకీ దారి తీస్తుంది.

లైంగిక ప్రవృత్తి (మనల్ని) బలాత్కారంగా అపమార్గం పట్టించగలది. కులం, మతం, రంగు లాంటివేవీ దానికి అడ్డురావు. అది గుడ్డిది. వివేచన, జాగ్రత్త, పరిణామాల- లాంటి

ముఖ్యమైన విషయాలని పట్టించుకోనంత చెవిటిది. అది ఎవరినైనా గట్టిగా ఆవహించిందంటే వారికీ వారికి సంబంధించిన వారికీ; దిగజార్చలేనంత పతనం గాని, చెయ్యలేనంత పాపం గాని, తెచ్చిపెట్టలేనంత (నరక) యాతన గాని: ఉండదు. ప్రపంచంలో జరుగుతున్న "నేరం"లో సగం (భాగం) ప్రత్యక్షంగానో పరోక్షంగానో లైంగిక ప్రవృత్తి కేంద్ర బిందువుగా సంభవించే వలయమే.

అలా అని లైంగిక ప్రవృత్తిలో అసలు మంచి అనేదే లేదని కాదు. ఉంది.

ధ్యానంతో భక్తితో శ్రద్ధగా సాధనచేస్తూ విచక్షణాత్మకంగా ఉపయోగించుకుంటే, వీర్యశక్తిని ఆధ్యాత్మిక శక్తిగా (ఓజశ్శక్తిగా) పరిణామం చెందించవచ్చు.

సాధారణ మానవులకు అందుబాటులో లేకపోతే పోవచ్చు గాని; లైంగిక ప్రవృత్తిని తగుమాత్రంగా పాటించుకుంటే, ముఖంలో కళ, పనిచేయాలనే ఉత్సాహం ఒనగూడుతాయి. అయితే మనం తరుచుగా ఆరోగ్య, ఆదాయ పరిమితులను విస్మరించి, చట్టపరంగానే కాక, చట్ట విరుద్ధంగా తగిలేవారితో కూడా లైంగిక ప్రవృత్తికి మితిమీరినంతగా లోనవుతూ, దానివల్ల ఉన్నతమయిన, చింతనాత్మకమయిన పనులను నిర్వహించలేనంతగా; దైహికంగా, ఆర్థికంగా- అకాలంగా- చితికి పోతాము. లైంగిక ప్రవృత్తి ఆరాటం, శక్తిపాతం; ఒకదానికొకటి తోడయి, ఒక విషవక్రంగా రూపొందుతాయి.

లైంగిక ప్రవృత్తితో వచ్చిపడే గొప్ప చిక్కు ఏమిటంటే, ఏ మనిషికి, ఏ మోతాదులో అది తగునో నిర్ణయించుకోలేక పోవడము. ఈ చిక్కు విప్పుకోలేనిది కాదు. అన్నిరకాల పరాయి సంబంధాలనూ నిర్దాక్షిణ్యంగా విసర్జించుకుంటూ, ఒకే ఒక (వివాహబంధ) వ్యక్తితో ఆ కార్యకలాపాలను పరిమితం చేసుకొంటే, ఈ చిక్కు చాల వరకు విడిపోతుంది. అప్పుడు కూడా దానిని నిర్ణీతమయిన సందర్భాలకు పరిమితం చేసుకొని- (వారానికి తక్కువకాని విరామాలతో)- తృప్తి చెందాలి.

అయితే అసలు చిక్కు కాల విరామ పరిమితిని నిర్ణయించుకోవడంలో లేదు. అలా నిర్ణయించుకున్న ప్రణాళికను తూచా తప్పకుండా అమలు పరచుకోవడంలోనే ఉంది.

**అందుకోసం:**

1. "నిర్ణయం" అనే పేర ఇంతకుముందు ప్రకరణంలో చెప్పుకున్న అన్ని (రకాల) శక్తులనూ సమీకరించుకుని, వాటిని నిత్యజీవితంలో అనుసరించుకుంటూ, లైంగిక కార్యకలాపానికి అడ్డుకట్టలు వేసుకుంటూ సాగిపోవాలి. ఇదంతా ఏదో మన నిర్ణయశక్తి పరిమాణం ఏ మాత్రంగా ఉందో చూసుకోవడానికి చెప్పే సూచనగా భావించుకో కూడదు. ఇందులో రెండు ప్రయోజనాలున్నాయి. ఒకటి మన బీజశక్తిని పరిరక్షించు కోవడము. రెండవది మన నిర్ణయశక్తిని పెంపొందించుకోవడము.

2. ఒక్కసారి ఆలోచించి చూసుకుంటే ఈ ఆకర్షణ (ఈ సుఖం) ఎంత తాత్కాలికమయినదో, ఎంత తక్షణ తృప్తి నిచ్చేదో తెలియడమే కాకుండా, అది కాస్తా అయిపోగానే, ఎంత నిరుత్సాహంగా ఉంటుందో, ఎంత నిరాశాజనకంగా ఉంటుందో తెలిసిపోతుంది.

మానవసుందరత ఉత్కృష్టంగా ఉండేది అయిదు, పదేళ్ల మాత్రమేనని మనకు తెలుసు. ఆ తరవాత అది క్రమంగా నీరసించిపోయి, ఒక్కొక్కప్పుడు అదృశ్యమయిపోతుంది. అత్యంత తాత్కాలికమయిన ఈ ఆనందంకోసమేనా, మనం జీవితంలోని ఉన్నత మయిన విలువలకు తిలోదకాలిచ్చి, వెంపర్లాడేది?

3. లైంగిక ప్రవృత్తికి సంబంధించిన ఆలోచనల తాకిడి కలిగినప్పుడు, దానినుంచి తప్పించుకోవడానికి మార్గాలు లేకపోలేదు. ఇష్టం ఉన్నా, లేకపోయినా ఒక వార్తా పత్రిక చదవడమే. ఒక స్నేహితుడితో (ఏదో అప్పటికప్పుడు తట్టిన విషయాన్ని గురించి) మాట్లాడవచ్చు. ఏదయినా ఒక ప్రార్థనా గీతం (మనోగతంగా కాకుండా, వాచ్యంగా) పాడుకోవచ్చు. వ్యాయామం చేయవచ్చు. కొద్దినిమిషాలపాటు (అనుబంధంలో చెప్పిన) ప్రాణాయామమును (చూ. పుట 155) నిర్వహించుకోవచ్చు. ఇలాటివన్నీ ఆ తలపులకు తలుపులు మూసేవే.

4. వెంటనే జననాంగ ప్రదేశాలను చన్నీటితో ప్రక్షాళించి బిగువయిన కౌపీనము గాని, బిగువుగా ఉండే, పొట్టి లాగు గాని ధరించవచ్చు.

5. తీరిక దొరికినప్పుడల్లా లైంగిక ప్రవృత్తి ఎంత దుర్భరమో ఆ ఉద్రేకం ఎంత అసహ్యకరమో మనకు మనం నచ్చజెప్పుకోవాలి. మన లైంగిక సహచారి చర్మం వెనుక దాగిఉన్న లోపలి శరీర భాగాలు; అనగా ఎముకలు, రక్తము, మాంసము ఎంత అసహ్య కశ్మల పదార్థాలో ఊహలోకి తెచ్చుకోవాలి. శరీరం నవరంధ్రాల ద్వారా బయటకు ప్రతిరోజు వదిలే చెమట, ఉమ్మి, మల మూత్రములు మొదలయినవి ఎంతలేసి అసహ్య రూపాలూ, వాసనలూ కలిగినవో- స్మృతిలోకి తెచ్చుకొని; ఆరోగ్యంగా ఉన్నప్పుడే అలా అసహ్యంగా ఉన్నాయికదా. జబ్బు పడినప్పుడు వచ్చే కఫం, శ్లేష్మం, చీము మొదలయినవి ఇంకెంత అసహ్యమయిన దుర్వాసనలో-అని స్ఫురహలోకి తెచ్చుకుంటే, ఆ (లైంగిక ప్రవృత్తి సంబంధమయిన) ఆలోచనలు దూరమవుతాయి.

6. మనం అనుదినం లిఖించుకునే స్వీయ చలనచర్యల పుస్తకంలో, మానవ అస్థి పంజరపు బొమ్మ ఒకటి ఉంచుకోవాలి. దానిని పదేపదే చూసుకోవడం అలవాటు చేసుకుంటే, ఈ నిగనిగలాడే చర్మం వెనుక ఎంతటి భయానకమయిన దృశ్యం దాగి ఉందో దానితో మనం కలకాలం ఎలా కాపురం చేస్తున్నామో తెలుస్తుంది.

7. ఎవరి లైంగిక సహచారి నగ్న స్వరూపాన్ని-పరిపూర్ణ నగ్నశరీరాన్ని-వారు (ప్రకాశ వంతమయిన) దివాకాంతిలో తగినంతసేపు చూడడం: వరుసగా కొన్ని రోజులు, అవసర మయితే కొన్నినెలలు అలవాటు చేసుకొని; ఆ రూపాన్ని భరించాలి. రాత్రనకా, పగలనకా ఏ నశ్వర మాంసావహ శరీరంకోసం అపేక్ష పడుతున్నామో, అది నిజానికి ఎంత వికర్షక మైనదో గ్రహింపులోకి వచ్చి మన లైంగిక ప్రవృత్తి సంబంధమైన వాంఛను చాలవరకు పరిహరిస్తుంది.

8. ఇన్నిటినీ అధిగమించి, ఎలాగో నిగ్రహించలేనంత ప్రలోభం కలిగి దానివల్ల ఓడిపోవడం సంభవిస్తే, దానికి శిక్షగా ఒకటి, రెండు రోజులు ఉపవాసాన్ని పాటించి, మనం చేసుకున్న పవిత్ర ప్రతిజ్ఞకి పునరుజ్జీవనము తెచ్చుకోవాలి.

లైంగిక ప్రక్రియ లేని రోజులలో శరీరం ఆ దిశగా చర్యలోకి దిగకపోయినా, మనస్సు దానిమీద లగ్నమయి చివరికి విధి నిర్వహణ నిర్లక్ష్యం వరకు వెళ్తే, అది చాలా అపచారం. ఎందుకంటే, ఆధ్యాత్మిక ప్రగతికి- దేహ నిర్వహణాత్మకమయిన లైంగిక ప్రవృత్తికంటె, మానసిక వ్యభిచారమే ఎక్కువ హానికరం, నష్టకరం.

బ్రహ్మచర్యం ద్వారానో, మరో కృత్రిమ పద్ధతి ద్వారానో, కుటుంబ నియంత్రణ సక్రమంగా చేయగలగవచ్చును. దానివలన చేకూరే భౌతికమయిన ప్రయోజనాలతో బాటు, కొన్నిరకాల వేదనల నుండి విముక్తి సంభవించి, భగవద్గీత సూత్రాలను అమలు పరచడంలో మరింత సులువు ఏర్పడి, దానిని మరింత పటిష్ఠం చేస్తుంది.

లైంగిక ప్రవృత్తిని గురించి, చివరగా కొన్ని విషయాలు చెప్పుకుందాము.

1. జీవితాంతం ఒకే లైంగిక సహచారిని అంటిపెట్టుకుని ఉండాలి.

2. మన విధ్యుక్త ధర్మాలు నిరాటంకంగా కొనసాగడానికి వీలుగా లైంగిక సంబంధాన్ని పరిమితం చేసుకోవాలి.

3. ప్రతి కలయిక తరువాత కనీసం వారం దినాలపాటు సంపూర్ణ (దైహిక, మానసిక) లైంగిక ఉపవాసాన్ని పాటించాలి.

4. లైంగిక తృష్ణను నియంత్రణలో ఉంచడానికి ఇంతకుముందు చెప్పుకున్న ఎనిమిది సూచనలను సాధన చేసుకుంటూ ఉండాలి.

## నిద్ర

శారీరక క్రమశిక్షణ అనేదానిని గురించి చర్చించుకోవడంలో, ఒకానొక సదుపాయం కోసం "నిద్ర" అనే దానిని మూడవ విషయంగా తీసుకుంటున్నాము. ఏది ఎలా ఉన్నా, మనకు ఆహారం తరువాత అంతటి అత్యవసరమయినది, సహాయకారి అయినది నిద్రే. నిద్ర అనేది మానవుడికి చాలా ముఖ్యమైన అవసరమని సృష్టే గ్రహించింది. కనుకనే పొద్దస్తమానం పనిచేసిన మనని, సృష్టి, తనంతట తానే నిద్రాలోకంలోకి లాక్కుపోతుంది. అతిచౌక అయినది అయినా అత్యంత అమూల్యమయినది; బలాత్కారంగా సంభవించేది అయినా, నెప్పి కలిగించనిది, శక్తి-ప్రసన్నతా దాయకమయినది: అన్నీ కలిపి ఒకటిగా భగవంతుడు ప్రసాదించినది నిద్ర. ఈ విలువయిన కానుకను ఎలా ఉపయోగించుకోవాలి, దానివల్ల ఎంత ఎక్కువ ప్రయోజనం పొందాలి- అనేది మన మీదే ఆధారపడి ఉంది. ఖర్చు ఏమీ లేకుండా సరఫరా అయిన కానుక కదా అని, దీని విలువని తక్కువ అంచనా వేయకూడదు.

1. ఏ మనిషికి ఎంత నిద్ర అవసరం అనేది, ఆ మనిషి ఆరోగ్య పరిస్థితిననుసరించి, ఆ మనిషి పగటిపూట చేసే పని స్వభావాన్ని అనుసరించి, ఆ మనిషి వయసుననుసరించి ఆధారపడిఉంటుంది. సాధారణంగా వయసు పెరుగుతున్నకొద్దీ- అనగా చిరుత బాల్యం నుండి మిగుల వృద్ధాప్యము వరకు- రోజుకు ఎన్ని గంటల నిద్ర అనేది, పది నుండి ఐదు గంటల వరకు తగ్గుకుంటూ వస్తుంది. మేధావులకు, నీడపట్టున పనిచేసేవాళ్లకు- శరీరశ్రమ చేసి జీవించే వారికన్నా, తక్కువ నిద్ర సరిపోతుంది. ఆ విధంగా ఎవరిమట్టుకు వారు తమకు అవసరమయిన నిద్ర ఎన్ని గంటలు- అనేది వారి అవసరాన్ని బట్టి (నిద్రా రహితత్వమునకు గాని, అతి నిద్రాలోలత్వమునకుగాని లోనవకుండా) నిర్ణయించుకోవాలి. నిర్ణయించుకున్నంత మాత్రాన సరిపోదు. దానిని కూడా క్రమ శిక్షణతో, ఇంకా చెప్పవలసి వస్తే, యాంత్రికమయిన నిర్దుష్టతతో పాటించాలి. దానిని "నిద్రాక్రమశిక్షణ" అనవచ్చును.

**అతినిద్రాలోలుడుగాని,**
**నిద్రారహితత్వానికి లొంగినవాడుగాని**
**యోగసాధనకు అర్హుడుకాడు.**

-శ్రీమద్భగవద్గీత ఆత్మసంయమయోగము·16

**నిద్రయందును, జాగరణము నందును**
**మితము కలిగియుండు వానికి**
**వానిబాధలను యోగము తొలగిస్తుంది.**

-శ్రీమద్భగవద్గీత ఆత్మసంయమయోగము·17

2. "నిద్ర సుఖమెరుగదు" అంటారు. కాని, నిద్రవలన కలిగే మేలువేరు. నిద్ర పరిమాణము కంటె, నిద్ర గాఢత్వము సుఖకరము. గాఢత్వము అనగా కలలు, కలతలు లేనిది. మాటవరసకు ఒక చిన్నబిడ్డ తన చేతులు, కాళ్లూ బారచాపి, నిశ్చింతగా తాను నిద్రిస్తున్నప్పుడు తన బాధ్యత ఇంకెవరిదో అనేవిధంగా నిద్రిస్తే, అది గొప్ప నిద్ర. అలాటి నిద్ర మనకు ప్రాప్తిస్తే, అదే అదృష్టం.

అలాంటి నిద్ర కొన్ని నిమిషాలపాటు ప్రాప్తించినా అది కలలతో, కలతలతో నిండిన ఎన్నోగంటల నిద్రకంటె గొప్పది. అట్టి సుఖవంతమయిన నిద్ర ప్రాప్తించాలంటే:-

(i) మేలుకుని ఉన్నంతసేపు (పగటిపూట) మనస్సును వీలయినంతవరకు పరిశుభ్రంగా, వేదనా రహితంగా ఉంచుకోవాలి.

( ) మరి, అలాంటి మానసిక పరిశుభ్రత, వేదనా రాహిత్యం చేకూరాలంటే; మనసా, వాచా, కర్మణా సత్యాన్ని అంటిపెట్టుకొని (అనుష్ఠిస్తూ) ఉండాలి. ఈ సూచన "చెప్పడం కంటె, పాటించడం కష్టం". కాని, ఇంతకుముందు (నిర్ణయ-నిశ్చయ ప్రతిపత్తి: అనే) ప్రకరణంలో వివరించినట్లు బలమయిన నిర్ణయం అలవరచుకుని సత్యాన్ని అనుష్ఠిస్తే మనసు పరిశుభ్రంగా ఉండడం, వేదనా రహితంగా ఉండడం- వాటంతట అవే అద్భుతంగా సంభవిస్తాయి.

(i) ప్రతిరాత్రి, నిద్రపోయే ముందు; "నేను కనీసం ఈ రాత్రికైనా సరే-నా బాధలన్నీ మరిచిపోయి హాయిగా నిద్రపోతాను!" అని ఒక దృఢమైన నిర్ణయం తీసుకోవాలి. "భగవంతుడున్నాడు. ఆయనే నా మంచిచెడ్డలు చూసుకుంటాడు. ఇంక నేనెందుకు (ఈ శరీరాన్ని గురించీ నా గురించీ) బాధపడాలి?" అని తలపోసి, పూచీ అంతా భగవంతుడి మీద వేసేసి సుఖశాంతులను ప్రసాదించమని ఆయనను ప్రార్థించాలి.

మన నిర్ణయంలో బలం, నిజాయితీ- ఉంటే నిద్ర దానంతట అదే వచ్చేస్తుంది. ప్రార్థన కూడా అందుకు కొంత తోడ్పడుతుంది.

ఇలా, క్రమ పద్ధతిలో; మన ప్రయత్నమూ దాని ప్రభావమూ-వాటంతట అవి సంభవించేటంతవరకూ నిర్విరామంగా నెరవేర్చుకోవాలి.

3. శరీరాన్ని భగవద్గీత (సూత్రాల) అభ్యాసానికి అనుగుణంగా క్రమబద్ధీకరించు కోడానికి గాను మరొక మంచి అలవాటుని కూడా చేసుకోవాలి. తెల్లవారడానికి ఇంకోగంట వ్యవధి ఉండగానే పక్కమీదనుంచి లేవాలి. మనో ప్రపంచంలో నిర్వహించుకొనే- ప్రార్థన, ఏకాగ్రత లాంటి సాధనలకి ఆ ఘడియలు చాలా అనుకూలంగా ఉంటాయి. రాత్రి చాలాసేపు మేలుకుని ఉన్నాను కదా, అందుచేత తొందరగా లేవలేను- అనుకోకూడదు, (అనకూడదు.) తెల్లారగట్ల పక్కమీంచి లేవడానికి అనుకూలంగా ఉండేటట్లుగా పనులన్నీ నిర్వహించుకోవాలి. పనులు ఉంటాయి; కాని, అవి నిద్రవేళ దాకా మిగిలిపోయి నిద్రని మింగెయ్యకుండా చూసుకోవాలి. పనులు పేరుకుపోతున్నాసరే పట్టించుకోకూడదు. ఎందుకంటే-నిద్రవేళలో పొందేశాంతి, దానివల్ల కలిగే అంతర్గతవికాసం- వీటికి మోసం రాకూడదు.

## శారీరక వ్యాయామము

ఎల్లవేళలా ఆరోగ్యంగా ఉండడానికి గాను, ఎవరి వయస్సుకీ, ఆరోగ్యస్థితికీ తగ్గట్టుగా వారు-ఏదో ఒక రకానిదైనా (ఆధునిక శరీర) వ్యాయామం చెయ్యాలి. (అనుబంధంలో వివరించి చెప్పిన) రాజయోగములోని ప్రాణాయామం, శవాసనం క్రమం తప్పకుండా సాధన చేయాలి. దానివల్ల మన సాధారణ ఆరోగ్యం సరిగ్గా ఉండడమే కాక, ఏకాగ్రతను, మానసిక శూన్యావహతను సాధించుకోవడానికి సహాయపడి, ఆధ్యాత్మిక క్రమశిక్షణకు దారితీస్తుంది.

ఈ అధ్యాయంలో ఎన్నో విషయాలు చెప్పుకున్నాము. వాటికి ఫలశ్రుతిగా కూడా కొంత చెప్పుకోవాలి. క్రమశిక్షణను నిర్వచిస్తూ చెప్పిన అన్ని సూత్రాలూ చెప్పడానికి సులువయినవే గాని, ఆచరించడానికి కష్టసాధ్యాలు. వాటిపైన నియంత్రణను సాధించ డానికి వాటిపైన విశ్వాసం అలవరచుకొని, దీర్ఘకాలం అభ్యసించవలసి ఉంది. ఎందుకంటే, ఆధ్యాత్మిక అభ్యాసంలో విజయానికి దగ్గిరదారులు లేవు. అన్ని కూడా "ఏ విత్తనం నాటితే ఆ పంటే పండుతుంది." అనే సూత్రాన్ని అనుసరించి వచ్చేవే. ★

## తొమ్మిదవ ప్రకరణము

# మానసిక క్రమశిక్షణ

అర్జునుడు:

**అహో, కృష్ణా! మనసు చాలా చంచలంగా ఉంది**
**కలత పెడుతోంది. బలిష్ఠంగా ఉంది. లొంగడం లేదు**
**వాయువును నిరోధించలేనట్లే, మనసును నిగ్రహించుకోవడానికి**
**కష్టమని అనిపిస్తూ ఉంది.**

- శ్రీమద్భగవద్గీత, ఆత్మసంయమయోగము 34

శ్రీ భగవానుడు:

**అర్జునా! ఓ మహాబాహూ!**
**మనసు నిస్సంశయముగా చంచలమయినదే.**
**దానిని నిగ్రహించడం దుస్సాధ్యమే. కాని, ఓ కుంతీపుత్రా!**
**అభ్యాసము చేతను, వైరాగ్యము చేతను దానిని సాధించవచ్చును.**

- శ్రీమద్భగవద్గీత ఆత్మసంయమయోగము 35

భగవద్గీతను అభ్యాసం చేయడంలో శరీరమే ముఖ్యపాత్ర వహిస్తున్నట్లు తోచినా, ఆచర్యల అసలు కేంద్రం మనసే. శరీరపు సమస్త అంగాలు, వాటికి ఆజ్ఞలను జారీచేసే అంతర- అంగాల అదుపాజ్ఞలకు లోబడి, పనిచేసే క్షేత్రకర్మచారులు. మానవుడు నిర్వహించే ప్రతి చర్యలోను, అతడి ఇచ్ఛాభీష్టం స్థూలంగా నిర్ణయం తీసుకుంటుంది. 'బుద్ధి' (అనే ముందువెనుకలు ఆలోచించే సామర్థ్యము గల శక్తి) ఆ నిర్ణయాలను అమలు పరచడానికి అవసరమయిన వివరాలను తయారు చేసుకోవలసి వస్తుంది. అట్టి వివరాలు ఇంద్రియాలకు (గుణాలకు) చేరుకుంటాయి. "గుణాలు" ఆ ఆజ్ఞలను బాహిర అవయవాలకు- అనగా కన్నులు, చెవులు, చేతులు- మొదలయిన వాటికి ఒప్పగిస్తాయి. చివరికి ఆ అసలు ఆజ్ఞలు కార్యరూపందాల్చి, చూడడము, వినడము వంటి క్రియలు ఏర్పడుతాయి.

ఈ ప్రక్రియ అంతటివెనుక జీవాత్మ (లేక "నీలోఉండే నిజమైన నీవు") సుదూరంగా ఆసక్తిలేని ప్రేక్షకునివలె నిలిచి ఉంటుంది. శరీరము నిర్వహించే ఏకార్యకలాపమూ దానికి అంటదు.

శరీరము రథమనీ, ఆత్మ ఆ రథసారధి అనీ,
ఇంద్రియాలు అశ్వాలనీ తెలుసుకోవలసి ఉంది.
ఆత్మ సారథిగా ఉన్న ఈ రథానికి మనసు కళ్లెములుగా పనిచేసి,
అశ్వాల వలె పరుగులిడే ఇంద్రియాలను అదుపులో ఉంచుతుంది.
భౌతిక ప్రపంచం, ఈ రథం నడవవలసిన మార్గము.
సారథిగా ఉండే ఆత్మ, మనసు అనే కళ్లేలను
తెలివిగా, బిగువుగా పట్టుకోకపోతే,
ఇంద్రియాలు వశం తప్పిన అశ్వాలవలె అదుపు తప్పిపోతాయి
రథం గమ్యాన్ని చేరుకోదు, అయితే
మానవుడు తెలివిగలవాడై మనసును వశంలో ఉంచుకుంటే
ఇంద్రియాలు క్రమశిక్షణగల అశ్వాలవలె ప్రవర్తించి, (సారథి)
ఆత్మ భద్రంగా ప్రయాణం చేసి గమ్యం (విష్ణులోకం) చేరుకుంటుంది.

-కఠోపనిషత్తు · III,3,4,5 9

శరీరముకంటె, ఇంద్రియాలు గొప్పవి.
ఇంద్రియాలకంటె మనసు గొప్పది. మనసుకన్నా బుద్ధి గొప్పది,
బుద్ధికన్నా ఆత్మ (జీవాత్మ) గొప్పది.

-శ్రీమద్భగవద్గీత, కర్మయోగము:42

ఇది సహజము, దైవ నిర్దేశితము అయిన ప్రణాళిక. కాని, ఆచరణలో చాలా అవరోధాలు తగులుతాయి.

అసలు సాధారణంగా మానవుడి ఇచ్ఛాభీష్టం చాలా నీరసమయినది. ఏ విషయం లోనూ దృఢమయిన, ఉత్తమమయిన నిర్ణయాన్ని తీసుకుని, దానిని సక్రమంగా అనుసరించేటట్లు బుద్ధిని శాసించలేదు.

బుద్ధి సామాన్యంగా తనకు గతకర్మ నిర్దేశించిన మార్గములోనే తప్ప, మరి ఏ ఇతర విధముగా ఆలోచన చేయలేదు.

బుద్ధి కర్మానుసారిణి.

కనుక, (బుద్ధి) ; స్వేచ్ఛాభీష్టము తీసుకొనే నిర్ణయాలను ఖచ్చితంగా పాటించలేక పోతుంది ; ఆ నిర్ణయాలను అమలు చేయడానికి గాను మనసుకూ, ఇంద్రియాలకూ అందించలేకపోతుంది.

మనసు భావాలకు స్థానము. భావాలు సాంకేతికంగా ఇంద్రియాలకన్నా గొప్పవి. కాని, సాధారణంగా భావాలకు రూపాలనిచ్చేది ఇంద్రియాలే. అది దురదృష్టము.

అన్నిటికన్న ఘోరం ఏమిటంటే, ఇంద్రియాలు (గుణాలు) నిరంతరం ప్రాపంచిక సుఖాల వైపుకే దృష్టి నిలుపుతాయి తప్ప; ఆధ్యాత్మిక ప్రగతి వైపుగా అంతర్దృష్టి సారించవు. ఆ విధంగా అవి విచ్చలవిడిగా, అదుపు తప్పి; వ్యవహరిస్తాయి. బుద్ధి, మనసు: స్వేచ్ఛా భీష్టపు నిర్ణయాలను ఇంద్రియాలకు అందజేసినా, అవి ఎదురు తిరుగుతాయి. అంతే కాదు. మనసు సృజించే భావాలను కలుషితం చేసి, తికమక పెట్టి, చివరకి బుద్ధినే ప్రభావితం చేసి, స్వేచ్ఛాభీష్టం ఏర్పరచే ఆధ్యాత్మిక ఆనతులను పక్కకు తప్పించి, తమ సృజనలయిన ప్రాపంచిక సలహాలనే అమలు పరచేటట్లు చూస్తాయి.

దీనితో మానవుడిలో ఉండే కొద్దిపాటి స్వేచ్ఛాభీష్టం కాస్తా నిరర్థకమయిపోతుంది. ఇంద్రియాలు రూపొందించే దుష్ట, ఐహిక ప్రయోజనాలదే పైచెయ్యి అయిపోయి, అవి అదుపుతప్పే ప్రమాణాలలోకి చేరుకుంటాయి. అయితే (విజయం ధ్యేయంగా సాగే) ఏ ఆధ్యాత్మిక అభ్యాసమయినా, ముందుగా ఇంద్రియాలను (గుణాలను) స్వాధీనంలోకి తెచ్చుకోవాలి. అది జరగాలంటే, ఇంద్రియాలమీద అధికారం చూపే "భావాలు", వాటి (ఉత్పత్తి) స్థాన మైన "మనసు"; సరైన శిక్షణ పొంది బలపడాలి.

ఆవిధంగా, స్వభావతః - చాలా కలతచెందగలది, అదుపు చెయ్యడానికి అసాధ్యమైనది -అయిన మనసు; క్రమశిక్షణ వలన (లోబరచుకోగలిగితే) శ్రద్ధాళువయిన ఏసాధకుడి అభ్యాసానికయినా, ప్రాథమికమయిన ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటుంది.

మనసును క్రమశిక్షణచేత లోబరుచుకోవడం కూడా రాత్రికి రాత్రి సాధ్యమయ్యే పనికాదు; అభ్యాసం చేత చేకూరేదే. ఆ అభ్యాసానికి (భాగాలయిన) కొన్ని మౌలిక సోపానాలు ఏమిటో చెప్పుకుందాము. ఇవి మన దైనందిన కార్యకలాపాలను అనుసరించి లేవని, మన స్వభావాలకు వ్యతిరేకంగా ఉన్నాయని, అసమంజసంగా ఉన్నాయని, అనవసరమయినవని తలచి; ఈ మానసిక అభ్యాసాలను ఉపేక్షించకూడదు. క్రమానుగతంగా మనలను మన ఆధ్యాత్మిక సాధనలలో ఉచ్చస్థితికి తీసుకుపోవడానికి ఇవి సహాయపరికరాలుగా రూపొందుతాయని మనము గ్రహించగలుగుతాము.

1. మానసిక క్రమశిక్షణలో మొదటిమెట్టు మనసును ఖాళీగా ఉంచనేర్వడం. మనసు ఖాళీగా ఉండడమనేది అరుదు. అక్కడ ఎప్పుడూ నిరంతరాయంగా మంచిదో, చెడ్డదో ఒక ఆలోచన వచ్చి కూర్చుంటుంది. అలాటి వాటిలో కొన్ని వేళలప్పుడు అసమంజసమైనవీ, యుక్తియుక్తరహితమయినవి: ఉంటాయి. అలాగని అవి అక్కడ తిష్ఠవేసుకోవు. మనసులోని అరలన్నిటివైపులకి అడ్డదిడ్డంగా దాట్లు వేస్తుంటాయి. ప్రకృతి (అనేశక్తి)కి శూన్యమంటే చిరాకు. అలాగే, మనసు కూడా సాధారణంగా ఖాళీగా ఉండడానికి ఒప్పుకోదు.

మనసులో చోటు చేసుకొనే ప్రతి ఆలోచన, మనసుకు పనికల్పించి, దాని శక్తిని హరిస్తూ ఉంటుంది. అలా పోగొట్టుకొంటున్న శక్తిని మనసు పునఃసాధించుకోవడానికి సహాయ పడే విధంగా మనసును ఆలోచనల తాకిడినుండి రక్షించి, మనసుకు పూర్తి విశ్రాంతిని ఇవ్వాలి.

మనసును ఆలోచనల తాకిడిలేకుండా (ఖాళీగా) ఉంచాలంటే, దానికి ఒకటే మార్గం. మనసు తన దృష్టిని నిలపడానికి అవకాశం ఉండే బాహిర వస్తు సముదాయమునుండి దానిని దూరం చేయడమే.

**అలా చెయ్యాలంటే:-**

ఎక్కడో ఒకచోట నిశ్చలంగా కూర్చోవాలి; లేక, నడుము వాల్చాలి. ఒక నిముషంపాటు మనసును ఆలోచనారహితంగా ఉంచడానికి ప్రయత్నించాలి. ఆఫీసు గురించో, కుటుంబంగురించో, దేశంగురించో- ఆ ఒక్క నిమిషంలోనే ఏదైనా ఆలోచన కలిగితే దానిని తరిమివేసి, ఖాళీగా ఉండమని, పూర్తిగా ఖాళీగా ఉండమని మనసును ఆజ్ఞాపించాలి. స్వేచ్ఛాభీష్టశక్తి తన ఆజ్ఞను మనసు పాటించేటట్లుగా చూసుకోవాలి. ఇలా చెయ్యడమెలాగో సాధారణవ్యక్తి ఎవ్వరూ కూడా "చేసి చూపించలేరు". ఎవరు ఏమి చెప్పినా, చేసినా; మనకి మనమే ప్రయత్నం ద్వారా (అనగా, చేస్తే సరిగా చేసినట్టు, తప్పు చేస్తే దిద్దుకున్నట్టు-చూసుకుంటూ) దానిని నేర్చుకోవాలి. అలా మనసుని పరిపూర్ణంగా ఖాళీ చేసుకొనేస్థితికి తేవడానికి మొదట్లో చాలా కష్టమనిపిస్తుంది. ఒక నిమిషం పాటు మనసులోకి ఏ ఆలోచనలూ రాకుండా తరిమివేయగలిగినా, ఆ నిమిషం లోపలే "అయ్యో, ఈ మనసు ఖాళీగా ఉండిపోయిందే" అనే నిష్ఫలమయిన ఆలోచన ఒకటి మనసులో తారట్లాడుతుంది. దానిని కూడా (మరిన్ని ఆజ్ఞలతో, నిర్ణయాలతో, ప్రయత్నాలతో) అదుపులో పెట్టుకోగలిగితే, కనీసం కొద్ది పాటి సమయమయినా మనసును ఆలోచనా శూన్యంగా చేసుకోవడంలో గెలిచినట్లే. అలా అలా కొద్ది కొద్ది క్షణాలపాటు మనసును ఖాళీగా ఉంచుకోవడం అభ్యాసం చేసుకుంటే, క్రమంగా ఆ (మనసుఖాళీ) సమయాన్ని ఏ పావుగంటకో, మరింత ఎక్కువ కాలానికో పెంచుకో గలగవచ్చు. మనం అలాచేసి దానిని అలవాటులోకి తెచ్చుకోగలిగితే, అది నిజంగా ఒక పులకాంకితమయిన అద్భుత కృత్యము అవుతుంది. (ఆ అద్భుతాన్ని ఇంకొకరకంగా చెప్పుకోవచ్చు:-) అలా (మనసును పావుగంట పాటు ఆలోచనా రహితంగా) ఉంచగలిగేవారు; కొన్ని గంటలపాటు, ఇంకా చెప్పవలసి వస్తే కొన్ని రోజులపాటు అత్యంత గాఢమయిన నిద్రను అనుభవించి, అప్పుడే లేచినప్పటి తాజా తనాన్ని: శారీరకంగా, మానసికంగా కూడా పొందగలరు.

అది అంతతో ఆగిపోదు. దానివలన మరింత ఘనమయిన ప్రయోజనం చేకూరు తుంది. మనసును తగినంతసేపు ఖాళీగా ఉంచుకుని నిద్రానంతరమయిన తాజాదనాన్ని పొందడం అనే ఉల్లాసకరమయిన అభ్యాసం-భగవద్గీతను అనుష్ఠించే మహా స్థితియందు అవసరమయిన ఏకాగ్రతను చేకూర్చుతుంది.

2. ఉద్దేశపూర్వకంగా మనసును ఆలోచనలులేని ఖాళీజాగాగా ఏర్పరచుకోవడమనేది, మనసును 'సోమరిగా ఉంచడం' కాదు. ఆలోచనలు లేని ఖాళీజాగాగా ఏర్పడిన మనసు పునశ్శక్తిని ఇవ్వగల విశ్రాంతి అనుకుంటే, సోమరిమనస్సు అంతులేని దురాలోచనలను

ఆహ్వానించగలది. అవికూడా ఆలోచనలేకనుక, అవి మనసుకు పనికల్పిస్తాయి. అవి దురాలోచనలు కనుక, మానవుని ఆధ్యాత్మికస్థాయిని దిగజారుస్తాయి. కనుక; మానసిక క్రమశిక్షణ విషయంలో రెండవ సోపానము ఇప్పుడు తటస్థపడుతుంది. దీని మొదటి కార్యక్రమము ఏమిటంటే- దురాలోచనలు అనేవి మనసులో ప్రవేశించి, అక్కడ తచ్చాడ కుండా వాటిని తరిమివేయడము.

ఆ దురాలోచనలు మనసును ముసురుకుంటే, మనకు:-

() ఒక అమాయక వ్యక్తిని వేధించాలనీ,

(i) (పాపావహమయిన) లైంగిక అనుభవం పొందాలనీ,

( ) ఇంకొకరిని దోచుకునే పన్నాగాలు పన్నాలనీ,

(iv) సుఖాత్మకమయిన ఊహాలలో తేలాలనీ-ఇలాంటి ప్రవృత్తులు కలుగుతాయి.

అటువంటి ఆలోచనలు మరీ మరీ మన మనసులో మోసాత్మకంగా ఎలా ప్రవేశిస్తాయో, వాటిని మనం వదలగొట్టుకొనే ప్రయత్నాలు ఎలా ఎలా చెయ్యాలో సూచనాత్మకంగా చెప్పుకుందాము.

పోలీసుశాఖకు చెందిన ఒక అధికారి ఉన్నాడనుకుందాము. అతనికి- ఎవరో "సుబ్బయ్య" లాంటి పేరుగల వ్యక్తిపై శత్రుభావం ఉంది అనుకుందాము. ఈ సుబ్బయ్య ఒక సాధారణ వ్యవసాయదారు అనుకుందాము. పోలీసు అధికారి మనసులో గల నీచ స్వభావము వలన; అతనికి, సుబ్బయ్యను ఏదో సాకుతో జైలులో వేయాలని అనిపించవచ్చు. కాని, ఆ పోలీసు అధికారి ఆత్మలో ఉన్న ఉన్నత స్వభావం- 'అటువంటి ఆలోచన కలగడమే పాపము, నాయనా-' అని చెప్తుంది.

అయినా సరే, దృష్టి: అటుతిరిగి ఇటు తిరిగీ; మళ్లీ ఈ చింతలోకే మళ్లుతుంది. సుబ్బయ్యని జైలులో పెట్టడం అనే ఆలోచన పాపభూయిష్ఠమయినది- అని, తన బాహిరదృష్టిని ఆ పోలీసు అధికారి తన ఎదురుగా ఉన్న గోడకి వ్రేలాడగట్టిన ఒక వర్ణ చిత్రంవైపు మళ్లించుకుంటాడు. అది చాలా బాగుంది. చిత్రకారుడెవడోగాని, అతడు ఆ చిత్రం గీయడానికి, సాక్షాత్తూ ఇంద్రధనసులోని రంగులను దొంగిలించి తెచ్చినంత బాగుంది. అవునూ, వాడు ఆ రంగుల్ని దొంగతనం చేశాడు కదా, మరి వాడిని జైలులో పెట్టొద్దా!... అవును, కటకటాలలో పెట్టాలి! ఆ సుబ్బయ్యని కూడా కటకటాల వెనక్కి తొయ్యాలి... ఇప్పుడు నా చేతిలో ఒక కిడ్నాపింగు కేసు ఉందికదా, దాంట్లో ఎలాగో వాడిని ఇరికించీయొచ్చు.

ఇలాగ, ఆ పోలీసాఫీసరుకి సుబ్బయ్యనిగురించి కలిగినట్లే, మనకూ ఆలోచనల తాకిడి కలిగి, మనకు తెలియకుండానే దాంట్లో కొట్టుకుపోతాము. ఒకటి రెండు నిమిషాలు గడిచేక ఆ సంగతి మన స్పృహలోకి వస్తుంది. ఆ దంభ బుద్ధిని దులిపేసి, "లేదు, లేదు! ఇలాంటి ఆలోచనని మళ్లీ నా మనసులోకి రానియ్యను. దానిని తరిమేసి ఇంకేదైనా విషయాన్ని గురించి ఆలోచిస్తాను" అని దృఢంగా చెప్పుకుంటాము.



A C. No. 18209

శ్రీరాముడు ఉన్నాడు. అతడు భూమికి దిగివచ్చిన అవతారపురుషుడ. "అతని నామం ఉచ్చరిస్తేనే పాపాలన్నీ కడుక్కుపోతాయి." అంటారు. నిజంగా కడుక్కుపోతాయటా? ఆ రామనామస్మరణ భద్రాచల రామదాసుకి ఏం ఒరగబెట్టింది? పాపం; రామభక్తుడై నందుకు ఆ దీనుడు ఏళ్ల తరబడిని కటకటాల వెనక గడపవలిసొచ్చిందే! తానా షా కారాగారంలో అతడు అనుభవించిన బాధ ఇంతా అంతానా?... ఈ సుబ్బయ్యకి కూడా కనీసం "అందులో" సగం కాలంపాటు నిర్బంధంలో ఉంచేటట్టు చేస్తే బాగుండును... సగమేమిటి, వాడు దానికి రెట్టింపుకాలం జైలులో మగ్గి పడిఉండాలి. వాడున్నాడే, వాడు...!

మళ్లీ ఇదే తంతు. మనసు సుబ్బయ్యనిగురించి (చెడు) ఆలోచనలలోకి తెలియ కుండానే జారిపోతుంది. కాని, మనకి తొందరగానే గ్రహింపుకొచ్చి, పశ్చాత్తాపపడతాం. ఎట్టి పరిస్థితులలోనూ (సుబ్బయ్యని గురించి) చెడు ఆలోచనలు మనసులోకి రాకుండా చూసుకోవాలి- అని పళ్లు బిగించి, దృఢ నిశ్చయానికి వస్తాం. అయినా సరే, ఈ నిషిద్ధమయిన ఆలోచనలు మనసులో ప్రవేశిస్తూనే ఉంటాయి. ఇలా కొంతకాలం సాగుతుంది. అయితే, ఆ ఆలోచనలు మనసులో ప్రవేశించడానికిససేమిరా ఒప్పుకొనేది లేదు- అని ఓర్పుగా, దృఢ నిశ్చయంతో నిలబడితే, అంతిమ విజయం మనకే ఖాయంగా లభిస్తుంది.

మనసులోకి చెడు ఆలోచనలు ప్రవేశిస్తూ ఉండడం, వాటిని నాశనం చేయడానికి మనం ప్రయత్నిస్తూ ఉండడం; ఇలా సాగుతూనే ఉంటుంది. ఒక్కొక్కప్పుడు ఆ ప్రక్రియలో మనం ఓడిపోతూ ఉండడం కూడా కద్దు. అటువంటి అన్ని సందర్భాలలోనూ గుర్తుంచుకోవలసినది ఏమిటంటే, మనకి అవసరమయినంత నిర్ణయశక్తి ఒనగూడడం లేదని. అందుచేత, అలా ఓటమి సంభవించి, గెలుపుకోసం పునఃప్రయత్నం మొదలు పెట్టినప్పుడల్లా మనం మన నిర్ణయశక్తిని పునరుజ్జీవింప జేసుకోవాలి. (అది ఎలాగ - అనేది 'నిర్ణయ-నిశ్చయ ప్రతిపత్తి' అనే ప్రకరణంలో చెప్పుకున్నాం.)

ఈ అభ్యాసాలన్నీ ఒక రోజుకో రెండు రోజులకో సంబంధించినవి కావని కూడా గుర్తుంచుకోవాలి. చాలా కాలం పడ్తుంది. ప్రతి అభ్యాసం సందర్భంలోనూ కఠోరమైన శ్రమ చెయ్యాలి. ఇలా కొన్ని నెలలు లేదా, మరికొంత ఎక్కువకాలం (అభ్యాసం) చేస్తేనే గాని; మనసులో చేరే చెడు ఆలోచనలను ఏరి పారెయ్యడంలో నైపుణ్యం ఒనగూడదు.

సాధనమున పనులు సమకూరును- అన్నట్టుగా ఈ అభ్యాసం చేయగా చేయగా పట్టుబడి, ఉత్తరోత్తరా; భగవద్గీత కరిన సూత్రాలను అమలు చేసుకోవడం చాలా సుకర మవుతుంది.

3. మనసులోంచి చెడు ఆలోచనలను పోగొట్టి, (మనసును) పరిశుద్ధం చేసుకోవడం అయింది కనుక, దానిని మంచి ఆలోచనలతో నింపుకోవడమే తరువాతి కార్యక్రమ ప్రయత్నం. మనమంతా సామాన్యమానవులము. మనమనసులు మంచి ఆలోచనలతో నిండక, ఖాళీగా ఉన్నట్లయితే, అది దుర్భరం. ఎందుకంటే, చెడు ఆలోచనలు మళ్లీ

(మనసులలో) ప్రవేశించేస్తాయి. చెడు ఆలోచనలను తోసిపుచ్చి, మంచి ఆలోచనలను స్వీకరించుకొనే ముందు మన నిర్ణయశక్తి తరుచుగా ఊగులాడుతుంది, పలచబడుతుంది; చివరికి చెడు ఆలోచనలకే లొంగిపోతుంది. కాబట్టి మధ్యమధ్య తగిలే ఈ ఊగులాటలని ఓ కంట కనిపెట్టి, వాటికి జాగ్రత్తగా తట్టుకుని, మంచి ఆలోచనలతో మనసును నింపుకోవాలి.

నిత్య జీవితంలో చెడ్డ ఆలోచనలను తరిమివేయడం కష్టమయితే కావచ్చు గాని, మంచి ఆలోచనలను తెచ్చుకోవడం అంతకష్టంకాదు. మనసును ప్రయోజనాత్మక మయిన, ఉపయోగకరమయిన పనులమీద నియమించుకుంటే సరి.

(i) మాటవరసకి ఒక ఆఫీసు, ఒక అధికారి, ఒక ఫైలు, దానిని రాసేవాడు ఒకడు. ఇతడు ఆ ఫైలుని తొందరగా రాసేసే మార్గాన్ని అన్వేషించి, తద్వారా అధికారిని సంతోష పెట్టడం

(i ) మన అభిరుచికి అనుగుణమైనది, సందర్భ ప్రాముఖ్యం గలది; అయిన విషయం గురించి ఒక (బహిరంగ) ఉపన్యాసం చేయడానికి సిద్ధమవడం.

(i i) గ్రంధరచన, దాని ప్రణాళికీకరణము, వివరాల సేకరణ, రచనా ప్రారంభము- వీటిలో నిమగ్నం కావడము.

(iv) వయోజన విద్యాకార్యక్రమము, ఆసుపత్రిలో ఉచిత సేవ, గ్రంధాలయ (పఠన మందిర) నిర్వహణ: వంటి సామాజిక, ధార్మిక విధులలో ఏదో ఒక దానిని (కొన్నిటిని) అభిమానంగా చేపట్టడం.

(v) కొన్ని మంచి పుస్తకాలు చదవడం, కొందరు సజ్జనులతో పనిగట్టుకొని సాంగత్యం ఏర్పరచుకోవడం; మురికివాడలలో నివసించే వారి (పరిస్థితుల) వివరాలు తెలుసుకొని వాటిని మెరుగుపరచే పథకాలు వేయడము.

అలా ఏదో సంకల్పిస్తూ, నిర్వహిస్తూ ఉంటే (శరీరంతో బాటు) మనసుకు బద్ధకం ఉండదు. నిష్క్రియా పరత్వము సకల పాపములకు మూలము.

4. ఇవన్నీ నిజాయితీతో, నిర్ణయశక్తితో అభ్యసించి, అమలు చేయవలసినవి. వాటివలన కొంతకాలానికి "పని" యందలి అనుకూల-ప్రతికూల లక్ష్యాల పట్ల అవగాహన, అదుపు: ఏర్పడతాయి. అప్పుడు మనసులోకి చెడు ఆలోచనలు రాకుండా నిరోధించ డానికి, మంచి ఆలోచనలు వచ్చేటట్టు చూసుకోవడానికి; (ఇంకా చెప్పవలసివస్తే) మనసులో ఏ ఆలోచనలూ లేని శూన్యస్థితిని సాధించుకోవడానికి: సాధ్యమవుతుంది. ఇదంతా, క్రోధ-మోహ-మాత్సర్యాది-శత్రువర్గాల నియంత్రణలో, మన ఆజ్ఞలను ఒక అనుభవశాలి అయిన సేవకుని వలె పాటించే విషయంలో: మనసుకు ఇచ్చే శిక్షణ మాత్రమే. (మరికొన్ని వివరాలు తరువాతి ప్రకరణాలలో చర్చించుకుందాము.)

అయితే, మనసును పరిశుద్ధంగా చేసి ఉంచడమనేది వేరే విషయం. (అది భగవద్గీత ఆచరణలో అవసరమయిన అనుబంధం.) అట్టి పరిశుద్ధతాక్రియ మనసు అపమార్గం

పట్టడానికి లోనయ్యే ఉద్దేశాన్ని, (చేసే ప్రయత్నాన్ని కూడా) నాశనం చేస్తుంది. ఈ (అపమార్గం) ఉద్దేశాలు మునపటి జన్మలోని పాపాల ఫలితం, ఈ జన్మకు తరలిన దానికి ఫలితంగా కలిగినవే. ఆధ్యాత్మిక క్షేత్రంలో, ఆత్మ, స్పష్టమయిన ప్రగతిని సాధించాలంటే, (పూర్వజన్మపాపసంగ్రహ ఫలితం వంటి) అసహ్యకర వారసత్వంనుండి మనసు స్వేచ్ఛను పొందాలి. ఇనుముకు మెరుగుపెట్టేముందు దానికి ఉన్న తుప్పు వదలగొట్టాలి.

మనసును (శుభ్రపరచుకొని) నిర్మలంగా ఉంచుకోవాలంటే, రామనామస్మరణో, లేక కృష్ణజపమోలాంటి ఇష్టదైవ ప్రార్థన ఉత్తమమే కాక సులువైనది కూడాను.

ఇష్టదైవ ప్రార్థన (నామస్మరణ, జపం) గురించి చాలా వివరంగా తరువాత క్రమంగా చెప్పుకుందాం. (అది "భక్తి" అనే ప్రకరణంగా రూపొందుతుంది.) ఇప్పటికి మనం గమనించుకోవలసింది ఏమిటంటే ప్రార్థన-లేదా, నామస్మరణ అనేది పాపాన్ని సమూలంగా నాశనం చేయగలది.

**కలియుగమునందు భగవన్నామోచ్చారణము ముక్తిదాయకం.**

భగవన్నామోచ్చారణ మనసులోంచి చెడు ఆలోచనలను దూరం చేయడానికీ, మనసును ఏదో ఒక మంచి పనితో నిబంధించడానికీ దారితీసి, పరోక్షంగా ఒక సత్కాల క్షేపం అవుతుంది. అందుచేత మనకి అవకాశం దొరికినప్పుడు, అవసరం కలిగినప్పుడు: యాంత్రికంగానయినా సరే, ఎవరో ఒక దేవుడి నామం ఉచ్చరించడం అలవాటు చేసుకోవాలి. భగవన్నామోచ్చారణకి సమయాసమయాల పాటింపు అక్కరలేదు. ఆ పని ఖాళీగా ఉన్నప్పుడూ చేయవచ్చు, పనిలో ఉన్నాసరే చేయవచ్చు.

(i) మనం తరుచుగా ఆశ్చర్యపడినప్పుడో, చిరాకుపడినప్పుడో మనకు తెలియకుండా "అయ్యో నా మతిమండా", "ఓరి నీ తస్సాదియ్యా", "చచ్చాంఫో"- లాంటి ఊత పదాలు ఉపయోగించడం కద్దు. అటువంటప్పుడు "అయ్యోదేవుడా", "అయ్యోరామా", "శివశివా"- లాంటి ఊత పదాలు వాడడం అలవాటు చేసుకుంటే, వాక్కు శుభ్రపడుతుంది, తద్వారా మనసుకూడా నిష్కల్మషమవుతుంది.

(ii) అప్పుడప్పుడు మనం వాహనాలమీద ప్రయాణం చేస్తూ, రైల్వే లెవెల్ క్రాసింగుల దగ్గిర గేటుపడితే కొంతసేపు ఆగవలసి వస్తుంది. అప్పుడు మనం రైల్వే అధికారులమీద, వారి పద్ధతుల మీద చిరాకు పడుతూ నోటికొచ్చినట్టు ఏదేదో అంటూ, ఆ కాలం గడుపుతాం. దానివల్ల రైలు తొందరగా వచ్చెయ్యదు. అందుచేత అలా వాగే బదులు రామనామ - లేక కృష్ణనామ స్మరణము చేసుకుంటూ, రైలు వెళ్లిపోయేదాకా కాలం గడిపితే, పుణ్యం, పురుషార్థం. (ఇలా ఇంకొక దగ్గిరా, మరొక దగ్గిరా కూడా చేసుకోవచ్చు.)

5. ఉన్నత శ్రేణికి చెందిన, గూఢమయిన, ఆధ్యాత్మికమయిన అభ్యాసాలలో "గురువు" వహించే పాత్ర అత్యంత ప్రాధాన్యము. గురువు తన శిష్యుడికి ఏవో బోధించి, మార్గదర్శక సూత్రాలను సూచించడంతో సరిపెట్టుకోడు. తాను ఆత్మజ్ఞానం గలిగిన ధన్యుడు గనుక,

గురువు తన శిష్యుడికి చేయూతనిచ్చి, తనతోపాటు ఆత్మ సాక్షాత్కార స్థితికి తీసుకుపోతాడు. దేవుడు భక్తుడికెంతో, గురువు శిష్యుడికి అంత. అదంతా జ్ఞానము చేత, ప్రేమచేత పరస్పర చర్యగా జరిగేది.

గురుర్బ్రహ్మ, గురుర్విష్ణు, గురుదేవో మహేశ్వరః- అని అందుకే అన్నారు. త్రిమూర్తులను తనలో ఇముడ్చుకుని, గురుః సాక్షాత్ పరబ్రహ్మ, తస్మై శ్రీ గురవే నమః అనిపించుకున్నవాడు, గురుభ్యోనమః అనికూడా అనిపించుకున్నవాడు.

అంతమాట అనిపించుకోగల గురువులు ఈ రోజుల్లో మిక్కిలి అరుదుగా దర్శనమిస్తారు. ఈనాటి అధునాతన, ధనప్రధాన అధ్యాపకులు, ఆనాటి ప్రేమాస్పదులు, జ్ఞానపూర్ణులు అయిన గురువులతో సరిపోల్చదగినవారుగా నిలవరు. అయినప్పటికీ, "గురువు" (అనేశక్తి) ఆవశ్యకత ఈ నాటికీ కూడా విస్మరణీయంకాదు- మరీనీ, శిష్యుడు తన అభ్యాసములో, ఆచరణలో ప్రారంభదశలలో ఉండి, అతనికి శారీరక సహాయము కన్నా మానసిక సహాయపు అవసరం ప్రముఖంగా ఉన్న కాలంలో. ఆధునిక గురువు ఆధ్యాత్మిక తత్త్వవేత్తగానో, మత బోధకుడుగానో, వలసినంత పరిపూర్ణ సాంకేతిక విజ్ఞానంతో లభించక పోవచ్చును. కాని, అతనిలో: సూచనలిచ్చే స్నేహితుడు, ఆలోచనా విధానాన్నీ భౌతిక చర్యలనీ పరిశీలించి ప్రభావం చూపించగల జ్ఞాని, ఆప్తుడు- ఇలా ఎవరెవరో ఉండవచ్చు. అలనాటి "గురువు"లలో ఈ అవసర లక్షణాలు అన్నీ ఒకే చోట రాశీభూతమై ఉండి ఉండవచ్చు; ఇప్పుడలా లేకపోవచ్చు, కాని, (ఇప్పటి గురువులలో కూడా) ప్రశాంత చిత్తులు, కలవరంలేని స్వభావాలవారు-ఉండవచ్చును. వారినుండి (ఏది ఎలా ఉన్నా) ఆగ్రహ నిగ్రహాన్ని గ్రహించుకోగలమేమో.

మరొక "గురువు" రూపుదాల్చిన తృప్తి, అతడు అవసరాలను గురించిగాని, అవసరాలు లేకపోవడాన్ని గురించిగాని, సణుగులాడడు. దారిద్ర్యపు లోతులలో, కోరికల కల్లోలంలో కూడా అతడు తనకున్నదానితోనే స్పష్టమయిన సంతృప్తిని పొందగలడు. అట్టి గురువు తృప్తి మార్గము చూపే "గురువు"గా స్వీకారార్హుడు.

ఇంకొకడు పుట్టుకనుండే అసాధారణ ఏకాగ్రతాశక్తిమంతుడై భాసిస్తాడు. మాట వరసకు అతనిని ఎంతో హడావిడి, గందరగోళం, ధ్వని, చీదర ఉండే చోట్లలో ఎక్కడ ఉంచినా, అతడు (విద్యలో, లేక ధ్యానములో, లేక బోధలో) తన ఏకాగ్రతను కోల్పోక, తన ధ్యేయముపై అవిభక్తమయిన శ్రద్ధతో ఉంటాడు. ఇట్టి గురువును ఏకాగ్రతకు "గురువు"గా స్వీకరించి, అతని మార్గదర్శకత్వమును గ్రహించవచ్చు.

ఆధునిక కాలంలో బడిలోనో, కళాశాలలోనో ఒక్కొక్క విషయానికి ఒక్కొక్క ఉపాధ్యాయుడు, అధ్యాపకుడు వచ్చి తమ బోధలను కొనసాగిస్తే స్వీకరిస్తున్న విధంగా; ఇప్పుడు చెప్పిన స్నేహానికి, తృప్తికి, ఏకాగ్రతకు తదితర విలువలకు వేరు వేరు గురువులను ఆశ్రయించవచ్చు. ఈ వేరువేరు గురువులు ఎక్కడో ఉండరు. వారిని గుర్తించగల దృష్టి వారినుండి నేర్చుకోగల వినయమూ ఉండాలేగాని, వారు మన ఇళ్లలో పెద్దల

రూపంలోనో, జీవిత సహచారుల రూపంలోనో ఉండవచ్చు, మన కార్యస్థానాలలో సహచరులుగా, సేవకులుగా ఉండవచ్చు.

అట్టివారిని అందరినీ (ఆయా రంగాలలో, ఆయా విషయాలలో) గురువులుగా స్వీకరించి వారి వ్యక్తిగత బలహీనతలను, చాంచల్యములను పట్టించుకోకుండా; వారితో స్నేహముచేసి, వారితో చనువుగా ఉండి, వారికి మన బలహీనతలు వివరించుకొని, మనలను పరీక్షించి సరిదిద్దే అధికారము వారికి ఇచ్చి, మనము దారి తప్పినప్పుడు మనకు ఋజుమార్గము సూచించే అవకాశము ఇచ్చి; మనము మన బలహీనతలను అధిగమించి అజ్ఞాన సాగరాన్ని దాటడానికి అన్నిరకాల ప్రయత్నాలు చేయాలి.

అన్నిటికీ మిన్నగా: వారికి విధేయులముగా ఉండాలి.

'నిర్ణయ, నిశ్చయ ప్రతిపత్తి' అని చెప్పుకున్న విధంగానో, ఇంకో రకంగానో; వారి సలహాలను నిరభ్యంతరంగా పాటించడానికి గాను, మన నిర్ణయశక్తిని పరిపూర్ణంగా ఉపయోగించు కోవాలి. అలా చేస్తే, భగవద్గీత సూత్రాలను అభ్యసించడానికి గాను, మనసును పరిశుభ్రం చేయడంలోనూ, శిక్షణ ఇవ్వడంలోనూ, సిద్ధ పరచడంలోనూ; ఒక గొప్ప ఉపచారం చేకూరుతుంది.

మనసును క్రమశిక్షణలో పెట్టుకోడానికి వినియోగించే ఎంత సమయం అయినా, ఎంత శక్తి అయినా వృథా కాదు. మనసును అదుపులో ఉంచగలవారు ప్రకృతి శక్తులను కూడా అదుపులో ఉంచగలుగుతారు. ★

## నాలుగవ భాగము

# సాధన

## పదవ ప్రకరణము

# భగవద్గీత వచించే ముఖ్య బోధలు

మానవుడు మోక్షము పొందడానికి అవలంబించగల మార్గాలు నాలుగింటిని భగవద్గీత బోధిస్తుంది. ఈ నాలుగింటిలో ఏ ఒక్క మార్గం ద్వారాగాని, అన్ని మార్గాల ద్వారాగాని మోక్షము పొందవచ్చునని.

1. నిర్లిప్తతతో పనిచేయడము.
2. భక్తితో ప్రార్థన చేయడము.
3. జ్ఞానమును సముపార్జించడము.
4. రాజయోగమును అభ్యసించడము.

వీటిలో నాలుగవదిగా చెప్పిన రాజయోగ మార్గం- దానికదే ఒక ప్రత్యేకమైన శాస్త్రం. దానిని నేర్చుకోవడం, అభ్యసించడం, సిద్ధహస్తుడయిన గురువు ద్వారానే చేయవలసి ఉంటుంది. కాబట్టి దానిని ఈ పుస్తకం పరిధిలో చేర్చలేదు.

మూడవది జ్ఞానమార్గం. ప్రారంభదశలో దీనిని మేధాసంబంధమయిన అభ్యాసంగా స్వీకరించవచ్చు; (ఆ పరిజ్ఞానం కోసం) తత్త్వ శాస్త్ర గ్రంథాలను అధ్యయనము చేయవచ్చు. కాని, మనకు సంబంధించినంతవరకు అది పై పై జ్ఞానమే అవుతుంది. అసలైనది, సంపూర్ణమయినది అయిన జ్ఞానం కేవలం ఆధ్యాత్మిక అనుభవం వలన మాత్రమే పొందవచ్చు. అందుకుగాను వ్యక్తి స్వభావానికి నైతిక పునర్నిర్మాణము జరగాలి. దానికి "గురువు" దీవెనచాలా సహాయం చేస్తుంది.

భక్తిమార్గం రెండవది. మనలో చాలామందికి సులువుగా అందుబాటులో ఉండేది. భగవంతుడిమీద ప్రగాఢమయిన నమ్మకం ఉంటే, అది అభ్యాసంలో ప్రార్థన రూపంలోకి పరివర్తితమవుతుంది. ఆ భగవంతుడు ఈశ్వరుడా, విష్ణువా- అనేవి అంత ముఖ్య విషయాలు కావు. ముఖ్యమయినదల్లా ఆ ప్రార్థన శ్రద్ధగా చేయాలి. ఎంత శ్రద్ధ ఉంటే, అంత ఫలితం.

ద్వితీయ, తృతీయ మార్గాలకు ప్రథమ మార్గంతో- అనగా నిర్లిప్తతతో- సన్నిహిత సంబంధం ఉంది. (నిర్లిప్తత లేకపోతే, జ్ఞానమూ అలవడదు, భక్తి కూడా.) ఈ మూడు మార్గాల మధ్య ఎట్టి పరస్పరమయిన వైరుధ్యం లేదు. అంతేకాక, అవి ఒకదానికొకటి అనుబంధాలుగా ఉంటాయి. వాటి కలయిక ఒకానొక త్రివేణి. ఈ ముప్పేటతాడులో నిర్లిప్త కార్యాచరణ అనే(మొదటి)ది బలవత్తమమయినది. నిజానికి ఈ మూడు భిన్నమార్గాలను ముగ్గురు అనుసరిస్తూ ఉన్నారనుకుంటే, ఆ ముగ్గురి దారులు అభ్యాసపు ఉచ్చతలంలో సమరూపాలవి అవుతాయి. భగవద్గీత యందలి ఊనిక మొదటి

మార్గమయిన నిర్లిప్తతపై ఉంది. కనుక: రెండవ, మూడవ మార్గములయిన భక్తి- జ్ఞాన మార్గాలను గురించి, భగవద్గీతలో వాటికి ఇచ్చిన ప్రాధాన్యాన్ని అనుసరించి; చర్చించు కుందాము. (అయితే, మొదటి మార్గం ఊనికే బలవత్తరమయినదిగా నిలుస్తుంది.)

నిర్లిప్తత అన్నా ఉద్వేగరాహిత్యం అన్నా ఒకటే. ఒక పని చేస్తాం. చేసేటప్పుడు దానిమీద పూర్తిగా మనసుపెట్టి చేస్తాం. చేసినపని ఒక్కొక్కప్పుడు సమంగా కుదురుతుంది, ఒక్కొక్కప్పుడు కుదరదు. ఏ సందర్భంలోనూ కూడా మనల్ని మనం మెచ్చుకోడం (లేదా మనలో మనం) నొచ్చుకోడం జరక్కూడదు. అదే నిర్లిప్తత. ఇది అనుకున్నంత (అనిపించినంత) సులభం కాదు. నిజంగా అలా అయినట్లయితే; ప్రపంచపు (నిర్లిప్తతను గురించి వచించిన) ప్రాచీన, ఆధునిక పవిత్ర గ్రంధాలన్నిటికీ తలమానికంగా భగవద్గీత భాసించేదేకాదు.

సిద్ధాంతపరమైన వ్యాఖ్యానాల సంగతి అలా ఉంచితే; నిర్లిప్తత, ఉద్వేగ రాహిత్యం- అభ్యాసంలో మాత్రం మిక్కిలి కష్టతరం. సగటు మనిషి ఎన్నెన్నో (మంచి) లక్షణాలని అలవరుచుకోవచ్చు. నిజమైన నిర్లిప్తత వాటిలో పరాకాష్ఠ. రాగ- క్రోధ- భయాలనే మూడు బలహీనతలకీ లొంగకుండా వాటిని (అతడు) అదుపులోకి తెచ్చుకోవాలి. చలీ-వేడీ, బాధా-ఆనందం, గౌరవం- అవమానం; వేటి వల్లా చలించకుండా (అతడు తన) అంతః స్వభావాన్ని శిక్షణ పరచుకోవాలి. ఒక మట్టి బెడ్డగాని, ఒక బంగారపు కణిక గాని అతని దృష్టిలో సమానం అవాలి. (తనకి- లేదా తన చుట్టు పట్ల సంభవించే) మంచిని చూసి ఆనందించడం, చెడుని చూసి చిరాకుపడడం- అనే రాగద్వేషాలకు (అతడు) అతీతుడై ఉండాలి. జీవితంలో తటస్థపడే నిమ్నోన్నతాలకిన్నీ అతీతుడు అవాలి. ఇంద్రియాలను (గుణాలను) నిర్జించి (దివ్య) జ్ఞానం వల్ల తృప్తి చెందాలి. అప్పుడు: నిర్లిప్తత అనే ఆ (మహా) లక్షణం ప్రాప్తిస్తుంది.

**స్థితప్రజ్ఞుడు**

**దుఃఖములు కలిగినప్పుడు మనసులో క్షోభపడక,**
**సుఖములయందు ఆసక్తి లేక,**
**రాగ-క్రోధ-భయములను విసర్జించగలిగేవాడు.**

-శ్రీమద్భగవద్గీత, సాంఖ్యయోగము.56

**సుఖదుఃఖాలను, మృత్తికా-స్వర్ణములను,**
**బాధా-ఆనందములను, గౌరవ- అవమానములను •**
**సమదృష్టితో చూడగలిగే (తనయందే ప్రతిష్ఠితుడయిన) వాడు.**

-శ్రీమద్భగవద్గీత గుణత్రయ విభాగయోగము·24

దేవానాం ప్రియుడు
రాగద్వేష రహితుడు, దుఃఖ-వాంఛారహితుడు,
శుభాశుభాతీతుడు, భక్తి పూర్ణుడు.

-శ్రీమద్భగవద్గీత, భక్తి యోగము:17

శత్రువులు-మిత్రులు అనీ, గౌరవము-అవమానము అనీ,
సుఖము- దుఃఖము అనీ, చలి-వేడి అనీ,
సహచరుడు-వివర్జితుడు అనీ; భేదములు చూపనివాడు.

-శ్రీమద్భగవద్గీత భక్తి యోగము:18

ఇదంతా సాధించాలంటే, మానవుడు కఠోరమయిన క్రమశిక్షణతో, నియమ బద్ధమయిన అభ్యాసముతో తన జీవిత కాలమంతా వెచ్చించవలసి వస్తుంది. అయితే, ఆచరణాదుష్కరములవలె కనిపించే ఈ గుణాలజాబితా తడబాటు కలిగించేదిగా తోచినా, నిరుత్సాహపడవలసిన అవసరం లేదు. సాధకుడు అధిరోహించవలసిన నిర్లిప్తతా శిఖరాలు అత్యంత సమున్నతమయినవి. ఆ అధిరోహణ అంచెలంచెలుగా సాగాలి. దానికోసం శాస్త్రబద్ధంగా ఏర్పరచిన పద్ధతులను గురించి, ప్రణాళికలను గురించి చెప్పుకుందాము. ప్రారంభదశలో ఈ పద్ధతి అవరోధభరితంగా ఉన్నట్టు తోచినా, కాలానుగతంగా మార్గం సుగమమవుతుంది. ఆధునిక జీవితం ఏ ఆధ్యాత్మిక అభ్యాసానికయినా భయంకరమయిన అవరోధాలను నిలుపుతుంది. అయినా సరే, దానిని లక్ష్యపెట్టకుండా మనము అవలంబించగలిగే మార్గం ఒకటి ఉంది. ఆ మార్గంలో అవిచ్ఛిన్నంగా, నిర్ణయశక్తితో అభ్యాసం చేసుకుంటూ పోతే, కొంత కాలంలో (అలా) సుగమమయి పోతుంది. ఆ మార్గం ఎంతో కష్టం కావచ్చు. కాని, దాని ఫలితంకూడా అంతకంతా సుఖదాయకము. మనము మనకార్యభారాలకు, సామాజిక బాధ్యతలకు- ఏ విధంగానూ అవరోధం కలిగించుకోకుండానే, కోటీశ్వరులకు కూడా పరితాప మానమయ్యే ఒకానొక అవర్ణనీయమయిన అంతరానందాన్నీ, శాంతినీ, తృప్తినీ అనుభవించగలుగుతాము.

అంతేకాదు. కృష్ణపరమాత్మ వాక్యాలను నమ్మకుంటే, ఆ అభ్యాసం మన అంతిమ ధ్యేయమయిన ముక్తికి దారితీస్తుంది.

(తనకు నైమిత్తికములయిన ప్రాపంచిక కర్మలను
నిర్వహించుకుంటూనే- తానొక కర్మయోగి అనిపించుకుంటూ-
ఉండే) అతడు నా వద్ద రక్షణ పొంది, నా అనుగ్రహము వలన,
శాశ్వతము, నాశనము లేనిది అయిన స్థానము పొందుతాడు.

-శ్రీమద్భగవద్గీత, మోక్ష సన్న్యాసయోగము:56

కనుక, ఈ ప్రణాళికను ఆచరణలో పెట్టడానికి మిక్కిలి శ్రద్ధతో సాగవలసి ఉంది. ★

## పదకొండవ ప్రకరణము

# క్రోధ నియంత్రణ

భగవద్గీత అభ్యాసాన్ని నియమబద్ధమయిన ఆచరణలో పెట్టుకోవడం విషయానికి వద్దాము. భగవద్గీత అభ్యాసమార్గంలో మనకు కొన్ని ఎదుర్రాళ్ళు తగులుతాయి. వాటిలో మొదటిదిగా "క్రోధం"ను తీసుకుందాము. ఎందుకంటే, ఈ క్రోధం అనేది (ఎందు కొచ్చింది, ఎంత వచ్చింది అనే) విశ్లేషణకి, దాని తరణానికి అనువయినది. అలాగని అదేదో సామాన్యమయినదిగా చిన్నచూపు చూడడానికి వీలయిన స్వల్ప విషయం కాదు. కనుక, దాటవెయ్యకుండా (పట్టించుకోవడం అనవసరం అని వదిలెయ్యకుండా) చెప్పుకో డానికిగాను ఈ ప్రకరణము. ఈ ప్రకరణమే కాదు. దీని తరువాత వచ్చే అన్ని ప్రకరణాలూ అలాటివే. మన అంతిమ ధ్యేయ సాధనకోసం మనసుని శిక్షణలో పెట్టే కార్యక్రమానికి ఏప్రకరణంపని దానికి ఉంది. స్వభావరీత్యా సులువుగా ఆగ్రహ (పర) వశులు కానివారుకూడా ఈ ప్రకరణాన్ని - అనగా ఇందులో క్రోధాన్ని గురించి, దానిలోని ఇరకాటాలను గురించి: చెప్పిన విషయాలని- శ్రద్ధగా అవలోడనం చేసుకుంటే; దీని తరువాత వచ్చే ప్రకరణాలలో చెప్పే విషయాల అవగాహన కోసం అవసరమయిన మానసిక క్రమశిక్షణకి ఒక సామాన్య నేపధ్యం ఏర్పడుతుంది.

తనకోపమే తన శత్రువు- అన్నారు: కోపం తెచ్చుకోవడం వల్ల (దానిని ప్రదర్శించడం వల్ల) చాలా అసౌఖ్యకరమయిన పరిణామాలు సంభవిస్తాయన్నది (అందరికీ) తెలిసిన సంగతే. మాటవరసకి కోపంలో ఉన్నప్పుడు ముఖ కవళికలు అసంబద్ధంగా, వికృతంగా తయారవుతాయి. నిర్ణయశక్తి పోతుంది. ఆవేశంలో అనే కొన్ని మాటల వలనగాని, చేసే చేతలవలన గాని- కొంత సమయం గడిచాక- పశ్చాత్తాప పడవలసి వస్తుంది. ఇతరులకు చిన్నచూపు, చులకన భావం, విరోధం కలిగి, కసితీర్చుకునే మనఃస్థితికి వారిని ప్రేరే పిస్తుంది. ఆఖరికి ఆరోగ్యంమీద కూడా ప్రభావం కలిగి, అజీర్ణం నుండి ఉన్మాదంవరకు ఏదయినా కలగవచ్చు.

ఇంకొక కీడు ఉంది. ఇది ఎంతో ఉపద్రవకరమయినదే కాని ఎవరూ గుర్తించరు. కోపం వల్ల మన స్వభావంలో ఉన్న నిబ్బరం పోతుంది. వేరుపురుగు చేరి వృక్షమును చెరిచినట్టు మన ప్రయత్నాలన్నీ వృధా అయిపోతాయి. కోపం మనతో ఉన్నంత కాలం గమ్యం చేరడానికి చేసే ప్రతి ప్రయత్నం ఓటమికి గురయి నిష్ఫలమవడం తథ్యం.

**కోపమువలన భ్రాంతి, భ్రాంతి వలన మతి భ్రమణము,**
**మతిభ్రమణము వలన వివేచనాలోపము కలిగి,**
**వివేచనాలోపము చేత వ్యక్తి భ్రష్టత్వము పొందును.**

-శ్రీమద్భగవద్గీత సాంఖ్యయోగము:63

అందుచేత కోపాన్ని మన స్వభావము నుండి సంపూర్ణంగా తొలగించి, అభ్యాసాన్ని మొదలుపెట్టవలసి ఉంది. కోపం రావడానికి చాలా కారణాలు ఉంటాయి. స్వభావంలోనే అది ఉండవచ్చు. అధికారులు నిష్కారణంగా వేధించినా, క్రింది ఉద్యోగులు అవిధేయత్వం చూపినా, సహోద్యోగులు మోసం చేసినా, ఇతరులు తమ కుయుక్తుల వలన నష్టపరిచినా, అప్పు తీసుకున్నవాడు లేదు పొమ్మన్నా, దండగులు చెయ్యి చేసుకున్నా - ఇలాగ నిగ్రహం కోల్పోవడానికి (కోపం తెచ్చుకోవడానికి) వేలాది కారణాలుండవచ్చు. ఒక్కొక్కప్పుడు మన క్రోధం సమంజసమయినది, న్యాయసమ్మతమయినది కూడా కావచ్చు. మొత్తానికి కారణమేదయినా, న్యాయమేదయినా కావచ్చుకాని - కోపమనేది సంభవించడం వలన- అది భగవద్గీతలో చెప్పిన ఆశయాలకు అర్హత పొందే అమూల్యమయిన ధ్యేయం మీద దెబ్బతీస్తుంది కనుక, నష్టపోయేది మనమే.

కోపాన్ని అదుపులోకి తెచ్చుకోవడానికిగాను కొన్ని సూచనలను పాటించడానికి ప్రయత్నించవచ్చును.

1. కోపాన్ని నిగ్రహించుకోవాలి, అది ఒక ముఖ్యమయిన విషయం, అది మన సొంత నిర్ణయం; అనేవి అన్నిటికంటే ముందు పూర్తిగా అర్థం చేసుకోవలసినవి. మనం అలాంటి నిర్ణయం తీసుకోకపోతే, ఎన్ని నిబంధనలు ఏర్పరచుకొన్నా ఏమీ లాభం లేదు. బలమయిన, మనఃపూర్వకమయిన నిర్ణయం అన్నిటికంటె ముందు నిలవాలి. అప్పుడే ఏ ప్రయత్నానికైనా, ఏపాటి అయినా విజయం సంభవిస్తుంది.

గాలివాటుగా చేసుకునే నిర్ణయాలు ఎందుకూ పనికిరావు. సరయిన నిర్ణయం కుదరాలంటే తెల్లారగట్ల నాలుగు గంటలకి లేచి ప్రశాంతంగా కూర్చొని, మనలో మనం ఆలోచన, చర్చ చేసుకోవాలి. కోపమనేది బలవద్విరోధి. దానితో చేసే యుద్ధం కఠినంగా ఉండి, దానిని ఎదుర్కొని గెలవడంలో ఎంతో అసౌకర్యం ఉంటుంది. "నిర్ణయ నిశ్చయ ప్రతిపత్తి" అనే ప్రకరణలో చెప్పిన పద్ధతులను అనుసరించి, ఈ అనుచితమయిన భావాన్ని మనస్వభావమునుండి బహిష్కరిస్తున్నట్టు మనకు ఇష్టమయిన వ్యక్తిమీద ఒట్టు పెట్టుకోవాలి. అవసరమయితే, ఒకరోజు పనిమానేసి దీనికోసమే, దీనిమీదనే ఏకాగ్రంగా ఆలోచన సాగించి, "అవును, ఇలాగ చెయ్యవలసిందే. ఇలాగ చేస్తాను. ఇలాగ చేసి తీరుతాను." అని ఒకటికి పదిసార్లు మనకి మనం చెప్పుకోవాలి. అలాచేస్తే తప్ప, నిర్ణయం అనేది దాని అసలురూపంలో సంభవించదు, ఉద్భవించదు. (ఆగ్రహాన్ని నిగ్రహించుకోవాలి అనే కేవల 'వాంఛ' దాని పరిపూర్ణ 'పరిష్కారం' కాదు.)

2. సరే, నిర్ణయము తీసుకున్నాము. అయితే, ఈ రోజుగాని, ఈవారంలోపల గాని మనకు కోపం రప్పించే సంఘటనలు ఏమి జరగనున్నాయి. అని: ఎంతవరకు సాధ్యమయితే, అంతవరకు ముందుచూపు కొనసాగించాలి. మన కర్మాగారంలోని కార్మికనాయకుడు అడ్డూ ఆపూ లేని భాషతో మనమీద(వాగ్యుద్ధాని)కి రావచ్చు. బద్ధకం బలిసిన ఆ సెక్రటరీ రేపు ఉదయానికల్లా కావలసిన కాగితాలు తయారు చెయ్యడు.

మనం బోలెడు డబ్బు పెట్టిన ఒక ఆర్థిక సంస్థ లావాదేవీలు కొన్నాళ్లనుంచి ఎంత అనుమానాస్పదంగా ఉంటున్నాయంటే మన పెట్టుబడి అంతటికీ పైసాకూడా రాని పద్ధతిలో వాళ్లు రేపే బోర్డు తిప్పేసి, పారిపోయేటట్టుగా ఉన్నారు. ... ... ... ఇలా కొన్ని విషయాలను ఆలోచనలోకి తెచ్చుకోవచ్చును. అప్పుడు ఆరకం ముందాలోచన వలన కొంత సమయం కలిసొచ్చి, మనం ఏ సంఘటనని ఎలా ఎదుర్కోవాలో తెలుస్తుంది. ఏ ఆపదకయినా ముందాలోచన ఉత్తమమయిన కవచం లాంటిది.

3. రాబోయే పరిస్థితిని గురించి ముందుగానే సాధ్యమయినంత సరిగా ఊహించిన తరువాత, జరగబోయే సంఘటనకు మనల్ని మనం సిద్ధం చేసుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ కోపం తెచ్చుకోకూడదని మనం తీసుకున్న నిర్ణయాన్ని, అతిశ్రద్ధగా పదే పదే మననం చేసుకోవాలి. ఏది ఏమైనా సరే, అతన్ని కలిసినప్పుడు కోపంతో రెచ్చిపోకూడదు. అతడు బిగ్గరగా అరిస్తే మనం నెమ్మదిగా మాట్లాడాలి. అతడు బెదిరిస్తే మనం చిరునవ్వు నవ్వాలి. అతడు రెచ్చగొడితే మనం అప్పటికి ఊరుకొని ఉండి, చెయ్యవలసిందేదో తరవాత చెయ్యాలి. అతని ద్రోహబుద్ధి బైటపడితే మాత్రం మన తడాఖా ఏమిటో మాటల్లో కాక చేతల్లో చూపించాలి. దిగువస్థాయి ఉద్యోగి అయివుండీ కూడా తన ముఖ్యమైన విధిని విస్మరించినందుకు చివరి హెచ్చరికగా ఒక మాట చెప్పాలే గాని కోపంతో రెచ్చిపోకూడదు. అలాటి చివరి హెచ్చరిక (అతనికి) ఇంతకు పూర్వమే చేసి ఉండడం జరిగితే మాత్రం ఇహ ఆగక్కర్లేదు. అతని కర్తవ్య నిర్వహణా వైఫల్యానికి తగిన శిక్షగా: అనుల్లంఘనీయమైనది, వ్రాతపూర్వకమైనది అయిన ఆజ్ఞను నిశ్శబ్దంగా జారీ చెయ్యడమే పని. అంతేగాని అక్కడికక్కడ ఆగ్రహాన్ని ప్రదర్శించకూడదు.

(కింది ఉద్యోగితో ఎలాటి సంయమం అవలంబించామో అధికారిపట్ల కూడా అలాగే ఉండడానికి ప్రయత్నించాలి.) అతడు అధికారి. అతడు మనపై కోపం చెందడం (ఒక్కొక్క సందర్భంలో) అన్యాయం అని మనకు తెలుస్తుంది. అతను మొహాన్ని క్రూరంగా పెట్టి, ఎరుపెక్కించుకుని మనమీద విరుచుకు పడవచ్చు. కాని మనం మాత్రం శాంతంగా, నిగ్రహంగా ఉండి, మన ముఖకవళికలను ఎప్పటివలె నిలుపుకుంటాము.

ఆయా సందర్భాలలో, ఆయా వ్యక్తులపట్ల, ఆయా విధాలుగా ప్రవర్తించాలని చేసుకున్న నిర్ణయాలు భార్యకుగాని, వయోధికుడయిన ఒక స్నేహితుడికి గాని వివరించి చెప్పి; సాయంకాలం ఆఫీసునుండి ఇంటికి రాగానే ఆ నిర్ణయాలు అనుకున్నవిధంగా అమలు పరచగలిగే సంగతి చెప్పగలనని మాట ఇవ్వాలి.

కోపాన్ని ఆపుకోవడం విషయంలో ఆయా సందర్భాలను బట్టి, ఎంత వ్యవధి ఉంటే, అంత ముందాలోచన సాగించాలి. ఆలజడి రానున్నదని తెలిసిన వేళకి కొంత ప్రశాంతత ఉంటుంది. దానిని పైన చెప్పిన విధంగా నిర్మాణాత్మకంగా ఉపయోగించుకుంటే అవసరం పడే సమయాన కోపాన్ని అదుపులోకి తెచ్చుకునే విషయంలో పరిస్థితి మనకు కనీసం సగం అనుకూలంగా ఉంటుందని అనుకోవచ్చు; (అవసరమంటూ పడితే మాట.) కోపం

వస్తుంది, దానిని అదుపులో పెట్టుకోవలసిన అవసరం వస్తుంది, అప్పుడు ఫలానా విధంగా ప్రవర్తించుకుందాము- అని మనం సిద్ధపడ్డాం. అయితే, అదృష్టవశాత్తూ మనకు కోపం కలిగించే పరిస్థితే సంభవించక పోవచ్చు. (అలా కూడా అప్పుడప్పుడు అవుతూ ఉంటుంది.) మరీ మంచిది. మన మానసిక శిక్షణ బలపడింది. ఆ విధంగా (ఏ సత్కార్యానికయినా) సిద్ధం అయినవారు విజయపథంలో సగందూరానికి చేరుకున్నట్లే.

ఇంతటి పూర్వాభ్యాసం చేసినా యాదృచ్ఛికంగా ఒకానొక అనుకోని పరిస్థితి తగిలి, మన ప్రయత్నాన్నంతటినీ తుస్సుమనిపిస్తుంది. ఈ అనుకోని పరిస్థితి అనేది; మన ఊహకు అందని దిశనుంచి మనం కలవరపడేటంత ఆకస్మికంగా వచ్చి మీద పడుతుంది. ఆ పరిస్థితిలో మనం తగని కోపానికి గురి అవుతాము. అటువంటప్పుడు యాంత్రికంగా కొన్ని మార్గాలను అనుసరించవలసి వస్తుంది. వాటిలో కొన్నిటిని చెప్పుకుందాము. (చెప్పుకొనే వాటిలో అవసరమయినవి, సాధ్యమయినవి ఏమిటో తెలుసుకుని పాటించ వచ్చు.)

4. ఒక్కొక్కప్పుడు కోపం మెరుపులా వచ్చి పడుతుంది. అలాటప్పుడు వెంటనే నిశ్శబ్దం వహించడమే దానికి మిక్కిలి అందుబాటులో గల ప్రథమ చికిత్స. నిశ్శబ్దంలో ఉండే సుఖం ఏమిటంటే, ఆ ఉద్వేగ సమయంలో మనం నోరుపారేసుకోకుండా బుద్ధిని స్వాధీనం చేసుకోవడానికి అవకాశం దొరుకుతుంది. ఆ కొద్దిసేపు మౌనం గడిచే లోపుగా ఆగ్రహం తనకు తానే నిష్క్రమించవచ్చు; ఎందుకంటే, మెరుపులా వచ్చేది, మెరుపులాగే మాయమవుతుంది.

5. మరో సమయంలో కోపం ఉరుములాగా (వర్షానికి) కొంచెం వ్యవధి ఇచ్చి వస్తుంది. అప్పుడు వర్షం వచ్చేటప్పుడు ఆరుబయటినుంచి ఎలా తప్పుకుంటామో అలాగే ఉన్న చోటినుండి, వేరే చోటికి మారిపోవాలి. అక్కడ ఉండే ఇంకొకరకం స్నేహితుల సంభాషణలో పాలుపంచుకుంటే, స్థలం మారి, ఆలోచనా విషయం మారి, కోపం మనలను ప్రభావితం చెయ్యలేకపోతుంది.

6. సరే, కోపం వ్యవధి ఇవ్వకుండా, సూచనకూడా లేకుండా వచ్చింది అనుకుందాము. అప్పుడు, ఎక్కడుంటే అక్కడ ఉండిపోయి బొత్తిగా సందర్భంలేనిదో, అసంబద్ధమయినదో అయిన రాతలోగాని, చదువులోగాని, లీనమైపోవాలి. అంతకంటే కూడా మన ఇష్ట దైవం నామాన్ని లోపల్లోపల జపించుకోవచ్చు. లేదా "క్రోధాద్భవతి సమ్మోహః"- అనే శ్లోకాన్ని ఒకటికి రెండు సార్లు మననం చేసుకోవాలి. అలా చేసుకుంటే, అందువల్ల మన భావోద్వేగం తగ్గడమే కాక, మన ప్రవర్తనలోకి ఒక పరిశుద్ధత చేకూరుతుంది. ఏది ఎలా ఉన్నప్పటికీ ఈ అభ్యాసప్రక్రియ (మన) ఆవేశ ప్రకృతి చల్లారడానికి కాల వ్యవధిని కల్పించి, మనలను మన మామూలు స్థితికి తెస్తుంది. ఆ స్థితివల్ల, మనకు తటస్థపడే పరిస్థితిని ప్రశాంతంగా, సమంజసంగా ఎదుర్కోగలము.

7. మనలో కోపం చెలరేగే సూచన కనబడినప్పుడు, రహస్యంగా హెచ్చరించమని నమ్మకస్తుడయిన సేవకుడికో, వ్యక్తిగత కార్యదర్శికో; పురమాయించుకుని ఉంచుకోవాలి.

దానిప్రకారం వారు చేసే హెచ్చరికను ఒక సేనాధిపతి ఆజ్ఞవలె పాటించి, మనలను మనం అదుపులో పెట్టుకోవాలి.

8. కోపావేశ సూచన కలిగినపుడు అవతలివ్యక్తితో నిందా రహితమయినవి, హుందా సహితమయినవి: ఛలోక్తులు వేసుకోవచ్చు; లేదా, పూర్వం ఎప్పుడో ఉభయ పక్షాలవారు చూసి, ఆనందించిన హాస్య సంఘటనలనో, అనుకరణలనో గుర్తుచేయవచ్చు. ఈ రెండిటిలో ఏ పద్ధతిలో వెళ్లినా, అది ఇరుపక్షాలలో ఉన్న వైరస్యాన్ని తప్పించి, కోపానికి విరుగుడుగా పనిచేస్తుంది.

9. ఎన్నిటి గురించో, ఎన్నో చెయ్యాలని ఎన్నోసార్లు అనుకుంటాం. అవరోధాలు ఎలా వస్తాయో, సదుపాయాలు ఎలా సమకూరవో- మనం ఊహించుకోలేం. ఫలితంగా, అనుకున్న పనులు గాని, చేసుకొన్న ఆలోచనలు గాని నెరవేరవు. అలాగే కోపాన్ని అదుపులో పెట్టుకోవడానికి గాను మనం చెప్పుకున్న ఇన్ని మార్గాలుకూడాను. అయితే, దీనికి మరో మహా చికిత్స ఉంది- దానిని ఆచరించగల ధైర్యం, దక్షతా ఉండాలేగాని. అన్ని రకాల సంసిద్ధతలకు, ముందు జాగ్రత్త చర్యలకు లొంగక మనకోపమే విజృంభించినా, అది ఒకటి రెండు రోజులలో చప్పగా చల్లారిపోతుంది. అయ్యో, ఈ కోపమేమిటి, దీనికి లొంగిపోవడ మేమిటి, ఇంత దురదృష్టకరంగా మన ఆత్మబలం తుడిచి పెట్టుకు పోవడమేమిటి- అనిపిస్తుంది. అప్పుడు ఏం చేయాలంటే, మన కోపానికి గురైన అవతలి వ్యక్తి (మన ఆజన్మ విరోధి అయినా సరే; మనకింద పనిచేసే సేవకుడే అయినా సరే;) అతన్ని పట్టుకుని, ఇదంతా చాలా సిగ్గుచేటయిందని స్పష్టంగా చెప్పేసి, క్షమాపణ కోరుకోవడమే పని. సిగ్గు చేటయిందని చెప్పుకోవడం నిజంగా చాలా కష్టమే. కాని, అటువంటి తప్పు మళ్లీ ఇకముందు జరక్కుండా చాలా శ్రేయస్కరంగా కాపాడుతుంది, అది. ఈ పద్ధతిలో సాగాలనీ, ఎప్పుడవసరం అయితే అప్పుడు దీనిని అవలంబించాలనీ ఖచ్చితమయిన నిర్ణయం తీసుకుంటే, రెండు మూడుసార్లు విఫలమయినా సరే, సిగ్గుచేటుతనంచేత, క్రమంగా; కోపాన్ని అనవసరంగా బయటపెట్టుకోవడం మానేసి, దానిమీద అదుపు సాధించుకో గలుగుతాము. (మనవల్ల కోపం ప్రదర్శితమయినప్పుడు అవతలి వ్యక్తి వద్దకు వెళ్లి, బేషరతుగా క్షమాపణ కోరడమే ముఖ్యం. మిగతాదంతా దానంతటదే జరిగి పోతుంది.)

ఈ సందర్భంలో దీనికి సంబంధించిన మరొక సలహా చెప్పుకోవచ్చు. భగవద్గీత అనుష్ఠానానికి గాను ఉద్దేశించి రూపొందించిన ఈ గ్రంథం మనకు పరిపూర్ణ ప్రయోజనాన్ని చేకూర్చాలని కోరుకుంటే, దీనిలో చెప్పిన (చెప్పబోయే) సూచనలకు అంగీకారంగా తల ఊపితే సరిపోదు. దీనిని అనుష్ఠాన భగవద్గీతలోని ఒక పాఠంగా గ్రహించవలసి ఉంది. ఆ పాఠము వలన సత్ఫలితము అనుభవించాలంటే, ఈ విషయంలో ఎంత సిద్ధాంత వివరణ చేసుకున్నప్పటికీ, అది కొద్దిపాటి అభ్యాసానికి సాటిరాదు. అభ్యాసం తీవ్రంగా, నిరవధికంగా సాధ్యపరచుకుంటే, ఎంతటి లోతయినది,

హానికరమయినది అయిన అలవాటయినా, ఎంతటి దీర్ఘకాలిక, మానసిక నియమో ల్లంఘన ప్రవృత్తి అయినా, లొంగిపోతుంది. అందుకని ఈ సూచనలను నిత్య జీవితంలో అన్ని మామూలు కార్యక్రమాల (సంఘటనల) పట్ల అమలు పరచుకోవాలి. అలా చేస్తే, మన అంతరంగ నిర్మాణాన్ని, బాహిర పరిస్థితులని అనుసరించి కాలక్రమంగా- కొన్ని వారాలలో కావచ్చు లేదా, కొన్ని నెలలలో కావచ్చు- కోపం అనే ఈ అవాంఛనీయమయిన మనఃస్థితి మన అదుపులోకి వచ్చి తీరుతుంది. అట్టి ఔన్నత్యాన్ని సమీకరించుకొని, దానిమీద అచంచలమయిన ఆధిపత్యాన్ని వ్యవస్థాపించుకోవడానికి గాను మనం మరో రెండు అడుగులు వేయవలసి వస్తుంది.

**10.** ఒకటి: మన పరిచారకులపైననో, ఇతరుల పైననో- వాళ్లకు ఏదయినా పని ఒప్పగించేటప్పుడు- స్వల్పంగా కోపాన్ని ప్రదర్శించవచ్చు. అయితే, అది నిజమయిన కోపంగా అధః పరిణామం చెందకుండా చూసుకోవాలి.

**11.** రెండు: మనలని రెచ్చగొట్టే పరిస్థితులను ఆహ్వానించుకుని వాటి మీద దాడిచేసి; అప్పటికీ గుండెల్లో కలవలరం కలగలేదని, ప్రశాంతంగానే ఉందని (పరీక్షించుకుని) నిర్ధారణ చేసుకోవాలి. దీనికోసం మన చతురమిత్రులెవరయినా వలపన్ని, మనకు తెలియ కుండానే, మనకు పిచ్చి కోపం రప్పించే సంఘటన కల్పించేటట్లుగా చూడాలి. మనం దాంట్లోంచి విజయవంతంగా బైటపడగలిగితే, కోపంమీద స్థిరమయిన ఆధిపత్యం వ్యవస్థాపించుకున్నట్టేనని, భగవద్గీతను నిత్య జీవితంలో సాధించుకోవడమనే ఆశయపు అసలు మార్గంలో పడినట్టే అని భావించవచ్చు. ★

## పన్నెండవ ప్రకరణము

# భయాన్ని బహిష్కరించడం ఎలా?

బడిపిల్లవాడికి బెత్తం అంటే భయం. హంతకుడికి ఉరితాడు అంటే భయం. మొదటిది పవిత్రపరిచేది, రెండోది భయోత్పాతమయినది; కనుక రెండూ కూడా సత్ఫలితాల నిచ్చేవే, కోరదగినవే. ఏ తప్పూ చెయ్యని మామూలు మనిషికి కూడా భయం తగిలి దానివలన అతడి మానసిక స్థితి దిగజారి, అవమానానికీ, అసహ్యానికీ గురి అవుతూ ఉంటాడు. (ఇలాంటి వాళ్లకి కలిగే) ఇలాంటి భయాన్ని గురించే మనం చర్చించుకోవాలి.

భయం అనేది ఓటమికి, తిరోగతికి చిహ్నం. అది ద్విగుణమయిన శాపం. భయము తానావహించిన మనిషిని దిగలాగుతుంది. అతడు చేసే పనిని పాడుచేస్తుంది. వేదిక ఎక్కి, ఉపన్యాసం చేసేవ్యక్తికి సభాకంపంగాని, మౌఖిక పరీక్షకు హాజరయిన అభ్యర్థికి వణుకుగాని ఉంటే అది భయస్వరూపంగా రేకెత్తి, వారు నిజంగా చేయగలిగినంత చేయలేకపోతారు. ఎవరికయినా- పిరికివాడు - అనిపించుకోవడం పరువుతక్కువ. ఎందుకంటే, దానివలన అతడు పరోక్షంగా తన ఆత్మగౌరవాన్ని వదులుకోవలసి వస్తుంది. అంతేకాక తనతో వ్యవహరించే ఇతరుల పట్ల వారికి లేని ఆధిక్యతను ఊహించుకుని తలవంచుకుంటాడు. అన్నిటికన్నా ఘోరం అతడికి భగవంతుడిలో విశ్వాసం ఒనగూడదు. భగవద్గీతలో చెప్పిన ఆదర్శ స్థితిని చేరుకోవడానికి సాధకుడు చేసుకునే ప్రయత్నాల ప్రగతికి "భయం" అనేది ఒక అనర్థ్వతగా, బలమయిన అవరోధంగా నిలుస్తుంది. కనుక సాధకుడు తన శీల ప్రవృత్తులలో ఉండే, ఈ దుష్టాంగాన్ని ఎంత వేగం ఛేదించుకుంటే అంత మంచిది.

అట్టి ఖండన సందర్భంగా భయం మూడు తరగతులు- అని విభజించుకోవచ్చును. దేనికి అనుగుణమయిన శస్త్ర చికిత్స దానికి జరుపుకోవలసి వస్తుంది.

I. మానవుడికి ఉన్న సహజగుణాలలో భయం ఒకటి. అది అతనికి ఎప్పటికప్పుడు ఉత్సాహభంగం చేస్తూనే ఉంటుంది. అతడు తలపెట్టినది మంచిగాని, చెడుగాని; అతడికి శత్రువుల వలన; లేదా, ఇతరుల వలన, దేహవ్యధ కలుగుతుందా- ఇలాటివేవీ దానికి పట్టవు.

() శరీరానికి ఎప్పుడో, ఏదో గాయం తగలవచ్చని ఊరికే ఆలోచించుకుంటూ కూర్చుంటే, ఏమీ ప్రయోజనం లేదు. అందువల్ల అలా ఆలోచించుకుంటూ కూర్చోవడం మానేసి, అసలు మనవల్ల ఏదైనా పొరపాటు ఉంటోందా- అని నిరపేక్షగా ఆత్మవిశ్లేషణకు లోనవాలి. ఎందుకంటే, మానవ స్వభావరీత్యా ఎవరుగాని, ఊరికే సరదాకోసమని ఇంకెవరికీ శారీరక బాధను కలిగించరు. ఒకవేళ అలా జరిగుంటే, మనమే ఆ ఇతరులకి అన్యాయంగా ఏదో తీవ్రమయిన వ్యధను కలిగించడంవల్ల వాళ్లలో దానికి ప్రతీకార వాంఛ బయలుదేరిందేమో. అలా మనవల్ల పొరబాటు జరిగిందని తోచినప్పుడు, సరాసరి

వారివద్దకు వెళ్లి, మనతప్పు ఒప్పేసుకోవడం ఉత్తమం, ముఖ్యంగా సాధకునికి. మనంతట మనమే తప్పు ఒప్పేసుకుంటున్నాం కదా- అని అదేదో హీనమయిన పనిగా భావించ కూడదు. అది ఎంతో ధైర్యంతో ముందు చూపుతో చేస్తున్నపని. దానివల్ల రెండు విధాల ప్రయోజనం: మనల్ని గురించి చెడ్డగా అనుకొనే శత్రువుకి ఆ భావం లేకుండా చూసు కోవడం; (అది పరార్థం) భగవద్గీత ఆదర్శాలు ధ్యేయంగా సాగుతున్న మన యాత్రలో మరొక ముందడుగు వేసుకుని మనశీల ప్రవృత్తులను మెరుగు పరుచుకోవడం రెండోది.

(i) మనకు కలిగే శారీరకమయిన వ్యధల మూలాలు ఇతరుల ఆలోచనలో, లేక, చర్యలో అనే భయం కావచ్చు: ప్రేమలో పోటీ పడి, శత్రువుగా మారిన వ్యక్తి అసూయ కావచ్చు; ఇరుగునో పొరుగునో ఉండే వ్యక్తుల అనవసర కక్ష కావచ్చు; మన ఇంటిని దోచుకొనే బందిపోటు పశుత్వం కావచ్చు. అటువంటివి సంభవిస్తాయని ముందుచూపుతో గ్రహించుకొని, వాటినుండి రక్షణ కల్పించే పద్ధతులను మనకు మనమే సమర్థంగా రూపొందించుకోవాలి. "భయపడి ఏమిటి ప్రయోజనం? (ఎవడయినా) తప్పించుకో లేనంత దూరానికి తరిమేస్తే, అప్పుడయినా నిరోధించి తిరగబడొచ్చు. అందుచేత ఏ దిక్కూ లేనప్పుడు, ఏం చెయ్యక తప్పదో- దానిని ముందునించీ ధైర్యంగా, తెలివిగా పథకం వేసుకోవాలి- అనే ఆలోచనలో ఉండాలి. దానికోసం మన ఇరుగు పొరుగులలోను, మిత్రులలోను మనకి ఉన్న పలుకుబడి అంతటినీ కూడదీసుకొని అటువంటి ఆపదలు వచ్చేటప్పుడు మనశక్తికి, వారిశక్తి తోడ్పడే విధంగా వారి సహాయాన్ని కోరాలి. ముందుగా పథకం వేసుకున్నవారు, తమ రక్షణాయుధాలకు పదునుపెట్టి యుద్ధానికి సన్నద్ధం చేస్తున్నారన్నమాట. స్నేహితుల సహాయంతో దీనిని సాధించాలి గనుక మనం సంఘీభావపు లక్షణాలను అలవరచుకోవలసిన అవసరం ఉంటుంది. దానివల్ల మన వ్యక్తిత్వము వృద్ధిచెంది, అధునాతన సామాజిక సభ్యత్వం ఒనగూడుతుంది. అలా ఏదో చెయ్యాలి తప్ప, ఊరికే భయపడిపోతూ, బద్ధకిస్తూ కూర్చోవడంలో అర్థంలేదు.

( ) ఇంత జరిగిన తరువాత కూడా, 'మీద పడుతుందనుకున్న" ప్రమాదం సంభవిస్తే, దానిని స్వీకరించవలసిందే. అయితే దానిని ఒకానొక ఉదాత్తమయిన కారణానికి గాను ఉరికంబాన్ని ఎక్కే వీరుడిలా స్వీకరించాలి. ఒక బానిసకు తప్పనిసరిగా సంభవించే అవమానంగా కాక పోరాటంలో శరీరానికి అవసరమయ్యే దారుఢ్యాన్ని సమకూర్చే, మానసిక విద్యా ప్రయోగంగా దానిని స్వీకరించాలి.

ఇలా చేయుగలవారు "భయము" అనేది నిజానికి దానిని గురించి ఊహించుకున్నంత భయానుభవం కాదనీ, ముందు ముందు కలగబోయే అలాంటి పరిస్థితులను ఎదుర్కోవ డానికి అవసరమయిన ధైర్యాన్ని సమకూరుస్తుందనీ తెలుసుకో గలుగుతారు.

**II.** అధునాతన మానవుడిని వేధించే ఇంకొక రకం భయం ఉంది: వ్యాపారంలోనో, పదవికి సంబంధించినదో, అధికార పరమయినదో- నష్టం. ఈ భయం వల్ల అతడు (ఆయా సందర్భాలను అనుసరించి) జీవితాంతం బాధించే అగౌరవం నుండి ఘోర

మయిన దారిద్ర్యం, దైన్యం- ఏదయినా కలగవచ్చు. క్రింది తరగతి ఉద్యోగులు ఉంటారు. వారు, తమ ప్రవర్తన ఎంతో గౌరవప్రదం, సక్రమం అయినప్పటికీ ఇలాంటి పరిస్థితుల (ఊహ) వల్ల కలుగుతుందని భయపడే ఆకలిబాధకు, తలవంపులకు భయపడడం వల్లనే వారు అధికారులకు (పెత్తందార్లకు) బానిసలలాగ వంగి వంగి పడివుంటారు. ఈనాడు నాటుకొనే భయోత్పాత బీజాలు భవిష్యత్తులో ఉపద్రవాలకు కారణభూతాలయి నిలుస్తాయి.

ఒక్కొక్కప్పుడు మన అధికారులు తమ కొంటెతనంచేత, మనచేత తప్పులు చేయిస్తున్నారని తెలిసినా, వారి వలన భయముచేత మనము ఆ తప్పులు చేస్తూ ఉండ వచ్చు. లేదా, మనమే విధినిర్వహణలో నిర్లక్ష్యం, అసమర్థత, అవిధేయత- వంటి లోపాలకు పాల్పడి, వాటిని కమ్ముకోవడానికి పచ్చి అబద్ధాలు చెప్పి మరింత హీన పడవచ్చు. అయితే అబద్ధాలకు తమ్మి తాము పెంచుకొనే స్వభావం ఉంది. అందువల్ల ఒక అబద్ధంలోంచి గొలుసుకట్టుగా మరొక అబద్ధంలోకి మనలను అవి నడిపించుకుపోయి, చివరికి తప్పుకోవడానికి అసాధ్య మయ్యేటంత అసందర్భ పరిస్థితిలోకి దిగబడిపోదాం. ఈ పద్ధతిలో మనం అలా భయ పడుతూ, రక్షించుకుంటూ, ఉండవలసిన అధికారుల సంఖ్య, సమస్యల సంఖ్య: పెరుగుతూ ఉంటుంది. క్రమంగా ఈ క్లిష్ట పరిస్థితిని గ్రహిస్తాము. కాని దిద్దుకోలేం. మొదట్లోనే తెలివి తక్కువ వల్ల, దూరదృష్టి లోపంవల్ల ఈ విషవలయంలోకి కూరుకుపోయాము. ఇప్పుడు దిద్దుకోవడానికి గాని, చివరికి ఆ పరిస్థితిని గురించి విచారపడడానికి గాని శక్తి, సమయం లేనంతటిదిగా తప్పుకోలేని జీవితకాలపు అభ్యాసంగా వచ్చి కూర్చుంది. ఇలాంటి పరిస్థితి "భూలోక నరకం"; ముఖ్యంగా జీవితంలో ఉన్నత విలువలను సాధించుకొనే ఆశ గలవారికి.

దీనినంతటినీ పరిహరించడానికీ, భయాన్ని సమూలంగా నాశనం చేయడానికీ చాలా హుందా అయినది, నిర్దుష్టమైనది- ఒక పద్ధతి ఉంది. ఏ వ్యవహారంలో అయినా: ప్రారంభ దశనాడే కాని, అలా వీలులేకపోతే ఆదశ దాటిన మరికొద్ది కాలంలో గాని- సత్యము వచించడం వలన సంభవించే అవాంఛనీయ సంఘటనలను ఎదుర్కోవడానికి మనసును సిద్ధం చేసుకోవాలి. ఇలా ఆది నిష్ఠూరపు నిర్ణయానికి రావడమే కష్టమే, దానిని పాటించు· కోవడమూ కూడా కష్టమే. అయితే, అట్టి కష్టాన్ని భరించి, ఆ ఆది నిష్ఠూరపు స్థితిని సాధించుకోగలిగితే అది తెలివిగల నిర్ణయమో, ఎంత విముక్తికరమో తప్పకుండా తెలుసుకో గలుగుతాము. ఎందుకంటే, మనలను నడిపించేది ఒకే సిద్ధాంతం, అదే అన్ని ప్రశ్నలకు సమాధానం ఇస్తుంది. దీనివలన మనం (అనుభవించే) బాధపడే అసౌకర్యం (లేదా, కష్టం;) ఒకే ఒక్కటి, కాని, ఏ ఒక్క అధికారికీ భయపడవలసిన పరిస్థితి రాదు. మెదడును బాధించే అన్ని సంక్లిష్టతలు, ఆత్మను హింసించే అన్ని ములుకులు- ఇలాటి బాధలు మనము మన అధికారులకు అసత్యాలు చెప్పడం వలన కలుగుతాయనుకుంటే, అవన్నీ కూడాను; (ఈ ఆదినిష్ఠుర ప్రవృత్తి వలన) ఉదయ సూర్యుని ప్రభావం చేత

మంచు తెరలు కరిగిపోయేటప్పటి లాగా ఎంతో ఆనందం, తృప్తి; కలుగుతాయన్న సంగతి స్ఫురిస్తుంది.

అంతేకాదు. సత్యపాలనా అవలంబనలోనికి చేసే తిరోగమనరహితమయిన ప్రయాణము వలన మన అంతస్తు క్రమంగా పెరిగి, ఉత్తరోత్రా మన అధికారుల దృష్టిలో (మార్పు వచ్చి) మనం అంతవరకు పడిన తీవ్ర సంఘర్షణ త్యాగాలకు పరిహారం సమృద్ధిగా లభిస్తుంది. దీనికి, మహాపురుషులందరి చరిత్రలు సాక్షీభూతాలయి నిలిచి ఉన్నాయి.

అస్మత్సదృశ సామాన్య మానవ వచనాలవలన కాకున్నా అమరములూ శాశ్వతములూ అయిన ఉపనిషత్తుల విస్పష్ట వాక్యాలవలన ఈ భావాలకు సిద్ధి:-

**సత్యమేవజయతే, నాఽ నృతమ్**

-ముండకోపనిషత్తు: తృతీయ అధ్యాయం ప్రధమ ప్రకరణం-16

ఇంత చెప్పిన తరువాత కూడా, అంటే; మనము సంపూర్ణంగా న్యాయ బద్ధులమయి, సత్య పాలకులమయి ఉన్నా కూడా- (ఇతరులు మనలను గురించి దురభిప్రాయపడే) దురదృష్టం అనివార్యంగా సంభవిస్తే, దానిని ధైర్యంగా, వీరోచితంగా స్వీకరించవలసి ఉంది. (ఏదో ఆపద తనను లోగొన్న బానిసవలె దుఃఖపడరాదు.) "జరగవలసినదేదో తప్పక జరిగితీరుతుంది." అది మనము నివారించలేనిది, ఒక అబద్ధం చెప్పి, దానిని ఆపడం మన శక్తికి మించినది. కనుక సత్యాన్నే వచించి ఇతర (పూర్వ) "మహాత్ములు పోయిన త్రోవలో" ఆ విధి లిఖిత ఫలితాన్ని శిరోధార్యంగా స్వీకరించాలి.

మరి, సత్యమనే దానిని మనం ఒక విశ్వాసంగా, ధర్మంగా ఏ ఊగులాటలూ లేకుండా జీవితాంతం పాటించాలనుకుంటే; మనం మన ఆలోచనలను, వాక్కులను చర్యలను దానికి అనుగుణంగా (నిష్ఠగా) నిబంధించుకోవలసి వస్తుంది. దానివల్ల మన శీల ప్రవృత్తులు మెరుగుపడతాయి. హరిశ్చంద్ర శ్రీరామ యుధిష్ఠిరాది మహనీయులకి తీసిపోని విలువ ఒనగూడి, ఏ(ఐహిక)శక్తి, ధన భాగ్యాలు సాధించలేని దివ్యానుభూతి కలుగుతుంది. తుదకు, భగవద్గీత (సూత్రాల) అభ్యాసానికి అవసరమైన ప్రాధమిక అర్హతలను పొందగలుగుతాము. అన్నిరకాల అభివృద్ధులకంటె, సత్యవచనం వల్ల కలిగేది పేరెన్నిక గన్నదిగా మనయందు నిబిడమవుతుంది.

కార్యాలయ, వ్యాపార, అధికార- సంబంధాలయిన అన్ని రకాల భయాలను నిర్జించ గల దివ్యౌషధం "సత్యంవద"- అనిచరమవాక్యం.

**III.** తనకు గాని, స్వజనానికి గాని సంభవించగల 'మృత్యువు' వలన భయం మానవుడికి అత్యంత బలీయమైనది. చావు అనేది ఏదో బాధాకరమైన అనుభవం అనో, చావు సంభవించడం వల్ల నరకానికో మరో చోటికో పోయి చెప్పలేనంత కాలం భరించరానంత బాధ పడవలసి వస్తుందనో కాదు; ఆ భయం. భార్య, పిల్లలు, ఆస్తి

అధికారం, కీర్తి; వంటి బంధాలు నిర్దయగా అపరివర్తనీయంగా తెగిపోవడం; ప్రేమాస్పదమైన ఆ బంధాలతో తన అనుబంధం కొనసాగించుకోడానికి ఇక మీదట ఏ మాత్రమూ వీలులేని విధంగా- తాను తిరిగి చూడలేనంత చాటుకీ తిరిగి రాలేనంత దూరానికీ విసిరివేయ బడడం; ఇవి; ఆ భయానికి అసలు కారణాలు. అది విషాదం. కాని, నిజానికి అది, మృత్యుభయంవలన కలిగే మనోవేదన.

'నీలో ఉండే నిజమైన నీవు" అనే పేరిట గల ఒక ప్రకరణంలో "ఆత్మ" గురించి మనము కొంత అవగాహనను సమకూర్చుకున్నాము. ఆ నేపధ్యంతో "ఎవ్వనికీ మృత్యువు లేదు. మృతి చెందేది శరీరమే" అని నచ్చజెప్పడానికి ప్రయత్నిస్తే ఎవ్వరైనా తిరగబడతారు, 'ఆత్మా? అదేమిటి? నేనెప్పుడూ చూడలేదు, అనుభవించలేదు. నాకున్నదంతా ఈ శరీరమే. నా జీవితకాలమంతా దీనితోనే గడిపి, ఇదే నేనుగా జీవించి, తెలిసి, ప్రేమించినది." అంటారు.

ఆచరణ ప్రకారం ఇదంతా నిజమే. కాని, నిజానికి ఇది ఒక చిన్నపిల్లాడి (మంకు) పట్టు లాంటిది.

పసిపిల్లలకు ఒక్కొక్కప్పుడు తాము ఆడుకొనే వస్తువులు తమ తల్లిదండ్రులకంటే, ప్రియమైనవి. వారు ఆ వస్తువులు ఇచ్చే తక్షణ ఆనందాన్ని మించినది మరొకటి కానలేరు; కనగోరరు. కాని ప్రాజ్ఞులమయిన మనం కూడా ఆ విధంగా (తలచి) ప్రవర్తించి మన ఋషులు అందించిన జ్ఞానాన్ని అనుసరించి, లబ్ధిపొందడానికి నిరాకరిస్తే; మనకూ, పసి పిల్లలకూ ఏమిటి, తేడా? మనం భగవద్గీత పధాన్ని అనుసరించి, ఉన్నత శ్రేణి జీవన విధానాన్ని కొనసాగించడానికి ఆశిస్తున్న పరిస్థితులలో అటువంటి నిరాకరణబుద్ధితో ఆ ఉన్నత శ్రేణి జ్ఞానాన్ని, కాంతిని- చూసేదెలాగ? కనుక మన ఆశలకు సంబంధించిన నిజమయిన జ్ఞానాన్ని అన్వేషించడానికి ప్రయత్నించవలసి ఉంది. అందుకుగాను కొన్ని విషయాలను శ్రద్ధగా పట్టించుకోవలసి ఉంది. అంతకంటే ముఖ్యంగా మనసును (ఆ కొన్ని విషయాలమీద) క్రమశిక్షణతో లగ్నం చేసుకోవలసి ఉంది.

ఆ విషయాలు ఏమిటి?

ఒకని జీవాత్మ (అనగా అతనిలో ఉన్న "నిజమయిన అతడికి") ఆ శరీరంతో ఉండే సంబంధం ఎలాంటిదంటే, ఆ శరీరానికీ, దానిమీద అతడు ధరించే వస్త్రాలకూ ఉండే సంబంధం లాంటిది. వస్త్రాలు- అంటే, అతడు కానట్లే; ఆ శరీరం-అంటే "అతనిలో ఉండే నిజమయిన అతడు" (అనగా అతని జీవాత్మ) కాదు. అతనిలో ఉండే 'నిజమయిన అతడు" అనేది అతని శరీరంనుండి భిన్నమయినది, అట్టి శరీరం కంటే చాలా ముఖ్య మయినది. ఎలాగంటేను, అతడు ధరించిన వస్త్రాలకంటే (అవి ఎంత ఖరీదయినవి, మెరిసేవి అయినా సరే) అతడి శరీరమే గొప్పది. అతడికి తన శరీరము మీద ఉండే అపేక్షతో పోల్చిచూస్తే, అతనికి ఆ వస్త్రాలతో ఉండే అనుబంధం అస లేమీ కాదు. కలలో కూడా అతడు తన వస్త్రాలు తన శరీరంకంటే, విలువయినవి అని అనుకోడు. ఈ రెండింటిలో ఏది గొప్ప అనే ఆలోచనే హాస్యాస్పదంగా తోస్తుంది.

అతడు వస్త్రాలను ధరిస్తున్నాడు. కాని, వాటి స్థానం ఎంతో తెలిసే అలా ధరిస్తున్నాడు. ఆ తెలివిడి అభ్యాసంలో పరిణతమైనట్లయితే, శరీరానికీ, వస్త్రాలకీ గల సంబంధ ప్రతిపత్తిని తార్కికంగా పరిశీలించుకొని; వస్త్రాలను చివికి (చిరిగి) పోగానే ఆకర్షణా రహితాలుగా గ్రహించి విసర్జించినట్లు, శరీరాన్ని కూడా అనుబంధరహితంగా పరిగణించి విసర్జించగలదిగా గ్రహించుకోవాలి.

తన శరీరమే (అవసరానంతరం విసర్జించగల) ఒక వస్త్రం వంటిది అని గ్రహించ గలవాడు, తన స్వజనం శరీరాలు అంతకు తక్కువ అపేక్షతోనే చూడవలసినవిగా కూడా గ్రహించి; తదనుగుణంగా, తన మరణ సమయంలో తనకొఱకుగాని వారికొఱకుగాని దుఃఖించరాదు.

**మానవుడు (తన) చినిగిపోయిన వస్త్రములను విడిచి,**
**నూతన వస్త్రములను ధరించినట్లే, ఆత్మయును;**
**ఒక దేహము నశించినప్పుడు మరియొక దేహమును చేరును.**

-శ్రీమద్భగవద్గీత సాంఖ్యయోగము:22

జరిగేది ఏదో జరిగి తీరుతుంది- అని మనం ప్రతి విషయంలోనూ సమాధాన పడతాము. "నిన్న" అనేది వెళ్లిపోయింది. దానితో మన "వయసు" ఒకరోజు "వృద్ధి" చెందింది. ఈ రెండు నష్టాలు మనము పూరించుకోలేనివే, నష్టం జరిగిందని మనకు తెలుసు, కాని, పట్టించుకోము, దానిని గురించి "చింతించుకోము." "కాలం" గడిచి పోవడము- అనేది ప్రకృతి సహజమనీ, దానిని ఎదిరించడం వృథా అనీ మనకు తెలియ కుండానే మనము రూఢి చేసుకున్నాము. ఈ క్రమంలో మన బాల్యం యౌవనంలోకీ, యౌవనం వృద్ధాప్యంలోకీ పరిణామం చెందుతున్నప్పుడు, ఆ పరిణామం మనకు ఆహ్లాదకరం కాదని తెలిసినా సరే, దానిని వ్యక్తావ్యక్తంగా ఆమోదించి, దానికి అలవాటు పడిపోతాము. అలాగే ఈ శరీరానికి సంభవించే మృత్యువు, దానిని అనుసరించి ఉండే ఆత్మ ఇంకొక శరీరంలో ప్రవేశించి, పునర్దర్శనము ఇవ్వడం- ఇప్పుడు చెప్పుకున్న పరిణామానికి- "తరువాతి విడత" స్థితులే, (అని గ్రహించాలి) కనుక దానిని కూడా సహజంగానే స్వీకరించాలి.

**ఒక శరీరం బాల్యమునుండి యౌవనానికీ,**
**యౌవనంనుండి వృద్ధాప్యానికీ మారడం ఎలాంటిదో,**
**జీవాత్మ ఒక శరీరము నుండి మరొక శరీరానికి మారడం అలాంటిదే.**
**జ్ఞాని అయినవాడు దీనివలన చెదరడు.**

-శ్రీమద్భగవద్గీత, సాంఖ్యయోగము:13

అదీకాక, మృత్యువు అనివార్యము, ఈ అనంత కాలవాహినిలో అమరుడయిన వాడు ఒక్కడు కూడా తేలలేదు. శ్రీ మహావిష్ణువు అవతారముగా భగవద్గీత ప్రవక్తగా

మనం ఎరిగిన కృష్ణ భగవానుడు కూడా కాలవాహిని తనను కబళించుకోవడాన్ని ఆమోదించుకున్నాడు.

ఉదయించిన సూర్యుడు సాయంకాలం అస్తమించకుండా చేసేవాడు ఎవడూ లేనట్టే, ఇదంతా ప్రకృతి సహజం. దీనిని ఆపేవారు కూడా ఎవరూలేరు. మృత్యువు సంభవించి నప్పుడు అది సహజ ప్రక్రియ మాత్రమే అని గ్రహించి, దుఃఖరహితంగా రాజీ పడడమే ప్రపంచజ్ఞానం. వయసుతోబాటు శరీరం పెడగడం, మార్పులకు లోనవడం, సహజమని ఎలా సమాధానపడతామో, ఈ ప్రపంచంలోకి వచ్చే దేదయినా సరే, ఎప్పుడో ఒకనాడు దీనిని విడిచి వెళ్లక తప్పదు అనేది ప్రకృతి సిద్ధాంతం.

**పుట్టినది గిట్టక తప్పదు.**
**మరణించినది తిరిగి పుట్టక తప్పదు. అందుచేత**
**తప్పని సరిగా జరిగే, దీనినిగురించి నీవు దుఃఖించకూడదు.**

-శ్రీమద్భగవద్గీత, సాంఖ్యయోగము:27

కాలం ఎంత బాధాకరమైన వ్రణాన్నైనా, ఎంత లోతైన గాయాన్నైనా- మాన్పించ గలదు. మరణం సంభవించినప్పుడు చేసే రోదన అలసటను కలిగిస్తుందనీ, అది వృథా అనీ గ్రహించడం వల్లను, ప్రకృతి మనకు ప్రసాదించిన (మరపు అనే) ఒకానొక లక్షణం వల్లను; కాలక్రమాన, మరణించిన వారిని వారి (ఆప్త) బంధువులు మరచిపోగలుగు తారు. రాత్రి తరవాత రాత్రిగా, నిద్రద్వారా; మనం, మన బాధలనూ, విషాదాలనూ మృతులైన బంధు జనాలనూ మరచిపోగలందుకు భగవంతుడు రాత్రిని సృజించాడు.

మరి, అందుచేత; ఎన్నడో ఒకనాడు తప్పనిసరిగా సంభవించేదే అయిన మృత్యువు పట్ల భయరాహిత్యాన్నీ నిర్వికారతనూ ప్రారంభం నుంచే అలవరచుకోవడం మనకు మంచిదా, కాదా? తప్పించుకోలేం- అని తెలిసిన దానిని ప్రయోజన విహీనమైన, హీనమైన-భయం, దుఃఖం లేకుండా స్వీకరించుకోవడం అనుసరణీయమైన జ్ఞానం అవునా, కాదా?... ... అవునని మానవజాతి అనుభవం చెప్తోంది. ఆదర్శవాదం, వాస్తవికతావాదం, వీరోదాత్తత కలగలిసినదది.

ఇటు తాత్వికతను, అటు తర్కాన్ని అధిగమించుకొని పాటించగలిగితే మన దృఢ విశ్వాసానికి ఆధారభూతాలుగా సహాయపడేవి, మృత్యువువల్ల కలిగే భయాన్ని నిరోధించేవి, మనశ్శాంతిని ధ్రువపరిచేవి; కొన్ని చిట్కాలు ఉన్నాయి:

1. మరణం ఎప్పుడు సంభవిస్తుంది- అని జ్యోతిష్కులని సంప్రదించకుండా ఉంటే, ఆ విపత్తును గురించి ఊహించుకొంటున్నప్పుడల్లా కలిగే, అనవసరపు ప్రకంపనలను నివారించుకోగలుగుతాము. అసలు జ్యోతిష్కులలో అందరూ ప్రవీణులు కారు, సరిగా చెప్పగలిగేవారూ కాదు.

2. ఒక వీలునామా రాసి పెట్టుకోవాలి. దాంతో; పిల్లల పట్ల, ఇతరులపట్ల నెరవేర్చ వలసిన విధులు నిర్ధారితాలయి మనసు కుదుట పడుతుంది.

3. ఉదాత్తమయిన కారణాలవల్ల చిరునవ్వులతో ఉరికంబాలెక్కిన గొప్ప వీరులను స్మరించుకొని, వారి అడుగు జాడలలో నడుచుకోగలిగితే, అది మనలో చాలా ఆరోగ్య కరమయిన ప్రోద్బలాన్ని కలిగిస్తుంది.

4. తీరిక వేళల్లో మానవసేవకు సంబంధించిన ఏదో ఒకపని చేసుకుంటూ పోతే, మనసు ఔన్నత్యభరిత కార్యక్రమాలపై లగ్నమయి, మృత్యువును గురించి తలపోయ డానికి సమయం ఏమీ లేకుండా ప్రశాంతపరుస్తుంది.

5. ఆఖరిదే- కాని, అన్నిటికన్నా ముఖ్యమయినది: క్రమం తప్పకుండా ప్రార్థన చేస్తూ ఉండాలి. అన్ని రకాల అస్వస్థతలకు- ఇక్కడయినా, ఎక్కడయినా; ఇప్పుడయినా, ఇక మీదటయినా- అదే దివ్యౌషధం. ఈ సలహాలను మరికొన్ని ఆలోచనలతో పరిపుష్టం చేసుకోవచ్చు. "ఇది మొదలు, నేను చావంటే భయపడేది లేదు. ఇక నాకు సంబంధించిన ఇతరుల మృత్యువు సంగతి నాకేల? ఇది మొదలు, జీవితాంతం; భయమనేదే నా దరికి రాకుండా బహిష్కరిస్తున్నాను." అని ఎవరికి వారు దృఢనిశ్చయం చేసుకోవాలి. ★

## పదమూడవ ప్రకరణము

# ఈర్ష్యా-మాత్సర్యాలను అణచిపెట్టే పద్ధతులు

"కోపము" గురించి ఇంతకుముందు ఒక ప్రకరణములో చెప్పుకున్నాము. ఇప్పుడు ఈర్ష్యా-మాత్సర్యాలను గురించి చెప్పుకుందాము. కోపము-అనేది బహిరంగంగా బైట పడే మొరటయిన శత్రువు. దీని ఎత్తుగడలను ముందుగానే, కొంతవరకు ఊహించ గలము. అది ఎంత తొందరగా మనలను ఆవహిస్తుందో, అంత తొందరగానూ చల్లారిపోతుంది. కోపం కలిగే చాలా సందర్భాలలో, అది ముఖతః తన తీవ్రతను వ్యక్త పరుస్తుంది. అయితే, స్థలం మార్పు, బలాత్కారపు మౌనం వంటి బాహిర సహాయాలు దానిని అదుపులోకి తేగలుగుతాయి.

కాని, ఈర్ష్యా-మాత్సర్యాలు అంత తేలికగా బయటపడవు. అవి కొంత గుట్టుగా ఉంటాయి. అవి మనగుండెలలో గూళ్లు కట్టుకొని, మన శీల ప్రవృత్తులలోపల తమ రెక్కలను సాచి, మనలను నిదానంగా, దొంగచాటుగా లొంగతీసుకుంటాయి. కనుక వాటిని తప్పుకొనేటట్లు చేసుకోవాలంటే, మరింత లోతయిన, అప్రమత్తమయిన వ్యూహం అవసరం. ఆ అవాంఛనీయ శక్తులను అణగదొక్కడానికి గాను, మనం; సుదీర్ఘమయిన మానసిక క్రమశిక్షణా అభ్యాసంపైన ఆధారపడవలసి ఉంటుంది. అందుకని ఈ 'జంట బలహీనతలను' మట్టుపెట్టడానికిగాను, మన ఆలోచనా క్రమాన్నికంటే, మన వైఖరినే క్రమబద్ధం చేసుకోవాలి- అనే విషయం మీద మరికొంత ఊనికతో చర్చసాగుతుంది.

### ఈర్ష్య (అసూయ)

మనకంటె అదృష్టవంతులకుండే లాభదాయక పరిస్థితులను గురించి మనం అనిష్టతతో తలపోయడమే అసూయ. ఇది సాధారణంగా మనకు సమానమయినవారి ఎడల; లేదా, సమానత్వానికి దగ్గరలో ఉన్నవారి ఎడల; కలుగుతుంది. ఆ సమానత్వం కార్య స్థానాలలోది కావచ్చును, స్నేహితుల మధ్యది కావచ్చును, సమాజంలో తమతమ స్థాయిల మధ్యది కావచ్చును, బంధు-కుటుంబసభ్యులమధ్యది కావచ్చును. మనకంటే ఎంతో అందరాని ఉన్నత స్థాయిలో ఉన్నవారి పట్లగాని, మనకు చాలా దూరమయిన సంబంధాలతో ఉన్నవారిపట్లగాని, మనకు అసూయ కలగదు. మాటవరసకి ఒకానొక ప్రాథమిక విద్యాలయపు ఉపాధ్యాయుడు, లేక, ఒక ఆఫీసులోని చిన్నపాటి గుమస్తా- ఇలాంటి వాళ్లు: ఒక ఎల్లయ్య అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రెసిడెంటు అయ్యాడంటేనో, ఒక పుల్లయ్య చంద్రగ్రహం మీద పచార్లుచేసి రాగలిగాడంటేనో, అసూయపడే ప్రసక్తి లేదు; పట్టించుకోరు.

మనతో సమాన స్థాయి కలిగినవారి పట్ల కూడా ఒకానొక రకం బలమయిన కారణం ఉన్నాసరే, అసూయ కలగకపోవచ్చును. మన మిత్రులలో మనకంటే పొడగరులు,

అందగాళ్ళు ఉండి మనం పొట్టిగా (వికారంగా) ఉన్నాసరే, అసూయకు తావుండదు. మనం దానిని గుర్తించనట్లే, మామూలుగా పనిచేసుకుపోతూ, ఆ తేడాని నిర్లక్ష్యం చేస్తాం. ఎందుకంటే, దానిని గురించి ఎలాటి బాధా పడడం శుద్ధ దండగ- అని మనకు నమ్మకంగా తెలుసును. మనకు అలాంటి సందర్భాలలో సంభవించే సమస్యలను, మన శరీరాల ఆకారాలతో (పరిమాణాలతో) సంబంధం లేకుండా, పరిష్కరించుకోవలసి వస్తుందని కూడా, మనకు తెలుసును.

అసూయ అనేది మనలో మొలకెత్తినప్పుడు మనం ఆ సంగతి గమనించం. అది నెమ్మదిగా పెరిగేరకం. మనం పని చేసుకుంటున్నప్పుడు, నిద్రపోయేటప్పుడు దాని ఉనికిని తెలియజేసే, ఏ అసాధారణమయిన మార్పులూ స్పష్టంగా కనిపించవు. అయితే, ఆయా వేళలందు మనలో కొంచెం నిస్పృహ, నిరాశ ఆవహించవచ్చు. అది క్రోధమే గాని దానికి బలం ఉండదు. మనలో సహజంగా ఉన్నతికోసం కలిగే, ప్రగాఢమయిన కోరికను చల్లబరచి, మనలను విషణ్ణంగా చేస్తుంది. అది ఎంత నిరుత్సాహ భావన అంటే, మనం దానిని మన ఉత్తమ మిత్రులకు కూడా చెప్పుకోలేని, అలాగని పైకి పొక్కకుండా మనలో మనం దాచుకోలేని- పరిస్థితి. అది మనకు ఒకానొక వింత ఇబ్బందిని తెచ్చిపెడుతుంది. దానిని ఒక పరిమితి మేరకు మించి పెరగకుండా అదుపుచేసుకోలేకపోతే, మన సహజ ఆరోగ్యకర స్వభావం తీవ్ర ప్రతిబంధకానికి గురి అయ్యేటట్లు చేస్తుంది. అసూయ అనేది పలచన చేసిన విషము వంటిది.

ఈ అసూయ బారిని పడకుండా దాని పీడ వదిలించుకోవడానికి కొన్ని పద్ధతు లున్నాయి.

1. మనల్ని మనం ఇతరులతో సరిపోల్చి, చూసుకున్నప్పుడే అసూయ తల ఎత్తేది. ఈ "సరిపోల్చడాలు" రెండు విధాలుగా హానికరమయినవి. అనుకూలంగా ఉంటే, మనలో గర్వాన్ని రగులుకొల్పుతాయి. వ్యతిరేకంగా వస్తే, నిస్పృహ కలిగిస్తాయి... గర్వం కలిగిందంటే, దానివెంట మితిమించిన ఆత్మవిశ్వాసం, సోమరితనం వచ్చి, చివరికి అపజయాన్ని రుచి చూపిస్తాయి. ప్రతికూలంగా జరిగే సరిపోలికవల్ల మనలో మనకి ఆత్మవిశ్వాసం తగ్గిపోతుంది. అవతలివాళ్లని అణగార్చడానికి అనాగరికమయిన పద్ధతులు తలకెక్కి. (వారిశక్తి - ప్రతిభల ఆధిక్యత వలన) అది కూడా చివరికి నిరాశా నిస్పృహలకే దారి తీస్తుంది. కనుక సరిపోల్చుకోవడమనేది ఒక గండం. మన సత్ప్రయత్నాల ద్వారా సాధించుకోవలసిన విజయం దిశగాసాగే, దారిని మళ్లిస్తుంది. అందుచేత అసూయను అదుపులోకి తెచ్చుకోవాలంటే, సాధ్యమయినంతగా మనలను ఇతరులతో సరిపోల్చు కోవడం మానుకోవాలి. ఒకానొక ఏకాంత ద్వీపంలో ఒంటరిగా ఉన్న రాబిన్‌సన్ క్రూసో లాగా మనం కూడా ఒంటరిగా ఉన్నాము- అనుకుని మన ఎదుట ఉన్న ధ్యేయాన్నే, ఆదర్శాన్నే సాధించుకోవడానికి అవసరమయిన ప్రయత్నాన్ని దీక్షగా చేసుకుంటే, దానికి అదే మందు.

2. సరిపోల్చి చూసుకోవడంవల్ల చిక్కులు వస్తాయని తెలిసినా సరే, సరిపోల్చుకోకుండా ఉండడం చాలాకష్టం. ఎందుకంటే, ఇవాళ జనాభా ఎక్కువ. మనము నిర్వహించ వలసిన వ్యవహారాలన్నిటిలోను పోటీదారులు చాలామంది తయారయ్యేరు. అదలా ఉంచి, సరిపోల్చుకోకుండా ఉండడం కూడా ఎప్పుడూ మనకు ప్రతికూలంగానే ఫలితాలిస్తుందని అనుకోకూడదు. సరిపోల్చుకోవడంవల్ల కలిగే మన ఆలోచనలను ఒక నిర్మాణాత్మక మయిన మలుపుతిప్పుకోగలిగితే, దానిద్వారా మనకు ఉపయోగపడే పద్ధతులు కూడా తప్పక ఒనగూడుతాయి. మనకు ఒక మిత్రుడు ఉన్నాడని అనుకుందాం. అతడు మన కంటే ఉన్నతమయిన స్థాయిలో ఉన్నాడని తెలిసినంత మాత్రంచేత మనం నిరుత్సాహం చెందవలసిన పనిలేదు. (అతడు ఆ స్థాయికి ఎలా చేరుకున్నాడో గ్రహించుకుని) అతని స్థాయికి మనం ఎదిగేటట్టుగానే కాక, అతనిని మించడానికి గాను సమకూర్చుకో వలసిన భౌతిక ప్రయత్నాలు- ఇవి- అని: పౌరుషాత్మకమయిన నిర్ణయం తీసుకుని (అమలు చేస్తే), మనం ఎంతో మర్యాదకరమయిన పద్ధతిలో తప్పక విజయం సాధించ గలుగుతాము. అంతతో తృప్తి చెందాలి. ఊరికే అసూయపడుతూ కూర్చోవడం, లేక, విజయంకోసం అపమార్గాలు అవలంబించడం-కంటే, ఇదే మంచిది. అలా అలా మర్యాద కరమయిన పద్ధతులద్వారా మన శీలప్రవృత్తులను ఉన్నత పథాన నడిపించుకుంటూ పోతే, భగవద్గీత(లో చెప్పిన) ఆదర్శాలను చేరుకోవడానికి మంచి యోగ్యతను సంపాదించు కుంటాము. కనుక "సరిపోల్చుకోవడము" అనే ఒక లక్షణాన్ని నిర్మాణాత్మకమయిన ప్రయత్నంగా పరిణమింపజేసుకొంటే, మన కంటే ఆధిక్యతలో ఉన్న పోటీదారులను మాత్రమే కాక, మన ప్రవృత్తిలో నిబిడీకృతమైఉన్న "అసూయ" అనే శత్రువుని కూడా గెలుచుకుంటాము. నిజానికి ఈ రెండో విజయమే "సాధకుడికి" మరింత ముఖ్యం. దానిని సాధించడానికి గాను నిర్వహించవలసిన భౌతిక కార్యక్రమానికి వెన్ను దన్నుగా నిలిచే శక్తిని మన మనసు ప్రసాదించాలి. ఒకటికి రెండుసార్లు మనలో మనం ఆలోచించు కుంటూ, మనసుకు నచ్చజెప్పుకోవలసినది చాలావుంది." ఇది అసూయ కాదు. అసూయ పడడం అనేది సిగ్గుచేటు. దానికి బదులుగా కష్టపడి పనిచేసి ఆ పోటీని ఎదుర్కొని ప్రత్యర్థిని ఋజుమార్గంద్వారానే మించాలి. అలా చెయ్యడం పౌరుషం, వీరోచితం. అప్పుడు అసూయ కలిగేది ప్రత్యర్థికే.

3. ఎంత గట్టిగా ప్రయత్నించినప్పటికీ ఏవో సహజమయిన, తదితర - కారణాల వలన మన రంగంలోని ప్రత్యర్థిని మించలేకపోయినా; బాధపడక్కరలేదు.

ఈ ప్రపంచంలో అన్ని ప్రతిభలూ కలిగినవాడు గాని, ఏదీలేనివాడు గాని- అసలు ఉండడు. చక్రవర్తినుండి, సేవకుడి వరకు ప్రతి ఒక్కనికి కార్యశూరత్వమో, స్థాయి బలమో తన ప్రత్యేక ప్రతిభ తనకుంటుంది. అలా ప్రత్యేక ప్రతిభలు కలిగినవారు ఎందరయినా ఉండవచ్చును. కాని, ఒకరికి ఉన్న పరిమాణంతో సమానంగా మరొకరికి ఉండదు. ఒకరికి ధనం, మరొకరికి ఆరోగ్యం, ఇంకొకరికి నిర్వహణా సామర్థ్యం, వేరొకరికి

శాస్త్రజ్ఞానం ఎనలేని పరిమాణాలలో ఉండవచ్చు. ఒకావిడ సౌందర్యంలో సాటిలేనిదయితే, ఇంకొకాయన సంగీతంలో ఆజన్మనిష్ణాతుడుగా వెలుగొందవచ్చు.

ఇలా ఉండడంవల్ల ఎవరికి వారు తమకి ఉన్న ప్రత్యేక ప్రతిభ ఎందులో ఉందో తెలుసుకుని; అవతలివాళ్లకి (కళ్లు) మిరుమిట్లు గొలిపేటంతగాను, తమను చూచి, తప్పక అసూయ పడేటంతగాను; (ఆ ప్రతిభను) అత్యధిక వ్యాప్తికి తెచ్చుకోవాలి. ఈ సూత్రం ఎవరికయినా వర్తించేదే.

ఇంకొక సంగతి ఏమిటంటే, ధనంగాని, జ్ఞానంగాని, ఉన్నతమయిన సామాజిక స్థాయి గాని- అలాంటి ఇంకేదయినా వరంగాని- అదొక్కటే సార్వకాలికమయిన ఆధిక్యతగా పరిగణనకి రాదు. నిజమే, అవన్నీ కూడాను: ఆర్థికంగా చితికిఉన్న వాళ్ళకు, జన్మతః అట్టడుగువర్గం వారికి- అందుబాటులోకి రానంతదురాశలే. అయితే, సచ్ఛీల ప్రవృత్తులు, నిరాడంబరత, ఆధ్యాత్మిక శక్తి- వంటి విలువలు కలిగినవారు ఎంతటి వినమ్ర, దారిద్ర్య బాధిత జనులలో ఉన్నప్పటికీ, మహాబలసంపన్నులయిన చక్రవర్తులు కూడా వారిముందు శ్రద్ధగా తలవంచవలసిందే, ఒక్కొక్కప్పుడు పర్వతం ఎంత సమున్నతమో, ఒక ఉడుత కూడా అంతటి వరాన్వితం కావచ్చు. మనకున్న సంపదతో ఆర్భాటంతో; ప్రపంచఖ్యాతి సాధించలేకపోవచ్చు కాని, పవిత్రతతో, నిరాడంబరతతో ఆ ఖ్యాతికి సమానమయిన దానిని సాధించుకోవడాన్ని ఎవరూ ఆటంకపరచలేరు. ఇవి (ఉద్దేశమంటూ ఉండాలేగాని) ఖచ్చితంగా మనచేతులలోనివే.

ఇప్పుడు పేర్కొన్న విలువలలో ఒకటిగాని, కొన్నిగాని; యావత్ప్రపంచపు దృష్టినీ ఆకర్షించేటంత పుష్కలంగా ప్రతివారిలోనూ ఉండకపోవచ్చు. కాని, ప్రతి ఒక్కరిలో ఈ విలువలలోనిది కనీసం ఒక్కటి- కొంత వరకయినా ఉండి తీరుతుందనేది స్వయం స్పష్ట సత్యం. అట్టి విలువను ఎవరికి వారు సరిగా గుర్తించుకోవాలి. ఎంత శ్రద్ధగా చేసే వ్యవసాయానికి అంతగా సుసాధ్యమయ్యేపంట.

కాని, మనము మన ప్రతిభలను గుర్తించుకోవడంలో ఎంత శ్రద్ధ తీసుకుంటామో, వాటి లక్ష్యాలను నిర్దేశించుకోవడంలో కూడా అంతటి శ్రద్ధా తీసుకోవాలి. ఒక కవి ఉన్నాడనుకుందాము. అతడు ఉత్తమ, మధ్యమ, అధమ తరగతులలో తృతీయ వర్గమువాడు అనుకుందాము. అతడు మొట్టమొదటే తనను గురించి తాను ఒక నిష్పాక్షికమయిన అంచనాకి రావాలి గాని, ఒక్కసారిగా తాను ఏ కాళిదాసుతోనో, షేక్స్పియర్‌తోనో సమానం అయిపోవాలని ఆశయం పెట్టుకోకూడదు. తన స్థాయిలో ఉన్న ఇతర కవుల మధ్య ఒక గుర్తింపును సాధించుకొని, అప్పుడు ఉన్నతికోసం ప్రయత్నించుకుంటే, అంతా బాగా జరుగుతుంది. అతడు ఔన్నత్యం కోసం చేసే కృషి ఎంత దృఢమైనదైనా సరే, వాస్తవ దూరమయినది, అత్యాశావహమయినది అయిన పథం మాత్రం ఎన్నడూ ఘోర పరాజయానికే, విషాదకర సంక్షోభానికే దారితీస్తుంది.

అసూయను వదిలించుకోవడంలో మరొక మార్గాన్ని సారాంశంగా చెప్పుకోవచ్చు. మన స్వంతప్రతిభను గుర్తించుకోవాలి. మన హద్దులను ఎరిగి మన లక్ష్యాలను నిర్ధారించుకోవాలి. కష్టే ఫలిః. ఊరికే కూర్చుని దుర్భరమయిన అసూయలో ఉంటే, అదంతా అమూల్యమయిన కాలాన్ని వృథా చేసుకోవడమే.

**4.(i)** ఇదంతా చాలా కఠినమయిన పెనుగులాట అనుకునేవారు కూడా నిరుత్సాహ పడనవసరంలేదు. అదృష్టదేవత ఎవరినీ జీవితకాలం వరించదని, మనిషి అదృష్ట-దురదృష్టాలు ఊగిసలాడేవే అనీ మనకందరికీ అనుభవైకవేద్యం. ప్రస్తుతం మన మిత్రుడొకడు మనం అతనిని చూసి- అసూయచెందే స్థితిలో ఉంటే ఉండవచ్చుగాని, అతడు ఆ స్థితిలోనే ఎల్లకాలమూ కొనసాగుతాడన్న నిర్ధారణ ఏమీ లేదు. అతను అదుపు చెయ్యలేని ఒకానొక కారణంవల్ల, బహుశా అతను ఇవాళ ఉన్న స్థితి (దైవేచ్ఛ చేత- లేక మానవ చర్యచేత) తొలగి, అతడికే మనలను చూచి అసూయ చెందే స్థితి సంభవించవచ్చు. వ్యక్తులపరంగా, సమాజాల పరంగా, రాజ్యాల పరంగా; ఆఖరికి నాగరికతల పరంగా కూడా ఇలా జరగవచ్చునేందుకు ఉదాహరణలు చరిత్రలో కోకొల్లలుగా ఉన్నాయి. ఒకనాడు అన్నిరంగాలలో ముందు నిలిచి ప్రపంచ నాయకత్వం అనుభవించిన భారతదేశం ఈనాడు దిశదిశలా ప్రేరణకోసం పాశ్చాత్యదేశాలవైపు అర్రులు చాస్తోంది. మన చాతుర్వర్ణ్య రాచరిక వ్యవస్థలు ఒకనాడు విశ్వవ్యాప్తంగా, ఆమోద గౌరవాలు పొందిన సామాజిక, రాజకీయ పద్ధతులు. కాని, ఇప్పుడు అవన్నీకులరహిత, ప్రజాస్వామ్య విధానాలుగా లొంగుబాటు చూపుతున్నాయి. ప్రస్తుతం భౌతిక సంస్కృతులకు తావివ్వడం కోసం అలనాటి ఆధ్యాత్మిక నాగరికతలు తప్పుకుంటున్నాయి. పోనీ, ఈ కొత్త ప్రపంచపు చరిత్ర చూద్దామనుకున్నా, ప్రస్తుత రాజకీయ సంఘటనలను పరిశీలిద్దామనుకున్నా; వ్యక్తుల, రాజకీయ పక్షాల ఉత్థాన పతనాలు- వాటి వాటి అనుయాయుల (జ్యోతిష్కుల!) కనులకు ఎదురుగానే కనిపిస్తూ దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. ఈ కారణాలవల్ల అసూయను పారద్రోలడానికిగాను కఠినమయిన పెనుగులాట అవసరమేమోనని భయపడేవారు కూడా నిరుత్సాహపడనవసరంలేదు. ఓర్పువహించి వేచిచూడవచ్చును. మనము ఎవరివలన అసూయాగ్రస్తులమవుతామో, అతనిని ఆ అదృష్ట దేవతే (మననుంచి ఏ ప్రార్థనా, ప్రయత్నమూ లేకుండానే) కిందికి దించి మనలను పైకి ఎక్కించి, మనలోని అసూయకు గల కారణాన్ని సమూలంగా తొలగిస్తుందేమో. ఆనందం అనేది అనుభవిస్తే బాగానే ఉంటుంది; కాని, ఇప్పుడు అవగొట్టేసుకోకుండా భవిష్యత్తుకోసం దాచుకుంటే, మరింత మధురంగా ఉండగలదు.

( ) ఇది కేవలం ఆత్మరక్షణా వ్యూహమే కనుక (విజయపథంలో) సందేహాస్పదమయిన పద్ధతి. అయితే, ఈ నిరీక్షణా కాలాన్ని స్మృతి రాహిత్యం కోసం అభ్యసించి, (కొంత కాలంపాటు) అసూయను మనసులోంచి తరిమి వేయడానికి వినియోగించుకోవచ్చును. ఆలా తరిమివేసిన అసూయ ఎప్పుడయినా కనిపిస్తూ ఉంటుంది. అప్పుడు మనకు మనం

నచ్చ జెప్పుకోవాలి: "ఈ నిరీక్షణ తాత్కాలికం. ఇప్పుడు అసూయ అనేది ఒకటి ఉందన్న స్పృహ అనవసరం. అదృష్ట దురదృష్టాలు వాటి ప్రభావాలు చూపించేదాకా- కనీసం ఈ స్వల్ప కాలంపాటు- మరచిపోవడమే మంచిది. అసూయను పట్టించుకోకుండా విస్మృతిలోకి తోసెయ్యడానికి ఎన్నోమార్గాలు; కుమార్తె వివాహం, దేశంలోని సమకాలీన రాజకీయ పరిస్థితి- ఇలాంటివి ఏదో ఒకటి మనసులోకి తెచ్చుకుంటూ ఈ అభ్యాసాన్ని తరుచుగా సాగించుకోగలిగితే; అసూయను దూరంగా ఉంచడమే కాకుండా మరి కొన్నిరకాల అవాంఛనీయ ఆలోచనలను కూడా మనసులోకి ప్రవేశించకుండా చూసుకోవడం అలవడు తుంది. దీనివల్ల ఉత్తరోత్రా అభ్యసించవలసిన "సాధన"కు అవసరమయిన ఏకాగ్రత క్రమంగా ఒనగూడుతుంది. ఆ విధంగా ఆత్మరక్షణా వ్యూహంగా మనకు తటస్థ పడిన ఈ గుణాన్ని ఒక దీవెనగా రూపొందించుకోవచ్చు.

5. ఈ నిరీక్షణ ఒక్కొక్కప్పుడు (బహుశా చాలాసార్లు) ఒక జీవితకాలం కూడా చాలనంత సుదీర్ఘంగా సాగవలసిన అవసరం రావచ్చు. అయినా నిరుత్సాహ పడకూడదు. యోగ్యతనుబట్టిగాని, అదృష్టాన్ని బట్టిగాని ప్రస్తుతం మనమిత్రుడు మనకంటె కొన్ని రకాల ఆధిక్యతలను అనుభవిస్తున్నా, అదంతా చాలా తాత్కాలికం. ఈ తాత్కాలికత కూడా ఆ నిరీక్షణ లాగానే ఒక జీవిత కాలాన్ని మించి సాగవచ్చును. అయినా తాత్కాలికం అంటే తాత్కాలికమే. ఒకటి రెండు జన్మలుపట్టినా సరే దానిగమనం మారి తీరుతుంది. అప్పుడు త్రాసు మనవైపు మొగ్గి మనకు పరిపూర్ణ న్యాయం సంభవిస్తుంది.

"అన్ని జన్మలు ఆగాలా? నాకు ఇష్టములేదు, ఓపికాలేదు!" అనకూడదు.

అది తప్పనిసరి- అనిమనం తెలుసుకోవాలి. దైవాజ్ఞలు న్యాయబద్ధాలే కాక అప్రతి హతాలు. మనము వాటిని తప్పించుకోలేము. దైవాజ్ఞలను పాటించుకోవాలన్న కోరికలేకపోయినా, దైవాజ్ఞకోసం నిరీక్షించాలని అనిపించకపోయినా; రెండూ మనకు తప్పవు- అని గ్రహించాలి. సూర్యోదయాన్ని నిర్ధారిత సమయానికి ముందుగా సంభవించే టట్లు చేయలేము. నిరీక్షించక ఏం చేస్తాము? అదీ ఇదీ ఒకటే. అఖండ పరిమాణాత్మక మైన ఆత్మయానం పరిపూర్తి అవాలంటే, దానికి కోట్ల కొలది జన్మలు సాగాలి. దానిముందు (ఇలా అసూయను మరిచిపోవడానికి గాను సంభవించే-) ఈ జన్మలూ- కొద్దిపాటి పునర్జన్మలూ ఏపాటివి? అటువంటి దీర్ఘకాలికమయిన దృక్పథం, (అదే సరైన దృక్పథం కనుక) మన అంతిమ సుఖప్రాప్తికి ఆదర్శమార్గం. ఇంకొకటిలేదు.

ఇదంతా మన ఋషులు మనకు ప్రసాదించిన జ్ఞానం. ఆమోదించి పాటించు కుంటామా, లేక, తిరస్కరించి బాధ పడతామా- అది మన యోగ్యత.

6. మనకు ఇతరులను మించి ఒక ప్రయోజనం ఒనగూడితే, మనకు మనమీద అసూయ కలగదు. ఎందుచేత? మనం అంటే మనకు ఎంతో ఇష్టం కనుక. మన బిడ్డలలో ఒకరికి, వారిలో ఇతరులెవ్వరికీ లేని ఒక సహజ ప్రతిభ కలిగితే కూడా మనకు ఆ

బిడ్డపట్ల అసూయ జనించదు. ఎందుకంటే, మన బిడ్డలకంటే, వారి మధ్య ఉండే తేడాల కంటే; మనం ఉన్నతస్థాయిలో ఉన్నామని అనుకుంటాము.

మన స్వంత విషయాలను కూడా ఇలాంటి తాత్త్విక దృష్టితో చూసుకోవాలంటే-

(i) మనం అంటే మనకు ఎంత ఇష్టమో, (మనకు అసూయ కలిగించగల) మన మిత్రుడంటే కూడా అంత ఇష్టముండాలి.

(ii) ఈ మిత్రుడుగాని, మనంగాని విశ్వాత్మశకలాలుగా, ఒకే చేతికి ఉండే వేళ్లలాగ సమానులము. సమానులమధ్య పొడవు, పొట్టి- వంటి భేదాలున్నా అసూయలుండవు.

(iii) పులకరం కలిగించే మహాసూక్తుల స్పృహలో మునిగి తేలి, మనము అసూయ అనే క్షుద్రభావానికి అతీతులము- అని తలపోయాలి.

...అప్పుడు అసూయ మనలోపల్లోపలే ఆహుతి అయిపోతుంది.

7. ఇంతకుముందు (నాలుగవ ప్రకరణములో) భగవంతుడు సర్వన్యాయవేది- అనీ కొంచెం అటూ ఇటూగా అన్ని వ్యక్తియాత్మలకు న్యాయం జరుగుతుందనీ చెప్పుకున్నాము. అది ఒక సిద్ధాంతం అనుకున్నట్లయితే, దానికి ఉపసిద్ధాంతంగా మరికొన్ని మాటలు చెప్పుకొని, (ఆ ఆలోచనల ద్వారా) అసూయను పరిపూర్ణ తృప్తితో వదలగొట్టుకోవచ్చు.

"నా మిత్రుడు ఇప్పుడు నాకంటే కొన్ని లాభదాయకమయిన పరిస్థితులలో ఆనంద పడుతున్నట్టుంది, అలాగే కానీ. మరి నేనుకూడా నా పూర్వజన్మాలలో అట్టి ఆనందం అనుభవించి ఉన్నానేమో, కనుక అతడు అనుభవిస్తున్న సుఖ-ప్రయోజనాన్ని, (చూసి అసూయ పడకుండా) అలా కొనసాగనివ్వడమే న్యాయం."

"సర్వేజనాః సుఖినోభవంతు." ... ... ... బంగారంలాంటి సూత్రం. అందరూ స్పృహలో ఉంచుకోవలసిన తిరుగులేని సూత్రం.

ఈ వాక్యాల(వలన) పరిపూర్ణ ప్రయోజనాన్ని సాధించుకోగోరే "సాధకుడు" వాటిని చదవడంతోనూ, ఆమోదించుకోవడంతోనూ సరిపెట్టుకోకూడదు. వాటిలోని సారాన్ని తన చర్యలలో పాటించాలి.

## మాత్సర్యం

మాత్సర్యం అనేది తీవ్రరూపంలో దర్శనమిచ్చే అసూయ. ఎవరో వచ్చి తన స్థానాన్ని ఆక్రమించి, తనను వైదొలగింపజేస్తున్నారనే భావం దీనికి మూలం. వ్యక్తులపట్లగాని, సామాజిక, ఆర్థిక, సాంసారిక స్థితులపట్లగాని మాత్సర్యం జనించవచ్చు. అపేక్ష, భార్యాభర్తల నడుమ ఉండే సదవగాహన, స్నేహితులపట్ల (వ్యవహార) భాగస్థుల పట్ల ఉండే ప్రేమ- ఇలాంటి చాలా విషయాలలో మాత్సర్యం జనించే అవకాశాలున్నాయి. మానవుడి జీవితంలో సంభవించే, అనేకానేక భావానుభవాలలో ప్రేమ అనేది అత్యంత శక్తిమంత మయిన వాటిలో ఒకటి. కనుక మాత్సర్యానికి అక్కడ అప్రతిహతమయిన స్థానం. దీని ఆకార స్వభావాలు నిర్వచించడానికి కష్టతరమయినవి. ఒక్కొక్కప్పుడు ఒక క్రూరమృగం

పాత్రలో దర్శనమిస్తుంది. అప్పుడు మాత్సర్య బాధితుడు దానిని క్రమ శిక్షణలో పెట్టుకోవడానికి గాని, మచ్చిక చేసుకోవడానికిగాని దుస్సాధ్యమై చివరికి ఆత్మహత్యకో, హత్యకో దారితీయడం ఉంది. కనుక అడ్డుకట్ట వెయ్యలేని ఆ ప్రవాహాన్ని అదుపు చెయ్యాలంటే మనిషి మరెంతో బలవత్తరమయిన ప్రయత్నం చెయ్యవలసి వస్తుంది. తీవ్ర వ్యాధులు కఠోర చికిత్సలకి గాని లొంగవు. మాత్సర్యంలో ఎన్నోరకాలు ఉండవచ్చు. కాని అన్నిటిలో స్త్రీ-పురుష సంబంధాల వలన (ద్వారా) కలిగే దానిముందు మిగిలినవన్నీ తీసికట్టే. కనుక దానిని గురించి చర్చించుకుందాము. స్త్రీ-పురుషసంబంధాల వలన ఏర్పడే మాత్సర్యం ఇరువర్గాల వారికి సమానమే. అయితే చర్చను సంక్షిప్తం చేసుకోవడానికి గాను పురుషుడికి తన భార్యపట్ల లేక, ప్రియురాలిపట్ల కలిగే మాత్సర్యాన్ని గురించి మాత్రమే చర్చించుకుంటే చాలు. ఈ చర్చలోని విషయాలు స్త్రీలకు కూడా సమానం గానే వర్తిస్తాయి. కాకపోతే, అదే ధోరణిలో వర్తిస్తాయి.

అసలు సమస్యకు కారణం "నీవు" కావచ్చు, "ఆమె" కావచ్చు, "అతడు" కావచ్చు.

1. (i) "నీవు" అయితే వారిద్దరిలో ఒకరినిగాని, ఇద్దరినీగాని అనవసరంగా అపార్థం చేసుకుని "నీ" నెత్తిమీదకి "నీవే" ఒక అనుకోని ఆపదను తెచ్చుకుంటున్నావేమో, కనుక; కారణం "నీవు" అవునో కాదో నిస్సందేహంగా తేల్చుకో. వారిద్దరి మధ్య నిజంగా ఆకర్షణ నెలకొన్నదని పూర్తిగా ఋజువయ్యేంతవరకు కలత చెందకూడదు.

(i) ఆ ఆకర్షణకు కారణం నీలోనే (త్రాగుడు లేక మరొక స్త్రీపై నీ ఆసక్తి రూపంలో) ఉన్న బలహీనత గాని, పాపంగాని అయితే సమస్యను పరిష్కరించుకోవడానికి ప్రయత్నం చేసే ముందే దానిని (నీ బలహీనతను) అదుపులో పెట్టుకోవాలి. ఇది నీకు చేతనయ్యే పనే. "నీవు" దారి తప్పిఉంటే, ఆమె "నీ" "వ్రత"గా ఉండాలని ఆశించడానికి "నీకు" ఎట్టి నైతిక హక్కు ఉండదు. చిరకాలం నిలువవలసిన స్నేహాలు చపలమయిన నైతిక ప్రమాణాలమీద ఆధారపడి ఉండవు.

2. (i) "ఆమె"తో బంధం ఏర్పడడానికి ముందు ఆమెకు కలిగిన సంబంధాలను "నీకు" బహిర్గతం చేయకపోవడము, శీల ప్రవృత్తి నియమోల్లంఘనాలు- మొదలయిన వాటి ద్వారా పాపం "ఆమెదే" అయితే; "ఆమె" స్వభావంలోని బలహీన లక్షణాలేమిటో అన్వేషించి, కనుగొని, ఆ లక్షణాలపై దాడి చెయ్యడం ద్వారా "ఆమె" దుష్ప్రవర్తనను సరిదిద్దాలి. అనియతమయిన చర్యలకు పాల్పడడానికి కారణమయిన "ఆమె" మూర్ఖత్వం నుండి "ఆమెను" మళ్లించడానికి; నచ్చజెప్పడం, భయపెట్టడం, బ్రతిమాలుకోవడం, కవ్వించడం- లాంటి పద్ధతులని అనుసరించవచ్చు. "ఆమె" చుట్టూ "నీవు" విధించే గూఢచర్య వలయాన్ని పటిష్టం చేసి, "ఆమెకు" "నీవు" ఇచ్చే ధన- సౌకర్య- ఆది- హక్కులను పరిహరించి, ఆమె అనియత చర్యలకు పాల్పడే స్థలం నుండి "ఆమెను" దూరంచేసి- కూడా "ఆమెను" దారికి తెచ్చుకోవచ్చు. అప్పటికీ "ఆమె" బాగుపడకపోతే (ఆ సంస్కరణోద్యమాన్ని) అక్కడితో ఆపెయ్యాలి.

(i) అయితే, కర్తవ్య పరాయణుడవయిన భర్తగా "నీవు" "ఆమె" పట్ల నిర్వర్తించ వలసిన బాధ్యతలను (ఎలాంటిద్వేషం, అసహ్యం లేకుండా) నెరవేరుస్తూనే ఉండాలి. ఇంటి పనులలో "ఆమెకు" సహాయపడుతూ; సాంస్కృతిక కార్యక్రమాలకూ, విందులకూ, "ఆమెను" వెంటబెట్టుకు వెళుతూ; ఆమె జన్మదినాలను ఘనంగా నిర్వహిస్తూ- ఇలాటివి కొన్నిచేసుకుంటూ పోయి, "ఆమెను" సంతోషపెట్టాలి.

(అనుమానమో, ద్వేషమో ఏర్పడిన నేపథ్యంలో) ఇటువంటి సంతోష పెట్టడాలు ఇంతకుముందు "ఆమె" మీద ప్రయోగించిన చర్యలకంటే కష్టతరమయినవే. కాని సాధకుడు అనేవానికి ఇదే అన్నిటికంటే ముఖ్యం. ఎందుకంటే, మనకు ఏర్పడిన విద్వేషాన్ని అణిచిపెట్టుకొని, మీదుమిక్కిలి మన చిత్తానికి వ్యతిరేకంగా, దేహాన్ని లగ్నం చేయాలి.

అక్కడ ఉంది, అసలుకిటుకు. చిత్తాన్ని అదుపులో పెట్టుకుని, దేహాన్ని లగ్నం చేయడము- అనేది "ఆమెను" దారిలో పెట్టడానికే కాదు, మన స్వభావంలో ఉన్న, మన ప్రగతికి అడ్డువస్తున్న- మరింత ముఖ్యమయిన శత్రువు(మాత్సర్యం)ని జయించడానికి.

3. () ఇక ఈత్రయంలో మూడోశక్తి "అతడు." దుర్మార్గుడు కావచ్చు. బలవ ద్విరోధి కావచ్చు. ఎన్నిరకాలుగానో మంచిగా చెబితే విననివాడు కావచ్చు. అప్పుడు బాహాటంగా కదనరంగంలోకి దిగాలి. వాక్కుద్వారా, చట్టంద్వారా, ఆఖరికి బల ప్రదర్శన ద్వారా, మనకి అందుబాటులో ఉండే ఏ శక్తుల పద్ధతుల ద్వారానో ఈ కదనం సాగాలి. (ఈ కదనాన్ని నిర్వహించవలసినది స్త్రీ అయితే, సత్యాగ్రహ మార్గాలు ఉపయోగించ తగినవి. ఉపవాసాలు చేసీ, హింసకు ప్రతిహింసమానేసి, ఇంటిపని మానెయ్యడం లాంటి సహాయ నిరాకరణ చేసి- ఎలాటి ఫలితాలు కలుగుతాయో, వేచి చూడవలసిందే.)

ఏ విషయంలో నయినా, కారణం న్యాయమయినదయితే శారీరకంగా చేసే యుద్ధం హింసకాదు, పాపమూ కాదు. పోరాటం అనేది (న్యాయకారణాన) సంభవించాలే కాని, ఆ పోరాటం మాటలతో జరుగుతోందా, మారణాయుధాలతో జరుగుతోందా, అనే వివక్ష, ఆ పోరాటం వల్ల మనం బాధించేది మనసునా, లేక శరీరాన్నా, అనే వివక్ష- అప్రస్తుతం. పోరాటం అనేది ఒక ధర్మం అయినప్పుడు దానిని నిర్భయంగా జరపడమే ముఖ్యమయిన పని. మాత్సర్యం- అనే సందర్భంగా అన్వయించుకుంటున్నప్పటికీ సరిగ్గా వ్యాఖ్యానించు కుంటే, న్యాయసమ్మతంగా పాటించుకుంటే భగవద్గీత చెప్పే తత్త్వం అదే.

కాబట్టి, పోరాడాలి. ఆ పోరాటంలో అవసరమయితే వీరోచితమయిన మరణం పొందాలి. అంతేకాని, జీవితాంతం హీనంగా, తలవొగ్గి బాధపడకూడదు. దానివలన ఇతరులకు మార్గదర్శకం గాను, కొంటె పనులు చేసేవారికి భయంకరంగాను మిగులు తాము.

(i) పోరాడినది బలవద్విరోధితో కనుక, ఓటమి సంభవించవచ్చు. ఉద్యోగం పోవచ్చు. అన్యాయం, అవమానకరం అనిపించే శిక్షలు తగలవచ్చు. చివరికి కారాగారం ప్రాప్తించ వచ్చు. కాని, సాధకుడికి తన ప్రగతిమార్గంలో, పోరాటంలో వలెనే- ఓటమిలో కూడా,

ఒక మంచి అవకాశం లభిస్తుంది. అతడు ఈ వ్యథనంతటినీ ఒకమంచి పంటకోసం వేసే (దుర్గంధపూరితమయిన) ఎరువు వెదజల్లేందుకు చేసే ప్రయత్నంలాగా మార్చుకోగలడు.

పోరాటం అనే దానిని ఒకానొక కర్తవ్యంగా భావించి నిర్వహిస్తే, దాని పరిణామాలను నిరామయంగా స్వీకరించి, మన విధిని మనము చాలాబాగా నిర్వర్తించామని తృప్తిగా ఊపిరి పీల్చుకోవచ్చును. కష్టమే. కాని, ఫలవంతమే. అయితే, దీని నిర్వహణ ఎలాగ-అనేది ఒకప్రశ్న. పోరాటం తన పాత్ర అయిపోయింది కదా అని అక్కడితో ఊరుకోదు. రాత్రనక, పగలనక అన్నివైపులనుంచి, దానిని గురించిన ఆలోచనలు మనకి ఇష్టంలేక పోయినా, అకస్మాత్తుగా మనలను వేధిస్తూనే ఉంటాయి. ఆ వేధింపు సంభవించినప్పుడల్లా "మానసిక క్రమశిక్షణ" అనే పేరిట మనము ఇంతకుముందు చెప్పుకున్న ప్రకరణంలోని సూచనల ప్రకారం వాటిని మనసునుండి తరిమివేయాలి.

(i) "నేను సాధకుడను. అవరోధాలకి జడవకుండా, ఫలితాలని పట్టించుకోకుండా నిరామయంగా ఎలా ఉండాలో నేర్చుకోవడమే నా జీవిత లక్ష్యం. అందుచేత ఇలాటి ఆలోచనలు ఎన్ని వచ్చినా, వాటి వలన నా ప్రశాంతికి భంగం వాటిల్లనివ్వను. అనిగాని, అంతకంటే బాగా గాని: మనసుకు పదే పదే నచ్చ జెప్పుకోవాలి.

(i') జపం, ప్రార్థన- ఇలాంటి అనిర్మాణాత్మకమైన వ్యాపకంతో మనసును నింపుకోవచ్చు. ఆలా ఒకరోజో రెండు రోజులో చేస్తే చాలకపోవచ్చు. (అలా చాలడం లేదని గ్రహింపుకి వస్తే) చాలినంత కాలంపాటు దానిమీదనే ఉండాలి. అప్పుడు ఆ మాత్సర్యపు ఆలోచనలను తప్పించుకొనే ప్రక్రియకు విజయం తప్పక లభించి వైరాగ్యాన్ని అలవరచుకొనే స్థితికి చేరుకుంటాము. పట్టుదలే విజయానికి ముఖ్య సహాయకారి. ★

## పధ్నాలుగవ ప్రకరణము

# కోరికను చంపడం ఎలా?

**కోరిక అనేది తృప్తి చెందని అగ్నివంటిది.**
**అది జ్ఞానాన్ని కూడా ఆవరించుకొని ఉంటుంది.**
**కనుక, జ్ఞానులకు అది నిరంతర శత్రువు.**

-శ్రీమద్భగవద్గీత, కర్మయోగము:39

కోరిక అంటే మనము పొందలేని దానిని అపేక్షించడం. భార్యకావాలని కోరుకొనేది బ్రహ్మచారేగాని వివాహితుడు కాదు. వివాహితుడు ఇంకొక భార్య కావాలని కోరుకుంటే, (అది బహుభార్యాత్వము అమలులో ఉన్న సమాజంలో అయితే-) అతడు కోరేది (పొంది ఉండనిది) రెండవ భార్యే తప్ప మొదటిభార్యకాదు. ఒక ధనవంతుడు మరిన్ని సంపదలకోసం ఆశపడితే, అతడు పొందిఉండనిది "ధనం" కాదు, "మరింత ధనం".

(కోరిక అనేది సర్వవ్యాపితం, సార్వజనీనం, సార్వకాలికం.) రాజైనా, రైతయినా, చిన్నఅయినా, పెద్దఅయినా, మగఅయినా, ఆడఅయినా, పర్వతాగ్రాన ఉన్నా, సముద్ర గర్భాన ఉన్నా; ఎక్కడయినా, ఎలాగయినా, ఎవరయినా సరే- కోరికలు ఉండేవారే. కనీస విద్యార్హతగల వాడు పండితుడు కావాలని. పండితుడయినవాడు పండిత ప్రకాండుడు అవాలని, భూమికి రాజయినవాడు విశ్వాంతరాళాన్ని జయించాలని; అలా కోరుకుంటూనే ఉంటారు. కోరికలు అన్నిచోట్లా ఉంటాయి, ఎన్నటికీ తీరవు; అవి అసంఖ్యాక రకాలు. అవి ఆకాశం కూడా పట్టనంతటివి.

ఆధ్యాత్మికప్రగతికి తటస్థపడే రెండు రకాల తీవ్ర అవరోధాలనూ కలిగించని కోరికలు సమస్యలుగా పరిణమించవు.

(i) మనలో చాలామందిమి సాధారణ మానవులము. అంతేకాక, శీలభ్రష్టమైన ఆధునిక సమాజంలో నివసిస్తున్న వాళ్లము. ఇక్కడ బయటనుంచి వచ్చి, మనమీద పడే పాపాల బాధవుంది. దానిని ఎదుర్కోవడానికి; లేదా, దానితాకిడినుంచి మనలను మనం కాపాడు కోవటానికి; తప్పనిసరిగానూ, తప్పులని తెలిసినా కూడానూ; కొన్ని పాపాలు చెయ్య వలసివస్తుంది. కాబట్టి అలాంటి కోరికలను నెరవేర్చుకొనే ధ్యేయంతో చేసే ప్రయత్నాలు అన్యాయపు మచ్చలతోనూ ఇతరులకు ప్రతికూలంగానూ ఉండకతప్పదు. ఇవికాక మనకు అర్హత ఉన్నా, లేకపోయినా కొన్ని కోరికలు ఉద్భవించవచ్చు. ఒక అధికారి తాను మరికొంచెం పెద్ద అధికారి అవాలని, ఒక న్యాయవాది తన పక్షంలో న్యాయం లేకపోయినా గెలవాలని, ఒక ఉపాధ్యాయుడు తన అనుయాయికి సరయిన అర్హత లేకపోయినా పై తరగతికి చేరిపోవాలని, ఒక ప్రేమికుడు ఎందరో ఇతరులు కోరుకుంటున్న పడుచు తనకే భార్య అవాలని: ఇలా, రకరకాల మనుష్యులకు రకరకాల పరిస్థితులలో రకరకాల

కోరికలు. అలాంటి సందర్భాలన్నిటిలో మనుష్యులు లంచగొండితనానికి, అబద్ధపు సాక్ష్యాల సృష్టికి, స్థిరపడిఉన్న పత్రాలలో జోక్యానికి- ఇలా ఎన్నో రకాల పాపకార్యాలు చేయడానికి గాను గౌరవహీనమయిన అభ్యాసాలకు లోనుకావలసి వస్తున్నది. ఇదంతా పాప భూయిష్ఠ మయిన మార్గమనీ, క్రమంగా దీనిని వదిలించుకోవడం చాలా కష్టమవుతుందనీ చెప్ప నవసరంలేదు.

(ii) కొన్ని ధ్యేయాల్ని సాధించుకొనే పరిణామంలో యాదృచ్ఛికంగా చేసే పాపాలు సులువుగా కనిపెట్టడానికి వీలవుతుంది. పరిహరించుకోవడానికి కూడా వీలవుతుంది. కాని, మరికొన్ని రకాల కోరికలు కుయుక్తి కరమయినవి, మరింత తీవ్రమయినవి, ప్రమాద కరమయినవి ఉంటాయి.

కోరికలనేవి మనిషిని ప్రాపంచికమయిన బంధాల ఉచ్చులలో చిక్కుకొనేటట్లు చేస్తాయి. భగవద్గీత సూక్తులు వైరాగ్యాన్ని ప్రతిపాదిస్తాయి. అనగా బంధాలను పెంచుకొనే వాడు (కోరికలచే వ్యామోహితుడైన వాడు) భగవద్గీత బోధలను కాదన్నట్లే. "కోరిక" అనే దానిలో ఏదోఒక విషయంపైన స్పష్టంగా కానవచ్చే అనురక్తి, లేదా, ఇంకొక విషయం పైన చాటుగా తప్ప కానరాని ద్వేషం, అనిష్టత- నిబిడీకృతమై ఉన్నాయి. ఈ రెండు భావాలూ భగవద్గీత బోధలకు వ్యతిరేకమైనవే. "కోరిక" మొలకెత్తుతూనే తనతోబాటుగా ఒకానొక వ్యూహాన్ని తెచ్చుకుంటుంది. ఆ వ్యూహం ప్రకారం ఆ కోరికని మంచిగానో, చెడ్డగానో సాధించుకుని తీరాలి. ఈ మంచి-చెడులలో పొగడ్తలుంటాయి, బ్రతిమాలుకోవ డాలుంటాయి; కొందరికి సేవలు చేయడాలు ఉంటాయి; తిట్లు, బెదిరింపులు, శాపనార్థాలు- ఎవరినో సంతోషపెట్టడం నుంచి, ఇంకెవరినో అణగదొక్కడం వరకు ఆ వ్యూహ నిర్వహణలో ఎన్నెన్నో ఉంటాయి. ఇది అనిర్మాణాత్మకమయిన వ్యవహారం. కనుక సహజంగానే ఇతరులు దీనిలో ప్రవేశించి మనం ఏమిచేస్తామో వాటికి విలోమ భావంతో సానుభూతి, ఉపకారం, స్నేహం, అనిష్టత, తిరుగుబాటు, శత్రుత్వం- వంటివి ప్రదర్శిస్తారు. వేరువేరు వ్యక్తులమధ్య పరస్పర-వ్యతిరేక ప్రయోజనాలు ధ్యేయంగా సంభవించే, భావ-ప్రతిభావ చెరలాటలు వారిమధ్యఉన్న విభేదాలకు విరుగుడు కలిగించ లేకపోతాయి. దానిమూలంగా మరిన్ని కోరికలు, మరిన్ని ఎత్తుకుపైఎత్తులు, రకరకాల గ్రహభేద ప్రస్తారాలుగా సంభవిస్తాయి. ఇరు వైపులా వాటికి ఫలితంగా ఏర్పడే సమస్యలూ మళ్లీ వాటికి పరిష్కారాలూ పుట్టుకొస్తాయి. అన్నీ చేరి, ప్రాపంచిక ధ్యేయాల సాధన కోసం ఒకానొక మాయాజాలం ఏర్పడి, అది నిరంతరం బిగుసుకుంటూ, విచ్చుకుంటూ ఉంటుంది. "కోరిక" అనేది ఆధారంగా ఇంత అవ్యవస్థ కలిగి, మరిన్ని ప్రాపంచిక బంధాలకూ, మరిన్ని కోరికలకూ దారితీసే ఒకానొక భ్రష్టవలయం ఏర్పడుతుంది. ఈ గందరగోళంలో "వ్యక్తి" అనాధ్యాత్మిక భావాల బురదలో కూరుకుపోయి, ముక్తిమార్గానికి మూల వైశిష్ట్యం అయిన విరక్తికి దూరమవుతాడు.

అందుచేత "సాధకుడు" తనపురోగతికి ఎక్కడ పడితే అక్కడ శనిగ్రహంలా దాపురించే "కోరిక"ను ప్రథమ శత్రువుగా పరిగణించి, దానిని తన స్వభావంలోంచి వీలయినంత వేగంగా, పూర్తిగా పరిహరించుకోవడానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చే ప్రయత్నాలు చేయాలి.

★ ★ ★

"కోరికలు లేని మానవుడు తానే భగవానుడు" - అని అంటే, అదేదో వట్టి కవిత్వం కాదు.

"కోరిక అనేది ఒక వ్యాధి"- అని పరిగణిస్తే, దాని చికిత్సను ప్రారంభించే ముందు మూడువిషయాలు స్పష్టంగా గమనించుకోవాలి.

1. "కోరిక"వేరు, "అవసరం" వేరు.

ఆకలితో బాధపడేవాడు ఆహారం కోసం చేసే ఆక్రందన అవసరాన్ని బట్టి వచ్చినదే గాని, (మనం ఇప్పటివరకు చర్చించుకున్న) "కోరిక" వలన కాదు. ఒక అధికారి తన తాబేదారులు అందరూ తనకు విధేయులుగా ఉండి, పనిచేయాలని ఆశిస్తే, అది అతని గొప్పతనాన్ని ప్రదర్శించుకోవడానికి పుట్టే కోరిక కాదు; తనకూ వారికీ నియతములయిన పనులు సక్రమంగా జరగడానికి, అతడు తప్పనిసరిగా అవలంబించవలసిన విధానమే. అవసరము తీర్చుకోవలసినదే. కాని, కోరిక అనేది అణగదొక్కవలసినది.

అవసరము- అనే దానికి ప్రామాణిక మయిన నిర్వచనము చేయలేము. కొందరు కొందరు వ్యక్తులు వారివారి విధులను బట్టి, సమాజ రూపాలను బట్టి, శీతోష్ణ ప్రాబల్యాలను బట్టి కొన్ని కొన్ని కోరికలకు బద్ధులవుతారు. ఒక్కొక్కప్పుడు శీతోష్ణ, సామాజిక పరిస్థితులు సమానంగా ఉండే వ్యక్తులమధ్య కూడా వారి అవసరాలలో, వారి వారి జీవితాదర్శాలనూ, అభిరుచులనూ బట్టి, ఆరోగ్యస్థితులనుబట్టి, మనస్తత్వాలను బట్టి వారి వ్యక్తిగత అవసరాలు వేరు వేరుగా ఉండవచ్చు. ఒకరికి ఖచ్చితంగా అవసరమయినదేదో, రెండో వారికి శుద్ధదండగ కావచ్చు. ధ్రువప్రాంతంలో నివసించే వారికి తోలుతో కుట్టిన ఉడుపులు అవసరం; కాని, ఉక్కగా ఉండే ఎడారిలో తిరిగే వారికి అవి మోత చేటు. మంత్రి పదవిలో ఉన్న ఒకనికి సమర్థుడయిన కార్యదర్శి అవసరం; కాని, ఒక వ్యవసాయ కూలీకి అది తలకుమించిన భారం.

2. ఆశయ సాధన నిమిత్తం ప్రణాళిక రూపొందించుకొని, దానికి సిద్ధపడడం కొందరి దృష్టిలో కోరిక-అనిపించుకుంటున్నది. కాని "ఆశయం" అనేదానిని "కోరిక"గా పేర్కొనడం సమంజసం కాదు. ఎందుకంటే, ఒకవ్యక్తి ఏదయినా వ్యాపృత్తిలో ఉన్నతి చెందాలంటే, దానికి ఒక (ఆశయం) ఒక ప్రణాళిక దాని సాధనకు మొదటిమెట్టే అవుతుంది. ఒక నిరుద్యోగి ఉన్నాడనుకుందాము. అతడు తన శక్త్యానుసారం కొంత డబ్బు అప్పుతెచ్చి, దానిని ఒక స్వయం ఉపాధి పథకంలో పెట్టుబడిగా వాడుకున్నాడంటే, అది అవసరమే గాని "కోరిక"కాదు. గట్టిగా పట్టుపట్టి, విపరీతార్థం తెచ్చుకుంటే తప్ప, అవసరం ఎన్నటికీ "కోరిక" కాజాలదు.

అందుచేత ఎవరికి వారు నిష్పాక్షికంగా ఆలోచించుకోవాలి. ఏదయినా ఒక సందర్భంలో ఒక వస్తువును (ప్రయోజనాన్ని) సాధించాలనుకోవడం తప్పనిసరి అవసరం కిందికి వస్తుందా; లేక, ఆశాపాశం అవుతుందా- అనేది నిర్ణయించుకోవాలి. అవసరం అనిపించినట్లయితే, దానిని పొందితీరాలి, ఆశ అనిపించినట్లయితే దానిని తప్పక విసర్జించాలి.

3. "కోరిక"ను గురించి ప్రాధమికంగా చెప్పుకొనేవాటిలో చివరిది ఒకటుంది: కోరికలకి పరిణామాలుంటాయి. ఈ కార్యకారణ సంబంధం ఎలాటిదంటే, ఆ పరిణామాలు ప్రస్తుతకాలంలో పూర్తిగా వ్యాపించడంతో ఆగిపోక, భవిష్యత్తులోకి కూడా లోతుగా చొచ్చుకుపోతాయి. ఋణానుబంధం పరిసమాప్తి కావడానికి ముందుముందు జన్మలవరకు జీవిని వెంటాడుతాయి. అలాగే, తీర్చుకోలేని కోరికలు కూడా మానవుడిని ఈ జన్మతో వదిలిపెట్టకుండా వాటి పరిపూర్ణ పరితృప్తికై జన్మజన్మాల కాలం పీడించుకుతింటాయి. ఈ లోపుగా అదృష్టం వల్లనో, స్వప్రయత్నం వల్లనో అతడు మేల్కొని, "కోరికలు" చేస్తున్న అల్లరిని గ్రహించి, వాటిని పూర్తిగా మట్టుపెట్టకపోతే; కోరికలు "పిల్లకోరికలను" సృజించి, (వాటిని అతడిమీద ప్రయోగించి), మరిన్ని జన్మలపాటు వేధించే ప్రమాదం ఉంది. ఈవిధంగా కోరికలు - అనేవి మానవుడి భవబంధాలను దీర్ఘం చేసి, ముక్తికి ఆటంకంగా నిలిచే "కర్మ"కు ముఖ్య అంగంగా నిలుస్తాయి. కనుక అంతిమ విముక్తి కోసం ఆశించే ప్రతి వ్యక్తియాత్మ: కోరికలను విషము వంటి భయంకర పదార్థంగా గ్రహించి, వాటిని అంతం చేయాలి.

ఇక్కడ మరొక సూక్ష్మ విషయాన్ని గమనించవలసి ఉంది. ఇది "కోరికలు - వాటిని చంపే పద్ధతులు" - అనే దానికి అనుబంధ విషయంగా తీసుకోవచ్చు. అప్పులు అనేవి సహజ జీవనగతికి తగిలే పక్కదారులు. వాటిని తప్పించుకోవలసిందే. అయితే, మనము తెచ్చుకొనే అప్పులు మన బాధ్యతలుగా నిలిచి, మన (ప్రగతికి మనం చేసుకొనే) ప్రయత్నాల ప్రతిదశలో మనలను క్రుంగదీసినా, మనము (ఇతరులకు) పెట్టే అప్పులు (మనకు అండగా నిలిచి) సహాయపడతాయి. అలాగే కోరికలలో కూడా చెడ్డవి ఉన్నట్టే, మంచివి కూడా ఉంటాయి. సంపూర్ణ వాంఛారహితత్వం ఆదర్శప్రాయమే అనుకున్నా, ముక్తి సాధనానికి ఆరోగ్యకరమయిన ప్రేరణలుగా నిలిచే "మంచి కోరికలను" - మనకు లభిస్తున్న ఒకానొక రాయితీగా పరిగణించి - భరించవచ్చును.

కనుక (మనలో కలిగే) అన్ని "చెడ్డ కోరికలను" నిర్దాక్షిణ్యంగా వదల గొట్టుకొని, "మంచి కోరికలని" కూడా సాధ్యమయినంతగా తగ్గించుకోవలసి ఉంటుంది.

## ముఖ్యమయిన కోరికలు

మానవుడికి తటస్థపడే ముఖ్యమయిన కోరికల మూలాలను స్థూలంగా నాలుగు అని చెప్పుకోవచ్చు.

1.ధనం, 2.లైంగిక ప్రవృత్తి, 3.అధికారం, 4.కీర్తి.

## ధనం

అతీత జ్ఞానసంబంధితత్త్వవేత్తలు ఎంతగా కాదన్నా- ఆహారం, నీరు లేకపోయినా బ్రతకగలమని అనుకుంటే తప్ప - ఆధునిక సమాజంలో ధనం లేకుండా మనం జీవించలేమన్నది లోకానుభవము. మానవుడు ఒక అంగుళం మేర కదలాలన్నా, ఒక నిమిషం పాటు జీవించాలన్నా, అవసరమయ్యేది ధనమే.

ధనం, మానవుడికి; కేవలం - ఆహారం, వసతి, దుస్తులు - సమకూర్చడం మాత్రమే కాక; అతను తన ఆనందం కోసం కోరే విలాస వస్తువులనన్నిటినీ కొనిపెట్టగలది. అతడు నెరవేర్చుకోగోరే అన్ని కోరికలనూ తీరుస్తుంది.

ఈ నేపథ్యంలో - ప్రపంచాన్ని పాలించేది మనిషి కాదు, ధనం: అనిపిస్తుంది.

ధనం మానవుడి మీద సర్వశక్త్యాత్మకమయిన ప్రభావం చూపించడంవల్ల, అతడు ధనాన్ని నిజంగానూ, నిజాయితీగానూ దైవంగా ఆరాధించవలసిందే. అయితే నాణేనికి బొరుసులాగా క్రమానుగతమయిన శనిగ్రహపాలన కూడా దానిలో ఉంది.

ధనం మనం కోరే అనేక వస్తువులను గుప్పిస్తుంది. కాని, అది మనలో మరిన్ని కోరికలను సృజించి, (అవి నెరవేరేటందుకుగాను) మనం దానిమీద మరింతగా ఆధారపడేటట్లు చేస్తుంది. దారి పక్కన (ఎండా వానా అనక) పడి ఉండే వాడికి నిరాడంబరమయిన ఒక గుడిసెను ప్రసాదించడంతో అది ప్రారంభమవుతుంది. క్రమంగా గుడిసెను ఒక డాబా ఇల్లుగా వృద్ధి చెందించాలనీ; అది నెరవేరాక దాని చుట్టూ ఒక అందమయిన ఉద్యానవనం ఏర్పరచి, ఒక దివ్యభవనంగా రూపుదిద్దాలనీ కోరికలు అలా పుట్టుకొస్తూ ఉంటాయి.

తన ఆవాసాన్ని మెరుగు పరచాలని అనిపించినప్పుడల్లా; మానవుడు అది ఒక విలాసాత్మకమైన ఆలోచన కాదనీ, "అవసరమే" అనీ, అది తన స్థాయికి తగ్గ కనీస సదుపాయమే తప్ప, అసందర్భమయిన వృథా ఖర్చు కాదనీ, భావించుకుంటూ వస్తాడు. ధనం చాపకింద నీరు లాగా విజృంభించి; మానవుడు అవసరానికీ, ఆశకీ మధ్య గీత ఎక్కడో, కనీస అవసరానికీ అవివేకమయిన ఆడంబరానికీ తేడా ఏమిటో తెలుసుకో లేనంతగా నిగూఢంగా అతనిని అంధకారంలోకి తీసుకుపోతుంది. కోరికలు గుణీకృతమై పాపాలు పెరగడమే దీని పరిణామం.

ఇంకొక విషయం ఉంది. ధనాన్ని పోగుచేసుకొనేటందుకు మానవుడికి కలిగే కోరికను సమాజపు ప్రయోజనాలకు ప్రమాదం తెచ్చిపెట్టేదిగానూ, ప్రగతి నిరోధక తత్వంగానూ చెప్పుకోవడం ఉంది. అయితే, మనిషి తనను తాను (పరి)పోషించుకోవాలన్నది ఒక అంగీకృతన్యాయం. దానికి ఒక ఉపసిద్ధాంతం పుడుతుంది. ప్రభుత్వము, సమాజము- పిచ్చి పిచ్చి ఊహలతో, అస్థిరమయిన ప్రమాణాలతో కొనసాగుతున్న ఈ రోజులలో;

ఎప్పుడు ఏ ఉపద్రవం వచ్చి పడుతుందోననే భావంచేత తీసుకునే ముందు జాగ్రత్త చర్యగా, దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవడం తప్పు అవదని- ఈ ఉపసిద్ధాంతం. కయ్యానికి కాలుదువ్వితే ఆత్మ రక్షణ అదే సమకూరుతుందని యుద్ధసమయసూత్రం అయినప్పుడు; ఇదీ అలాంటిదేననీ, ధనం పోగుచేసుకోవడమనేది: అస్థిరమయిన సామాజిక పరిస్థితులకు అనుగుణంగా తీసుకొనే ముందు జాగ్రత్తేనని ఎందుకు అనుకోకూడదు - అంటారు.

కాని, ఈ సిద్ధాంతం నేపధ్యంగా; అలాఅలా ధనం పోగు చేసుకుంటూ పోతే ఈ ముందు జాగ్రత్త చర్యకి తుది ఎక్కడ, దీని వల్ల కలిగే సంఘవ్యతిరేక పరిణామాలకి హద్దు ఎక్కడ?

ఆత్మ పరిశీలనా సమర్థుడయిన పౌరుణ్ని కూడా - ఇది న్యాయమేనేమో, ఇదే నీతి అనిపించుకుంటుందేమో - అనే ద్వైధీభావంలో పడేస్తుంది, ధనం అవసరం.

ధనం ఆవిధంగా చాలా గుట్టుగా మనుష్యుడి కోరికలను గుణీకృతం చేస్తుంది. ఒకవైపు నుంచి ఇనుమిక్కిలిగా తృప్తిని తెచ్చి పెడుతూ, ఇంకొక విషయంలో ఎన్నో అసంతృప్తులను జనింపజేస్తుంది. డబ్బుకి ఆశ తోడయితే గాలిని విత్తనంగా వేసుకుని సుడిగాలిని పంటగా తెచ్చుకోవడమే.

ఇలాంటి పరిస్థితుల్లో అవసరం, భోగం, అస్థిరత్వం, అధికధనసేకరణ - వీటి వల్ల కలిగే దుష్ఫలితాలను ఎలా తప్పించుకోగలుగుతాము? ధనానికి సంబంధించి, వినియోగం - దుర్వినియోగం మధ్య వివేకాత్మకమయిన, విస్పష్టమయిన రేఖను గీసుకోవడం ఎలా?

ధనాన్ని గురించి కొంత చర్చ జరుపుకోగా, మనకు కొన్ని సందేహాలు కలిగాయి, కొన్ని ప్రశ్నలు ఉదయించాయి. ఈ సందర్భంగా కొన్ని సూచనలు చేసుకుందాము.

1. ఒక వస్తువు. అది లేకపోతే మన నిత్యజీవితం తీవ్రమయిన అవరోధాలకు గురి అవుతుంది. లేదా, మన పనిని మరింత సామర్థ్యంతో చేసుకోవడానికి వీలవదు. అప్పుడు ఆ "వస్తువు" మనకు "అవసరము" అని భావించాలి. అయితే, అది మన ఆర్థిక సామర్థ్యపు పరిధిలోనిది అయిఉండాలి. మరి, ఆ "వస్తువు" లేకపోయినా సరే మనపని సులువుగా ఉత్సాహభరితంగా చేసుకోగలము- అనుకుంటే, ఆ "వస్తువు" (అవసరం కాదు) విలాస వస్తువు.

ఒక ఉదాహరణ : మనకు ఒక సైకిలు ఉంటే, ఆఫీసుకి సంబంధించినది గాని, ఇంటికి సంబంధించినదిగాని మన పనులు మరింత బాగా చేసుకోగలిగి, మన కాలాన్నీ శక్తినీ ఆదా చేసుకోగలుగుతాము. సైకిలు లేకపోతే మనకి లాభదాయకమైన ఇంకొక పనికి ఉపయోగించుకోగలిగే (విలువయిన) కాలం వృథా అవుతుంది. అదీకాక, సైకిలు కొనుక్కోవడం వలన మనకు కలిగే ఆర్థిక బాధ ఎక్కువ కాదు. అప్పుడు సైకిలు అనేది మన "అవసరం"గా భావించి కొనుక్కోవాలి.

ఇదే ఆలోచన ఒక (మోటారు) కారు విషయంలో కూడా చేసుకోవచ్చు. అవును. కారు ఉంటే మన పనులు ఖచ్చితంగా మరింత మరీ బాగా అవుతాయి. కాని, మన వద్ద అంత ధనం లేదు. ఆ విధంగా కారు అనేది ఒక "విలాసవస్తువు;" కనుక, కారు కొనే ఆలోచన మానెయ్యాలి.

2. మనం మనతో సమానమయిన పరిస్థితులలో - అనగా ఆదాయవ్యయాలలో, ఆస్తిఋణాలలో మనతో ఇంచుమించు సమానంగా - ఉన్న మిత్రులతో, ఇరుగు పొరుగులతో మనలను సరిపోల్చి చూసుకోవచ్చు. మనకు "అవసరం"గా తోచే "వస్తువు" లేకుండానే వారు నెగ్గుకొస్తున్నారని అనిపిస్తే; ఆ "వస్తువు" మనకు అవసరం కాదు, విలాస వస్తువే.

3. భవిష్యత్తులోకి చూసుకునేటప్పుడు మరీ అంత దూర దృష్టి - మన స్వంత జీవిత కాల వ్యవధిని మించి - అవసరం లేదు. మన సంతానం చదువు సంధ్యలకి వాళ్లు వాళ్ల జీవితాలను ప్రారంభించుకోవడానికి తగినంత ఏర్పాటు చేసి ఉంటే - అదే చాలు. తరువాతి కాలంలో వారికి ఏమి జరగాలో అదంతా దేవుడికి వదిలెయ్యాలి. వాళ్ల బాగు కోసం ఇంకా కొంత, మరికొంత (ధనం) పోగు చెయ్యాలనే కోరికను అక్కడితో ఆపెయ్యాలి.

4. (మన అనంతరం వాళ్లు ఏమయిపోతారో - అనే బెంగ కలిగితే,) వీలయినంత ఎక్కువ సొమ్ముకి బీమా చెయ్యాలి. దాంతో మన మీద ఆధారపడిన వారి ప్రయోజనాల భద్రత కోసం చేయగలిగినదంతా చేసినట్టు భావించుకొని తృప్తి చెందాలి. తరవాత సంగతి దేవుడు చూసుకుంటాడు - అని తలపోసి, వారి కోసం (ధనం) పోగుచెయ్యడం మానెయ్యాలి.

## లైంగిక ప్రవృత్తి

ధనం తరువాత మానవుడిని బాధపెట్టే అతి సామాన్యమయిన, తీవ్రమయిన కోరిక లైంగిక ప్రవృత్తే. దీనిని గురించి శారీరక క్రమశిక్షణ అనే పేరిట సాకల్యంగా చర్చించుకున్నాము. అయినా సరే - ఇప్పుడూ, ఇక ముందూ; (భగవద్గీత) అభ్యాసం విషయంలో "అది" నిర్వహించే ప్రముఖపాత్రను దృష్టిలో పెట్టుకుని ఒక సంగతి మరింత శ్రద్ధగా చెప్పుకోవలసి ఉంది.

మనలో చెలరేగే లైంగిక ప్రవృత్తిని అదుపుచేసుకోవడానికి గాను శరీర సంబంధ మయినవి ఎన్ని అసౌకర్యాలనూ, ఎంత నిగ్రహాన్నీ పాటించినా, చివరికి ఆ విషయంలో విజయాన్ని సాధించే కీలకం మన మనసులలోనే నిర్ధారితమయి ఉంది. లైంగిక ప్రవృత్తిని గురించి మంచి సలహాలకు, ప్రయోజనకరమయిన సమాచారానికీ లోటులేకపోయినా, ఆ సలహాలను అభ్యాసంగా మార్చుకోవడానికి వ్యక్తిలో ఇచ్ఛాశక్తి లోపం వల్లనే మనలో చాలా మంది విఫలులవుతున్నారు. సాధారణ ప్రజలకు సంబంధించిన సందర్భాలలోనే

ఇలా జరుగుతోందంటే, సాధకుడి విషయంలో లైంగిక ప్రవృత్తిలో విజయ రహస్యాన్ని గుర్తించుకోవడం, దానిని తన స్వంత జీవితంలో (ప్రవర్తనలో) ఆ ధ్యేయానికి అనుగుణమయిన తీవ్రతతో పాటించడం మరింత ముఖ్యం అవుతుంది.

నిర్ణయ - నిశ్చయ ప్రతిపత్తి అనే పేరిట, మానసిక క్రమశిక్షణ అనే పేరిట ఇంతకు ముందు ప్రకరణాలలో కొన్ని సూచనలను చేసుకున్నాము. వాటినన్నిటిని గుర్తుకి తెచ్చుకొని, మన లైంగిక అవయవాలకు అవసరమయిన భౌతిక సంయమాన్ని విధించుకోవడంలో ఆ సూచనలను ఉపయోగించుకోవాలి. మనలో కలిగే లైంగిక ప్రేరణను అదుపులో పెట్టుకొనే నిశ్చయానికి రావాలి. అందులో ఓటమి సంభవిస్తే ఉత్సాహం కోల్పోవకూడదు. మన నిశ్చయంలో బలం లేకపోవడమే ఆ ఓటమికి కారణం. కనుక నిర్ణయ శక్తిని మళ్లీ ఒకసారి, లేక అవసరమయినంత తరుచుగా పటిష్టం చేసుకుంటూ, శారీరక క్రమశిక్షణ అనే ప్రకరణంలో చేసిన సూచనలను పాటించాలి. అలాంటి పట్టుదల ఉంటే విజయం లభిస్తుంది.

## అధికారం

ముఖ్యంగా మూడు కారణాలకుగాను అధికారకాంక్ష మనలను ఆవహించకుండా కాపాడుకోవాలి.

1. ఈ అధునాతన యుగంలో, అధికారానికి చేరవలసిన మార్గం; ప్రత్యర్థులు ఎంత న్యాయంగా వ్యవహరించినా, రక్తసిక్తమై ఉంటున్నది. అనగా మనము పై స్థాయికి ఎదుగుతున్నకొలదీ, మనము మోయవలసిన పాపభారం పెరుగుతూనే ఉంటుంది.

2. అధికారం అనేది అత్యధిక శక్తిమంతమయిన మత్తు మందు. ఎంత అధికారాన్ని అనుభవిస్తే, అంతగా దానికి అలవాటు పడిపోయి, బానిసలమయిపోతాము. మరి, ఒకసారి అనుభవించిన అధికారంనుండి మన అదుపులో లేని శక్తుల వలన మనము వైదొలగవలసి వస్తే, అప్పుడు కలిగే నిరుత్సాహం మరింత ఎక్కువ. కనుక, మనము అధికారాన్ని అంటిపెట్టుకొని ఉండడానికి గాను మరిన్ని పాపాలు చేసి, అందుమూలంగా ముక్తికి మరీమరీ దూరంగా తొలగిపోతాము.

3. అధికార మదాంధుడు జీవితంలోని ఉన్నత విలువలను చూడలేడు. అహంకారం, నియంతృత్వం, క్రౌర్యం నిండుగా వచ్చి పడతాయి. మన స్వార్థ ప్రయోజనాలకోసం భార్యాబిడ్డలతో సహా, కన్నవారిని, కుటుంబ సభ్యులను ఎవరిని మట్టుపెట్టాలన్నా సంకోచించము.

ఇలా అనుకుంటున్నాము కదా- అని, అధికారమంటే, అదేదో సింహాసనమనీ; దానిని చేరాలంటే మన శత్రువుల శవాలమీదుగా నడచి వెళ్లాలనీ, అక్కడికి చేరిన తరువాత మనకు వ్యతిరేకంగా నడచుకొనే వారినందరినీ సర్వనాశనం చేసుకుంటూ పోవాలనీ- భావించనక్కరలేదు. అధికారాన్ని గురించి కొన్ని తేలికపాటి ఉదాహరణలు: చక్రవర్తికి సింహాసనంమీద కోరిక, వీధిలో బిచ్చమెత్తుకునేవాడు బ్యాంకులో మెసెంజరు

కావాలని అనుకోవడం. ఇలా అధికారం అనేది చిన్నా, పెద్దా- అనే తేడా లేకుండా పాలకుల నుండి బిచ్చగాండ్ర వరకు అందరి తలలలో ఒకే రకమయిన కల్లోలాలను రేపేది.

ఏవో కొన్ని ఉపద్రవకరమయిన సంఘటనలను కలిగించే పరిస్థితులను మినహాయిస్తే, అధికార కాంక్షను ప్రోత్సహించలేకపోయినా (కొంతవరకు) భరించవచ్చు.

ఏ రకమయిన అధికార కాంక్షనయినా ఎంతవరకు అనుమతించవచ్చును- అనుకుంటే-

(i) న్యాయమయిన, నిజాయితీ అయిన మార్గాలద్వారా సాధించినది.

(ii) మన ఆధ్యాత్మికత ఔన్నత్యానికిగాని, ఇతరుల మేలుకోసం గాని; ఉపయోగపడేది.

మాటవరసకి; ఒకడు అతను ఉన్న ఊళ్లోని గూండాలను అణచిపెట్టి చట్టవిధేయులయిన పౌరులను కాపాడే ఉద్దేశంతో తాను న్యాయాధికారి అయితే బాగుండునని కోరుకోవడం. వ్యక్తిగత, సామాజిక సంబంధములయిన ఆధ్యాత్మిక ప్రయోజనాలకు వినియోగించడానికిగాను ఒకడు మనకు కొంతధనంగాని, ఒక అధికారంగాని చేకూరాలని కోరుకోవడం.

## కీర్తి

కీర్తి అనేది సత్కార్యాల ద్వారాగాని, ప్రతిభవలనగాని, శీలప్రవృత్తుల ఔన్నత్యం వలనగాని ఫలితంగా మనిషికి లభించేది. కనుక; కీర్తి రావాలని కోరుకొనే వారు, ఏదైనా ఒక సత్కార్యం నెరవేరడానికి నిజాయితీగా పరిశ్రమించవలసి వస్తుంది. కీర్తి కాంక్ష అనేది స్వయంకృషితో తన్ను తాను సమున్నతపరుచుకోవడానికి వ్యక్తిని ప్రోత్సహిస్తుంది. కనుక, అది కేవలం ఏదో ఒక పద్ధతిలో సాగి, ముక్తికి ఆటంకంగా నిలిచేదయితే తప్ప అట్టి కీర్తి కాంక్షను నిషేధించనవసరంలేదు.

## కోరికతో పోరాటం

**కోరిక ఇంద్రియాలను, మనసును, బుద్ధిని**
**ఆశ్రయించి ఉంటుంది. వాటి సహాయంతో (అది)**
**జ్ఞానాన్ని కప్పిపుచ్చి, ఆత్మను వంచించగలది.**

-శ్రీమద్భగవద్గీత, కర్మయోగము·40

**కనుక, ఓ అర్జునా! మొదట ఇంద్రియాలను అదుపులో**
**పెట్టుకుని జ్ఞానమును, ఆత్మాను భవమును నాశనం చేసే**
**పాపావహమయిన ఈ కోరికను చంపుకో.**

-శ్రీమద్భగవద్గీత, కర్మయోగము·41

కోరికలనేవి అసంఖ్యాకాలు, అనేకరీతులు. కనుక వాటిని ఒకటొకటిగా పరిశీలించి వాటికి చికిత్స చేయడం అసాధ్యం. కనుక సామూహికంగా చికిత్స నెరవేర్చే కొన్ని పద్ధతులను గురించి చర్చించుకుందాము.

## మొదటి దశ

మన అంతిమధ్యేయం ముక్తి. దానికోసం కోరికను నిధనం చేయడానికిగాను మనము వెనుకచూపులేని నిశ్చయానికి రావాలి. అదే అన్ని చికిత్సలకు మూలం. నిశ్చయమనేది దృఢంగా లేకపోతే, ఎంత సార్థకమయిన ఔషధమయినా ఎంత అమోఘమయినదయినా విజయపథం పట్టలేము. దీనిని మూల సూత్రంగా స్వీకరించి, మనము, ఏది మనకు సమంజసంగా తోస్తుందో దానిని అవలంబించాలన్న నిశ్చయానికి రావాలి. నిర్ణయ-నిశ్చయ ప్రతిపత్తి అనే ప్రకరణంలో చెప్పుకున్న పద్ధతులను ఏ అవసరాన్ని బట్టి దానిని అవలంబించుకుంటూ మనకు మనం దృఢంగా కొన్ని మాటలు చెప్పుకోవాలి.

"ఏ విషయమయినా నాకు సమంజసంగా తోస్తే దానిని ఆచరిస్తాను. దానినే తప్ప మరి దేనినీ ఆచరించను."

అప్పుడు సాధ్యమయినంత నిష్పాక్షికమయిన పద్ధతిలో ఆలోచించుకొని, ఖచ్చిత మయిన నిర్ణయాలకు రావలసిన విషయాలు కొన్ని ఉన్నాయి.

(I) మానవుడి దుఃఖానికంతటికి మూలం అతడు తన దేహంతో తాదాత్మ్యం చెందడం. అతడు తానే శరీరమనీ, ఆ శరీరమే అన్ని పనులను చేస్తున్నదనీ భావిస్తాడు.

కాని, "నీలో ఉన్న నిజమైన నీవు" అనే ప్రకరణంలో "నీవు వేరు, నీవుగా కదులుతున్న నీ శరీరం వేరు" అని చెప్పుకున్నాము. మన శరీరంతో మనకున్న సంబంధాలు ఎలాంటి వంటేను: ఒక రోజుకిగాను తీసుకొని మరుచటిరోజు విడిచిపెట్టే హోటలు గది, లేక ఒక పానీయాన్ని పీల్చడానికిగాను స్వీకరించిన తేలికపాటి గొట్టం- వీటితో మనకు ఉండే అనుబంధం వంటిది.

ఈ సూత్రాన్ని మరింత విశాలం చేసుకుంటే, మనదని అనుకుంటున్న ఈ శరీరం, మనకి; ఇతర మానవుల, జంతువుల శరీరాల కంటె ఏ మాత్రమున్నూ ఆప్తం కాదని గ్రహించగలుగుతాము. మనం నిజానికి మరింత ఉన్నత స్థాయికి చెందే (జ్ఞాన, ముక్తి సాధకులమైన) వారము కనుక మరింత కటువుగా కూడా ఈ బంధాన్ని నిర్వచించ వచ్చు. ఆఫ్రికాలో గాని, అమెరికాలో గాని (సుదూరంగా) ఉన్న వీధి కుక్క ఎంత ఆప్తం కాదో, ఈ శరీరం కూడా మనకు అంత ఆప్తం కాదు.

ఈ విధంగా (శరీరంతో మనకు ఉండే సంబంధం ఎంతటిదో బాగా) ఆలోచించు కుని (కోరికను నిధనం చేసుకునే విషయంలో) ఒక నిర్ణయానికి రావాలి.

అలా పరిశీలించుకుని, పునర్విమర్శచేసుకుని, ఆ సత్యాన్ని విశ్వసించగలిగితే మంచిదే. లేనప్పుడు మనమతగ్రంధాలలో నమ్మకం ఉంచుకుని, ఆప్తతను గురించిన

సిద్ధాంతానికి ఒడంబడి ఉండాలి. కొన్ని ఆధ్యాత్మిక సత్యాలు ప్రయోగాలు ఆధారంగా, అనుభవాలు ఆధారంగా- ఇప్పటిమన పరిస్థితులలో ఋజువు చేసుకోలేకపోతాము. వీటికి ఒక విద్యాలయంలో ఏర్పరచుకొనే ప్రయోగశాలలో శాస్త్రరీత్యా పరిశోధించే పద్ధతి వర్తించదు. మన ఋషులు తాము అనుభవించి, మనకు ఉపనిషత్తుల రూపంలో ప్రసాదించిన వాటిని ఆధారం చేసుకుని మనం సాగాలి.

(మనం సాకల్యంగా చర్చించుకున్న ఆధ్యాత్మిక సత్యాలను అనుసరించి;) మన ఈ శరీరంతో మన అనుబంధం, ఎక్కడో అమెరికాలో ఉన్న జంతువు శరీరంతో ఉండే, అనుబంధమంత నిస్సంగం. 'కోరికలు'' అనేవి మనలను ప్రాపంచికంగా కట్టిపడేస్తూ, ముక్తి పథాన్ని మనకు అందకుండా ఉంచేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో, ఈ శరీరాన్ని సంతృప్తిపరచడమే పనిగా పెట్టుకునే కోరికలను దరికి రానివ్వడంవల్ల, ఏమిటి ప్రయోజనం? దీనిని గురించి నిజాయితీగా ఆలోచించాలి.

మరి, ఈ పరిస్థితుల్లో; కోరికలనేవి బొత్తిగా అవాంఛనీయాలు-అని అంగీకరించ వలసిందే కదా.

మనం (ఎవరికి వారు) ఆత్మేగాని, శరీరం కాదని అనుకుంటే,

శరీరానికి సంబంధించిన (ప్రయోజనం) దేన్నయినా కోరుకోవడం అర్థం లేనిపని-అని:

మరొకసారి ధ్రువపరచుకోవలసిఉంది.

అంతేకాదు. ఖచ్చితంగా ఆ సత్యాలు ఆధారంగా జీవితాన్ని నిర్వహించుకొనే నిశ్చయానికి రావాలి.

2. ఆత్మ అంటే ఏమిటో తెలియకపోవడంవల్ల; కనీసం ఆత్మ (యొక్క) ఏకత్వంలో నమ్మిక లేకపోవడంవల్ల; "కోరికలు" పుట్టుకొస్తాయి.

"నీలో ఉన్న నిజమైన నీవు" (అనే ప్రకరణములో చెప్పినట్లు), "అతనిలో ఉన్న నిజమైన అతడు'' లాగానే, "దానిలో ఉన్న అది"- అన్నీ ఒకటే; అనగా "నీవు" అనే నిజమైన నీవు అన్ని ప్రాణులలోను ఉన్నట్లు, అన్ని ప్రాణులు ఆ "నీవు"లో ఉన్నట్లు- తాత్పర్యము.

ఈ వివేచన, నిరాశావహమయిన ఆత్మలకు ఊరటను గాఢంగా ఉద్దేశించి చెప్పి నప్పటికీ; ఇదంతా ఏదో మాటల గారడీగా తోచవచ్చు.

జీవాత్మ (వ్యక్తియాత్మ) చివరికి పరమాత్మలో ఐక్యం అవుతుందా- అనే విషయం మీద ద్వైత, అద్వైత, విశిష్టాద్వైత మత పద్ధతుల ప్రకారం కొన్ని విభేదాలు ఉండవచ్చు. కాని, అన్ని జీవులవెనుక నిజమయినది, ఏకత్వం కలిగినది- ఆత్మ అనేది- ఒకటి ఉందని ఆ మత పద్ధతులన్నీ ఒప్పుకుంటాయి.

దీనిని గురించి ఏదయినా భిన్నాభిప్రాయం కలిగి ఉండడానికి ఎవరయినా సాహసించ గలరా? ఉపనిషద్వచనానంతరకాలంలో మన (భారత)దేశంలో ప్రభవించి, ఈ మూడు భారతీయ తత్త్వాలను ప్రవచించి, మహా మేధావులని పేరు పొందిన (శ్రీమధ్వ, శ్రీశంకర,

శ్రీరామానుజ)- ఆచార్యులతో విభేదించడానికి ఎవరయినా సాహసించగలరా? పరిశీలించి చూడాలి.

విభేదించలేమని భావిస్తే-

( ) మనము, ఇతర ప్రాణులు - అన్నీ ఒకటే, సమానమే:

(i) విశ్వములోని సమస్తము మనకు చెందినవే, మనము విశ్వములోని సమస్తమునకు చెందేవారమే.

(ii) అనగా దేనిమీదనైనా కోరిక కలిగిందంటే, అది మనకు చెందనిదని మనం అనుకున్నామన్నమాట. ధనపు పేటికకే యజమానిగా ఉన్నవాడు దానిలోంచి తస్కరించ వలసిన అవసరం లేదుకదా... అని మనకు మనం రూఢి చేసుకోవాలి.

ఇలా అనుకున్నా, ఒకానొక సందర్భోచితమయిన సందేహం మనలను వెనుకకు లాగవచ్చు. నిర్గుణమయిన పరమాత్మ ప్రకారం ఇదంతా సరయినదే కావచ్చు. కాని, మనం తులనాత్మక ప్రభావం పనిచేసే ప్రపంచంలో నివసిస్తున్నాము. ఇక్కడ ఇది వర్తించదు. ఎందుకంటే, సామ్యాసామ్య సిద్ధాంతాలవారికి ఫలితాలు ఆ క్షణాననే; ఆ ప్రదేశాననే కావాలి. ఇది భగవద్గీత అభ్యాసంపట్ల ఆసక్తి లేనివారి తత్త్వం. కాని, సాధకుడు అనేవాడు మరింత అతీతదృష్టితో చూడడానికి సిద్ధమయి; విధినిర్వహణం చేసి, (ఫలితం కోసం) నిరీక్షించాలి. కనుక ఈ సమస్యను సాధకుడి దృష్టితోనే చూడాలి గాని (భగవద్గీత అభ్యాసంపై ఆసక్తిలేని) వాని దృష్టితో చూడకూడదు. సామ్యాసామ్య పద్ధతి పరమాత్మకు దారితీయదని గ్రహించాలి. గొప్ప గొప్ప సమస్యలను గొప్ప గొప్ప పద్ధతులలోనే పరిష్కరించాలి. జ్వరాన్ని కొలిచే తాపమానంతో సూర్యునివేడిని కొలవ లేము కదా. సారాంశం ఏమిటంటే, ఇంతకుముందు మనకు మనం చేసుకున్న వాగ్దానాన్ని నిలబెట్టు కుని, కోరికలనన్నిటినీ వదిలించుకోగలము- అని చేసుకున్న నిర్ణయానికి పునరుజ్జీవనం ఇవ్వాలి.

3. కోరికలు- అనేవి మనలను ప్రపంచానికి కట్టిపడేస్తాయి. అవి ముక్తి వ్యతిరేకాలు. మనకు కోరికలు కావాలో, ముక్తి కావాలో: ఏదో ఒకటి తేల్చుకోవాలి. రెండూ కావాలంటే కుదరదు. అప్పుడు దేనిని ఎంచుకుంటాము?

జవాబు చాలా స్పష్టం. ఎందుకంటే, దాని వెనుక ఉన్న తర్కం సరళం.

సరే, ముక్తే కావాలి- అనుకుంటే సరిపోదు. దానికోసం కృషి చేయాలి. అది కూడా తర్కబద్ధమే.

కాని, ఇక్కడొక ఇబ్బంది ఉంది. ముక్తి కావాలి- అని కోరుకోవడం, దాని వెనుక ఉన్న తర్కం మనకి బోధపడక కాదు. మానవ సహజమయిన బలహీనత మన అభిప్రాయాలను అధిగమించగలది. దానిమూలంగా ఘనమయిన వాటిని తోసిపుచ్చి, స్వల్పమయిన వాటిని ఎంచుకోవాలనీ, చేతికి అందినది దూరంగా ఉన్నదానికంటే గొప్పదనీ అనుకోవడానికి సిద్ధపడతాము.

అందుకని, మనకు సమంజసమని అనిపించినదానిని తప్పక పాటించాలని తీసుకొనే నిర్ణయంగురించి మరొకసారి గుర్తుచేసుకోవాలి.

మన ముక్తికోసమే మనం పనిచెయ్యాలనీ, ఏ ఇతర ప్రాపంచిక ప్రలోభాలకు గాని, కోరికలకుగాని లొంగేది లేదనీ తీర్మానించుకోవాలి.

4. కాని, ఈ కోరికలు అనే వాటితో ఒక చిక్కుఉంది. అవి ఒకటో, రెండో పోనీ మరికొన్నో అయితే ఏదోవిధంగా కష్టపడి పనిచేసి, ఆ కోరికల ధ్యేయాలని సాధించుకోవచ్చు. అక్కడితో వాటిని వదిలించుకోవచ్చు. కాని దురదృష్టం ఏమిటంటే, అలా జరగదు. కోరికలు (ఒకటీ, రెండూ, కొన్నీ కాక) ఎంతో అసంఖ్యాకమైనవి. ఒక జీవితకాలంలో వాటిని ఎదుర్కొని సాధించలేము. ఒకవేళ సాధించగలిగినా, అవి నెరవేరాయికదా- అని వాటిని చంపేసుకోగలిగినా, అవి (సాధారణంగా) చస్తూ చస్తూ మరికొన్ని కోరికలను సృజించి మనమీద పడేసి మరీ చస్తాయి. (అది ఎలాగంటేను:-)

మనకి మన ఆర్థిక స్థితిని మెరుగు పరచుకోవాలన్న అభిలాష కలుగుతుంది- అనుకుందాము. దానికోసం మనం చేసే ప్రయత్నంలో కొందరు ఇతరులను ఇరికించవలసి రావచ్చు. అనగా వాళ్ల సిఫార్సులు అవసరం రావచ్చు; లేదా,(మన వ్యాపారం అభివృద్ధి చేసుకోవడానికి గాను) వారిని మన వ్యాపారంలో భాగస్వాములుగా చేరమని ఆహ్వానించవలసి రావచ్చు. సిఫార్సు సంగతి చూద్దాము. దీనికోసంగాను ఆ సిఫార్సు చేసేవాళ్లకు మనంకూడా ఏదో ఒక ప్రత్యుపకారం చేయాలి కదా. మాటవరసకి మనకు సిఫార్సు చేసే వ్యక్తి తాను ఫలానా సుబ్బారావుని వాళ్ల అల్లుడుగా చేసుకునే ప్రయత్నంలో మన సహాయం కోరవచ్చు. ఈ సుబ్బారావు మరెవరో అమ్మాయి తన భార్య అయితే బాగుండు నని తలచవచ్చు. మనం ఆ ప్రయత్నంమీద ఉన్నట్టయితే; అతనిని ఆ ఆకర్షణనుండి దూరం చేయవలసి రావచ్చు. ఇలా మరిన్ని సంక్లిష్టతలు ఏర్పడతాయి.

ఈ పద్ధతిలో మనకు ఇతరులతో ఏర్పడే అవసర, అనుబంధాల పాశం మనకే తెలియనంత దీర్ఘంగా సాగి, ఆ పాశంలోని ఒక్కొక్క మెలిక; (మనకు మొట్టమొదట తటస్థపడిన కోరికకు తోడుగా) ఒక్కొక్క అదనపు కోరికను తెచ్చిపెడుతుంది.

కాని, మనం (ఈ విధంగా ఏర్పడిన) మరికొన్ని కోరికలతో, (మనకు ఉన్న) అసలు కోరికను చంపలేము. అందువల్ల ఒక కోరికను పరిసమాప్తి చేసే ప్రయత్నం ఎండమావి వెనుక పరుగుపెట్టడం వంటిదే.

కోరికలకు లోబడుతూ ఉండడం, వాటిని నెరవేర్చుకొనే ప్రయత్నంలో పడడం; ఇదికాదు సౌఖ్యానికి మార్గం. కోరికలకు మన మనోద్వారాన్ని పూర్తిగా మూసేసి, సుకరమయిన జీవితాన్ని సాగించడంలోనే ఉంది ఆ మార్గం.

5. కోరికలు పెచ్చుమీరే ప్రలోభంతో మనలను బానిసలుగా చేసుకుంటాయి. (కోరికలను) ఎంతగా అనుభవిస్తామో (వాటిని నిరోధించడానికి) అంత నిస్సహాయులమవుతాము.

ఐహికమయిన కోరికల ఫలాలు తాత్కాలికమయినవి. ఒకానొక దేశానికి అధ్యక్ష పదవిని సాధించిన వాడయినాసరే, (ఆపదవికి) ఎన్నికచేసినవారి ఆనందం సాగినంత తక్కువ కాలంపాటే (ఆ పదవిని) అనుభవించగలడుగాని, చిరకాలం కాదు. ఈ లోపుగా అతడు ఆ పదవిని అంటిపెట్టుకుని ఉండడానికి ఎంతగా అలవాటు పడతాడో, దానిని విడిచిపెట్టవలసి వచ్చినప్పుడు అంత హీనత్వమూ అనుభవిస్తాడు. దానిని అంటిపెట్టుకుని ఉండాలనే కోరికే విడిచిపెట్టేటప్పుడు కలిగే ఆ హీనత్వానికి కారణం. అలా కాకుండా, ఆ స్థానం పట్లా ఆ అధికారంపట్లా కోరిక లేనివాడు, (అవి పొందినప్పుడు కలిగినంత ఆనందం తోనే) ఆ సింహాసనాన్ని విడిచిపోగలుగుతాడు. శ్రీరాముడు తనకు పట్టాభిషేకం జరగబోతున్నది- అని తెలిసినప్పుడూ, తనకు అరణ్యావాసం విధించినప్పుడూ ఒకే రకమయిన ఆనందం పొందాడుకదా.

కాబట్టి, అస్థిరమయినవి, బానిసలుగామార్చేవి, ప్రాపంచిక మయినవి- అయిన కోరికలను అపేక్షించడం తెలివయినపనో; లేక, శాశ్వత ఆనందం, శాంతి, స్వాతంత్ర్యం- ప్రసాదించే మోక్షంకోసం పాటుపడడం వివేకమో; ఆలోచించుకోవాలి.

మన ఆలోచనలు ఎటువైపు మొగ్గుతాయో నిస్సందేహంగా చెప్పవచ్చు. అందుకని కోరికలను పరిహరించుకోవాలని చేసుకున్న మన పూర్వతీర్మానాన్ని, మరింత బలపరచు కోవలసి ఉంటుందని, బుద్ధి చెప్పుకోవడమే మన ఏకైక కార్యక్రమం.

స్థిరనిర్ణయం అవసరం గురించిన ప్రసక్తి పదే పదే వస్తోందని- విసుగు, చిరాకు చెంద కూడదు. ఈ ప్రసక్తి, దీనిని గురించి ఇప్పుడు చేసుకున్న హెచ్చరిక చాలా అవసరం. ఎందుకంటే, ఇక మీదట మనము జరపవలసిన భగవద్గీత అభ్యాసం యావత్తూ ఖచ్చితంగా మానసిక సంబంధమైనది. దాని విజయం ఏదైనా బాహిర, భౌతిక నిర్బంధం వలన కాక, (ఇంతకుముందు చేసుకున్న) తీర్మానాలను అమలు పరచుకోవడం ద్వారానే సుసాధ్యమవుతుంది.

నిర్ణయం అనేది అభ్యాసానికి చైతన్యశక్తి. నిర్ణయశక్తితో కోరికను తరిమివేయవలసి ఉంది.

## రెండవదశ

చెప్పడానికేమి, ఎన్నైనా చెప్పుకోవచ్చు. అయితే మనం సామాన్య మానవులము. మనకు కొన్ని బలహీనతలు ఉంటాయి. ఇవి ఒక్కొక్కప్పుడు మన (శరీర, మానసిక, భౌతిక నిర్మాణంలో సృష్టి సహజమయిన) పదార్థాల వలన, మనపై నిబంధితాలయిన సామాజిక, ఆర్థిక ఒత్తిడులవలన ప్రభావితాలవుతాయి. అందువలన ఎంతో ఆరోగ్య-ధైర్యాలతో నిశ్చయించుకుని (అనుష్ఠానం) ప్రారంభించినా, ఒక్కొక్కప్పుడు ఆ నిశ్చయాలు పలచ బడే అవకాశం ఉంది. అప్పుడు "కోరికలు" అనే నిరంతర పరివృత శత్రువు చేసే దాడులను తట్టుకోలేకపోతాము. అటువంటి సందర్భాలలో మన మనసులలోని ఒకానొక కోరికకు కొంతవరకు లొంగిపోవలసిన ఒత్తిడి ఏర్పడవచ్చు. అప్పుడు ఆ దాడులనుండి మనలను

రక్షించే రెండవ ఆయుధం ఏది ఉందో, తెలుసుకోవడానికి కనీసం కొన్ని సూచనలను పాటించుకుంటే మంచిది.

1. ఇంతకుముందు చెప్పుకున్న ప్రమాణాలనుబట్టి, మనము ఎదుర్కొంటున్నది అవసరమా, కోరికా- అనేది అన్నిటికంటే ముందు తేల్చుకోవాలి. అవసరము- అని తేలితే ఏవిధమైన పరితాపం లేకుండా దానిని నెరవేర్చుకోవడానికిగాను స్వీకరించి పని చేయాలి. మనము ఏదో బురదలో అడుగుపెడుతున్నామన్న కలతతగదు.

2. అలాకాక, అది కోరిక- అనే స్పృహ కలిగినట్లయితే, దానిని మొగ్గలోనే తుంచెయ్యడానికి, ఎదగకముందే తెగగొట్టడానికి ప్రయత్నించాలి. ఎట్టి పరిస్థితులలోను అది మనలో వేళ్లుతన్నకుండా చూసుకోవాలి. మొక్కై వంగనిది మానై లొంగదు.

ఉదాహరణకు: ఒకడు ఆఫీసులో పనిభారంచేత ఇంటికి ఎంతో ఆలసటతో వస్తాడు. అతడు మరుసటిరోజు ఉత్సాహంగా పనిచేసుకొనేటందుకు సాయంకాలంపూట అతనికి కొంత వినోదం అవసరం. సమీపంలో ఒక వినోదావాసం ఉంది. అక్కడ కులాసా అయినవి, చెలరేగించేవి కొన్ని రకాల వినోదాల ఏర్పాటు ఉంది. వాటిలో ఎవరి అమాయకత్వాన్ని బట్టి వారు, తమకు అవసరం అనిపించిన వినోదవ్యాపకాన్ని అక్కడ ఎంచుకోవచ్చు.

వినోదం-అనేది నిస్సందేహంగా అవసరమే. కాని, వినోదావాసానికి వెళ్లాలనిపించడ మనేది కోరికే. అందుచేత దానిని మొగ్గలోనే తుంచేసి, ప్రత్యామ్నాయంగా ఇంకేదైనా వినోదాన్ని అన్వేషించుకోవాలి. సముద్రతీరాన పచార్లు చేయవచ్చు. పిల్లలతో ఆటలాడుకోవచ్చు. సంగీతం అభ్యసించవచ్చు. అంతేగాని వినోదావాసానికి వెళ్లకూడదు. అక్కడ వినోదంతో బాటు ప్రమాదం కూడా ఉంది. వినోదాన్ని అనుసరించి కలిగే బలమయిన కొన్ని ప్రలోభాలు క్రమంగా అతడిని వశం చేసుకోవచ్చు.

3. వినోదం అవసరమేగాని, దానిని విస్తరించనివ్వకూడదు. సామాజిక బాధ్యత, ప్రలోభాన్ని నిర్జించడంలో అతడికి ఉండే అంతర్గత బలహీనత- వంటివిగా అతడి అదుపులో లేని ఏదో కారణంవల్ల అతడు ఏదో ఒక తప్పటడుగు వేసేసి, ఆ తొలి అడుగుతోనే ఏదయినా ఒక కోరికకి లొంగిపోతాడు. అయితే, కనీసం ఆ తొలి అడుగుతో నయినా దానిని ఆపెయ్యాలి. (అంతేకాక) అలా పుట్టిన ఆ ఒక్క కోర్కె అనేక ఇతర కోరికలగా శాఖోపశాఖలుగా విస్తరించకుండా ఆపాలి.

మొట్టమొదటి తప్పటడుగు పడగానే, మతసిద్ధాంత సదృశమయిన నిష్ఠతో కోరికల వలన పుట్టు కొచ్చే పిల్లకోరికలను అదుపుచెయ్యడానికిగాను నిర్ణయశక్తి అమలు పరచుకోవాలి. లేని పక్షంలో తరువాతికాలంలో వైదొలగలేనంత నిమగ్నతను కల్పిస్తూ కలిగే కోరికలకు అంతు ఉండదు. అప్పుడు ఒకటికి పది శత్రువులవుతాయి. పోరాటం పది శత్రువులతో కన్నా ఒక శత్రువుతో సులువు అని గ్రహిస్తాము. పోనీ, వినోదావాసంలో సభ్యుడుగా చేరడమంటూ ఎలాగో జరిగిపోయినా, కనీసం అప్పుడయినా ఆ సభ్యత్వంతో చాలించు కుని "ఇంతే, ఇంతకుమించి (వెళ్లేది) లేదు"- అని ఎవరికి వారు కటువుగా

చెప్పుకోవాలి. దోషరహితమయిన వినోదంలో మాత్రమే పాల్గొనాలి. మద్యపానంవంటి వ్యసనంలో దిగిపోకుండా, వీలున్నంతత్వరగా వినోదావాసంనుండి వైదొలగాలి.

4. కోరికను హద్దులలో ఉంచాలి. గెలవాలి- అనే రాజీలేని నిశ్చయంతోనే కోరికమీద పోరాటం ప్రారంభించాలి. ఒకవేళ ఓడిపోతే, ఆ కోరిక కనీసం మన హద్దులలో ఉండేటట్లు చూసుకోవాలి.

(కోరికను హద్దులలో ఉంచుకొనే విషయంలో ఒకటి, రెండు ఉదాహరణలు చెప్పుకోవచ్చును)

మనదగ్గిర (పెట్టుబడిగా) కొద్ది వేల రూపాయలు ఉన్నాయి. అంతకుమించి, (పెట్టుబడిగా) బైటినుంచి ఏ సహాయమూ తెచ్చుకునే ఆస్కారం లేదు. అప్పుడు చిన్న కుటీర పరిశ్రమను (వ్యవస్థాపించుకొనే) ఆలోచనలలో ఉండాలి. అంతేగాని, ఏదో పారిశ్రామిక సామ్రాజ్యాన్ని స్థాపించాలని ప్రయత్నించకూడదు.

ఒక కాంపౌండరు ఉన్నాడు. అతడు కొద్దిపాటి రోగ నిదానం, ఔషధ నిర్ణయం చేయగలవాడుగా రూపొంది, డాక్టరుగా చెలామణీలో ఉన్నాడు. అతడు తన గ్రామంలో; లేక, తాను ఉన్న చిన్న పట్టణంలో తగుమాత్రం వృత్తి చేకూరాలని అభిలషించవచ్చు. అంతేగాని, రాష్ట్రానికి వైద్యవృత్తి శాఖాధిపతి అయిపోవాలని అత్యాశలోకి వెళ్లకూడదు.

—— ఇలా, హద్దులవలన పరిమితాలయ్యే కోరికలు మాత్రమే పెట్టుకుంటే, (అనగా కోరికలను హద్దులలో ఉంచుకోగలిగితే) వాటిని తీర్చుకోగలుగుతాము, ఆ తృప్తి కూడా మనకు లభిస్తుంది. సాధించుకొనేటందుకు మనకుగల అవకాశాల పరిమాణాన్ని బట్టి, కోరిక పరిమాణాన్ని నిబంధించుకోవడం సమంజసం.

5. దేనినయినా కోరడానికి ముందు దానికి మనం యోగ్యతను పొంది ఉండాలి. మన కోరిక మన హద్దులలో ఉన్నదే అయినప్పటికీ, దానిని అంగీకరించడానికి ఆరాట పడకూడదు. మనము మనకోరికను ప్రకటించి, దానిని కంటి సంజ్ఞచేత సాధించు కొని తృప్తిపడే సమయం వస్తుంది: దానికి ముందు ఒక ధ్యేయం మనకు ఉన్నదని మనము అనుకోవడం సమర్థించదగినదని, అది మన యోగ్యతల వలన సమంజసమేనని, ఆ ధ్యేయానికి సంబంధించిన పని మన చేతులలో పడితే దానిని మనము సమర్థంగా నిర్వహించగలుగుతామని విశ్వసించినప్పుడు. అలా జరగకపోతే, మనమీద పడడానికి నిరుత్సాహం కనుచూపుమేరలో సిద్ధంగా ఉంది.

విజయం పొందడానికి అర్హత ఉన్నప్పటికీ ధ్యేయం నెరవేర్చుకోవడంలో ఓటమి పొందితే, కనీసం ఆ ఓటమి మననుండి ప్రయత్న లోపంవల్ల సంభవించినది కాదని- తృప్తి చెందవచ్చును. అనవసరంగా ఓడిపోయాడే- అని జాలిపడేవాళ్లు ఉంటారుగాని, అర్హత లేకుండా విజయం సాధించినవారిని మెచ్చేవారు ఉండరు.

అర్హత ఉండీకూడా, ఓడినవారు నివురుగప్పిన నిప్పులు, వికసించడానికి సిద్ధంగా ఉన్న వీరత్వం.

6. నిదానంగా ఆలోచించి చూసుకుంటే, మనం సంతృప్తి పరచుకోగల కోరికలకు ఒక అల్పసంఖ్యాకత్వము ఉంటుంది గాని; అధిక సంఖ్యాకత్వము ఏదీ ఉండదని అర్థమౌతుంది. కనుక, మనకు కోరికలు తక్కువగా ఉండేటట్లు చూసుకుంటే, వాటి నన్నిటినీ- లేదా, కనీసం వాటిలో కొన్నిటిని- తీర్చుకోగలిగామనే సంతృప్తి కలుగుతుంది. అలా కాకుండా ఎక్కువ కోరికలు పెట్టుకుని, వాటిని గురించి (ఎలా సాధించుకోవడమా- అని) ఆలోచిస్తూ కూర్చుంటే, వల్లమాలిన అశాంతి. కనుక ఈ విషయంలో క్రిందిచూపే తప్ప, పైచూపు పనికిరాదు.

7. అనుకోకుండా ఏదయినా అదృష్టం కలిసిరాకపోతుందా- అని ఆశపడకూడదు. అది ఒకానొక పెద్ద నీటిబుడగమాత్రమే. లాటరీ టిక్కెట్లు కొనుక్కున్నవాళ్లు లక్షలమీద ఉంటారుగాని, గెలిచే అదృష్టవంతుడు ఒక్కడే ఉంటాడు. మిగిలిన యావన్మంది అసౌకర్యంలో, నిరాశలో మునిగిపోవలసినవారే. మనం కూడా ఆ మిగిలిన వారిలోనే ఉండడం తథ్యమని ఇతరుల అనుభవం వలన నేర్చుకోవాలి. ఏదో ఒకరోజు తనను ఒకరాజకుమార్తె వరించకపోతుందా- అనీ, రాజకుమారుడు తనని గుర్తించక పోతాడా- అనీ; పడే ఆశ మనలను ఏ దారికి లాక్కువెళుతుందో వేరే చెప్పాలా?

అంతకన్నా దుస్థితి ఏమిటంటే, ఆ కోరిక అక్కడ ఆపదు. తాను విఫలుడవుతాడని నమ్మకంగా తెలిసినా, రాత్రనకా-పగలనకా; తాను కోరుకున్నది నిజంగా సాధ్యపడిననాడు తాను ఏమిచెయ్యాలో (ఎలా ప్రవర్తించుకోవాలో) గాలిలో మేడలు కట్టుకుంటూ కూర్చుంటాడు. ఆకాశానికి (మానసిక) నిచ్చెనలు వేసుకొని, మేఘాలలో పవనాల అన్వేషణలో పడతాడు. ఇదంతా, క్రిందను భూమిమీద తనకు నిరాడంబరమయిన జీవితాన్ని ప్రసాదించే తన విధ్యుక్త ధర్మాల పట్ల తనకు తానుగా చేసుకొనే తీవ్ర అపచారం.

కనుక, లేనిపోని ఆశలతో పైకి ఎగసిపోవాలని కోరుకొనేవాడు, పతనానికి గురికాక తప్పదు.

8. సరిగా అర్థం చేసుకుని, శ్రద్ధగా అవలంబించగల వానికి సహాయం చేసే, బంగారం లాంటి సూత్రం ఒకటి వీటన్నిటినీ మించినది ఒకటి ఉంది. ఏ ధ్యేయానికైనా ఉత్తమ మయిన ప్రణాళిక, కఠోరమయిన పరిశ్రమ- ముఖ్యం. దానిని సాధించే మార్గంలో న్యాయంగా సంభవించేవి, అయాచితంగా లభించేవి స్వీకరించుకుని తృప్తి చెందాలి. అట్టివాడు:-

**అయాచితంగా ఏది లభిస్తే, దానితో తృప్తి చెందేవాడు.**

-శ్రీ మద్భగవద్గీత జ్ఞానయోగము:22 ★



...గ్రంథాలయ... A C No. 18209 ...044.

## పదిహేనవ ప్రకరణము

# ద్వంద్వాలు

భగవద్గీత అభ్యాసం గురించి చెప్పుకోతగిన ప్రకరణాలలో చాలా కఠినమయినది, అయినాసరే, చాలా ముఖ్యమయిన వాటిలో ఒకటి- ద్వంద్వాల సమస్య.

ప్రాపంచిక బంధనాలనుండి స్వేచ్ఛను పొందితేనే మోక్షం సాధ్యమవుతుంది. ప్రాపంచిక బంధనాలు చాలా మొరటయినవి. అవి కోరికల రూపంలో ఎక్కడవడితే అక్కడ ప్రత్యక్షమై ప్రగతిని స్థంభింపచేస్తాయి. అయితే ద్వంద్వాలు మరింత ప్రమాద కరమైనవి. అవి ఇంకా నిగూఢంగా, లోతుగా వెళ్లి మనలను మనకు తెలియకుండానే, మనము తప్పించుకోలేని పద్ధతిలో ఇహానికి కట్టిపడేస్తాయి. కాబట్టి, వాటియందు జాగరూక గమనిక కలిగిఉండి, (ఎప్పటికప్పుడు) పునరుజ్జీవనము పొందడానికి మిక్కిలి కఠోర మయిన శ్రమచేసి, వాటి సంకెళ్లను పారద్రోలవలసి ఉంది.

మనలను తరుచుగా కలవరపెట్టే ద్వంద్వాలు: 1) సుఖదుఃఖాలు 2)ఆనంద విషాదాలు 3) జయాపజయాలు 4)కీర్త్యపకీర్తులు 5)రాగద్వేషాలు (మిత్రులు, శత్రువులు)- ఇలాంటివి.

ద్వంద్వాలను పట్టించుకోకుండా వాటిపట్ల ఉదాసీన స్వభావాన్ని అవలంబించవలసి ఉంది. పరిస్థితుల ప్రాబల్యంచేత; లేక, విశ్వసంబంధమయిన కాల పట్టికలోని ఏదో ఒక నిమిత్తం చేత- మనము ద్వంద్వాలపట్ల అట్టి ఉదాసీన భావాన్ని సాధించుకుని, మోక్షానికి ఒక అడుగు దగ్గరగా పోవచ్చు. కాని (మోక్ష సాధనయందు) అది అంతగా సహాయపడే స్థితి కాదు.

1. బాహ్యమయిన నిర్బంధాల వలన అవసరార్థం జరిగే అభ్యాసాన్ని ఎరువు (అడిగి తెచ్చుకున్న) శక్తిగా పరిగణించాలి. ఆ బాహ్య నిర్బంధాలు తప్పుకోగానే మళ్లీ ద్వంద్వాలకు బలికావలసిన స్థితి సంభవించి, మనం కాలప్రవాహంలో నిస్సహాయంగా కొట్టుకుపోతాము.

2. మోక్షానికి గాను మననుండి ఏవిధమైన ప్రయత్నమూ లేకుండానే, విశ్వప్రణాళిక లోని నిమిత్తములు, నిర్ణీత సమయమప్పుడే మనముక్తి సంభవమయ్యే సంగతి తమకు తాముగానే చూసుకుంటాయని తలపోస్తే; బహుశా మహాప్రళయం (విశ్వయావద్విముక్తి) సంభవించే సమయం వరకు నిరీక్షించవలసి రావచ్చు. దానికి ఎంత కాలం పడ్తుందో ఎవరూ జోస్యం చెప్పలేరు. బానిసత్వంలో అల్లాడుతున్న దేశంలోని ఒకానొక యావజ్జీవ ఖైదీ పరిస్థితిలాంటిది, అది. దేశానికి స్వాతంత్ర్యం రావడం ఎప్పుడు, ఖైదీలందరికీ క్షమాభిక్షను ప్రసాదించి వారిని విడుదల చేసేదెప్పుడు!

అలాకాకుండా, ద్వంద్వాల ప్రభావాలకు అతీతమయ్యే స్థితిని బుద్ధిపూర్వకంగా స్వయంకృషితో సాధించుకొంటే, అప్పుడు చేకూరేబలం (ఎరువు తెచ్చుకున్నది కాక) స్వంతమే అయి, మోక్షం మరికొంత ముందుగా సాధ్యం చేసుకునేటందుకు సహాయ పడుతుంది. ఇతరుల బలాత్కారంవల్ల గానీ అవసరంవల్ల గానీ చేయని ఎట్టి

అభ్యాసమయినా మనది అని చెప్పుకోగల ఆస్తిగా, ప్రగతికి సహజసిద్ధమయిన చాలక శక్తిగా భాసిస్తుంది.

కోరికలతో మన అనుబంధం ఆద్యంతం. కనుక, అవి చనువు తీసుకోగల శత్రువులు. వాటికి మనసులలో బీజాలు వేసేది మనమే, మన శరీరశ్రమతో వాటి పెరుగుదలకి సహాయం చేసేదీ మనమే. వాటి ఫలితంగా సంభవించే పరిణామాలను మన ఆధ్యాత్మికతలో కలిగిన మందకొడితనంగా స్వీకరించేదికూడా మనమే. కోరికలు మనలను సాధారణంగా ఇటు నెరవేరే దారిలోకి గాని, అటు వైఫల్యపు మార్గంలోకి గాని- ఏదో ఒక వైపుకి లాగుతాయి. దానిని మనం కొంతవరకు ముందుగానే చూడగలుగుతాము. అటువంటి ముందుచూపు ఉండి, దానికి సంకల్పాన్ని జతచేస్తే; వాటి పెరుగుదలను సమర్థంగా ఆపడానికే కాక; అవి మళ్లీ మళ్లీ మనమీదకి దాడి చెయ్యకుండా మనకోసం మనం ఒక రక్షణయంత్రాంగాన్ని వ్యవస్థాపించుకొనే ప్రణాళిక వేసుకోవడానికి కూడా తగినంత వ్యవధి ఉంటుంది.

కాని, ద్వంద్వాల విషయంలో అలా కుదరదు. అవి తరుచు మనకు తెలియకుండానే మనలను అధిగమించి, మన భావాలమీద గట్టిదెబ్బ కొడతాయి. ఉత్సాహ-నిరుత్సాహాల అంచుల మధ్య మనలను ఊగిసలాడిస్తూ, ఆధ్యాత్మిక ప్రపంచంలో ఎక్కడ, ఏలంగరుకూ ముడి పడకుండా ఎలాగ నిలిచి ఉన్నామో తెలియరాని కలవరస్థితిలో పడవేస్తాయి. ఈ పరిణామంలో, మనలను మోక్షానికి దూరంచేసే, కొన్ని ఐహిక బంధాలలో మరింత లోతుగా ఇరుక్కుపోతాము.

మానవుడి ఉత్థాన పతనాలు సంఘటనల వైచిత్రివలన కూడా సంభవిస్తాయి. ఒకడు తన ఒకనాటి స్నేహితుడి పలుకుబడి ద్వారా ఒక పొగాకు కంపెనీలో చిన్నపాటి టైపిస్టు ఉద్యోగం సంపాదించుకున్నాడు. అతడు అక్కడ చేరిన కొద్ది నెలలలో; ఆ కంపెనీ నుండి ఇంగ్లాండు దేశానికి ఎగుమతి చేసిన ఎంతో అధికమయిన పరిమాణంగల పొగాకు (నాణ్యత) పాడయింది- అనే మిషతో కొన్ని లక్షల రూపాయల నష్టం సంభవించే సంఘటన తటస్థపడింది. కంపెనీలో (అతడు ఎంతో పెద్ద ఉద్యోగస్తుడు కాకపోయినా) పట్టభద్రుడు అయి, ఇంగ్లీషు భాష బాగా తెలిసినవాడు. అందుచేత ఈ సమస్యను వీలయినంత సానుకూలంగా పరిష్కరించమని కంపెనీవారు అతనిని తమ తరఫున ఇంగ్లాండుకు పంపారు. ఊరికే అలా (కంపెనీ తరఫున) ఒక మనిషి స్వయంగా అక్కడికి వెళ్లినంత మాత్రంచేత; సమయం మించిపోకుండా, ఆ సరుకు ఎలాగో పూర్తిగా అమ్ముడయిపోయి, (ఎంతో నష్టం సంభవించగలదని కలిగిన భయం తొలగి) తగు మాత్రం లాభం కూడా వచ్చింది. ఈ విజయం లోని మెరుపువలన అతడు ఆ కంపెనీలో భాగస్థుడయి, పాలనామండలిలోకి కూడా ప్రవేశం పొందాడు. ఇక అతనికి డబ్బేడబ్బు. అతడు ఆ నగరపు పురపాలక సంఘంలో సభ్యుడయ్యాడు. ఆ పురపాలక మండలిలో ఆ సమయంలో రెండు వైరివర్గాల మధ్య నెలకొని ఉన్న ఒకానొక ఘర్షణ ఫలితంగా అతడు చేర్మను అయ్యాడు. ఆ స్థానబలిమిచేత అతడు జిల్లా కలెక్టరుగారినే ఏమిటి,

మంత్రులంతటి వారిని కూడా కలుసుకునే అవకాశాలు వచ్చిపడ్డాయి. నగరంలో అతని పేరుతో ఒక ఉన్నతశ్రేణి కాలేజీ వ్యవస్థాపనకి సహాయపడడం వలన ఆ రాష్ట్రపు శాసనమండలికి ఉపాధ్యాయుల ప్రతినిధిగా ఎన్నిక అయ్యాడు. ఒకానొక కీలకమైన సమయంలో అతడు (అప్పటివరకు తాను ఉన్న) పార్టీని విడిచి అధికార పార్టీతో చేతులు కలిపాడు. కొలది వారాలలోనే అతడు రాష్ట్రమంత్రిమండలిలో (డిప్యూటీ మినిస్టర్‌గా) స్థానం పొందాడు.

ఇలా కొంతకాం 'దండమీదదండ'గా అతడు ఎదిగాడు. ఎంతగా ఎదిగాడంటే, వ్యక్తిగత జీవితంలో సుఖాలు, సౌఖ్యాలు ఒకటొకటిగా తటస్థపడి, అధికారం కూడా మోహం మొత్తినంత చేకూరింది. ఇలా అదృష్టమనే నిచ్చెనను అధిరోహించడం అతని ఆలోచనా క్రమాన్ని మార్చింది. తాను స్వయంకృషి వలననే ఇంతవాడు అయ్యాడని తలచి తన ఉన్నతికి సహాయపడినవారిని, ఆఖరికి తల్లిదండ్రులను, గురువులను ఛీకొట్టి; ఈ విజయానికి వెనుక నిలిచిన దైవశక్తిని విస్మరించాడు. ఆ భ్రమలో పడి; తానెన్నటికీ అందుకోలేని చిత్రచిత్రమైన స్వభావాలతో, సంక్లిష్టతలతో నిండిన అసంఖ్యాకాలయిన ప్రాపంచిక బంధాలను ఏర్పరుచుకున్నాడు. ఇంకా ఎంతకు దిగజారేడంటే, కొంతకాలం పాటు రకరకాల విలాసాలకు, పై మెరుగుల సౌఖ్యాలకు బానిసయినంతగా అలవాటుపడి, అవన్నీ తన ఉనికికి అవసరాలేననీ, అవిలేకపోతే, తన పని గట్టున పడిన చేప చందం అయి బ్రతకడం కష్టమనీ - అనుకో సాగాడు.

కాని, ఒకేఒక్క దురదృష్టకరమయిన, అవివేకమయిన నిర్ణయం తీసుకోవడం వలన అధికారపక్షం అప్రదిష్ఠ పాలయి, ఉన్నట్టుండి అధికారాన్ని కోల్పోయింది. అతడి మంత్రిపదవి ఊడింది. అతడు తిరిగి సాధారణ పౌరుడు అయ్యాడు. అది అంతతో ఆగలేదు. అతడు (పదవిలో ఉండినప్పుడు) అధికారాన్నీ ప్రజాధనాన్నీ దుర్వినియోగం చేసినందుకు అతనిమీద ఒక బహిరంగ విచారణకు ఆదేశించారు. ప్రజాజీవితంలో వలెనే, వ్యక్తిగత జీవితంలో కూడా గట్టిదెబ్బలు తగిలాయి. అతడు తాను అధికారంలో ఉన్నప్పుడు తనకు అప్పు పెట్టమని తాను నిర్బంధించిన ఋణదాతలు అవన్నీ తీర్చమని ఒత్తిడి చేశారు. ఒకప్పుడు కనులు మిరుమిట్లు గొలిపిన అతని "మూర్తి" నశించింది. చివరికి అతడు కారాగారంలో కటకటాల వెనుకకు చేరాడు. ఆ దయనీయ స్థితిలోనే అతని అత్యంత ప్రియతమమయిన సంతానంలో ఒకరికి తీవ్రమైన రోడ్డుప్రమాదం జరిగి, మరణం సంభవించిందనీ, అతని భార్య గుండెపోటుతో ఆసుపత్రి పాలయిందనీ తెలియ వచ్చింది. ఇదంతా చాలదన్నట్లు అతని కుమార్తె శీలాన్ని శంకించి, అల్లుడు ఆమెను విడిచిపెట్టగా, ఆమె మతిచెడి దుఃఖిస్తూ తన నలుగురు పిల్లలతో ఇల్లు చేరింది. గతకాలంలోని సుఖాలూ, వైభోగాలూ పోయాయి. ఆ కుటుంబం ఒక హీనమయిన అద్దె ఇంటికి చేరి ఉండగా, కొన్నాళ్లకి అదికూడా ఖాళీ చెయ్యవలసి వచ్చింది. చివరికి అతడు తన అవమానకరమయిన శిక్షా కాలాన్ని పూర్తిచేసి వచ్చాక, అన్నిరకాల అవమానాల వల్ల, తలవంపులవల్ల; తలను గోడకు కొట్టుకోవాలనిపించింది. ఆత్మహత్య చేసుకోవాలని

అనిపించినా ఆ పిలుపు అందుకొనే ధైర్యంలేదు. ఈ దురవస్థలన్నీ సంభవించినందుకు ఇతరులనీ, ఆఖరికి దేవుడిని కూడా: తిట్టుకున్నాడు. గతించిన వైభవాన్ని తిరిగి పొంద డానికిగాను తిరుగులేని నిస్పృహలో మిక్కిలి హేయమయిన వ్యూహాలను ఏర్పరుచు కున్నాడు. ఇలా పాపాల ఐహికబంధాల సాలెగూడులో తనను తాను మరింత లోతుగా ఇరికించుకున్నాడు.

ఈ విధంగా మనం మన ప్రమేయం లేకుండానే పర్వతాగ్రానికీ, అగాధానికీ మధ్య ఇటూ-అటూ ఊగిసలాడుతాము. ఈ రెండు ప్రయత్నాలలోనూ ఐహికమయిన అనుబంధాలు మనమీద తమపట్టును ఇంకా బిగిస్తాయి. ఫలితంగా పునరపిజననంగా ఈ గొలుసు ఎన్నటికీ పరిపూర్తి అవని విధంగా కొనసాగుతుంది.

మోక్షానికి మనలను దూరంచేయడానికి గాను సంభవించే, ఈ అంతులేని, నిరోధించలేని- లాగుడును ఆపడానికి ఒకే ఒక మార్గం ఉంది.

విశ్వప్రణాళిక ప్రకారం సంభవించే మోక్షం కోసం నిరీక్షించకుండా, శక్తిని పెంపొందించు కొంటూ, సంకల్పశక్తితో మనకు మనముగా ప్రయత్నించుకోవడమే ఆమార్గం.

దైవికంగా మనకు ప్రాప్తమై, మనం చేరాలనుకునే చోటికి తీసుకుపోయే సాగరఝరి మనబలం అనిపించుకోదు. ఆ ఝరి, మరుక్షణంలో; తిరోగమనం చేత మనలను వెనక్కు కూడా లాగి (మనం చర్చించుకున్న ట్రైపిస్టు ఉదంతంలో వలె) నరకప్రాయం, దైవవర్జితం అయిన ఒకానొక ద్వీపానికి తోసెయ్యగలదు. కాని, ఆ సాగరఝరిని ఎదిరించి, ఆ కెరటాలను నెట్టుకుంటూ, మనకు మనంగా ఏర్పరచుకున్న ప్రణాళిక ప్రకారం ఈదులాడుకుంటూ పోవడం నేర్వగలిగితే, అదే మన అసలైన బలం. దానిని నమ్ముకుని మనధ్యేయంవైపు సాగిపోవచ్చును.

మనం ద్వంద్వాలను పట్టించుకోకుండా ఉండగల స్వభావాన్ని అభివృద్ధిపరచుకో గలగడమే అట్టిబలం.

మానవుడు అదృష్టం చేతుల్లో బానిసగా ఆడే కీలుబొమ్మకాదు- అని; "నిర్ణయ-నిశ్చయ ప్రతిపత్తి" అనే ప్రకరణంలో చెప్పుకున్నాం. మానవుడు తన అభిరుచిని అనుసరించి తన కర్తవ్యాన్ని ఎంచుకొని, పనిచేసుకునేటందుకు కొద్దిపాటి స్వేచ్ఛను పొంది ఉన్నాడని మన ఋషులు నిర్ధారణగా చెప్పారు. స్వేచ్ఛాభీష్టం అనే ఈ వరం (ఇచ్చే) సహాయం తీసుకుని మోక్ష మార్గ అవలంబన కోసం మనం సాగించే పోరాటానికి అవసరమయ్యే బలాన్ని అభివృద్ధి చేసుకోవాలి.

ఆ బలం రెండు విధాలుగా ఖచ్చితంగా సహాయపడుతుంది.

1. అదృష్టం చంచలం. దాని చిత్తంపట్ల నిర్లిప్తత ఉంటే, అదృష్టపు శిఖరాగ్రం మీద కూర్చున్నప్పుడూ, దురదృష్టపు అగాధంలో కూలబడినప్పుడూ; (ఇప్పటికే) మనకి ఏర్పడిన ప్రాపంచిక అనుబంధం పెరగకుండా దానిని దూరంగా ఉంచుతుంది. అనగా, ఆ నిర్లిప్తత మన పురోగతికోసం ఒక సుగమమయిన మార్గాన్ని ఏర్పరచి, తద్వారా మనకు ఇంతకు

పూర్వపు పాపాలవలన కలిగే ప్రభావాన్ని ఎదుర్కోవడానికి మేలయిన అవకాశాన్నిచ్చి; మోక్షాన్ని త్వరగా సాధించుకోగలిగేటట్లుగా చేస్తుంది.

2. ఎప్పుడో భవిష్యత్తులో మోక్షాన్ని త్వరగా సాధించుకోగల అవకాశాన్ని ప్రసాదించడమే కాదు; ప్రస్తుతకాలంలో కూడా అసలయిన ఐహిక సుఖానికి ఏకైక ఉత్తమ మార్గం-పట్టుదలతో ద్వంద్వాలపట్ల నిర్లిప్తతను సాధించుకోవడమే. ఆధునిక కాలంలో కూడాను, ఎంతోమంది సాధకుల అనుభవసారం ఏమిటంటే; (ఇప్పటికీ ఎప్పటికీ కూడా,) సుఖ సాధనకోసం మానవుడికి తెలిసిన అన్ని పద్ధతులలోను నిర్వికారత్వమే నిస్సందేహంగా గొప్పది.

ఇంకొక విషయాన్ని గురించికూడా కొన్ని సూచనలు చేసుకోవాలి. మృదువుగా సాగే మన జీవితమార్గంలో ఈ ద్వంద్వాలు తప్పనిసరిగా (తటస్థపడి) ఎన్నో ఎత్తుపల్లాలను సృజించి, మన చుట్టూరా ఉండే ప్రాపంచిక అనుబంధాల సాలెగూడును దట్టంగా చేస్తాయి. కాని, ఆ కారణం చేత అవి మన పురోగతికి అవరోధాలు-అని చీదరించుకోకూడదు. పైగా; క్రమపద్ధతిగల, శ్రద్ధాళువయిన సాధకుడుగా ఆ ద్వంద్వాలు యాదృచ్ఛికంగా సంభవించేవేనని గ్రహించి, అభ్యాసం కోసం పథకం వేసుకోవాలి. అదృష్టం వలన కలిగే ఎగుడు దిగుడులు కలవర పెట్టేవిగా ఉంటాయి. వాటి సమక్షంలో ద్వంద్వాలను గురించి సమదృష్టిని అలవరుచుకొనే కీలకాన్ని గ్రహించుకొని, వాటిని మన ప్రయోజనంవైపు తిప్పుకోవలసి ఉంది. ఈ ద్వంద్వాలు మన వైరాగ్యపు కొనలను పదునుపెట్టే సానరాళ్లు-అనీ, అవి మనలను మోక్షానికి మరింత అర్హులనుగా చేస్తాయనీ అనుకోవాలి. ఈ విధంగా, ఈ ద్వంద్వాలను; మన ఆధ్యాత్మిక అభ్యాసాలలో లాభకరమయిన ఉప కరణాలుగా గ్రహించి వాటిని ఆహ్వానించాలే తప్ప మన ప్రగతికి అవరోధాలుగా భావించి తూలనాడరాదు. అవి నిజానికి వరాలే; కాని, ముసుగులో ఉన్నవి.

## ఆచరణ యోగ్యాలైన సూచనలు

జీవితంలో ద్వంద్వాల ప్రభావానికి లోను కాకుండా ఉండడానికి గాను కొన్ని (ఆచరణ యోగ్య) సూచనలు చేసుకోవాలి. ఇప్పుడు గాని, ఎప్పుడయినాగాని, మన వ్యావృత్తులలో ఇంచుమించు అన్నీకూడా మనస్సంబంధమైనవేననీ, వాటి నిర్వహణలో శరీరం చేయవలసినది అతి తక్కువఅనీ, మరొకసారి నొక్కి చెప్పుకోవాలి. మనసు- అనే దానిని, కొద్దోగొప్పో నికార్సయిన ఒక దేహావయవంగా మార్చుకుని; అది మనము నిర్దేశించే విధంగా ఆలోచించి ప్రవర్తించేటట్లుగా దానిని మలచుకోవాలి. ఇంతకుముందు ప్రకరణాలు చాలావాటిలో ఫలానాపద్ధతిలో పనిచెయ్యాలని శరీరానికి ఆజ్ఞలను జారీచేసేది మనసేనని చెప్పుకున్నాం. అయితే, ఇక్కడమాత్రం మనసు ఫలానా పద్ధతిలో ఆలో చించాలనీ, (ఆలోచించకూడదనీ) ఆజ్ఞలు జారీ చేసేది స్వేచ్ఛాభీష్టం. అందుచేత అవసరమయితే మానసిక క్రమశిక్షణ అనే ప్రకరణంలో చేసుకున్న సూచనలను మననం చేసుకుని, వాటిని సాధ్యమయినంత సంపూర్ణ ఉపయోగానికి తేవాలి- అనేది ఈ ప్రకరణంలో చేసుకునే సూచన.

ఒక ప్రత్యేక ద్వైధీ (ద్వంద్వ) భావ సందర్భంలో, ఒక ప్రత్యేకమయిన పద్ధతిలో ఆలోచించుకోవాలని, ఎవరు ఎవరికి చేసినా ఇదే సూచన. ఆ ఆలోచనకు తగిన విధంగా మన మనసు ఆలోచించుకుని, దానికి తగిన పద్ధతిని పాటించేటట్లుగా మనసును నిబంధించుకోవడమే - ఆ తరువాత మనము చేయవలసిన పని. చివరిది- అంటే, "ఫలానా పద్ధతిని పాటించుకోమని" మనసును నిర్దేశించడం- ఈ అభ్యాసం అంతటిలో అతి క్లిష్టమయినది; అయినాసరే, అత్యంత ప్రయోజనకరమయినది. మనసు అలా "పద్ధతిని పాటించుకొనేటట్లు" చూసుకుంటే, సాధకుడికి అదే విజయాన్ని సమకూర్చి పెడుతుందని- గుర్తుంచుకోవాలి.

పని చేసేది మనసు. మనసొక్కటే. మనసుతప్ప మరేదీ కాదు.

1. ఈ శరీరము అనేది "నీవు" కాదు. కనుక ద్వంద్వాల ప్రభావాలు తాకకుండా తప్పించుకోవాలంటే, మొట్టమొదట:-

"సవివరంగా గ్రహించాలి"- (అనగా,) నీలో నీవు మళ్లీ మళ్లీ అనుకుంటే సరిపోదు, సవివరంగా గ్రహించు, (ఏమని?)

ఈ శరీరం అనేది నీవు కాదని,

కాని, నీవు ఆత్మవు- అని.

"సవివరంగా గ్రహించు"- అంటే, ఒక విషయాన్ని గురించి కేవలం ఏదో కొద్దిగా తెలుసుకోవడం కాదు.

దానిని గురించి తీవ్రంగా భావానుభవం చెందాలి. దాని వెనుక ఉండే సత్యాన్ని పూర్తిగా విశ్వసించాలి. అందుకుగాను:

దానికి సంబంధించిన పుస్తకాలు చదవాలి. పండితులతో చర్చించాలి. అది; పునరాలోచన, తిరోగమనం సంభవించే అవకాశం లేని- ఒకానొక దుర్భేద్యమయిన నమ్మకంగా రూపొందేవరకు- అంతశ్చర్చ చేసుకోవాలి; ఎంతకాలం పట్టినా సరే. ఎందుకంటే, ఒక మానవునిగా పొందే దృఢ విశ్వాసాలన్నిటిలో మిక్కిలి ముఖ్యమైనది అదే.

అధునాతన మానవుడికి ఇదంతా ఆచరించడానికి సమయం దొరకదు. అప్పుడు అతడు మన ఋషులు, పురాతన మతగ్రంధాలు చెప్పిన వాటిని శంకారహితంగా నమ్మాలి. కనీసం ఆ గొప్పదనం మనలను మోసగించడానికి ఏర్పడినది కాదని- తెలియాలి. వీలైనంత తరుచుగా, వీలైనంత దీర్ఘదృష్టితో "మన ఋషులు మహనీయులు, మన మతగ్రంథాలు చాలా గొప్పవి. ఇది నా నమ్మకం" అని నచ్చజెప్పుకోవాలి. ఆ తరువాతనుంచి "ఈ శరీరమనేది నేనుకాదు. ఈశరీరమనేది నేనుకాదు. ఈ శరీరమనేది నేనుకాదు"- అని మనలో మనం అదేపనిగా, ఎక్కువెక్కువసార్లు- జీవిత కాలమంతాను- చెప్పుకుంటూ పోవాలి.

అప్పుడు కలిగే ప్రశాంతమయిన ఆలోచన ఎలా వస్తుందంటే:

"ఈ శరీరమనేది నేనుకాదు కదా; ఇది చనిపోగానే నాకేమీ సంబంధమయినది కాకుండా అయిపోతుంది కదా; ఇది ఇవాళో, రేపో- కాకపోతే కొన్నేళ్లలో జరిగేదే కదా; మరి ఇలాంటి అశాశ్వతమైన పదార్థాన్ని గురించి నాకెందుకు బెంగ? అవును, ఈ శరీరానికి "ప్రాణం" అని ఒకటుంది. అది ముఖ్యమైనదే. ఈ జీవితానికి సంబంధించినంత వరకు బెంగకి కారణం అదే. అయితే మరి, అత్యంత సుదీర్ఘమయిన ఆత్మజీవనకాలం ముందు ఈ ప్రాణకాలపు పరిమాణం ఏపాటిది? అత్యంత ప్రకాశవంతంగా, శాశ్వతంగా నిలిచే ఆత్మముందు నశ్వరమైన, అపరిశుభ్రమైన ఈ శరీరం విలువ ఎంత నిరర్థకమైనది!

"ఏ అదృష్టం వల్లనో మానవజన్మ లభించింది. సృష్టిలోని పశుపక్ష్యాది అధో జీవులకు అనుభవయోగ్యంగాలేని మేధను నాకు భగవంతుడు ఎంతో ఉదారంగా అనుగ్రహించాడు. ఈ మేధను పరిపూర్ణంగా ఉపయోగించుకుని- నేను ముఖ్యంగా నా ఆత్మ ప్రయోజనానికే పాటుపడాలి తప్ప, శరీర నిమిత్తం కాదు. శరీర (సంరక్షణ, సుఖం, ప్రయోజనం) నిమిత్తం పాటుపడడం వల్ల, (నాకే) తీరని అన్యాయం చేసుకుంటున్నానన్నమాట.

"జీవితంలో ద్వంద్వాలవలన కలిగే బాధలు ఈ దేహం మృతితో ముగిసిపోతాయి. కాని, వాటి ఫలితాలు మాత్రం ఎంతో విలువైన నా ఆత్మను అంటిపెట్టుకుని, దానిని అధోగతిపాలుచేసి, క్రమంగా దాని పురోగమనాన్ని నిరోధిస్తాయి.

"కనుక, ఇప్పటినుండి; వినాశనాత్మకమైన ఈ వేదనలను ఏవిధంగానూ నన్ను ప్రభావితం చేయనివ్వను. జీవితంలో వచ్చిపోయే ఉత్థానపతనాలు నన్ను ఏమాత్రం అంటకుండా చూసుకుంటాను.

"ఇదే నా ఆదర్శం, ఇదే నా ప్రతిజ్ఞ"

అట్టి ప్రశాంతమయిన ఆలోచన స్థిరపడిన స్థితిలో మనసును నిలిపి, ఎప్పుడయినా ఆనందవిషాదాల వలన కుదుపులు సంభవిస్తే, అప్పుడు ఆ స్థితిని అభ్యాసంలోకి తెచ్చుకోవాలి.

## 2. ఒక కళేబరము.

ద్వంద్వాలు మనమీద చూపించే ప్రభావాలను సహజ సిద్ధాలుగా స్వీకరించడానికి వీలుగా, ఎవరి కళేబరాన్ని వారు దృష్టికి తెచ్చుకోవాలి. దీనిని ఏదో అశుభమయిన, జుగుప్సాకరమయిన, అసందర్భమయిన- సూచనగా తలచకూడదు. ఐహిక బంధాలే సర్వం- అని భావించే సామాన్య గృహస్థుకు అది అలా అనిపించవచ్చు. కాని, లౌకిక ఆనందాలకు మిక్కిలి అతీతంగా దృష్టిని సారించుకుని, (ఇట్టి విషయాలకు పోలికలేని వాటి సాధనకు నిశ్చయంతో కొనసాగే) శ్రద్ధాళువైన సాధకుని విషయంలో అలాకాదు.

ఇందులో భయపడవలసినది ఏమీలేదు. ఆవగింజపాటి ముందుచూపు ఉన్న వారెవరయినా తాము ఏదో ఒకనాడు కళేబరంగా మారుతారని గ్రహించగలరు. అది అనుల్లంఘనీయం. ఆ స్థితి రాకుండా ఎవరూ తప్పించుకోలేరు. మరి, అలాంటప్పుడు, దానిని గురించి (ఇప్పుడు) కనీసం ఆలోచించుకుంటే ఏమిటి, తప్పు? అదీకాక ఇప్పుడే ఆ ఆలోచన సాగించుకుంటే, ఖచ్చితంగా దానివల్ల లాభం ఉంది. పువ్వులు జల్లి, కళేబరాన్ని

ఎవరో పూజించినా, లేక, (దానిని చీదరించుకుని) దానిమీద ఉమ్మివేసినా, ఆ కళేబరానికి తేడా ఏమీ తెలియదు.

ఆధ్యాత్మిక అభ్యాసం నిమిత్తం మనలను మనం తాత్కాలికమయిన కాలంపాటు కళేబరంగా పరిగణించుకుని చూసుకుంటే; దూషణ భూషణాలకు, శత్రు మిత్రులకు, ఉష్ణ శైత్యాలకు: ఎలా ప్రభావితం కాకుండా ఉన్నదీ చూసుకోగలుగుతాము.

ద్వంద్వాల ప్రభావాన్ని అధిగమించడానికి ఇంకొక ఉత్తమ మార్గం చెప్పేరు: "నీవు ఒక కళేబరానివి- అని భావించవలసిన వైఖరిని అవలంబించడానికి గాను నీ మనసును బలాత్కారంగా సిద్ధంచెయ్యి, అప్పుడు నీ మనసు నీ శరీరాన్ని కళేబరంగా ఉండమని ఒత్తిడి చేస్తుంది. ఆ పరిస్థితిలో (మీద పడుతున్నవి) పుష్పగుచ్ఛాలా- ఇటుకరాళ్లా; ఆనందాలా- విషాదాలా; వేటికీ ఏ ప్రభావమూ ఉండదు"

విజయానికి చిట్కా: ఆలోచించగలమా, లేదా- అనేదానిమీద ఆధారపడి ఉండదు. ఎంత తీవ్రంగా ఆలోచించగలము; అనుగుణమైన స్థితిని అవలంబించే విధంగా మనసును ఎంత తీవ్రంగా ప్రేరేపించగలము- అనే వాటిమీద ఆధారపడి ఉంటుంది. అభ్యాసంవలన, ఆచరణవలన విజయం సిద్ధిస్తుంది.

### 3. సత్యం, న్యాయం.

ఓటమి, అవమానం, ప్రతికూలత; సంభవించినప్పుడు పాటించవలసిన సువర్ణ సూత్రం: సత్యానికి కట్టుబడి ఉండాలి.

ఓటమి, అవమానం ఇలాంటివన్నీ విధి లిఖితాలు అయితే, సంభవించి తీరుతాయి. ఎవరూ ఏమీ చెయ్యలేరు. ఏం జరిగినా, (మనం) న్యాయమనీ, సత్యమనీ, నమ్మినదానికి మొండిగా కట్టుబడి ఉండాలి. అందువల్ల మూడులాభాలు ఉన్నాయి.

(i) ఎట్టకేలకు సత్యం జయిస్తుందన్నది నిస్సందేహం. మానవుడి సర్వప్రాంత అనుభవం గానీ, ప్రపంచపు సర్వకాల చరిత్రగానీ- చెప్పేది అదే. సత్యం (ఆయుధంగా) ఉంటే ఇప్పుడో, ఎప్పుడో విజయం తథ్యం. కనుక మధ్యలో నీరుగారిపోకూడదు. పరిపూర్ణమైన సత్యాన్ని మన పోరాటపు ఆయుధంగా చేపట్టాలి.

( ) విజయం సంభవించడానికి కొంతకాలమో, మరింతకాలమో పడితేపట్టనీగాక. అయినాసరే, మధ్యకాలంలో దేవుడిసంగతి అలావుంచి, మనపక్షాన నిలిచే మహనీయులు అనేకుల దీవెనలు, సానుభూతి మనకు ఉంటాయి. అవే అసలయిన, అమూల్యమయిన బలం. దానిని అనుసరించి కలిగే జయం చిరకీర్తిని తెస్తుంది. అంతేకానీ, కష్టాలు వచ్చిపడినందున, న్యాయ విరుద్ధమయిన పద్ధతులతో జరిపే గింజులాటవలన కాదు. అంతేకాక అట్టి విజయం ఔన్నత్య, ఆశ్చర్య భరితమయిన జీవనంలోకి చూసుకోగల స్థైర్యాన్నిస్తుంది.

( ) అది అలా ఉంచి, సత్యం-న్యాయం; వీటికి అవమానమనేది ఎన్నడూఉండజాలదు. మనం సత్యానికి, న్యాయానికి కట్టుబడి ఉన్నాసరే, మనకి అవమానం సంభవిస్తే; అదంతా దాన్ని మనమీద రుద్దేవాళ్లకే గాని, మనకి చెందదు. సత్యానికి, న్యాయానికి కట్టుబడి

ఉన్నప్పుడు; (పిరికితనంవల్ల) మిగిలిన వాళ్లలో చాలామంది నిలబెట్టలేని ఒక ఉన్నతాదర్శాన్ని మనం సమర్థిస్తున్నాం కనుక, అవమానకరమయిన పరిస్థితుల్లో కూడా మనం వీరోచితంగా తలెత్తుకు తిరగ్గలం.

## 4. ప్రార్థన చెయ్యాలి

ఒక్కొక్కప్పుడు మన గమనం అధోముఖంగా సాగుతూ ఉంటుంది. అన్ని వైపులనుండి వేధింపులే ఎదురవుతూ ఉంటాయి. మన కర్తవ్య నిర్వహణకిగాను చెయ్యగలిగినంతా చేసినాసరే, వైఫల్యమే సంభవిస్తుంది. అలాంటప్పుడు ప్రార్థనకి మించిన అండ మరోటి ఉండదు, మనకి. మానవుడు సాధారణంగా ప్రార్థన అనే పద్ధతిని ఆఖరు దశలో ఆశ్రయిస్తాడు- కానీ, మొదటినుండి అవలంబించవలసిన ఉత్తమమయిన పథం ఇదే. అన్యథా శరణం నాస్తి- అనిపించినప్పుడు మనకి సహాయపడడానికి గాను, మనం ప్రార్థన ద్వారా ఆవాహన చేసేది; మానవుడు ఊహించగలిగిన అత్యున్నత శక్తిని.

మనము చేసేది ఏదయినా సరే, దానికోసం మనం పెట్టే శ్రద్ధకి తగిన విధంగా ఫలాన్ని ఇవ్వవచ్చు, లేదా, ఇవ్వకనూపోవచ్చు. కాని, ప్రార్థన ఎన్నడూ భక్తుడిని విఫలుడినిగా చేయదు. తనను ఆశ్రయించిన వారిపట్ల ప్రతిచర్యను ప్రసాదించడానికి విఫలం కానిది ప్రార్థన. ఆ ప్రతిచర్య ఫలితం ఎవరికి ఎంత అర్హత ఉందో ఎప్పుడూ సరిగ్గా అంతే అందుతుంది. మనము సాధించుకోగోరే దానికి గాను, తప్పనిసరిగా లభించగలదని నమ్ముకోగల ఆధారం ప్రార్థన.

ప్రార్థనను గురించి, దాని సార్థకతను గురించి; ఈ గ్రంధంలో (వేరే ప్రకరణంలో) సవివరమయిన చర్చ ఉంటుంది. కనుక, ప్రతికూల పరిస్థితులలోకూడా న్యాయానికీ, సత్యానికీ కట్టుబడి ఉండేవాడు, దానికి తోడుగా చేయవలసినది ప్రార్థనే- అని మాత్రం ఇక్కడ చెప్పుకుంటే సరిపోతుంది.

అందుచేత, మన్పైనిపడే ద్వంద్వాల ప్రభావాలను అధిగమించడానికిగాను:

(i) మనకు అదృష్టం కలిసివచ్చినప్పుడు; గర్వం, స్వార్థం, క్రౌర్యం, సంపదపై మరింత అనురక్తి- కలగకుండా కటాక్షించమని ప్రార్థించాలి. లభించిన సంపదలకు అర్హతలు కూడా చేకూరేటట్లు చూడమని ప్రార్థించాలి.

(ii) మనము ఆపదలో ఉన్నప్పుడు; న్యాయానికీ, సత్యానికీ కట్టుబడి ఉండే ఆత్మ స్థైర్యాన్ని ప్రసాదించమని ప్రార్థించాలి. (ఈ కలిగిన) ఆపదను అన్యాయంగా కలుగజేసిన వారిపై ప్రతీకార చర్యలకు తలపడకుండా కాపాడమని ప్రార్థించాలి.

## 5. సాగరం.

"నీవు" అనేది ఆ శరీరం కాదనీ, ఆత్మ అనీ, నీలోనూ నాలోనూ అతనిలోనూ సమస్త జీవులలోనూ ఉండే విశ్వాత్మ అనీ- మరొకసారి జ్ఞాపకం చేసుకోవలసి ఉంది. చూడడానికి వేరే వేరే శరీరాలుగా కనిపిస్తున్నవన్నీ నిజానికి ఒకటేనని పరిపూర్ణ విశ్వాసంతో నొక్కి చెప్పుకోవలసి ఉంది.

వివిధ శరీరాలకు వాటిలో వాటికి గల సంబంధం, వాటికి విశ్వాత్మతో ఉన్న సంబంధం ఎలాంటిదంటే, ఒక మహోదధిలోని ఉదక బిందువులకు వాటివాటి మధ్య ఉండే సంబంధం, వాటిలో ప్రతి ఒక ఉదబిందువుకు ఆ మహోదధితో ఉండే సంబంధం ఎలాంటిదో- అలాంటిది.

తనకంటూ ఒక ప్రత్యేక స్థానంలేని - విడి - ఉదబిందువు దృష్టితో కాక, విశ్వాత్మ దృష్టినుంచి (అనగా సాగరం దృష్టినుండి) చూద్దాము. దానికి నష్టము గాని, లాభముగాని (హానివృద్ధులు) ఉండవు.

సాగరానికి ఆటుపోటులు ఉంటాయి. సాగరం ఆటు వలన విషాదం పొందదు. పోటు వలన ఆనందం కూడా పొందదు. ఈ రెండు విరుద్ధమైన లక్షణాలు కలిగిన సాగరం హాని వృద్ధులు లేక చెక్కు చెదరకనే ఉంటుంది. అది ఒక ప్రత్యేక శక్తి. దానికి ఎంత చిన్న పాటి కలత అయినా లేదు.

అలాగే "నీవు"- అనే విశ్వాత్మకూడాను. దానికి హాని-వృద్ధులు సంభవించినట్లు కనిపిస్తే, అదంతా సాపేక్షమయినది, విభాగసంబంధమయినది; అంతేగాని, పరమముకాదు, సర్వ వ్యాపితము కాదు. సాధకునికి జీవితంపట్ల దీర్ఘము, పరమము అయిన దృష్టి ఉండాలి. అతడు తన దృష్టిని సంకుచితం చేసుకోకూడదు. దాని చుట్టూ గిరి గీసుకో కూడదు. అతడు భూమిని అధిగమించి పై కక్ష్యనుండి చూడగలవాడు కావాలి. కారాగారపు అరలోని బందీ కాకూడదు.

"పరమ-అర్థం"ను అనుసరించి, కలిగే అట్టి అవగాహన ప్రకారం మనకు సంభవించే హాని- వృద్ధులు ఒక భ్రమ మాత్రమేనని, వాటిపట్ల విలాప ఉల్లాసాలు నిరర్థకాలనీ (సాధకుడు) మనసుకు చెప్పుకోవాలి. సాధకుని విషయంలో ఇది మరింత అవసరం.

ఈ పద్ధతిలోనే సాగర- ఉదబిందు- సంబంధం కూడా ఉంటుంది. "నీవు" అనేది ఒక బిందువు అని, సాగరంతో ఏకీభావం కలదిగా ఉంటుందని భావించుకున్నప్పుడు; ఒక మిత్రుడుగాని, ఒక శత్రువుగాని; అదే సాగరంలో రెండు వేరు వేరు స్థలాలనుండి తలలెత్తుకు చూసే రెండు (మైత్రీ-విరోధ భావాలుగల) ఉదబిందువులుగా భావించాలి. "నీవు" అనేది సాగరమే అయినప్పుడు, ఆ రెండు బిందువులు అందులో భాగాలే అయినప్పుడు; ఆ రెండిటిమధ్య భేదభావం చూపడానికి వీలవుతుందా? శత్రుభావ బిందువును ద్వేషిస్తే, అది స్వయంద్వేషమే. ఎవరికయినా తనను తాను ద్వేషించుకోవడం సాధ్యం అవుతుందా? అలాగే మిత్రభావబిందువు అట్టి మరొక (మిత్రభావ) బిందువును ప్రేమించగలుగుతుందా? ఎవరయినా రెండు కళ్లూ వారివే అయి; వారే ఆ రెండు కళ్లూ అయివుంటారు గనుక; తన కుడి కంటిని ప్రేమించి, ఎడమకంటిని ద్వేషించగలరా? గుణాతీతుడయిన పరమాత్మ స్థాయిలో ఆ విధంగా ఉండ వచ్చునని, మనము నివసిస్తున్న ఐహిక స్థాయిలో ఆ విధంగా కాదనీ చెప్పుకోకూడదు.

గుణాతీతుడయిన పరమాత్మ పట్ల ప్రతిఒక్కరూ- శ్రద్ధవహించాలి- (సాధకుడు మరింత)- అని ఎవరికి వారు గట్టిగా చెప్పుకోవాలి. సాధకుడు తన ధ్యేయాన్ని సాధించుకో

గోరితే, నిరంతరం పరమాత్మపరంగా ఆలోచించడం ముఖ్యం. ఆచరించడం అంతకన్నా ముఖ్యం.

సుఖ-దుఃఖాలు, బాధానందాలు, సంతోష-విషాదాలు- వంటి ద్వంద్వాలపట్ల సాగర తుల్య పరమాత్మ వైఖరిని అవలంబించుకుంటే, అవి ఏవీ మనలను తాకకుండా ముందుకు సాగగలుగుతాము.

### 6. ప్రారబ్ధం

ఈ జీవితంలోకి రావడం, ఈ ద్వంద్వాలగుండా ఈదులాడుతూ పోవలసిరావడం; ఈ రెండూ కూడా ప్రారబ్ధం వలన సంభవించేవే. పూర్వ జన్మలో మనము ఒనరించిన మంచి చెడ్డల సంఘటిత ఫలమే ప్రారబ్ధం. ప్రారబ్ధం వలన స్వభావము రూపుదాలుస్తుంది. ద్వంద్వాలను ఎదుర్కొనేటప్పుడు ఆరూపు క్రమంగా స్పష్టమవుతుంది.

(i) మన ప్రస్తుత అదృష్ట - దురదృష్టాల పట్ల మనకు కలిగే స్పందనలు ఆయా అదృష్ట-దురదృష్టాల సంభవం విషయంలో మనము చేసినదానిని బట్టి, నిర్ణయమవుతాయి. ఆ నిర్ణయాలు మన మనసు వాటి పట్ల పొందే స్పందనను, శరీరాన్ని కార్యోన్ముఖం చేసే నిర్దేశపద్ధతిని- అనుసరించి ఉంటాయి.

మనసే అసలయిన విత్తనం. ద్వంద్వాలను కొనసాగించుకోవడం గాని, మట్టుపెట్టడం గాని; అంతా దాని చేతుల్లోపని.

మనసు ద్వంద్వాలతో ఏకమయిపోయింది- అనుకుందాము. అప్పుడు ఈ ద్వంద్వాల మీద పెత్తనం అంతా మనదే అనిపించేటట్టు చేసి, దానికి అనుగుణంగా మనచేత పని చేయించుతుంది. మనం, మన అదృష్టానికి కారకులం మనమే, నాశకులం మనమే; అనుకొని, వాటిలో మరింతగా కూరుకుపోతాము. అవన్నీ మరిన్ని సంక్లిష్టతలను చేర్చుకుని, మరుజన్మలోనికి కొనసాగుతాయి.

అలాకాక, మనసు ద్వంద్వాలనుండి పూర్తిగా విడిపడి, ద్వంద్వాలకు స్పందనగా శరీరం ఏఏ చర్యలకు బద్ధమై ఉంటోంది- అనేదానిపట్ల ప్రేక్షక వైఖరిని అవలంబిస్తే, ప్రారబ్ధం యావత్తూ ఈ జన్మలోనే పరిహృతమవుతుంది. మానవుని చోదన లేకుండా పనిచేసే యంత్రం ఇంధనం అయిపోగానే (తనంతట తానే) ఇప్పుడో, ఇకనో పూర్తిగా ఆగిపోతుంది.

కనుక, మనసు ఎలా ఆలోచించుకోవాలో, దానిని మనం ఆదేశించాలి.

"నాదేహం ద్వంద్వాలకు లొంగుబాటుగా పాల్పడే ఏ చర్యలోనూ కూడా నేను జోక్యం చేసుకోను."

"దొంగలు దారి మళ్లించి ఈ శరీరాన్ని కొట్టినట్లయితే, రక్షించుకోవడం- అనేది నా కార్యనిర్దేశకత్వంలో కాక, తన స్వయంరక్షణ పద్ధతులలోనే జరగాలి. కార్యాలయంలో పదోన్నతి కలిగితే, ఆఫీసుకి వెళ్లేటప్పుడు అందుకు తగిన దుస్తులు వేసుకున్నప్పటిలాగా నేను దానిని యాంత్రికంగానే స్వీకరిస్తాను. ఈ శరీరానికి జబ్బు చేసి, బాధలు కలిగి

మూల్గులు వచ్చినా, అదంతా ఇంకేదో శరీరానికి సంభవించినట్లుగా పరిగణించి ఊరు కుంటాను."

"ఈ శరీరానికి సంభవించే అన్ని సంఘటనలను, అదేదో మనసులేని యంత్రంలాగా తీసుకుని; కష్టమో, సుఖమో అనుభవించవలసిందే కానీ, నేను వాటన్నిటికీ దూరంగానే ఉండిపోతాను. లేకపోతే, ఈ చిక్కులు, ఈ ప్రారబ్దం మళ్లీ జన్మలోకి కూడా వెంట పడతాయి."

( ) అదంతా మామూలుగా జరిగే పద్ధతి. అయితే, ద్వంద్వాలకు మూలాలయిన వాటిని నిర్వీర్యం చేసి, ప్రారబ్ధ పరిహారాన్ని త్వరగా సాధించే పద్ధతి కూడా ఒకటివుంది.

ఈ పద్ధతిలో ద్వంద్వాల విజృంభణకు ప్రతికూల దిశలో ఆలోచించవలసి వస్తుంది, పని చేయవలసి వస్తుంది.

మనకు ఒక శత్రువు ఉన్నాడు. అతనికి ఏదో నష్టమో, గాయమో కలిగించితే, బాగుంటుందని మనకు సాధారణంగా (న్యాయంగా కూడా) అనిపించవచ్చు. కాని, అలా చెయ్యకూడదు. పైగా అతని తరపున ప్రార్థనలు చేసి, అతనికి ఎంతో కొంత మేలు చేయాలి. భౌతికంగా మనకు కనబడినా, కనబడకపోయినా; ప్రతీ చర్యకూ ఒక ప్రతిచర్య ఉంటుందన్న సిద్ధాంతం ప్రకారం మనము అతనిపట్ల ఒనరించిన సత్కార్యం అతనిలోని దురభిప్రాయాలను పరిహరించి, మనపట్ల అతనికి ఉండే వ్యతిరేకతను ఆ మేరకు చల్లబరుస్తుంది.

ఒక్కొక్కప్పుడు మన ప్రయత్నానికి మించిన ప్రయోజనం కలుగుతున్నదని మనకే తోచవచ్చు. అప్పుడు అదనంగా సంక్రమించే లాభాన్ని త్యజించి దానిని మన వ్యక్తిగత ఆడంబరానికి గాక మరొక రకమయిన (అనగా; దానధర్మాలు, పునరావాస గృహాలకు విరాళాలు వంటి) ప్రజాహితానికి ఎట్టి ప్రతిఫలాపేక్ష లేకుండా వినియోగించవచ్చు.

ప్రారబ్ధాన్ని సత్వరంగా పరిహరించడానికి ఉన్న పద్ధతులు (ఇలా, సారాంశంగా) చెప్పుకోవచ్చు. శత్రువుల పట్ల కూడా ప్రేమభావాన్ని తెచ్చుకోవడం. అధిక సంపదలను త్యజించడం. న్యాయ సమ్మతమయిన పనులకుగాను కష్టాలు అనుభవించడానికి సిద్ధం కావడం, అపమార్గాలద్వారా ఆవహించే సుఖాలను త్రోసిపుచ్చడం. ఇవన్నీ మానసిక, భావసంబంధ తాదాత్మ్యాలచేత నిర్వహించకూడదు. సత్కార్యాలు నెరవేర్చేటప్పుడు అడ్డుతగిలే శక్తుల వ్యతిరేకతతో చేయవలసినవి.

మనకు స్వేచ్ఛాభీష్టం ఒక వరముగా ఉన్నది. దానిని ఏదో ఒక విధంగా ప్రయోజనాత్మక మయిన ఫలితంకోసం ఉపయోగించి, నిలద్రొక్కుకోకపోతే, ప్రారబ్దం చేతులకు చిక్కిన ఒక సాధనం వలె మిగిలిపోయి, ఇహలోకంలో పునరపిజననానికి లోనయి, ఆ సంకెల అలా కొనసాగుతూ ఉంటుంది. ప్రారబ్ధాన్ని పరిహరించుకొనే అవకాశం, అవసరం నేపథ్యంగా- అదృష్టవశాత్తూ సంభవించిన ఈ చిన్నపాటి ఆలోచనను, స్వేచ్ఛాభీష్టం సహాయంతో అమలు పరచుకోవలసిఉంది.

## 7. ముందుచూపు

ద్వంద్వాల ప్రభావాన్ని తగ్గించుకోవడానికి ఇంకొక మార్గం ఉంది. జీవితంలో తగిలే ఎదురుదెబ్బలను ముందు చూపుతో గ్రహించుకొని, వాటిని ఎదుర్కోవడానికి సంసిద్ధం కావచ్చు.

(i) మనము భాగ్య వైభోగాలతో ఉన్నప్పుడే: రేపెప్పుడైనా అదృష్టచక్రం మనల్ని పేదరికం లోకీ అంధకారంలోకీ తోసెయ్యవచ్చుననే ముందుచూపుతో- ఆడంబర రహితమైన, జాగరూకమైన- జీవితాన్ని ఎలా గడపాలో దానిని అభ్యసించుకోవాలి. (అదృష్టచక్రం త్వరలోనో తరువాతనో 'అధోస్థితిని' కూడా తప్పక చూపుతుంది కదా!)... ఇంతకు ముందు 'శారీరక క్రమశిక్షణ'- తదితర ప్రకరణాలలో చేసుకున్న సూచనలను అనుసరించి ఉపవాసాలుండడము, చన్నీట స్నానం చేయడము, చాపమీద నిద్రపోవడము- మొదలైన చర్యలద్వారా భాగ్య వైభోగాల కాలంలో కూడా ఆ నిరాడంబరతను అలవరచుకోవచ్చు.

(i) మనకు ఒక మిత్రుడు ఉన్నాడు. అతనియందు ఇనుమిక్కిలి ప్రేమ. కాని, రేపెప్పుడయినా అతనికి పతనము గాని, మరణము గాని సంభవించినప్పుడు మనకు అంతటి విషాదం కలుగవచ్చు. అందుచేత, ఆ ప్రేమను అంచులు దాటకుండా నిరోధించు కోవాలి. అతనిపై ఉండే అపేక్ష నిరాసక్తంగా రూపొందడానికి గాను, ఇప్పటినుండే కొంత అభ్యాసం చేయాలి. ఆ ప్రేమ కొంత యాంత్రికంగా ఉండేటట్లు- అనగా అది ఒళ్లు మరచిన ప్రేమ కాకుండా- చూసుకోవాలి. అంతేకాక, ఈ ప్రగాఢ స్నేహానికి ఏదయినా విఘాతం ఏర్పడవచ్చుననే ముందుచూపుతో గుండెను (కొంతమేరకు) రాయి చేసుకోవాలి.

(ii) మన వ్యాపారంలో ఏదో నష్టం సంభవించవచ్చు. ఈ ముందుచూపుతో అట్టి నష్టకష్టకాలంలో ఆదుకోవడానికిగాను ఇప్పటిది కొంత విడిగా తీసి, దాచాలి.

(iv) మనము హేయమయిన, హీనమయిన పరిస్థితులలో ఉన్నప్పుడు; అదృష్ట చక్రం మనలను అధోస్థితినుండి ఊర్ధ్వస్థితికి తెచ్చేవిధంగా తిరగవచ్చునని, ఆ దినంకోసం నిరీక్షించడమే మనపని అని: చేసుకునే భావన కూడా ముందుచూపే. అలా అదృష్ట చక్రం మనలను ఊర్ధ్వ స్థితికి తీసుకువెళ్లినప్పుడు ఇతరుల పట్ల దాన, దయాశీలత పాటించవలసి ఉంటుందని ఇప్పటి హీనస్థితి ఆధారంగా గ్రహించుకోవాలి.

## 8. అదృష్టచక్రం

గ్రహాలు నిరంతరం కదులుతూనే ఉంటాయి. మన అదృష్టాలు వాటిని ఆధారం చేసుకుని ఉన్నవే కనుక, అవికూడా సదా మారుతూనే ఉంటాయి. నేడు అధమంగా కనిపించేది రేపు తప్పుకుని, అక్కడ, ఈ నాటి ఖ్యాతికరమయిన దానికి చోటియ్యవచ్చు; లేదా, అటునుండి ఇటు రావచ్చు. దానికి మన ప్రమేయం ఉండదు. విశ్వం భ్రమణ శీలమయిన చలనానికి కట్టుబడి ఉంది. విశ్వనిష్ఠమయిన ఫలితం మంచిచెడ్డల పట్ల నిరాసక్తతతో తప్పక సంభవిస్తుంది. ఆ ప్రక్రియను ఎవరూ ఆపలేరు.

అది అలా ఉంచి, మనము నిజాయితీగా ఒకటి ఆలోచించుకోవాలి. ఈ ఐహిక ఉత్థాన పతనాలను గురించి ఇంతటి మనోదఘ్నత ఎందుకు? దీనిని గురించి అమూల్య మయిన మనశక్తిని, అభ్యున్నతిని వృధా చేసుకునేటంత అనవసర వేదన ఎందుకు?

మనము ప్రయాణం చేస్తున్న రైలు వెళ్లవలసిన చోటికి చేరవలసిన సమయానికి చేర గలదని తెలిసికూడా దానిని గురించి- ఇలా చెయ్యాలి, అలా చేస్తే బాగుండును- అని వృధా ఆలోచనలు చేసుకోవడంవల్ల ఏమిటి లాభం!

ఇహలోక సంబంధమయిన విషయాలను గురించి ఎంత ఎక్కువ ఆలోచన చేసుకుంటే అంత వృధా, అంత హాని. అదృష్ట-దురదృష్టాల సంభవం గురించి చేసుకునే ఆలోచనలలో మానసికంగా ఎంత ఇరుక్కుంటామో, ప్రాపంచిక బంధాలు అంతగా బలపడి ముక్తిని మరింత కష్టసాధ్యం చేస్తాయని ఒకటికి రెండుసార్లు చెప్పుకోవాలి.

( ) చదువులో, ప్రేమలో, కార్యసాధనలో, వ్యాపారంలో- ఇలా ఏదో ఒక దానిలో (లేదా, అన్నిటిలో) తిరుగులేని వైఫల్యం సంభవించినప్పుడు మనసుకు నచ్చజెప్పుకోవడం అవసరం: "ఇది కేవలం ఒక కెరటం. కొంచెంసేపు ఒళ్లు వంచుకుంటే కెరటం తనే వెనక్కి వెళ్లిపోతుంది. మన విజయ సమయంకోసం నిరీక్షించడమే మనపని. అలా చేద్దాం."

( ) అవే రంగాలలో యశస్కరమైన విజయం లభిస్తే, అప్పుడు చెప్పుకోవలసినది కూడా ఉంది: "ఈ అదృష్టం తాత్కాలికం. దీనితో నిజమైన దృష్టి మూసుకు పోకూడదు. గర్వం, పాపచింతన కలుగకుండుగాక. ఇది ఈ ప్రాపంచిక బంధాలలో కట్టి పడేసి ముక్తి ఆశయంనుండి దారి మళ్లించకుండా ఉండుగాక."

సిద్ధాంతపరంగా ఇవి చాల గొప్ప మాటలు అనడానికి సందేహమే లేదు. ఇవి ఎవరు పడితే వారు ఇవ్వగలిగే ఉచిత సలహాలే. సలహాలు వినేవారు ఎందరో ఉంటారు, కాని, పాటించేవారు కొందరే ఉంటారు. పాటించడానికి ప్రయత్నించేవారి విజయానికి ఆధారం ఈ మాటలను అంగీకరించడంలో లేదు; ఈ మాటలలోని సారాన్ని అభ్యసించడంలో ఉంది. కనుక, అభ్యసించి విజయం పొందవలసిందే.

## 9. 4×3 = 12

విశ్వ నిర్వహణా పరిక్రమణం; కంప్యూటరు యంత్రాంగంతో సాధించగలిగే దానికి దీటుగా ఉండగలదని మనం ఊహించుకోగలిగేటంత నిర్దుష్టమైన ప్రమాణాలతో సాగుతుంది. ఆ పరిక్రమణ విధానం విశ్వాంతరాళంలోని నక్షత్రమండలాల పరిభ్రమణం మొదలుకొని పిపీలికపు కదలికలంత సూక్ష్మ వివరాల వరకు ప్రతి విషయంలోనూ ఖచ్చితంగా అదే నిర్దుష్టతలో వర్తిస్తుంది. అది అలా ఉంచి, ఆ పరిక్రమణానికి సంబంధించినంత వరకు (మేధాత్మక, చర్యాత్మకమయిన) ఎట్టి మానవయుక్తిని, పరిమితికి మించి దానిలో ఏ జోక్యమూ చేసుకోనివ్వదు. మన జీవితాలలో సంభవించే చిన్న చిన్న సంఘటనలను కూడా; సూర్యోదయాన్నో, సూర్యాస్తమయాన్నో చూచినట్లు, నిస్సహాయ ప్రేక్షకులవలెనే చూసుకోవలసి ఉంది. అనగా, ఆ విశ్వ పరిక్రమణ ప్రణాళిక,

మనము, మన స్వంత జీవితాలపట్ల కూడా పూర్తి నిర్వికారతతో ఉండాలనీ, ఆ విశ్వ పరిక్రమణ ప్రణాళికనే మన బాగోగులు చూసుకోమని వదిలెయ్యాలనీ సంభావిస్తుంది. అలాకాకపోతే, (అనగా మానవుడు తాను విశ్వపరిక్రమణా ప్రణాళికా శాసితమయిన ఈ సంభావనలో జోక్యం చేసుకోవాలని తలపడితే) అతడు ఆ విశ్వవ్యవస్థ నిర్దుష్టతను శంకిస్తున్నాడన్నమాట.

గతంలో మనము విశ్వనిర్వహణా పరిక్రమణానికి అనవసరంగా జోక్యం చేసుకోవడం వల్లనే, (ఈ జన్మలో) ద్వంద్వాలు సంభవించాయని అనుకోవాలి. (ఏదో ఒరిగిపడు తుందనే ఆశతో) అప్పటి ద్వంద్వాల వలన కలిగిన సమస్యలను పరిష్కరించుకొనే సందర్భంగా మన చర్యలకు మనసును పురికొల్పడం ద్వారా, తెలివితక్కువగా ఏదో తలపెట్టి ఉంటాము. దానివలన విశ్వ నిర్వహణకు చిరాకు కలిగించగా, ఈ జన్మలో ఈ ద్వంద్వాలు మన మీద ఎక్కి కూర్చున్నాయి.

కనుక, ఇప్పటికయినా కళ్లు తెరచి ఈ ద్వంద్వాల పట్ల ఒకానొక గణిత శాస్త్ర సూత్రం పట్ల చూపే నిర్వికారత చూపడం మంచిది. 4×3=12 అని ఎవరయినా అన్నప్పుడు మనకి సంతోషం, విచారం, ఉత్సాహం, నిస్పృహ ఏమయినా కలుగుతాయా? అలాగే జీవితంలోని అన్ని సంఘటనలూనూ. ఎందుకంటే, అవన్నీ అణుమాత్రం గతితప్పని విశ్వప్రణాళికలో భాగాలే. లెక్క అంటే లెక్కే. కనుక, అదృష్ట-దురదృష్టాలు మనసు సమతూకాన్ని భంగపరచినప్పుడు "ఇదంతా 'నాలుగు మూళ్లు పన్నెండు' లాంటిది. దీనిని గురించి సంతోషించడం గాని, విచారించడంగాని దేనికి?" అనుకోవాలి.

10. ఇదంతా అసాధారణమనీ, ఆచరణ సాధ్యం కాదనీ అనిపిస్తే ద్వంద్వాల ఉపద్రవ ప్రభావాలను తగ్గించుకోవడానికి తేలికయిన, చాలా సాధారణమయిన పద్ధతి ఉంది.

( ) (మనం ఇంతో అంతో ఉన్న వాళ్లం, బాగుపడుతున్నవాళ్లం- అయినా; మనకంటే ధనవంతులయికూడా, మనకంటే నమ్రతగా ఉన్నవాళ్లను చూడాలి. వాళ్లని ఆదర్శంగా తీసుకుంటే మనం: గర్విష్ఠులుగా, క్రూరులుగా, విషయలంపటులుగా, బుద్ధి హీనులుగా- అవకుండా తప్పించుకోవచ్చును. ఈ సంపద అంతా భగవదనుగ్రహమే తప్ప, మన ప్రతాపం కాదు- అని, మళ్లీ మళ్లీ చెప్పుకోవాలి.

(i) మనము హీనమయిన పరిస్థితులలో ఉన్నప్పుడు: మరికొందరు; (తెలిసినంత వరకూ వాళ్ల తప్పు ఏమీ లేకపోయినా;) మనకంటే దురదృష్టంలో, మనకంటే హేయ మయిన స్థితిలో ఉన్నవారితో సరిపోల్చుకుని, వాళ్లకంటే మనమే నయం- అని సరిపుచ్చు కోవాలి. ఇలాంటి ఉదాహరణలు మనచుట్టూ లెక్కలేనన్ని ఎప్పుడూ దొరుకుతాయి. దీనిని ఒక సదవకాశంగా తీసుకుని; ఆపదలలో ధైర్యంగా ఉండడం, ఓర్పు-నేర్చుకుని; వీరోచిత గుణాన్ని పెంపొందించుకోవాలి. ★

పదహారవ ప్రకరణము

# వైరాగ్య సాధన

భగవద్గీత ప్రయోగాలన్నిటిలోను మిక్కిలి కష్టసాధ్య మయినదైనప్పటికీ, అత్యంత ఫలప్రదమయినది, చాలా ముఖ్యమయినది: అయిన దానిని గురించి ఈ ప్రకరణంలో చెప్పుకుంటాము. ఈ ప్రకరణం ఆ మహాగ్రంథంలోని బోధలకు పరాకాష్ఠను సూచిస్తుంది.

ఇంతకుముందు చర్చించుకున్న సాధనల విషయంలో ఒక దానికీ మరొక దానికీ మధ్య విరామం సూచితమయిఉందేమో. కాని, ఇప్పుడు చెప్పుకునే అభ్యాసం ప్రకారం అట్టి సాధన నిర్విరామంగా జీవితాంతమూ సాగవలసి ఉంది. ఒక ఉదాహరణ: మనము కోపానికి లోనవుతాము. అయినా, అది జీవితాంతం నిరంతరాయంగా కొనసాగదు. కోపం అనేది మహా అయితే, అప్పుడప్పుడు మనకు కలిగే ఒకానొక మానసిక ఉద్వేగం. అందువల్ల, దానిని అదుపులో పెట్టుకోవడానికిగాను చెప్పుకున్న సూచనలను పాటించు కుంటూ చివరి శ్వాసవరకు ఏవేవో చర్యలు తీసుకుంటూ ఉండనవసరం లేదు. అయితే, ఈ ప్రకరణంలో చెప్పుకొనేది అలా ఉండదు.

ద్వంద్వాలు- అని ఒక ప్రకరణం చేసుకున్నాము. మరి, ఈ ప్రకరణం ఒక విధంగా దాని కొనసాగింపు అనో, దానికి అనుబంధం అనో అనుకోవచ్చు. ఎందుకంటే, ద్వంద్వాల(ను ఎదుర్కొనే) విషయంలో మన కర్తవ్యం చాల వరకు మానసికం-కానీ, ఇక్కడ అది అంతా మనసుకు సంబంధించినదే.

ద్వంద్వాల విషయంలో మనము, పూర్వజన్మల చర్యల ఫలితంగా తప్పని సరిగా ఉద్భవించే ప్రతిచర్యలను గురించి వ్యవహరిస్తాము. గత జన్మలో చర్యలకు ఇప్పుడు ప్రతిచర్యల ప్రసక్తి వచ్చింది. ఇటువంటి ప్రసక్తి మరుజన్మలో రాకుండా, ఈ ప్రశాంతత ద్వారా, మరు జన్మలో సందర్భపడగల ప్రతిచర్యలకు మూలాలను ఇప్పుడే నిరోధించవచ్చు. ఇది చాలా ఆసక్తికరమయిన, నిగూఢమయిన- అభ్యాసం. జీవితాంతం ఆచరించవలసి నది. అందు చేత మన ఎదుట ఉన్న సమస్యలోని నిగూఢత్వాన్ని విజ్ఞతతో అర్థం చేసుకోవలసి ఉంది. ఆ సమస్యను పరిష్కరించుకునే విషయంలో సూచనలను పాటించే టప్పుడు చూపవలసిన ఒకానొక అవిచ్ఛిన్నమయిన పట్టుదలను గురించి; మరి ఏ ప్రకరణంలోనూ లేని విధంగా, ఇక్కడ చెప్పుకుంటాము.

"ద్వంద్వాలు" అనే ప్రకరణంలో మన ఇప్పటి చర్యలన్నీ కూడా కొన్ని కొన్ని గత చర్యలకు ప్రతిచర్యలేనని తెలుసుకున్నాము. అయితే, ఈ ప్రతిచర్యా శృంఖలాలకు కారణమయిన, అట్టి "గత చర్య" ఎప్పుడు, ఎలాగ సంభవించి ఉంటుందనేది సాధారణ మానవమాత్రుడు ఎవడూ విప్పలేని దీర్ఘకాలపు చిక్కుముడి. అందుచేత మనము ఏ గత చర్యపట్లా, అధికంగా గాని, అల్పంగా గాని స్పందించరాదు. అట్టి అధిక అల్ప స్పందన వలన మరు జన్మలో ఇంకొక ప్రతిచర్య ద్వారా దానిని రద్దు చేయవలసినంత

"చర్య" మిగిలిపోతుంది. అయితే ప్రస్తుతం మనకు తటస్థ పడుతున్న 'ప్రతిచర్య'కు ఏ 'చర్య' ఆధారమో ఆ 'చర్యను' రద్దు పరచడానికి సరిగ్గా ఎంతపాటి 'ప్రతిచర్య', ఎలాటి 'ప్రతిచర్య'- అవసరమో మనకు తెలియదు. అందుచేత, ఏమి జరగాలి, ఏమి చెయ్యాలి-అనే దానిని విశ్వశక్తులకు; అనగా, దేవునికి వదిలెయ్యాలి. దీనినే ఇంతకు ముందు ఇంకొక రకంగా చెప్పుకున్నాము. ద్వంద్వాల ప్రభావంలో మానసికంగా చిక్కుకోకూడదు, వాటి స్పర్శకి దూరంగా ఉండాలి.

అయితే, అంతమాత్రంచేత సరిపోదు. మోక్షం అనే అత్యున్నత ఆశయం సాధించుకోవడానికి గాను మార్గం సుగమం అయ్యే విధంగా, కనీసం ఇప్పటినుండి అయినా, మన (ప్రస్తుత) చర్య, ముందు ముందు ఏ విధమయిన ప్రతి చర్యనూ కలుగజేయని విధంగా; మనము ఇప్పుడు ప్రవర్తించవలసి ఉంటుంది. ప్రారబ్ధాన్ని (పురాకృత కర్మను) ఎలా అధిగమించడమో 'ద్వంద్వాలు' చెప్తాయి. "వైరాగ్యం" (ఇక మీదట మనకు ఏ కర్మా కలగని విధంగా) ప్రస్తుతం మనము ఎలా పనిచెయ్యాలో చెప్తుంది.

అలాగని (ఇక మీదట మనకు ఏ కర్మాకలగని విధంగా) నిష్క్రియాపరత్వం పనికిరాదు. అది అసాధ్యం.

**ఎవ్వరూ కూడా,ఒక్క క్షణమయినా సరే, నిష్కర్మపరులై**
**ఉండలేరు, కర్మ అనేది సహజ సిద్ధగుణం,**
**ఆ గుణము వలననేప్రతి ఒక్కడుమా నిస్పృహోయుడయి**
**పని చేయుటకు ప్రేరితుడగుమ**

- శ్రీమద్భగవద్గీత, కర్మయోగము : 5

**కర్మ (పని) చేయకుండా ఊరుకుంటే**
**దేహయాత్ర కూడా సాగదు**

- శ్రీమద్భగవద్గీత, కర్మయోగము : 8

సమాజాన్ని విడిచిపెట్టి వెళ్లే "సన్యాసి" కూడా ఆలోచన, భోజనం - వంటి ఏదో ఒక - మానసిక మయిన, లేదా, శారీరకమయిన - పని చేయకుండా తప్పించుకోలేడు. అలా పని తప్పించుకోడానికి అడవులలోకో, గుట్టుగా ఉండే మఠాలకో - పారిపోతే అతడు ప్రపంచాన్నీ తననూ వంచించుకుంటున్నాడన్నమాట. ఎందుకంటే, శరీర సన్యాసం కంటే ముందు సంభవించవలసినది, ముఖ్యమయినది; మనస్సన్యాసమే.

పనిని విడిచిపెట్టి వెళ్లిపోవడానికి చేసే ఎలాటి ప్రయత్నాన్ని కూడా భగవద్గీత సమర్థించదు. అంతేకాక, రెండు కారణాలను అనుసరించి, పని చెయ్యమని, మనలను నిర్దేశిస్తుంది.

1. మనలను పోషిస్తున్న సమాజం పట్ల మనకు గల బాధ్యతలను నెరవేర్చడానికిగాను పనిచేసి తీరాలి.

జ్ఞాని అయినవాడు,
కర్మ బద్ధుడయిన అజ్ఞానిని విముఖతకు ప్రేరేపించరాదు
అతని ధర్మమునకు అతనిని, ప్రేరేపిస్తూ
తాను తన కర్మను అనుష్ఠించాలి.

- శ్రీమద్భగవద్గీత, కర్మయోగము : 26

ఎందుకంటే

సాధారణ మానవులు ఉత్తములను అనుసరిస్తారు,
వారు ఏర్పరచిన ప్రమాణాలను కూడా అనుసరిస్తారు.

- శ్రీమద్భగవద్గీత, కర్మయోగము '21

జనకాది మహనీయులు (నిష్కామ) కర్మ
నిర్వహణ వలననే సిద్ధి పొందారు, సమాజ క్షేమాన్ని
దృష్టిలో నిలుపుకొని అయినా నీవు పనిచేయాలి.

- శ్రీమద్భగవద్గీత, కర్మయోగము : 20

ఓ పార్థా! ఈ మూడు లోకములలో నేను
సాధించదగినదిగాని, సాధించకుండా వదిలినదిగాని ఏదీ లేదు.
అయినా సరే నేను పని చేస్తూనే ఉంటాను.

- శ్రీమద్భగవద్గీత, కర్మయోగము : 22

2. కాని, ఆ కారణంచేత ఎవరికి వారు అన్యాయం చేసుకోకూడదు. అనగా, (సాధించవలసినదంతా సాధించిన తృప్తి కారణంగా) మానవుని ముఖ్య ఆదర్శమయిన ముక్తి కొరకు (కూడా) పని చేయవలసే ఉంది.

కనుక, మనము రెండు రకాల ధ్యేయాలను సాధించుకోవడానికి - మనకు మేలు చేసుకోవడానికి, సమాజానికి విశ్వాస పాత్రంగా నిలవడానికి - ఒకానొక ప్రత్యేక పద్ధతిలో పని చేసుకుంటూ పోవాలి. భగవద్గీత, కర్మయోగ సారముగా శాసించినదదే.

మరి, దానిని చేయడమెలా?

మన అన్నిచర్యలకు కేంద్ర స్థానం మనసు - అని ఇది వరకు చెప్పు కున్నాము. మనసులో జనించే ఆలోచనలను, శరీరం దైహికమయిన పనిగా మార్చుతుంది. 'ప్రారబ్ధం' కొనసాగకుండా చూసుకోవాలి. శరీరం చేసే ఏ పనితోనూ భావాత్మకమయిన సంబంధం పెట్టుకోకూడదని, మనసు ఏ కార్య నిర్వహణకయినా శరీరానికి యాంత్రికమయిన నిర్దేశాలు ఇచ్చి అంతటితో చాలించుకోవాలని-"ద్వంద్వాలు" అనే ప్రకరణంలో చెప్పుకున్నాము. పని ఏదయినా సరే, మనసు అవలంబించవలసిన వైఖరి మాత్రం ఇదేనని కూడా ఆ ప్రకరణంలో చెప్పుకున్నాము.

ఆ సూచన సరిగానూ, సంపూర్ణంగానూ ఆచరణలోనికి వస్తే, మనసు అభ్యాస ప్రక్రియలో పరిపక్వస్థితికి చేరినప్పుడు ఇలా ఆలోచించవలసి ఉంది. "ఈ శరీరాన్ని

ఎవరయినా ఒకనదిలోకి విసిరేయవచ్చు. అప్పుడు అది తనలో నరాల ప్రేరణవలన అసంకల్పితంగా కలిగే ప్రతిస్పందన చేత ఒడ్డుకి ఈదుకొని రావాలి. అది నిరిచ్ఛాక్రియ తప్ప, ఆందోళన, భయం, ఆజ్ఞ వంటి నాప్రమేయ ఫలితం కాదు. ఈ శరీరం ఒక సింహాసనాన్ని అధిష్ఠించడం అవసరమయితే, దానిని అది ఒక యాంత్రిక ఘటనగా తీసుకోవాలి. నేను మాత్రం ఆ సింహాసనం మీద ఒక ఇటుకను కూర్చోబెట్టినప్పటికంటే హెచ్చు ఉత్సాహం పొందను. (ఈ శరీరానికి ఉండే) ఒక స్నేహితుడు మరణిస్తే, ఈ శరీరమే ఆ స్థలానికి వెళ్లి, అవసరమయిన సానుభూతి చూపిస్తుంది. నేను మాత్రం ఆ సంఘటనకు సంబంధించిన ఆహ్లాదకరమయిన సమావేశాలకు హాజరవుతాను. అదంతా నా వరకు ఒక అపరిచిత సుదూర వ్యవసాయదారు పుష్కలంగా లభించిన తన పంటను కోసుకోవడం వంటిదే."

మనం ఇప్పుడు చెప్పుకుంటున్నది వైరాగ్యం-అనే విషయానికి సంబంధించిన ప్రకరణం. ఇక్కడ కూడా అదే వైఖరిని అవలంబించుకోవాలి. అయితే, మనం చేపట్టిన ఈ ప్రత్యేక కార్యం పట్ల మరికొంచెం ఎక్కువ భావతీవ్రత తెచ్చుకోవాలి. శరీరం నిర్వహిస్తున్న పని ఏదయినా సరే, దాని ఫలితం గురించి మనసుకి ఏ ప్రమేయం ఉండకూడదు; అది విజయమో, వైఫల్యమో.

ఏ పనిని గురించి చేసే ఏ ప్రయత్నం పట్ల అయినా, అవలంబించవలసిన వైఖరి ఈ నిర్వికారతే- నన్న సూత్రం భగవద్గీత బోధలకు మకుటాయమానం. సక్రమ కార్యం గురించిన సమగ్రతత్త్వం (సుప్రఖ్యాతమయిన) సరళమయిన ఈ శ్లోకంలో భగవానుడు ఉటంకించినాడు:

శ్లో॥ कर्मण्येवाधिकारस्ते मा फलेषु कदाचन
मा कर्मफलहेतुर्भूः मा ते संगोस्त्वकर्मणि ।

-శ్రీమద్భగవద్గీత, సాంఖ్యయోగము'47

(కర్మమును ఆచరించుటవరకే నీకు అధికారము. కాని, ఆ కర్మఫలములను ఆశించుటయందు నీకు అధికారము లేదు. కర్మఫలమునకు హేతువువు కూడా కారాదు. అలాగని కర్మయందు నిమగ్నత మానరాదు.)

పుస్తకానికి వాసన, ఈతగానికి సంగీతం: ఎంత సంబంధం లేనివో-ప్రయత్నానికీ ఫలితానికీ మధ్య సంబంధం అంతేనని తలచే విధంగా మానవుడి యావద్ మనస్తత్త్వం పెంపొందాలి. మానవుడికి పనిని గురించిన యావద్వైఖరి ప్రయత్న ప్రధానంగా రూపొందాలి గాని, ఫలిత ప్రధానంగా కాదు. ప్రతి విషయం పట్ల, అన్ని విషయాల పట్ల "ఈ ప్రయత్నం ఉండగలిగినంత ఉత్తమంగా, పరిపూర్ణంగా ఉందా?- అని తలచే విధంగా మనసును శిక్షణలో పెట్టుకోవాలి; అంతే కాని, "ఈ ప్రయత్నానికి ఫలితం ఏమిటి, జయమా, అపజయమా?"- అనికాదు.

చూడడానికి ఇది తేలికగానే ఉంది. కాని ఈ వైఖరిని అలవరచుకోవడం నిజానికి అత్యంత కష్టసాధ్యం. దీనికి యావజ్జీవితకాలపు కఠోర జాగరూక అభ్యాసం కావాలి.

అవసరమయితే తగినంత అధ్యయనంతో దానికి తగిన పునర్విమర్శనతో; బలపరచు కోవాలి. అభ్యాసం మరింత ముఖ్యం. ఎందుకంటే దీనిలో ఉన్నసూత్రం చాలా గొప్పది. అది ముక్తికి ఇంచుమించు ఒక తాళం చెవి లాంటిది. మానవుడు నిర్వహించే సాధనలన్నిటిలో ఔద్ధత్య భరితం. ఫలితం కూడా అంతటి అత్యంత వాంఛనీయ మయినదే.

నిస్సంగత్వ, లేక, వైరాగ్య-వైఖరిలో అంతటి పరిపక్వతకు చేరుకుంటే, అసత్య వచనాన్ని కూడా పాపం స్పృశించజాలదు. మరి, ఆ పరిపక్వతా స్థాయియందు హృదయ పూర్వకంగా, ఆత్మ పూర్వకంగా ఒకానొక భావాన్ని నిర్మలంగా పరిపూర్ణంగా అనుభవంలోకి తెచ్చుకో వలసి ఉంటుంది.

"అసత్యం వచించాను. కాని, అది నేను చేసిన పని కాదు. నా నాలుక తయారీలో చేరిన పదార్థాల గుణాల ప్రభావంచేత నా శరీరం ఆ అసత్యాన్ని వచించింది. నిజమయిన నేను ఈ శరీరం కాదు. నేను, అది: వేరువేరు. (ఇక్కడ) చేసేది అదేగాని నేను కాదు."

ఆత్మానుభవం చేత అలా నిజాయితీగా ఆలోచించి అనుభవించ గలిగే వారికి అసత్య ప్రభావం ఉండదు. అంతే కాదు, అట్టి మానసిక వైరాగ్య స్థితిలో పాపపుణ్యాల మధ్య, గుణదోషాల; మధ్య నెలకొని ఉన్న విభేదాలు మన కర్తృత్వ భావనతో సహా అదృశ్యమయిపోయి; ఈ శరీరం వ్యభిచారం, హత్య-వంటి అనేక పాపాలకు పాల్పడినా నైర్మల్యం మిగిలి ఉండే పరిస్థితి ఉంటుంది.

> **త్రిగుణాతీతులయిన వారికి ధర్మమెట్టిది, నిషేధ మెట్టిది!**
> **తాను ఒనరించిన కర్మలకు తానే కర్తను - అనే అహంకార భావము**
> **నుండి స్వతంత్రుడు, బుద్ధియందు కల్మషము లేనివాడు**
> **మనుష్యులను చంపినా సరే, ఆ చంపేది అతడు కాదు.**
> **ఆ పాపమునూ వానిని అంటదు.**

- శ్రీమద్భగవద్గీత, మోక్షసన్న్యాసయోగము : 17

పనిని సంకల్పించినవాడు తన మనోతత్వాన్ని పరిపూర్ణమయిన ప్రయత్నభావంతోనే నింపుకోవాలి గాని, ఫలోన్ముఖతతో కాదు. పని అనేది స్వయం ప్రయోజనకరం. ఈ సూత్రంలోని తర్కాన్నీ, దీని ఉపయోగాన్నీ బుద్ధి పరంగా నమ్ముకోవలసి ఉంది. పనిని నిర్వహించేటప్పుడు ఏ చర్యలు తీసుకోవాలని ఆలోచించే ముందే ఆ నమ్మకం కుదిరితే పని సక్రమంగా పూర్తి అవుతుంది. ఆ ధ్యేయం దృష్ట్యా పరిశీలించుకోవలసినవి కొన్ని విషయాలు ఉన్నాయి.

1. మన ధ్యేయం ముక్తి. ముక్తి అనగా దైవంతో గాని, విశ్వాత్మతోగాని తాదాత్మ్యం చెందడం, లేదా, ఆదరికి చేరడం. దానిని సాధించినవాడు సర్వశక్తిమంతుడుగా,

సర్వజ్ఞుడుగా, సర్వాంతర్యామిగా భాసించి, విశ్వ ప్రభువు కాగలడు. అనంతము, భావాతీతము అయిన ఆనందాన్ని, తేజాన్ని అనుభవిస్తాడు.

ధ్యేయం స్థాయి అది కాగా, దానికన్నా ముందుగా ఆలోచించుకోవలసినవి కొన్ని ఉన్నాయి. ఒకానొక స్వల్పమయిన (అశాశ్వతమయిన) ధనలాభం, కార్యస్థానంలో ఒక చిన్న పదోన్నతి, నాగరిక సుందరి ఒకతె చూపే చంచల మోహం; ఇట్టి క్షణిక ఆకర్షణలు. ఒక రాష్ట్రానికి గవర్నరు పదవిని ఆశించిన వానికి, ఒకానొక గ్రామీణ సహకార బ్యాంకులో మెసెంజరు ఉద్యోగం ప్రాప్తిస్తున్నదంటే, ఏమనుకోవాలి? తారాబలం వలన సంభవించిన ఒకానొక వింతయిన విచేష్ట కారణంగా దరఖాస్తు పెట్టుకున్నప్పటికీ, దాని ఫలితం అనుకూలంగా రావలసిందేనని వ్యథ చెందరాదు కదా.

2. మనసు ఆలోచనలకు మాతృస్థానం అనీ, (అక్కడ జనించిన) అట్టి ఆలోచనల భౌతిక పరిణామాలే చర్యలు అనీ ఇంతకు పూర్వం తరుచుగా అనుకుంటూనే వస్తున్నాము. మనసు-చర్య; వీటి మధ్య ఒకానొక సజీవమయిన పరిక్రమణం ఉందనీ, అవి రెండూ విడదీయరానివనీ తెలుసుకున్నాము.

ఎట్టి చర్యకుగాని, పనికిగాని; సంకల్పం అనేది పరోక్షమయిన కారణంగా ఉంటుంది. ఈ సంకల్పం ఒక ఆదర్శాన్ని అనుసరించి కలుగుతుంది. కనుక, పని (చర్య)కి మూలం ఆదర్శం. ఆదర్శం ప్రకారం పని జరిగిందా, జరగలేదా అనేది గెలుపు- ఓటమి: అనే కొలమానాల ద్వారా-అనగా ప్రయత్నానికి లభించిన ఫలితం ద్వారా - నిర్ణయిస్తాము. ఫలానా పని చెయ్యి - అని శరీరానికి, మనసు ఆజ్ఞలను జారీ చేస్తుంది; శరీరం ఆ పనిని ఫలవంతంగా నిర్వహిస్తోందా, లేదా, అని మనసు అందుకు గాను తిరుగులాడుతూనే ఉంటుంది - అని చివరికి తేల్తుంది.

పరిస్థితి అంతటినీ క్లుప్తంగా చెప్పుకోవచ్చు. మనసు ప్రాపంచిక బంధనాల నుండి విడిపడినప్పుడే మోక్షం సాధ్యమవుతుంది. శరీరం చేసే పనియందు మనసు తాదాత్మ్యం చెందడమే ఈ బంధనం. పని అనేది, అది ఇచ్చే ఫలితం వల్ల జీవిస్తుంది. ఇలా చెప్పుకుంటూ పోతే, ప్రయత్నానికి సంభవించే ఫలితం నుండి మనసును విడదీయడం మీదనే మోక్షం సంభవించడమనేది ఆధారపడి వుందని, ప్రయత్నాన్నే మనసు నుంచి విడదీయడం మీద కాదని తేలుతుంది.

అందుచేత, పని చేయడానికి తలపెట్టినప్పుడు; ఫలితం పట్ల ఏ ఆలోచనలూ రాకుండా మనసును దృఢపరచుకోవాలి.

3. గుణాతీతుడయిన పరమాత్మ విషయంలో విజయం కాని, ఓటమి కాని అసలు లేదు. రాత్రి, పగలు-అనేవి కేవలం భూమికే ఉంటాయి. భూమి తన చుట్టూ పరిభ్రమించే (స్థితిగల) సూర్యుడికి అంతా వెలుతురే. ఆ విధంగానే, విశ్వానికి; పై భాగం-కింది భాగం, ఘన పదార్థం-ద్రవ పదార్థం, చలనం-విరామం : అన్నీ ఒకటే; అన్నీ కలిపి అవిభాజ్య మయిన పదార్థం. ఆ విధంగానే, విశ్వమంతా స్వతస్సిద్ధంగా వ్యాపించి దానిని అనంత

కాలం సజీవంగా ఉంచే జీవాత్మ- అనగా భగవంతుడు; అతడికి విజయం గాని, ఓటమి గాని ఉండవు. ఆ మాటకి వస్తే, ప్రయత్నం కాని, ఫలితం కాని ఉండవు. అనంత విశ్వంతో పోల్చి చూసుకుంటే, మనం నివసించే ఈ భూమి చాలా అల్పమయిన పరిమాణం గలది. ఈ మాత్రం దానికే మన మానవులలో ఎన్నో విభేదాలు. మన మహా సముద్రాలలో వేరు వేరు దిక్కుల నుండి చిన్న చిన్న కెరటాలు లేస్తూ, పడుతూ ఆజల తలంమీద ఒకదానినొకటి గుద్దుకుంటూ ఉంటాయి. మానవులలో నెలకొనే అంతులేని విభేదాలకు, సాగరంలో నిరంతరం చెలరేగే కెరటాలకు; చలించకుండా ఒకే పరిపక్వ విరాట్ స్వరూపంగా నిలిచేది పరమాత్మ ఒక్కడే.

అట్టి మహా యశోవంతమయిన పరమాత్మతో కదా, మనము ఐక్యం చెందవలసినది! అయినా సరే-విజయం, వైఫల్యం-అని తేడాలు చూసుకుంటూ సాగడం సాధ్యమా?... ఎంత తృణీకారయోగ్యమయిన ఆలోచన!

4. (i) ఈ విశ్వపాలనలో దేవుడు పరిపూర్ణ న్యాయం చేస్తున్నాడని గుర్తుంచుకోవాలి.

(i) కాలానుగతంగా, చర్య-ప్రతిచర్యలు సమాన-వ్యతిరేకాత్మకాలవుతాయని కూడా గుర్తుంచుకోవాలి. కాలానుగతం-అన్నది, ఎంత కాలమో మనం చెప్పలేం. ఒక నిమిషమో, అంతకంటే ఎక్కువో కావచ్చు; లేక, ఒక జీవిత కాలమో, అంతకంటే ఎక్కువో కావచ్చు. ప్రతిచర్య కోసం ప్రేరేపించే చర్య స్వభావాన్నిబట్టి, తీవ్రతను బట్టి (ఆ కాలపరిమితి) ఆధారపడి ఉంటుంది. ఏది ఏమయినా ఆ సూత్రం దానంతటదే అమలు అవుతుంది గాని, అది (ఏశక్తినీ తన కార్యక్రమం పట్ల) కలగజేసుకోనివ్వదు.

ఒక ప్రయత్నం ఇప్పుడు విఫలమయితే, దాని అర్థం ఇంతకుముందు చేసిన ఇలాంటి (దే అయిన) ప్రయత్నం సఫలమయిందని; లేదా, ఇక మీదట: (అనగా, ఈ జన్మలో కాకపోతే, మరోజన్మలో నయినా) చేసే ప్రయత్నం సఫలమవుతుందని. అలాగే మన దగ్గిర అప్పు తీసుకున్నవాడెవడయినా, లేదు పొమ్మన్నాడంటే, అతగాడికి పూర్వజన్మలలో ఎప్పుడో ఒకప్పుడు మనం కూడా అలా చేసేము-అని తెలియాలి. అందుచేత మన పూర్వ ఋణం నుండి మనమే విముక్తి చెందామని భావించాలి. లేదూ, కాదూ; అతడు మనకు ఇప్పుడు తనంతటతానే తొలిసారిగా ఏ విధమయిన పూర్వ సంబంధం లేకుండా అన్యాయం చేస్తున్నాడు - అనుకుంటే, ఇదంతా మనం మరుజన్మలో తిరిగి పొందగల విధంగా దాచుకుంటున్న నిలవ - అని అనుకోవాలి. ఇలా ఏదో విధంగా సంతోషమే పొందాలిగానీ, దైన్యం, నిస్పృహ-కూడదు.

దీనికి జతచేసి చెప్పుకోవలసినది ఒకటి ఉంది. అన్ని వ్యక్తియాత్మలకు, భగవంతుడు పరంపరానుగతమయిన జన్మల కాలంలో సమాన న్యాయం చేస్తాడు. అనగా, మనలో ఏ ఒక్కరికైనా సంభవించే విజయ-వైఫల్యాల, సాఫల్య-ఆశాభంగాల, అదృష్ట-దురదృష్టాల పరిమాణం ఇతర వ్యక్తియాత్మలలో ఒకదానికి సంభవించే అట్టి భావ-ప్రతిభావాల మొత్తానికి సరిసమానంగా ఉంటుంది. ఎందుకంటే, పరిపూర్ణమయిన న్యాయమే

భగవంతుడు. మరి, మానవుడికి ఒక హీన అవస్థ ఉంది. అతడు హ్రస్వదృష్టితో ఈ ఒక్క ప్రత్యేక అశాశ్వత జీవితాన్ని మాత్రమే దృష్టిలో పెట్టుకుని వీక్షించి, తొందరపాటు అంచనాలకు పాల్పడి, ఆ అంచనాలు ఆధారంగా ఫలితాన్ని లెక్కకడతాడు. అంతేగాని, ఆత్మసాగించే సుదీర్ఘ యానం ముగిసేక చేరే, నిజమయిన అంతిమ తీరం అతని దృష్టికి రాదు. మరి అలాంటప్పుడు అతడు వచించే అసంపూర్తి అయిన, తాత్కాలిక మయిన ఫలితాన్ని ఎందుకు పట్టించుకోవాలి?

5. ఫలితం గురించి ఆలోచిస్తూ, దానికోసం విలువయిన మనశ్శక్తిని వెచ్చించడం శుద్ధదండగ-అని పరిగణించడానికి ఇంకొక శక్తిమంతమయిన కారణం ఉంది. ఎందుకంటే ఎప్పుడూ కూడా ఫలితం అనుకూలంగా వస్తుందో, రాదో ముందుగానే విధిలిఖితమయి ఉంటుంది. మన ప్రయత్నం, ఫలితానికి దారితీసే ఒకానొక బాహిర యాంత్రిక ఉద్దేశం మాత్రమే.

మానవుడికి కొంత స్వేచ్ఛాభీష్టం ఉంది కదా; దానిని ఉపయోగించుకొని తద్వారా తన చర్యల నాణ్యతను పెంచుకొని ఆ చర్యలకు కలిగే ఫలితాల స్వరూపస్వభావాలను తన అభీష్టం ప్రకారం మార్చుకోవచ్చును-అని తలపోయవచ్చు. కాని, అది చాలా అత్యాశ. ఎందుకంటే, మానవుడికి ఉన్న స్వేచ్ఛాభీష్టం పరిమితం; అవును, చాలా పరిమితం! దాన్ని ఆధారంచేసుకొని (నిర్వహించే చర్యలద్వారా) ఏవో అంతంత మాత్రం ఫలితాలను సాధించగలగొచ్చు గాని; తిమ్మిని బమ్మిని బమ్మిని తిమ్మినీ చేసేటంతగా ఏకంగా ఫలితాల్నే తారుమారు చెయ్యలేడు. దీన్నే, మానవ వ్యవహార పద్ధతిలో ఇలా చెప్పొచ్చు: మానవ ప్రయత్నం వల్ల నిస్సందేహంగా కొంత అభివృద్ధి సంభవించవచ్చుగాని, అట్టి మానవ ప్రయత్నం అనేదే అతని ఆధిపత్యానికి అతీతంగా ఉండే కొన్ని బాహ్యశక్తుల నిర్వహణలో సాగుతుందని గుర్తించుకోవాలి..... ఒకడు, ఒక రైల్లో; రిజర్వేషను లేని పెట్టిలో ప్రయాణం చేస్తాడనుకుందాం. అతను ఆపెట్టెలో తనకిష్టమైనచోట ఎక్కడైనా కూర్చోవచ్చునని అందరూ ఒప్పుకుంటారు. కాని, అసలు జరిగేదేమిటంటే; ఆ-కూర్చోడం అనేది- (అంతకి ముందు అక్కడున్న) అతని సహ ప్రయాణికులు (అతనికోసం) జాగా చెయ్యడం మీదనే ఆధారపడుతుంది. మానవుడి కార్యనిర్వహణ ఎంతో అద్భుతంగా ఉన్నా అతడు వైఫల్యం చెందడం చాలా సార్లు చూస్తూనే ఉంటాం. మరి ఒక్కొక్కప్పుడు ప్రయత్న హీనం, ఆఖరికి ప్రయత్న శూన్యత- ఉన్నాసరే, ఒక్కొక్కడు అనిర్వచనీయమైన విజయాన్ని సాధించేస్తాడు.

ఫలితం మన చేతుల్లో లేదు. విజయమూ వైఫల్యమూ అనేది తిరుగులేని పద్ధతిలో నిర్ణయమైపోయి ఉంది. మరి అటువంటప్పుడు దాన్ని గురించి ఆదుర్దాగా ఊహల్లోకి వెళ్లిపోయి కూర్చోడంవల్ల ఏమిటి, లాభం?... ... అందువల్ల ఆత్మ(కు విధాయకమైన) అసలుధ్యేయాన్ని మరిచిపోతాం. ప్రాపంచిక ధ్యేయాలతో మమేకం చెందుతాం. అదంతా ముక్తి-వ్యతిరేకం. కనుక విధి నిర్ణయాన్ని ఆనందంగా స్వీకరించడానికి సిద్ధం కావాలి.

ఏం జరగవలసి ఉందని రాసిపెట్టుందో అదే విధిగా జరుగుతుందని ఎరిగి, ఫలితం సంగతి సర్వమూ మరిచిపోవాలి.

6. ఇవన్నీ వివాదాస్పదమయిన సంగతులనీ, వీటివలన పరిపూర్ణమయిన విశ్వాసం కలగదనీ- భావిస్తే; కనీసం, మానవాతీతులయిన మన మహర్షులు వచించిన దానిమీద, మన మతగ్రంధాలు చెప్పేవాటిమీద ప్రగాఢమయిన నమ్మకాన్ని ఏర్పరచుకొని ఆ సూక్తులను శంకారహితంగా అనుసరించాలి. వారికి, మనకన్నా చాలా ఎక్కువ తెలుసు; వారు మన శ్రేయోభిలాషులు కూడాను. విధి అప్రతిహతమయినదని వారి బోధ.

## ఆచరణయోగ్య సూచనలు

చెప్పినదానినంతటినీ విశ్వసించినా "ఫలితం" పట్ల నిర్వికార వైఖరి అవలంబించాలంటే చాలా కష్టం కావచ్చు. మానవ నిర్మాణం ఇంద్రియ ప్రధానం. (కర్మకు కలిగే) ఫలితాలను గురించి మరచిపోవడానికి మనం చేసే అన్ని ప్రయత్నాలను బలంగా ప్రతిఘటించడమే ఈ ఇంద్రియాల ముఖ్యలక్షణం. అవి తత్త్వాన్నీ, తర్కాన్నీ నిర్లక్ష్యం చేసేవిధంగా మనలను ఒప్పిస్తాయి. మనం ఒనర్చే ప్రయత్నాలన్నీ ఫలధ్యేయంగా సాగాలని నిర్దేశిస్తాయి.

కాని, స్వేచ్ఛాభీష్టాన్ని అభ్యాసంలోకి తెచ్చుకోవలసింది ఇక్కడే. ఇంద్రియాల దురాత్మక ప్రభావంమీద నిర్ణయాత్మక అభ్యాస రూపంలో ఒకానొక దృఢమైన పోరాటం సలపాలి. సాధారణ మానవుడు ఇంద్రియాల ఒత్తిడులకు మచ్చికగా లొంగిపోతాడు. సాధకుడు అలా కాకుండా భేదం చూపాలి. విశ్వాసాలను ఆచరణలో పెట్టడం ద్వారా, ఔన్నత్యానికి చేరాలని ఏర్పరచుకొన్న కోరికలోని శ్రద్ధను నిరూపించుకోవాలి. కర్మను (ప్రయత్నాన్ని), ఫలితాన్ని వేరువేరుగా చూసుకోవడానికి గాను, ఈ అభ్యాసంలోనే ఒక న్యాయమయిన ప్రయోగం చేసుకోగలము, అందుకు కొన్ని సూచనలు:

(') "ఫలితం"- అనే ఆలోచన మనసును తాకగానే ('మానసిక క్రమశిక్షణ' అనే ప్రకరణంలో చెప్పుకున్న) ఏదయినా ఒక పద్ధతిని అమలు పరచి, దానిని వెంటనే తరిమివేయాలి. (క్రోధము, భయము, మాత్సర్యము- అనే వాటిని తరిమికొట్టడం ఈ పాటికే ఒక కళవలె అలవాటయి ఉండి ఉంటుంది. కనుక, 'ఫలితం' గురించిన ఆలోచనలను మనసులోంచి తరిమివేసి, వేరే ఆలోచనలతో మనసును నింపడం ఎలా- అని ఇప్పుడు చెప్పుకోనక్కరలేదు. అభ్యాసం ప్రారంభ దశలలో ఉన్నప్పుడు, సాధకుడు అవలంబించవలసిన పద్ధతి అది. (మనము ప్రారంభదశ దాటి వచ్చేశాము కనుక;) మనసులోంచి అవాంఛనీయ ఆలోచనలను తరిమివేయడం మనకు తెలుసునని నమ్మవచ్చును. ఏది ఏమయినా సరే, ప్రయత్నంవల్ల సంభవించే ఫలితాలను గురించి, ఎప్పుడు, ఏ రూపంలో కలిగే ఆలోచనలయినా అవి మనసులోకి చొరగానే, మనకి ఇష్టమయిన- ఏదయినా ఒక పద్ధతిని అవలంబించి, వాటిని మనసులోంచి తోసి పారేసే సంగతి మాత్రం ఖచ్చితంగా చూసుకోవాలి. అట్టి ఆలోచనలు-మన ఆలోచనామందిరం లోకి చేరే ప్రయత్నంలో వాటంతట వాటికే విసుగుపుట్టి, ఆగిపోయేదాకా అలా

(తరిమికొట్టడం) కొనసాగించాలి.

ఇక్కడ ఒక సంగతి గుర్తుంచుకోవాలి. భావి కార్యక్రమాన్ని ప్రణాళికీకరణం చేసుకునే టప్పుడు, మన ప్రయత్నానికి కలిగే ఫలితం గురించి, ఆందోళన చెందడంగాని, భావోద్వేగంలో నిమగ్నం కావడం గాని; ఉండకూడదు. కలగబోయే ఫలితంలోకి మంచి-చెడ్డలు: అనగా, విజయ-వైఫల్యాలు ఇప్పుడు పరిశీలనలోనికి రాకూడదు. ఫలితం గురించిన భావాన్ని విసర్జిస్తూనే, దాని స్వభావ పరిమాణాలను గురించి (గణిత శాస్త్ర పరమయిన, లేక- అధ్యయనశాస్త్ర పరమయిన) శ్రద్ధను తప్పకుండా చూపించుకో వచ్చును. అదంతా ప్రయత్నపు 'వాసి'ని పెంచడానికి గాను మెదడుపడే ఆరాటమే గాని, ఫలితం విషయంలో హృదయం అనుభవించే నిమగ్నత కాదు.

2. ముఖ్యమయినపని ఏది చేసినా, అది ముగిసేక,

"ఏతత్ సర్వం బ్రహ్మార్పణమస్తు"

అని అనుకోవడం అలవాటు చేసుకోవాలి. (ఇదంతా భగవంతుడికి నివేదన అగుగాక!)

అసలు, ఈ మాటలను; అది ఒక అసంకల్పితమయిన అలవాటుగా రూపొందినప్పటి నుండి (ఏదో యాంత్రికంగా కాక, ఆ అర్థాన్ని మనసారా ఉద్దేశిస్తూ)- అనుకుంటే మంచిది. అభ్యాస ప్రారంభంనుండి అనుకుంటే ఇంకా మంచిది. ఈ అభ్యాసంలో ఈ(ఉత్తర) భాగం అత్యంత ప్రాముఖ్యం గలది. దానిని జీవితాంతం భావనలో కొనసాగించుకో వలసి ఉంది.

ఈ మార్గాన్ని అనుసరించి పోతే మంచిది. దీనిని ఇప్పుడు నిరోధించుకొని ఊరుకుంటే ఉత్తరోత్రా అయినా తప్పదు. అందుచేత ఇప్పుడే, బుద్ధి పూర్వకంగానే; చేయడం మంచిది. మన ప్రయత్నాలకు ఫలితాలు: మన కోరికలను బట్టి, లేదా, మన సదుపాయాన్ని బట్టి రూపుదిద్దుకోవు. ఇదంతా ఇప్పటికే పూర్వపక్షం అయిఉంది. మనం దానిని స్వీకరించ వలసిందే, ఆచరించవలసిందే. ఇదేదో మనకోసం చేసినదికాదు. మహత్తరమయిన విశ్వప్రణాళికలో అది ఒక భాగం. అది దానికోసమే తయారయింది. దాని పరితృప్తికోసమే తయారయింది. అది మిక్కిలి ప్రబలమయినది. మనం నిమిత్తమాత్రులం. ఇదంతా భగవంతుడిపని, వ్యాపకం. అనగా, మన ప్రయత్నం దానికిగాను (మనకు) కలిగే ఫలితం; ఆ మాటకొస్తే, మనం కూడా- అంతా భగవత్కార్యమే, అది పరిపూర్ణ సత్యం. అందుచేత మన కర్తవ్యం ముగిసినప్పుడు "బ్రహ్మార్పణమస్తు" అని అంటే, కేవలం నిజమే చెప్పినట్టు. దానికి తోడుగా మనం ఆ భావాన్ని అనుభవించి, ఆ భావానికి అనుగుణంగా ప్రవర్తిస్తే, ఆ సత్యాన్ని సార్థకం చేస్తున్నట్టు.

అదీ, పరిస్థితి. దానిని సరిగా అర్థం చేసుకోవాలి. అప్పుడు; మానవుడు ఊహించ గలిగే వాటిలో మిక్కిలి ఘనమయిన విశ్వప్రణాళిక పరిపూర్తికొరకు మనం మన ఐహిక ప్రయత్నాల వలన, ఒకానొక స్వల్ప చర్య నెరవేరుస్తున్నామని, అది స్వల్పమే కాక అత్యల్పమయినదని; తెలుస్తుంది.

మనం ఎన్నెన్నో చేస్తాం. పరీక్షకోసం అధ్యయనం చేస్తాం. ఉన్నతోద్యోగంకోసం ప్రయత్నం చేస్తాం. వ్యాపారంలో మరింత లాభంకోసం శ్రమ పడతాం.- ఇలా ఏది చేసినా, ఎన్ని చేసినా సర్వం భగవంతుడికే అంకితం. సర్వం భగవంతుని పేరనే చేస్తున్నాము- అనే బ్రహ్మార్పణ భావాన్ని అలవరచుకోవాలి. చిన్నా, పెద్దా- ప్రతి పని ముగిసినప్పుడు:

ఏతత్ సర్వం బ్రహ్మార్పణమస్తు

అని అనుభవించి, ఉచ్చరించాలి.

మనము ఫలితాన్ని గురించి చాలా ఆరోగ్యకరమయిన పద్ధతిలో మరిచిపోడానికి అది (అట్టి అనుభవం, ఉచ్చారణ:) సహాయపడుతుంది.

**కర్మయోగులు అన్ని బంధాలను త్యజించి ఇంద్రియములతో,**
**మనసుతో, బుద్ధితో, శరీరంతో మాత్రమే చర్యలను సాగిస్తారు.**
**వారు అలాచేసేది ఆత్మశుద్ధికోసం.**

-శ్రీమద్భగవద్గీత కర్మసన్న్యాసయోగము: 11

**కర్మయోగి; కర్మఫలాన్ని త్యజించి, శాంతిని (భగవదైక్యమును)**
**పొందుతాడు. యోగికానివాడు, అలాకాక; కోరికచేత**
**ముందుకు తోయబడి, ఫలితమునందు ఆసక్తుడై;**
**బంధితుడుగా ఉండిపోతాడు.**

-శ్రీమద్భగవద్గీత కర్మసన్న్యాసయోగము: 12

3. దీని తార్కిక పర్యవసానంగా మనలో ఒకానొక పరిస్థితి రూపొందుతుంది.

మహత్తరమయిన విశ్వప్రణాళిక నిర్వహణలో, జరిగే ప్రయోగాలలో మనం చేసేది ఎంతో స్వల్పమే; అయినా, అది ఆ ప్రయోగంలో ఒక భాగమే. ఆ ప్రణాళిక వెనుకనున్న అసలుకర్త భగవంతుడే కాని, మనం కానేకాదు. మనం ఆ ప్రయోగంలో పరమాత్మ ఉపయోగించే ఒకానొక సాధనం మాత్రమే. కార్యము మనదికాదు. కర్త మనము కాదు. కనుక, మనకు కర్తృత్వభావము (నేను చేస్తున్నాను అనే భావం) ఉండకూడదు. పొట్ట పోసుకోవడంకోసమో, ఇతరుల సాంఘిక సేవకోసమో, విరోధితో పోట్లాడడం కోసమో, మిత్రుడికి సహాయపడడం కోసమో; ఏపని నిర్వహించతలపెట్టినా "ఇది నాపని కాదు, దీనికి కర్త నేనుకాదు, ఇది భగవంతుడిపని. దీని అసలు కర్త ఆయనే" అనే ఎప్పుడూ అనుకుంటూ ఉండాలి. ఈ మాటలనే పదే పదే ఎంత తరచుగా అవసరమయితే అంతగా చెప్పుకుంటూ, మనస్తత్వాన్నంతటినీ ఆ భావంతోనే నింపుకోవాలి. చేసేవాడూ, చేయించేవాడూ మనం కాదన్న ధోరణి అలవరచుకోవాలి. తోటయజమాని, ఆఫీసు యజమాని మనంకాదు. తోటమాలి, ఆఫీసు గుమాస్తా: మాత్రమే. అలా అనుకోగలిగితే

ప్రయత్నము నుండి ఫలితాన్ని వేరు చేసే ప్రయోగంలో మంచి ఫలితాలు వస్తాయి. అవునూ, పని మనది కాదు. చేసేది కూడా మనముకాదు. ఇంక దాని ఫలితం సంగతి మనకెందుకు?

4. సరే, మనం చేసిన గట్టి ప్రయత్నం ఫలించింది అనుకుందాము. సర్వశక్తిమంతుడయిన భగవానుడు విశ్వాత్మ. మనలో ప్రతి ఒక్కరు అందులో ఒక్కొక భాగం. భగవానుడు ఈ విశ్వ నిర్వహణా వ్యాపకంలో ఉన్నాడు. అందులో మనకు భాగం ఉంది. కనుక, ఆ సంస్థ విజయంకోసం; ఆ మహత్తరమైన విశ్వవ్యవస్థ యందు మనకు నిబద్ధమై ఉన్న భాగానికి అనుగుణమైనంత ఉత్తమంగా; (మనయందు నిబద్ధితాలయి ఉన్న వ్యక్తిగత- సామాజిక బాధ్యతల పరిపూర్తికోసం గట్టి ప్రయత్నం చేసుకుంటూనే) ఏమివ్వగలము, ఏ రూపంలో ఇవ్వగలము- అని చూసుకుంటూ, ఇతర భాగస్వాముల వలె పనిచేసుకుంటూపోవాలి. విశ్వపురోభివృద్ధి, అందులో భాగాలమయిన మన అందరి ప్రగతి. కనుక, అట్టి విశ్వ పురోభివృద్ధి కొరకు మనము నిర్వహించే ఏ బాధ్యత అయినా, ఒనరించే ఏ కార్యమయినా- అదంతా మన స్వంత ప్రయోజనానికే అని భావించాలి. ఒక పుష్పం పూర్తిగా వికసించింది- అంటే, అది మొగ్గగా ఉన్నప్పుడు దానిలో ఉన్న అన్ని రేకులూ వికసించినట్లే. ఈ కార్యాచరణ క్రమంలో ఫలితం మన చేతులలోలేదని తప్పక గుర్తుంచుకోవాలి. దాని సంగతంతా చూసుకుంటూ, దానివలన ఒనగూడే ప్రయోజనాన్ని లెక్కవేసుకుని సమయం వచ్చినప్పుడు మనకు రావలసిన భాగాన్ని ఈ విశ్వనిర్వహణా వ్యవస్థ సర్వాధికారి పంచుతాడు. (మన ప్రయత్నంలో కొంత మార్పువలన) ఫలితంలో కొంత మార్పు సాధించగలమని అనుకున్నా, అట్టిమార్పు అత్యల్పంగా ఉంటుందనీ విశ్వనిర్వహణకు, పరిణామానికి సంబంధించి జరిగిన పూర్వ నిర్ణయం దానివలన ఎంతమాత్రం ప్రభావితం కాదని గ్రహించాలి. అనగా మన ప్రయత్నం, దాని ఫలితం ఆ చిన్న భాగంలోనివే.

నిజానికి మనలో ప్రతి ఒక్కరూ విశ్వాన్ని నడిపే పనివాళ్లలో ఒక్కొక్కరు. అంతేగాని, విశ్వ నిర్వహణ ప్రయోజనాలను పంచే సమితిలో సభ్యులు కారు. సుఖపడాలని కోరుకుంటే, దీనిని గ్రహించుకొని; ఆ జ్ఞానంతో, ఆ భావనతో; క్రమం తప్పకుండా వర్తించాలి.

అందుచేత, మనము చేయగలిగినదంతా చేస్తే, అక్కడితో మనపాత్ర సరి అని ఎల్లప్పుడూ అనుకొనే విధంగా, మనసుకు శిక్షణ ఇవ్వాలి. మనం చేసినది గట్టి ప్రయత్నమే ననీ, అందువల్ల విజయం కలిగిందనీ అనుకుంటేసరి.

అసలు, ప్రయత్నం తొలిదశలో ఉన్నప్పుడే; మన ధ్యేయం, ఆ ప్రయత్నం పరిణతి మీదనే ఉంచాలి తప్ప; దానివలన కలిగే విజయ-వైఫల్యాల మీద కాదు.

ఎప్పుడూకూడా, మనం "ఈపని చేతనయినంత బాగా చేసేమా?" అని, మనల్ని ప్రశ్నించుకుంటూ ఉండాలి. సమాధానం 'అవునని' వస్తే, పూర్తి సంతృప్తితో అక్కడ 'ఆగమని' మనసును నిర్దేశించాలి. ఈ వైఖరి మన ప్రతిఒక్క చర్యలోనూ అవలంబించు

కుంటూ పోతే, మన మనస్తత్వం క్రమంగా- ప్రయత్నానికీ, ఫలితానికీ మధ్య సంబంధాన్ని పట్టించుకునే- ఆ ధోరణినుండి తప్పించుకుంటుంది.

5. ఫలితంగురించి ఆందోళన పడ్డామంటే, విజయంకోసం కోరిక ఉందన్నమాటే. విజయంకోసం ఆశపడతాము, అభిలషిస్తాము, పనిచేస్తాము. (అంతేగాని, విజయం కోరడ మనేది ఉండదు) విజయం కలగాలి- అనే భావం కోరిక రూపంలో అవతరించిందంటే, విజయంకోసం ప్రయత్నం చేయడానికి ప్రేరణ కలుగుతుంది. విజయానికి అవకాశాలు స్వల్పంగానూ, సుదూరంగానూ ఉన్నప్పటికీ అపేక్ష ఆ పట్టు ఎన్నడూ వదలదు. ఏ పని తలపెట్టినా అదంతా విజయవంతంగా ముగింపుచెందవలసిందే నన్న తీరుకి వచ్చి, పని అంటే (విజయానికిగాను ఏర్పడే) తిరుగులేని కోరికకి సమానార్థకంగా రూపొందుతుంది. అది అలా ఉండగా తలపెట్టిన పని విఫలం కావచ్చునేమో- అనే భావపు నీడ తగిలినా, ఇక ఫలితాన్ని గురించి ఒకే ఆవేదనగా అది ఒక భూతంలా వెంటాడుతుంది.

కనుక, ఫలితం అనే దాని పీడనుంచి తప్పుకోవడానికి ఒక చిట్కా, విజయం గురించి ఏ ఆలోచనా రాకుండా మనసును కట్టడి చేసుకోవడంలో ఉంది, "విజయం సాధించాక, దానితో ఏమి చెయ్యాలి, దానిని మరిన్ని ఘన విజయాల సాధనకు ఎలా వినియోగించాలి- అనే వాటికి తగినంత శక్తి, సమయం ఉన్నాయి. కనుక, దానిని గురించి ఇప్పటినుండి ఎందుకు వేదన చెందాలి?'' అని మనసుకు గట్టిగా నొక్కి చెప్పుకోవాలి.

ఒకవేళ వైఫల్యమే సంభవిస్తుందని అనిపించినప్పుడు దానిని ప్రయత్నం నాణ్యతను పెంచుకుంటూ పోవడంద్వారా ఎలాగ తప్పించుకోవాలో ఆలోచించుకోగలం; అయినా సరే, వైఫల్యం సంభవిస్తే, దాని పర్యవసానాలను ఎలాగ ఎదుర్కోవాలో కూడా మనం చక్కగా ఆలోచించగలము. ఈ పద్ధతి ఉభయతారకం. ప్రయత్నంలో మరిన్ని ఉన్నత పద్ధతులను ప్రవేశపెట్టడం ద్వారా విజయాన్ని సాధించుకునే అవకాశాలు పెరుగుతాయి. సంభవించగల వైఫల్యాన్ని, (అవసరమయితే) ఎలాంటి నిస్పృహకు లోనవకుండా, స్వీకరించడానికి సిద్ధం అవుతాము.

అందుచేత; ఫలితాన్ని గురించి ఆలోచించుకోకుండా ఉండలేం అనుకుంటే, వ్యతిరేక ఫలితమే రాగలదన్న ఆలోచనలో ఉండాలి తప్ప; అనుకూల ఫలితం రాగలదని ఎన్నడూ ఆలోచించుకోకూడదు.

మానసిక క్రమశిక్షణయందు తగినంత అనుభవం ఒనగూడింది కనుక; (ఆ ప్రకరణంలో చెప్పిన) ఏదో ఒక పద్ధతిచేత, కాకపోతే మరో పద్ధతిచేత: ఫలితాన్ని గురించిన అన్ని ఆలోచనలకు; కనీసం మన ప్రయత్నానికి విజయం- అనే ఊహకు, మనసును దూరంగా ఉంచాలి. విజయం నుండి విడిపడడం, వైఫల్యంలో అనుసంధానం- సాధించు కుంటే, (పరిమళం ఇవ్వలేని పువ్వుపట్ల, తీపిని రుచిచూపించని చక్కెరపట్ల వలె) ఫలితం పట్ల ఆకర్షణ ఉండదు.

6. మనలో ఉన్న స్వాభావిక (మానసిక) అంశాల మధ్య ఏదో ఒక వైరస్యం వలన ఈ సూచనలలో ఏదీ కూడా పనికిరాకపోతే, మనకు మనమే పనికొచ్చేదానిని దేనినో, అన్వేషించుకోవలసి ఉంది. కాని, అట్టి మానసిక ప్రయత్నపు ఏదశలోనూ కూడా ఫలితం పట్ల ఏదయినా వేదనగానీ, అనుచితమయిన ఆసక్తిగానీ కమ్మకుండా చూసుకోవాలి.

ఏ విషయంలోనయినా ముఖ్యపాత్ర ఆలోచనదే- అని గుర్తించాలి. అందుచేత ఆలోచన అనేది మనకిష్టమొచ్చినరీతిలో సాగినా, మనసులో మాత్రం ప్రయత్నానికి కలిగే ఫలితం పట్ల పరిపూర్ణ వైముఖ్యాన్ని అలవరచుకొని, ఏది చేసినా పూర్తి నిరాసక్త భావంతో చేయాలి.

మరి, అప్పటికీ ఫలితం గురించిన ఆలోచనలు బాధిస్తే, ఇహ చివరిప్రయత్నం ఒకటి ఉంది, అది చెయ్యవలసిందే: మనం ఒకానొక ప్రయత్నం మీద నిమగ్నమయి ఉన్నాము కదా. (ఫలితం గురించిన ఆలోచనల బాధ వదలనప్పుడు) మన ప్రయత్నం ఉందే, అది ఎంత ముఖ్యమయినదైనా సరే, దానినే త్యజించి, తద్వారా మనసులోంచి ఫలితం గురించి కలిగే ఆలోచనలని తరిమివేసే పద్ధతిమీద దృష్టిని కేంద్రీకరించాలి.

అటువంటి పరిస్థితిలో దృష్టిని ఏకాగ్రంగా చేసుకోవడమే ముఖ్యమయినపని. అదే గొప్పమేలు. మన(అసలు) ప్రయత్నం; మహా అయితే, ఒక స్వల్పమయిన, తాత్కాలిక మయిన- అనుకూల ఫలితాన్ని తెచ్చిపెట్టవచ్చు. కాని, ఫలితం కోసం చేసే ఏ ప్రయత్నం గురించిన ఆలోచనలు మనసులో లేకుండా తుడిచిపెట్టుకోవడంలో విజయం సాధించ గలిగితే, అది మోక్షానికి అతి ముఖ్య అవసరమయిన వైరాగ్యాన్ని సంపాదించి పెడుతుంది. అలా ఆలోచనలనన్నిటినీ తుడిచి పెట్టెయ్యాలంటే, చాలా ధైర్యం, తెలివి, త్యాగం- అవసరం అన్నది నిస్సందేహం. కానీ, దానివలన పరోక్షంగా (ఏ ప్రాపంచిక లాభానికీ) సాటిరాని ప్రతిఫలం లభిస్తుంది. భగవద్గీత అభ్యాసంలో ధ్యేయం పట్ల నిజాయితీకి అది ఒక పరీక్షవంటిది.

7. ఎల్లప్పుడూ, ప్రతి దశలోనూ "ఫలితం గురించి కలుగుతున్న ఆ పీడను మనసులోంచి తరిమివెయ్యడం అయిందా, లేదా? లేకపోతే మాత్రం ముందు ఆ పని చెయ్యాలి." అని మనకి మనం చెప్పుకుంటూ ఉండాలి. చెయ్యాలి కూడాను.

దానికోసం ఒక నమ్మకస్తుడి సహాయం తీసుకోవాలి. మానసిక క్రమశిక్షణ అనే ప్రకరణంలో సూచించిన విధంగా అతనిని కాలోచిత గురువుగా మనకు మార్గదర్శకత్వం వహించనివ్వాలి. మనసు ఫలితం దిశగా ఊహలు కొనసాగించే స్థితికి జారుతున్నప్పుడు మనం ఏం చెయ్యాలో అతన్ని చెప్పనివ్వాలి. మనం దారి తప్పకుండా నిరోధించే అధికారాన్ని అతనికి ఇచ్చేసి, అతడు చెప్పేదానిని విధేయంగా పాటించాలి.

ఈ కార్యాచరణక్రమాన్ని అవసరమయినంత కాలంపాటు (అనగా, ఆ బలహీనతను పూర్తిగా అధిగమించేవరకు) అవలంబించడానికి సందేహిస్తే, అది మన ధ్యేయంపట్ల,

మన నిర్ణయంలో తగినంత నిజాయితీ లేనందువల్లనే- అని గ్రహించి, ముందు దానికి అడ్డుకట్ట వల వేయాలి.

8. శీలరుగ్మతల మూలాలు, శారీరకమయిన రోగాల వాటికంటే చాలా ఎక్కువ లోతైనవి. ఈ జన్మలో ప్రదర్శితాలవుతున్న మన సహజ సిద్ధ లక్షణాలు (గుణాలు) నిజానికి ఏ పూర్వ జన్మలలోనో పాదుకొన్న ప్రవాహపు కొనసాగింపులే. కనుక, ఆ లక్షణాలలో సమూలమయిన మార్పు తేవాలంటే, దానికి మామూలు, కృత్రిమ ఔషధాలను మించి చొచ్చుకుపోగల చికిత్స అవసరం. ఈ సూచనలతో సరిపోల్చుకోదగినది ఒకటి ఉంది:

తాత్త్విక జ్ఞానం ద్వారా, బుద్ధి సంబంధ విశ్వాసం సాధించడం; అనారోగ్యాన్ని శాశ్వతంగా, సమర్థంగా నివారించడంకంటే, స్వభావ సంబంధమయిన లోటు పాట్లను, వైఫల్యతారహితంగా సరిదిద్దడంకంటే శ్రేష్ఠమయినది. కనుక, ఆధ్యాత్మిక తత్త్వం గురించిన గ్రంథాలను చదువుతూ, అధ్యయనం చేస్తూ ఉండాలి. అవి ఆధునిక గురువులు. ఉత్తమ మయినవి. సులభంగా అందుబాటులోనికి రాగలవి. ★

## పదిహేడవ ప్రకరణము

# భక్తి సాధన

ఇప్పుడు చెప్పుకొనేది ఒక సాకల్య-సారాంశ ప్రకరణం. ఇంతకుముందు చెప్పుకొన్న ప్రకరణాలలో రకరకాలయిన సాధనల అభ్యాసంలో సాధకుడు పాటించవలసిన విషయాలున్నాయి. కాని, విడిచిపెట్టిన (అలక్ష్యం చేసిన)వి చాలా ఎక్కువగానే ఉన్నాయి. అందువల్లన కలగగలిగే లోటుపాట్లను సవరించుకోవడం గురించి ఈ ప్రకరణంలో చెప్పుకుంటాము. సాధకుడు తన యావత్తు సాధనలో మొదటినుండి చివరివరకు ఇక్కడ చెప్పే సిద్ధాంతాలను అనుసరించి, సాగగలిగే విధంగా అసలు ఈ ప్రకరణాన్ని ఈ గ్రంధానికి మొట్టమొదటి ప్రకరణంగా పెట్టుకుని ఉండవలసిన మాట.

అయితే, ఈ ప్రకరణంలో చెప్పుకుంటున్న విషయం; భగవద్గీత ప్రభోధంలోని ఒక ప్రత్యేక భాగపు స్థాయి కలదికనుక, దీనికి ఇదేగా నిలుపుకుంటున్నాము. ఈ ప్రకరణం భగవద్గీత ముఖ్యబోధకు, ప్రముఖ అనుబంధంగా; భగవద్గీత అభ్యాసం విషయంలో అనూహ్య సహాయకారిగా ఉండగలదిగా భావించినప్పటికీ; భగవద్గీత మూల వస్తువునకు అనుబంధస్థాయినే ఇచ్చుకుంటున్నాము. అలాకాక, మిగతా ప్రకరణాలకంటే ముందు ఉండవలసినదిగా చేసిఉంటే భగవద్గీత, మూలబోధ ప్రాముఖ్యం తక్కువ అంచనాకి లోనవుతుందేమోనన్న భయం చేత దానిని ఒక ప్రత్యేక విషయంగా, ఒక స్వతంత్ర ప్రకరణంగా రూపొందించి, (ఇది ఇతర ప్రకరణాల మీద అనవసర ప్రాబల్యం వహించ కుండా చూసుకుంటూనే దీని ప్రత్యేకతను నిలబెట్టుతూ) ఈ గ్రంధంలో దీని స్థానం ఇక్కడేనని ఉద్దేశపూర్వకంగానే నిర్ణయించడమయింది.

ఈ ప్రకరణం ఈ పుస్తకంలో వరుసక్రమంలో ఇంచుమించు చివరిదిగా ఉన్నప్పటికీ, ప్రాముఖ్యంలోనూ, చింతనాత్మకతలోనూ దీనిని చివరి వరుసలోనిది (కనిష్ఠం)గా ఎన్నడూ భావించకూడదు. అందుకు భిన్నంగానే పరిగణించాలి. ఒక గౌరవ ప్రదమయిన వ్యక్తి, వయసు మళ్లినవాడు, వృత్తినుండి విరమించిన రాజనీతి విశారదుడు, చురుకయిన రాజకీయ వేత్తలకు అవసరమయిన నైతికమేధోప్రేరణ చేసే వ్యక్తి ఎవరయినా ఉంటే వారిని గౌరవించినట్లు దీనిని కూడా గౌరవించవలసి ఉంది.

అసలు విషయానికి వద్దాము. అభ్యాసంలో (నిమగ్నుడై) ఉన్న సాధకుడికి ప్రార్థన వలన కలిగే మేలు ఎటువంటిది?- అనే సమస్యకు గణిత శాస్త్ర సంబంధమయిన రీతిలో పరిశీలించుకొంటే వివరణ కలగవచ్చు.

ఎక్కడయినా, ఏదయినా ప్రయత్నంలో వైఫల్యం సంభవించడానికి కారణం, ఆ ప్రయత్నానికి అనుకూలంగా పనిచేసే శక్తులకంటే, ప్రతికూలంగా పనిచేసే వాటిశక్తి ఎక్కువ అయి ఉండడము. ఈ అనుకూల- ప్రతికూల శక్తుల ఫలితంగా కలిగే ప్రభావాన్ని అంచనావేసేటప్పుడు; వాటిలో చాలామట్టుకు మన కంటికి కనపడనివి, భౌతిక

పరిభాషలో మన గ్రాహ్యశక్తికి అతీతమయినవి- అయినందువల్ల, మనం సాధారణంగా ఘోరమయిన తప్పిదాలు చేస్తాము. మనం ఈ జన్మలో గాని, గత జన్మలలోగాని ఒనరించిన నైతిక, ఆధ్యాత్మిక తప్పిదాలతో వాటికి సంబంధం ఉంటుంది. కంటికి కనబడినా, కనబడక పోయినా మనకు ఏదయినా ప్రయత్నంలో వైఫల్యం సంభవించిందంటే, దానికి కారణంగా ఏదో ఒక ప్రతికూలశక్తి ఉండి తీరుతుంది. ముందు దానిని రద్దు పరచాలి.

ధన, ఋణ- భావాలు ఒకదానికొకటి విరుగుడు. అలాగే పాప-పుణ్యాలు. మన గత జన్మల, ప్రస్తుత జన్మ- సంబంధమైన: నైతిక, ఆధ్యాత్మిక- కార్యకలాపాలను పరిశోధించుకొని మనము ఒనరించిన పాపాల అసలు స్వరూప పరిమాణాలను, అవి సృజించిన వ్యతిరేక శక్తులను నిర్ధారించుకోవడం; అత్యంత కష్టసాధ్యం. కనుక, మనలను పట్టుకు వ్రేళ్లాడే అట్టి వ్యతిరేక శక్తులకు విరుగుడుగా పనిచేయగల (ఆ వ్యతిరేక శక్తులకు సరిసమానమయిన లక్షణాలూ, ప్రభావమూ గల) పుణ్యమును ఎన్నుకోవడం, సాధించు కోవడం అనేది ఇంచుమించు అసాధ్యం.

కాని, విశ్వమునందలి యావత్ పుణ్యానికి నిర్దిష్టరూపం భగవంతుడు. అన్ని పాపాలను, దుర్మార్గాలను తుడిచిపెట్టగల మంచితనం. అన్ని అనుకూల శక్తులను అనంతమయిన పరిమాణంలో నిలవచేసిన మహాసరోవరం. భగవంతుడు ఖచ్చితమయిన రీతిలో పనిచేసే కంప్యూటర్ వంటివాడు; మన పాపాలకన్నిటికీ విరుగుడుగా కావలసినంత శక్తిని సరఫరా చేయగలడు; నిత్య జీవితానికి- అనగా ఒక విద్యుత్ చోదక రైలు నుండి ఒక జీరో వాట్ బల్బు వరకు ఏ ఉపకరణానికి అయినా- అవసరమయ్యే విద్యుత్ శక్తిని సరఫరా చేసే పవర్ హౌస్ వంటివాడు.

మన ప్రయత్నం సఫలం కాకుండా కొన్ని వ్యతిరేక శక్తులు (పాపాలు) పని చేస్తున్నాయి. వాటిని నాశనం చేయగల సరిసమానమయిన అనుకూల శక్తిని తన మహాసరోవరం నుండి ప్రసాదించమని భగవంతుడికి చేసుకొనే విన్నపమే ప్రార్థన. మనం అలాగని పైకి అన్నా, అనకపోయినా అది అంతే.

(i) భగవంతుడు తనంతట తానే పనిచేసే సూత్రం. (i) ప్రార్థనకు ప్రతిఫలంగా వరం రావలసి ఉంది.

కనుక, సూత్రానికి అనుగుణంగా ప్రతీచర్యకూ ఫలితంగా ప్రతిచర్య సంభవిస్తుంది గనుక మన చర్యకు సమానమయినది, విరుద్ధ స్వభావము గలది అయిన వరాన్ని మన ప్రార్థనకు ప్రతిఫలంగా భగవంతుడు తప్పక ఇస్తాడు.

అన్నీ తెలిసిన ఆ (కంప్యూటరు) భగవంతుడు, మన ప్రార్థనమూ దానిలో నిబిడీ కృతమయి ఉన్న కోరికనూ స్వీకరించి: అంతా తనమీద వేసుకొని, ఆ ప్రార్థనకు ప్రతిక్రియగా- పరిమిత జ్ఞానంతో అల్లాడే మనకు- మన పాపాలకు విరుగుడుగా ఏమి ఇవ్వాలో తానే బాధ్యతగా నిర్ణయించి, సరిగ్గా ఎంత కావాలో అంత పరిమాణంలో ప్రసాదిస్తాడు. అది అలా జరగక తప్పదు. ఉన్నత తలం మీద ఉన్న జలాశయానికి

అనుసరించి ఒక కాలువను తవ్వితే నీరు కిందికి ప్రవహించక తప్పదు. అలాగే మనము ప్రార్థన ద్వారా అడిగిన వరాలను భగవంతుడు మనకు తప్పక ప్రసాదిస్తాడు. భౌతిక శాస్త్రంలో చెప్పిన (భూమ్యాకర్షణ శక్తి వంటి) ఏ సూత్రానికి అయినా దీటుగా ఉన్న ఆధ్యాత్మిక ఆకర్షణా సూత్రం, అది.

(i) ప్రార్థన ఎన్నడూ ఫలితం లేకుండా ఉండదు, ఉండలేదు.

(i') మనం తెలిసిగానీ, తెలియక గానీ చేసే ఏ పాపాన్నయినా ప్రార్థన కప్పుతుంది.- అని మనం ధ్రువంగా సంభావించుకోవాలి.

అలా, అన్ని పాపాలు తుడిచిపెట్టుకుపోయాక; మనకోసం నిరీక్షించేది: మోక్షం కాక మరేమిటి!

ప్రార్థన ఒకానొక సర్వరోగ నివారిణి. అదే కృష్ణభగవానుడు అర్జునునికి చెప్పినదాని సారాంశం.

सर्वधर्मान् परित्यज्य मामेकं शरणं व्रज
अहं त्वा सर्वपापेभ्यो मोक्षयिष्यामि मा शुचः

(సర్వధర్మములను పరిత్యజించి, నన్నే శరణుకోరుము. విచారము వలదు. నేనే నిన్ను సకల పాప విముక్తుని చేయుదును.)

-శ్రీమద్భగవద్గీత మోక్షసన్న్యాసయోగము'66

మనం ఒక ఇల్లు కట్టాలనుకుంటే; మనకి: ఒక పెట్టుబడిదారు, ఒక ఇంజినీరు, తాపీ మేస్త్రీలు, (ఇనుము-సిమెంటు మొదలయిన పదార్థాల) వర్తకులు, కూలివాళ్లు మొదలయిన వారెందరిదో సహకారం, సేవ అవసరం వస్తుంది. మనకు ఇతరత్రా ఉండే పనులచేత, ఇందులో నైపుణ్యం లేకపోవడంచేత; ఈ సామానులు, సేవలు అన్నిటినీ సమన్వయం చేసుకోలేకపోతాము. కనుక, ఈ పనిని మన తరపున, తానే అన్నీ అయి (నిర్వహణకుగాను కొంత రుసుము వసూలుచేసి) నెరవేర్చే ఒక కాంట్రాక్టరుకు వప్ప గిస్తాము. ఆ విధంగానే:

మనకు తగినంత విశ్వాసం ఉండాలే గాని, ప్రార్థన; మనకోసం ఒక ఇల్లు- ఏమిటి; ఒక సామ్రాజ్యాన్నే (రుసుము ఏమీ లేకుండా) నిర్మించి పెట్టగలదు. మన భౌతిక ప్రయత్నాలన్నీ నామమాత్రమే, అనుబంధప్రాయమే. అసలు నిర్మాణకర్త మన ప్రార్థనే. మరి, ఐహికమయిన ఇలాంటి విషయాలలోనే ఇలా జరిగితే, ఆధ్యాత్మికమయిన అభిలాషలలో, ఆ అభ్యాసాలలో; ప్రార్థన మనకు మరింత నిశ్చయంగా, మరింత సంగతంగా, మరింత శక్తిమంతంగా తప్పక సహాయపడగలదు కదా!

మనలో ఉత్సాహాన్నిపెంచి, మన సకలవేదనలను తొలగించి, మనకు అపారమైన మేలు కలుగ జేసేది ప్రార్థన. ప్రార్థనకు ఉన్న సామర్థ్యం సర్వతోముఖమయినది. మన ధ్యేయాల సాధనకోసం తెలిసీ తెలియకా మనం చేసే తప్పులను పరిహరించి, అన్ని ఆటంకాలనూ అణచివేయగలది. అనుకూల శక్తులను సృజించగలది.

అన్నిటికీ మించి మానవ సహాయంకంటె, దైవ సహాయం ఎంతో మేలయినది- అని, మనము భావించుకోవలసి ఉందికదా.

ఒక్కొక్కప్పుడు మన ప్రార్థనవల్ల పని జరగలేదని అనిపించవచ్చు. మనము చేసిన ప్రార్థన, మనము కోరిన ఫలితాన్ని ఇవ్వలేకపోయి ఉండవచ్చు. అంతటితో ప్రార్థన మనకు అనుకూలమయిన శక్తులను తగినంతగా సృజించలేదని అనుకోకూడదు.

ప్రార్థన అంటూ చేయాలేగానీ, దాని అర్హతకు సమానమయిన ఫలితాన్ని ప్రసాదించడంలో అది విఫలం అవదు. నిర్దుష్టము, దోష రహితము అయిన విశ్వపాలనా యంత్రాంగమునందు అది ఎన్నటికీ అసంభవం. మనం ప్రార్థన చేసినా విజయం లభించ లేదంటే, దాని అర్థం; మనము చేసిన పాపాలవలన ఏర్పడిన ఎంతో ఎక్కువ ప్రతికూల శక్తులను, ఎదుర్కొని విరుగుపరచడానికి తగినంతగా అనుకూల శక్తులు జనించలేదని. అంటే, (అట్టి ఎక్కువ ప్రతికూల శక్తులను విరుగుపరచగల) అధిక అనుకూల శక్తులను సృజించడానికి గాను మరింత ఎక్కువ ప్రార్థన చేయవలసి ఉందన్నమాట. అప్పుడు మనం పూర్తి ఫలితంకోసం మరింత విశ్వాసంతో, మరింత ఎక్కువకాలం పాటు ప్రార్థనను నిర్వహించవలసి వస్తుంది. కనుక:

కోరుకున్న ధ్యేయం ప్రార్థన ద్వారా నెరవేరకపోయినప్పుడల్లా, ప్రార్థన దీనికి అనుగుణ మయినది కాదని ఆపాదించుకోకూడదు. ప్రార్థన తగినంత పరిమాణంలో జరగలేదనే అర్థం చేసుకోవాలి. కొద్దిపాటి ధనంతో ఒక ఏనుగును కొనుక్కోలేకపోయాము- అని తెలిసినప్పుడు, ఏనుగును డబ్బుతో కొనలేము: అనికాదు అర్థం. రోగ తీవ్రతను బట్టి ఔషధపుమోతాదు. మోతాదు చాలని ఔషధం, వ్యాధి నివారణలో విఫలం కావచ్చు.

ప్రార్థన విఫలమయ్యే పరిస్థితిలో కూడా, ఎంతో ఊరట కలిగించే విషయం ఒకటి ఉంది. ఏదో ఒక విషయంలో విజయంకోసం చేసిన ప్రార్థన (అది విఫలమయినా) ఎన్నటికీ వృధాకాదు. భౌతిక ప్రపంచంలో 'పదార్థము' అనేదానికి నాశనము లేదని సూత్రం; అలాగే, ఆధ్యాత్మిక తలంలో ప్రయత్నానికీ (ప్రార్థనకి) లేదు. కోరుకొన్న విజయాన్ని తెచ్చిపెట్టలేకపోయిన (తగినంతకి తక్కువయిన) మన ప్రార్థన ఈ జన్మలో ఒక భావి సందర్భంలోనో, లేక మరో జన్మలోనో మనము పొందగలిగే విధంగా జమ అవుతుంది. అప్పుడు, ఈ ప్రస్తుత నిష్ఫల ప్రయత్నాన్ని తిరిగి చేపట్టితే, ఇప్పటి ప్రార్థనా ఫలితాన్ని మినహాయించగా అవసరమయ్యేటంత మాత్రమే ఆ ప్రయత్నానికి గాను చేస్తే సరిపోతుంది. ఎంత నిలవవుంది. ఎంత బాకీ ఉంది, ఎవరికి ఎంత ఇవ్వాలి, ఎవరినుండి ఎంత బిగపట్టుకోవాలి- అనే సంగతులను అణుమాత్రం తేడా రాకుండా నిర్వహించుకోగల సమర్థుడయిన ఎకౌంటెంటు భగవంతుడే.

**(సంపూర్ణత్వమును చేరని) వానికి ఈ లోకములో గాని,**
**ఆధ్యాత్మిక లోకములోగాని పతనం లేదు.**
**మంచి చేసేవాడు ఎవడూకూడా దుఃఖమును పొందడు.**

-శ్రీమద్భగవద్గీత ఆత్మసంయమయోగము: 40

**అక్కడ అతడు పూర్వజన్మ జ్ఞానము పొంది,**
**దానితో అతడు పూర్వముకన్న హెచ్చయిన బలంతో**
**సంపూర్ణత్వానికి ప్రయత్నిస్తాడు.**

-శ్రీమద్భగవద్గీత, ఆత్మ సంయమయోగము: 43

దీనిని కొనసాగించుకుంటూ పోతే మరికొన్ని విషయాలు వస్తాయి... ఏదయినా ఒక ప్రయత్నానికి సాఫల్యం కలిగే నిమిత్తం అవసరమయిన దానికంటె ఎక్కువ (పరిమాణంలో) ప్రార్థన నిర్వహిస్తే, ఆ 'ఎక్కువ' వృధాపోదు. ఆత్మను అనుసరించి ఉండే మన అనుకూల శక్తుల నిలవరూపంలో అది భవిష్యత్తులోకి చేరిపోతుంది.

(i) దానిని (ఇంతకు ముందు మనము తలపెట్టని) మరేదయినా ప్రాపంచిక కార్యానికి స్వతంత్రంగా మళ్లించుకోవచ్చును. అప్పుడు, అట్టికార్యం దానికిగానూ అవసరమయ్యే టంతకంటె తక్కువ ప్రయత్నంతో నెరవేరుతుంది.

( ) ఈ 'నిలవ-అనుకూల' శక్తి మన 'సంచిత కర్మ' (గతజన్మలలో పోగుపడిన కర్మ)నుండి కొంతమేరకు విముక్తినిస్తుంది.

(ii) సర్వ సాధారణంగా అలాంటి "సంచితకర్మ" ఉండదు. ఒకవేళ ఉంటే, ప్రార్థన ద్వారా సాధించిన ఈ నిలవ అనుకూల శక్తి, మనము ముక్తికొరకు అధిరోహించ వలసిన (నిచ్చెన) మార్గాన్ని మరింత సుకరం చేస్తుంది.

ఇలా, 'నిలవ-అనుకూల శక్తులు' ఏదో ఒకేవిధంగా గాని, అన్నివిధాలుగానూ గాని మనకు ఉపకరిస్తాయి. ఎలా అయినాసరే, అవసరమైన దానికంటె ఎక్కువ పరిమాణంలో చేసే ప్రార్థన వృధా కాదు; దానివల్ల ఏర్పడే "నిలవ" కూడా వృథాకాదు- అని గమనించు కోవాలి.

అన్నిటికి మించి అత్యంత ముఖ్యమయిన విధానం ఒకటిఉంది. దాని ప్రకారం అలవాటుగా నిర్వహించుకొనే ప్రార్థన మన ప్రగతికి సహాయం చేస్తుంది.

సంఘటనలకు మూలం ఆలోచనలే. ఈ జన్మలో ఏ ఆలోచనలతో చనిపోతే, ఆ ఆలోచనలకు సంబంధించిన మరుజన్మమే మనిషికి ప్రాప్తిస్తుందని వచించి ఉంది.

**జీవి మరణకాలమునందు ఏయే ఆలోచనలతో, లక్ష్యాలతో**
**శరీరాన్ని విడుస్తాడో, ఆ ఆలోచన నిమగ్నతలో నిరంతరం**
**ఉంటాడు కనుక, దానినే మరుజన్మలో పొందుతాడు.**

-శ్రీమద్భగవద్గీత, అక్షరపరబ్రహ్మ యోగము:6

అతడు కుటుంబం, ఆస్తి, ఇహ సంబంధమయిన అధికారం కీర్తి, లాంటి విషయాల ఆలోచనలో నిమగ్నుడయి, శరీరాన్ని విడిచితే అతడు మరుజన్మలో ఈ మరణ కాలము నందలి కోర్కెల తృప్తికి అవకాశం కలిగించే పరిస్థితులుగల పుట్టుకను పొందుతాడు.

తన కోరికలకు అనుగుణమయిన రీతిలో లౌకిక సంపదలను, ఆనందాలను పొందడంలో విజయవంతుడవుతాడు. తదనుగుణంగా అందుకు సంబంధించిన చిక్కులు తెచ్చి పెట్టుకుంటాడు. అవి అతనిని ఈ భూమిపై మరింతగా చుట్టికట్టి పడేస్తాయి. (అది వేరే సంగతి)

అలాగే, దైవ సంబంధమయిన ఆలోచనలో నిమగ్నుడయి శరీరాన్ని విడిచితే, అతడు దేవుని రాజ్యాన్నే చేరుకొంటాడు.

**మరణ సమయంలో నన్నే స్మరిస్తూ,**
**ఈ శరీరాన్ని విడిచిపెట్టేవాడు నా స్థితిని పొందుతాడు.**
**ఇందులో సందేహం లేదు.**

- శ్రీమద్భగవద్గీత, అక్షరపరబ్రహ్మయోగము : 5

(మరణం ఆసన్నమవుతోందని తెలిసే) ఆ క్లిష్టసమయంలో అతడు భగవంతుని గురించి, ఆతని గుణాలను గురించి ఆలోచించుకోవాలి. భగవంతునితో సాన్నిహిత్యానికీ, ఐక్యతకూ ఉత్సుకతతో ఎదురుచూసుకోవాలి.

కానీ, చరమకాలం అతనిని అనూహ్యంగా (ఒక ప్రమాదంలో వలె) పైకొంటుంది. అప్పుడు ఆ సంఘటన హఠాత్ స్థితిని అనుసరించి దేవుడిని గురించిగానీ, మరి దేన్ని గురించయినాగానీ ఆలోచించడమే అసాధ్యమవుతుంది.

పోనీ; దీర్ఘరోగం, వృద్ధాప్యం వంటి సందర్భాల్లో వలె; మరణం: తగినంత వ్యవధినిచ్చి మెల్ల మెల్లగానే సంభవించినా, బాధామయ శరీరపు జీవన్మరణ స్థితుల మధ్య వ్యక్తికి (సహాయకునికి) తగిలే పోరాటాలు ఆరాటాల వలన; లేక, నిశ్చైతన్య స్థితిలోకి జారిపోవడం వలన' ముక్తికోసం భగవంతుణ్ణి ప్రార్థించడంగాని, (అసలు) ఆయన మీదికి దృష్టిని మళ్లించుకోవడంగాని; (జీవికి) అసాధ్యం, కాకపోతే కష్టసాధ్యం.

అయినా సరే,

క్లిష్టమయిన ఆ అంతిమ క్షణాలకు ముందు మనము సుదీర్ఘకాలం అపేక్షాకరమయిన దైవస్మరణ చేసుకుంటూ, నిరవధికంగా దైవనామోచ్చారణ చేసుకుంటూ, ప్రతి ప్రయత్నం లోనూ, అన్నిటా- ఆతని సహాయాన్ని ఆహ్వానించుకుంటూ, జీవితాన్ని అక్షరాలా దైవదృష్టి నిమగ్నతతో పరిపూర్తి చేసుకుంటూ ఉండగలిగితే, అట్టి సాహసం మనకు సిద్ధించగలదు. అంతిమ క్షణాలప్పుడు ప్రయోజనకరంగా ఉండగలదన్న ఈ నిర్దిష్టమయిన ధ్యేయాన్ని దృష్టిలో ఉంచుకుని, (మరణ సమయంలో భగవంతుడిని గుర్తుకు తెచ్చుకుని ప్రార్థించుకోవలసి ఉంటుందన్న స్పృహతో) దానిని పటిష్ఠంగా నిరవధికంగా అభ్యాసం చేస్తే, ఆ సిద్ధి మనకు సాధ్యం అవుతుంది. అలా సిద్ధించినప్పుడు; మరణం అనేది ఏ పద్ధతిలో సంభవించినా, మనకు పూర్వం నుంచి ఉండిన అలవాటు, ఒక శక్తిగా పరిణ

మించి, మనంతట మనకే నిరిచ్ఛాక్రియ విధానంగా భగవంతుడి గురించిన ఆలోచనలు, మాటలు మన మనసుకు, నోటికి తెచ్చి అందిస్తుంది.

కానీ, ఏదో ఒకటి రెండుసార్లు జీవితంలో ఎప్పుడో దీనినంతటినీ వాంఛించుకుంటే, పనయిపోతుందని ఆశపడకూడదు. ఇప్పుడు చెప్పుకున్న దాంట్లో ఏదీకూడా అకస్మాత్తుగా జరిగేది కాదని గ్రహించాలి. ఎందుకంటే ఈ విశ్వ నిర్వహణలో అకస్మాత్తుగా జరిగేది- అంటూ ఏదీ ఉండడానికి వీల్లేదు. యాదృచ్ఛికంగానో, వింతగానో ఏదయినా జరిగితే కూడా దాని వెనక సుదీర్ఘమయినది, అగోచరమయినది- ఒక చరిత్ర ఉందన్నమాట. మనం అనుకొనే యాదృచ్ఛికాలు, అకస్మాత్ సంఘటనలు- ఇవన్నీ ఆ అగోచరమయిన చరిత్రకు సుగోచరమయిన తర్క బద్ధమయిన ముగింపులు మాత్రమే.

కాబట్టి, మనము తలపెట్టే ప్రతి ప్రయత్నంలోనూ; అది ప్రాపంచికమా- ఆధ్యాత్మికమా, పెద్దదా- చిన్నదా, నిత్యవ్యవహారమా- సందర్భానుసారమా; అని చూడకుండా భగవంతుని సహాయాన్ని అర్థించాలి. ఉదయంనుండి సాయంకాలం వరకు ప్రతిదినం, ప్రతి పనిలోను ప్రార్థనతో ప్రమేయం పెట్టుకోవాలి. అలా మనం యావజ్జీవితం నిర్వహించే ఋజుమార్గమర్యాదాస్పద కార్యక్రమాలన్నీ ప్రార్థనలో మునికి తేలే విధంగా రూపొందించుకోవాలి. మనకు లభించే ముఖ్య సహాయం ప్రార్థన వల్లనేనని, ఈ మానవ ప్రయత్నమంతా అల్పమాత్రము, అనుబంధమాత్రమేనని, మానసికంగా పరిగణించడాన్ని నిరంతర అభ్యాసం ద్వారా సాధించాలి. అది మనకు సర్వదా సర్వథా అపారమయిన మేలొనరిస్తుంది.

అధ్యాత్మిక సాధనలో బాగా ముందుకు సాగినవారికి సూచించడం మంచిది కాదుగానీ, ప్రాపంచిక ప్రయోజనాలను గురించి ప్రార్థన చేసుకోవడం ప్రారంభకుల విషయంలో నిషేధంకాదు. (ప్రార్థన ద్వారానో, స్వతహాగానో) ఒక మనిషి శారీరక ఆరోగ్యంతోనో, మానసిక ఉల్లాసంతోనో ఉన్నప్పుడే అతడు ఉన్నతమయిన ఆధ్యాత్మిక సాధనలను చేపట్టగలిగే పరిస్థితిలో ఉండగలడు. ఆకలి వేసినవాడు, అనారోగ్యంతో బాధపడేవాడు ముందు ఆకలితీరాలనీ ఆరోగ్యం బాగుపడాలనీ కోరుకుంటారే తప్ప, ఐహిక బంధాల నుండి విముక్తి కాదు. శరీరపు ఆకలి, ఆధ్యాత్మిక తృష్ణ; సాధారణంగా కలిసి సాగవు.

అందుచేత, ఏ మనిషికయినా ఆధ్యాత్మిక ప్రగతి సాగాలంటే, ముందు ఆ మనిషి ఐహిక వాంఛలు తగినంతగా తీరడం సహాయకరం; అంతేకాక, తరుచుగా అత్యవసర మూనూ. ఆ తృప్తి (ఆధ్యాత్మిక సాధనకు గాను వేసుకున్న) నిచ్చెనకు దిగువమెట్టే కావచ్చు గానీ, అదికూడా ఒక మెట్టే.

కనుక, మనిషి అస్తిత్వంకోసం ప్రార్థన నిర్వహించుకుంటే దానికి అడ్డు తగలకూడదు, నిషేధం అసలే కూడదు. మనిషి అవసరాలు అతని వ్యక్తిగతమయినవే కాక, అతని బంధుమిత్రులవి కూడాను. ఎందుకంటే, వారి యోగక్షేమం అతని మానసిక శాంతితో బలంగా ముడిపడిఉంది. ఈ అస్తిత్వం అనేదాంట్లో ఆ మనిషి సామాజిక స్థాయిని

అనుసరించి ఏర్పడే జీవన విధానాలు మిళితమయి ఉన్నాయి. ఈ స్థితిగతుల పరితృప్తి కోసం చేసుకునే ప్రార్థన అతని ఉన్నత ఆధ్యాత్మిక అభ్యాసానికి జరిగే ఒక సహాయ పూరిత పరిచయమే. ఆధునిక కాలపు సన్యాసికి కూడా తన మఠంలో తాను నివసించా లన్నా కూడా ఒక క్రమబద్ధమయిన ఆదాయం అవసరమే.

ఇప్పుడు చెప్పుకున్న రకం ప్రార్థన ఇతరుల ప్రయోజనాలకు ఎంతమాత్రం హానికరం కాకూడదు. మన స్వంత అభ్యున్నతికోసం తప్ప, ఇతరుల వినాశనం కోసం ప్రార్థన జరపకూడదు. మన బిడ్డలకు మంచి సంబంధాలు రావాలని ప్రార్థించుకోవచ్చు గానీ, మన ఇరుగు పొరుగుల పిల్లల పెళ్లిళ్లు పెటాకులు కావాలని కాదు. ఈ పద్ధతిలో మనము కూడు, గూడు, గుడ్డ, ఆరోగ్యం, సంక్షేమం- ఇలాటి తగు మాత్రపు కనీస సౌకర్యాలు మనకు, మన కుటుంబాలకు, మన సన్నిహితులకు, బంధువులకు ఒనగూడాలని ప్రార్థన చేసుకోవచ్చును. ఇలాంటి విషయాలలో లభించే తృప్తి, మన ఆధ్యాత్మిక ఉన్నతికి ఉపకరించే సొగుడుపలక వంటిది.

ప్రాపంచికమయిన ధ్యేయాలకోసమే ప్రార్థన సలపడానికి అన్ని యోగ్యతలు ఉన్న నేపధ్యంలో; ఆధ్యాత్మిక ఆదర్శాలను సాధించుకోవడానికి ప్రార్థనను ఆశ్రయించుకొనే న్యాయం ఎంత అని అనగలము! మనం ప్రార్థించేది రాముడినా, కృష్ణుడినా, శివుడినా, ఒక గ్రామ దేవతనా, ఇంకొక మతానికి చెందిన దేవుడినా- అనేది ముఖ్యం కాదు. పలుమతాలు నిర్దేశించిన వివిధ దైవాలు అవి ఎన్ని రూపాలవీ, ఎన్ని స్వభావాలవీ అయినా, ఆ విభేదం, ఆ విభజన పరమాత్మ ఏకత్వానికి విరుద్ధం కాదు. అదంతా మానవుని పరిణామం అసంపూర్తిగా ఉంటూ వచ్చిన దానికి ఒక నిదర్శనం మాత్రమే. అయితే, హిందూమత పితరుల మేధ ఒకే పరమాత్మను వేరు వేరు తరగతులలో, రూపాలలో; రకరకాల అభిరుచులు, స్థాయీభేదాలు కలిగిన సామాన్య జనానీకం అవగాహన కోసం, ఊహించి సమర్పించింది. కనుక; ప్రార్థనలో వాడే భాష, ప్రార్థనలో ఉద్దేశించే దైవంపేరు- ఇవేవీ పెద్దగా పట్టించుకోవలసినవి కావు. ప్రార్థన నిర్వహించే మనలోని హృదయం ప్రధానం. అన్ని నదులూ మహాసముద్రంలో కలిసేతీరుగా అన్ని ప్రార్థనలూ ఒకే పరమాత్మను చేరుకుంటాయి.

అలాగే, ఆ ప్రార్థన ఫలానా పద్ధతిలో సాగాలని ఏమీ లేదు. ఒక విగ్రహాన్నో, ఒక పటాన్నో ఎదురుగా పెట్టుకుని ప్రార్థించుకోవచ్చు. ఒక మానవ రూపాన్నో, జంతు రూపాన్నో, మరింకేదైనా గోచర అగోచర రూపాన్నో మనసులో నింపుకొని, ఆ రూపాన్ని ఉద్దేశించి ప్రార్థన సలుపుకోవచ్చు. ఆ ప్రార్థన పద్య రూపంలో గాని, వచన రూపంలో గాని, ఆఖరికి మనసులో కలిగే ఒక భావరూపంలోగాని సాగించవచ్చు. భగవంతుడు ఇందుగలడందులేడని సందేహము వలదు- అనే భావానికి రూపమే ఈ (ప్రార్థనా విధాన) స్వేచ్ఛ.

ఇన్నిటిలోనూ ఉన్న ముఖ్యమైన విషయం ఏమిటంటే: ఏ రూపంలో ఊహించుకున్నా, ఏ పద్ధతిలో పూజించుకున్నా, అలా ప్రార్థించుకోదగిన దివ్యశక్తి ఒకటి ఉందని మనం గ్రహించాలని. వేద యుగంలో ఋక్కులను అనుసరించి చేసిన మత కర్మాచరణ ప్రభావం హెచ్చుగా ఉండేది. క్రమంగా సమస్త విశ్వంలోని ఐహిక ఆధ్యాత్మిక ప్రపంచాలకు సర్వాధిపతి అయిన బ్రహ్మం అనే పదార్థం ఊహలోకి వచ్చి ధ్యాన ప్రపత్తి ఏర్పడింది. ఈ అభిప్రాయాలన్నీ భగవద్గీతలో ధ్రువీకరించి ఉన్నాయి.

కనుక, ప్రార్థనలోనూ పూజలోనూ పాటించుకోవలసిన నియమనిబంధనలు ఏమిటి, పద్ధతులు ఏమిటి- అని వేదన చెందకూడదు. అవన్నీ మనసును ఏకాగ్రంగా, నిశ్చలంగా ఉంచడానికి సిద్ధం చేసే ఒకానొక క్రమశిక్షణలోని భాగాలుగా పరిగణించాలి. ప్రార్థన, పూజ-ల పద్ధతి స్వరూపాలు ఏవి ఎలా పాటించినా ఆ ప్రక్రియలో ప్రధానపాత్ర మనసుదే అయ్యేటట్లు చూసుకోవాలి.

కొన్ని విషయాలను గమనించుకొని అప్పుడు ప్రార్థన సందర్భ విధానాలు ఏమిటి, ఎలాగ- అనేవి తెలియాలి.

1. కష్టంలో ఉన్నప్పుడు ప్రార్థన దానంతట అదే సంభవిస్తుంది. ఆ ప్రార్థన ఎలా సాగాలి-అనే దానిని గురించి ఎవ్వరూ సలహా చెప్పనక్కరలేదు. భగవంతుడిని మనం చూడకపోయినా, ఆయన సర్వవ్యాపి-అని, సర్వశక్తిమంతుడని; మనము గ్రహిస్తాము. మనపై సర్వాధికారాలూ ఆయనకే. ఆయనకు పూర్తిగా దాసోహం-అని మనకు ఉన్న కోర్కెలను తీర్చమని ఆయనను అర్థిస్తాము..... ఇదంతా ఒకానొక ప్రత్యేక; బాధావహ మయిన-సందర్భంలో జరిపే తీవ్రమైన విశ్వసనీయమయిన ప్రార్థన. మాట వరసకు మన ప్రియతమమయిన వ్యక్తి ఒకరు జబ్బుపడి, మంచానపడి ఉన్నప్పుడు; మన వ్యాపారం కూలిపోయే స్థితి దగ్గరపడినప్పుడు, ఒకానొక క్రిమినల్ కేసులో మనకు వ్యతిరేకంగా తీర్పు వచ్చేస్తుందని తెలిసినప్పుడు; ప్రార్థన (దానంతటదే) సంభవిస్తుంది.

(అలాంటి ప్రత్యేక పరిస్థితులలోనే కాక,) సాధారణ పరిస్థితులలో కూడా ప్రార్థనను ఒకానొక అనుభవనీయ భావంగా చేసుకోవాలనే ఆదర్శాన్ని పొందాలి.

2. ఒక ఉద్యోగం కోసం ప్రయత్నం మొదలు పెట్టినప్పుడో, ఒక వ్యాపార సంస్థను ప్రారంభించబోతున్నప్పుడో ఒక పరీక్షకు హాజరు అవుతున్నప్పుడో - ఇలాటి చిన్నా, పెద్దా ముఖ్య-అముఖ్య సత్కార్యాలను తలపెట్టేటప్పుడు భగవంతుని సహాయం కోరడానికిగాను చేసే ప్రార్థన కోసం మన భాషలోని ఏదో ఒక ప్రార్థనా గీతాన్నిగాని, సంస్కృతంలో చెప్పిన శ్లోకాన్నిగాని ఎంచుకోవాలి. అనగా, మనము ఎదుర్కొనే ప్రతి భౌతిక దృక్పథాన్నీ ఆధ్యాత్మికీకరించడమే.

3. ఏదయినా ఒక కోరికను నెరవేర్చుకొనే సందర్భంలో; లేక, ఒక ప్రత్యేక ధ్యేయం సాధించుకొనే సందర్భంలో కాక, కేవలం జీవితాన్ని పరిశుభ్రపరచుకొని భగవత్ చింతనతో నించుకోవడానికి చేసుకునేదిగా నిర్వహించేదే మన ప్రార్థన అయితే; రాముడు, కృష్ణుడు

వంటి మన ఇష్టదైవం నామాన్ని వీలైనంత తరుచుగా జపిస్తూ ఉండడం అలవాటు చేసుకోవాలి. అసలు అట్టిజపం లేకుండా మన సమయంలో ఏ భాగాన్నీ వదలకూడదు. అనగా, వృత్తి పరమయినవి సాంసారిక ముఖ్య సంఘటనల పరంగా కలిగేవి, మరికొన్ని అలాటివి-తీవ్రమయిన ఆలోచనలతో మనసు నిండి ఉండనప్పుడల్లా; ఆ నామాన్ని యాంత్రికంగానయినా సరే, ఉచ్చరించు కుంటూనే ఉండాలి

అట్టి పునరుచ్చారణ రెండు విధాలుగా మేలు చేస్తుంది.

(i) మనసు ఆలోచనలతో నిండిఉండని సమయాలలో చెడుతలపులు అందులో దూరకుండా అడ్డుపడుతుంది.

( ) పుణ్యము అనేదాని రూపమే భగవంతుడు. ఆయన నామాన్ని యాంత్రికంగా నయినా సరే పునరుచ్చరించవలసి ఉంది. అట్టి పునరుచ్చారణ వలన ఒకటి రెండుసార్లు (లేదా మరికొన్నిసార్లు) మనం భగవత్ చింతనలో ఉండగలుగుతాము. అందువలన మనకు ఉపకరించగల అనుకూల శక్తులు జనిస్తాయి. దానివలన మన ఆత్మను పట్టుకుని వ్రేలాడే సంచిత కర్మలో కొంతభాగం దానికదే నశించి, మనము ఆ ఘోరము నుండి ఆ మేరకు విముక్తి చెందుతాము.

అట్టి పునరుచ్చారణా కార్యక్రమాన్ని తగినంత సుదీర్ఘ కాలంపాటు అభ్యసిస్తే మనసును ఆ (యాంత్రిక) పునరుచ్చారణలో మరింతగా నిమగ్నం చేయగలుగుతాము. ఆ యాంత్రికశ్రమ, ఒకానొక క్రమబద్ధమయిన జనకశక్తిగా పరిణామం చెంది, ఆధ్యాత్మిక శక్తికి దారితీస్తుంది.

అందుచేత, ప్రాపంచికమయిన పనులలో తీవ్రంగా నిమగ్నం చేసేది ఏదీ లేకపోయినప్పుడల్లా, భగవన్నామ పునరుచ్చారణను శ్రద్ధగా అభ్యసించాలి. తీవ్రనిమగ్నత అవసరం లేని ప్రాపంచిక కార్యక్రమాలు కోకొల్లలు: ( ) స్నానం, ( ) బస్సుకోసం నిరీక్షణ (i ) ఆఫీసు వరకు సాగే ప్రయాణం, (V) రాత్రివేళ (పరుండి) నిద్రకోసం నిరీక్షణ, (V) నిద్రనుంచి (ఉదయం) లేచి ఒళ్లు విరుచుకొని, కూర్చుని లేవాలని సిద్ధపడడం, (V ) ఏదయినా కారణం చేత బెదురు, దిగ్భ్రాంతి కలగడం, (v ) ఎవరినో తిట్టవలసి రావడం— ఇలా ఎన్నో.

అలా చిన్నాచితకా ఏ అవకాశం ఎప్పుడు, ఎక్కడ దొరికినా "హరేరామ, హరేకృష్ణ"- అనో, అలాటిదింకోటో అనుకుంటూ ఉండాలి. అలా జీవిత కాలమంతా చెయ్యాలి. అందువల్ల మనం మన పూర్వ పాపాలను నశింపజేసుకోవడమే కాక, కొత్తవి తగులుకోకుండా జాగరూకులమవుతాము. కాలాన్ని సద్వినియోగం చేసుకుంటే, అదే ఒక పెద్ద స్థిరాస్తి.

**4.** సరే, మనకు ప్రాపంచికమైన కోరికలు ఉంటాయి, లేకపోతాయి. కాని, మన అంతస్సు ఆరోగ్యంగా, బలంగా ఉండడానికి కనీసం కొద్దిపాటి ఆధ్యాత్మికత అవసరం. అందుచేత ఉదయం ఒకసారి, సాయంకాలం ఒకసారి, కొన్నేసి నిమిషాలపాటు ప్రార్థన

ఒక క్రమబద్ధమయిన అలవాటుగా చేసుకోవాలి. శ్రుతుల నుండి కొన్ని శ్లోకాలను ఎంచుకొని, ఉదయ-సాయం సంధ్యలలో-వాటిని మనసులోగాని, బిగ్గరగా గాని వల్లించుకోవాలి. అలా చేస్తే, మనం గడిపే ప్రతిదినం ఆరోగ్యంగా మొదలయి ఆనందంగా ముగుస్తుంది. ఆ శ్లోకాల వల్లింపుకూడా ప్రార్థన వంటిదే. ఆ ప్రార్థన కేవలం ప్రార్థన కోసమే. ఆ శ్లోకాల అర్థం తెలుసుకొని, ఆ అర్థం మీద పెట్టాలి. ఆ ప్రార్థన, 'ప్రార్థన' అనే ప్రక్రియ సిద్ధికోసం చేసిందే అయినా, అది జీవితాన్ని పరిశుభ్రపరచి, ఆధ్యాత్మిక పునాదులను దృఢపరుస్తుంది.

5. భగవంతుడి నామస్మరణ యాంత్రికంగా చేసినదయినా, అది మనకు కొంత ఆధ్యాత్మిక శక్తిని ఇస్తుంది. అట్టి నామస్మరణను జీవితకాలమంతా తరుచుగా చేస్తే అది తనకు తానే ఒక అలవాటు అవుతుంది. అప్పుడు అనుకోకుండా సంభవించేవి-తీవ్రమైన ప్రమాదాలవంటి అకస్మాత్ సంఘటనలు కలిగినప్పుడు మనము అప్రయత్నంగా ఆమాటలను ఉచ్చరిస్తాము. ఎంతో బాధాకరమయిన, కలవర, క్లిష్ట మృత్యు ఘడియలలో కూడా ఆ మాటలు మన పెదవుల మీదుగానిరిచ్ఛాక్రియవలె వెలువడతాయి. మృత్యు ముఖాన ఉన్న సమయంలో అట్టి పవిత్రమయిన మాటలను స్మరించుకోవడం వల్ల, ఉచ్చరించడం వల్ల మరుజన్మలో (సంభవించగల) జీవిత స్వరూపాన్ని దిద్దుకోవడం మీద అమూల్యమయిన ప్రభావం ఉంటుంది.

దానికది మంచిదే. అయితే, (మనం జపించుకొనే) ఆ ఇష్టదైవం పేరుకి బదులుగా; మనం స్థిరమని ఎన్నుకున్న మోక్ష సాధనా ధ్యేయానికి అనుగుణమైనవి మరో (రకం) మాటనో (కొన్ని) మాటలనో (వాటి అర్థం తెలుసుకుని మరీ) ఉపయోగించుకుంటూ ఆఉచ్చారణ సాగిస్తే అది (కూడా) ఒక అలవాటుగా మారి, దాని శక్తివల్ల మరణ సమయంలో ఆ అలవాటైన మాటల్ని వాచా కాకపోతే మనసా అయినా ఉచ్చరించుకో గలిగితే అదే ఖచ్చితమైన మోక్షమార్గం.

అందుచేత, మోక్షమార్గం చూపే అట్టి మాటలను కూడదీసుకోవాలి. ఆ మాటలను, ఆ వాక్యాలను మన పవిత్ర గ్రంధాల నుండి మనకి తోచిన భాషలో సేకరించుకోడం ఇంకా మంచిది. వాటిని యావజ్జీవం ఉచ్చరించడం అభ్యాసం చేసుకోవాలి. అలా ఎంపిక చేసుకోవలసిన మహావాక్యాలు కొన్నిటిని మానవజాతి శ్రేయస్సు కోసం మన మహర్షులు (ఇది వరకే) నిర్ధారించేరు:

| | | | |
|---|---|---|---|
| (') | అహం బ్రహ్మాస్మి | : | నేను బ్రహ్మమును |
| (i) | సోஉహమ్ | : | అతడే నేను |
| ( ı) | తత్త్వమసి | : | నీవే అది |
| ('v) | ఓమ్ తత్సత్ | : | బ్రహ్మము నందుగల త్రిగుణాత్మక స్థితి |
| (V) | ఓం | : | గుణాతీతుడైన పరమాత్మ (బ్రహ్మము)ను నిర్వచించే మార్మిక ఏకాక్షరం. |

ఇందులో మొదటి దానిని మన ఉదయ-సాయం-సంధ్యల ప్రార్థనలలో చేర్చుకోవడం మంచిది.

మిగిలిన వాటిలో ఒకదానిని ఎంచుకొని, దాని అర్థం మీద పూర్తి స్పృహతో; మనకు తీరికగాని అవకాశంగాని తగినంత లభించినప్పుడు; మనము దానిని మిక్కిలి శ్రద్ధగా, ఒక జపము (పునరుచ్చారణ)వలె అభ్యాసంలోకి తెచ్చుకోవాలి. జీవితాంతం ఒకానొక లోహతుల్య దృఢ నిర్ణయంతో అలా చేసుకుంటూ, మరణ సమయమునందు దానిని గుర్తుకి తెచ్చుకొని ఉపయోగించుకోవాలి.

ఇంకొక సంగతి ఉంది. ఇప్పుడు ఉదహరించినవి మామూలు అక్షరాలూ, మాటలూ కావు. అవన్నీ "మహావాక్యాలు, మహామంత్రాలు-అని నిర్దుష్టంగా వచించినవి. మానవ మోక్షసిద్ధికి శక్తిమంత సంభావ్య గర్భితాలు.

ఎన్నికైన ఆ మహామంత్రాన్ని ఒక గురువు ఉపదేశంగా కూడా స్వీకరించి, దానిని అభ్యాసం చేయడం ప్రారంభిస్తే, అది అత్యంత సహాయకారి కాగలదు. అట్టి ఉపదేశాన్ని ప్రసాదించగల అనుగుణుడయిన గురువు లభించని యెడల మనోభీష్టం చేత మన ఇష్టదైవాన్నే గురువుగా చేసుకొని ఆయనే ఉపదేశాన్ని ప్రసాదించాడని భావించుకోవాలి. అదిచాలు. ఫలితం మన అభ్యాసంలోని శ్రద్ధమీద, దానిపై మనకుగల విశ్వాసంమీద ఆధారపడి సిద్ధిస్తుంది.

6. మన ఇష్టదైవనామ పునరుచ్చారణ వాచా జరిగినా, మనసా జరిగినా దానికి హృదయాన్ని, తలపులను-చేర్చుకుని అట్టి కార్యక్రమం నిర్వహించుకోవాలి. ఆ ఇష్టదైవం, మన వ్యక్తిగత ప్రభువు, పిత, భర్త, గురువు, మిత్రుడు-అని భావించి అతనిని అట్టి ప్రేమతో చూసుకోవాలి. అప్పుడు మన ప్రార్థన "భక్తిగా" పరిణమిస్తుంది. భక్తి అంటే, ప్రామాణికమయిన ప్రార్థన.

మనభక్తి తారాస్థాయికి చేరుకుంటే· మిత్ర-శత్రు, ఉన్నత-అవనత, స్వర్ణ-మృత్తిక, ప్రేమ-ద్వేష : భావములన్నిటి మీద, భయ-బంధుత్వాలు లేని; బాధా-ఆనందాల పట్ల నిరాసక్తత గల; స్థితి ఏర్పడి, స్థిత ప్రజ్ఞత్వం దానంతట అదే సిద్ధిస్తుంది.

భక్తిభావం భగవద్గీత ముఖ్యసూక్తికి ఒకానొక అనుబంధమే అయినా, భక్తిభావం తానుగా దైవత్వానికి ఒక స్వతంత్ర మార్గం.

మానవుడు తాను ఒనరించే అన్ని కార్యములయందు, భక్తికి సత్యాన్ని జోడించి పనిచేయగలిగితే, అతడు సంపూర్ణ మానవుడు కావడానికి మరేమీ అవసరం లేదు.

భక్తి, సత్యం:జంట, సరాసరి మోక్షానికి చేకొని పోగల రెక్కల గుర్రాల జంట.

★

## పద్దెనిమిదవ ప్రకరణము

# ఏకాగ్రతా సాధన

ప్రార్థన మోక్షానికి మార్గం. అతీతమయిన ఏకాగ్రత (సమాధి) "మోక్షమే". ప్రార్థన అనే ప్రక్రియలో భగవంతుని సహాయం అపేక్షించి, దానిని పొందడం ఉంది. అయితే, సమాధి అనగా ఆతనితో ఐక్యం కావడమే.

ఆ స్థితిలో మనసు, దేహంతో ఉండే జీవ సంపర్కాన్ని వదిలేసి సహజాతీత స్థితికి ఉత్థానమై స్వర్లోకాత్మక శాంతినీ, అనంత పరమానందాన్నీ పొందుతుంది. అట్టి ఏకాగ్రత ద్వారా అంతర్గత జీవిత సంబంధమయిన అనుభూతులు, ఆనందాలు తెలుస్తాయి. ఇంకా విశ్వాంతరాళంలోని వేలాది మర్మాలూ వైభవాలూ తెరిచి ఉంచిన పుస్తకంవలె అవగతమవుతాయి. అది ఒకానొక నిగూఢ ఆధ్యాత్మిక మత్తత. దానిని ఒకే ఒక్కసారి అయినా చవిచూస్తే, ఈ ఇహలోక ఆనంద సౌఖ్యాలు అన్నీ ఎంతో హీనమైనవిగా, అవివేకమయినవిగా తోచి, మరి ఎన్నడూ వాటివంక చూడలేని స్థితి సంభవిస్తుంది.

అతీత ఏకాగ్రతా స్థితి (సమాధి) ఒకానొక అత్యంత సమున్నత స్థితి. భగవద్గీత అభ్యాసంలో ఇంతకు ముందు చెప్పుకున్న విషయాల పరాకాష్ఠ. ఆ స్థితి కోసం మానవుడు ఈ మృత్యు వలయంలో పెనుగులాడుతాడు. అది మనకు ప్రసాదించే పరమోన్నత బహుమతిని దృష్టిలో నిలుపుకుంటే, ముక్తి కోసం పెనుగులాట సాగించే ఏ వ్యక్తి అయినా, ఆ స్థితిని పొందడానికిగాను తాను చేసిన ఎట్టి త్యాగంగాని, ఎదుర్కొన్న ఎట్టి కష్టంగాని గొప్పవి అని పరిగణించుకో కూడదు.

అందుచేత, సాధారణ సంఘటనాత్మకమయిన పరిస్థితుల్లో మానవుడు ఏకాగ్రత సాధనను పట్టుదలగా ప్రారంభించడానికి, మళ్లుతున్న వయసు తొలిదశ అనుకూలంగా ఉంటుంది. అప్పటికి అతడికి వృత్తి పరమయిన పనుల్లో చురుకైన వాటినుండి విరమణ జరిగినా శ్రమతో కఠోర నియమాలతో సాధించగల ఏ ఆధ్యాత్మిక ప్రయోగానికైనా తగిన శారీరక దారుఢ్యం ఉంటుంది. అప్పటికి అతడు పిల్లలపట్ల, తనపై ఆధారపడి ఉన్న ఇతరుల పట్ల నిర్వహించవలసిన విధులను నిర్వహించి ఆ ఐహిక బాధ్యతల (లో మిగిలిన వాటి)ని వప్పగించడం కూడా అయిపోయుంటుంది. అలా అతనికి అన్ని ప్రాపంచిక పూచీలూ వదిలిపోతే, జీవితంలో నెరవేర్చుకోవలసిన ఏకైక ధ్యేయం-ఏకాగ్రతా సాధన-కోసం అతడికి స్వేచ్ఛ. ఏకాగ్రతా సాధన సఫలం అవాలంటే దానికి మనసు ఏకాగ్రంగా ఉండడం అవసరం. రెండో ఎక్కువో ధ్యేయాలు పెట్టుకోవడమనేదే ఏకాగ్రతకి వ్యతిరేకం.

ఆ వయసు వచ్చేసరికి మనిషి భగవద్గీతలోని వివిధ అభ్యాసాలలో తగినంత శిక్షణ సమకూరి, నాలుక-కన్ను-లైంగిక ప్రవృత్తి; క్రోధం, భయం, మాత్సర్యం-వంటి ఇంద్రియ, భావోద్వేగ జనితాలైన బలహీనతల మీద తగినంత అదుపు ఏర్పడి ఉంటుంది.

నిష్కామత్వం, నిరాసక్తత, ద్వంద్వాల పట్ల వైముఖ్యం-వంటి ఉన్నత విలువలను సాధించుకొని, సత్యంతో, ప్రార్థనతో బలోపేతుడవుతాడు. అంతర్గత పురోగతి: ఆ పునాది ఆధారంగానే, పటిష్ఠతకూ ఆరోగ్యానికీ నిలయమైన ఏకాగ్రత అనే అద్భుతమైన కట్టడాన్ని నిర్మించుకొనే ఆశయాన్ని నెలకొల్పు కుంటుంది.

అభ్యాసానికి యోగ్యతలుగా పేర్కొన్న లక్షణాలూ, అర్హతలూ ఒనగూడి ఉన్నాయని మనకు మనం పరిశీలించుకొని, జీవితంలో సాధించవలసిన ఈ ఉన్నతోద్యమానికి ధైర్యంగా శ్రీకారం చుట్టాలి. దానికోసం మనకి మనమే కొన్ని ప్రశ్నలకి సమాధానాలు చెప్పుకుంటూ నిజాయితీగా నిర్దాక్షిణ్యంగా ఆత్మపరీక్షకు నిలవాలి. అట్టి ఆత్మపరీక్ష సందర్భంగా కొన్ని సూచనలను ఉదహరించుకోవచ్చు:

1. ఇంద్రియ నిగ్రహం.

(i) అసలు మనం: భయం- అనుగ్రహం లేకుండా, స్వార్థం లేకుండా; అన్ని పరిస్థితుల్లోనూ; సత్యాన్నే పలుకుతున్నామా, సత్యంతప్ప మరేదీ కాదా?

(ఉదాహరణ : ఒక పేదవాడున్నాడు. ఒక దావాలో ఒకే ఒక అసత్యాన్ని వచించి నట్లయితే ఒక లక్షరూపాయలో, కొంచెం ఎక్కువో- ఏ చికాకులూ లేకుండా-అతనికి కలిసొచ్చే విధంగా తీర్పు వెలువడుతుంది. అప్పుడు అతడు సత్యం వచించి ఆ అదృష్టాన్ని కాలదన్ను కుంటాడా?)

(ⁱ) మనం ఎల్లప్పుడూ కూడా ఖచ్చితంగా ఎంత అవసరమైతే అంతే మాట్లాడు తున్నామా?... అలా (తక్కువ) మాట్లాడినప్పుడైనా: ఎల్లప్పుడూ మృదువైన, మధురమైన ప్రేమాస్పదమయిన మాటలు ఉపయోగిస్తున్నామా? కఠిన పదజాలంలోకి, అశ్లీలంలోకి దిగజారడం లేదుకదా!

అది వాగింద్రియము (నాలుక)కు పరీక్ష

2. మనలో ప్రతి ఒకరు శారీరకంగా మాత్రమేకాక, మానసికంగా కూడా కఠోర బ్రహ్మచర్యాన్ని పాటిస్తున్నారా? బాహ్యమయిన శారీరక నిర్బంధాల వలన కాక, అంతర్గత మయిన విశ్వాసాన్ని అనుసరించి, ఉద్దేశపూర్వకంగా ఒకానొక జీవిత సిద్ధాంతంగా భావించుకొని, నిర్వహించవలసినది బ్రహ్మచర్యం. ఇతరులతో సంగతి అలా ఉంచి, తమ సొంత వైవాహిక భాగస్వామితో నయినా, కోరిక ప్రేరణచేత వారు లైంగిక చర్యకు గానీ, ఆలోచనకు గానీ పాల్పడ నిరాకరించే స్థితికి చేరుకున్నారా? (ఇది లైంగిక ఇంద్రియం గురించిన ప్రశ్న)

3. మనలో ప్రతి ఒకరు నిరంతరం సాత్విక ఆహారమునే భుజిస్తారా? మిఠాయిలు, కారపు వస్తువులు, మద్యం-వంటి-విలాస వంతమైన, ఘాటైన, మత్తతా ప్రేరక పదార్థాలను పరిహరిస్తారా? ఎల్లప్పుడూ వారికి కావలసినంత దానికంటె కొద్దిగా తక్కువే తింటారా? వారానికి కనీసం ఒక సారి అయినా ఉపవాసం ఉంటున్నారా?

ఇదంతా జిహ్వేంద్రియ(నాలుక) క్రమశిక్షణ గురించి.

4.ఇక దృగింద్రియము (కన్ను) క్రమశిక్షణ గురించి:

లింగభేదముగల ఒక బలిష్ఠ సుందర వ్యక్తి తమ కంటికి ఎదురుగా అర్ధనగ్నంగానో, పూర్తి నగ్నంగానో నిలబడినప్పుడు, చూసే ప్రలోభాన్ని తట్టుకుని కనులు మూసుకోగలుగు తున్నారా? ఒకవేళ ఏదైనా కారణంచేత చూడవలసే వస్తే, ఒకానొక శరీర మర్మశాస్త్ర పరిశోధనా శాలలోని బల్లమీద పడిఉన్న దిగంబర మృత శరీరాన్ని చూసే వైద్య విద్యార్థికి ఉండేలా కేవల పరిశీలనా దృష్టితో చూడగలరా? అలాగే; కామప్రకోప దృశ్యాల పట్ల, అశ్లీల లైంగిక ప్రదర్శనల పట్ల- విముఖత కలుగుతుందా?

5. కనీసం అప్పుడప్పుడైనా గట్టి చాపమీద శయనిస్తున్నారా, చన్నీటి స్నానం చేస్తున్నారా, అనాచ్ఛాదిత పాదాలతో నడుస్తున్నారా? (ఇవి త్వగింద్రియ-అనగా చర్మ-నియంత్రణ కొరకు) అలాగే, శ్రవణేంద్రియాన్ని (చెవిని) అదుపులో పెట్టుకోవడం గురించి : అశ్లీల మయిన పాటలను, పోసుకోలు కబుర్లను అసలు వినకుండా ఉంటున్నారా?

6. ఉద్వేగ జనితాలైన క్రోధము, మాత్సర్యము మొదలైన భావాలపై ఆధిపత్యం గురించి :

(I) సేవకుడు, ముఖంమీద ఉమ్మినా సరే, వారు నిశ్చలంగా, క్రోధ రహితంగా ఉండగలరా?

( ) జీవిత భాగస్వామి, ఒకానొక ఇతర వ్యక్తితో అక్రమ లైంగిక సంబంధం కలిగి ఉండడం తెలిసినప్పుడు అసహ్యంవల్ల, అసూయవల్ల- కలవరం లేకుండా ఉండగలరా? (అది విశ్వప్రణాళికలో ఒకానొక భాగము అని స్వీకరించి, ప్రతీకారం, శిక్ష-వంటి పథకాలు వేసుకోకుండా అక్కడితో దానిని వదిలెయ్య గలుగుతారా?)

7. వారు ఒనరించే ఏ ప్రయత్నానికి గాని కలిగే ఫలితాన్ని గురించి తమకు సమదృష్టి, నిర్లిప్తత- ఉంటాయా?

() సామాజిక వలయంలో మనకు ఒక మొండి ప్రతిస్పర్థి ఉన్నారు. ఒకానొక విషయంలో తనకు మన కంటే ఎక్కువ మంచి జరిగినప్పుడు దానిని సమదృష్టితో చూడగలమా? ఆ విషయంలో తాను మనకంటే ఎక్కువ యోగ్యత కలిగి ఉండి కూడా, విఫలం చెందుతూ ఉంటే, తన విజయానికిగాను మనము ప్రార్థన సలుపగలమా?

(ii) ఒకరైలు తీవ్రప్రమాదానికి గురి అయిందన్న వార్త రేడియో ద్వారా వస్తుంది. అందులో ప్రయాణం చేస్తున్న మన ప్రియతమ వ్యక్తులలో ఒకరి భద్రత గురించి ఆ ప్రమాద స్థలానికి టెలిగ్రామ్ ఇస్తాము. దానికి జవాబు వచ్చేటంత వరకు దానిని గురించి ఎట్టి ఆలోచనా లేకుండా ఉండగలమా?

8. గొప్ప విషయాలు నెరవేరాలంటే, గొప్ప యోగ్యతలే కాకుండా, గొప్ప ప్రయత్నాలు కూడా కావాలి. కనుక, భగవద్గీత అభ్యాసంలో మనము నిర్వహించుకున్న అన్ని

సాధనలయందు, క్రమశిక్షణల యందు ఈ పాటికి మనకు పట్టభద్రత వంటిది చేకూరిందని అనుకున్నా. ఏకాగ్రతను విజయవంతంగా సాధించడానికిగాను ఇంకా పట్టుదలతో, ఓర్పుతో ఒనరించవలసినది ఎంతో ఉంది. ఏది ఏమైనా సరే, ఈ ప్రయత్నం నెరవేరేలా చూసుకుంటాను-అని ఒక మొండి నిర్ణయంతో (ఏకాగ్రతాసాధనను) ప్రారంభించుకోవాలి. "నేను సమాధి స్థితిని చేరుకోవాలన్న తీవ్ర విశ్వసనీయ నిర్ణయంతో ఉన్నానా? ఆస్తినష్టం, కుటుంబ విషాదం-వంటి ఐహిక కారణాల వలన ఈ ప్రయత్నాన్ని విరమించనంత పటిష్ఠంగా నా ఇచ్ఛాశక్తి ఉందా?"

సమాధి కొరకు ప్రయత్నం చేసుకోవాలన్న నిర్ణయాన్ని అనుసరించి, అలాటి సక్రమ మయిన పరీక్షలతో మన అర్హతలను గురించి ప్రశ్నించుకొని సంతృప్తి చెందినట్లయితే; (మానవుడు ఆశించదగిన) అత్యున్నత ఆదర్శానికి గాను మనము సంసిద్ధమయినట్లే. ఈ జన్మలో ఎన్నో ఏళ్ల కష్టతరమయిన, శ్రద్ధావహమయిన ప్రయత్నం ద్వారా ఇంతచేసినా, మన ఆశయం నెరవేరడంలో వైఫల్యం కలిగితే కూడా నిరుత్సాహ పడనవసరంలేదు. మన ప్రయత్నం ఏదీ కూడా వృధా పోదు. (ఈ ప్రయత్న ఫలితం) అంతా మరుజన్మకు చేరి, అక్కడ నిలవ ఉంటుంది. కనుక అప్పుడు చేయవలసిన కృషితగ్గి, మన ధ్యేయం కోసం మనకు ఉండే భారం ఆ మేరకు తగ్గి పని సులువు అవుతుంది. అలా పరమోన్నతమయిన శాంతినీ "సమాధి" ఆనందాన్నీ పొందడానికి ఎన్నో జన్మల పరంపర పట్టవచ్చు. ఈ జన్మలోనే అట్టి స్థితిని సాధించిన ప్రతిఒక్కరి విషయంలోనూ వారు; కానరానంత సుదీర్ఘమయిన గొలుసువలె సాగిన పూర్వజన్మలలో ఈ పోరాటం సలిపి ఉన్నారని మనము తెలుసుకోవాలి. దానిని ఎవ్వరూ తప్పించుకోలేరు. దానిని ఒకానొక యథార్థమువలె స్వీకరించుకొని మనము ఆ బృహత్సాహసానికి సిద్ధం కావాలి.

దీనిని నేపథ్యంగా తీసుకుని మన (భగవద్గీత) అభ్యాసం కోసానికిగాను మరికొన్ని సహాయకారి సూచనలను గుర్తుపెట్టుకోవాలి. అయితే, ఈ సూచనలనన్నిటినీ మన వ్యక్తిగత అవసరాలకు, సామర్థ్యాలకు అనుగుణంగా అమర్చుకోవాలి.

1. మనము సాధన నిమిత్తం ఒకానొక నిర్మల, ప్రశాంత, ఏకాంత ప్రదేశాన్ని ఎన్నుకోవాలి. అది మన ఇంట్లో ఒక ప్రత్యేకమైన గది కావచ్చు, లేక; ఇంటి డాబా మీద ఒక మూల కావచ్చు. ఏదయినా సర్వజన ప్రవేశార్హమయిన (ఉద్యానవనం-ఆలయ)-ప్రాంగణంలో ఒక నీరవ స్థలం కావచ్చు. (సర్వజన ప్రవేశార్హ-అన్నాము కదా, అని రైల్వే ప్లాట్ఫారం వంటి శబ్దమయ స్థలాన్నిగానీ, అలాటిది ఇంకేదయినా గానీ పనికి రాదు. శబ్దం ఏకాగ్రతను భంగం చేయగల తీవ్రశత్రువు.)

2. నిశ్శబ్దానికి వలెనే చీకటి కూడా ఏకాగ్రతకు చాలా అనుకూలం. కనుక సాధన (యందు నిమగ్నతకు సాఫల్యం) కోసం వీలున్నంత వరకు ఉదయపూర్వ సంధ్యనుగాని, సాయంకాల అనంతర సంధ్యను గాని; ఎన్నుకోవడం మంచిది. ఇలా ఆలోచించగలిగితే అర్ధరాత్రికి కొంచెం ఇటూఅటూగా ఉండే సమయం కూడా చాలా అనుకూలమైనదే.

అయితే, దానిని ఒక అలవాటుగా కొనసాగించుకోవడానికి గాను ఆ వేళప్పుడు మెలకువగా కూర్చుని ఉండాలి. నిశీథి చాలా గొప్పది. అప్పుడు ధ్వని, కాంతి మనమీద పెత్తనం సాగించవు. మనం నిరాకులమైన ఏకాంతతతో మన సాధనను దీక్షగా నిర్వర్తించుకోవ డానికి సర్వ పరిసరాలను మనకు వదిలిపెడతాయి.

**(భగవానునియందు దృష్టి నిలుపగల) యోగి,**
**అన్ని జీవులకు రాత్రి యయినవేళ మేల్కొని ఉంటాడు.**
**జీవులన్నీ మేల్కొని ఉండేవేళ అది జ్ఞానికి రాత్రి**

-శ్రీమద్భగవద్గీత సాంఖ్య యోగము'69

అర్ధరాత్రి, తరువాతి వేళలు; ఎవరికయినా, ఏ పని చెయ్యడానికయినా అసౌఖ్యపు ఘడియలే; అందులో సందేహం లేదు. అయితే, ఈ పుస్తకంలో శారీరక క్రమశిక్షణ అనేపేర చెప్పుకున్న ప్రకరణంలో చేసిన సూచనలను పాటించగలిగితే, అలాంటి "వేళకాని వేళల్లో" లేచి కూర్చోవడానికి కూడా పెద్ద కష్టం కాదు. అందుచేత, కనీసం ఏకాగ్రతా సాధన కోసమయినా మన శరీరాన్ని (దానికి అవసరమయిన క్రమశిక్షణకోసం) కొంత ఇబ్బందికి గురిచేసి; అర్ధరాత్రిపూట కూడా చురుకుగా ఉండగలిగే విధంగా (శరీరానికి) శిక్షణ ఇవ్వాలి.

3. అభ్యాసం మొదలు పెట్టేటప్పుడు, మానసికంగా ఎంతో విశ్రాంతిగా ఉండాలి. అది చాలా అవసరం. అలసిన శరీరం, కార్యవిముఖమయిన మనసు-ఎట్టి సాధనకూ విముఖంగా ఉంటాయి.

(i) మనసును సర్వదా, సర్వసాధారణంగా; శాంతితో, విశ్రాంతితో ఉంచేవి రెండు : అద్వైత సిద్ధాంతంలో నమ్మకం, (అనగా అన్ని వ్యక్తియాత్మలు ప్రాథమికంగా ఒకటేనన్న నమ్మకం) పటిష్ఠమైన మూలాలతో ఏర్పడిన నిష్కామత్వం. అందుచేత, కనీసం మనం ఏకాగ్రత సాధించుకోవడంలో సహాయపడడానికి ఈ రెండు లక్షణాలను అలవరచు కోవాలి.

( ) అలాంటి ప్రశాంతత కలగాలంటే, నిశ్చలంగా కళ్లుమూసుకుని పరుండి, ఏదయినా ఒక సుందర దృశ్యాన్ని ఊహలో నిలుపుకోవాలి. ఆ సుందర దృశ్యాలు పలురకాలు. సువిశాల సముద్రతీరం వద్ద సంభవించే సూర్యోదయం, సుదీర్ఘంగా పరచుకొని ఉన్న హరిత వర్ణపు పొలాల వరుసలు, ముగ్ధమనోహరగాంభీర్యాన్ని సంతరించుకున్న పర్వత శిఖరాలు-ఇలాంటివి. లేదా, మనము గాలిలో తేలిపోతున్నట్లో, మహిమాన్వితుడయిన దేవుడి సమక్షంలోనిలిచి ఉన్నామనో తలచుకోవచ్చు. మనం ఊహించుకొనేది, ఆహ్లాద కరంగా, వింతగా ఉండాలి. అప్పుడు మనసు అద్భుత మయిన రీతిలో ప్రశాంత పడుతుంది.

(ii) కొన్నిసార్లు ప్రాణాయామం చేసి, కొంతసేపు శవాసనంలో పరుండాలి. (ప్రాణాయామం, శవాసనం-ల గురించి (చూ పుట 155 156)) ఆలోచనా శ్రమతో

బిగుసుకున్న మనస్సంబంధమయిన నరాలను పరిపూర్ణ సౌలభ్యానికీ శాంతికీ పునరుద్ధరించేటందుకు- ఈ ప్రాణాయామ శవాసన ప్రక్రియ చాలా బాగా పనిచేస్తుంది. ప్రాణాయామంవల్ల మనసు నిశ్చలంగా ఒకేవిషయం మీద నిలుస్తుంది. శవాసనం శరీరానికి ఉపశమనం కలిగించి, మనసుకి శాంతిని తెచ్చిపెడుతుంది.

ఏకాగ్రతా సాధనకోసం ప్రత్యేకంగా కూర్చునేటప్పుడే కాక; మనసునూ, శరీరాన్నీ ఆరోగ్యంగా ఉంచి, ఏకాగ్రతా సాధనకు రంగం సిద్ధం చేయడానికి కూడా ఈ రెండు యోగాభ్యాసాలూ క్రమం తప్పకుండా చేసుకుంటే మంచిదని ఈ సందర్భంలో చెప్పుకోవచ్చు.

4. అలా మనసును ప్రశాంత పరచుకున్న తరువాత:

(i) మడత పెట్టిన గుడ్డ, మెత్తటి చాప, తివాసీ- వీటిలో ఏదో ఒకదానిమీద; లేక, వట్టినేల మీద మరం వేసుకుని కూర్చోవాలి. వెన్నుపూస చివర నుండి మెడద్వారా తల వరకు ఉన్న శరీర భాగాన్ని ఏ వంకరా లేకుండా నిటారుగా చేసుకుని, సాధన యావత్ సమయం అలా ఉంచాలి. (ఇలా చెయ్యడం వల్ల) కొత్తలో కొంచెం శ్రమ, నడుం నెప్పి- అనిపించవచ్చు. కాని రాను రాను అభ్యాసం వల్ల అవన్నీ పోతాయి. అయితే, తల, మెడ, నడుం: నిటారుగా ఉంచే ఈ ఒక్క పద్ధతి ఉత్తరోత్రా ఏకాగ్రతకి తగినంతగా తోడ్పడుతుంది.

(i) ఇప్పుడు కళ్లు మూసుకోవాలి. కొద్దిపాటి దూదిగాని, మరేదయినా గాని ఉపయోగించి చెవులు కూడా మూసుకోవాలి.

కన్ను చాలా పెంకిది. ఏకాగ్రతని చెరచగలది. తన ఎదురుగా కదలాడే అఖండ వస్తు దృశ్యసముదాయం మీదికి మనసును ప్రబలంగా లాగుతుంది. అలాగే మనము విననవసరం లేని ధ్వని, చప్పుడు: ఏకాగ్రతకి వెలుతురంతటి అవరోధాలే. కనుక, దృష్టి- వినికిడి-అనే ఈ రెండిటికోసం ఉన్న అవయవాల వలన కలిగే ఆటంకాల నుండి మనసును రక్షించుకోవాలి.

5. (అలా మనసు, శరీరం కుదుట పడ్డాక) మనం అభ్యసించ ప్రారంభిస్తున్న ఏకాగ్రత లేక సమాధి (ఆనందమయ) స్థితులకు మనలను ప్రోదిచేసిన మన ఇష్ట దైవాన్ని గానీ, గురువును గానీ ఉద్దేశించి, ప్రార్థన చేయాలి. మన ఈ ప్రయత్నంలో సహాయపడ వలసినదిగా అర్థిస్తూ, మన మహర్షుల, మహాయోగుల (అగోచర ఆత్మల) దీవెనలకోసం ప్రార్థన చేయాలి.

మన ప్రార్థనలను స్వీకరిస్తున్న దైవిక-ఆధ్యాత్మిక శక్తులు, మనకు వాటి నుండి రావలసిన అనుగుణమైనంతటి అనుకూల శక్తులను ప్రసాదిస్తాయని మనము లోగడ చెప్పుకున్నాం. అందువలన, ప్రార్థన అనేది మన అభ్యాస మార్గంలో అవసరమైనదిగా, సహాయకారిగా పరిగణించవలసిన ప్రథమ పాదం. ఆ ప్రయోజనాన్ని అందుకోగల వారిని ఆధ్యాత్మికతా సోపాన పంక్తికి ప్రథమ ద్వారంగా నిలిపేది ప్రార్థన.

6. అప్పుడు మన ఇష్టదైవం విగ్రహాన్నిగాని, చిత్రపటాన్ని గాని ఊహాలోకి తెచ్చుకుని, అది మన హృదయ ఫలకంలో-లేక-మన రెండు కనుబొమల మధ్య: ప్రతిష్ఠితమై ఉందన్న భావానికి రావాలి. ఆ స్వరూపం మీద ఏకాగ్ర దృష్టి నిలుపుకొని మనసును దానిపై లగ్నం చేసుకోవడానికి ప్రయత్నించాలి.

కాని, మనసు కోతివంటిది. అది ఎక్కడి నుండి ఎక్కడికి గంతులు వేస్తుందో చెప్పడం అసాధ్యం. ఈ క్షణాన ఐక్యరాజ్య సమితికి సంబంధించిన ఒక ఉన్నత రాజకీయ భావం మీద వాలితే, మరుక్షణం మన పడక గదిలో దోమల బెడద మీదికి దూకుతుంది. అలా మనసు దూకుతున్న సంగతి గ్రహింపుకి వచ్చిన మరుక్షణం ఆలోచనలను వెనుకకు లాగుకొని మనము ప్రతిష్ఠించుకున్న విగ్రహం (లేక చిత్రపటం) మీదికి తెచ్చుకుని "ఈసారి ఈ మనసుని పక్కదారి పట్టనివ్వను"- అని దృఢ నిశ్చయానికి రావాలి.

అయినాసరే, తన సహజ చాంచల్య ప్రవృత్తికి లోబడి మనసు మరు నిముషంలోనే మరొక అసంబద్ధమైన-నిషిద్ధమైన రంగంలో పచార్లు చేస్తుంది. అది కూరగాయల అంగళ్ల మీదికి కావచ్చు, లేదా; స్థానిక కర్మాగారంలో కార్మికుల సమ్మెమీదికి కావచ్చు- దూకుతూ ఉండడమే దాని పని. అందుచేత, మళ్లీ మనం దానిని (మనం ప్రతిష్ఠించుకున్న) విగ్రహం మీదికి, లేదా; చిత్రపటం మీదికి-మరింత దృఢమైన, పునరుజ్జీవమైన నిర్ణయంతో వెనక్కు తెచ్చి "ఇక ఈ తిరుగుబోతు తనాన్ని ఎంతమాత్రం సహించేది లేదు"- అని-మానసిక క్రమశిక్షణ అనేపేర చర్చించుకున్న ప్రకరణంలో సూత్రాలను అభ్యసిస్తూ, మనసును అదుపులో పెట్టాలి.

ఇదంతా చాలా విసుగు పుట్టించే పని అనిపించవచ్చు. కాని, మనసు లోనయ్యే అన్ని నిరుపయోగమైన పక్కదారులు మూసేసి, మనం ప్రతిష్ఠించుకున్న విగ్రహం మీదికే (లేదా చిత్రపటం మీదికే) తిరిగి చేరే విషయంలో పూర్తిగా విజయం కలిగే వరకు ఎన్నిసార్లు అవసరం వస్తే అన్నిసార్లూ కూడా ఈ అభ్యాసం చేస్తూ ఉండవలసిందే.

సాధనకు సంబంధించినంత వరకు అసలైన ప్రధమ సోపానం ఇదే.

7. అవడానికి ఇది ప్రధమ సోపానమే గాని, అది కొంత ఉన్నత స్థాయికి చెందినదే. దానిని చేరుకోవడానికి కొన్ని వారాలు పట్టవచ్చు, కొన్ని నెలలు పట్టినా పట్టవచ్చు. కానీ, తప్పదు. అలా జరగవలసిందే.

మనసును అసంబద్ధమైన, నిషిద్ధమైన విషయాలమీది నుంచి పూర్తిగా మళ్లించి దానిని (మనం ప్రతిష్ఠించుకున్న) విగ్రహం మీద-లేక, చిత్రపటం మీద-నిలుపు కోవడం సాధ్యం చేసుకుని మనసు మీద అదుపు పొందిన తరువాతి స్థితిలో; ఆ(మానసిక సృజిత) విగ్రహపు- లేదా చిత్రపటపు - పరిమాణాన్ని సాధ్యమయినంతగా సూక్ష్మీకరించుకోవాలి. ఆ విగ్రహాన్ని (పటాన్ని) రోజురోజుకీ క్రమంగా చిన్నదిగా, ఇంకా చిన్నదిగా మనసులో నిలుపుకుంటూనే, దానిమీద మనసు ఏకాగ్రంగా లగ్నమై ఉండాలన్న ముఖ్యధ్యేయాన్ని మరువక ఉండాలి.

ఈ పద్ధతిలో సాధన చేసి, విగ్రహాన్ని ఎంతగా సూక్ష్మీకరించుకోగలిగితే ఏకాగ్రత అంత ఘనమైనదిగా రూపొందుతుంది.

ఈ సూక్ష్మీకరణ ప్రక్రియను అలా కొనసాగించుకుంటూ పోవాలి. ఎంతవరకు, అంటే : మనం మనసులో ప్రతిష్ఠించుకున్న విగ్రహం (పటం) సూక్ష్మాతి సూక్ష్మంగా పరిణామం చెంది అందులో ఉండిన కళ్లు, చెవులు, నోరు-వంటి వివిధ అవయవాల ఆకారాలు గుర్తించలేనంత చిన్నవైపోయి అసలు విగ్రహం అంతా ఒక (మిరియం అంత) చిన్న పదార్థం అయిపోయేటంత వరకు. అప్పుడు దానిని, మన మానసిక వీక్షణతో; సుదూరాన ఉన్న ఒక నక్షత్రం వలె, సూర్యుని వలె కానగల ఒకానొక కాంతిపుంజంగా; స్వీకరించి, అందులోనే మన ఇష్టదైవపు సర్వాంగాలు నిబిడీకృతమై ఉన్నాయని గ్రహించాలి. మనసులో నెలకొన్న ఈ ప్రకాశవంతమైన కాంతిపుంజమే అన్ని హంగులతో మనము మనసులో ప్రతిష్ఠించుకున్న విగ్రహం (చిత్రపటం).

నిజానికి ఇదంతా కేవలం ఒక భావన మాత్రమే. కాని, ఏకాగ్రతా సాధన అనే అభ్యాసానికి ప్రాణం ఈ భావనే.

8. ఈ భావనను మరింత పరిపుష్టం చేసుకుంటే, ఆ కాంతి పుంజం మనం ప్రతిష్ఠించుకున్న విగ్రహానికి కాక, ఆ విగ్రహంలో ఉద్దేశించిన మన ఇష్టదైవం, తన ముఖ్యమైన లక్షణాలన్నిటితోను అక్కడ వెలసి ఉన్న ప్రతీక-అని గ్రహించగలుగుతాము. అనగా, మనం ఊహించుకొన్నది శ్రీరామ విగ్రహం అయితే, ఆ కాంతి పుంజం ఆయన ముఖ్య గుణమైన 'ధర్మానికి' ప్రతీక; కృష్ణుడిదయితే 'జ్ఞానానికి' ప్రతీక. నిదానించి విశ్లేషించుకుంటే ఏ శరీరానికైనా (ఏ విగ్రహానికైనా) ప్రాణం గుణమే తప్ప ఆకారం కాదని; ఆరాధించదలచిన రూపాలకు ప్రతీకలుంటాయని, తెలుస్తుంది.

సువాసనను పుష్పం నుండి, రుచిని పండ్లనుండి - వేరుచేసి భావించడం సులువుకాదు. పదార్థం పాత్రానుగతమే తప్ప వేరు కాదు. మన మందరము మన గుణాలను (మన లక్షణాలను) మన శరీరాల ద్వారా తప్ప విడిగా ప్రదర్శించలేము. కాని, ఇక్కడ ప్రధానమైనది ఊహ. కనుక, (ఆ ప్రకాశవంతమైన కాంతి పుంజం ద్వారా) పదార్థాన్ని (అనగా సర్వాంగ శోభిత దైవాన్ని) పాత్ర (విగ్రహం) లేకుండా ఊహలో నిలుపుకోగలుగు తాము. ఆ అమూర్త పదార్థం ఆకార స్వభావాలు ఇవి - అని కొంతకాలం వరకు సరిగా నిర్ధారించుకోలేకపోయినా, ఆ ప్రకాశవంతమైన కాంతి పుంజాన్ని మనసులో నిలుపుకుంటే ఆ కాంతి పుంజంలోనే మనం ఏకాగ్రతను నిలుపుకోవలసిన అనిర్వచనీయ ఆత్మ స్వరూపం నిబిడీకృతమై ఉందని అనుకోగలుగుతాము.

కష్టమే, దారి ఎలాగా - అని తడుము కుంటూ వెళ్లవలసిందే. కాని, ఆ అభ్యాసమే మన ప్రయత్నం సఫలమయ్యే మార్గాన్ని అడుగడుగునా చూపిస్తుంది.

ఆ కాంతి పుంజం మనం ఊహలో నిలుపుకొనే దైవస్వభావం - అని భావించుకుని, (ఏకాగ్రతకు గాను మనం చేసుకునే) ఆ ప్రయత్నంలో స్థిరపడే వరకు; ఆ కాంతి పుంజం ప్రతీకగా ఉన్న అమూర్త పదార్థంపై మనసును కేంద్రీకరించుకోవాలి.

9. మానవమేధ పరిమితం. దానికి గ్రాహ్యమైనంత వరకు దైవానికి ప్రేమ, న్యాయం, ధర్మం- వంటి లక్షణాలు ఉన్నాయని నిర్వచించగలదు. కాని, పరమాత్మ అంటే దైవాలకే దైవం. దానితో ఐక్యతే జీవాత్మ (వ్యక్తియాత్మ)కు మోక్షం. అట్టి పరమాత్మ స్వరూప స్వభావాలు మానవమేధకు ఎన్నటికీ అగ్రాహ్యాలే, అనిర్వచనీయాలే. అనంత శక్తి పరిమాణ తేజాత్మకమయిన విశ్వాత్మ అగ్రాహ్య అనిర్వచనీయ, సర్వవ్యాపిత, సర్వ ప్రాణాధారము. దానిని మనము మన శక్తిని అనుసరించి, ఒక కాంతి పుంజముగా ఊహించుకోగలిగాము. మన అభ్యాసంలో సంఘటించే తరువాతి స్థితిలో, మన ఊహను విస్తరించుకుని, ఆ కాంతి పుంజపు స్వభావలక్షణాలకు అనుగుణమయిన ఒకానొక శూన్యతను, రిక్తతను పునర్భావనకు తెచ్చుకోవాలి. ఎందుకంటే, అనిర్వచనీయమయిన దానిని (అనగా శూన్యతను) ఒకానొక ఊహాసంక్రమిత భావం (కాంతిపుంజం) ద్వారా నిర్వచించడం దానికదే ఆశయ స్వయం భంగ ప్రక్రియ. కనుక, ఏకాగ్రత (ధ్యాన) సాధనలో ఈ స్థితి తరువాత; మన గ్రాహ్య-నిర్వచన శక్తులకు అతీతమయిన, స్థితి-జ్ఞాన-ఆనంద (సత్-చిత్-ఆనంద) శాశ్వతత్వానికి స్థానమిస్తూ; మన గ్రాహ్య-నిర్వచన శక్తులచేత ఏర్పరచుకొన్న కాంతిపుంజం క్రమంగా తప్పుకోవాలి.

శాశ్వతత్వాన్ని ప్రతీకాత్మకం చేయడం అసంగత అభ్యాసం. హద్దులు లేనిదానికి హద్దులను నిర్ధారించడం స్వవచన వ్యాఘాతం. ఆ ప్రతీకను సూచించడానికి చాలినంత వచోసామర్థ్యం అలభ్యం. అట్టి ప్రతీకను గ్రహించడానికి మానవ ఊహ అశక్తం. అది సైద్ధాంతిక పద్ధతులకు లొంగనిది. అనంత పరిమాణాలతో, లక్షణాలతో విలసిల్లే భగవానుని రూపాన్ని, మనకుగా మనం స్థిరపరచుకొని, ఆ రూపం పట్ల ఏకాగ్రతను నిలుపుకోవడానికి గాను, మహా అయితే, ఆ రూపం- (ఏదో) ఈ విధంగా ఉండవచ్చు-నని, తన పరిమిత(జ్ఞాన) పరిధులను అనుసరించి, కొన్ని సారూప్యతలను తెచ్చుకోవచ్చును. అట్టి సారూప్యతలు ఆధారంగా కొన్ని మార్గదర్శక సూత్రాలు ఉన్నాయన్న సాకుతో, (ఆ భగవానుని అన్వేషణలో) మనకు తెలియని జగజగాల చీకటులలో అడుగడుగునకు తడుముకుంటూ సాగవలసి ఉంది. (ఆ మార్గం అంధకార బంధుర మయినప్పటికీ) మనము వేసే ప్రతి అడుగు, తరువాతి అడుగును దృష్టిలోకి తెస్తుంది. అలా సాగిసాగి, మన అంతిమ ధ్యేయం-శాశ్వతానందం, పరిపూర్ణ ఏకాగ్రత: నిర్వికల్ప సమాధి-కి చేరుకుంటాము. మన అభ్యాసమే మనకు మార్గదర్శకమయి, గురువయి నిలుస్తుంది.

అనిర్వచనీయములు, అనంతములు అయిన (పరమార్థ) విషయాలపై ఏకాగ్రత సాధించడానికి గాను, గ్రాహ్యములు, పరిమిత పరిధులలోనివి- అయిన సారూప్యాలు కొన్నిటితో ప్రారంభించి (అట్టి ఏకాగ్రతను) మెరుగు పరచుకుంటూ పోవాలి.

( ) భగవానుడి అనంతత్వానికి చిహ్నంగా నిలిచే అనంత, అపరిమిత ఆకాశాన్ని దృష్టిలోకి తెచ్చుకుని, దానిపైన ఏకాగ్రత వహించవచ్చు.

(i) మనలో చాలమందికి మాతృప్రేమ అనుభవానికీ ఊహకూ రాగలదు. కాని, దానిని సరిగ్గా నిర్వచించమంటే చేతగాదు. అలాగే, భగవానుని అ-వ్యక్త సాధ్యమైన తేజస్సును ఊహలో నిలుపుకొని దానిని భక్తితో అనుష్ఠించవచ్చు.

(i) ఈనాడు కూడా, కొందరు మహాయోగులు; కేవలం తమ అభీష్ట, ఆధ్యాత్మిక శక్తులచేత; దిగ్భ్రాంతికరమయిన అద్భుతాలను నెరవేర్చడం మనం చూస్తూనే ఉన్నాం. వారు అవి ఎలా చేస్తున్నారో మనకి అర్థం కాదు. కాని, వాటిని మనం నమ్ముతాం. ఇది కూడా అలాంటిదే అనుకున్నా; మనకు అర్థంకాని మానవాతీత మహత్త్వం ఏదో ఒకటి ఉందని భావించాలి. మన ఎరుకలోకి రాని అలాంటి మహత్త్వం (ఏదో ఒకటి ఉందని తలపోసి, దాని) మీద ఏకాగ్రత నిలుపుకోవచ్చు.

ఇలా ఏదో ఒక పద్ధతిని అనుసరించి, అన్వేషించుకుంటూ పోతే; క్రమంగా మనకు (ఆ) కాంతి ప్రాప్తిస్తుంది.

సాధ్యమయితే, యోగ్యుడయిన ఒక గురువు నుండి దీక్షను స్వీకరించాలి. అప్పుడు మనం, మన గమ్యాన్ని సత్వరంగా, సౌఖ్యంగా చేరడానికి సహాయపడే విధంగా మార్గాన్ని సంక్షిప్తం చేసేందుకు అవసరమయిన ఆధ్యాత్మిక ప్రేరణలను మనకు తెలియకుండానే పొందుతాము.

మనము మానసికంగా సృజించుకొన్నది అయిన అట్టి భగవత్ చింతనా పూర్వకమైన శూన్యతను మన కనుబొమలయందు, లేదా; హృదయమునందు (నింపుకొని) నిలుపుకోవడానికి గాను చేసే కఠోర అభ్యాసం కొన్ని నెలల సుదీర్ఘకాలం సాగవచ్చు. కాని, ఆ ఏకాగ్రత సాధనలో ఏదో ఒక స్థితిలో రెండు మూడు గంటల పాటు నిర్విరామంగానూ, చిన్నపాటి అలజడి కూడా కలత చెందించకుండానూ, శ్రద్ధను నిలపగలిగితే; ఆస్థితిలో బాగా స్థిరపడినట్లు చెప్పుకోవచ్చును. అలా మరింతగా అభ్యాసం చేసుకుంటూ, ఆ స్థితి నుండి పతనం కాకుండా రక్షించుకోగల స్థైర్యాన్ని పొందినట్లయితే: మిక్కిలి మహిమాన్వితం, అనుభూతి మయం; ఈ అభ్యాసానికి అంతిమ ధ్యేయం - అయిన నిర్వికల్పసమాధి స్థితిని చేరడానికి అర్హత పొందినట్లే.

10. ఈ స్థితిలో మనసు నిర్వహించే పాత్రలో మూడు ముఖ్య విషయాలను గుర్తుంచుకోవాలి.

(i) దాని శక్తి ఇంచుమించుగా అవధీరహితం.

(ii) అది భౌతికానికి, ఆధ్యాత్మికతకి మధ్యఉన్న మార్గం.

(iii) భావించే వానిని అది (ఆ) భావంగా మారుస్తుంది.

**యద్భావం తద్భవతి.**

అట్టి ఏకాగ్రతా చరమస్థితిలో, మనసుకు సంబంధించిన ఈ మూడు ముఖ్యాంశాలూ ప్రముఖ పాత్రలను వహిస్తాయి; ముఖ్యంగా మూడవది. అది మనలను గమ్యానికి తీసుకుపోవడంతో సరిపెట్టుకోదు. మన లక్ష్యంతో మనలను ఐక్యం చేస్తుంది.

ఈ భౌతిక ప్రపంచంలో సాధ్యపడాలేగానీ; ఏకాగ్రత యందు స్థితములైన ఈ వివిధ స్థాయిల క్రమాన్ని కార్యాచరణమునందు గల వివిధ దశలతో సరిపోల్చవచ్చు:

(i) మొదట చెఱకుగడ నుండి తీపిని పిండుతాము.

(i ) చెఱకు అనేది లేకుండా చక్కెర వస్తున్నది.

( ii) చక్కెర అనేది లేకుండా తీపిని ఆస్వాదిస్తాము.

(iv) చివరికి మనమే తీపిగా అవుతాము.

ఈ భౌతిక ప్రపంచంలో కార్యాచరణక్రమం సరిగ్గా ఇలాగే సాధ్యంకాకపోవచ్చు. కాని, ఆధ్యాత్మిక తలంలో మాత్రం ఖచ్చితంగా సాధ్యపడుతుంది.

ఇంతకుముందు ఉన్నస్థితిలో మనము; అనంత, అపరిమిత, శూన్య అంతరిక్షం-పరమాత్మ (పరబ్రహ్మ) సమానమని భావించుకొని, దానిపైన ఏకాగ్రతను నిలుపుకున్నాముకదా!

ఇప్పుడు, ఈ స్థితిలో మనమే పరబ్రహ్మ- అని తలచి ఆ భావంపైన ఏకాగ్రత నిలుపవలసి ఉంది. ఇంతకుముందు మన ధ్యానంలో ఒక శూన్యత (రిక్తత) ఉండెను. ఇప్పుడు ఈ స్థాయికి వచ్చాక ఆశూన్యత, భగవానుని భావాతీత లక్షణాలయిన స్థితి-జ్ఞాన-ఆనందములతో (సత్-చిత్-ఆనందముతో) సరిపోల్చదగిన సంపూర్ణ చంద్ర బింబంతో, వెన్నెలతో నిండి ఉంది-అని భావించాలి. "అహం బ్రహ్మాస్మి" (నేనే బ్రహ్మమును), "సోఽహమ్" (అతడే నేను); అని తలచి ఆ భావంమీద ఏకాగ్రత నిలపాలి.

అప్పుడు మనమే పరబ్రహ్మము అవుతాము. ఈ జన్మకు నిబంధితమైన కాల పరిమితిలో మిగిలిఉన్న భాగం ఈ భూమిమీద, దానియందు మన శరీరంతో సహా నిబిడీకృతమై ఉన్న భౌతిక అద్భుతాల, ఆకర్షణల మధ్య జీవించవలసి ఉన్నా, అవన్నీ మనకు అసంగత విషయాలయిపోతాయి. ఇక్కడే, ఈ భూమిమీదే, ఈ శరీరంలోనే; ముక్తి ప్రాప్తిస్తుంది. మరుజన్మ ఉండదు.

**అదే**

**మనకుగాని**

**మనవంటి ఏ ఇతర సాధకునికి గాని**

**కలుగగల వైభవము.**

**ఓం; శాంతిః శాంతిః శాంతిః**

★

# అనుబంధం

## ప్రాణాయామము

ప్రాణాయామం అనేది ఒక యోగాభ్యాసం. దానిని నిర్వహించే పద్ధతి ఏమిటి, దానివల్ల ప్రయోజనాలు ఏమిటి- అనే సంగతులు వివరంగా తెలుసుకోవాలంటే, యోగాభ్యాసాలను గురించి వ్రాసిఉన్న అనేక పుస్తకాలలో ఏదో ఒకదానిని పరిశీలించుకోవచ్చు అయితే, మనము భగవద్గీత అనుష్ఠానంలో ఉన్నాము. ఈ సందర్భంగా ప్రాణాయామమునకు సంబంధించిన వివరాలు కొన్నిటిని సంగ్రహంగా చెప్పుకోవలసి ఉంది.

ప్రాణాయామం అభ్యసిస్తే, ఆరోగ్యం మెరుగు పడడమే కాకుండా, మనసును ఏకాగ్రతలో మరింతగా స్థిరపరచడానికి తోడ్పడుతుంది.

ప్రాణాయామం ఎలా అభ్యసించాలి- అనే విషయంలో కొన్ని సూచనలు:

బాగా గాలీ, వెలుతురూ తగిలే, పొడిగా ఉండే- గదిలో గాని, ఆ లక్షణాలు ఉన్న ఇంకొక చోటగాని; "పద్మాసనం"లో గాని మనకు సౌఖ్యంగా ఉన్న ఇంకేదయినా స్థితిలో గాని కూర్చోవాలి.

ముక్కు రంధ్రాలలో కుడిదానిని కుడిచేతి బొటన వ్రేలితో మూసుకోవాలి. ఎడమరంధ్రం ద్వారా నెమ్మదిగా గాలి పీల్చుకోవాలి. కొంతసేపు గడిచాక ఎడమరంధ్రాన్ని (కూడా) కుడిచేతి ఉంగరపు వేలు, చిటికెనవేలు అడ్డంపెట్టి, మూసేసుకోవాలి. లోపలికి కొంతగాలి వెళ్లిందికదా, అది బయటికి రాకుండా సాధ్యమయినంత ఎక్కువసేపు (సౌఖ్యం చూసుకుంటూనే) ఉంచాలి. అప్పుడు కుడి రంధ్రాన్ని మూసిన బొటన వ్రేలిని తప్పించి వీలున్నంత నెమ్మదిగా గాలిని బయటికి వదలాలి.

ఆ తరువాత కుడిరంధ్రం ద్వారా నెమ్మదిగా గాలి లోపలికి పీల్చాలి. తగినంత పీల్చాక ఆ రంధ్రాన్ని (మళ్లీ) బొటన వ్రేలితోనే మూయ్యాలి. లోపల ఉన్న గాలిని ఇంతకు ముందులాగే (ఎక్కువ కష్టపడకుండా) నిలబెట్టుకోవాలి. తగినంత సేపు నిలబెట్టాక, ఎడమ రంధ్రాన్ని మూసి ఉంచిన రెండు వేళ్లనీ తప్పించి గాలిని వీలున్నంత నెమ్మదిగా బయటికి వదలాలి.

... ... ఇదంతా కలిపి ఒక ప్రాణాయామం.

గాలిని లోపలికి పీల్చుకోవడాన్ని 'పూరకము' అంటారు, గాలిని లోపల ఉంచు కోవడాన్ని 'కుంభకము' అంటారు, విడిచిపెట్టడాన్ని 'రేచకము' అంటారు. ఈ "పూరక- కుంభక- రేచకాలు" ఎంతెంతసేపు సాగాలి- అనే దానిని గురించి ఒక ఉరమరిక అయిన నిష్పత్తి నిర్ధారితమై ఉంది. అది ఎలాగంటేను: పూరకము-1, కుంభకం-4, రేచకం-2: అని ఆ నిష్పత్తి. మొదట్లో కొంచెం అటూ ఇటూ అయినా, క్రమంగా ఆ నిష్పత్తికి అలవాటు పడగలుగుతాము. పూరకం మొదట్లో ఒక్క సెకండు అనుకుంటే, కుంభక-రేచకాలు 4,2: అవుతాయి. అభ్యాసం సాగగా, సాగగా- పూరకం వ్యవధిని 16 సెకండ్ల వరకు పెంచుకో గలుగుతాము. అనగా గాలిని లోపల ఉంచే సమయం 64 సెకండ్లకు, గాలిని బయటకి వదిలే సమయం 32 సెకండ్ల వరకు సాగించగలుగుతాము. ఇలా 16,64,32- చొప్పున ప్రాణాయామాలు ప్రతిరోజూ 5,15,20 సార్లు చేసుకోవచ్చును.

(గాలిని ఊపిరితిత్తులలో బంధించి ఉంచడాన్ని "అంతఃకుంభకము" అనీ, గాలిని ఊపిరితిత్తులనుండి బయటికి విడిచిపెట్టడాన్ని "బాహ్యకుంభకము" అనీ అంటారు.) ★

## శవాసనము

పద్ధతిగా అభ్యసించాలేగాని శవాసనము- అనే యోగాభ్యాసం చాలా ఉత్కృష్టమైనది. మనిషి దైహికంగా గాని, మానసికంగా గాని (రెండు విధాలాగాని) అలసి ఉన్నట్లయితే, మళ్లీ తాజా స్థితికి, శక్తి మంతనానికి తీసుకురాగలది శవాసనము. ఈ అభ్యాసం మనిషికి గొప్ప ఆనందాన్ని, మనశ్శాంతిని ప్రసాదించగలది.

శవాసనం అభ్యసించే పద్ధతి చెప్పుకుంటే సులువే. సమతలంగా ఉన్న నేలమీద ఒక మెత్తటి కంబళిగాని, మడతపెట్టిన దుప్పటిగాని పరుచుకొని, దానిమీద వెల్లకిలా, హాయిగా (బిగుసుకోకుండా) పరుండాలి. కాళ్ల రెండూ కలిపి మడమలు కలిసి ఉండేటట్లు, బొటన వేళ్ల దూరదూరంగా ఉండేటట్లు చూసుకోవాలి.

కళ్ల రెండూ (సునాయాసంగా, పూర్తిగా) మూసుకోవాలి. (చేతులు రెండింటినీ జానువుల వైపుగా, మండలను నేలవైపునకు ఉంచి; అరచేతులను తెరిచి ఉంచాలి.) జీవనాన్ని గురించిన అన్నిరకాల ఆలోచనలను, పథకాలను విడనాడాలి. మనసును, నరాలను యావత్ శరీరాన్ని సడలించి ఉంచాలి. "ఈ శరీరము నాదికాదు. నేను గాలిలో తేలుతూ ఉన్నాను." అనే ధోరణిలో ఆలోచన సాగాలి. ఆ పరిస్థితిలో ఉన్నప్పుడు ఎవరయినా మన చేతిని ఒక దానిని పైకెత్తి వదిలేస్తే అది, దానిమీద మన అదుపు ఏమీ లేని విధంగా ఒకేపాటుగా పడిపోవాలి. శరీరాన్ని సడలించుకున్నాము- అని చెప్పుకోవ డానికి ఇది ఒక ఋజువు. అలా సడలించుకోవడమనేది పరిపూర్ణంగా అమలయితే అది శవాసనము.

శరీరాన్నీ, మనసునూ ఎంతటి శ్రద్ధతో సడలించుకోగలుగుతామో అంతటి విజయం ఈ ఆసనానికి సమకూరుతుంది. ఈ ఆసనాన్ని ప్రతిదినం (ఉదయం, సాయంకాలం- ఎప్పుడు అలసిఉంటే అప్పుడు) అయిదేసి నిముషాలపాటు అభ్యసించుకోవచ్చు. ★

## రెండవ పుస్తకము

# ప్రణవీయము

# అంకితం

అత్యంత గౌరవాస్పదం, ప్రేమాస్పదం అయిన

నా జననీ జనకుల స్మృతికి



శ్రీ నందూరి సుందరరామయ్య గారు



శ్రీమతి నందూరి లక్ష్మీనరసమ్మ గారు

# ప్రణవాక్షర (ॐ) సంకేత వివరం

వాక్కునందు ప్రణవాక్షరమును నేనె.

-శ్రీమద్భగవద్గీత విభూతియోగము: 25

'ఓం' అనే ఏకాక్షరాన్ని (నన్ను ఉద్దేశించి) ఉచ్చరించుచూ,
భావించుచూ పురోగమించి దేహమును త్యజించువాడు
పరమోన్నతమైన మార్గమునందు సాగును.

-శ్రీమద్భగవద్గీత, అక్షరపరబ్రహ్మయోగము: 13

(ఎల్లరు) తెలియవలసిన పవిత్ర (ఓంకార) స్వరూపుడను నేనె.
అధికార వాక్కును నేనె.

-శ్రీమద్భగవద్గీత, రాజవిద్యారాజగుహ్యయోగము: 17

**ఈ పుస్తకం చివరి అట్టమీద ఉన్న**
**ఓంకారపు చిత్తరువుకు అనుగుణమైన వివరణ**

మధ్యభాగంలో ప్రస్ఫుటంగా ఉన్న అక్షరం (ఓం) గుణాతీతుడగు పరమాత్మకు సంకేతం. (**ఓ మిత్యేకాక్షరం బ్రహ్మ.**) దాని చుట్టూ సమకేంద్రపు దీర్ఘవృత్తంలోని చోట్లు ఆధ్యాత్మిక జ్ఞాన సంపన్నుని భావనలో గల విశ్వపరిరూపం. ॐ (అనే అక్షరాన్ని తనలో ఇముడ్చుకున్న) వెలుపలి (అండాకార) కాంచన వర్ణ (దీర్ఘ) వృత్తము సగుణ బ్రహ్మమునకు సంకేతము. దాని చుట్టూ కొంతమేర ఆకాశవర్ణంగా వ్యాపించి క్రమంగా చిత్తరువు అంచుల వరకు దట్టమైన నీలిరంగుకి విపరిణామం చెందడం నిర్గుణ బ్రహ్మమునకు సంకేతము. చిత్తరువు అంచులు మన ఊహను- అనగా, కాల, స్థల పరిమాణాలయందు- పరిమితం చేయగలవు గాని, విశ్వ వ్యవస్థయందు అట్టి పరిమితులు ఉండవు. అది అనంతం.

పరమాత్ముడు భక్తి, వైరాగ్య, జ్ఞానములనే మూడు మహనీయగుణాలను పాఠకులకు ప్రసాదించుగాక!

"ప్రణవీయము" అనేది "అనుష్ఠాన భగవద్గీత"కు సైద్ధాంతిక అనుయాయి గ్రంథం. జీవాత్మ (వ్యక్తియాత్మ)- పరమాత్మల ప్రధాన లక్షణాలను, వాటి పరస్పర సంబంధాన్ని; జీవాత్మ, పరమాత్మతో ఐక్యం కాగలస్థితిని వివరించే గ్రంథం ఇది.

★

# విషయ సూచిక


పీఠిక. . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . 163

మొదటి ప్రకరణము : శాశ్వతము, విశ్వజనీనము

1. గుహ్యమైన ఏకాక్షరం . . . . . . . . . . . . . . . . . . 168
2. ప్రస్థానత్రయం . . . . . . . . . . . . . . . . . . . . 170
3. శాశ్వత, విశ్వజనీన మతము . . . . . . . . . . . . . . 172
4. శాస్త్రము - ఆధ్యాత్మికత . . . . . . . . . . . . . . . 173
5. ఆధునిక శాస్త్ర విజ్ఞానము - పురాతన మహర్షులు . . . . . . . . 175
6. నిష్కల్మష మానసము . . . . . . . . . . . . . . . . . 176
7. మార్గత్రయము . . . . . . . . . . . . . . . . . . . 177

రెండవ ప్రకరణము : ఆరాధన

8. భక్తి . . . . . . . . . . . . . . . . . . . . . . . 180
9. సగుణ బ్రహ్మము . . . . . . . . . . . . . . . . . . 181
10. ప్రార్థన . . . . . . . . . . . . . . . . . . . . . 183
11. అంతిమక్షణ భక్తి . . . . . . . . . . . . . . . . . 185
12. ఆత్మార్పణము. . . . . . . . . . . . . . . . . . . 187
13. జపము . . . . . . . . . . . . . . . . . . . . . 188
14. ప్రార్థనలో ఏకాగ్రత . . . . . . . . . . . . . . . . 190
15. భక్తునికి లభించే కనికరము . . . . . . . . . . . . . 191
16. సత్సంగత్వము . . . . . . . . . . . . . . . . . . 193
17. భక్తుడు ఎలా ఉండాలి . . . . . . . . . . . . . . . 195
18. ప్రార్థన ఎలా ఉండాలి . . . . . . . . . . . . . . . 197

మూడవ ప్రకరణము : కర్మ

19. విధేయత - స్వేచ్ఛ . . . . . . . . . . . . . . . . . 200
20. కర్మ - పునర్జన్మ . . . . . . . . . . . . . . . . . 201

21. అవతారములు . . . . . . . . . . . . . . . . . . . 202
22. సమాంతర సూత్రాలు . . . . . . . . . . . . . . . 204
23. నిస్సంగత్వం . . . . . . . . . . . . . . . . . . . . 206
24. అంతర్గత వ్యక్తిత్వము . . . . . . . . . . . . . . 207
25. మానవుని అహం . . . . . . . . . . . . . . . . . . 208
26. సత్యము . . . . . . . . . . . . . . . . . . . . . . 209
27. భవిష్యత్ కర్మ . . . . . . . . . . . . . . . . . . 211
28. జీవాత్మ కర్మచారులు . . . . . . . . . . . . . . . 212
29. మనసు - వాంఛ . . . . . . . . . . . . . . . . . . 215
30. నిస్వార్థకర్మము . . . . . . . . . . . . . . . . . 217
31. మతము - ప్రభుత్వము . . . . . . . . . . . . . . 219
32. ధర్మము - అర్చన . . . . . . . . . . . . . . . . . 221

నాలుగవ ప్రకరణము: జ్ఞానము

33. ఆధ్యాత్మిక సామ్యవాదము . . . . . . . . . . . 224
34. బ్రహ్మజ్ఞానము . . . . . . . . . . . . . . . . . . 225
35. ఉపనిషన్మూలము . . . . . . . . . . . . . . . . 226
36. పరమాత్మ - ఒక అవగాహన. . . . . . . . . . . . 227
37. ఆత్మ పదార్థము . . . . . . . . . . . . . . . . . 229
38. ఆత్మాంతరగత యానము . . . . . . . . . . . . . 230
39. బ్రహ్మమార్గపు తొలిమెట్టు. . . . . . . . . . . . 232
40. నిర్గుణ పరమాత్మ ఆరాధన . . . . . . . . . . . . 233
41. గురువు ఆవశ్యకత . . . . . . . . . . . . . . . . 234

ఐదవ ప్రకరణము : ముగింపు

42. బ్రహ్మ సాక్షాత్కారము . . . . . . . . . . . . . . 236

★ ★ ★

# పీఠిక

అసతోమా సద్గమయ,
తమసోమా జ్యోతిర్గమయ,
మృత్యోర్మా అమృతంగమయ.

-బృహదారణ్యకోపనిషత్

మనలను స్థితికి, జ్ఞానానికి , శాశ్వతత్వానికి చేకొని పొమ్మని చేసే ఔపనిషద్ప్రార్థన యందలి మహిమాన్విత విషయాన్ని ప్రతిబింబించేటందుకు చేసే వినయవంతమైన ప్రయత్నం ఇది. సాహసమే.

శ్రద్ధాళువులైన పాఠకులెవరైనా సరే ; ఈ పుస్తకాన్ని అధ్యయనం చేసే ముందు, కొన్ని ధర్మ సందేహాలను లేవదీసుకుంటే, అది సమంజసమే.

భగవంతుడు అంటే ఏమిటి? మోక్షం అంటే ఏమిటి? విశ్వప్రణాళిక (కాలపట్టిక) తిరుగులేని విధంగా నిర్ణయమయిపోయిందా, లేదా? దానిలో ఏదయినా మార్పుకి అవకాశం ఉంటే, అందులో వ్యక్తియాత్మకు గల స్వేచ్ఛాభీష్టం ప్రమేయం ఉన్నట్టా? అలా అయితే, ఆ స్వేచ్ఛాభీష్టాన్ని జీవాత్మ పూర్వకర్మ శాసించదా? అసలు, కర్మ అనేది ఎప్పుడు, ఎలాగ ప్రారంభమయింది?

ఇవీ, ఇలాంటి మరెన్నో ప్రశ్నలు- మానవ మోక్షానికి సూటిగానో, చాటుగానో సంబంధించినవి ఉదయిస్తాయి; కాని, వాటికి సంతృప్తికరమయిన సమాధానాలు లేనట్టుకాదు. ఈ ప్రశ్నలనుండి మరికొన్ని గడ్డు సమస్యలు ఉద్భవిస్తాయి. అవి కూడా జవాబులు దొరకనివే; పైగా, ఎన్నోసార్లు, ఒక్కొక్క ప్రశ్న ఒక్కొక్క సమస్య అవుతుంది. వాటికి జవాబులు సంశయాత్మకంగా రాగలవు. వాటికి స్పష్టత ఉండదు. తేల్చిచెప్పే లక్షణం ఉండదు. అలా వచ్చే ప్రతి జవాబుకి దానికి అనుగుణమైన సమర్థన ఉన్నట్టు తోస్తుంది. ఫలితంగా మోక్షం అనేది ఒకానొక అసాధ్యమయిన ఆలోచన- అని తలచి దానిని పట్టించుకోకపోవడం జరగవచ్చు.

ఆ ప్రశ్నలకు సమాధానాలు ఏమిటి- అనేది మనలో ఎవరికి వారు తమకు గల బుద్ధిని అనుసరించి అన్వేషించుకోవడం వల్లనే (మోక్షం అనేది ఒకానొక అసాధ్యస్థితి అనుకొనే) ఈ నిరాశావాహ పరిస్థితి సంభవిస్తుంది. సమస్యలు ఆధ్యాత్మిక స్థితికి సంబంధించినవి, బుద్ధి ఐహికము. ఈ రెండు స్థితులు: నిర్మాణంలోనూ అవగాహన లోనూ బొత్తిగా సారూప్యత లేనివి. ఒకదానిలో చేయగల అన్వేషణ పద్ధతులు, చేపట్టగల సాధనాలు; రెండవ దానికి అసలు సరిపడనివి. జ్వర తీవ్రత ఎంత ఉందో తెలుసుకోడానికి ఉపయోగించే ధర్మామీటరుతో ఏనుగు ఎంత బరువు ఉంటుందో తెలుసుకోలేము.

భూతలం మీద నడవడానికి అనుగుణమైన అవయవాలు మాత్రమే కలిగిఉన్న మనం పక్షుల లాగా గాలిలో ఎగరలేము కదా!

అందుకనే, శ్రీకృష్ణ పరమాత్మ అర్జునునికి తన విశ్వరూపాన్ని భౌతిక అవగాహనకు సాధ్యమయ్యే పరిమాణాలలో మాత్రమే ప్రదర్శించినాడు. అసలు విశ్వరూపం కేవల ఆధ్యాత్మికలక్షణాలతో- ఆమాటకొస్తే ఆధ్యాత్మికాతీత లక్షణాలతో- విలసిల్లేది. మనబుద్ధి ఎంతటి ఆధిభౌతికమైనదయినా, మనలో ఎంతటి తెలివిగలవాడైనా సరే; అచ్చమైన స్వర్గం ఒకటి ఉంటుందనీ దాని ఏలికగా రూపుదాల్చిన ఒక దైవం ఉంటాడనీ ఆమోదించలేకపోతాడు.

పరమాత్మ స్వభావాన్ని గురించి ఎంత విపులంగా బోధించుకున్నప్పటికీ శ్రీకృష్ణ పరమాత్మ తన విశ్వరూపాన్ని అర్జునునికి గోచరనీయం చేయడానికిగాను అసంఖ్యాకాలయిన చేతులతో, తలలతో (మరికొన్ని అవయవాలతో) దర్శనమిచ్చి కొంతమేరకు భౌతికతలానికి అవనతుడయినాడు- అని చెప్పుకోవచ్చు. భగవానుడు తన ఆధ్యాత్మిక స్వభావానికి సంకేతంగా అపరిమిత పరిమాణాలు గల భౌతిక రూపానికి పరిణామం చెందడం ఎందుకంటే, అర్జునుని అవగాహనా పరిధి భౌతికమే గాని ఆధ్మాత్మికం కాదు కదా అని, తనకు తానే దిగివచ్చాడు. ఈ విశ్వరూప సందర్శన నిమిత్తం భగవానుడు అర్జునునికి దివ్యచక్షువును ప్రసాదించేడని చెప్పుకున్నా, అదంతా భౌతిక తలానికీ ఆధ్యాత్మిక తలానికీ నియోగించే కొలబద్దలు వేరు వేరు- అని మరింతగా నొక్కి చెప్పడం కోసమే.

ఆత్మ స్వరూప స్వభావ సంబంధములైన మర్మాలను మనకు ఉన్న బుద్ధి అనే కేవల భౌతిక సాధనం సహాయంతో అన్వేషించలేము. కనుక మన సందేహాలకు సమాధానాలుగా మనం ఏర్పరచుకొనే ఊహలు దిద్దుకోవలసిన తప్పులుగానే వస్తాయి. మానవమేధ అల్పము. దాని సహాయంతో దేనిని గురించి చేసే ఊహ అయినా ఉరమరిక స్థాయిని మించి కలగదు.

అవీ, పరిస్థితులు. అందుచేత బుద్ధి అనే ఈ నిరుపయోగ సాధనం ఏర్పరచిన హద్దులను ఏదో విధంగా అధిగమించి మనకు మనంగా ఆధ్యాత్మిక జ్ఞాన మార్గంలో సూటిగా వెళ్లాలి. అందుకు; ఆధ్యాత్మిక తలంలోని జీవితాన్ని దర్శించి, అనుభవించి వారిమీద ఆధారపడడం తప్ప మరొక దారి లేదు.

అపౌరుషేయమైన జ్ఞానాన్నీ కేవల నిస్వార్థ సద్బుద్ధినీ వరములుగా ఏకకాలమందు పొందినవారు మన ఋషులు. వారు విశ్వానంతర మర్మాలను విజయవంతంగా అన్వేషించి, మానవజాతికి వారు ఒనరించిన ఆ అమూల్య సేవలకు ఏ ప్రతిఫలాన్నీ ఆశించకుండా ఆ విశ్వరహస్యాలను ముందుతరాలవారి ప్రయోజనంకోసమని బహిర్గతం చేశారు. వేదాల రూపంలో మనకు వారు ఎంతో విలువైన కానుకను ఇచ్చినా కూడా అదంతా మానవశ్రేయస్సు ప్రేరణగా జరిగినదేనని భావించి వారు అజ్ఞాతంలో ఉండిపోవడానికే నిశ్చయించుకున్నారు.

కొలవరాని లోతులుగల మన ఆధ్యాత్మిక సమస్యల పరిష్కారంలో ఆ మహనీయులు ఏర్పరచిన ఉదార మార్గదర్శకత్వాన్ని అందిపుచ్చుకోవడం అత్యంత సమర్థనీయం.

అది అలా ఉంచి, జ్ఞాన మార్గ అన్వేషణకుగాను మానవునికి గల సాధారణ స్థాయి 'బుద్ధి' తగిన సాధనము కాదని ఋజువైపోయింది కనుక, దానిమీద ఆధారపడకుండా మన ఋషులు నిర్దేశించిన మార్గంపై అగణితమైన విశ్వాసం నిలిపి సాగడమే మేలు. సత్యముపైన విశ్వాసం ఉంచడమూ ఘనమైన దానిని విశ్వసించడమూ ఒకటే. ఆధ్యాత్మిక విషయాలలో "సంశయాత్మ వినశ్యతి".

అందువలన, ఈ పుస్తక ప్రణాళికకు సంబంధించినంతవరకు-

పరమాత్మ స్వభావం, మానవుడు పొందవలసిన మోక్షం- వంటి విషయాల అవగాహ నకు గాను, మన పవిత్ర గ్రంధాలు వచించిన దానిని నిశ్శంకగా విశ్వసించు కొంటూనే, దానియందు సంభవించే అన్ని సందేహాలను పైదొలగించుకొంటూనే, ఒకానొక అనీశ్వరవాది మార్గాన్నే బుద్ధిపూర్వకంగా ఎన్నుకుంటున్నాను. అసలు మోక్షం అంటూ ఒకటి ఉందా, లేదా; దానిని సాధించుకోవడం కోసం నాకు ఉన్న స్వేచ్ఛాభీష్టాన్ని ఉపయోగించుకోగలనా· ఇంతకీ స్వేచ్ఛాభీష్టం అంటూ ఒకటి నాలో ఉందా· అసలు దేవుడనేవాడున్నాడా లేడా; ఇలాంటి విషయాలమీద చర్చకు దిగడం వృధా అనీ, ఇహలోకస్థాయిలో దఘ్నమై ఉన్న నా పరిమిత మేధ వలన అది నా శక్తికి మించిన పని అనీ భావిస్తున్నాను.

ఆలాగున: పరమేశ్వరుడున్నాడని, మోక్షం ఉన్నదని, స్వేచ్ఛాభీష్టం కూడా ఉందని, నమ్మి ఇందులో దిగాను. మానవుని అంతిమ లక్ష్యమయిన మోక్షాన్ని సాధించుకోవడానికి మనము మన స్వేచ్ఛాభీష్టము ఎంత సమర్థంగా ఉపయోగించుకోగలుగుతాము- అనేది సూచించడంకోసం చేస్తున్న వినయపూర్వకమైన ప్రయత్నమే ఈ పుస్తకరచన.

ఏది ఏమయినా సరే, ఇది ఒక గొప్ప పుస్తకం అని నేను భావించుకుంటున్నాను. ఇందులో నా గొప్ప ఏమీ లేదు. నేను స్పృశించినవి, వెల్లడించడానికి ప్రయత్నించినవి: అయిన ఉపనిషత్‌సూక్తులలో ఉంది, ఆ ఘనత. కనుక, నా ఈ ప్రయత్నంలో కానవచ్చే లోపాలను పరిహరించుకోవలసినదిగా, విశారదులయిన పాఠకులను వేడుకొంటున్నాను.

(1984) **నండూరి వేంకటేశ్వరరావు**

# మొదటి అధ్యాయము

# శాశ్వతము - విశ్వజనీనము

# 1. గుహ్యమైన ఏకాక్షరం

ఓం అనే ఏకాక్షరం తానే బ్రహ్మము. దానికి
నాశనము లేదు. అది విశ్వమునకు ప్రతీక. భూత-
భవిష్యత్-వర్తమానములు అన్నీ ఓంకారము.
కాలమునకు సంబంధించిన ఈ
మూడుదశలను అతిశయించునది కూడా ఓంకారమే.

-మాండూక్యోపనిషత్తు

ఓం అనేది స్థితిలోఉన్న, స్థితిలో లేని
వ్యక్తిగతమైన, పరోక్షమైన - బ్రహ్మము

-ప్రశ్నోపనిషత్తు

ఓంకారము బ్రహ్మము. ఓంకారము సర్వము.
ఓంకారమును ధ్యానించినవారు బ్రహ్మమును పొందుతారు

-తైత్తిరీయోపనిషత్తు

ఆకాశాత్పతితం తోయమ్ యథాగచ్ఛతిసాగరం
సర్వదేవనమస్కారం కేశవమ్ ప్రతిగచ్ఛతిః

-మహాభారతము

భౌతిక, ఆధ్యాత్మిక-సంబంధమైన ఎట్టి వృత్తి కర్మనిర్వహణకైనా, దానిని గురించి వచించగల ఒకమాట అవసరం పడుతుంది. సర్వశక్తిమంతము, గుణాతీతము అయిన పరమాత్మయందు నిబిడీకృతమై ఉన్న గుణాలను వర్ణించుకుని దానిపైన మనసును ఏకాగ్రతతో నిలుపుకోవడానికి కూడా ఒక నామం, లేదా, ఒక సంకేతం కావాలి. ఈ ఆలోచనలనేపథ్యంతో మన పురాతన పవిత్రమత గ్రంధాలు అన్నీకూడా ఆ పరమ పురుషుడిని "ఓంకారం"గా పేర్కొన్నాయి.

భగవానుడు, మన ఇంద్రియ గోచరమైన విశ్వంలోనికి; మొట్టమొదట, ధ్వనిగా (నాదబ్రహ్మగా) ఆవిర్భవించాడని అంటారు. ఈ విశ్వమునందలి యావత్ నాదమును అ-ఉ-మ్ అనే మూడు శబ్ద శకలాలకుగా క్లుప్తీకరించి చెప్పవచ్చునని, ఆ మూడు శబ్దాల కలయిక ఓంకారంగా రూపొందిందని-అంటారు. అది, ఓం అనే ఆ 'పరమనాదం' పరమ బ్రహ్మనామముగా పరిక్రమణము చెందిన విధానము.

పరమబ్రహ్మమును నిర్వచించినదిగా వేదమంత్రాలన్నింటిలోను ఓంకారం అత్యున్నత మైనదిగా, మిక్కిలి శక్తిమంతమైనదిగా ఉన్నది. వేదమంత్రాల ద్వారా ఏదైవాన్ని ఆవాహన

చేసుకోదలచినా అవన్నీ ఓంకారంతోనే ప్రారంభమవుతాయి. దీనిలో రెండు భావాలు ఉన్నాయి. మంత్రంచేత ఏ (ప్రత్యేక) దైవాన్ని ఆవాహన చేసినా, ఆ దైవం పరమాత్మ తరువాతిదో, లేక పరమాత్మ అనుయాయిగానో ఉంటుందని, మనము మన ప్రార్థనను ఏదైవాన్ని ఉద్దేశించి చేసినా, అట్టి ప్రార్థన మనకు తెలిసిగాని, తెలియకగాని పరమాత్మను ఉద్దేశించి చేసినదే అవుతున్నదని, గ్రహించాలి. సూర్యభగవానుడు ఈ విశ్వమంతటిలో ఎక్కడ నుండి అయినా అనంతకోణాలలో కానవచ్చే విధంగా, పరమాత్మ ఈ విశ్వమంతటా నిండి ఉన్నాడు. పరమాత్మ, విశ్వములోని అణువణువుపట్ల స్పందించగలడు గనుక చిన్నా-పెద్దా అనే తేడా లేకుండా పై దైవాన్ని ఆరాధించే వారయినా, ఏ మత విశ్వాసానికి కట్టుబడి ఉండేవారయినా-ఎవరు చేసిన ప్రార్థన అయినా-అక్కడికే చేరుకుంటుంది.

అంతేకాదు. భౌతిక విశ్వానికీ, ఆధ్యాత్మిక విశ్వానికీ సంబంధించినవన్నీ నిండిఉన్న, వాటికి అతీతంగా కూడా ఉన్న, లక్షణరహిత నిర్గుణ పదార్థాన్ని నిర్వచించగల (లేదా, దానికి సంబంధించగల) దేనినైనా ఊహించాలన్నా, పేర్కొనాలన్నా ఓంకారమే దానికి అనుగుణమైనది. దీనికి ప్రపంచంలో ఉన్న మతపరమైన, భాషాపరమైన; ఎల్లలు లేవు.

అందుచేత, సహజంగానే ప్రస్థానత్రయం ఈ గ్రంథంలోని ఇతర వచనాలకు ప్రేరణగా ఉంటున్నది.

★

# 2. ప్రస్థానత్రయం

ప్రపంచం మొత్తంమీద మత తత్త్వాన్ని గురించి చెప్పిన గ్రంధాలన్నిటిలో వేదాలు అత్యంత పురాతనమైనవి.

మరికొన్ని శ్రుతులు కూడా ఉన్నాయి. అవి బైబిలు, కొరాను, ధమ్మపద-ఇలాంటివి. అవి కూడా ఈ దేశంలో అనుసరించినవే. అయితే, అవన్నీ వేదాల తరువాత వచ్చినవి, వేదాలతో సరిపోలిస్తే దేశంలో చాలా తక్కువ ప్రదేశాలలోనూ తక్కువ మంది అనుయాయులను కలిగిన్నీ ఉన్నాయి.

ఉపనిషత్తులు ఉన్నాయి. ఇవి వేదాలకు ఫలశ్రుతులు. పవిత్రమైన వేదాల సారం అంతా వీటిలో దింపేసి ఉంది. అవి మన మహర్షులు మొట్టమొదట సుదీర్ఘమైన, కష్టమైన తపస్సు ద్వారా స్వయంగా అనుభవించి చెప్పిన ఆధ్యాత్మిక వచనాలు. అవి ఎవరూ ఎక్కడా వ్రాసి ఉంచినవి కావు. ఆ మహర్షులకు శిష్యులు ఉండేవారు. వారు అవన్నీ మౌఖికంగా అధ్యయనం చేసి తరం తరువాత తరంగా తమ ధారణాశక్తిచేత పరంపరానుగతమైన బోధనలుగా వాటిని నిలబెట్టారు. మన ఆధునిక పాఠ్యపుస్తకాల వంటివి కావు, అవి

వాటినన్నింటిని బాదరాయణ మహర్షి 'బ్రహ్మసూత్రాలు' అనే పేరిట చేసిన గ్రంధంలో పద్ధతిగా సూత్రీకరించారు. ఈ బాదరాయణ మహర్షి భారతీయ సంప్రదాయం ప్రకారం వేదవ్యాస మహర్షికి సమానుడు. బ్రహ్మసూత్రాలు చూడడానికి పొట్టిపొట్టిగా ఉంటాయేగాని, అవి వేదాంత తత్త్వాన్ని ప్రతిపాదించే సూక్తులు. విపులమైన వ్యాఖ్యానం లేకపోతే అర్థం కానంత దురవగాహకాలు.

ఆ శ్రేణిలో తరువాతగా వచ్చినది భగవద్గీత. ఇది ఉపనిషత్తుల సారం. అయినప్పటికీ సాధారణ మానవుని అవగాహనా శక్తికి అందుబాటులో ఉండే విధంగా రచించినది. (వేదాలు, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు అధ్యయనం చేసేటప్పటిలాగా కష్టపడనక్కర లేదు.) వేదాంతపు పిండిత సారాన్నే ఇముడ్చుకున్నా దీని విధానం మిగిలిన వాటికన్న అధునాతనమైనది.

ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, భగవద్గీత - ఈ మూడిటినీ 'ప్రస్థానత్రయం" అని ఒక మాటలో చెప్పుకుంటాము. అతీతజ్ఞానంలో ప్రగాఢమైన పరిశోధనతో విలసిల్లిన ఈ మూడు గ్రంధాలు పరమాత్మ స్వభావాన్నీ దానిని సాధించే పద్ధతులనూ స్పష్టపరచి చెపుతాయి.

ఆధ్యాత్మికతకు సంబంధించినంత వరకు ఏదైనా ఇతర మతానికి సంబంధించిన పురాతన గ్రంధాలలో వివరించి ఉంటే ఉండవచ్చుగాని, ప్రస్థానత్రయంలో స్పృశించ కుండా వదిలేసిన ముఖ్యవిషయం ఏదీలేదు.

ఈ మూడు పుస్తకాల మూలాలు మిక్కిలి పురాతనమైనవి. ఇవి కాలపరీక్షలో నెగ్గినవి. ఇతర మతాల తాకిడిని తట్టుకొని నిలబడినవి. ఈ నాటికీ కూడా మానవుని ఆధ్యాత్మిక బుద్ధిమీద ప్రబలమైన ఆకర్షణను చిమ్ముతున్నవి. భారతదేశానికి సంబంధించినంత వరకు ఆధ్యాత్మిక విషయాలలో అత్యున్నతస్థాయికి చెందిన సాధికార గ్రంధాలుగా పరిగణించుకుంటున్నవి.

అందుచేత, సహజంగానే ప్రస్థానత్రయం ఈ గ్రంథంలోని ఇతర వచనాలకు ప్రేరణగా ఉంటున్నది.

★

# 3. శాశ్వత, విశ్వజనీనమతము

వేదాలు అపౌరుషేయాలని, మానవులు కూర్చినవి కావని సంప్రదాయ వచనం. అవి దేవ వాక్కులు.

ఆధునిక మనస్తత్వం ఆ సిద్ధాంతాన్ని అంగీకరించడానికి ఇష్టపడదు. కాని, ఈ సందర్భంగా మనకు మనం కొన్ని విషయాలు చెప్పుకోవాలి. మహర్షులు ఉండే వారు. వారు తమ తపస్సుల ద్వారా విని ఉన్న అతిలోక వాక్కులను దివ్యదృష్టి ద్వారా దర్శించిన లోకాతీత దృశ్యాలను వేదాలద్వారా ప్రతిధ్వనించారు, మనో చిత్రరచన చేశారు. వారి ప్రతిభ ఈనాటికి కూడా ఘనమైనదిగా గుర్తించగలుగుతున్నాము. ఆత్మిక-ఆధ్యాత్మిక తలాలలో హిందూేతర మతాలేవీ కూడా దరిజేరలేకపోయినంత లోతయిన, విస్తారమైన: పరిశోధన ద్వారా అది వారికి సమకూరింది. విభ్రమానిత్వమైన ఆ పరిశోధనలు ఆధారంగా మానవుని మోక్షానికి సంబంధించిన కొన్ని సిద్ధాంతాలను వేదాలు ప్రవచించినవి. అవేవీ కూడా సామాన్యులైన మేధావులు రూపొందించిన తేలికపాటి మతసూక్తులు కావు.

వేదాలు; (ఇంకా సరిగా చెప్పాలంటే వాటి ఉపనిషద్భాగాలు) "బ్రహ్మము"నకు, "జీవాత్మ"కు గల సంబంధాన్ని గురించీ వాటి స్వభావాలను గురించీ విపులంగా వచిస్తాయి. మానవుని అంతిమధ్యేయం అయిన బ్రహ్మైక్యతను సాధించడానికిగాను: జీవాత్మ, ప్రాపంచిక బంధాల నుండి ఎలా విముక్తి పొందాలో అవి వివరిస్తాయి.

మానవుని మోక్షానికి గాను భూమిమీదగల ఏ (ఇతర) మతమూ నిర్వచించలేని విధంగా, ఎంతో విలువైన ఆధ్యాత్మిక సిద్ధాంతాలను నిర్వచించి ఉంచిన జ్ఞానాగారం వేదం. వేదాలలో ప్రవచించని ఏ సిద్ధాంతం కూడా ఏ ఇతర మత గ్రంధాలలోను దొరకదని నిస్సందేహంగా నొక్కి చెప్పుకోవచ్చును. భక్తి, సన్యాసం - వంటి కొన్ని ఆధ్యాత్మిక విషయాలను గురించిన విపుల వ్యాఖ్యానాలు కొన్ని, ఇతర పవిత్ర గ్రంధాలలో ఉంటే ఉండవచ్చు. కాని, వాటి మూలాలు వేదాలలోనే ఉన్నాయి.

హిందూత్వం అనేది వైదిక మతానికి ఇటీవల ఏర్పడిన పేరు. ఇందులో (అనగా హిందూమత పవిత్రగ్రంధాలైన వేదాలు మొదలయిన వానిలో) చెప్పిన సూక్తులు శాశ్వతమయినవి, విశ్వజనీనమయినవి. కనుక, హిందూత్వాన్ని "విశ్వసనాతన ధర్మము" అని చెప్పుకోవాలి.

★

# 4. శాస్త్రము - ఆధ్యాత్మికత

విజ్ఞానశాస్త్రం కల్పన కాదు. అయినా సరే అది పరిపూర్ణ సత్యంకూడా కాదు. విజ్ఞాన శాస్త్రం ప్రకారం జరిగే సమస్త కార్యాచరణక్రమం సారాంశంగా చెప్పుకోవాలంటే "పరిశోధన-పరిష్కారం" · ప్రయోగం-పరిశీలన"-అంతే. విజ్ఞానశాస్త్రం ద్వారా లభించే మౌలిక సమాధానాలు వేటికీ శాశ్వతత్వం లేదు. అవి మార్పులకు లోనుకావచ్చు, వివాదాలకు ఆస్పదాలు కావచ్చు, ఒక్కొక్కప్పుడు సమూలంగా కొట్టివేయవలసి రావచ్చు. కాలం గడుస్తున్న కొలదీ, మానవుని పరిశోధన లోతులకు పోతున్న కొలదీ· ప్రకృతియందలి మర్మాలు ఇంతకు ముందు తేలినవి కాక మరెన్నో వెలుగు చూస్తున్నాయి. ఒక ప్రమాదం జరిగినప్పుడో, ఒక గుట్టు విడనప్పుడో, ఒక సిద్ధాంతం నియమభ్రష్ట మయినప్పుడో వాటిని దురవగాహాలుగా అంగీకరించి, గౌరవించేసే అవకాశం విజ్ఞాన శాస్త్రం విషయంలో ఉంది. కాని, విశ్వపాలనా యంత్రాంగంలో ఉన్న దోషరహితమయిన క్రమబద్ధత, నిర్దుష్టత -అలాంటి వెసులుబాటుకి అసలు ఒప్పుకోవు.

గణితశాస్త్రంలో చెప్పిన అనంత సంఖ్య, శూన్యం, కరణి మొదలయినవి ఊహా భావాలే తప్ప స్పష్టమయినవీ వాస్తవాస్పదమయినవీ కావు. భౌతిక శాస్త్రంలో, ప్రతీచర్యకూ ప్రతిచర్య ఒకటి ఉంటుందని చెప్పేరే కాని· విశ్వములోని నక్షత్ర మండలాలు వాటి నిర్ణీత కక్ష్యలలో ఏ ఆటంకమూ లేకుండా నిరంతరం ఏ సూత్రం ప్రకారం పరిభ్రమిస్తున్నాయి, ఆ పరిభ్రమణం ఏ ఇరుసు ఆధారంగా సాగుతోంది, అసలు ఈ పరిభ్రమణం ఎప్పటి నుండి జరుగుతోంది, ఇంకా ఎన్నాళ్లు సాగుతుంది - ఇలాంటివి అన్నీ విజ్ఞాన శాస్త్రం ప్రకారం తరచి చూడలేనివి; కనీసం ఇప్పటి వరకు!

వాటికి ప్రారంభంలేదు, వాటికి లెక్కలేదు, అవి మనం తెలుసుకోలేనివి-అని చెప్పుకునే జవాబులు ఆ చిక్కు ప్రశ్నలకు నిజమైన సమాధానాలు కావు. మానవమేధ పరిమిత మైనది మాత్రమే - అని మొహమాటంగా ఒప్పుకొనే పద్ధతి, అది

అయినప్పటికీ, ఆధ్యాత్మికత విజ్ఞానశాస్త్రాన్ని వ్యతిరేకించదు, తోసిపుచ్చదు. మానవ అనుభవంలో 'ఋజువేమిటి" అని ప్రశ్నించకుండా నమ్మి ఊరుకోవలసినవి కొన్ని విషయాలు ఉంటాయని ఆధ్యాత్మికత అంగీకరిస్తుంది; అయితే, వాటికి వివాదరహిత మయిన ముడులను విప్పగలిగే శక్తిని ఒకానొక మేధోగంధం ద్వారాగాని, అతీంద్రియ స్పృహ ద్వారాగాని ఆధ్యాత్మికత అందించగలదు.

ఆధ్యాత్మిక ప్రపంచంలో అంతర్దృష్టి అనే మూల విషయం ఒకటి పని చేస్తుంది. నిపుణుడయిన ఆధ్యాత్మిక గురువు వద్ద తగిన శిక్షణ పొందితే ఆ అంతర్దృష్టి సాధారణ మేధోజీవికి అందుబాటులో లేనట్టి దేనిస్వరూపాన్నయినా చూపిస్తుంది. ప్రమాదాలు, అదృష్టాలు, నియమోల్లంఘనలు - అని మనం చెప్పుకుంటున్నవన్నీ నిజంగా అలా కావనీ సుదీర్ఘకాలంగా నిరీక్షిస్తున్న కొన్ని కార్యాల అంతిమ ఫలాలేననీ చెప్పేదికూడా ఈ అంతర్ దృష్టే

ఆధ్యాత్మిక గురువుల సమర్థమార్గదర్శకత్వం ద్వారా ఈ అంతర్‌దృష్టిని మరింత అభివృద్ధి చేసుకుని పరమ జ్ఞానాన్ని పొందగలిగితే, భౌతిక - ఆధ్యాత్మికాలుగా రెండు స్వతంత్ర ఉపలోకాలు ఉన్నాయని, ఈ రెండిటినీ శాసించగల ఒకానొక బలవత్తర శక్తి పరమాత్మ రూపంలో ఉన్నదని; అదే ఈ రెండిటినీ సంయుక్తం చేసి నిర్వహిస్తున్నదనీ - మనకు మనమే గ్రహించగలుగుతాము.

ఆ అంతర్ జ్ఞానం, "సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తూ ఎన్నటికీ అతనిలో ఐక్యం కాని గ్రహాలవలె జీవాత్మలు కూడా పరమాత్మ చుట్టూ నిరంతరం పరిభ్రమిస్తూనే ఉంటాయా? అవి పరమాత్మలో ఎన్నటికైనా ఐక్యం అవడం సాధ్యమేనా? అట్టి ఐక్యతను తన పరమ జ్ఞానం చేత పరమాత్మ ఏ విధంగా అమలుపరుస్తాడు?"- అనే వాటిని అన్వేషకునికి స్పష్టపరుస్తుంది.

★

# 5. ఆధునిక శాస్త్ర విజ్ఞానము - పురాతన మహర్షులు

ఆధునిక విజ్ఞానశాస్త్రం మానవుడిని ఆకాశపు అంచుల అవతలికి తీసుకు వెళ్ళ గలిగింది. కాని మానవుడు దాని సహాయంతో తన భౌతిక శరీరంలో ఉన్న ఆత్మలోకి కనీసం తొంగి చూడనైనా లేకపోతున్నాడు. మన పురాతన ఋషులు ఆధునిక విజ్ఞాన శాస్త్రం తాకిన ఔన్నత్యాలను అందుకోలేదని అనుకోవనక్కరలేదు. వారు ఆ దిశగా తగినంత మేరకు చేరి ఇంక సాగడం వృథా అని గ్రహించి తెలివిగా అక్కడితో ఆగారు. సత్యస్వరూపాన్ని అన్వేషించడంలో వారికి ఉండిన పట్టుదల చాలా దృఢమైనది. భౌతిక విజ్ఞాన శాస్త్రంలో ఎంతటి ఘనతను సాధించినా (సత్య స్వరూపానికిగాను తాము ఏర్పరుచుకున్న) తమ ధ్యేయం విషయంలో అది ఎంత మాత్రం తోడ్పడదని వారు గ్రహించుకున్నారు. అన్వేషించి తెలుసుకోవలసినది ఒకే ఒకటి. దానిని తెలుసుకున్నవారు ఇంకేదీ తెలుసుకోవలసిన అవసరం లేదు. ఈ గ్రాహ్యత వలన వారు తమ దృష్టిని భౌతిక శాస్త్రం నుండి ఆధ్యాత్మికతకు (మిక్కిలి సమంజసంగా) మళ్ళించుకున్నారు.

ఈ ప్రక్రియలో మన ఋషులు మానవుని భౌతిక శరీరానికి సంబంధించిన యోగక్షేమం మీద కాకుండా, అతని అంతర్గత జ్ఞానాన్ని క్రమ శిక్షణలో ఉంచడం మీద దృష్టి నిలుపుకోవడం ప్రారంభించారు. మానవుడు సంఘజీవి. అతడు జీవితంలో ఎన్నో ఎగుడుదిగుడులను ఎదుర్కోవలసి ఉంటుంది. ఆ క్రమంలో అతడిమీద అరిషడ్వర్గముల లోని లోభ, మోహ, మాత్సర్య, క్రోధాల దుష్ప్రభావం పడుతుంది. ఆ దుష్ప్రభావాన్ని అతడు ఎప్పటికప్పుడు ధైర్యంగా దూరం చేసుకోగల విధంగా అతని అంతరాత్మను జ్ఞానవంతం చేయడానికి మతం అనేది ఏర్పడింది. ఆధ్యాత్మిక సత్యము అనేది ఒక సమున్నత గుణము కనుక, మానవుడు దానిని ఒకానొక అత్యవసర అనుబంధంగా పరిగణించుకొని పెంపొందించుకోవాలి - అనే ఆశయసిద్ధికి కూడా మతం ప్రణాళికను సిద్ధం చేసింది. మన సనాతన ఋషులు ఆధ్యాత్మిక సత్యాలను పొదిగి రూపొందించినవి కేవలం బుద్ధిమంతసూత్రాలు మాత్రమే కావు, తేజోమంత సిద్ధాంతాలు భగవానుని అతీత జ్ఞానస్థాయి నుండి వారికి అనాఘ్రాత స్థితిలో అందిన పరమార్థాలు అవి. వాటి ఔచిత్యం ఏదయినా ఒక యుగానికిగాని, ఒక (మానవ) తరగతికిగాని పరిమితం కాదు. దానికి భౌగోళికమయిన ఎల్లలు లేవు.

మన ఋషులు వచించిన ఆ పరమ అమూల్య వచనాలలోని అంతస్సందేశం సాధారణ బుద్ధి కుశలత (మాత్రమే) గలవారికిగాని, ప్రాపంచిక సమాచార పరిపూర్ణులకు కూడా గాని - అందనిది. అది ఒక పరమానంద స్థితి. ముక్తి. అది మానవుని అత్యున్నత ఆదర్శం. దానికి సంబంధించిన అంతర్దృష్టి అలవడ డానికిగాను మానవుడు ఆత్మానుభవం చేత పండిపోయిన వారెవరినో మార్గదర్శిగా నిలుపుకొని అప్రాపంచికతతో తీవ్రమయిన ఆధ్యాత్మిక సాధన చేస్తేనే, ఆ స్థితి చిక్కుతుంది

★

# 6. నిష్కల్మష మానసము

ఆధ్యాత్మిక యానంలో వేయవలసిన మొట్టమొదటి అడుగు: నిష్కల్మషమైన మానసాన్ని సాధించుకోవడం, సాధకులు ఒకటికి రెండు సార్లు తమ మనసులు నిష్కల్మషంగా ఉంటున్నాయా అని శోధించుకోవాలి. లేదు - అని తోచినప్పుడు, మనసును ఆవహించుకున్న, ఆక్రమించుకున్న కల్మషాన్ని వెంటనే ప్రక్షాళనం చేసుకోవాలి.

మనసే కాదు; "ఏదైనా" సరే, దాని సహజస్థితి (అనగా అది రూపొంది ఏర్పడిన స్థితి) యందు నిర్మలంగానే ఉంటుంది. ఒక బంగారపు నగ ఉందనుకుందాము. ధగధగా మెరుస్తూ ఆకర్షణీయంగా ఉంటుంది. మరి, కొనుక్కున్నవారు దానిని కొన్నాళ్ళు (ధరించి) ఉపయోగించిన తరవాత చూస్తే అది కొంత మకిలి పట్టి, ఆ మిలమిల తగ్గిపోతుంది. పసిపాప మనసు, అప్పుడే కార్ఖానా నుంచి తెచ్చిన నగ లాగా నిష్కల్మషం, అమాయికం, పసివాడనిది. దానికి, నెరవేర్చుకోడానికి; ఉద్దేశాలూ, కోరికలూ కొంటె ఆలోచనలూ, ద్రోహచింతనలూ ఉండవు. నవ్వినా, ఏడ్చినా అందులో అమాయకత్వమే కనబడుతుంది. దానివల్ల మనకి ఆహ్లాదకర, సానుభూతికర స్పందనలు కలుగుతాయి. కోరికలు, క్రోధం, గర్వం, కపటం, దౌష్ట్యం లేని అలాంటి మనసు నిష్కల్మషం అనిపించుకుంటుంది.

సహజంగా పసిబిడ్డకు ఉండే నైర్మల్యాన్ని ఆవహించే కల్మషాల్లో కెల్లా ఆ మనసు పెరుగుతూ ఉండే కాలంలో ఆ నిష్కల్మషత్వాన్ని నాశనం చేసి విజృంభించేది కోరిక అనే తుంటరిశని. అది ప్రాథమిక కాలుష్యం. చాలా ఉపద్రవకరమైనది. దానినుండి మోహం, ద్రోహం, అసత్యం - వంటివి, అసంఖ్యాకాలయినవి ఉద్భవిస్తాయి. కోరిక మీద కోరికగా పుట్టుకొచ్చి, ఫలితంగా మనసు కలుషితమైపోయి, అది ఆధ్యాత్మిక ప్రగతికి పనికి రాకుండా పోతుంది. అందుచేత, సాధకుడు; (కోరిక అనే) ఈ కీడు (తనలో) తలెత్తుతున్నప్పుడల్లా దానిని మొగ్గలోనే తుంచేయాలి.

'కోరిక'లో అంతర్గతంగా ఉండే 'శని', మానవుని మనసులో 'అపేక్ష' అనే కల్మషాన్ని పుట్టించి, తద్వారా మనసును వినాశన కార్యకలాపాలకు పురికొల్పుతుందని కూడా గుర్తించుకోవాలి. 'అపేక్ష' అనే దానిని 'కల్మషంగా' రాకుండా ఇంద్రియాలను భగవత్సేవకుగాను అందుబాటులోకి తెచ్చుకోగలిగితే అది సాధకుడి అంతరాత్మకి ఉపయోగం కాగలదు.

ఈ క్రమం అంతటి కోసం సాధకుడికి బలమైన నిర్ణయశక్తి అవసరం. నిశితంగా పరిశీలించగల దృష్టి కావాలి. 'స్వభావం' లోంచి 'కోరిక'ను సమూలంగా తొలగించడానికి దృఢ ప్రయత్నం కావాలి. మానవుని ఆధ్యాత్మిక ప్రగతి ఏదిశలో సాగాలన్నా ఈ విధంగా ఏర్పరచుకున్న నిష్కల్మషమానసం అత్యవసరమని గ్రహించాలి.

★

# 7. మార్గత్రయము

భగవంతుని ఎరుకకుగాను మన పురాతన మత గ్రంధాలలో చెప్పినవిగా మనం అవలంబించిన మూడు ప్రముఖమైన పద్ధతులు: భక్తి మార్గం, వైరాగ్య మార్గం, జ్ఞాన మార్గం. ఈ మూడిటిలో ఒక్కొక్క దానిని గురించి వేరువేరుగా విస్తారమైన గ్రంధరచన జరిగింది. అయితే, వాటిని క్లుప్తంగా (కూడా) వివరించుకోవచ్చును.

భక్తి మార్గము అనేది భగవంతుని ఎడల మనము అనుభవించవలసిన సంపూర్ణ ప్రేమ పద్ధతిని గురించి బోధిస్తుంది. ఈ పద్ధతిలో భక్త - భగవత్ సంబంధాలు ప్రేమాధారాలు. భక్తుడు భగవంతునికి విశ్వాస పాత్రుడైన సేవకుడుగా, తనయుడుగా, భార్యగా, శిష్యుడుగా రకరకాల పాత్రలను ధరించి భగవంతుని సేవ ఏది చేసినా తనను తాను మరచిపోతాడు. ఆయన దానిని ఎంతో మెచ్చుకొని తన భక్తునికి మోక్షాన్ని ప్రసాదిస్తాడు. ఈ పద్ధతి మార్గత్రయం అనే మూడిటిలో మిక్కి సులభ సాధ్యమైనది. ముఖ్యంగా ఎక్కువ జ్ఞానంతో ప్రకాశించని వారు, భక్తి పద్ధతి యందు ప్రారంభకులు; ఈ పద్ధతిని చేపట్టగలుగుతారు.

జీవితంలో తటస్థపడే ప్రతివిషయం పట్ల ఒకానొక విరాగ దృష్టిని పెంపొందించు కోవడం అభ్యాసం చేసుకుంటే, అది వైరాగ్య మార్గం. వ్యక్తిని అనుసరించి ఉండే కర్మాను బంధం వైరాగ్యమార్గం ద్వారా తొలగిపోతుంది. అనగా అతడు వైరాగ్యమార్గము వలన ప్రాపంచిక బంధాల నుండి విముక్తుడై పరమాత్మతో పునరైక్యం కావడం సాధ్యమవుతుంది. ప్రస్తుత ప్రపంచంలోని అన్ని జీవికారంగాలవారు, అని వయో - మేధో స్థాయిల వారు - (తమతమ జీవిత పరమాశయాలు నెరవేరాలంటే) ఈ పద్ధతిని అభ్యసించగలగాలి, అభ్యసించాలి కూడా.

మూడవది జ్ఞానమార్గము. ఈ పద్ధతిని ఆశ్రయించే సాధకుడు ఉత్తమ స్థాయి అధ్యాత్మిక జ్ఞానాన్ని సముపార్జించుకోవాలి. దాని వలన అతడు ఈ ప్రాపంచిక సుఖాలు ఎంతటి క్షణ భంగురాలు, మోక్షానందం ఎంత శాశ్వతము - అనే విషయాల పట్ల పరిపూర్ణ విశ్వాసాన్ని పొందుతాడు. అతనిలో ఆజ్ఞానోదయం కావడమే చివరికి అతని మోక్షంగా పరిణమిస్తుంది. ఈ పద్ధతి మార్గత్రయంలో మిక్కిలి క్లిష్టమైనది. ఎందుకంటే లోకానుభవం చేత గాని, విద్య వలన గాని సామాన్య మానవుడు, అందుకోలేనంత ఉన్నత స్థాయి ఆధ్యాత్మిక జ్ఞానం దీనికి అవసరం.

ఈ మూడు మార్గాలూ ఒకదాని కొకటి విరుద్ధమైనవి కావు. అంతేకాక, అభ్యాసపు ఉన్నత దశల యందు సాధకుడు, ఈ మూడు పద్ధతులలోని సారూప్య లక్షణాలను

దర్శించి ఇవి ఒక మహానదికి ఉండే మూడు ఉపనదులవలె ఒకదాని కొకటి అనుబంధ సదృశాలని గ్రహించుకుంటాడు. ఏకాగ్రమైన ధ్యానం ద్వారా ఏర్పడిన ప్రబలమైన భక్తికి పరాకాష్ఠ పరమాత్మను గురించిన జ్ఞానమే. కర్మ ఫలం పట్ల బొత్తిగా అనాసక్త వైఖరిని అవలంబించగలిగేవాడు, ఏపని చేసినా తాను భగవంతుని చేతులలో కదలాడే ఒక సాధనము వంటివాడే అని తిరుగులేని విశ్వాసం ఏర్పరుచుకున్నవాడు; భగవద్భక్తిని ఇంకొక రూపంలో కలిగి ఉన్నాడని భావం.

★

## మూడవ అధ్యాయము

# ఆరాధన

# 8. భక్తి

పరమాత్మను చేరాలన్న ధ్యేయంతో సాగే వ్యక్తికి తన అన్నిరకాల ప్రాపంచిక కార్యక్రమాలపట్ల సంపూర్ణ నిస్సంగత్వ వైఖరి ఒకానొక పూర్వాకాంక్షిత ఆవశ్యకత. ఇక్కడ నిస్సంగత్వం అంటే, తనయందు నిబద్ధితమైన కర్మపట్ల కఠినమైన అశ్రద్ధకాదు, ఖచ్చితమైన నిర్లక్ష్యం కూడా కాదు. ఆ నిస్సంగత్వం, అతడు తన కర్మనిర్వహణకు గాను- విధాయకంగా పాటించుకోవలసిన ఒకానొక మానసిక ప్రవృత్తి. ఒకరైలుబండి పట్టాలమీద నడుస్తున్నది. పట్టాలకు ఇరువైపులా నేత్రానందకరమైన పచ్చిక బయళ్ళు తగిలినా, ఘోర నీరవ పీఠభూములు తగిలినా- పట్టించుకోకుండానే అది వెళ్లాలి. అలాకాక ఆ రైలు ఆ పరిసరాల అందచందాల పరిశీలన (ఆనందం) కోసం అక్కడా ఇక్కడా ఆగుతూ పోతే ఆ రైలు దాని గమ్యస్థానాన్ని సకాలంలో చేరలేకపోతుంది. అలాగే మోక్షం ధ్యేయంగా నిలుపుకుని సాగే సాధకుడు తన దృష్టిని ప్రాపంచిక ఆనందాల వైపు మళ్లించుకుని ఆ అసంగత అవరోధాలమీద శ్రద్ధ ద్వారా తన కాలాన్నీ, శక్తినీ వృధా చేసుకోకూడదు. సాధకునికి తటస్థపడే ప్రాపంచిక ఆకర్షణలు అంతకంటే బలమైన, ఆరోగ్యకరమైన (ఆధ్యాత్మిక) విషయాల చేత వేరే దిక్కుకి మళ్లి, నిరర్థకమయితే అతనికి అవసరమైన నిస్సంగత్వం అతనిలో ఉత్పాదమవుతుంది. అలా అతనిని మళ్లించగలిగే విషయాలు అంత సులువుగా లభ్యం కావు. కాని, ఆ లభ్యమయ్యే వాటిలో అనంత శక్తిమంతమైనది "మంచి" ఎడల దీక్ష. అది భగవద్భక్తికి సమానము.

భగవంతుని ఎడల కలిగే భక్తి, ఆయన ఎడల కలిగే ప్రేమమునకు మరొక రూపము. మనము సామాన్య మానవులము. మనము ఒక వ్యక్తియందుగాని, ఒక వస్తువునందు గాని ప్రేమమును కలిగి ఉండాలంటే; ఆ వ్యక్తి, లేక ఆ వస్తువు గురించి మనకు అనుభవైకవేద్యత ఉండాలి. అట్టి వ్యక్తిని లేక వస్తువును గురించి మనము విని ఉండాలి లేదా, చూచి ఉండాలి; లేదా, వ్యక్తిగతమైన గాఢపరిచయం ఉండాలి. భగవంతునితో సంగతి అదికాదు. ఆయనను మనం ఎన్నడూ చూడలేదు. ఆయనతో మనకు ఎలాంటి వ్యక్తిగత సంబంధం లేదు. వేద్యత లేదు. మనకు ఆయనతో ఉన్న అనుబంధమంతా ఊహాత్మకమైనది మాత్రమే.

ఒకడు పుట్టుకతోనే భక్తుడు కాలేదు అనుకుందాము. అప్పుడు అతనిలో భక్తి భావాన్ని పెంపొందించాలంటే, దానికి ఒక ఉత్తమమైన మార్గం ఉంది. అతని మానసికస్థితి సద్బోధకు స్పందించగలదిగా ఉన్నప్పుడు- అనగా అతని బాల్యంనుండి- అతనిలో కొన్ని ఆధ్యాత్మికపు అలవాట్లు (అభిరుచులు, నియంత్రణలు- మొదలైనవాటిని) బలాత్కారంగా జొప్పించడమే. బాల్యానికి దైవత్వంతో ఒకానొక అనిర్వచనీయమైన తాదాత్మ్యత ఉంది. ఒక బిడ్డ తన తల్లిని ప్రేమతో జయించుకోగలిగే విధంగా, ప్రేమ అనేది భక్తిగా పరిణమించి భక్తుడు ఆ బలీయమైన ఆయుధంతో భగవానుని గెలుచుకో గలుగుతాడు.

★

# 9. సగుణ బ్రహ్మము

బ్రహ్మము గుణాతీతమైన స్థితి.
గుణాతీతమైన స్పృహ. పరమ ఆనందం.
అది శాశ్వతం, ద్వంద్వాతీతము, కర్మాతీతము.

వివేక చూడామణి (శ్రీ శంకర భగవత్పాదులు)

భగవానుడు భక్తునికి రెండు స్వరూపాలలో కానవస్తాడు: లక్షణ సమన్వితుడైన సగుణ బ్రహ్మముగా, లక్షణ రహితుడైన నిర్గుణ బ్రహ్మముగా. ఈ రెండు స్వరూపాలలో ఏది ఉన్నతము- అనేది నిర్వచించుకోవడానికి కాక పరమాత్మను రెండు వైవిధ్యభరిత దృక్కోణాలనుండి అవగాహన చేసుకోవడానికే ఈ స్వరూప విచక్షణ. ఈ రెండు దృక్కోణాలు: భక్తునికి గల అభిరుచి, ప్రతిభ- ఆధారంగా రూపొందుతాయి.

సాధారణ మానవుని భాషలో లక్షణ సమన్వితుడైన భగవానుడు "సత్-చిత్-ఆనందము" (స్థితి, జ్ఞానం, ఆనందం. ఇలా నిర్వచించుకోవడం అసలు, పేరు అనేదేలేని ఆ దివ్య పదార్థాన్ని ఒక పేరుతో చెప్పుకుంటున్నామని కాక. ఆ పరమాత్మను మన అవ గాహనా పరిధిలోనికి తెచ్చుకుంటున్నట్టు మాత్రమే గ్రహించుకోవాలి. అలా నిర్వచించు కోవడం ద్వారా సమస్త విశ్వం ఆయన శరీరం అనీ, గ్రహాల- నక్షత్రాల- ఖగోళ మండలాల నిర్విరామ పరిభ్రమణం అంతా ఆతని జీవశక్తి అనీ, బ్రహ్మాండ కార్యక్రమం అంతా అతని స్వభావం అనీ గ్రహించుకోగలుతాము.

పరమాత్మను గురించి చేసుకొనే ఇలాంటి ఏ వ్యాఖ్య అయినా సాధారణ పరిమాణ బుద్ధిమంతులకు ఏపాటి అయినా సులభ గ్రాహ్యంగా చెప్పినట్టు కాదు. అందుచేత ఆ భావాన్ని మరింత విస్పష్టంగా గ్రహించుకోవడానికిగాను మన శ్రుతులు, పురాణ సాహిత్యం పరమాత్మ స్వరూపాన్ని వికేంద్రీకరించి సృష్టి-స్థితి-లయ శక్తులకు ప్రతీకలుగా బ్రహ్మ-విష్ణు-మహేశ్వర మూర్తిత్రయాన్ని ప్రాధమిక రూపాలుగా (దైవసంబంధ వారసత్వంగా) నెలకొల్పినవి. (సృష్టి, స్థితి, లయ కారులయిన త్రిమూర్తుల పరిక్రియలు సాధారణ మానవ అవగాహనకు దుర్‌గ్రాహ్యాలు అనే సిద్ధాంత పరిణామంగా), మధ్యస్థాయిలో ఇంద్ర, అగ్ని, వాయు దేవులవంటివారు, దిగువస్థాయిలో గ్రామదేవతల వంటివారు (తమ తమ శక్తులకు, ప్రభావాలకు అనుగుణమైన వృత్తాంతాలతో) ఉదాహృతు లయినారు. "ఎక్కువ జ్ఞానం లేనివారి" అవగాహన నిమిత్తం, దిగువ-మధ్య-ఉన్నత: స్థాయిల దైవాల రూపలక్షణాలను మరింతగా స్పష్టపరచడానికి గానుఅసంఖ్యాక రీతుల ఆదర్శాలకు భౌతిక రూపాలుగా; విగ్రహాలు, ఆలయాలు వచ్చాయి. ఆలయ ప్రాంగణా లలో (ఏర్పడే) వాతావరణం, దైవత్వం ఆపాదించి (తయారు చేసుకుని) ఉన్న విగ్రహాలు

యాదృచ్ఛికంగానే (కాక సహజంగా కూడా) దైవం మీద నమ్మకానికీ ప్రార్థనలో ఏకాగ్రతకీ ప్రేరణలు అయ్యాయి.

మన పూర్వులు ఇలాగ విస్తార రీతిలో (ఎన్నో రూపాల - ఎన్నో స్వభావాల- దైవాలను) సృజించారుకదా అని, వారు పరమాత్మ ఏక నిష్ఠ స్వరూపాన్ని కాదన్నారని అనుకోకూడదు. తెలియని వారికి తెలియజెప్పడం కోసం జ్ఞాని కొంతమేరకు దిగి రావలసి వస్తుందన్నదే అందులోని పరమార్థం.

★

# 10. ప్రార్థన

మరణానంతరము పుణ్యజీవి ఉత్తమ లోకములకు,
పాపజీవి అధమజన్మములకు చేరును. పుణ్య పాపములు రెంటినీ
ఒనరించిన వాడు మానవలోకమునందే పునర్జన్మమును పొందును.

-ప్రశ్నోపనిషత్తు

మానవ నిర్మాణములో మనసు ఒక కీలక స్థానం కలది. దీనికి నిర్మాణాత్మక, వినాశనాత్మక ధోరణులు రెండిటిలోనూ అపారమయిన శక్తి సామర్థ్యాలు ఉంటాయి. మనసు సరైన దిశలో పనిచేస్తే స్వర్గానికీ, వ్యతిరేక దిశలో పనిచేస్తే నరకానికీ మానవుడిని చేకొని పోగలది.

అంతకంటే ముఖ్యమయినది ఇంకొకటి ఉంది. మనసుకు నమ్మరానంత నిగూఢ శక్తి ఒకటి ఉంది. సమర్థంగా నిర్వహించాలే గాని, మనసు దేనిని తలచుకుంటే దానిని నిజం చేయగలశక్తి అది.

మరణానంతరం; ఆత్మ; ఈ దేహాన్ని ఇక్కడ వదిలేసి, పుణ్య పాపాల కర్మభారంతో వేరే ప్రపంచానికి వెళ్లి, అక్కడ వాటిలో కొంత భాగాన్ని పరిహరించుకొని, అపరిహార కర్మభార భాగాన్ని తదనుగుణమైన చర్యలతో రద్దుపరచుకోవడానికి గాను తిరిగి ఈ భూమిమీద పునర్జన్మను పొందుతుంది. కర్మభారము పూర్తిగా పరిహృతమయ్యేటంత వరకు సుదీర్ఘ కాలం ఈ క్రమం పునః పునః కొనసాగుతుంది,

సాధారణంగా మనము ఈ భూమిమీదికి వచ్చినప్పుడు (గత జన్మలకు సంబంధించిన) ఘనమయిన పాపభారంతోనే వస్తాము. అట్టి పాపభారాన్ని దానికి వ్యతిరేక శక్తి అయిన పుణ్యం వలననే పరిహరించుకోగలుగుతాము. పుణ్యం అనేది ప్రార్థన ద్వారా పుష్కలంగా ఉత్పత్తి అవుతుంది. ఎందుకంటే ప్రార్థనలో మనసు భగవానుని తలుస్తుంది. భగవానుడు తాను రూపుదాల్చిన పుణ్యమే. అదికాక, మనసు దేనిని తలచుకుంటే దానిని నిజం చేయగల శక్తి కలది. ఈ విధంగా పుణ్యసముపార్జన ఒనగూడుతుంది.

అసలు ప్రతీ చర్యకూ సమానమయిన ప్రతిచర్యఉంటుందని సూత్రం. పాప పరిహారార్థం నిర్వహించే ప్రార్థన ఒకానొక ప్రతిచర్య. ఈ ప్రతిచర్యవలన దైవవరంగా పుణ్యం జనిస్తుంది... ఈ క్రమంలో కూడా పాపము ప్రార్థన వలన పరిహృతమవుతుంది.

ప్రార్థన మిక్కిలి అమూల్యమయినది. అర్థం తెలిసి, చైతన్యం కలిగి, పరిపూర్ణ శక్తితో ఏకాగ్రతను నిలుపుకుని నిర్వహించే ప్రార్థన; అత్యుత్తమంగా భాసించి, అభిలషించిన ఫలితాన్ని ఉత్పత్తి చేయగలడు. మనకు పరిచయంలేని భాషలో, పద్యరూపంలో నిబంధించినది, (దాని అర్థమేమిటో మనకు సరిగా తెలియనిది)- అయిన ప్రార్థన

నిర్వహించినప్పటికీ ఆ ప్రక్రియ సమయంలో మనము భగవానుని గురించి తలచు కుంటాము గనుక అదికూడా మంచిదే. మత సంబంధ సూత్రాలను అనుసరించి యాంత్రికంగా నిర్వహించే ఏదైనా కర్మకాండ సందర్భంగా చేసే ప్రార్థనలో కూడా, అట్టి ప్రార్థకుడు ఆ ప్రక్రియ యావత్తు సమయమునందున్నూ తనకు తెలియకుండానే (ఇదంతా ఒక ఆధ్యాత్మిక కార్యక్రమం అని భావించి) భగవంతుని యందు దృష్టి నిలుపుకుంటాడు కనుక అది కూడా మంచిదే. సరాసరిగా నిబద్ధతతో ఉద్దేశపూర్వకముగా చేసే ప్రార్థనకు ఈయీ పద్ధతి ప్రార్థనలు తులతూగక పోయినా సరే, వీటివలన కలిగే పుణ్యం కూడా తక్కువ కాదు.

ఏతావతా ధ్యానం ద్వారా, వల్లేవేయడం ద్వారా, మంత్ర ఉచ్చారణ ద్వారా ఎలా చేసినా సరే; ప్రార్థన సలక్షణంగా భాసించి, ఆత్మను భవబంధాలనుండి విముక్తి చేయడానికి గాను అనుకూల ఫలితాలను ప్రసాదిస్తుంది.

★

# 11. అంతిమక్షణ భక్తి

---

మరణ సమయమునందు నన్ను స్మరించుచూ శరీరమును
విడుచుజీవి నా సాయుజ్యమును పొందును. సందేహం లేదు.

-శ్రీమద్భగవద్గీత, అక్షరపరబ్రహ్మయోగము: 5

---

మనలో చాలమందికి ఒక గొప్ప సంప్రదాయం అలవాటుగా ఉంది. చనిపోతూ పోతూ ఉన్న వారి చెవిలో "నారాయణ నారాయణ" అని బిగ్గరగా ఉచ్చరించడం. దీని వెనుక ఒక బలవత్తరమయిన నమ్మకం ఉంది. చనిపోతున్న వ్యక్తి ఆ నారాయణ నామోచ్చారణ తానే స్వయంగా చేయకపోయినా, ఆ వ్యక్తియాత్మ ఆ సమయమునందు భగవంతుని చింతనలో ఉంది కనుక, మోక్ష సాధన జరుగుతుందని.

శ్రీకృష్ణ పరమాత్మ అర్జునునికి భగవద్గీతలో, నమ్మకమయిన బోధగాచేసినది కూడా ఇదే. సాధకునికి ఇంతకంటే ప్రామాణికమయిన, ప్రోత్సాహకరమయిన- పలుకు మరి ఒకటి ఉండదు. అయితే, ఆ క్లిష్ట సమయంలో భగవానుని నామాన్ని జ్ఞప్తికి తెచ్చుకోవడానికి నిజంగా సాధ్యమవుతుందా?

ఒక్కొక్కప్పుడు, మృత్యువు వ్యక్తిని, ఒక ప్రమాదంలో వలె హఠాత్తుగా పైకొనవచ్చు. లేదా, స్పృహలేని స్థితిలో నెమ్మదిగానయినా అది సంభవించవచ్చు. ఎలా అయినా సరే, మనిషికి ఆ సమయంలో దేనిని గురించి ఆలోచించడం అయినా అసాధ్య సదృశమే. ఇక భగవంతుని మాట ఏం చెప్పాలి?

పోనీ, మృత్యువు అతడు పూర్తి స్పృహలో ఉన్నప్పుడు తగినంత హెచ్చరికతో సంభవిస్తున్నది అనుకున్నా, అప్పుడు అతని మనసు సాధారణంగా: ఆ మృత్యుభయంతో, తాను ఎంతో ప్రేమించిన బంధు-మిత్ర సందోహాన్ని విడిచి వెళ్లడంలో కలిగే విచార వ్యథలతో, దేహం అనుభవించే తీవ్రబాధా వ్యగ్రతతో నిండి ఉంటుంది. ఇన్ని రకాల మృత్యు సందర్భాలు దేనిలోనూ కూడా భగవంతునిపై ఏకాగ్రదృష్టి, కనీసం ఆయనమీద తలపు అనే సమస్యే ఉండదు.

అయితే, ఇవన్నీ ఏవి ఎలా ఉన్నా, మరణ సమయంలో భగవంతుడిని జ్ఞప్తికి తెచ్చుకునే మార్గం ఒకటి ఉంది. మానవుడు తన బాల్యంనుండి తాను ఆరోగ్యంగా ఉత్సాహంగా ఉన్నప్పటినుండి కూడా మృత్యువు అనే విషాదకర స్థితి తప్పదు- అని గ్రహించుకొని, దానికి చాలా ముందుగానే సంసిద్ధంగా ఉండాలి. ఆ నేపథ్యంతో అతడు అనుదినం క్రమం తప్పక తగినంత దీర్ఘ సమయం చొప్పున భగవన్నామోచ్చారణ అభ్యాసం చేసుకుంటూ ఉండాలి. ఆ నామోచ్చారణ కోసం కేటాయించుకొన్న సమయాలలోనే కాక (తాను పనిచేసే చోటికి ప్రయాణం చేస్తున్నప్పుడు, ఎవరయినా మిత్రుని కోసం

వీధి మూలను నిరీక్షించేటప్పుడు, లేదా, రాత్రిపూట నిద్ర పట్టనప్పుడు- ఇలాగ) ఎప్పుడు అవకాశం వస్తే అప్పుడు భగవన్నామోచ్చారణ చేసుకుంటూ ఉండాలి. మానవుడు తన జీవితంలో సుదీర్ఘకాలం పాటు ఇలాగ (భగవన్నామోచ్చారణ) అభ్యాసం చేసుకుంటూ పోతే అది ఒక అలవాటు (శక్తి)గా మారి, అతడు మరణ సమయంలో భగవంతుని నామాన్ని జ్ఞప్తికి తెచుకొని ఉచ్చరించుకోగలుగుతాడు.

★

# 12. ఆత్మార్పణము

సర్వధర్మములను పరిత్యజించి, నన్నేశరణు కోరుము.
విచారమువలదు. నేనే నన్ను సకలపాప విముక్తుని చేయుదును.

-శ్రీమద్భగవద్గీత, మోక్షసన్న్యాసయోగము. 66

సగుణ బ్రహ్మాన్ని ఆరాధించేవాడు· సాధారణంగా, భగవంతుడు మనుష్య రూపంలో ఉంటాడని ఊహిస్తూ, మానవునిలో కానవచ్చే ఉదాత్త గుణాలన్నిటినీ ఆతనికి ఆపాదిస్తాడు. అట్టి ఉదాత్త లక్షణాలలో ముఖ్యమైనదిగా ఆపాదించేది భగవంతునికి కరుణ ఉంటుందని.

భక్తి అనేది ప్రేమమునకు పరాకాష్ఠానిర్వచనం. ఇది: భక్తుడు, తన స్వప్రయోజనాలతో సహా, సర్వ ప్రపంచాన్ని విస్మరించి, దాపరికం లేకుండా పరమాత్మకు సర్వమూ అర్పించు కున్నప్పుడు నిజమై ఋజువవుతుంది. అప్పుడు, అతడు: తానూ దైవమూ వేరు వేరు కాదని, తనను సృజించిన ఆ ప్రభువులో తాను ఒక భాగము మాత్రమేనని· తన ప్రతి చర్యలోనూ భావించుకో గలుగుతాడు. తనకు సంబంధించిన అన్నిటి పూచీ ఆయనదేనని, అతడు ఒక తల్లి ఒడిలోని బిడ్డవలె నిశ్చింతలో ఉంటాడు. తప్పించుకోలేని బాధ్యతతో తనను సర్వవిధాలా సంరక్షించవలసిన ప్రభువుగా భక్తుడు ఆయననే నిబంధిస్తాడు. తనను తాను సర్వార్పణం చేసుకొనే ప్రతివానికీ, తాను సకల పాప విముక్తి సలుపుతానని భగవద్గీత ద్వారా పూచీ పడ్డాడు. తనను శరణు కోరిన వారి అన్ని బాధ్యతలను తనపైన వేసుకొని, అట్టివారి సర్వతోముఖరక్షణ తానేనని వచించాడు. భక్తుడు భగవంతునికి పూర్తిగా ఆత్మార్పణం చేసుకున్నాడు కదా అని, నీటిలో మునిగిపోయేవాడు నిస్పృహతో చేతికి దొరికిన గడ్డిపోచను పట్టుకొన్నట్టుగా అతడు కేవలం నిస్సహాయుడై అలా చేశాడని అపార్థం చేసుకోకూడదు. పరమాత్మలో ఐక్యం కావడానికి; అతడు· తెలివిగా ఆలోచించి, బుద్ధిపూర్వకంగా, నిదానంగా తీసుకున్న చర్య అది. జీవాత్మ తన అంతిమ లక్ష్యాన్ని చేరుకోడానికి చేసే ప్రయత్నాల శ్రేణికి ఫలశ్రుతి అది. ఒక నది సముద్రంలో కలిసి పోవడానికి ముందు దానిలో ఒక ఉపనది కలిసినట్టు; అంతకి ముందు ఆ ఉపనదిలో కలిసే ఒకవాగు - అలాంటిది, ఆ ప్రక్రియ. ఇక్కడ, ఆత్మార్పణం అంటే - ఆత్మ సాఫల్యాన్ని పొంది జీవాత్మను తెలుసుకోవడం - అనే తెలియాలి.

కొందరుంటారు. వాళ్ల స్వభావరీత్యా ఖచ్చితంగా సన్మార్గులు కాకపోవచ్చు. వాళ్లకి దృఢమైన పట్టుదలా విశ్వాసమూ లేకపోవచ్చు. వాళ్లకి ఆత్మార్పణ మార్గం సునువుగా ఉండదు మరి. అలాంటి వాళ్లుకూడా, భగవంతుని అవతారాల కధలనూ ఆతని గుణాలనూ సతతం వింటూ; తద్వారా ఆత్మార్పణకు అనుగుణమైన మానసిక ప్రవృత్తిని పెంపొందించుకోవచ్చు. నిర్విరామంగా చేసే ప్రయత్నం అంటూ ఒకటుంటే, అది లొంగతీసుకోలేనిదంటూ ఉండదు.

★

# 13. జపము

యద్భావం తద్భవతి

- అష్టావక్ర సంహిత

మనము ఏమి కావాలని అనుకుంటామో అదే అవుతాము. ఈ సూత్రం ఎంతో పురాతనమైనది, ఆమోదం పొందినది. అనుకున్న వెంటనే అయిపోము. "అవడం" అనేది ఏమి అవాలి అని అనుకుంటున్నామో ఆ విషయం, ఆ అనుకోవడం ఎంత శక్తి మంతమో - అలాంటి విషయాలపైన ఆయా ఆలోచనలకు సహాయపడేవి - లేక, వాటిని వ్యతిరేకించేవి; అయిన కొన్ని ఇతరేతర విషయాల మీదకూడా ఆధారపడి త్వరగానో, లేక ఆలస్యంగానో జరిగి తీరుతుంది. ఎప్పుడో ఒకప్పుడు ఆ ఉద్దేశం ఒక దృఢమైన రూపంలో నిజం అయి తీరవలసిందే. అదంతా మనసుకు ఉన్న అంతర్గత శక్తి.

సరే, మనము ఏమో అవుదామని అనుకుంటాము. అలా అనుకొనే వాటిలో దైవం కూడా ఉండవచ్చు. అసలు మనము దైవము అవాలని అనుకోగలిగితే ఆ భావం అన్ని ఇతర భావాల కంటె గొప్పది. ఎందుకంటే, దైవము అన్నిటికంటె గొప్ప కనుక. అప్పుడు మనము దైవము అవాలని అనుకుంటే దైవమే అవవలసి ఉంది కనుక, ఆ అనుకోవడాన్ని అనుసరించి ఉన్న ముఖ్య, ఇతరేతర విషయాలు పరిగణనలోనికి తీసుకుంటే సహజంగానే అనుకోవడానికీ, అవడానికీ మధ్య చాలా చాలా సుదీర్ఘకాలం పట్టవచ్చును.

పురాణాలూ హరికథలూ వినడం ద్వారా అయితేనేమి, సామూహిక ప్రార్థనల (భజనల)లో పాల్గొనడం ద్వారా అయితేనేమి, ప్రత్యక్షంగానో, పరోక్షంగానో దైవంపై మనం మన ఆలోచనలను నిలుపుతాము. సంగీతాది కళా స్వరూపాల యందు అభిరుచి వలన గాని, మేధో సంబంధమైన ఉత్సుకత వలన గాని మనము ఆయా ప్రక్రియలన్నిటి సందర్భాలలోనూ బుద్ధి పూర్వకంగాగాని, యాదృచ్ఛికంగా గాని భగవంతుని గురించి ఆలోచిస్తూనే ఉంటాము. భగవంతుడిని మన ఆలోచనలలో నిలుపుకోవడానికి మనము నిదానంగా చేసేది కాకపోయినా, అసంకల్పితంగా చేసే చర్య అది. అంతా కలిసి మనము దైవత్వానికి పరిణామం చెందడానికిగాను సహాయపడుతుంది.

ఆశించిన ఫలితాన్ని సాధించడంలో వీటిన్నిటిని మించిన ఫలప్రదప్రక్రియ జపము. జపము అనే దానిని ఒక్కమాటలో నిర్వచించలేము. మనము ఆరాధిస్తున్న దైవం రూపానికిగాని, లక్షణాలకిగాని, సమ్మోహక శక్తికిగాని ఉండే అర్థాన్ని మనసులో నిలుపుకుని మౌఖికంగాగాని, మానసికంగా గాని ఆ దైవానికో, ఆతని నామానికో చేసే నమస్కారం, అది ఒక నిరంతర పునరుచ్చారణగా సాగడమే జపము. భగవానుని స్వరూపలక్షణాలను

ఉద్దేశించి చేసే జపం ఏ ప్రేరణా లేకుండా జరుగుతుంది. కనుక, ముక్తిగామి అయిన సాధకుడిని నామస్మరణ కంటే త్వరగా దరిజేరుస్తుంది.

జపము రెండు రకాలు. మానసికము, మౌఖికము. మానసికమైన జపము నిశ్శబ్దంగా జరుగుతుందని అనుకున్నా; అది, అంతరాంతరంలో (మౌఖిక జపంకంటె) శ్రద్ధగా జరిగేది కనుక, స్థాయిలో ఉన్నతమైనది. మానసిక జపంలో మనుసును గాఢ నిమగ్నతకు నిబంధించడం ఉంది. అట్టి మనో నిమగ్నత (మోక్ష సాధనయందు) విజయ రహస్యంగా భాసిస్తుంది.

అవసరమైనంత శక్తితో, ఓర్పుతో· అనుకూలమైన పరిస్థితులలో, సమర్థుడైన గురువు మార్గదర్శకత్వంలో నిర్వహించుకుంటే, జపము సాధకుడిని సమాధియందుగల దివ్యానందప్రాప్తికి చేకొనిపోతుంది. అదే జీవన్ముక్తి· అనగా- ఈ జన్మలోనే సంభవించే మోక్షప్రాప్తి.

★

# 14. ప్రార్థనలో ఏకాగ్రత

ఏకాగ్రతలేని ప్రార్థన ఆరోగ్యం లేని శరీరంలా, (ఇంకా మొరటుగా చెప్పాలంటే, జీవంలేని అస్తిపంజరంలా (కళేబరంలా) వృథా.

భగవంతుడి దయను కోరుతూ చేసే ప్రార్థన, తప్పనిసరిగా దానికి అనుగుణమయిన ఫలితాన్ని ఇస్తుంది. అదంతా సాధకుడు తాను చేసే ప్రార్థనలో భక్తి ఎంత లోతుగా ఉంచుకోగలుగుతాడో దానిని బట్టి ఆధారపడి ఉంటుంది. భక్తుడు ఎంతటి ఏకాగ్రతతో తాను ఉద్దేశించిన దైవాన్ని ప్రార్థిస్తాడో, అంత త్వరగా, అంత నమ్మకంగా ఫలితం కలుగుతుంది.

ప్రార్థనలో ఏకాగ్రత ఉన్నత స్థాయిలకు చేరిన కొలదీ భక్తుడికి తన శరీరం మీద స్పృహ తగ్గుతూ, (క్రమంగా) ఆ శరీరంలోని వివిధ అవయవాలు బాహిర సంబంధాలకు స్పందించడం మానేస్తాయి. ఆ స్థితిలో అతడు దేనినీ చూడలేడు వినలేడు, ఆఘ్రాణించ లేడు, స్పృశించలేడు. తన శరీరం మీద పాములు ప్రాకినా, పూవులు వర్షించినా అతడు చలించడు. అతని మానస దృష్టి ఒకే ఒక స్వరూపం మీద (ఆ స్వభావం మీద) నిలకడగా ఉంటుంది. అతడు దానిని తప్ప, మరి దేనినీ చూడని స్థితికి, తన మనసు గానితోనే మమేకం చెందే స్థితికి. చేరిపోతాడు.

చెదురు బెదురులు లేకుండా, మనము అట్టి ఏకాగ్రతతో జపము చేసుకుంటే, అది కోరిన ఫలితాన్ని తప్పనిసరిగా ప్రసాదించి తీరుతుంది. అయితే, ఆధునిక సమాజంలో ఒక సాధారణ గృహస్థు, అట్టి పరిపూర్ణ ఏకాగ్రతా భావంలోకి తనను తాను తీసుకుని పోవడమనేది శక్తికి మించిన పని. అట్టి పరిపూర్ణ ఏకగ్రతాస్థితిని చేరాలంటే, దానికి కొన్ని సంవత్సరాల (లేక, కొన్ని జన్మల) సుదీర్ఘ కాలంపాటు చేసే కఠోర అభ్యాసం కావాలి. ఏదో కొన్ని రోజులలో, లేదా, కొన్ని వారాలలో అట్టి అభ్యాసం చేసేసి. దానిని సాధించడం ఇంచుమించు అసాధ్యం. ఒకవేళ అలా ఎవరికైనా అట్టి స్థితి స్వల్పకాలంలో సాధ్య మయింది- అంటే, దానికి వెనక అతడు తన పూర్వ జన్మలలో ఇదంతా సుదీర్ఘ కాలంపాటు అభ్యసించి పూర్తిచేసుకున్నాడని అర్థం. అలా ఆ స్థితిని సాధించలేనివాడు, ఈ పరిశ్రమ అంతటికీ దానికి అవసరమయినంత సుదీర్ఘకాలంపాటు ఇంకా లోను కావలసి ఉందని అర్థం.

సర్వజ్ఞుడు, న్యాయ నిష్ణాతుడు అయిన భగవానుని (ఆరాధన, సన్నిధి, ఐక్యత) విషయాలలో విజయానికి అడ్డదారులు, చిట్కాలు ఉండవు. ప్రయత్నం (లో పరిశుద్ధత ఉంటే, అది) వృథా పోదు. తపము లేనిదే వరప్రదానం ఉండదు.

★

# 15. భక్తునికి లభించే కనికరము

(శ్రీ భగవానువాచ:)

నీ మనసును, ఆలోచనలను నాయందే నిలుపుకో
అప్పుడు, నీవు నాయందు తప్పక నివసిస్తావు.

అలా, మనసును నాయందు నిలుపజాలని ఎడల,
అభ్యాసయోగంలో నన్ను చేరడానికి ప్రయత్నించు.

అలా, (అభ్యాసయోగం) చేయజాలక పోతే, నీ సకల కర్మములను
నా కొఱకై నిర్వర్తించు. ఇలాగ కూడా నీవు సిద్ధి పొందుతావు.

అలాగ (కర్మనిర్వహణ నా కొఱకై) చేయడానికి కూడా నీవు
అశక్తుడవయితే, అప్పుడు కర్మఫలమునంతటినీ త్యజించు.
మనసును, ఇంద్రియాలను నిగ్రహించుకుని నాయందే ఆశ్రయం తీసుకో.
ఇలా చేసినా సరే, నీవు నన్ను పొందగలవు.

-శ్రీమద్భగవద్గీత, భక్తియోగము . 8,9,10 11

నిజమయిన భక్తుడు ఏ తరగతికి- ఏ కులానికి- ఎ తెగకి: చెందిన వాడయినా; ఏ వయో-ఆరోగ్య-తదితర పరిస్థితులకు లోబడి పనిచేసుకోవలసిన వాడయినా; అట్టి అందరికీ, ఎవరికి వారికి; భగవదారాధనకుగాను: ఆయా స్థితులకు అనుకూలమయిన మార్గం ఏర్పడి ఉంటుంది, మరిన్నీ, అతనిని తన అంతిమ లక్ష్యమయిన మోక్షానికి చేకొనిపోతుంది.

భగవంతునియందు పరిపూర్ణ మనోఏకాగ్రతతో నిలిపే భక్తి ఉత్తమమైనది, మిక్కిలి ఫలవంతమైనది. అయితే, మనం ప్రస్తుతం ఉంటున్న అధునాతన జీవనంలో రకరకాల చాంచల్యభరిత సంక్లిష్టతలు తటస్థిస్తాయి. (అందువలన) ఈ అధునాతన మానవుడు తన దైవాన్ని ప్రార్థించుకొనేటప్పుడు (ఆ ధ్యానమునందు నిబద్ధం కావలసిన) ఏకాగ్రత గల దృష్టిని నిలుపుకోడం చాలా కష్టం. అలాంటి సందర్భంలో భక్తుడు అభ్యాసయోగాన్ని ఆశ్రయించుకోవాలి. అభ్యాసయోగం అంటే కఠినము, నిలకడ- అయిన అభ్యాస పద్ధతి. భక్తుడిలో నిబద్ధత, భక్తిలో ప్రయత్న తీవ్రత (ఈ రెండూ) ఉంటే అట్టి అభ్యాసమే అతనికి అంతా బోధిస్తుంది.

మానవుడికి ఉన్న రెండు నిగూఢ అంతరావయవాలు మనసు, బుద్ధి. మనసు భావిస్తుంది, బుద్ధి (అందులోని సామంజస్యాలను గురించి) నిర్ణయించి నిశ్చయిస్తుంది.

ఈ రెండు విలువలను ప్రణాళికా బద్ధంగా, నిరంతర ప్రయత్నంతో అనుసంధానించుకొని పని చేస్తే; భగవత్ దృష్టికీ, ప్రాపంచిక దృష్టికీ మధ్య మనసును ఊగులాడనివ్వకుండడ మెలాగో నేర్చుకోగలుగుతాడు. అలా అలా మనసును అన్ని ఐహిక అవరోధాలనుండి పూర్తిగా దూరం చేసుకోగలుగుతాడు. ఇట్టి అభ్యాసాన్ని (ముఖ్యంగా) ఒక సానుభూతి పరుడైన, అనుభవజ్ఞుడైన గురువు మార్గదర్శకత్వంలో సుదీర్ఘ కాలంపాటు నిరంత రాయంగా చేస్తే, మానవుడు తన మనసు అసలు వైఖరిని హీనమయిన లౌకిక మార్గంనుండి ఉత్థానాత్మకమైన ఆధ్యాత్మిక మార్గానికి పునరుద్ధరించుకోగలుగుతాడు.

అయితే, సాధకుడు ఇలాంటి కఠోర అభ్యాసం తన భౌతిక మానసిక సామర్థ్యాల దృష్ట్యా తలకి మించిన భారం అనుకుంటే, దానికి కూడా ఒక మార్గాంతరం ఉంది. తాను ఈ చర్యలన్నిటినీ తన ప్రభువైన భగవంతుడి కోసమే నిర్వహిస్తున్నానని భావించే మనస్థితిని అలవరచుకోవడానికి ఉద్దేశ పూర్వకంగా ప్రయత్నించుకోవాలి. ఇదంతా ఆలోచనా సంబంధమైనది. ఏపని చేస్తున్నా అదంతా తనకోసం కాదనీ, భగవంతుడి కోసమేననీ అనుకుంటూ ఉండాలి. ఈ మనోతత్త్వం నిరంతరం నెలకొని ఉండాలి, సదాగుర్తుకు తెచ్చుకుంటూ ఉండాలి. "దేవా, నీ కార్యమును నీవు నా ద్వారా చేస్తున్నావు. నేను నీచేతులలో (ఉన్న) ఒక సాధనాన్ని మాత్రమే," అని మానవుడు ఎల్లప్పుడూ తలచాలి. అతని స్వభావంలో స్థిరంగా నాటుకొనే ఈ వైఖరి అతని మనసును ప్రక్షాళనం చేసి అతని విమోచనానికి దారి తీస్తుంది.

అలాటి అభ్యాసం కూడా కష్టమని అతనికి అనిపిస్తే దానికి కూడా మార్గాంతరం ఉంది. తన అన్ని చర్యలకూ కలిగే ఫలితాల సంగతి దేవునికి వదిలెయ్యడమే. ఇలాంటి ధోరణి అతనిలో వేళ్లు తన్ని మొలకెత్తితే ఇలాంటి ఆత్మత్యాగం తనని దైవత్వపు దిశగా తీసుకుపోతుందని, అతడు అనుభవపూర్వకంగా తెలుసుకుంటాడు. సర్వం భగవదర్పణం చేసుకోవడమే నిర్మల జీవనానికి, సంపూర్ణత్వానికి దారితీస్తుందని గ్రహిస్తాడు. అప్పటికి మోక్ష పదార్థంలో అధిక భాగం అతనికి చేజిక్కినట్లే.

దీనినంతటినీ సంగ్రహంగా చెప్పాలంటే, "సాధకుడు సాధ్యమయినంత తీవ్ర ఏకాగ్రతతో దైవాన్ని ప్రార్థించాలి." అలాటి తీవ్ర ఏకాగ్రత అతనికి ఉన్నట్టుండి అలవడకపోతే-క్రమ పద్ధతిలో, బుద్ధిపూర్వకంగా దానికోసం ప్రయత్నం చేయడం (అభ్యాసయోగం) ద్వారా ఆ తీవ్ర ఏకాగ్రతను సాధించుకోవాలి. అతడు ఆమాత్రం ప్రయత్నం కూడా చెయ్యలేకపోతే, తాను చేస్తున్న అన్ని చర్యలూ తనకోసం కాక భగవానుని కోసం చేయడమే. ఆఖరికి అది కూడా ఏదో కష్టం లాగా అనిపిస్తే, తన అన్ని చర్యల ఫలాలను భగవదంకితం చేయడమే.

ఈ పద్ధతులన్నీ నిజమైన భక్తికి ఉన్న వేరు వేరు విభాగాలే. మరి శ్రద్ధగా, పట్టుదలగా నిర్వహిస్తే, వీటిలో ఏదో ఒకటి భక్తుడిని ఈశ్వర సన్నిధికి చేకొనిపోతుంది.

★

# 16. సత్సంగత్వము

సత్సంగత్వం వలన మానవునికి నిస్సంగత్వము, నిర్మోహత్వము నిశ్చలతత్త్వము (ఒకదాని కారణంగా మరొకటి) లభించి, అతనిని జీవన్ముక్తుడుగా చేస్తాయి.

-ఆదిశంకరులు

ఒక ఇనుపముక్క అయస్కాంత స్పర్శతో తానే అయస్కాంతత్త్వము పొందుతుంది. ఒక దీపం తనకాంతి ఏమీ నష్టపోకుండా ఇంకొక దీపాన్ని వెలిగిస్తుంది. అలాగే సత్సాంగత్యం దుర్మార్గుడిలో కూడా మంచితనాన్ని ప్రేరేపిస్తుంది. మంచితనం కూడా ఒకరినుండి మరొకరికి వ్యాపిస్తుంది.

ఉన్నత ప్రమాణాలవలన పరిణామం చెందే నైతిక ఆధ్యాత్మిక మహనీయులపట్ల ఈ సత్యం మరింత నిజం. ఆధ్యాత్మికత ఒకానొక శక్తి నిలయం. విద్యుత్తును ఉత్పత్తి చేసే డైనమోకి ఆశక్తి పంపిణీ కోసం తీగలు కావాలి. కాని, ఆధ్యాత్మిక శక్తి అలాటి సహాయం లేకుండానే పంపిణీ అవుతున్నది; ప్రతిగ్రహీతను ఐహికస్థాయినుండి దివ్యస్థాయికి లేవనెత్తగల అద్భుతాన్ని చేసి చూపుతుంది.

సత్సాంగత్యం అనేది కొంతమందికి అనవసరశ్రమ అనిపించినా, ఉద్దేశపూర్వకంగా దానిని అన్వేషించుకుని పొందే సాధకులు రాణిస్తారు. మానవుడు, ఎంత చెడినవాడయినా సత్పురుష సాంగత్యము వలన మొదట్లో ఒక జీవనశైలిగా, క్రమంగా ఒక అలవాటుగా ఆ సత్పురుషుల పవిత్రతను అలవరచుకొంటాడు. వారి పవిత్ర సాంగత్యము వలన ప్రయోజనం పొందాలన్న కోరిక అతనికి గాఢంగా ఉంటే, వారిలో అంతర్గతంగా ఉన్న అవ్యాజ కరుణ, శక్తి: అతనికి ఎరుకలేకుండానే అతనిని ఆధ్యాత్మికునిగా దిద్దుతాయి.

సత్సంగము అనగా పవిత్ర మూర్తులతో సహచర్యం. సత్సంగంలో ఉన్న అమేయ మయిన లాభదాయక శక్తిని గురించి మన శ్రుతులూ మత గ్రంధాలూ నమ్మకంగా వివరించి చెప్తాయి. జగద్గురువు ఆదిశంకరులు తన ఒకానొక అమృతమయ శ్లోకంలో సత్సంగత్వము వ్యక్తికి క్రమంగా ముక్తిమార్గాన్ని ఏర్పరచి పెడుతుందని నిర్ద్వంద్వంగా ప్రకటించినారు.

ఆధ్యాత్మికంగా ఉన్నత స్థితికి చేరుకున్న వ్యక్తులు అనుభవజ్ఞానంతో, విశ్వసనీయ భక్తితో నిండిన సరస్సుల వంటివారు. వారి గొప్పదనం, వారు వచించే సూక్తులలోనే కాక, ఆ సూక్తులను అనుసరించి వారు జీవించడంలో ఉంది. వారిలో కొందరు కేవల జ్ఞానులు. వారు తమ ఆధ్యాత్మిక తన్మయతలోని కొన్ని పరమానంద క్షణాలలో అగోచర దైవత్వ కిరణాలను ప్రసరిస్తారు. అవి, వారిని పరివేష్టించి ఉన్న స్థలాన్ని, జనాన్ని; నైతిక పతనం నుండి దైవానుగ్రహలబ్ధివరకు పరిణామం చెందించగల మహాశక్తిమంతమైనవి. దీనినంతటినీ నమ్మాలంటే అనుభవించవలసిందే కనుక, ఏ సాధకుడయినా, తన స్వంత ప్రయోజనం కోసం సత్సంగత్వాన్ని అన్వేషించి, పొంది, ఆనందించాలి.

★

# 17. భక్తుడు ఎలా ఉండాలి

గుణాతీతుడైన భగవానుడు విశ్వమంతటా వ్యాపించి ఉంటాడు. విశ్వంలోని సమస్త చేతనా చేతనాల సారానికీ స్థితికీ ఆతడే సమర్థకారణుడు. అతి సూక్ష్మములైన క్రిముల నుండి పర్వత సదృశ మహా ప్రాణుల వరకు ప్రతి జీవాత్మయందు ఆతడు నివసిస్తాడు. అంతేకాదు, కంటికి కనబడే రకం జీవం లేని లోహాలలో, రాళ్ళ మొదలైన వాటిలో కూడా భగవంతుడు ఉంటాడు. వైభవం, కీర్తి, సౌందర్యం, మహనీయత వంటి లక్షణాల ద్వారా ప్రముఖంగా కానవచ్చే (సజీవ నిర్జీవ) పదార్థాల యందే కాక దుర్నీతి, నీచత్వం, పాపం, దైన్యం వంటి అధమాధమ స్థాయి అవగుణాల యందు కూడా భగవానుడున్నాడు.

కాబట్టి నిజమయిన భక్తుడు సాధారణమైన విగ్రహంనుండి, సజీవుడైన మహర్షి వరకు తన చుట్టూ ఉన్న ప్రతి మహద్-అమహద్ వస్తు-పదార్థ జీవులన్నిటిలోను దైవత్వాన్ని దర్శించి తాను ఊహించిన రూపంలో భగవంతుడిని పూజిస్తాడు.

భక్తుడు తన మనసునందు నెలకొల్పుకొనే విశ్వజనీనత అనే ఈ ఊహవలన అతడు సమాజంలోని ప్రతి వ్యక్తిని ప్రత్యక్ష దైవంగా భావించుకుంటాడు. దాని వలన నిరాడంబరత, నమ్రత అతని ప్రముఖ గుణాలుగా ఏర్పడతాయి. డాబు దర్పాలు తమంతట తామే మాయమై అతనికి దూరమవుతాయి.

అతనికి తగిలే ప్రతిఒక్క వ్యక్తి ప్రత్యక్షదైవమే. దైవము ఎదుట అతడు అసత్యము పలకడానికి సాహసించడు. ఆ విధంగా అతడు పరిపూర్ణ సత్యవాది అవుతాడు. బలవంతులలోకెల్లా బలవంతుడయిన భగవంతుడే తన యందు ఉన్నాడని భావించుకోవడంవల్ల అతడు ఈ భూమిమీద ఉండే ఎవరికీ భయపడడు.

విశ్వము ఉన్నది. దానికి గాను ఒక న్యాయము ఉన్నది. భగవానుడు ఆ యావత్తు న్యాయానికీ రూపము. అతడు విశ్వమునందలి అణువణువునా స్థితుడై ఉన్నాడు. కనుక, భగవానుని నమ్ముకొనే భక్తుడు తనకు ఏ కోణమునుండి గాని, ఏ రూపములో గాని అన్యాయము జరగవచ్చుననే సందేహం పెట్టుకోడు. తనకు ఏదయినా అన్యాయం తెచ్చిపెట్టే తప్పు జరిగినట్టు తోచినా ఆ సంఘటన పరిపూర్ణ రూపాన్ని తాను అజ్ఞానం చేత దర్శించలేకపోయాడని, కాల క్రమాన అంతా దానంతట అదే సర్దుకుంటుందని: నమ్ముకోగలడు. కనుక, అతడు ఎన్నడూ (దేనిని గురించీ కూడా) ఉత్సుకుడు కాడు. తనకంటె సామాజిక, తదితర- ఆధిక్యతలు కలిగిన వారిపట్ల అసూయ చెందడు. ఎంతటి కారణం ఉన్నా వారిపట్ల ఆగ్రహం తెచ్చుకోడు.

అతడికి ఎవరిపట్లా ద్వేషము ఉండదు. సంతృప్తితో, ఆత్మ విశ్వాసంతో, నిగ్రహంతో ఉంటూ, అందరి ఎడలా స్నేహభావంతో కరుణతో ఉండగలడు.

వీటన్నిటికీ మించినది ఇంకొకటి ఉంది. భక్తుడు సహజంగా గాని, స్వయం స్పృహతో చేసుకొనే ప్రయత్నం ద్వారా గాని "నేను", "నాది"- అనే భావాలపట్ల సంపూర్ణ వైరాగ్యాన్ని

అలవరచుకుంటాడు. బాధలో, ఆనందంలో మనసు పరిపూర్ణ సమతూకంతో ఉండే స్థితిని పొందుతాడు. కర్మయావత్తూ భగవంతునిదేనని, తనకు సంబంధించిన ప్రతి విషయం ఆతని బాధ్యతేనని: అనుకోగలుగుతాడు.

తాను చేసే(పని) ఏదయినా సరే, భగవంతుడు తనచేత చేయిస్తున్నాడే తప్ప, తాను తనకుగా అది చేయడంలేదని భక్తుడు సదా తలపోస్తాడు.

ఇవన్నీ ఏదో యాదృచ్ఛికంగా వాటికవే జరుగుతున్నాయని (భక్తుడు) అనుకోడు. తాను నిర్వహించే ప్రతి కర్మయందు, ఉద్దేశం పట్ల మనసా, వాచా, కర్మణా: మమేకం చెందుతాడు. భక్తుడంటే అలా ఉండాలి.

★

# 18. ప్రార్థన ఎలా ఉండాలి

ప్రార్థన. తలచుకుంటే మొదట ఏదో తేలికయినదిగానే అనిపిస్తుంది. తాత్త్విక చింతన ఉన్నతం అవుతున్న కొద్దీ ప్రార్థన అనేది ఎంత నిగూఢ విషయమో తెలిసివస్తుంది. ప్రార్థన అనేది; అర్థం చేసుకోవడానికీ, అభ్యసించడానికీ కూడా అనుల్లంఘనీయములైన ఇబ్బందులు కొన్నిటితో నిండి ఉంది.

ప్రతీ చర్యకూ సరిసమానమయినదీ, వ్యతిరేకమయినదీ ప్రతిచర్య ఉంటుంది- అనే సూత్రం ఆధ్యాత్మిక తలంలో కూడా నిజమే. మానవుడు ప్రార్థన చేస్తే దేవుడు వరం ఇస్తాడు. (ప్రార్థన కష్టంలోంచి వస్తే, వరం సుఖానికి కారణమవుతుంది. ఎంత ప్రార్థనకు అంత వరం.) ప్రార్థనకూ, వరానికీ విడదీయరాని కార్యకారణ సంబంధం. వ్యక్తియందు నిష్ఠమయిన పురాకృత కర్మము, అతని ప్రస్తుత జీవన- ఆవరణ- పరిస్థితులపై దాని ప్రభావం; లెక్కలోకి తీసుకుంటే; శ్రద్ధగా భక్తిగా చేసుకొనే ప్రార్థన దానికి అనుగుణమయిన వరాన్ని (ధ్యేయాన్ని) సాధించుకుంటుంది.

ప్రార్థన రకరకాలు. ఇతరులకు హాని చేయడం, ఇతరులను నాశనం చేయడం వంటి రాక్షస ధ్యేయాలతో చేసే ప్రార్థన అన్నిటిలో అధమ రకానికి చెందినది. అది అవడానికి ప్రార్థనే అయినా, ఆ ప్రార్థకుడిని మరింత పాపంలో, బంధంలో ఇరికించుతుంది. ఆ ప్రార్థనకు (భగవంతుని వలన) వరం లభించినా, భస్మాసురుని ఉదంతంలో వలె ఆ వరం చివరికి ఏదో విధంగా ప్రార్థకుడి నెత్తిమీదికి తెస్తుంది.

ఇతరులకు హాని చేయనివి, స్వప్రయోజనం నెరవేరడానికి చేసేవి అయిన ప్రార్థనలు పాప భూయిష్టమైనవి కావు అనడానికి సందేహం లేదు. ఒకడు తనకు ఒక ఉద్యోగం రావాలని ప్రార్థన చేసుకుంటాడు. ఇంకొకడు తన పొలాన్ని సేద్యం చేయడంలో సంవత్సరమంతా చేసిన శ్రమ మంచి పంటను ఇవ్వాలని ప్రార్థించుకుంటాడు. ఇలాంటి ప్రార్థనలలో కోరిక అనేది అంటుకొని ఉంటుంది. తాత్త్విక దృష్టితో చూస్తే కోరికలు అనేవి ఆధ్యాత్మిక ప్రగతికి అవరోధాలు కదా!

ఇంకొకడు సాక్షాత్తు తన ముక్తికోసమే ప్రార్థన చేసుకుంటాడు. ఇది నిశ్చయంగా అప్రాపంచికమయిన, మినహాయించడానికి వీల్లేని కోరిక. బహుశా మానవుడికి తప్పని సరయిన కోరిక కూడాను. అయితే మట్టుకు, అది కోరికే. అందులోనూ కొంత స్వార్థం ఉన్నది. అందుచేత, ఆదర్శాత్మకంగా చెప్పాలంటే, అట్టి ప్రార్థనను కూడా ఉత్కృష్టమైనదిగా పరిగణించలేము.

మరొకడు యావద్విశ్వ శ్రేయస్సు కోరుతూ, లేదా సర్వజీవకోటి క్షేమం కోరుతూ ప్రార్థన చేస్తాడని అనుకుందాము. ఇతడు, సాక్షాత్తూ భగవంతుడికే ఆయన ఈ విశ్వ పాలనకుగాను ఎలా వ్యవహరించాలో సూచించేటంత దుడుకుతనానికి తలపడ్డాడేమోనని అనిపిస్తుంది. (తన పని ఎలా నిర్వహించుకోవాలో ఆయనకు తెలుసు.

దానిని గురించి ఆయనకి ఎవరూ సలహాలు ఇవ్వక్కరలేదు.)

అందుచేత, ఎలాంటి కోరిక, ఉద్దేశం, సూచన- లేకుండా కేవలం భగవత్ చింతనతో సరిపుచ్చుకొనే ప్రార్థన (అన్ని రకాల ప్రార్థనలలో) బహుశా ఉత్తమమైనది.

అయితే, గ్రహించుకోవలసినది ఒకటి ఉంది. చిట్ట చివరకి వ్యక్తియాత్మ, పరమాత్మ ఒక్కటే. అందుచేత, భగవత్ చింతనలో భక్తుడు తన ఆత్మకు నమస్కారం చేసుకుని దానితో బాటు "అహంబ్రహ్మాస్మి" అనే మహిమాన్విత వాక్యాన్ని పునశ్చరణ చేసుకోవడం పరమాదర్శవంతం.

★

# మూడవ అధ్యాయము

# కర్మ

# 19. విధేయత - స్వేచ్ఛ

భగవంతుని సిద్ధాంతాలు దయలేనివే. కాని, పరిపూర్ణంగా న్యాయ బద్ధమైనవి. బ్రహ్మాండమయిన నక్షత్ర మండలాలు సహితం, క్రమశిక్షణ గల సైనికులు చేసే ఒకానొక మిలిటరీ కవాతుల్లో వలె జాగ్రతతో, క్రమబద్ధంగా తమ కక్ష్యలలో పరిభ్రమించడమే దీనికి వివరణ. ఆయన ఆ అధికారాన్ని ఏమాత్రం సడలించినా తారామండలాలలో అసంఖ్యాకాలయిన సంఘర్షణలూ, పతనాలూ సంభవించి ఆయన రాజ్యంలో విశ్వ వ్యవస్థకు బదులు, అరాచకం ఏర్పడుతుంది.

భౌతికమే గాని, ఆధ్యాత్మికమే గాని - ఎట్టి అధికారమయినా, అదంతా విశ్వస్థిత మయిన ప్రతి వ్యక్తియాత్మకూ పరిపూర్ణ న్యాయం పట్ల అంతిమ నిబద్ధతతో ఉంటుంది. ఏదో ఒక విషయం అన్యాయం అని మనకు తోచినా న్యాయ పరిక్రమణం ఇంకా పూర్తి కాలేదనీ కాలక్రమాన అది జరుగుతుందనీ అర్థం చేసుకోవలసి ఉంది.

భగవంతుడు తన న్యాయాన్ని మిక్కిలి నిర్దయగా ఒక యంత్రం వలె అమలు చేస్తాడు. విశ్వపాలనలో ఆయన ఒక సక్రమమయిన నీతి శాస్త్రానికి కఠినంగా కట్టుబడి ఉంటాడు. ఆపాలనలో తన వారికి మేలు చేయడమో, పెరవారిని ఉపేక్షించడమో వంటి వాటికి తావులేదు. భగవంతునికి కరుణ, ప్రేమ - వంటి మానవ గుణాలు ఉంటాయని ఆపాదించుకోవడం - అదంతా మన అవగాహనా శక్తిని బల పరుచుకోవడానికే. అట్టి అవగాహన, మన అజ్ఞానాన్ని మనం మొహమాటంగా అంగీకరించుకోవడమే. కాని, నిజానికి భగవంతుడు (మనలో ఎవరి పట్లా కూడా) దయగా, క్రూరంగా, ప్రేమగా, ద్వేషంతో - అలా ఎలాగో - ఉండలేదు.

కనుక, మనం; మన శ్రుతులలో, పవిత్ర గ్రంథాలలో ఉదహరించి ఉన్న భగవద్విచిత మయిన న్యాయశాస్త్రాన్ని విశ్వాస పాత్రంగా అనుసరించుకుంటూ పోతే పట్టాలమీద పరుగులిడుతూ పోయే రైలు తన గమ్యస్థానాన్ని (సుకరంగా) చేరుకున్నట్లు, మనం మోక్షాన్నీ, అంతిమ స్వేచ్ఛనూ సాధించుకుంటాము. కాని, మనం స్వతంత్రంగా ఏదో చేసేయగలమని అనుకుని, దారి తప్పితే (అనగా నీతి సూత్రాలను అతిక్రమించి, పాపాలకు ఒడికడితే) పట్టాలు తప్పిన రైలు లాగా మనం ఇబ్బందులలో బంధాలతో చిక్కుకుని నరకయాతన పడతాం. భగవంతుడు ఏమీ బెసగని నిరంకుశ పాలకుడే ననడానికి సందేహం లేదు గాని, న్యాయాన్ని ఎంతలా ఒకానొక యంత్రసదృశనిర్దిష్టతతో పంచిపెట్టగలడో అంతటి పరిపూర్ణ న్యాయం ఆయన.

ఇదేదో విరోధాభాసంలా అనిపించవచ్చు. కాని, ఆతని పాలనలో "విధేయుడిగా ఉంటూ, స్వతంత్రంగా వ్యవహరించు" ; "తిరగబడినా కూడా బద్ధుడవై ఉండు." అని సూత్రం.

★

# 20. కర్మ - పునర్జన్మ

మానవులలో, వారి వారి మధ్య అసమానతలు ఉంటాయి. కొంత మందికి ఎలా వచ్చాయో, ఎందుకొచ్చాయో తెలియని బాధలు ఉంటాయి. ఇవన్నీ మానవజాతికి లెక్కకు మించిన సంక్లిష్ట సమస్యలు. అయితే, భారతీయ తత్త్వశాస్త్రంలో చాలా కీలకమయిన స్థానం వహించి ఉన్న కర్మ సిద్ధాంతం, పునర్జన్మ సిద్ధాంతం: ఈ సమస్యలన్నిటికీ అత్యంత సంతృప్తి కరమయిన సమాధానంగా (ఒక్కొక్కప్పుడు పరిష్కారంగా కూడా) పని చేస్తాయి.

మన పురాతన మత గ్రంధాల ప్రకారం కార్యకారణ సంబంధ సిద్ధాంతం భౌతిక జగత్తులో వలెనే, ఆధ్యాత్మిక జగత్తులో కూడా నిరతిక్రమణీయంగా వర్తిస్తుంది. రెండు జగత్తులలోనూ కూడా ప్రతీ చర్య దానికి వ్యతిరేక దిశకు చెందినది, దానికి సమానమైనది-అయిన ఒక ప్రతిచర్యను సృజిస్తుంది. ఎట్టి చర్య కూడా, దాని పరిణామాన్ని స్థిర పరచకుండా స్మృతిపథం నుండి తప్పుకోదు; అలాగే, ఏ పరిణామం కూడా దానికి సంబంధించిన పూర్వ కారణం లేకుండా సంభవించదు. ఆ విధంగా, ఆధ్యాత్మిక క్షేత్రంలో; సత్కార్యాలు అదృష్టాన్ని ప్రసాదిస్తాయి, దుష్టకార్యాలు బాధలతో ముగుస్తాయి.

'ప్రతీచర్యకూ ప్రతిచర్య' భౌతిక జగత్తులో జనించినంత త్వరగా ఆధ్యాత్మిక జగత్తులో జనించక పోవచ్చు. చర్యకు ప్రతిచర్య (ప్రయత్నానికి తగిన ఫలితం) సంభవించడానికి ఒక్కొక్కప్పుడు ఒక జీవిత కాలమంతా చాలకపోవచ్చు. కాని, కర్మ సిద్ధాంతం చాలా దయావిహీనమయినది. అందువలన, అట్టి ఫలితం ఎన్నడో ఒకనాడు సంభవించక తప్పదు. అటువంటి సందర్భాలలో, వ్యక్తి తాను పూర్వ జన్మలలో ఒనరించిన సత్కార్యాలకుగాని, దుష్కార్యాలకుగాని ఫలితాలను పొందడానికి ఇంకొక జన్మ ఎత్తవలసి వస్తుంది. సారాంశం ఏమిటంటే, కర్మ సిద్ధాంతం తర్కబద్ధంగా పునర్జన్మ సిద్ధాంతానికి దారితీస్తుంది.

వ్యక్తి ఈ జన్మలో ఒనరించే సకల కార్యాలూ మరుజన్మలో ఆతనికి సంభవించగల అదృష్టదురదృష్టాలకు రూపులను దిద్దుతాయి. ఒక జన్మ కాలంలో (కలిసి, విడివిడిగా) జీవించే వేరు వేరు వ్యక్తులు ఒనరించే కార్యాల స్వభావంలో అంతులేని వైవిధ్యం ఉంటుంది కనుక, మరుజన్మలలో వారివారికి సంభవించగల అదృష్టాలు కూడా వైవిధ్యభరితంగా ఉండక తప్పదు. ఆయా అసమానతలు, ఆయా వ్యక్తుల మీద చూపే ప్రభావాలు కూడా వైవిధ్యంతోనే ఉంటాయి. మళ్ళీ ఆ ప్రభావాలు పొందిన వారి వలన కూడా వివిధ సంక్లిష్టతలతో, ఛాయలతో నిండి ఉండే అసంఖ్యాక పరిణామాలను జనింపజేస్తాయి. ఈ విధంగా ఒక వ్యక్తి, ఒక జన్మలో చేసిన ఒక కర్మ: అక్కడితో ఆగిపోక, దానిని అనుసరించి, ఇతరులు ఒనరించే అట్టి చర్యల వలన వ్యత్యయ సంయోగాలతో అసంఖ్యాక శృంఖలాల గొలుసులోకి చేరి; సంక్లిష్ట, వైవిధ్యభరిత, సంకర-కర్మలతో: వాటికి సంబంధించిన, వాటికి అనుగుణములయిన - పునర్జన్మలకు కారణమవుతుంది.

★

# 21. అవతారములు

శ్రీ భగవానువాచ.

ఎప్పుడెప్పుడు
ధర్మమునకు గ్లాని కలిగి అధర్మము ప్రబలునో
ఆయా సమయములందు
నేనే స్వయముగా అవతరిస్తాను.
సన్మార్గులను రక్షించడానికి, దుర్మార్గులను నాశనము చేయడానికి,
ధర్మమును వ్యవస్థాపించడానికి
ప్రతి యుగమునందును నేనే సంభవిస్తాను.

- శ్రీమద్భగవద్గీత, జ్ఞానయోగము : 7 8

నీరు పల్లమెరుగును. అలాగే, ధర్మము కూడా తాను చేరవలసిన తలమునెరుగును. ఒక వ్యక్తి మరొకని పట్ల అధర్మాన్ని ఆచరిస్తే, ఈ జన్మలో గాని, తరువాతి జన్మలలో ఏదో ఒకదానిలోగాని దానికి బదులు తీర్చవలసి వస్తుంది. పాపము, దాని పరిహారము; చర్య - ప్రతిచర్య - ల వలెనే వేరుపరచలేనివి. అది ప్రకృతి సిద్ధాంతం.

వ్యక్తి ఒనరించే అధర్మం, వ్యక్తి పరిధిని అతిక్రమించి సమాజంలోని బహుళ విభాగాలపై తన రెక్కలను చాచునప్పుడు, కొద్దిమంది సాధారణ పుణ్యజీవులు ఆ సవాలును ఎదుర్కో లేకపోతారు. (అప్పుడు) భగవంతుడు సామూహిక హాని కారణమయిన ఆ అధర్మమును రూపుమాపుటకుగాను అవతారరూపంలో దిగివస్తాడు. (ఇందులో యాదృచ్ఛిక మయినదిగాని అసాధారణమయినదిగాని ఏదీ లేదు.) ఇదంతా; అధర్మాన్ని రూపు మాపడం వలన సమాజంలోని అన్నిజనసమూహాలూ తమ ధర్మనిబద్ధ అర్హతలను అనుసరించి ప్రయోజనం పొందగలరన్న ఉద్దేశంతో భగవంతుడు ఒకానొక సార్థక స్థాయిలో నిర్వహించే ధర్మనిబద్ధ పరిక్రియ మాత్రమే. సమాజంలోని అన్ని వ్యక్తియాత్మల కర్మ సంకలనమూ అవతారరూపంలో నిబిడీకృతమవుతుంది. ధర్మాచరణలో కలిగే అన్ని లోపాలను, అన్ని నియమోల్లంఘనాలను సరిదిద్దడానికి గాను; సంపూర్ణ అధికారంతో, శక్తితో; పరమాత్ముడైన భగవంతుడు మన మధ్యకు పంపే ప్రతినిధే అవతారం.

కాని, అత్యున్నత స్థితి యందు కేవల ప్రేక్షకస్థాయిలో ఉండి ఈ కార్యాచరణ క్రమంలో భగవానుడు రెండు అతిక్రమణలను చేయడం మన జ్ఞాన ఔన్నత్యానికిగాను ప్రత్యేకంగా చెప్పుకోవలసి ఉంది. "ప్రకృతి" లేక మాయాశక్తి భగవంతుడయిన ఈశ్వర సృష్టి. భగవంతుడు భూమిమీద అవతరించేటప్పుడు ప్రకృతిని సానుకూల పరచుకొని, తాను పుట్టినట్లూ పెరుగుతున్నట్లూ భ్రమ కలిగిస్తాడు. (నిజానికి ఆయనకు పుట్టుక,

చావు లేవుకదా) ఇక రెండవది. భగవానుడు తన అసలు స్థితిలో కర్మకు అతీతుడు. అయినప్పటికీ ఆయన ఏ అవతారం దాల్చినా, రక్తమాంసాలతో ఉండే కర్మ బద్ధుడిగా మన నడుమ సంచరిస్తాడు. కాని, ఆయన ఒకానొక ఆదర్శ జీవాత్మగానే నిలుస్తాడు.

"దేవుడు - అంటే అదేదో చాలా అసాధ్యమైన పదార్థం. పురాణ గ్రంథాలు ఆయనకు ఒక అగోచర పరిపూర్ణ స్వరూపుడుగా నిర్వచించాయి. ఆయనను చేరుకోవడ మనేది శ్రుతులు పేర్కొన్న ఆదర్శం." అని తన భక్తులు తనను గురించి ఏర్పరచుకొనే అవగాహన ప్రకారం కాక, అంత కంటె సన్నిహితుడుగా తనను తాను చేర్చుకొనేటందుకు గాను; అవతార బద్ధితాలయిన ఇతర కార్యాలతో బాటు భగవంతుడు అంతా అలా చేస్తాడు.

★

# 22. సమాంతర సూత్రాలు

వ్యక్తి నిష్టమైన కర్మ జీవాత్మను (ఒకానొక దృఢమైన బంకతో అంటించినట్టుగా) అంటి పెట్టుకుని ఉంటుంది. ఎంత కాలం - అంటే, పూర్తిగా నాశనం చేసేటంతవరకు. (దానికి ఎన్ని జన్మల కాలం పట్టినాసరే.) అంత వరకూ కూడా, జీవాత్మ దింపుకోవడానికి వీల్లేని భారం లాగా దాన్ని అలా వీపుమీద మోస్తూ ఉండవలసిందే. మధ్యలో కొంత కొంత కొత్త కర్మ అంటుకుంటూ ఉంటుంది. దాన్నికూడా వదిలించుకోవాలి. అలా అలా, కర్మవిముక్తి కోసం వ్యక్తి బ్రహ్మప్రయత్నం చేయవలసి వస్తుంది.

పద్ధతిగానూ శాస్త్రబద్ధంగానూ; యావత్తు కర్మనూ నశింపజేసుకోవాలంటే, ఇంతకు ముందు చెప్పుకున్న కఠోరమనోనియంత్రణకు తోడు, అంత ముఖ్యమైనదీ అయిన మరొక విషయాన్ని కూడా లెక్కలోకి తీసుకోవాలి.

నిర్మాణంలోనూ, మూల సూత్రాల్లోనూ ఎలాంటి సారూప్యతా లేకపోయినప్పటికీ, ఇటు భౌతిక తలంలోనూ అటు ఆధ్యాత్మిక తలంలోనూ కూడా ఒకదానికొకటి సమాంతరాలైనవి కొన్ని సిద్ధాంతాలున్నాయి.

- భౌతిక తలంలో: పదార్థం అనేదానికి నాశనం లేనట్టే, ఆధ్యాత్మికతలంలో ప్రయత్నం అనే దానికీ నాశనం లేదు. ఏదైనా ఆధ్యాత్మిక విషయానికి గాను గుంజాటన పడిన దానికి ఫలితం అక్కడికక్కడ చేతికి చిక్కకపోయినా, అందునిమిత్తం వెచ్చించిన శ్రమ వృధాకాదు. ఆ దిశగా ఉత్తరోత్రా చేసుకునే ప్రయత్నానికి జమ అవడానికి గాను దీని ఫలితంలో అనుగుణమైన భాగం కేటాయించుకుని ఉంటుంది. కృష్ణ పరమాత్మ అర్జునుడికి ఆ హామీని భగవద్గీతలో ప్రసాదించాడు.
- భౌతిక, ఆధ్మాత్మిక తలాలు రెండిటిలోనూ సమాంతరంగా సాగేది, బహుశా మరింత ముఖ్యమనది: మరొక సూత్రం ఉంది. చర్య, ప్రతిచర్య: ఈ రెండిటి సమానత్వం, ఈ రెండిటి పరస్పర వ్యతిరేక స్వభావం భౌతిక తలంలో ఈ సూత్రం ఎలా అమలు అవుతుందో మనకి తెలుసును. మరి ఆధ్యాత్మిక తలంలో: మనం ఎవరికైనా ఏదైనా 'మంచి' చేస్తే దానికి ఫలితంగా కృతజ్ఞతను తప్పక పొందుతాము. అలాగే 'చెడు' చేస్తే దానికి ఫలితంగా హాని సంభవిస్తుంది.

ఇదే సిద్ధాంతం ప్రతికూల దిశలో కూడా వర్తిస్తుంది. ఒకడు ఒక పాపకార్యం ఒనరిస్తే; ఒకానొక దేహ సంబంధమైన గాయం, దాని బాధను నివారించడానికిగాను పూసే పిష్టం వలన తగ్గించుకోగలిగిన విధంగానే, ఆ పాపకార్యఫలితం ఒక పుణ్యకార్య నిర్వహణ వలన రద్దు పరచుకోగలుగుతాడు.

ఈ రెండు సూత్రాలూ ఆధ్యాత్మిక తలంలో కూడా వైఫల్యం లేకుండా వర్తిస్తాయి. దానికి గాను, ఎంతో శక్తిమంతం, చాలా చంచలం- అయిన మనసును నియంత్రించుకుంటూ, జీవాత్మ; ఆధ్యాత్మిక ప్రగతికి ఎదుర్రాయిగా నిలిచే కర్మను సంపూర్ణంగా

నివృత్తి చేసుకోవాలి.

మనసును అలాగ క్రమశిక్షణలో పెట్టుకోవాలంటే, సాధకుడు తనకు అనుకూలంగా పనిచేసే శక్తులను కూడగట్టుకోవాలి. అనగా మనసును సదా ఆధ్యాత్మిక సంబంధములైన ఆలోచనలతో గాని, ప్రణాళికలతో గాని నింపి ఉంచుకోవాలి.

ఈ "అనుకూల శక్తులు" అనేవి చాలా ఉండవచ్చు. వాటిలో కొన్ని:-

- నిరంతర ధ్యానం. ప్రారబ్ద కర్మ భారం వలననే జీవి ఈ జన్మమును పొందుతున్నాడు. ప్రారబ్ద కర్మ భారాన్ని వదిలించుకోవడానికి తోడ్పడే అనుకూల శక్తులలో మిక్కిలి శక్తిమంతమైన దానిని ఉత్పత్తి చేసేది ప్రార్థనే. (ధ్యానమే)
- సాధకుడు తనకు ఇంచుమించు అనుదినం తటస్థపడే: విజయం-వైఫల్యం, గౌరవం-అవమానం, సుఖం-కష్టం: వంటి ద్వంద్వాల ప్రభావం పొందకుండా ఉండగలిగే విధం ఏమిటి- అని మనసులో నిరంతరాయంగా చర్చించుకుంటూ ఉండాలి. ఆ చర్చ, అతనికి; నిరపేక్షాకరంగా చేసే కర్మవలన కలిగే ప్రయోజనాలను బోధించి, భవిష్యత్తులో మరికొంత కర్మభారం కలుగకుండా అతనిని కాపాడుతుంది.
- పవిత్ర గ్రంథాల పఠనము, ఇది, (చీకటిని వెలుతురు తరిమికొట్టినట్లు) ఆధ్యాత్మిక అజ్ఞానాన్ని తొలగజేస్తుంది. పవిత్రగ్రంథాల పఠనం వలన కలిగే జ్ఞానపు మిలమిల అడ్డుపడి ఎలాటి దుశ్చింత, పాపపుటాలోచన చొరబడడానికి సాహసించవు. ఆ జ్ఞానం సాధకుడికి దీర్ఘకాలంగా పోగుపడిఉన్న కర్మను నశింపజేస్తుంది.

★

# 23. నిస్సంగత్వం

భక్తి జ్ఞానం కంటె మిన్న. నిష్కామ కర్మ భక్తికంటె మెరుగు.

-సూర్యగీత: V : 12

పరిపూర్ణమయిన ఏకాగ్రతతో మనము నిర్వహించే ప్రార్థన వలన మనము అభిలషించిన ధ్యేయమును ఫలింపజేసుకొనగలుగుతాము. అయితే, మనము ఈ అధునాతన ప్రపంచంలో ఒకానొక పద్ధతికి చెందిన జీవనశైలికి, దాని అవధులకు కట్టుబడి ఉన్నాము. అందుచేత, సాధారణంగా ఏకాగ్రతకు అవసరమయిన శక్తులను పోగు చేసుకొని ఆ ఫలితాన్ని పొందలేకపోతాము - అనేది చర్చించదగిన విషయం.

కాని, దీనికి ఒక మార్గాంతరం ఉంది. మనము భగవదారాధనకుగాను ఏకాగ్ర ప్రార్థనకు మారుగా, దానికి సమానమయిన ఫలితాన్ని ఇవ్వగల ఇంకొక పద్ధతిని అవలంబించుకోవచ్చును. అది ఏమిటంటేను, భగవంతునిలో నిబిడమై ఉన్నామని మనం భావించుకొనే శీల ప్రవృత్తులను మనము పాటించడమే. అనుసరణ అంటే పరోక్షంగా చేసే ఆరాధనే.

గుణాతీతుడయిన భగవానుడు సర్వాంతర్యామి, సర్వశక్తి మంతుడు, సర్వజ్ఞుడు అనంత పరిమాణాత్మకుడు, శాశ్వతుడు. ఇవన్నీ మనము పాటించలేనివి, విభ్రమ చెందేవి అయిన లక్షణాలు. వాటిని ఆధారం చేసుకుని మన స్వభావాలను దిద్దుకోవాలని ఆశించే ఊహాలోక చిత్రాలుగా ఉండిపోతాయి.

అయితే, మోక్షాన్ని ధ్యేయంగా పెట్టుకుంటే, మనవంటి సాధారణ మానవులు కూడా అభ్యసించవలసిన, అభ్యసించగలిగే - లక్షణం ఒకటి పరమాత్మయందు ఉన్నది. పరమాత్మ ఈ సమస్త విశ్వ వ్యాపారానికి వెనుక ఉన్న ఒకే ఒక చాలన శక్తి అయినప్పటికీ, ఆయన ఈ జగన్నాటకం అంతటికీ ఒక నిరాసక్త ప్రేక్షకుని వలె ఎల్లప్పుడూ తెరచాటునే ఉండిపోతాడు. ఆతని కేవల సమక్షమే విశ్వాన్ని కార్యోన్ముఖంగా చైతన్యవంతం చేస్తుంది గాని, ఆయన మాత్రం అందులో పాత్రధారి కాడు. ఆతని ఈ లక్షణం మాత్రం మనము అనుసరించ లేనిది కాదు. మన నిత్య ప్రాపంచిక సంచాలనాలలో ఈ (కేవల ప్రేక్షక) ధోరణిని అలవరచుకోవచ్చు. దానికిగాను మనము మన జీవితాలలో తటస్థపడే ప్రతి విషయాన్ని నిరపేక్షాధోరణిలో వీక్షించాలి. ఏ పని చేసినా ఫలాన్ని కోరుకుంటూకాక, "పని చేయడం ఒక ధర్మం" అని తలచి చేయాలి. ఒకానొక (కళా) ప్రదర్శన సందర్భంగా కూడిన ప్రేక్షక సమూహంలో ఏ ఒక్కరుగాని, ఆ వేదిక మీద కదలాడే పాత్రల అదృష్ట - దురదృష్టాల వలన ప్రభావం పొందని విధంగానే మనము చేసే ఏ పని పట్లయినా అవలంబించుకోగల ప్రేక్షక వైఖరి మనలను కర్మబంధాలలో ఇరికించదు. కేవల ప్రేక్షక వైఖరి సంపూర్ణ ఏకాగ్రతకు ప్రత్యామ్నాయం. దీనిని అవలంబించుకొని మనము "ఇంకొక మార్గం ద్వారా" భగవంతుని చేరుకోగలము. నిస్సంగత్వం కర్మను సృజించదని మన పవిత్ర మత గ్రంధాలు కూడా నిర్ద్వంద్వంగా వచిస్తాయి. కనుక, కర్మ అనేది లేకపోతే, పునర్జన్మ లేనేలేదు.

★

# 24. అంతర్గత వ్యక్తిత్వము

మానవుడు తన అంతర్గత వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోడానికి ప్రయత్నించడంతో ఆత్మజ్ఞానం ప్రారంభమవుతుంది. వ్రతాలు, భజనలు, దానధర్మాలు చేయడం - ఇలాంటివి వాటికవి మంచివే. కాని ఆ సత్కార్యాల వెనక ఉండే సిద్ధాంతాన్ని గ్రహించ కుండా యాంత్రికంగా చేస్తే వాటివల్ల ప్రయోజనం లేదు. నిజమైన ఆధ్యాత్మికతకి బహిరంగ ప్రదర్శన అవసరం ఉండదు. మానవుడు తన అంతర్గత స్వభావాన్ని ఆదర్శ ప్రాయంగా చేసుకోడంలో వినియోగించే సాంకేతిక విధానం వేరు; మామూలు వస్తువులను శుద్ధి చెయ్యడానికి ఉపయోగించే పద్ధతి వేరు.

దేవసీమ దారిలో సాగే వాడు తాను చేసే ఏ పనిలోనైనా తన మనసులో తప్పనిసరిగా ఆ దివ్యత్వాన్ని నిలుపుకుంటాడు. అతడు తనను తాను దేవుడి సేవకుడుగాను, తన కార్యకలాపాల ద్వారా చేసేది కేవలం దేవ కార్యమేననీ నమ్మకంగా పరిగణించుకుంటాడు. తన విశ్వాస నిబద్ధతలను అనుసరించి తాను నిర్వహించే పని ఏదీ కూడా తనది కాదు గనుక వాటికి సంభవించే జయాపజయాల వలన అతడు ఉత్సాహ నిరుత్సాహాలు పొందడు. అతని అభిప్రాయం ప్రకారం అంతాదేవుడే చూసుకోవలసి ఉంటుంది. తనకి అసలేమీ సంబంధం లేదు. తనకి (దేవుడు) వప్పగించిన పనిని తన (ఉత్తమ) సామర్థ్యంతో నిర్వహించడమే అతని ఏకైక వ్యాపకం, ముఖ్య ధ్యేయం. అతడు ఇతరులతో నెరపే అన్ని వ్యవహారాలలో ఇలాంటి నిస్సంగత్వ వైఖరిని బుద్ధి పూర్వకంగా, శ్రద్ధగా అంటి పెట్టుకుంటే అతనికి పాపం అంటదు; కర్మ ఉండదు, పునర్జన్మ ఉండదు.

(అప్పుడు) సహజంగానే అతని మనసు డాబుదర్పాల నుండి వైదొలగి, అసలైన అధ్యాత్మికత వైపుగా వర్తిస్తుంది. అది అక్కడితో ఆగదు. నెమ్మదిగానే అయినా, స్థిర నిశ్చయంతో అతడిని ముందుకు తీసుకుపోతుంది. అతడు తన అసలు మూలాలు ఏమిటో, తాను ఋజు మార్గంలో ఎదగడం ఎలాగో, తాను ఏర్పరచుకోవలసిన అంతిమ ధ్యేయం ఏమిటో - ఇలాంటి విషయాల మీద లోతుగా అంతరాన్వేషణ చేసుకొనే దారికి తీసుకువెళ్తుంది. క్రమంగా అతడు జీవాత్మ స్వభావాన్ని గురించి, పరమాత్మతో దానికి గల సంబంధాన్ని గురించి - అధ్యయనం చేయడం ప్రారంభిస్తాడు. అదే అతనికి కలిగే జ్ఞానోదయం.

సాధకుడు శ్రద్ధ వహించగలిగితే; శ్రుతులు వచించే విధులనుగాని, తాను నమ్మిన ధర్మాన్నిగాని - అందుకు సంబంధించి ఉన్న మత కర్మాచరణ విధుల నుండి వైదొలగకుండానే - నిర్వహించుకోగలుగుతాడు. అయితే, ఆధ్యాత్మిక పదార్థాలలో అందర్మూల్యాలు ఉపరితల సౌందర్యాన్ని ఆకర్షణనూ మించే రీతిలో ఉన్నా; అవి నిబిడంగా, నిగూఢంగా ఉంటాయి. కనుక ఉపరితలం నుండి అంతః కేంద్రం వైపుకీ, అలంకారం నుండి వస్తువుకీ చొచ్చుకుపోయే విధంగా సాధకుడు తన ధర్మాచరణ యందు (తన) దృష్టినీ ఆచరణనూ కొత్త మలుపులు తిప్పుకోవడానికి ప్రయత్నిస్తూ సాగవలసి ఉంటుంది.

★

# 25. మానవుని అహం

ఒక మహాసముద్రం ఉంది. దాని మీద ఉవ్వెత్తుగా ఒక కెరటం లేచింది. అలా లేచినప్పుడు, చెప్పుకోదగిన కొంత పరిమాణంగల జలపదార్థం, చెప్పుకోతగనంత కాలంపాటు సముద్రతలం నుండి విడి ఉంటుంది. చెప్పుకోతగ్గ పరిమాణంతో ఉండి ఉండడం వల్ల ఆ కెరటం తాను వేరే ఒక జల పదార్థాన్ని సుమా అని చాటి చెప్పుకోడానికి సిద్ధపడిపోవచ్చు. ఆపుకోలేనంత తీవ్రమైన అంతర్గర్వం వల్ల, అపమార్గాలోచనల వల్ల : ఆ కెరటం తనకి ఏదో వ్యక్తిత్వం ఉందని అహంకరించుకోవచ్చు. కాని, క్షణాలమీద, మన కళ్ల ఎదురుగానే; ఆ కెరటం వెనక్కి విరుచుకు పడి మాయమైపోతుంది. తనలాంటి అసంఖ్యాక తరంగాల వ్యక్తిత్వానికీ తన ఆ క్షణిక వ్యక్తిత్వానికీ సాపేక్షకత ఉంటుందని ఆ కెరటం ఎరుగదు. తాను ఆ మహాసముద్రంలో ఒక సూక్ష్మ శకలం అని, తన ఉద్భవానికి మూలం ఆ మహాసముద్రమేనని స్పృహ కలిగించే సాపేక్షకత అసలే ఉండదు.

(మన ప్రస్తుత విషయానికి సంబంధించి) పరమాత్మ అట్టి మహాసముద్రం, జీవాత్మ అందులో భాగమైన ఒక చిన్న కెరటం (అని తెలియాలి). మహాసముద్రంలో ఉద్భవించే ఏదైనా ఒక కెరటమువలెనే జీవాత్మకూడా తనకుగాను ఒక స్వతంత్ర ప్రతిపత్తి లేనిదే. ఈ జీవాత్మ విశ్వాత్మలో ఒక భాగం. దానికి వ్యక్తిత్వం అంటూ ఏదైనా ఉంటే, అది ఇతర జీవాత్మలకు సంబంధించినదే కాని, పరమాత్మకు సంబంధించినది కాదు.

కనుక, జీవాత్మకు రక్తమాంసానుగతమైన పేటికగా వ్యవహరించే మానవుడు తాను పరమాత్మ యందలి ఒకానొక అత్యల్ప శకలమేనని, తనకంటూ ఒక వ్యక్తిత్వం ఏదీ లేదని-గ్రహించాలి. ఈ విశ్వములో ఉన్న సమస్తము పరమాత్మకే చెందుతుంది.

కనుక, సాధకుడు "నేను", "నాది" అనే ఆలోచనలన్నిటిని మానుకోవాలి. తాను ఇక్కడ చేసే ప్రతీదీ కూడా పరమాత్ముడే చేస్తున్నాడని, ఈ "నేను" అనేవాడు చెయ్యడం లేదని పరిగణించుకోవాలి. "నేను", "నాది" అనే భావం అతని అజ్ఞానానికి మూలం, అది అతనిని ఆధ్యాత్మిక జ్ఞానం పట్ల అంతటా అంధుడిని చేస్తుంది. ఈ రహస్యాన్ని "బుద్ధి"తో గ్రహించుకోవడానికి వెచ్చించే ఎంత సుదీర్ఘ కాలంగాని; అలా గ్రహించు కోవలసిన అవసరం ఉందని కలిగే జ్ఞానాన్ని సాధించుకోవడం కోసం పడే తపనలో వెచ్చించుకొనే ఎంతటి శారీరక-మానసిక శక్తులు గాని (ఆ మహోధ్యేయానికి) తగినవే.

మానవుడు జీవత్వం నుండి పరమాత్మత్వం వరకు పరిణామం చెందడం విషయంలో దైవ సంబంధమయిన నిశ్చయ ప్రణాళిక ఒకటి ఉంది. అహాన్ని పూర్తిగా తుడిచిపెట్టు కోవడం ద్వారా; నిరపేక్షకర పద్ధతిలో ప్రతీదీ భగవంతుని కోసం, భగవంతుని పేరిట - చేయడం ద్వారా మానవుడు ఆ పరిణామం (సక్రమంగా సంభవించడానికిగాను) తనకు తానే సహాయం చేసుకుంటూ ఉంటాడు.

★

# 26. సత్యము

సత్యమే ఎన్నటికీ జయిస్తుంది. అసత్యము జయించదు.
సత్యము సాధనముగా దైవత్వానికి మార్గము వేసుకోవచ్చు.
నిష్కామ పరులైన ఋషులు ఆదారిని సాగి పరమధామము చేరుతారు.

- ముండకోపనిషత్తు : II, 1-6

(ఉపనిషద్వచనం అలా ఉన్నా); పరిపక్వమైన నిస్సంగత్వంతో, అధునాతన పరిస్థితులకు అనుగుణంగా, సత్యపదార్థానికి అయినా సరే -ఒక కొత్త మెలిక పెట్టగలము.

సత్యమే దైవం అన్నారు. సత్యాన్ని మించిన యథార్థం మరేదీ లేదు. సత్యము చేత, ధ్యానం చేత మనసును మరి ఏదీ చేయలేనంతగా ప్రక్షాళనం చేసుకోవచ్చు. మనసు పరిశుద్ధ పడితే, ఇంద్రియ నిగ్రహం సుసాధ్యమవుతుంది. అంతర్గతంలో బ్రహ్మ సాక్షాత్కారం 'క్రమంగా' అదే సంభవిస్తుంది.

మనము అసత్యము వచించడం వల్ల, మనకు చేసుకున్నంత హాని ఇతరులకు చేయము. మన అసలు అంతః స్వరూపం దాచిపెట్టి బయటి ప్రపంచానికి వేరే విధంగా కనపడడం వల్ల, మన ఆధ్యాత్మిక ఉన్నతికి మనమే మిక్కిలి తీవ్రమయిన నష్టం కలిగించుకుంటాము.

మనం సత్యాన్ని జీవన సూత్రంగా చేసుకొని, దానిని నిలకడగా అనుసరిస్తే, అది మన ప్రవర్తనలోని అసందర్భాలనెన్నిటినో సరిజేస్తుంది. మాట వరుసకు ఒకడు వ్యభిచారం చేసేడనుకుందాము. దానిని గురించి పదిమందితోనూగాని, తన భార్యతోగాని ఉన్నదున్నట్టుగా చెప్పుకోవడానికి అతనికి భయం. అయితే, అతడు దృఢంగా సత్యానికి కట్టుబడి ఉంటే, అసలు అతడు ఆ పాపకార్యానికి ఎన్నడూ ఒడిగట్టడు. ఎందుకంటే, ఉత్తరోత్రా ఎప్పుడయినా, దానిని గురించి అబద్ధం చెప్పవలసిన అవసరం వస్తుందని అతనికి భయం.

సత్యాన్ని చెదరకుండా అంటిపెట్టుకుని ఉంటే, (మానవుడు) క్రోధ-లోభ-మాత్సర్యాది భావాలనుండి విముక్తుడు కాగలడు. అలాంటి చాంచల్యాలను వదలగొట్టుకుంటే అతడు దైవత్వస్థాయికి ఎదగగలుగుతాడు. అసత్య భరితంగా సాగించుకున్న జీవనం ద్వారా అతనికి ఒనగూడే ఐహిక ప్రయోజనాలన్నిటి కంటే ఎన్నో విధాలుగా మేలైనది, అది.

ఇంత చెప్పుకున్నా, దీనంతటికీ విపర్యాసంగా; ఈ అధునాతన కాలంలో; సత్యాన్ని వచించడం అనే దాన్ని విశ్వసనీయమైన జీవన సూత్రంగా చేపట్టే వారికి అది ఆత్మహత్యా సదృశంగా పరిణమించడం దురదృష్టకరం. సత్యానికి ఖచ్చితంగా కట్టుబడి ఉండేవారు తరచుగా తమ వ్యాపార, రాజకీయ, సామాజిక, అధికార రంగాలలో స్థితి తప్పుతూ ఉంటున్నారు.

అలాంటి దుర్భరమైన పరిస్థితులలో జీవించవలసి వస్తున్న మానవుడికి విపరీత సందర్భాలలో వాడుకునేటందుకుగాను ఒక అరుదైన ఊరటగా సత్య నిర్గమనాన్ని అనుమతించవచ్చునని అనిపిస్తుంది. అంటే ఒకానొక ఉరిశిక్షను అమలు పరిచే జీతగాడైన తలవరికి ఉండే నిర్లిప్తధోరణిలో తప్పనిసరిగా అవసరమయ్యే ఒక చిన్న అసత్యాన్ని అతడు పలుకవచ్చు. కాని, అతడు ఆ పరిస్థితులలో అబద్ధం ఆడకుండా తనను తాను నిరోధించుకోవడం కంటే, ఆ మానసిక క్రమశిక్షణను సాధించుకోవడమే ఎక్కువ కష్టం.

★

# 27. భవిష్యత్ కర్మ

మానవుడు మోక్షాన్ని పొందాలంటే, (అతడు) గతించిన తన కర్మను నాశనం చేసుకోవడమే కాకుండా భవిష్యత్తులో కర్మ ఏ మాత్రమూ పెరగకుండా జాగ్రత్త పడవలసి ఉంది. ఏది ఎలా జరుగుతుందో అలాగే జరగనీ-అని కూర్చున్నాడంటే, పురాకృత కర్మ విజృంభించి అతడు భవిష్యత్ కర్మలో ఇరుక్కునే విధంగా అతనిని కొత్త కొత్త చర్యలకు ప్రోది చేసి ప్రేరేపిస్తుంది. పురాకృత కర్మ భారం నుండి తనను తాను విముక్తుడిని చేసుకోవడానికి అతడు అవలంబించే వ్యూహం ఏదయినా కావచ్చునుగాని, సాధకుడు అనేవాడు కనీసం ఇప్పటినుండి అయినా తనమీద మరికొంత కర్మభారం పడకుండా చూసుకోవడం అనే ముందుజాగ్రత్త కూడా అవసరమే. అందుకుగాను అతడు తన మనసును కట్టి ఉంచుకోవడానికీ, స్వేచ్ఛాభీష్టాన్ని సద్వినియోగం చేసుకోవడానికీ తీవ్రమయిన నిశ్చయాత్మకమయిన ప్రయత్నం చెయ్యాలి. అప్పుడు మనసు ఇంద్రియాలు చేసే ఊపులకు లొంగక, అవే ఇంద్రియాలను తన ఆజ్ఞలకు లోబడి ఉండమని, బుద్ధిగలిగి ప్రవర్తించుకోమని ఆజ్ఞాపించేటంత క్రమశిక్షణలో నిలవగలుగుతుంది.

మానవులు యావన్మందీ కామ- క్రోధ- లోభాది బలహీనతల చేత బాధపడుతూ ఉండరు. ఎవరయినా ఒక మనిషి సాధారణంగా మొదట్లో ఒకే ఒక పాపకార్య ప్రలోభానికి బలి అవుతారు. అక్కడినుంచీ అతని శీలస్వభావాలలో మరెన్నో లోటుపాట్లు (మొదటి బలహీనత ప్రోదిగా) కలిగి అదంతా ఒక శృంఖల చర్య అవుతుంది. మాటవరసకు లైంగిక ప్రవృత్తి సంగతి. దీని విజృంభణ అసత్యవాదాన్నీ, ద్వేషాన్నీ, ద్రోహాది ఇతర దుర్గుణాలనీ జనింపజేస్తుంది. అవన్నీ ఇక నిరాటంకంగా ఇంద్రియాలకు సంబంధించిన అవయవాలను అవి తలపెట్టే దుష్ట చర్యలలో ఇరికించి వాటి దుర్మార్గధ్యేయాలు నెరవేరే విధంగా మనిషిని ఆ తప్పు దారిలో నడిపించుకుపోతాయి.

మానవుని బుద్ధి, స్వేచ్ఛాభీష్టం తన పాత్రలను నిర్వహించవలసినది ఇక్కడే. ఈ చిలిపి ఉద్దేశాలన్నిటికీ మూలకారణం ఏమిటో కనిపెట్టి (-కనిపెట్టడానికి ఏముంది, అది లైంగిక బలహీనతే-) ముందు దానిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి మనసును కేంద్రీకరింప జేయాలి. బుద్ధి, స్వేచ్ఛాభీష్టం- మనసును రాజీలేని పద్ధతిలో అదుపులో పెట్టి, ఆ బలహీనతకు సంబంధించిన అవయవాలను ఆ పాపచర్యలో కలుగజేసుకోనివ్వకుండా చూడాలి. దానితో, ఆ వ్యవహారంలో ఉండే సహకార్య దౌర్బల్యాలు మానమై మనిషి తన భవిష్యత్ కర్మను గురించి నిశ్చింతగా ఉండగలడు.

సరే, భవిష్యత్ కర్మను నియంత్రించే విషయంలో స్వేచ్ఛాభీష్టానికి ఇలా శిక్షణ ఇచ్చుకున్నాం. మరి పురాకృత కర్మ నాశనానికి కూడా ఇలాంటి పద్ధతిలోనే ఏదో చెయ్యాలని స్వేచ్ఛాభీష్టాన్ని నియమించుకుంటే, అదికూడా ఫలించి జీవాత్మ అన్ని ప్రాపంచిక తగలాటాలనుండి, బంధాలనుండి విముక్తి పొందగలదు కదా! నిర్ణయాత్మకమైనదీ, లెక్క ప్రకారం చేసేది అయిన ప్రయత్నం సాధించలేనిది ఏదీ ఉండదు.

★

# 28. జీవాత్మ కర్మచారులు

శ్రీ భగవానువాచ:- అర్జునా!

**మనసు చంచలమయినది, నిగ్రహించ వీలులేనిది, కల్లోలమయినది.**
**కాని, అభ్యాసం చేత, వైరాగ్యంచేత దానిని క్రమశిక్షణలో పెట్టగలవు.**

-శ్రీమద్భగవద్గీత, ఆత్మసంయమయోగము' 35

జీవాత్మ, గుణాతీతుడయిన పరమాత్మతో ఐక్యమవడమే వ్యక్తి మోక్షం. కర్మ అనేది ఎప్పుడు ఎవరి మూలంగా ప్రారంభమవుతుందో చెప్పలేము. కాని జీవాత్మ పరమాత్మతో ఐక్యం కావడం మాత్రం, ఆ జీవాత్మ కర్మ బంధాలనుండి విముక్తి పొందినప్పుడే. కర్మ బంధాలనుండి విముక్తి లభించాలంటే, దానికి ప్రతికూలంగా కఠోర చర్యను చేపట్టి, తద్వారా ఆ కర్మను నశింప జేయడమొక్కటే మార్గం. ఇవి ఒక బృహత్ కార్యం. దీని మార్గం దుర్గమం. దీని నిర్వహణ వివిధ దశలలో జరుగుతుంది. అందుచేత, ఈ బృహత్కార్యాన్ని విజయవంతంగా ముగించడానికి గాను ఇది ఏపాటి కఠినమో, దీనిని సులభతరం చేసుకోవడమెలాగో, ఆ మార్గాన్ని సుగమం చేసుకోవడమెలాగో, ఆ నిర్వహణ దశలు ఏమిటో: తెలుసుకోవడం ముఖ్యం.

ఒక వ్యక్తి కోసం ఒక పనిని నిర్వహించే క్రమం ఇది- అని ఏర్పరచడానికి అతనిలో మూడు ముఖ్యమైన కర్మ సాధనాలు ఉంటాయి. ఇవి వరుసగా: స్వేచ్ఛాభీష్టం, మనసు, ఇంద్రియాలు. ఈ కర్మసాధనాలు నిర్వహించే కార్యక్రమం కేవలం తన విమోచనం కోసమే అయినా జీవాత్మ ఆ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనకుండా, కేవల నిరాసక్త ప్రేక్షకవైఖరిలో ఎడంగా ఉండిపోతుంది. అది దాని స్వభావం. జీవాత్మ తాను సుదూర నేపథ్యంలోనే స్థితమై; తన (విమోచనం) కోసం పనిచేసే కర్మచార యంత్రాంగాన్ని పనిలో పెట్టి ఆ సాధనాలను చైతన్యవంతాలుగా చేస్తుంది.

ఏపని చేయవలసి వచ్చినా దానికి సంబంధించిన మౌలికమైన ఆజ్ఞ, స్వేచ్ఛాభీష్టం నుండి ఉద్భవిస్తుంది. "ఈ పని చెయ్యి"- అనే అట్టి ఆజ్ఞను స్వేచ్ఛాభీష్టం, "బుద్ధి" ద్వారా అందజేసి, అందుకు పురమాయిస్తుంది. మనసు ఆ పనిని నిర్వహించమని ఇంద్రియాల ద్వారా, అవయవాలను ఆదేశిస్తుంది. అవి పూర్తి విధేయతతో (ఆ పనిని) అలా చేసేస్తాయి.

అసలు సహజంగా జరగవలసిన పద్ధతి అది. కాని, (మనసు ఇచ్చే) ఒక్కొక్క ఆదేశాన్ని అమలు పరచడంలో చాలా అవరోధాలను అతిక్రమించవలసి వస్తుంది. (అది అనుభవం చెప్పే సంగతి).

అసలు "స్వేచ్ఛాభీష్టం స్వభావత: సలక్షణమైనది. జీవాత్మకు ఏదయినా ఒక నిష్కల్మషమైన కృషి వలన విముక్తి సాధించే విషయంలో (స్వేచ్ఛాభీష్టం) సానుభూతిగా వ్యవహరించగలది. "స్వేచ్ఛాభీష్టానికి" అసలు స్వాతంత్ర్యం అంటూ ఒకటి ఉంటే కూడా అది పరిమిత పరిమాణానికి చెంది ఉంటుంది. స్వేచ్ఛాభీష్టం ఒకానొక పరిధికి లోబడి పనిచేయవలసి వస్తుంది. ఈ పరిధి చాలా ఇరుకుగా ఉంటుంది. ఎంత ఇరుకుగా అంటేను, ఈపాటి ఆపాటి నిర్ణయాన్ని పూర్తి స్వాతంత్ర్యంతో తీసుకోవడానికి అనుమతించదు. అది అలా వుండగా, తాను నిర్వహించవలసిన ఏదయినా పనిని గురించి నిర్ణయాత్మకమైన వైఖరిని అవలంబించడంలో, దానిమీద; నిరోధించడానికి సాధ్యంకాని, వ్యక్తి పురాకృతకర్మప్రభావం పనిచేసి; స్వేచ్ఛాభీష్టం ఆ పరిమిత పరిధిలో కొట్టుకు లాడుతుంది.

స్వేచ్ఛాభీష్టం, ఆదేశాలను జారీ చేస్తుంది. కాని, తాను జారీచేసే ఆదేశాన్ని తూచా తప్పకుండా నిర్వహించ వలసిందిగా చెప్పవలసిన తొలిదశలోనే ఆ అధికారం తగినంతగా పలచబడిపోతుంది.

కార్యనిర్వహణలో ఆ తరవాతి మెట్టు మనసు. సరయిన శిక్షణలో పెడితే ఎంతటి ఊహాతీతమయిన అద్భుతాన్ని అయినా సాధించగల ఆశ్చర్యకర సామర్థ్యం ఉన్నప్పటికీ, మనసు, సాధారణంగా ఎంతో చంచలంగా, కల్లోలంగా, అదుపు చేసుకోలేనిదిగా ఉంటుంది. సగటు మనిషి విషయంలో మనసు పాపపథం వైపు మొగ్గి; క్రమ శిక్షణకు అంత సులువుగా లొంగకుండా తయారవుతుంది. మామూలుగా స్వేచ్ఛాభీష్టం జారీచేసే ఆదేశాల పట్ల మనసు విముఖతను పాటిస్తుంది; లేదా పెడచెవిని పెడుతుంది.

అంతేకాదు, ప్రాపంచిక ప్రలోభాలకి సులువుగా లొంగిపోతూ, నిరంతరం పై మెరుగులనే చూసుకొనే ఇంద్రియాలతో చేతులు కలుపుతుంది. ప్రాపంచిక ప్రలోభాలు మానవుని పుణ్య మార్గానికి ప్రబల శత్రువులు. అవి అతనిని వశం చేసుకుంటూ కర్మబంధాలలోకి మరింత లోతుగా దింపుతాయి. మనసు, నిజానికి తను తలుచుకుంటే- నేను చెప్పినట్టు వినండర్రా అని- ఇంద్రియాలను శాసించగలదు. కాని, అలా చెయ్యదు. ఎందుకంటే, పాపధోరణి కలిగిఉన్న ఇంద్రియాలతో చేతులు కలిపి సులువు అనిపించే ఆ మార్గంలో సాగిపోవాలనుంటుంది. ఇంద్రియాలు మనసును చెరిచి, సుదీర్ఘంగా సాగే దురాలోచనలవైపుగా దానిని నమ్మించి చేకొనిపోయి వాటిలో ఇరికిస్తాయి. ఇందువల్ల, 'మనసు' స్వభావత: మంచిదీ పవిత్రమైనదీ అయినా, ఇంద్రియాలు కల్పించే దుష్ప్రభావానికి లోనై, దుష్టమార్గంపట్టి ; స్వేచ్ఛాభీష్టం తనకు జారీచేసే ఆదేశాలను తీవ్ర అనిష్టంతో నిర్వహిస్తుంది; లేదా, బహిరంగంగా తిరుగుబాటును ప్రకటిస్తుంది. మీదు మిక్కిలి; నీతి బాహ్యంగా ప్రవర్తించే ఇంద్రియాలతో కళ్లసైగలు చేసుకుంటుంది. ఈ అలుసు చూసుకొని, ఇంద్రియాలు స్వేచ్ఛాభీష్టం జారీచేసిన ఆదేశాలను (కార్య కర్తలైన) అవయవాలకు బదలాయించడానికి నిరాకరిస్తాయి. స్వేచ్ఛాభీష్టం జారీ చేసే

ఆదేశాలకు ఈ పరిణామం సంభవించి, తోక కుక్కను ఊపే పరిస్థితి సంభవిస్తుంది.

ఇదే పద్ధతిలో, జీవాత్మ విముక్తిని ఉద్దేశించి తలపెట్టే మంచి పనులు మరేవైనా కూడా, తరుచుగా శూన్యతకి దారితీసేస్తాయి.

కనుక; అతిముఖ్యమైన ఒక సంగతిని గుర్తించుకోవాలిక్కడ. మంచికి గాని, చెడ్డకి గాని, అపరిమితమైన శక్తులతో మనసు వహించే ప్రముఖ పాత్రను దృష్టిలో పెట్టుకుని; మనసు, పాపపుణ్యాలలో ఏ దిశగా పయనించ దలచినా, పాపంవైపు కాకుండా పుణ్యం వైపు మాత్రమే మొగ్గు చూపే విధంగా తీవ్రమైన శిక్షణ ఇచ్చుకోవలసి ఉంది. స్వేచ్ఛాభీష్టం స్వరం సున్నితంగా ఉంటుంది. ఆ స్వరం వచించే దానిని సహానుభూతితో స్వీకరించి; ఒక చేత సత్కార్యాలు ఒనరిస్తూ మరొక చేత ఐహిక దృష్టితో మాత్రమే అల్లాడే ఇంద్రియాల వల్ల ప్రేరేపితాలయ్యే దుష్కార్యాలను నిర్దాక్షిణ్యంగా అణిచివేసే పద్ధతికి, మనసును శిక్షణలో పెట్టుకోవాలి.

మనసు; తన ఎగువన ఉన్న స్వేచ్ఛాభీష్టం పట్ల సహకారంతో, తన దిగువన ఉన్న ఇంద్రియాలపట్ల దయావిహీనమైన నిరంకుశత్వంతో- అవలంబించగల ద్వంద్వనీతి, జీవాత్మ ముక్తిదిశగా అధిరోహణ సాగించడంలో ఇనుమిక్కిలిగా తోడ్పడుతుంది. ఈ విషయం ఎంత ప్రాముఖ్యం కలిగినదో ఆ సంగతి, నిజానికి; ఏమీ నొక్కి చెప్పక్కర్లేనిది.

★

ముళ్లంగి వెంకట రమణారెడ్డి
39-18-1, మాధవధార
విశాఖపట్నం-530 007
ఫోన్: 0891-2722189

# 29. మనసు, వాంఛ

శరీరం రథం, దానిని అధిష్ఠించేది వ్యక్తి
బుద్ధి ఆ రథసారథి, మనసు "పగ్గాలు", ఇంద్రియాలు అశ్వాలు,
కోరికల శ్రేణులనే మార్గం గుండా ఆ ప్రయాణం.
మానవుడు తెలివిగా మనసును నియంత్రించుకుంటే,
ఇంద్రియాలు అదుపులో ఉండి;
సరైన రౌతు నడిపే ఉత్తమాశ్వాలవలె వర్తిస్తాయి.
అప్పుడు రథాన్ని అధిష్ఠించిన వ్యక్తి,
భద్రంగా తన ధ్యేయాన్ని సాధించుకుంటాడు.

-కఠోపనిషత్తు.

కోరికలు గలవాడు పునఃపునః జన్మిస్తూనే ఉంటాడు.
కోరికలను చంపుకున్న వానికి పునర్జన్మ వ్యథ ఉండదు

-బృహదారణ్యకోపనిషత్తు

మనసును అదుపులో ఉంచుకొని కోరికలను చంపుకోగలిగే మానవుడు తన అభీష్టాలను స్వేచ్ఛగా న్యాయ మార్గాన నడిపించుకొని తననుతాను ఉత్కృష్టుడుగా తీర్చిదిద్దు కోగలుగుతాడు.

కోరిక అనేది మానవుడి ఆధ్యాత్మిక ప్రగతికి బద్ధశత్రువు. అది మొదట మనసును స్వాధీనం చేసుకుని దానిమీద పెత్తనం చెలాయిస్తుంది. ఎన్నెన్నో ప్రలోభాల వైపు ఈడ్చి, వాటికి లొంగిపోయేటందుకు నీచమైన పద్ధతులలోకి దింపి, ఆ వాంఛలను నెరవేర్చు కునేటట్లు మనసును కలుషితం చేస్తుంది. కోరికలు తీరుతున్న కొలదీ మనసు వాటి కోసం మరింత దాహార్తి అనుభవిస్తుంది. పోనుపోను కోరిక తాను బలపడి మనిషిని భ్రష్టుడిని చేసి తన బానిసనుగా చేసుకుంటుంది. అదంతా అతడు ఏమీ పసికట్టలేనంత రహస్యంగా, దొంగచాటుగా జరిగిపోతుంది. చివరకి మనిషి ప్రమత్తుడై నడిసముద్రంలో తుపానులో చిక్కుకున్న నావలాగా మిగిలిపోతాడు.

వాంఛ అనేది నిరంతరం పెరిగేదీ ఎన్నటికీ తీరనిదీ. జ్వలిస్తున్న అగ్నిలోకి మరిన్ని సమిధలు వేసి దానిని ఆర్పలేము. అలాగే కోరికలను చంపుకోవాలనే కోరికతో అసలు కోరికను చంపలేము. దీపము శలభాన్ని ఆకర్షించినట్టు కోరిక అనేది మానవుని తన వినాశనాత్మకమైన కోరలలోనికి ఆకర్షిస్తుంది. ఫలితంగా మనిషి అన్ని రకాల ప్రలోభాల చుట్టూ తిరిగి వాటికి లొంగి అసంఖ్యాకమైన పాపాలు చేయడానికి ప్రేరణపొందుతాడు. చేసిన పాపాలన్నీ అతనిలోని ఔన్నత్యాన్ని హరించి, అతడిని ప్రగతికి అనర్హుడుగా చేస్తాయి.

కోరిక అనేది మనిషిని వశం చేసుకోవడంతో ఊరుకోదు. అతడు దానిని వ్యతిరేకించినప్పుడు, ఓడించినప్పుడు అతనిలో క్రోధము, మత్సరము, మతిభ్రమణము, కుతర్కము వంటి భావాలను సృజించి తద్వారా అతని అంతస్సంబంధమైన ఆధిక్యతను నశింపజేస్తుంది.

అట్టి వినాశనాత్మకమైన శత్రువును మట్టుపెట్టి చపలమైన మనసును, దానికి బాసటగా నిలచే ఇంద్రియాలను అదుపులో పెట్టుకోవాలంటే దానికి ఒకటే ఉత్తమ మార్గం. పవిత్ర గ్రంథాలను (శ్రుతులను) అధ్యయనం చేసి, (మానవుడిని ఉన్నతుడుగా తీర్చి దిద్దడానికిగాను) వాటిలో వచించిన సూత్రాలను సాధన చేయడమే, మంచి అనేది. హితబోధ అనేది; ఎన్నిసార్లు చేసుకున్నా అంతామంచే. విషయ సుఖాలు, వాటి పరిణామాలుగా వచ్చే చెడు ఫలితాలు; మానవుడి ఆధ్యాత్మిక ప్రగతిని అత్యంత శక్తిమంతంగా వెనుకకు మళ్లిస్తాయన్న సంగతి అతనికి చెవిలో ఇల్లుకట్టుకుని చెప్పాలి, మనసు అట్టడుగు పొరలలో దాగిఉండే మలినాన్ని పరిశుభ్రం చేసుకోవడానికి కొన్ని మార్గాలున్నాయి. క్రమం తప్పకుండా చేసే ధ్యానము, ప్రార్థన, సజ్జన సాంగత్యము, దురాలోచనలను దూరంగా ఉంచుకొంటూ ఆధ్యాత్మిక భావాలతో మనసును నింపుకోవడము.

పైన చెప్పిన నివారణ మార్గాలను నిష్కపటంగా, పట్టుదలగా అమలు చేసుకుంటూ పోతే మానవుడు విషయవాంఛల పట్ల మోజును మనసు నుంచి తొలగించుకుని మనసును సరైన దిశలోకి మళ్లించుకుని ముక్తి మార్గంలోనికి చేరగలుగుతాడు. తన అభ్యున్నతి కొరకు తాను నిర్వహించుకొనే ఉత్తమ కార్యక్రమము ఇది. ప్రారంభము.

★

# 30. నిస్వార్థ కర్మము

कर्मण्येवाधिकारस्ते मा फलेषु कदाचन
मा कर्मफलहेतुर्भूः मा ते संगोस्त्वकर्मणि ।

- భగవద్గీత, సాంఖ్యయోగము : 47

(నీకు పనిచేసే హక్కు ఉంది. కాని దాని ఫలాన్ని ఆశించే హక్కు లేదు. నీ పని ఫలముగా మారుటకు కూడా నీవు సహాయకారి కావద్దు.)

మానవుడు పుట్టి పెరిగినదంతా ప్రాపంచిక ఆలోచనలతో ఆశయాలతో నిండిన సమాజంలో. అతనికి తన చర్యల వలన (కృషి వలన) కలిగే ఫలము ఆశించని తత్వము అలవడదు. పైగా తన కృషికి మరింత మరింత ఫలము లభించాలని ఆరాటపడతాడు. ఏదో దురదృష్టము వలన అట్టిఫలము లభ్యము కాకపోతే అతడు ఎంతగానో క్రుంగిపోయి, దాని వలన కలిగిన నష్టాన్ని భర్తీ చేసుకోవడానికి ఎన్నెన్నో దారుణాలకు ఒడిగడ్తాడు. అవి అతనిని పాప పంకిలములో ముంచి అతడు ఐహికుడిగా ఉండిపోయే ఋణకర్మలో పడవేస్తాయి. ధీమంతులు ఓటమిని గెలుపునకు మెట్లుగా భావించుకోగలరు. కాని సామాన్యులకు ఓటమి అనేది పాపబీజతల్పము.

మానవుడు కర్మబంధాల నుండి ముఖ్యంగా పాపకర్మ బంధాలనుండి విముక్తుడు కావాలంటే అతడు కర్మఫలాన్ని త్యజించాలి; అంతే కాని, కర్మను త్యజించరాదు. కర్మను త్యజించడమనేది ప్రకృతం కాదు, సాధ్యం కూడా కాదు. తన మట్టుకు తాను తిని, త్రాగి బ్రతకాలంటే ఏదో ఒకటి చేయాలి. అంతేకాక అతడు ఏదో ఒకటి ఆలోచించకుండా ఉండలేడు. ఆలోచన కూడా పనే.

కనుక "పని" చేసి దాని ఫలితాన్ని దైవాధీనం చేసేస్తే, అటు భగవంతుడిని, ఇటు ప్రకృతిని ఉత్తమమైన పద్ధతిలో తృప్తి పరచగలడు. ఆ చేసే "పని" ఆధ్యాత్మికమైనదో, మానవీయమైనదో లేక అలాటి పవిత్రమైనదో అయితే మరీ మంచిది. అది కూడా స్వోత్కర్షగా, సంప్రదాయంగా, నిత్యకృత్యంగా కాకుండా స్వార్థమనేది అసలు లేకుండా చేయాలి. అంతా భగవత్కర్మ అని· అతని పేరిట, అతని కొరకు చేస్తున్నానని; అనుకొని చేయాలి. అపుడే అతడు దానివలన మిక్కిలిగా మేలందుతాడు.

మనము సాధన చేసే విలువలలో స్వార్థరాహిత్యం ఫలవంతమైనది. ఒక సాధకుడు ఆత్మ ప్రక్షాళనలో తనకు తానుగా శ్రద్ధగా శిక్షణను అవలంబిస్తున్నాడంటే అతడు భగవదైక్యతా సాధనలో వేగం అందుకొంటున్నాడన్న మాట. స్వార్థరాహిత్యమనేది ఒకానొక ఆధ్యాత్మిక ఫలము.

అయితే స్వార్థ పరత్వమనేది బహు మొండి. అది మానవుని ఆలోచనలమీద తన పట్టును గుప్తంగా ఎప్పటికప్పుడు బిగిస్తూ, అతడి ఆధ్యాత్మిక ప్రగతికి అడ్డుగోడగా నిలుస్తూ ఉంటుంది. స్వార్థము విడనాడి, "ఇచ్చుట"లో సుఖము ఉన్నదని భావించుకోవాలి. అది విరోధాభాస అలంకారము. ఇచ్చే వాడికే లాభం, పుచ్చుకునేవాడికే విషాదం. (పుచ్చుకున్నవాడు దానిని అనుభవించే తపనలో పడి కర్మహీనుడవుతాడు. అది విషాదమే.)

★

# 31. మతము, ప్రభుత్వము

మానవజాతికి భౌతిక వాదం ఇచ్చే సందేశం కంటే, మతం బోధించేది ఉన్నతంగా ఉంటుంది. అందుకనే ప్రపంచంలో భౌతికమైన అధికారం ఆధారంగా ఏర్పడిన అసంఖ్యాక నాగరికతలు రావడం-పోవడం జరుగుతున్న విషయానికి ప్రపంచ (చరిత్ర)ము సాక్ష్యంగా నిలిచింది. అనాది కాలంనుంచి మానవజాతి ఏర్పరుచుకున్న (ఆధ్యాత్మిక సంబంధమైన) విశ్వాస సిద్ధాంతాలు, విలువలు ఈనాటికీ మానవుడిని ఉత్తేజపరుస్తూనే ఉన్నాయి.

అన్ని మతాలూ తమ తమ రీతులలో మానవుడికీ, మానవాతీతమైన స్వరూపాలకీ మధ్య ఉండే శక్తి-ప్రభావ-ప్రతిపత్తులను గురించి వాటి వాటి ధోరణులలో నిర్వచనాలు, సూత్రాలు, మంత్రాలు మొదలైన వాటిని చెప్పాయి. సమాజ పరమైన, పర్యావరణ పరమైన పరిస్థితులను అనుసరించి ఆయా మతాల, సూత్రాల, మంత్రాల పద్ధతులలో బాహిరమైన తేడాలు ఉండవచ్చును. కాని మానవాతీతమైన శక్తి ఒకటి (లేదా శక్తులుకొన్ని) ఉండవచ్చునని భౌతిక జీవనానికి అతీతుడైన ఒక పరమాత్మ ఈ విశ్వాన్ని ఏలుతూ ఉంటాడని ఏర్పడిన ప్రాధమిక అభిప్రాయము భౌతిక నాగరికతలు ఛిద్రములై అంతర్థానములు ఐనట్లు ఎన్నడూ, ఎక్కడా మారలేదు. ఆరలేదు.

అలా ఎందుకవుతుందంటే, భౌతికమైన శక్తిని అంతకంటె బలిష్ఠమైన మరొక భౌతికశక్తి పడగొట్టి నశింపజేయగలదు. కాని ఆధ్యాత్మిక శక్తి తనకన్నా తక్కువ స్థాయిలో ఉండే సిద్ధాంతాలనూ శక్తులనూ తన ప్రభావంచేత మరింత ఉన్నత స్థితికి తెస్తుందే తప్ప, దానిని నాశనము చేయదు.

పైన చెప్పిన వాటిని ప్రభుత్వయంత్రాంగానికి అనువర్తింపజేసి, పరిశీలించుకుందాము. ఏ ప్రభుత్వమైనా సరే; ఒక పద్ధతిలో పెంచిపోషించుకునే భౌతికమైన బలాన్ని కలిగి ఉంటుంది. ఈ బలం ఇతరత్రా తనను ప్రతిఘటించే హింసను, తిరుగుబాటును కొంతవరకే ఎదుర్కోగలదు కాని, అంతకుమించి కాదు. నేరస్థులకు పోలీసులంటే భయం. వారివద్ద ఉన్న ఆయుధం (అధికారం) చూసినందువలననే అట్టి భయం తప్ప, పోలీసు ఉద్యోగం చేస్తున్న ఆ మనుష్యుల వలన కాదు. నిరంకుశమైన అధికారము నిశ్శబ్దంగా బయలుదేరే తిరుగుబాటుకు దారి తీస్తుంది. బలాత్కారపు నిర్ణయాల వలన వ్యతిరేకత ఉద్భవించినా, అవకాశం కోసం సమయం కనిపెట్టుకుని ఉంటుంది. ప్రజలపై ఏలుబడి సాగించే అధునాతన ప్రభువుల సామర్థ్యం ఇన్ని రకాలుగా కాలుజార్చే పాకుడునేలమీద ఉంది.

ప్రభుత్వము అన్నాక ప్రజ ఉంటుంది. ఈ ప్రజ ప్రభుత్వానికి విధేయంగా ఉండాలి. దానికోసం ప్రభుత్వం తన శక్తితో కొన్ని నిబంధనలను ప్రజలమీద రుద్దుతుంది. అప్పుడు కూడా ప్రజలు విధేయులుగా ఉంటారు. కాని అది అనిష్ట విధేయత. దీనికి ప్రతిగా ప్రభుత్వపు చర్యల వలన ఇష్టపూర్వకంగా విధేయులుగా ఉండే ప్రజలు కొందరు ఉండి,

వారు ప్రభుత్వానికి సహకరిస్తారు. అనిష్టమైన విధేయతను భరించి, దానిపై ఆధారపడే కంటె; ఇష్టంగా, తమకు తాముగా సహకరించే వారు ఏ ప్రభుత్వానికైనా మేలు.

జీవితానికి కొన్ని సమున్నతమైన ఆధ్యాత్మిక విలువలు ఉంటాయి. అట్టి విలువలపై విజ్ఞానాత్మకమైన విశ్వాసం కొందరు ఏర్పరచుకోగలుగుతారు. వారికే అకలంకమైన సహకార ప్రవృత్తి కలుగుతుంది.

అలా సమాజ శ్రేయస్సు చేకూరిననాడు మాత్రమే వ్యక్తి అభివృద్ధి సుసాధ్యమై, సామాజిక పరిణామానికీ, ఆధ్యాత్మిక తత్వానికీ పొంతన కలుగుతుంది. దీనికి మానవుడి తత్వం క్షణభంగురత్వం వదలి శాశ్వతత్వానికి పయనించాలి. ఈ ప్రయాణంలో మతం పాత్ర చాలా ప్రముఖమైనది.

★

# 32. ధర్మము, అర్చన

నిజాయితీగా, నిష్పాక్షికంగా చేసేవీ, సమాజం మేలుకోసం భగవంతుని సాక్షిగా చేసేవీ; పనులు ఎన్నిఉన్నా, ఒక దానికొకటి సరిపోలదు, వాటిలో వాటికి ఉత్కృష్ట హీనతలు ఉండవు. సమాజము సక్రమముగా వర్ధిల్లడానికి; సమాజములోని వివిధ భాగాలకు, వివిధ వ్యక్తులకు, నిర్ణీతములైన విధులను ఆయా వ్యక్తులు, ఆయా విభాగాలు (నిర్ణీత ప్రతిపత్తిలో) నిర్వహించవలసిన అవసరం ఉంది. అట్టి ఉదారభావముతో నిర్వహించే విధి, ఆ విధిని నిర్వర్తించే వారి నిస్వార్థతగా భాసించి దానికి ఒకానొక ఔన్నత్యం ఒనగూడు తుంది.

ప్రతి వ్యక్తి సమాజంలో ఒక భాగమే; అతడు సమాజ అభివృద్ధికి, అభ్యున్నతికి ఉద్దేశించి తనకు చేతనైన సేవ చేస్తే, అది సమాజానికి, తనకు కూడా సేవ కాగలదు- అని గ్రహించగలిగితే అదే ఒక జ్ఞానము. శ్రద్ధగా గమనించు కుంటే తాను ఎంతటి వినయంతో (తన విధులను నిర్వర్తించుకుంటూ) ఉండగలడో సమాజం దృష్టిలో అతను అంతటి ఔన్నత్యాన్ని పొందుతాడు. ఇదే సేవాధర్మములోని రహస్యము.

భారత దేశంలోని కుల వ్యవస్థ ఎప్పుడో పురాతన యుగాలలో ఏర్పడినా, ఇప్పటికీ అమలులో ఉంది. ఇది ఒక సంప్రదాయం. ఆ కాలంలో సమాజం ఎంత నియమ బద్ధంగా ఉండాలని (విధి నిర్వహణ చేయాలని) ఏర్పాటు చేసుకున్నారో దానినే ముఖ్యమైన విషయంగా భావించుకోవాలి తప్ప, సమాజంలోని వివిధ భాగాలుగా ఉండే జనులు ఒకరికంటే ఒకరు ఎక్కువనీ, తక్కువనీ భావించడానికి కాదు.

అపురూపమైనవి, అరుదైనవి (ధాన్యాది) వస్తువులు సక్రమంగా పంపిణీ జరగడానికి గాను ఇటీవల రేషనింగు అనే పద్ధతి ప్రవేశపెట్టుకున్నాము. అంతేకాక జాతీయబాధ్యతల నిర్వహణలో లోపాలు జరగకుండా ఉండేందుకు ఆ బాధ్యతల సముదాయాన్ని వివిధ శాఖలను, విభాగాలను ఏర్పాటు చేసుకున్నాము. అలాగే ఒక్కొక్క కులానికి ఒక్కొక్క బాధ్యత ఒప్పగించు కోవడంతో కుల వ్యవస్థ అమలులోకి వచ్చింది. ఒక డాక్టరుగారు ఉన్నారనుకుందాము. వైద్య విజ్ఞానాన్ని సాధించుకొనే విషయంలో అతడి కుమారుడికి ఉన్న సౌలభ్యం మిగిలిన వారికి అంతగా ఉండదు. అలాగే ఒక ప్రత్యేక కులములో జన్మించిన వాడు కులవృత్తి చేసే తల్లిదండ్రుల వద్ద ఆ వృత్తి మెలకువలను సాధించు కోవడంలో ఉన్న సౌలభ్యం ఇతరకులాల (వృత్తుల)లో ఉన్నవారి బిడ్డలకు అంతగా ఉండదు. ఆ విధంగా కుల వ్యవస్థ తరతరాలుగా స్థిరపడిఉంది.

అధునాతన లౌకిక రాజ్యాలలో అన్ని రకాల అనుమతులూ ప్రభుత్వాలనుంచే వస్తున్నాయి. అలాగే వ్యక్తుల మంచిచెడ్డల మీద, ప్రవర్తనలమీద మత ప్రభావం గాఢముగా ఉండిన ఆ రోజులలో (కుల) వ్యవస్థకు అనుమతి, అధికారము శ్రుతుల వలన, ఆధ్యాత్మిక గురువుల వలన సంక్రమించాయి.

ఒక పద్ధతిలో, కొన్ని నిబంధనలకు లోబడి సమాజ అభ్యున్నతి కొరకు వ్యక్తి పాటు పడవలసి ఉంది- అనే సూత్రము కుల వ్యవస్థకి సంబంధించి ఉన్నప్పటికీ, అది ఒక ఆధ్యాత్మిక దృక్పథంతో ఏర్పడినదే తప్ప, తర్కానికి లొంగేది కాదు.

సమాజంలో అన్ని విభాగాలు భగవంతుడు సృజించినవే. వారందరిపట్ల భగవంతునికి సమానమైన ప్రేమ ఉంది. కనుక సమాజానికి ఎవరివలన ఏ సేవ జరిగినా అది భగవానునికి ప్రియతమమైనదే. ఆ సేవలలో ఎక్కువ తక్కువలు, ఘనహీనతలు ఉండవు.

అంతేకాక, ఒకానొక వ్యక్తి తన జీవితంలో నిర్వహించే సేవ వినయ పూర్వకమైన నిబద్ధతతో కూడినది అయితే ఆధ్యాత్మిక ప్రగతికి అంతటి అవకాశమవుతుంది. ఎందు కంటే అంతస్సంబంధమైన ప్రగతికి : పేదరికం, సమాజం తనని నిర్లక్ష్యం చేసిందనే భావం కంటె, సంపదకోసం అధికారం కోసం పడే వేదనలే తీవ్రతరమైన ఆటంకాలుగా నిలుస్తాయి.

అది అలా ఉంచి, గతంలో ఏర్పడి అమలులోకి వచ్చి ఆమోదం పొందిన కుల వ్యవస్థ ఒకానొక సామాజికమైన కట్టుబాటుకి దారి తీసిందే కాని ఇది సార్వకాలికము శాశ్వతము అని ఎవరూ అనలేదు. ఈనాడు అట్టి కులవ్యవస్థ అమలు పరుచుకోవడానికి వీలు లేకుండా ఉంది కనుక, అధునాతన జీవన పరిస్థితులకు అనుగుణంగా దానిని కొద్దిగా మార్చుకుంటే, లేదా- పూర్తిగా పక్కకి తోసేస్తే; తప్పేమీ లేదు.

కుల వ్యవస్థ ప్రాతిపదికగా ఆ యుగాలలో ఏమి బోధించాలనుకున్నారో సరే. నిజాయితీగా, నిస్వార్థంగా చేసే ఏ పని అయినా గౌరవప్రదమే. సమాజంలో ప్రతి వ్యక్తీ తనకు నిర్దేశించిన విధిని నిష్కపటంగా నిర్వహించి, సమాజ శ్రేయస్సుకు పాటుపడాలి. అంతే కాక అభ్యున్నతి ఉన్నతోన్నత స్థాయికి ఎదిగి విశ్వ అభ్యున్నతి కాగలదన్న భావాన్ని అలవరచుకోవాలి.

ఆధ్యాత్మిక నాగరికత ప్రభావంతో గడచిన ఆ రోజులలో (కుల) వ్యవస్థ మానవుడికి వేరే విధంగా కూడా సహాయపడగలదని నిష్కపటంగా ఆశించారు. వ్యక్తి తనకు సమాజం (తనకులం ప్రాతిపదికగా) భారమైన విధిని ఒప్పగించినప్పటికీ, అతడు దానిని నిర భ్యంతరంగా నిర్వహించేవాడు. అందుమూలముగా అతడు మరింత సంస్కారమును పొంది భగవదనుగ్రహానికి మరింత అర్హతను సంపాదించుకున్నాడు. అట్టి భావము వలన తాను నిర్వర్తించవలసిన విధి కొంత అప్రతిష్ఠాకరమనే భావము కలిగినా, అది తొలగిపోగలిగినదయింది.

సమాజము బాగుపడడము, ఆత్మానుభవము-ధ్యేయములుగా గల వానికి పనిలోనే భగవంతుడున్నాడు.

★

# నాలుగవ అధ్యాయము

# జ్ఞానము

# 33. ఆధ్యాత్మిక సామ్యవాదము

శరీరము నిర్వహించే కర్మధర్మములు అన్నీ ప్రాణము అనే శక్తి వలన నెరవేరుతాయి. ఈ ధర్మకర్మ నిర్వహణకు వెనుక నిలిచి ఉండేది జీవాత్మ. అనగా వ్యక్తియాత్మ.

ప్రాణము నిష్క్రమించినప్పుడు శరీరమే మృత్యువునకు లోనవుతుంది తప్ప, జీవాత్మ కాదు. వ్యక్తి యొక్క "కర్మ"ను జీవాత్మ ఆతడి పునర్జన్మకు చేకొనిపోయి, అట్టి పునర్జన్మ వలన ఏర్పడే ఆ శరీరానికి ఒప్పగిస్తుంది.

(అట్టి కార్యభారమును కొనసాగించుటకు) వ్యక్తి ఆత్మ (జీవాత్మ) వెనుక ఉండేది విశ్వాత్మ (పరమాత్మ) అనే మరొక శక్తి.

మానవ, మానవేతరులకు, జంగమ స్థావరములకు, అన్నిటికీ ఒక దానికి (వ్యక్తికి)వలెనే మరొక దానికి (వ్యక్తికి) కూడా జీవాత్మ ఉంటుంది. అట్టి (వ్యక్తి యాత్మలకు) జీవాత్మలకు పరమాత్మ (విశ్వాత్మ) చలనమును ఇస్తుంది. "పరమాత్మ చలనమును ఇస్తుంది" అనేది గ్రహాలకు, రాశులకు, సౌర, చంద్రాది దివ్య గోళాలకు కూడా వర్తిస్తుంది. పరమాత్మ నుండి చలనమును చేకొనే జీవాత్మలు ఆ విశ్వాత్మలో భాగములుగా కూడా భాసిస్తాయి. ఈ జీవాత్మలు పరమాత్మకన్నా అన్ని విధముల అల్పములైనప్పటికీ విశ్వాత్మతో సర్వ సమస్వభావం కలవి.

అనగా విశ్వాంతరాళంలో స్థితములైన గ్రహ, నక్షత్ర; గోళములు మానవులతో బాటు సమస్త జీవులు; సూర్యభగవానునితో చుట్టరికమున్న ఒకే మహాకుటుంబము.

విశ్వాంతరాళంలోని దివ్య గోళాలవంటి సమున్నత శక్తులతో సమానత్వాన్ని మనకు మనముగా అపేక్షించినట్లే; మనకన్నా అల్పజీవులైన బానిసలపట్ల, క్రిమికీటకాది జీవులపట్ల, జంతువుల పట్ల; అట్టి సమానత్వమును దయచేయగల ఔదార్యం, నమ్రత మనమున్నూ కలిగి వుండాలి.

మానవుల యందే కాక, భూమిమీద జీవించే నిఖిల భూతముల యందును చూప వలసిన ఈ సర్వసమతావాదమే ఆధ్యాత్మిక సామ్యవాదము. రాజకీయ సామ్యవాదము ఒకటి ఉండవచ్చును. దాని ఆశయాలను గురించి ఎన్నో విపులమైన వ్యాఖ్యానాలు వచ్చి ఉండవచ్చును. కాని అవన్నీ ఆధ్యాత్మిక సామ్యవాదము ముందు వెలవెలబోయి, నిరర్థకములుగా మిగిలిపోతాయి.

అట్టి ఆధ్యాత్మిక సామ్యవాదమునకు పట్టుగొమ్మ అయిన సిద్ధాంతాన్ని జీర్ణించు కోవడమే, మనిషిలో నిజమైన జ్ఞానోదయం. అదే బ్రహ్మజ్ఞాన ఉషస్సుకు దారి చూపుతుంది.

★

# 34. బ్రహ్మ జ్ఞానము

**ఆత్మ అనేది ఛేదించడానికి వీలు లేనిది. (అగ్ని వలన) కాలనిది. (నీటివలన) నాననిది. (ఎండవలన) ఆరనిది. అది శాశ్వతము, సర్వ వ్యాపితము, స్థిరము.**

- ఈశావాస్యోపనిషత్తు

ముక్తి మార్గంలో పయనించే సాధకుడు ప్రాధమికంగా తెలుసుకోవలసినది ఒకటే. "తాను" వేరు, తన శరీరం వేరు.

తనలో ఉన్న "తాను". అది అతని జీవాత్మ అనగా అతని ప్రత్యేక ఆత్మ. శరీరము అశాశ్వతము. ప్రాణం నిష్క్రమించగానే దానికి మృత్యువు. కాని జీవాత్మకు అట్టి మృత్యువు లేదు. శరీరమునకు మృత్యువు సంభవించినపుడు ఆ శరీరము తన మాసిన ఉడుపులను పారవేసినట్లు, జీవాత్మ ఆశరీరమును పారవేయగలదు.

జీవాత్మకు, శరీరమునకు ఒక అనుబంధము. ఇది పరమాత్మ యొక్క ప్రతిబింబము వంటిది. కాని, నిజానికి రెండూ ఒకటే. పరమాత్మకు ఆపాదించుకునే గుణ లక్షణాలు అంతటి సమానత్వంతో, సామంజస్యంతో జీవాత్మకు కూడా వర్తిస్తాయి.

పరమాత్మ వలెనే (పరమాత్మతో సమాంతరముగా) జీవాత్మ కూడా ఒకానొక భావాతీత స్వభావము కలది. దానియందలి భాగములను గాని, దాని పరిమాణములను గాని నిర్వచించలేము. (అందలి మూలకముల ప్రభావములనుకూడా) అది ఆయుధాల వల్ల తెగేది కాదు. అగ్ని వలన దగ్ధమయ్యేదికాదు. నీటివలన చివికేది కాదు. గాలి వలన ఆరేదికాదు.

అది శాశ్వతము, సర్వవ్యాపి, స్థిరము, అజంగమము. సిద్ధాంత, ఊహ, స్థితిగతుల ప్రభావము పడనిది... ... సాధకుడు తెలియవలసినది మరొకటి ఉంది. అతడు ఆత్మను అనుసరించి ఉన్నాడు. అది మహిమాన్వితము, అమరము. కనుక తాను; క్షణభంగురము, జీర్ణమృత్యు అవస్థాపీడితము- అయిన శరీరధారుడు కాడు. అశాశ్వతము, నశ్వరము అయిన ఈ శరీరములో ఆత్మ ఎప్పుడు, ఎలా బంధితమయిందో అతడికి తెలియరాదు. ఈ ప్రాపంచిక జీవితపు వలలో నుంచి, తనదైన నిజమైన తనను (జీవాత్మను) ముక్తుని చేయడమే తన ప్రయత్నముగా కొనసాగాలి. ఈ ప్రయత్నం విజయవంతం కావాలంటే తనను తాను తెలుసుకునే ప్రయత్నం చేయాలి. దానికి రెండు మార్గాలు. ఒకటి అభ్యాసము, రెండవది సమర్థుడైన గురువుసేవ.

తన ఆత్మను తాను తెలుసుకోవడము, అట్టి ఆత్మకు పరమాత్మతో గల సంబంధమును తెలుసుకోవడము - అదే బ్రహ్మజ్ఞానము. అదే మానవుని నిజజ్ఞానము. తన ఆత్మ స్వరూపమునూ పరమాత్మనూ అవగాహన చేసుకోవడమే ముక్తి-అని ఉపనిషత్తులు చెబుతాయి.

★

# 35. ఉపనిషన్మూలము

**ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవాఽవశిష్యతే**

\- ఈశావాస్యోపనిషత్తు

"పరమాత్మ" ఉంది. అలాగే పర(మ) బ్రహ్మము ఉంది. ఈ భావన గురించి ఎంతైనా చెప్పవచ్చును. అలా చెప్పగలిగేది ఒక అనంతగ్రంథం కావచ్చును. అయితే ఈశావాస్యోపనిషత్తులో "పూర్ణమదమ్ పూర్ణమిదమ్ పూర్ణాత్ పూర్ణముదచ్యతే-" అని సరళంగా చెప్పారు. సర్వ వేదాంతమును విపులముగా నిర్వచించడానికి ఆధారభూతమైన సూత్రము ఇదే.

అతి క్లిష్టమైన ఈ సూత్రాన్ని ఎలా విశదీకరించుకోవచ్చు నంటే: అస్పష్ట, అనంత విశ్వమునందు గల అదృశ్య నిర్గుణ బ్రహ్మము నుండి, స్పష్ట, అనంత విశ్వమునందు దృశ్య సాధ్యమగు సగుణ బ్రహ్మము వచ్చినదని. అలా వచ్చినప్పటికీ ఆ (పరమాత్మ) నిర్గుణ బ్రహ్మము తరగదు, ప్రభావితమవదు.

పైన చెప్పినది మనకు సాధారణముగా తెలిసిన గణిత నిబంధనలకు లొంగనిది. పరమాత్మ అనంతత్వాన్ని అనుసరించి ఉన్న అగ్రాహ్యతను వచించే పరమ సత్యము ఇది. మనకు అనంతత్వంతోగాని, కనీసం శూన్యతతోగాని తగినంత పరిచయం లేదు. అందువలన పరమాత్మ అనంతత్వము, దానిని అనుసరించి ఉన్న అగ్రాహ్యత మనకు బోధపడవు. అయితే, మన ఋషులు మాత్రం; ఊహాతీతమైన, నిబిడాశ్చర్యకరమైన పరమాత్మ అగ్రాహ్యతలను లోతుగా పరిశోధించుకుంటూపోయి అనుపమానమైన, అనంతమైన; ఆనందాన్ని సాధించుకున్నారు.

అది గణిత శాస్త్రానికి లొంగని ఒకానొక అసంబద్ధమైన నిబంధన. అది, ఆధ్యాత్మిక తత్వానికి సంబంధించిన ఒక మహా సిద్ధాంతానికి ఎలాగ ఆధారభూతము అయింది-అని విభ్రమ చెందుతాము. అనంతత్వము అనే ఒక ఆలోచన ఆధారంగా దాని స్వరూపాన్నీ దాని దివ్యత్వాన్నీ మన ఋషులు ఎలాగ పట్టుకోగలిగారా అని కూడా. ఈ విభ్రమ అనవసరం. ఎందుకంటే ఒకనాడు నిరాధారమైన మూఢనమ్మకాలకింద కొట్టిపారేస్తూ ఉండిన దానిని అధునాతన శాస్త్రపరిజ్ఞాన అభివృద్ధి వలన అదంతా నిజమని నమ్మవలసి వస్తోంది. ఇది ఒక పరిణామము. మన ఆధ్యాత్మికరంగ మహనీయులు వారి అంతర్ దృష్టి ద్వారా గ్రహించినది కాలక్రమాన నిజమూబుజావూ కాగలదేమో.

అల్ప పరిమాణాలలో మనకు తటస్థపడే ప్రాపంచిక అదృష్టాలు చూసుకున్న మాత్రం చేతనే మనము ఎంతో సుఖం, సంతోషం పొందుతున్నామే; మరి అలాంటప్పుడు-నమ్మరానంత ఉత్కృష్టమైన శక్తి పరివ్యాప్తి, కాలము, ప్రేమలకు - నిలయమైన పరమాత్మను తెలుసుకునే స్థాయికి ఎదగ గలిగినప్పుడు మనము అనుభవించే ఆనందానికి అవధులుంటాయా?

★

# 36. పరమాత్మ - ఒక అవగాహన

**అనిర్వచనీయమునకు అతీతమైనది మరింత శాశ్వతమైన అనిర్వచనీయ మొకటి కలదు. అది సనాతనము, అతి పవిత్రము, అలోకము, నాశనరహితము.**

(భగవద్గీత, అక్షర పరబ్రహ్మ యోగము - 20)

నిక్కమైన స్పృహగా విలసిల్లే ఆత్మ-అదే బ్రహ్మము

- ఐతరేయ ఉపనిషత్తు

పరమాత్మ అనేది నిర్గుణం. కనుక దానిని వర్ణించడానికి ప్రయత్నించడమే ఒక వైభేద్యం. అయినా సరే, ఆ పరమాత్మ స్వరూపమేమిటో, మనం దానిన చేరే ప్రయత్నం ఎలా ఉండాలో; అవ్యక్తంగానైనా (అనగా; క్షమాపణ చెప్పుకోవలసిన ధోరణిలోనైనా సరే) నిర్వచించుకోవలసి ఉంది.

పరమాత్మను గురించి మనకు కొన్ని గౌరవభావాలు, ఆ భావాలపట్ల సహానుభూతి; ఉన్నాయి. కనుక ప్రస్తుతానికి "పరమాత్మ"ను "అతడు"- అని వ్యవహరించుకుందాము.

"అతడు" సర్వ స్థితుడు. (ఇందు గలడందులేడని సందేహము వలదు) కాని అతనిని మనము చూడలేము. అతడు అగోచరుడు. (గాలి అంతటా ఉంటుంది. కాని దానిని మనము చూడలేము. ఆ విధంగానే) "స్థితి" దర్శనీయతకాదు.

"అతడు" సర్వ ప్రకృతియందు విలీనుడై ఉన్నాడు. కాని ప్రకృతి యందు సంభవించే పరిణామాలను మన ఇంద్రియాలు కనిపెట్టలేవు. విలీనత అంటేనే విడదీసి చూడలేనిది.

మానవుని మనసు, జ్ఞానము, ఆలోచనలకు అనుభవాలకు సాధనాలు; వాటికి ఉన్న పరిధి మిక్కిలి పరిమితము. అందు వలన మానవుడు "అతనిని" స్పృశించగల అవకాశం కూడా పరిమితమే. ఆ విధముగా "అతడు" ఊహాతీతుడు.

"అతడు" ఆది మధ్యాంత రహితుడున్నూ.

ఆకాశంతో సహా విశ్వములోని సమస్తము అంతర్థానమై శూన్యస్థితికి చేరినా "అతడు" మాత్రం మిగులుతాడు.

"అతడు" సమస్త విశ్వానికి సృష్టి, స్థితి, లయకారుడు. అయినా "అతడు" మాత్రం అట్టి పరిణామాలు చెందనివాడు.

"అతడు" అన్ని జీవాత్మలకు అంతస్సులోని ఆత్మ "అతడు" లేనిదే విశ్వమే లేదు.

ప్రకృతియందుగల స్వాభావిక లక్షణాలన్నీ "అతని"లో ఉన్నట్లు తోచినా, "అతడి"పై వాటి ప్రభావం ఉండదు.

విశ్వమంతటికీ శక్తిని ప్రసాదించి, దానికి చలనం కల్పిస్తాడు. అయితే "అతడు" వీక్షకుడుగా ప్రోద్బల శక్తిగానే వాటిని నిర్వహిస్తాడు.

"అతడి" పరివ్యాప్తి అనంతం. అది మన ఊహాశక్తికి అందదు. "అతడి"ని అర్థం చేసుకునే ప్రక్రియలో మనము మరీ నిస్సహాయులమై పోయేదే "అతని" లక్షణం. "అతడు" పదార్థ, అంతశ్శక్తులకు అతీతుడై; ఆలాగున "అతడి"ని గురించి (అట్టి అతీతశక్తిని గురించి) ఉరమరికగా తెలుసుకోవాలనుకున్నా, అదే ఒక సంక్లిష్టమైన సమస్య అని, తేలుతుంది. అంచనాలు వేసుకోవడంతో, ఊహా నిర్ధారణలో; మనకు ఉండే అన్ని ఆలోచనలను వమ్ము చేస్తుంది. "అతడి" గుణాలు (విలువలు) ఇవి - అని ఒకరకం ఆధారాలతో "అతడి"ని తెలుసుకోవడానికి ప్రయత్నించే కన్నా, "అతడి" స్వభావాలు, లక్షణాలు "ఇవికావు" అనీ "అతడు" ఇలాగ ఉండడు" అనీ- ఈ మార్గం ద్వారా మన అన్వేషణ సాగించుకుంటే; ఒకదారికి వస్తాము. ప్రకృతి సిద్ధములైనవని మనము ఎరిగిన కొన్ని గుణాలు "అతడి"లో ఉన్నాయని కాక, లేకున్నాయన్న అవగాహనతో "అతడి"ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం మంచిది. న-ఇతి, న-ఇతి అనుకుంటూ, కొంతదూరం వెళ్ళిపోతే, అదే "అతని"ని కొంత వరకు తెలిసిన తృప్తి.

ఈ అనుపానులన్నీ మన ఋషులకు తెలిసినందువలననే వారు "అతని"ని "జ్ఞానాత్మక శక్తి" అనీ "పరిశుద్ధ జ్ఞానం" అనీ నిర్వచించి "అతడి"ని "అది" (పరమాత్మ) అన్నారు.

★

# 37. ఆత్మపదార్థం

ఆత్మ పదార్థం అనే దానిని ఒకానొక భౌతిక పదార్థపు సూక్ష్మ స్వరూపము అని పేర్కొంటే, అది ఒక అపార్థం కాగలదు. ఏ భౌతిక పదార్థాన్ని అయినా, రేణువులుగా అణువులుగా; "ఇంతకన్నా సూక్ష్మమైనది ఉండదు" అనేటంత వరకు విభజించవచ్చును. అయినా, ఆత్మ అనే పదార్థం యొక్క సూక్ష్మత్వానికి ఎంత మాత్రం దరిజేరలేము. "అణోరణీయాన్ మహతోమహీవాన్" అన్నారు. ఈ భావంలో స్వయం వైభేద్యం ఉంది. అట్టి ఉక్తి కూడా ఆత్మపదార్థాన్ని వర్ణించడానికి పనికిరాదు. అది ఆకాశం వలె అనంత శూన్యం కాదు. అట్టి అనంత శూన్యంలో కానరానంతగా ఇమిడిపోయే పొగవంటిది కూడా కాదు. గ్రహించగలిగే వారికి అది ఒకానొక అంతరంగ పదార్థం. గ్రహించలేని వారికి అనంతకోటి యోజనాల దూరములో ఉండేదని ఊహించే నక్షత్రంకన్నా, దూరంగా ఉండేది.

ఆత్మ పదార్థం ఎలా ఉంటుందో సూచన ప్రాయంగా చెప్పుకోగలం. మాటవరసకు మానవ శరీరంలో ఉన్న "ప్రాణం" అనే పదార్థాన్ని తీసుకోవచ్చు. అది ఉందని తెలుసు. అది రక్తమాంస పరివృతమైన శరీరం సమస్తంలో ఉన్నదనీ, తెలుసు, దానిని శరీరమనే ఆవాసమునుండి శాశ్వతంగా, తరిమివేయడమెలాగో తెలుసు. అయితే దాని ఆకారము, దానిలోని పదార్థ నిర్మాణము, దాని అసలు స్థావరము మనకు తెలియవు.

ఇలాటిదే ఇంకొకటి "మనసు" అని అనుకోవచ్చు. మనసు-అనేది కూడా ఉందని మనకు తెలుసు, దానికి మనమీదనే కాక, మనలను పరివేష్టించి ఉండే అన్నిటిమీదను: శక్తి, చలనం, ప్రభావం ఉంటాయని తెలుసు. కాని, ఈ "మనసు" అనేది ఎక్కడుంటుంది? ఎలా ఉంటుంది? ఎంత ఉంటుంది? మనకు తెలియదు అంతేకాక, ఎట్టి భౌతిక సహాయంతోగాని, పదార్థ సంబంధ సాధన సహాయంతో గాని; దానిని పెంచలేము, తుంచలేము.

ఇదంతా "ఆత్మ" విషయంలో కొంత వరకు వర్తిస్తుంది. అగ్రాహ్యము, స్వయం వైభేద్యం, ఆశ్చర్యకరము, అతులితము-అనిపించే ఈ ఆత్మ అనే దానికి, ఒకే ఒక లక్షణాన్ని, కారణాన్ని ఆపాదించవలసి వస్తుంది. అది ఏమిటంటే ఈ ఆత్మ అనేది ఒకానొక విలక్షణమైన స్థాయికి చెందినదని. అందుచేతనే మనందరిలో ఆత్మ అంటూ ఒకటి ఉన్నా, దానిని గురించి, మనకు ఏ విధమైన సమాచారం (అవగాహన) లభించదు. ఒక్కొక్కరికి, ఒక్కొక్క విధంగా వారివారికి ఉండే, ఆధ్యాత్మిక పారవశ్యం, స్వాభావిక అంతర్ దృష్టి వంటి విలువల ద్వారా మనలో కొందరు దానిని గురించి కొంతపాటి అవగాహనకు రాగలుగుతాము.

★

# 38. ఆత్మాంతరగత యానం

మానవుడు పరమాత్మతో ఐక్యం కావడం అనే అత్యున్నత ఆదర్శం సాధిస్తే అది ఆత్మకు ఆవలి తీరమే.

ఆత్మ స్థావరము, స్థితి-వేరు. ఆత్మ నిర్మాణము, స్వభావము తదితర ఊహాత్మకమైన విషయాలు వేరు. ఆత్మ స్వభావాన్ని ఉరమరికగా దృశ్యీకరించుకోవాలంటే, అది మన ఆనంద, ఆగ్రహ మాత్సర్యాల వంటి భావాల వంటిదే తప్ప, ఆ విధంగా అనుభవించగల గుణము కాదని చెప్పవలసి ఉంటుంది.

అందుచేత భౌతికమైన (విషయాలకు ప్రాముఖ్యాన్నిచ్చే) స్థాయిలో జీవించే మనకు ఆత్మ స్వరూపాన్ని ఆదినుంచి అంతం దాకా పరిక్రమించడానికిగాని, పరిపూర్ణమైన ఆత్మస్వరూపాన్ని చేరడానికిగాని ఎన్నడూ తగలని లాంటివి ఎన్నో అవరోధాలు కలగడం తథ్యం.

మనం ఉన్న ప్రపంచంలో మనిషి గొప్పతనాన్ని అంచనా వేయడానికి-జీవితంలో అతడు అధివసించిన ఉన్నత స్థితి, అతడు పోగుచేసుకున్న అనంత నిధినిక్షేపాలు, ఇతరులను మట్టుపెట్టడానికి అతడికి గల కండబలం, అతడికి ఉన్న విద్య, పాండిత్య అర్హతలూ-ఇలాంటివి పరిగణనలోనికి వస్తాయి.

అయితే ఆత్మస్థాయి పరిగణనలో ఇవన్నీ ఎందుకూ కొరగాని పైపై మెరుగులు. ద్రోహం, దుర్మార్గం, ద్వేషం, అహంభావం వంటి దుర్గుణాల ద్వారా; అసత్యవాదం ద్వారా; నీతినిగాని, ఆధ్యాత్మికతని గాని- లక్ష్యపెట్టక; జనాలను హింసించ (వధించ)డం ద్వారా, ఒకడు వృద్ధిలోకి రావచ్చు. కాని ఆత్మిక స్థాయిలో అది కుదరదు. అక్కడ ముందుకు సాగాలంటే, (తనకుగల అట్టి) అన్నిశక్తులూ తలక్రిందులవుతాయని, మిక్కిలి సంభ్రమాశ్చర్యాలతో కనుగొంటాడు. ఇక్కడ కలిగిన అనుభవాలకు, విజయాలకు- అక్కడ అంతా వ్యతిరేకంగా జరుగుతుంది. అసత్యం, ఆగ్రహం, దర్పం, విషయాసక్తి, అజ్ఞః అక్కడ గెలవవు. అక్కడ గెలిచేవి సత్యం, వినయం, నిజాయితీ, పవిత్రత, ప్రార్థన.

ముక్తి సాధన ఆశయంగా గల వ్యక్తి, అదే తన ధ్యేయం అని అనుకుంటే (పైన చెప్పిన) అవగుణాల నుండి దూరంగా ఉంటూ, వాటిని జయించగల సద్గుణాలను అలవరచుకోవాలి.

అలా జరగాలంటే, అతడు; బాహ్యదృష్టినీ, బాహ్యజీవితాన్నీ విడనాడి, అంతస్సులోనికి దృష్టి సారించుకుని నిలదొక్కుకోవాలి. తాను వేసే ప్రతి అడుగువద్ద నిర్దాక్షిణ్యంగా ఆత్మ పరీక్ష చేసుకుని, అవసరమైతే తననుతాను దిద్దుకుని, పరమ సత్యమైన, పరమ పవిత్రమైన జీవితాన్ని కొనసాగించుకోవడానికి సిద్ధమవాలి.

అప్పుడు అతడు ఆత్మిక స్థాయిని గూర్చి కొంతైనా తెలుసుకుని అందులో ప్రవేశించే అర్హత సంపాదించుకుంటాడు. అయితే, చిరకాలంగా అలవాటులో ఉన్న ప్రవృత్తులను ఆపుకొని అప్రాపంచికుడుగా మారడం అంత సులువుకాదు. దానికి చాలా కష్టసాధ్య మయిన, తీవ్రమైన-ప్రయత్నం కావాలి. అందులో అతడు విజయం సాధించాడా, సరేసరి. లేదా, నిరంతర మృత్యుశీలురైన ఇతర జీవుల వలెనే "అచ్చపు చీకటిన్ బడి" భ్రమలో, నిస్పృహలో కొట్టుమిట్టాడుతూ ఉంటాడు.

★

# 39. బ్రహ్మమార్గపు తొలి మెట్టు

నిర్వచనానికిగాని, వర్ణనకు గాని, పరివ్యాప్త పరిమాణ-శక్తి-జ్ఞాన-స్వభావ నిర్ణయాలకు గాని; మన స్ఫురణలోని ఏ ఇతర లక్షణాలకీ అందని పదార్థమే నిర్గుణ బ్రహ్మము. అట్టి నిర్గుణ బ్రహ్మములో ఐక్యమయ్యే ధ్యేయంతో ఆరాధన నిర్వహించాలంటే అది సాధారణ పరిస్థితులలో మెలగే సామాన్య మానవునికి ఊహాతీతమైన సంగతి.

మరి ముక్తి అనేది ఒక ఆశయంగా చేపట్టినప్పుడు తప్పదుకదా!

ముక్తి మార్గానికి అనుగుణంగా మన జీవితాలను మలచుకునేటందుకు ఆ నిర్గుణ బ్రహ్మ స్వరూప స్వభావాలను మనకు సాధ్యమయినంత ఊహాత్మకంగా రూపొందించు కోగలము. ఒక బొంగరం ఉంటుంది. అది తిరుగుతూ ఉంటుంది. తిరుగుతూ ఉన్నప్పుడు భూమ్యాకర్షణ శక్తి వంటి బాహ్య శక్తులు దానిమీద పనిచెయ్యవు. తిరిగే బొంగరం కొద్దిగా ఇటో అటో వంగిందంటే, దాని తిరుగుడులో పరిపూర్ణత, సమతౌల్యం లోపించి నట్టు తెలుసుకుంటాము. బ్రహ్మమార్గము అనేది ఇటుగాని అటుగాని వంగకుండా తిరిగే, ఏ ఇతర శక్తులవలన ప్రభావితం అవని, ఆ బొంగరం వంటిది.

బ్రహ్మము అనేది విశ్వాంతరాళాన్ని సచేతనం చేస్తుంది. లేకపోతే, విశ్వాంతరాళము సమస్తము చలన రహితమయిపోతుంది. అది ఊహాతీతము. విశ్వాంతరాళపు నిరంతర చేతనాత్మకతలో ఒదిగే బ్రహ్మము ఉత్కృష్టతను పోగొట్టుకొని వక్రతలోకి పరిణామం చెందవచ్చు. కనుక బ్రహ్మము విశ్వాంతరాళాన్ని చైతన్యవంతం చేయడం వరకే చాలించుకుని, దానిలో ఒదగకుండా ఉండిపోవాలి.

పరమాత్మలో ఐక్యమయిపోవడము, లేక అట్టి పరమాత్మ లక్షణాలతో స్వభావమమేకం చెందడం- ఇదే ఏ భక్తుని ఆధ్యాత్మిక ప్రార్థనలకైనా అంతిమ ధ్యేయం. తనంతట తాను పరమాత్మ స్వరూపాన్ని గురించి ఒక రూపకల్పన చేసుకుని ప్రార్థన సలుపుకోలేనివాడు అట్టి పరమాత్మ స్వరూప స్వభావాలలో ఉత్తమమైనదిగా తాను గ్రహించిన విధానికి అనుగుణంగా తన స్వభావాన్ని మలచుకోవడమే కర్తవ్యం. తనకుగాని, తానున్న పరిసరాలకు గాని, జరిగే దేనినైనా నిర్లిప్తతతో, తటస్థ గుణంతో దర్శించి భావించగల గుణమే ఆ స్వభావం కావచ్చు. అదే ఆధ్యాత్మిక మార్గంలో అతని తొలి సక్రమ సోపానము.

★

# 40. నిర్గుణ పరమాత్మ ఆరాధన

**సమస్త జీవుల యందు తనను, తనలో సమస్త జీవులను;**
**దర్శించ గలిగిన వాడు బ్రహ్మమును చేరుకో గలడు.**

- కైవల్యోపనిషత్తు

ఇంద్రియ ప్రభావంలో (సామాన్యత్వములో) - ఉండే మానవులకు నిరాకారుడు, నిర్గుణుడు, అనిర్వచనీయుడు అయిన పరమాత్మను ధ్యానించడమే చాలా కష్టమవు తుంది. ఆధ్యాత్మికతలో ఒకానొక అత్యున్నత స్థాయిని చేరిన వారికే అట్టి ఆరాధన సాధ్యమవుతుంది. మిగిలిన వారు భ్రమోపహతులుగా మిగిలిపోతారు.

భగవానుడు విశ్వవ్యాపి, అంతఃస్థితుడు. చూసేవానికీ చూడబడే వానికీ అభేదాన్ని తెలిపే తత్త్వవేత్త ఈ అంతఃస్థితిని గుర్తించవలసి వుంటుంది. జ్ఞానముచేత, పరిజ్ఞానము చేత ఏర్పడే విశ్వాసాలు మానసానుభవము వలన కలిగే తెలివిడులు కావని గ్రహించవలసి ఉంది. సమస్త జీవరాసుల యందు ఉండే ఆత్మ ఒక్కటేనని చేసే సిద్ధాంతాన్ని సూత్రప్రాయంగా ఆమోదించినంత మాత్రాన సరిపోదు. అట్టి జీవరాశులు అనుభవించే బాధలు, వ్యధలు ఎంతటివో తెలుసుకుంటేనే ఆ సూత్రాన్ని మనసా అంగీకరించినట్లు.

కష్టసుఖాలను, విషాదానందాలను సమముగా చూసుకోగల అవగాహనా లక్షణము పట్టుబడాలి. పూలతోటలో నిలుచున్నా, దహనచితి మీద పడివున్నా, గాలిలో తేలినా, జలధిలో మునిగినా తాను భగవానుని పరిధిలో ఉన్నానని కాక, భగవానునిలోనే ఉన్నానని శంకారహితంగా భావించాలి.

అట్టి విచక్షణ అనుభవములోనికి తెచ్చుకోగలిగేవాడు అన్నిటా భగవానుని, భగవానునిలో అన్నిటిని - గ్రహించి; సర్వ ప్రపంచ కార్యకలాపమంతా భగవానునిదే నని తాను ఆతని సాధనమాత్రుడిగా (తన కర్తవ్యాన్ని) నిర్వహిస్తున్నాడని గ్రహించగలుగు తాడు. అప్పుడు అతనికి తన విధిపట్ల హృదయపూర్వకత ఏర్పడి, దాని ఫలితము పట్ల నిర్వికార, నిరామయ దృక్పథము ఏర్పడుతుంది. పనిలో ఆనందం కలిగి ఆనందంగా విధి నిర్వహణ చేసుకోగలుగుతాడు.

ఎవడు తన అంతస్సును అట్టి ఔన్నత్యానికి పరిణమింపజేసుకుని సమస్త విశ్వమును ఆ దృక్కోణములో అవలోకించగలుగుతాడో, అతడు నిర్గుణ పరమాత్మ ఆరాధనకు సమర్థుడవుతాడని చెప్పవచ్చు. అంతే కాదు. అతడు చేసే ఏ పని అయినా పరమాత్మ ఆరాధనే. (దానినే మన పూర్వులు "యద్యత్ కర్మకరోమి తత్తదఖిలమ్ శంభో, తవారాధనమ్" అన్నారు.)

★

# 41. గురువు ఆవశ్యకత

గురుర్బ్రహ్మా, గురుర్విష్ణు; గురుదేవో మహేశ్వరః.
గురుః సాక్షాత్ పరబ్రహ్మా, తస్మై శ్రీ గురవే నమః

'అనంతము'ను తెలియాలంటే, శ్రుతులయందు ప్రగాఢ పరిజ్ఞానము కలిగి బ్రహ్మమునకు భక్తుడై ఉండే గురువును సాధకుడు వినయపూర్వకంగా ఆశ్రయించవలసి ఉంది.
-ముండకోపనిషత్తు.

ఆధ్యాత్మిక ప్రగతిని సాధించడానికి సాధకుడి స్వయంకృషి ముఖ్య అవసరమని ప్రముఖంగా స్థిరంగా చెప్పుకోవలసి వచ్చినా, గురువు ఆవశ్యకత కూడా ప్రముఖమైనదేననే సూచన చిరకాలంగా స్థిరపడినా; మన ఆధ్యాత్మిక వాఙ్మయంలో గురువు ఆవశ్యకత అంతశక్తిమంతంగా చెప్పలేదు.

మనము శాస్త్రాలకు, తర్క వ్యాకరణాది ఇతర విషయాలకు బోధకులుగా గురువుల ఆవశ్యకతను అంగీకరించుకొన్నాము. అయితే మరి సృష్టిలో కెల్లా అత్యంత క్లిష్టమయిన ఆధ్యాత్మిక తత్వానికి బోధకుడిగా ఒక గురువు అవసరం ఎంత ప్రధానమైనది అయి వుండాలి! ఆధ్యాత్మిక సిద్ధాంతం గురుముఖతా సూచనగా వచ్చినప్పుడు అది కేవల సిద్ధాంత బోధగా కాక ఒకానొక నిగూఢ అనుభవంగా స్థిరపడుతుంది, కదా!

ప్రస్తుత కాలంలో ఎంతటి అభిరుచిగల శిష్యుడికైనా అంతటి విశ్వాసాన్ని పాదుకొలిపే టంత విలువగల గురువు దొరకడం కష్టంగా ఉంది. మఠాధిపతులుగా మనం ఈనాడు పేర్కొంటున్న, మనకు ఈనాడు దర్శనమిస్తున్న, అనేకులు సామాన్య మానవులకు సహజాతాలైన రాగద్వేషాలతో ఉన్నవారే. నిజంగా "గురువు"లు అనిపించుకునే వారు, వారి ప్రతిభను ఎన్నడూ చాటి చెప్పుకోరు. అది అలా ఉండగా వారి ప్రతిభే వారిని (వారికి ఇష్టం లేకపోయినా) పదిమందిలో ప్రచారంలోకి తెస్తుంది. అట్టి ధన్యులలో చాలమంది పేదలు, నిరక్షరాస్యులు - అయినా సరే - వారి గుప్త కాంతి నిజమైన శిష్యులకు తానుగా కానవస్తుంది. వారు విద్యాలయాలు స్థాపించి, పాఠాలు చెప్పరు. కాని మనము వారిని ఒక గురుకులములో విధేయులైన శిష్యులవలె సేవించితే, వారు మనలను వారి బిడ్డలవలె చూసుకుంటారు. కాల క్రమాన, వారు వారికి సమంజసమని తోచిన నాడు, మనలను నిండుమనసుతో దీవిస్తారు. మనము జ్ఞానమార్గములో పరిపూర్ణత సాధించామనడానికి అదే ఋజువు.

అట్టి నిజగురువు మనకు సంప్రాప్తించనప్పుడు మన ఇష్టదైవాన్నే మన పరమ గురువుగా మానసిక స్వీకారం చేసుకోవచ్చు. అట్టి ఇష్టదైవాన్నే ప్రార్థించుకొని, ఆధ్యాత్మిక యానంలో మనము వేసే ప్రతి అడుగు వద్ద, అట్టి పరమ గురువు మార్గదర్శకత్వాన్ని కోరుకుంటాము. అట్టి (మానసిక) పరమ గురువు మనకు తప్పక సహాయ పడగలడని, అది ఆ పరమ గురువు అభీష్టమని మనము భావించుకోవచ్చు.

★

## ఐదవ అధ్యాయము

# ముగింపు

# 42. బ్రహ్మసాక్షాత్కారము

ఉపనిషత్తులలో చెప్పిన నాలుగు మహా వాక్యాలు :

1. అహం బ్రహ్మాస్మి
2. త్వమేవాఽహం
3. ఆత్మావై బ్రహ్మనామాసి
4. బ్రహ్మార్పణం

ఇంతకు ముందు ప్రకరణాలలో వివరంగా చెప్పినది, సూచనగా చెప్పినది : ఏమిటి అనేది ఈ క్రింది విధంగా సారాంశం చేయవచ్చును.

మానవుని ఉత్కృష్ట ఆశయం : అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ : ఒక్కటే. ముక్తి. అదే పరమాత్మలో లీనం కావడం; లేదా, దరి జేరడం.

అట్టి బ్రహ్మైక్యతకు మానవుడి పూర్వకర్మ పెద్ద అవరోధంగా నిలుస్తుంది. కర్మ అనేది ఎప్పటికప్పుడు పరిశీలించుకుని, నియంత్రించుకోవలసినది. లేకపోతే అది మానవుని ఆత్మమీద నిరంతరం ప్రభావం చూపించి అతనికి ఐహిక బంధం అనే ఊబిలోకి లోతుగా దింపేస్తుంది.

తనకంటే హీన జీవులుగా ఉన్న (పశు, పక్ష్యాదుల వంటి) వాటికంటే, విశేషంగా మానవుడికి ప్రత్యేక వరంగా "సంకల్పం" అని ఒకటుంది. దీనికి పరిధులున్నాయి. అయితే మానవుడు ఈ వరాన్ని పరిపూర్తిగా ఉపయోగించుకొని, ముక్తిమార్గదిశగా పయనించి, సంకల్పసిద్ధుడు కావాలి.

ఇంద్రియాలు; వివిధ రకాలైన రాగద్వేషాల వలన, కోరికల వలన, తదితర భవబంధాల వలన- మానవుడిని ప్రభావితుణ్ని చేస్తాయి. మనస్సు ఇంద్రియాలను నియంత్రిస్తుంది. మనస్సును నిర్మలం చేసుకుంటే కోరికలను జయించడం అవుతుంది. కోరికల నాశనంతో వాటి వలన సంభవించే కామ, క్రోధ, ఆశాది వైరి భావాలు తగ్గుముఖం పడతాయి, లుప్తమవుతాయి కూడా.

దీనినంతటినీ అమలు పరచుకోవడం క్లిష్టసాధ్యమైన ప్రక్రియ. పంకిల మార్గం ఎప్పుడూ కూడా ఎంతో ప్రలోభాత్మకంగా ఉంటుంది. దానిని విడనాడి, వ్యక్తి తన మనసును సన్మార్గానికి మాత్రమే పరిమితం చేసుకొని, బలవంతంగా నైనా సరే అటు మళ్లించు కోవాలి. బాహిర అవయవాలు తదనుగుణంగా ప్రవర్తించేటట్లుగా మనసు ఇంద్రియాలకు ఆ శ్రేష్ఠమార్గానికి సంబంధించిన నిర్దేశాలను ఇచ్చేవిధంగా చూసుకోవాలి.

నిర్మలమైన మనస్సు ఎన్నడూ దున్నని భూమి వంటిది. అట్టిచోట చేసే, ఆధ్యాత్మిక వ్యవసాయం ఇబ్బడి ముబ్బడి ఫలసాయం ఇస్తుంది. అందుచేత మనస్సును కామక్రోధాది

వైరి భావాలనుండి; కోరిక వంటి కల్మషాల నుండి- దూరం చేసుకుని, సదసద్వివేక విచక్షణతో, శ్రద్ధాభక్తులతో, కర్మజనితాలయ్యే అన్ని దుష్ఫలితాలను నిర్జించాలి. అట్టి ఆత్మ సంపన్నాత్మక స్థితిని సాధించడం కోసం కొన్ని పద్ధతులను, విధులుగా పాటించ వలసి వస్తుంది.

యద్భావం తద్భవతి - అని సూక్తి. దేనిని ధ్యానం చేస్తామో, దానిలోకి పరిణామం చెందించే శక్తి మనస్సుకి వుంది. దైవాన్ని ధ్యానించి, ప్రార్థిస్తే, దైవత్వాన్ని పొందుతాము. అది ఒక వైశిష్ట్య స్వరూపం. అందుచేతనే ప్రార్థన అన్ని దుర్భావాల, దుశ్చర్యల, దుష్ఫలితాలను పరిహరించి; మానవుడి ప్రగతిని ముక్తి మార్గం వైపు మళ్లించే ఒకానొక విశిష్ట ఆధ్యాత్మిక శక్తిగా భాసిస్తున్నది.

కనుక; తన పూర్వ ప్రస్తుత పాపములు కడుగుకొనిపోయి, ముక్తిమార్గం నిరంత రాయంగా ఏర్పడేటందుకు: మానవుడు విస్తారంగా, వివిధంగా భగవంతుని ప్రార్థించవలసి వుంది. ఇట్టి ప్రార్థన ఏ ఐహిక వాంఛాఫల సిద్ధి కొరకో కాక ప్రార్థన అనేది ఒక ధ్యేయంగా సాగాలి. ఇతరులు మెచ్చుతారనీ తనకు వినోదంగా, కాలక్షేపంగా వుందనీ కాక; మనసును ఆధ్యాత్మిక భావాలతో ధ్యానంతో నింపుకోవడం ద్వారా, భజనలలో పాల్గొనడం ద్వారా, పవిత్ర స్థలాలను దర్శించడం ద్వారా-అంతా ఒకానొక దైవాజ్ఞగా సాగాలి.

మానవుడు తన విధులను శ్రద్ధతో, నిర్లిప్తతతో ప్రతిఫలాపేక్షారహితంగా (మా ఫలేషు కదాచన) నిర్వర్తించ నేర్వాలి. ఈ సూత్రం అతి ముఖ్యమైనది. "ఫలమును" పట్టించుకో కూడదు. కాని "ధర్మాన్ని" తప్పక ఆచరించాలి. అప్పుడు మానవుడు తన పారమార్థిక, ఆధ్యాత్మిక ఆలోచనలను విడువకుండా తనవలన జరుగవలసిన దానిని సమర్థంగా నిర్వర్తించ గలుగుతాడు.

అది అలా వుంచి, తన ధర్మముపై అట్టి నిరామయ శ్రద్ధ కలిగి వుండే వాడు పునరపి జనన కారణమైన "ప్రారబ్ధము" కొనసాగించుకోకుండా ఉండగలుగుతాడు. స్నేహితులను, శత్రువులను, సుఖమును, కష్టమును అట్టి ఇతరేతర భావబంధములను సమదృష్టితో చూసుకోగలుగుతాడు. అదే వైరాగ్య సారాంశం.

తాను "పరమాత్మ"లో ఒక భాగమని, తాను నాశనము లేని "ఆత్మ" అని జనన మరణములకు అతీతుడని "సాధకుడు" గ్రహించాలి. విద్వాంసులతో సాహచర్యం, గోష్ఠి, ప్రశ్నోత్తరాలు, అధ్యయనం- మొదలైన విలువల వలన ఇది సాధ్యమవుతుంది. సృష్టిలోకెల్లా అత్యంత మార్మికమైన ఓంకార బీజాక్షరమును నిరంతరం, సాధ్యమయినంతసేపు జపించాలి. "అహం బ్రహ్మాస్మి" అనే అపురూప వాక్యాన్ని స్మరించుకుంటూ, ఓంకారంలోని విలువనూ, అర్థాన్నీ తెలుసుకుంటూ, నిత్య జీవితంలో దాని అర్థం ఇది అని గ్రహించే ప్రయత్నం చేయాలి.

తనయందు, నిఖిల భూతములందు: "జీవాత్మ" ఒక్కటేనని సాధకుడు నిరంతరం అనుభూతి చెందడం నేర్వాలి. తనలోనే అందరూ ఉన్నారని, అందరిలో తానున్నాడని

దృగ్గోచరం చేసుకోగల స్థాయికి ఎదగాలి. స్వానుభవము వలన సాధించుకొనే అట్టి జ్ఞానం అదే ముక్తి. దానినే బ్రహ్మైక్యత అన్నారు.

భక్తి, నిరామయత, విచక్షణ- అనే మూడు గుణాలను ఆచరణలోనికి తెచ్చుకుని "కర్మ" వలన పొడసూపే అవాంతరాలను అధిగమించి ముక్తి మార్గానికి వేసుకున్న బాటలో త్వరితగతిని సాగవచ్చు. అట్టి పరిణత స్థితిని చేరుకొన్న తరువాత సాధకుడు, ఆది శంకరుడు వివేక చూడామణిలో చెప్పిన శ్లోకాన్ని తనలో తాను ప్రతిధ్వనించుకోవాలి.

క్వగతం కేనవా నీతం కుత్ర లీనమిదం జగత్
అధునైవ మయాదృష్టం నాస్తి కిం మహదద్భుతమ్

★

---

సర్వేజనాః సుఖినో భవన్తు
సమస్త మంగళాని భవన్తు
సర్వం
శ్రీ కృష్ణార్పణమస్తు

★ ★ ★

# కొన్ని సాంకేతిక పదాల వివరణ

అంతః కుంభకము : యోగాభ్యాసాలలోని ప్రాణాయామము నందు చెప్పినది. ఊపిరి తిత్తులలో గాలిని నిలిపి ఉంచడం.

అద్వైతము : ఆది శంకరులు ప్రవచించిన మత విధానం. వ్యక్తి వేరు, బ్రహ్మము వేరు - అని కాక రెండూ ఒకటేనని సారాంశంగా చెప్పినది.

అహంకారము : "నేను" అనే భావం.

ఇంద్రియములు : ప్రకృతియందలి పదార్థాల స్వభావ లక్షణాలను తెలిపే మానవ అవయవాలు. ఇవి ఐదు.

ఇష్టదేవత : భగవానుని గూర్చి వ్యక్తిగత అభిప్రాయం ఆధారంగా ఏర్పడినభావం.

ఉపనిషత్తులు : వేదములయందు మూడవ విభాగంగా బ్రాహ్మణములు అని పేర్కొన్న వాటిని అనుసరించి చెప్పినవి. వేదములు అనగా తెలుసుకోవలసినవి. బ్రాహ్మణములలో, శ్రుతులు - అనగా ప్రపంచ మార్గమును నిర్వచించినవి. వీటినన్నిటిని స్పృశించినవి ఉపనిషత్తులు.

ఓజస్సు : జన్యుశక్తి.

కర్తవ్య భావము : 'చేసేది నేను" అనుకోవడము.

కర్మయోగి : కర్మయోగమును అభ్యసించేవాడు.

కర్మ : మానవుడు చేసే చర్యవలన కలిగే ఫలము.

గుణములు : శక్తి యందలి రూపములు, సత్త్వ, రజః తమములని - మూడు.

జపము : ఇష్టదేవ నామాన్నిగాని, ఇష్ట మంత్రాన్నిగాని; నిరంతరాయంగా, నిశ్శబ్దంగా - స్మరించుకోవడము.

జీవాత్మ : వ్యక్తి ఆత్మ.

తమస్సు : త్రిగుణములలో మూడవది. స్తబ్ధత, అంధకారం, మౌఢ్యం-లకు సంకేతం.

ధర్మము : నియమిత విధి, న్యాయము, మంచితనం, ఈవి.

దృగింద్రియము : కన్ను.

ధ్యానము : ఏకాగ్రతతో సలిపే స్మరణ.

ద్వైతము : మధ్వాచార్యులు ప్రవచించిన తత్త్వపద్ధతి. లోకములు, లోకస్థులు, ఆత్మలు-కలిపి ఒకటి· విష్ణువు మరి ఒకటి; అని

నిర్వికల్ప సమాధి : (కోరికలు, ఆకాంక్షలు - లేని విధంగా "ధ్యానం' లో ఏర్పడే అంతిమ స్పృహాస్థితి.

పద్మాసనము : పద్మమువలె కూర్చుని ఉండుట. ఒకానొక యోగాసనము.

పూరకము : (చూ.ప్రాణాయామము)గాలిని ఊపిరితిత్తులలోనికి లాగుకొనుట

ప్రణవము : అ,ఉ,మ్-అనే మూడు శబ్దాలతో ఏర్పడిన మార్మిక ఏకాక్షరము: ఓం.

ప్రాణాయామము : యోగాసనాలలో చెప్పిన ఒక స్థితి. ఊపిరితిత్తుల నిండుగా గాలిని పీల్చుకోవడము, ఊపిరితిత్తులలో గాలిని నిలిపి ఉంచడము, ఊపిరితిత్తుల నుండి గాలిని వదలడము-ఇవి ఒకానొక క్రమ పద్ధతిలో చేసుకుంటే ఒక ప్రాణాయామము అవుతుందని.

ప్రారబ్ధము : పురాకృత కర్మ.

బాహ్య కుంభకము: (చూ.ప్రాణాయామము) గాలిని ఊపిరితిత్తుల నుండి వదలడము.

బుద్ధి : విచక్షణా జ్ఞానం : మనసును అనుసరించి ఉండేది.

బ్రహ్మ చర్యం : పవిత్రతా నియమం.

బ్రహ్మము : పరమాత్మ.

మంత్రము : ధ్యానంలో ఏకాగ్రతకు తోడ్పడే ఒక శబ్దము, లేక పదము.

మఠము : సాధుజనుల ఆవాసము.

మహర్షి : జ్ఞాన సాధనా పరిణామమును ముగించుకొని లోక శ్రేయస్సు కొరకు భూమిపై ఉండిన వాడు.

మహా ప్రళయము : విశ్రాంతము.

మహా మంత్రము : ఉత్తమ మంత్రము.

మహా వాక్యము : ఘనమయిన సూక్తి.

మాయ : చిత్తభ్రమ. భగవానుడు అవతారాలను ధరించేటప్పుడు మన మమేకం కోసం తోడు తెచ్చుకొనేది.

యోగము : ఒకానొక ఆధ్యాత్మిక ధ్యాన పద్ధతి.

రజస్సు : త్రిగుణములలో నడిమిది. కదలికకు, చలన శక్తికి, మోహమునకు-ప్రతీక.

రాజయోగము : మనసునందు, అందు ఉద్భవించే భావాల యందు; అదుపు కలిగి ఉండే యోగము.

రేచకము : (చూ.ప్రాణాయామము) ఊపిరితిత్తుల నుండి గాలిని బయటికి వదులుట.

విశిష్టాద్వైతము : రామానుజులు ప్రవచించిన మత విధానము.

శవాసనము : యోగాభ్యాసములలో చెప్పినది. నిర్జీవివలె పడి ఉండుట.

శ్రవణేంద్రియము : చెవి.

శ్లోకము : గణబద్ధంగా సంస్కృతంలో చేసిన రచన.

సంచితకర్మ : పూర్వ జన్మల నుండి పేరుకుంటున్న కర్మ.

సత్త్వము : త్రిగుణములలో మొదటిది. లయ, సామరస్యం, పరిశుద్ధతలకు సంకేతం.

సన్న్యాసి : నిరాసక్తుడు.

సమాధి : ధ్యానమునందలి మూడవ స్పృహస్థితి.

సాధకుడు : ముక్తి మార్గ సూత్ర అభ్యాసకుడు.

సాధన : అభ్యాసము.

స్థితప్రజ్ఞుడు : నిశ్చల మనస్కుడు.

★

# ఇది ఒక విశిష్ట అనుభవం

"ఇతన్ని కేవలం హాస్య రచయితగా కొట్టిపారెయ్యడానికి వీల్లేదు!"

"రామగోపాలంగారి పాత్రలు ఘోరంగా కష్టాలు పడిపోతూ ఉండవు. ప్రపంచంలోని దారుణ దురంతాలను, క్రౌర్యాలను, నైచ్యాలను, అత్యాచారాలను, భయంకరమైన చీకటికోణాలను అవి చూపించవు. మనస్సును వికలంచేసే విషాదాల జోలికి అవి వెళ్లవు. చంద్రుడి మీదికి నల్లటి మబ్బుతునక వచ్చి కాసేపు ఆగి వెళ్ళిపోయినట్టు ఉంటాయి రామగోపాలంగారి కథలు".

..... ఇవి నా వెన్నుమీద చేతులు వేసి అన్నమాటలే. కాని, "తట్టి" అన్నారా? "కొట్టి" అన్నారా? తెలియదు. అలా, నా రచనలను గురించిగాని, నన్ను గురించిగాని అన్నవాళ్లు నాకన్నా వయసుచేత, జ్ఞానం చేత - పెద్దవారు. అందుచేత ఆ మాటల్లో అభిశంస ఉన్నా ప్రశంసకూడా ఉంటోంది కదా అని నేను సమాధాన పడిపోయేను.

అలాంటి మాటల్లో "Neither Marx, Nor Gita" అని, మునిపల్లె (బక్క) రాజాగారిది ఒకటి ఉంది.

అవును. నాకిప్పుడు 70 ఏళ్లున్నాయి కదా. ఈ పాటికి; ఆ మాటకొస్తే ఆయన ఆ మాటల్ని అన్న (1997) నాటికి; నేను భగవద్గీత, మార్క్సిజం - రెండూ అధ్యయనం చేసి ఉండవలసిందే. అవి రెండూ కూడాను; రకరకాల కోణాల్లో, విపులమయిన వ్యాఖ్యానాలతో, పుష్కలంగా లభ్యమయ్యే పుస్తకాలే. ఐతే; జీవికవలన, సంసార బాధ్యతలవలన, సాహిత్య కార్యక్రమాల పట్ల నాకు ఉండిన ఆకర్షణ వలన : ఆ రెండిటిలో ఏ ఒక్క దానిమీదా శ్రద్ధ పెట్టలేకపోయానని నాకూ ఇతరులకీ నచ్చచెప్పుకున్నాను. కాని; అది నిజంకాదు, కేవలం నచ్చచెప్పుకోవడమే : అని నాకు ఇటీవలే తెలిసింది.

భగవద్గీత, మార్క్సిజం - రెండూ శక్తిమంతాలయిన ఉప్పెనలు. వాటిని అనుష్ఠించడం మాట ఎలా ఉన్నా, అధ్యయనం చేసినంత మాత్రం చేతనే వాటి ప్రభావాలకు లోనయి వాటి "బారినిపడిపోతాం." అందులోనూ, మార్క్సిజం ప్రభావంలో పడిన వాళ్లలో కొందరు కొంతకాలం తరువాత ఇవతల పడడం నేనెరిగున్నాను గాని; భగవద్గీత ప్రభావంలో పడినవాళ్లు మళ్లీ ఇవతల పడడం నా ఎరికలో ఎన్నడూ ఎక్కడా జరగలేదు. అందుచేత భగవద్గీతకి సంబంధించిన అన్ని విషయాలలోనూ భక్తి ఎంత ఉన్నా భయం అంతకు మించి ఉండడం చేత ఆ సూత్రాల అభ్యాసం మాట అలా ఉంచి అధ్యయనాన్ని అయినా చేపట్టలేదు.

Practical Bhagavad Gita అనే పేరిట నండూరి వేంకటేశ్వరరావుగారు ఇంగ్లీషులో రచించిన పుస్తకానికి ఈ నా 'తెలుగుసేత' ఉదంతం ఒక మధురగాధ, ఒక విశిష్ట అనుభవం. వేంకటేశ్వరరావు గారి కుమారుడు చిరంజీవి యశస్వీగారు ఈ పుస్తకాన్ని అనువాదం చేయగలవారి కోసం ఆంధ్రప్రభ వీక్లీలో వేసిన ప్రకటన నేను చూసిన నాటి

నుంచి, ఈ పుస్తకం ఈ ఆకారంలో వెలువడినంత వరకు: జరిగిన సంఘటనలు, సంభాషణలు - అన్నీ ఉత్కంఠ భరితాలే, ఆనంద పూరితాలే. ఏవో కధలు రాసుకుంటూ, మరేవో జోకులు పేల్చుకుంటూ కాలం గడిపేసే నేనెక్కడ, భగవద్గీతెక్కడ: అని నిస్పృహ చెందడానికి కూడా నాకు సుమారు నాలుగయిదు నెలలు పట్టింది. పట్టినపట్టు నెగ్గేదాకా వదల్లేని యశస్విగారు 'ఇది మీరు చెయ్యకతప్పదు' అని దృఢంగా చెప్పకపోయినా; నా డొంకతిరుగుడులో ఏ మలుపునీ ఖాతరు చెయ్యకుండా నన్ను ఇందులో దింపేరు.

"హైదరాబాదులో ఉన్న దాదాపు అరడజను యూనివర్సిటీల్లో, పండిత పీఠాల్లో; ఎవరికి ఫోనుచేసినా ఈ పని మీద శ్రద్ధా సామర్థ్యం చూపగలవాళ్లు డజన్లకొద్దీ దొరుకుతారే; ప్రకటన ఎందుకు వేసేరండీ?" అని మొదలెట్టి; "అక్కడ దీనికి సిద్ధపడిన వాళ్లపేర్లు నాకు చెప్పండి- తగిన వారెవరో (ఎంతకి తగుదురో) సూచిస్తూ నేను సలహాలిస్తాను." అని చమత్కారం చేసి - యశస్విగారిని పక్కదారి పట్టించాలని నేను చేసిన ప్రయత్నాలు ఏవీ పనిచెయ్యలేదు. నాకూ భగవద్గీతకీ చుక్కెదురు, బాబూ - అని నేను అన్లేదు; ఆయన ఆ మాట అనుకోలేదు. "ఒక ఇంగ్లీషు పుస్తకం. దానికి తెలుగు కావాలి. ఎటొచ్చీ ఆ పుస్తకం నా మామూలు ధోరణి (cup of tea) కి సంబంధించినది కాదు; లోతయిన ఆధ్యాత్మిక పరిమళాలతో, కఠినమయిన తాత్త్విక పదజాలంతో నిండిఉన్నది. కనుక, చాలా శ్రద్ధతో, ఎంతో భక్తితో మిక్కిలి భయంతో ఈ పని చేపట్టవలసి ఉంది." అని నేను కొంచెం వంగే సరికి ధడ్డుమని పడింది, దెబ్బ. 'ఈపని మీ వల్లనే కావాలి' అని యశస్విగారు నిర్ణయించి చెప్పేరు. సృష్టి మొదలు ఇప్పటిదాకా ప్రపంచ భాషలన్నిటిలోనూ ఉద్భవించిన లక్షలాది గ్రంధాలలో గొప్పవిగా చెప్పగల పదింటిని ఎంచమంటే ఆ పదింటిలో భగవద్గీత ఉంటుంది. శక్తిమంతమైన ఆ పుస్తకం నాకన్నా శ్రేష్ఠుల నెందరినో అలవోకగా జయించి వారినందరినీ దరిజేర్చింది. నేనొక లెక్క కానేకాదు. అందుకనే కాబోలు, ఆ మహాశక్తి నన్ను ఈ విధంగా నిర్జించి ధన్యుణ్ణి చేసింది.

నండూరి వేంకటేశ్వరరావు గారు ఇంగ్లీషు అధ్యాపకత్వంలో, సంస్కృత అధ్యయనంలో జీవించిన వారు. ఆయన ఈ పుస్తకాన్ని రచించిన విధానం ఈ పాటి ఆపాటి స్కాలర్స్‌కి మతిపోగొట్టే ప్రభావం కలిగినది. ఉపనిషత్‌లనూ, భగవద్గీతనూ ఔపోసన పట్టడం ఒక ఎత్తు, వాటిని ఆధారంగా చేసుకొని ఒకానొక విశ్వవ్యాపి భాషలో గ్రంధ రచన చేయడం ఒక ఎత్తు. వారి ఇంగ్లీషు ఒక్కొక్కచోట పిష్టపేషణంగా, ఒక్కొక్క చోట కలివిడిగా, ఒక్కొక్క చోట వ్యక్తినిష్ఠంగా ఉండడం చూసిన తరువాత నాకు మళ్లీ నా (1974) పాత అనుభవం మరోసారి వేద్యం అయింది. ఎవరైనా సరే తనకి రెండు భాషలు బాగా తెలుసని అనుకోవచ్చు. కాని, ఆ రెండిట్లో ఒక భాషలో ఉన్న ఒకానొక పదార్థాన్ని రెండవ భాషలోకి అనువాదం చేయడానికి ప్రయత్నించేటప్పుడే తనకి ఆ రెండు భాషలూ కూడా తెలియవని (కనీసం తను అనుకున్నంత బాగా తెలియవని) తెలియవస్తుంది. దీనికి తోడు వస్తువు (మేటరు)లో ఈ రెండు భాషల్లోనూ సమాన ప్రతిపత్తితో చెప్పగల భావాలు,

సిద్ధాంతాలు తక్కువగా ఉంటే, ఇంక ఆ అనువాదకుడి (ఆద్విభాషి) తిప్పలే తిప్పలు. ఇటు ప్రస్థాన త్రయంలోనూ, అటు ఇంగ్లీషు మీడియంలోనూ వేంకటేశ్వరరావు గారికి తిరుగులేని పాండిత్యం ఉందని ఈ పుస్తకం ఆంగ్లమాతృక (Practical Bhagavad Gita) ద్వారా నాకు తెలిసింది. ఆయన మార్గం నాకు దుర్గమం అని కూడా తెలిసింది. కాని, అప్పటికే ఈ తెలుగు పుస్తకం నేనే రాయాలని నిర్ణయం అయిపోయింది.

ఈ (తెలుగు) పుస్తకం తయారీలో నేను ప్రసాద గుణాన్ని ప్రధానంగా చేసుకున్నాను. "Practical Bhagavad Gita" పాఠకులకు ఉండవలసిన అవగాహనాశక్తి వేరు, "అనుష్ఠాన భగవద్గీత" పాఠకులకు వేరు. ఆయన Intelligentsia నీ Elite నీ Targets గా పెట్టుకున్నారు. నా అవగాహన చాలా తక్కువ ప్రమాణానికి చెందినది. నా "Spoon" బాగా చిన్నది. అందుచేత నేను ఈ (తెలుగు) పుస్తకం రచనలో ఘండికోట బ్రహ్మాజీరావు గారి సహాయం తీసుకోవాలని తీర్మానించుకున్నాను. ఆయన ఇంగ్లీషు, తెలుగు భాషల్లోనేకాక సంస్కృతంలో కూడా పట్టభద్రానంతర అర్హతలు కలిగి; వేదాలతో, శ్రుతులతో, ఉపనిషత్తులతో, బ్రహ్మసూత్రాలతో, భగవద్గీతతో-పరిచయం ఉన్నవారు. ఈ (తెలుగు) పుస్తకం ఆయన తన ధిషణతో నాకోసం తయారు చేసేరు. ఆయన రాసిచ్చిన "పాఠం" చూసేక, అనువాదంలో గాని - అనుసృజనలో గాని; ఏమేమి చెయ్యకూడదు- అనే పాఠం బోధపడింది. అందుచేత నేను ఆయన తెలుగులో లోతుగా వేలుపెట్టి దీని ప్రస్తుత Text ని తయారు చేసేను. అట్టే పాండిత్యం లేని, ఆ మాటకొస్తే భగవద్గీత జోలికి పోవడానికైనా సరే భయపడే నా వంటి పాఠకులకోసం ఈ అనుసృజనను నిర్వహించాను. భగవద్గీతలోనివే కాక మరికొన్ని ఇతర సంస్కృత గ్రంథాలలోని కొన్ని సూక్తుల, శ్లోకాల-తెనుగుసేత కోసం నేను ప్రధానంగా సంస్కృతం మీదనే ఆధారపడినా వేంకటేశ్వరరావుగారి ఆంగ్ల అనువాదాల వలన వ్యక్తమయిన ఆయన Aim మీద కూడా దృష్టి నిలుపుకున్నాను.

ఇంగ్లీషు భాషలో ఉన్న Passive Voice నదుపాయం తెలుగులో అంతగా రాణించదు. "వేదాలు ఇలా నిర్వచించాయి"- అని చెప్పడంలో ఉన్న సౌఖ్యం "వేదాలలో ఇలా నిర్వచించబడి ఉంది"- అని చెప్పడంలో లేదు. "బడు" ధాతువు మీద చేటభారతమంత చర్చ ఉంది. దీనికి తోడు, "యొక్క" అనేది చూపులకు ఎంత సమంజసంగా కనిపిస్తుందో నిజానికి అది అంత వ్యర్థపదం అని నాకు అనిపిస్తుంది. ఈ 'యొక్క', 'బడు' శబ్దాలు అనువాదకులకు అనుక్షణం అవరోధాలుగా నిలుస్తాయి. ఈ పుస్తకం తెలుగులో రాస్తున్నప్పుడు ఈ రెండు మాటలూ లెక్కలేనన్ని సార్లు నేను, నేను- అంటూ ముందు కొచ్చేయి. 'బడు' నన్ను గెలవలేదుగాని ఒక్కసారి ఎక్కడో 'యొక్క'కి లొంగినట్టున్నాను. ఇవి ఇలా ఉండగా, Complex Sentence నిర్మాణం ఇంగ్లీషులో ఎంతో సుకరంగా జరగగలదు గాని ఆ వాక్యాన్ని వాక్యంగా తెలుగులో రాస్తే దాని నిర్మాణం కొంత కృతకంగా ఉంటుంది. Venkayya reached

the place, where Subbayya is expected to be available అనే వాక్యాలకు "సుబ్బయ్య ఎక్కడ దొరుకుతాడని భావించబడిందో, అక్కడికి వెంకయ్య చేరుకున్నాడు"- వంటి అనువాదాలు చెప్పుకో దగినంతగా సుఖపెట్టవు. (ఈ బాణీ హిందీలో కొంత వరకు ఆమోదయోగ్యంగా ఉన్నట్టుంది. "హమ్ ఇస్ దేశ్‌కే వాసీహుం, జిస్ దేశ్‌మే గంగా బహతీహై" అన్నది పద్యంలోనే కాక వచనంలో కూడా ఆమోదయోగ్యమే అట.) ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని; "అతని రచనల్లో ఏముంది, Readability తప్ప?" అని నా మిత్రుడు చలపతి రావు (నా రచనా పద్ధతిని గురించి) అన్న మాటని అదే ఒక ప్రశంసగా స్వీకరించి ఈ తెలుగు సేతలో నేను Readability ని నా ముఖ్య మార్గంగా, ధ్యేయంగా ఎన్నుకున్నాను. చెప్పే విషయం గహన సదృశం అయినప్పుడు (కానప్పుడు కూడా) చెప్పే విధానం ప్రసాదగుణంతో ఉండాలని నేను అనుకుంటూ(నే) ఉంటాను. సాహిత్యంతో సహా అన్ని కళా స్వరూపాలలో ఎక్కువ మందికి ఆస్వాదయోగ్యమయిన దానిని ఆశ్రయించాలా, లేక ఎక్కువమందికి ఆశ్చర్య విభ్రమలు కలిగించే దానిని ఆశ్రయించాలా: అనే విచికిత్స ఆ కళా స్వరూపాలంతటి పురాతనమయినదే నని నేను అనుకుంటూ(నే) ఉన్నాను. నాకు రామరాజభూషణుడు గౌరవనీయుడు, కాని, పోతనామాత్యుడు అంతకు మించి ఆస్వాదనీయుడు, వేమన అయితే సాక్షాత్తూ మా అమ్మే. అందుకనే కాబోలు నేను ఈ పుస్తకం (తెలుగు) రచనలో కొన్నిచోట్ల వేంకటేశ్వర రావుగారు చెప్పిన కొన్ని గహనమైన సత్యాలను (ఆయన మాటలలో చెప్పాలంటే-) "అంతగా పరిజ్ఞానం లేని పాఠకులతో" నన్ను నేను కలుపుకుని కేవలం ముక్కస్య ముక్కకి పరిమితం కాకుండా కొంచెం వివరణ, బోధన- చేయడానికి కూడా సాహసించాను. ఈ ప్రక్రియవలన; వేంకటేశ్వరరావు గారు చెప్పిన "అసలు విషయాలు" కొన్నిటికి నా "తాత్పర్యాలు" విపులంగా ఉన్నా, వింతగా కూడా ఉన్నాయేమో; ఇదంతా, "కానని వాని నూతగొని కాననివాడు విశిష్ట వస్తువున్ కాననియట్లు" చేసిన నిర్గమనం ఏమో - అని నన్ను నేను వినయ పూర్వకంగా అనుమానించుకుంటున్నాను. అయినా సరే, నండూరి వేంకటేశ్వరరావు గారి Practical Bhagavad Gita ని చేరాలని ఉద్దేశించే తెలుగు పాఠకుల కోసం నేను ఏర్పరచిన ఈ మార్గం సుకరమైనదని మాత్రమే కాక; నాకన్నా ఎక్కువ చదివిన వారుగాని, నాకన్నా ఎక్కువ వాక్‌బలం కలవారుగాని; ఇంతకంటే నున్నటి తోవ వెయ్యలేక పోవచ్చుననే ఆత్మ విశ్వాసంతో, దీనిని; మాతృసమానురాలైన శ్రీమతి సీతారాం, సోదర సమానుడైన చిరంజీవి యశస్విగార్ల ద్వారా సమర్పించుకుంటున్నాను.

1, అర్జున్ ఎపార్ట్‌మెంట్స్ ... ట్సు, మీ విధేయుడు
విశాఖపట్నం - 530 022 ... భమిడిపాటి రామగోపాలం
ఫోన్ : (0891) 535550 ... 30-11-2001

18209
A.C. No. ........
ముళ్లంగి వెంకట ... 
విశాఖపట్నం-530 007
ఫోన్: 0891-2722180

**YMA పబ్లికేషన్స్**

90 A, రోడ్డునంబరు 9, జూబ్లిహిల్స్, హైదరాబాదు 500033, ఇండియా.